# తాళ్లపాకకవుల కృతులు

## వివిధ సాహితీ ప్రక్రియలు




డాక్టర్ వేటూరి ఆనందమూర్తి

ఎం. ఏ., పిహెచ్.డి.

రీడరు, తెలుగు శాఖ - నిజాం కళాశాల

హైదరాబాదు

AB34

# తాళ్లపాక కవుల కృతులు

## వివిధ సాహితీ ప్రక్రియలు

డాక్టర్ వేటూరి ఆనందమూర్తి
ఎం. ఏ., పిహెచ్. డి.,

రీడరు, తెలుగుశాఖ—నిజాంకళాశాల

ఉస్మానియా విశ్వవిద్యాలయము—హైదరాబాదు.

ప్రభాకర ప్రచురణము.
ప్రథమ ముద్రణము-1000 ప్రతులు.
మే, 1974. ఆనంద-వసంతము,
సర్వస్వామ్య సంకలితము.
ఆంధ్రప్రదేశ ప్రభుత్వ ఆర్థిక సహాయముతో ప్రకటితము.

**TALLAPAKA KAVULA KRITULU**
**VIVIDHA SAHITEE PRAKRIYALU**

*by Dr. Veturi Anandamurthy*
M. A., Ph. D.,
Reader in Telugu, Nizam College (O. U.),
Hyderabad, Andhra Pradesh, India.

*Published by* **Smt. V. Chandrakala &**
**Sri V. Prabhakar.**
'SRI-NIVAS'
6/2 RT. (New) Vijayanagar Colony,
Hyderabad-500028

Price Rs 30/-

*Printed at*
Murali Power Press,
Kuthbiguda, Hyderabad.

*Copies available with* — **Smt. V. Chandrakala,**
**'SRI-NIVAS', 6/2 RT. (New)**
**Vijayanagar Colony,**
**Hyderabad-500028.**

12-10-95



స్వామి వారి

శ్రీ పాదములకు

అంకితము

"బ్రహ్మ గడిగిన పాదము
బ్రహ్మము దా నీ పాదము ॥పల్లవి॥

చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తల మోపిన పాదము
తలఁకక గగనము దన్నిన పాదము
బలరిపు గాచిన పాదము ॥బ్రహ్మ॥

కామిని పాపము గడిగిన పాదము
పాము తలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికేటి పాదము
పామిడి తురగపు బాదము ॥బ్రహ్మ॥

పరమ యోగులకుఁ బరిపరి విధముల
పరమొసఁగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము ॥బ్రహ్మ॥

—అన్నమయ్య సంకీర్తనము

# ఆ శీ స్సు లు

## శ్రీయుతులు ఖండవల్లి లక్ష్మీరంజనంగారు

డాక్టరు వేటూరి ఆనందమూర్తిగారు తా మిదివరలో ఉస్మానియా విశ్వవిద్యాలయము Ph.D పట్టమునకు సమర్పించిన సిద్ధాంత వ్యాసము నందలి ముఖ్యభాగమును, తాళ్ళపాక కవులకు సంబంధించినదానిని ఇప్పుడు పుస్తక రూపములో ప్రకటించుచు నాయాశీస్సులను గోరి నాయం దాదరగౌరవములను ప్రకటించినారు. నేనును వల్లెయని యంగీకరించితిని. ఆనందమూర్తిగారి సిద్ధాంత వ్యాసములోని ఏకదేశమే 500 పుటలకు మించిన గ్రంథమగు చుండగా, వారి సంపూర్ణ సిద్ధాంత వ్యాసము మరియొకటి రెండు సంపుటముల నలంకరించు ననుట అతిశయోక్తికాదు. ఆ సంపూర్ణ వ్యాసము నామధేయమును బహుభార వినమ్ర మైనది.

'విజయనగర యుగము ఆంధ్ర వాఙ్మయముపై వైష్ణవమత ప్రభావము—తాళ్ళపాక కవీంద్రులపై ప్రత్యేకాలోకము' అని దాని అభిధానము. ఇది ముప్పేట సిద్ధాంత వ్యాసమని నాజ్ఞప్తి. వైష్ణవ మతము ఆవిర్భావ వికాసములు; విజయనగర తెలుగు వాఙ్మయముపై దాని ప్రభావము; అది తాళ్ళపాక కవుల విస్తృత రచనలయందు స్నిగ్ధ గంభీర ఘోషము చేసిన విధానము, ఈయన్నిటిని డాక్టరు ఆనందమూర్తిగారు బహుశ్రమతో, విపుల భావనా బలముతో, పరిశోధనాసక్తితో , రచనా నైపుణ్యముతో ఆ సిద్ధాంత వ్యాసమునందు పొందు పరచిరి. వారట్లు చేయుటకు సర్వవిధముల తగియుండిరి. ఆంధ్ర పరిశోధనా జిజ్ఞాసువులలో అగ్రశ్రేణికి చెందిన వారు స్వర్గీయ వేటూరి ప్రభాకర శాస్త్రి మహాశయులు శ్రీ ఆనందమూర్తిగారి జనకులు. తండ్రిగారి సారస్వతాంశము పరిగణనీయమైన పరిమాణములో ఆనందమూర్తిగారియందు ప్రతిబింబించినదని అనాడే నేను గుర్తింపగలిగితిని.

వారి సిద్ధాంతవ్యాసమునకు పర్యవేక్షకపదము నాకు లభించుట సంతోషదాయకమే అయినది. ఈ పర్యవేక్షక స్థానము నేతిబీరకాయ వంటిదేమో అని

నాలో నేనే నవ్వుకొనుచుందును. బాహుపటుత్వము గల ఒక యీతగాడు క్రొత్త నీరు తగులుచున్న ఒక వేగవతియైన సరస్వతికి అడ్డుపడి ఈదుకొని వచ్చుచున్నాడు. గట్టుమీదనుండి ఆతురతతో చూచుచున్నాడు ఒక దర్శకుడు. ఈతగాని వీపుపై పుచ్చకాయలలో లంకగుమ్మడికాయలలో భారముగా క్రుంగదీయుచున్నవి. దర్శకుడు చేయదగినపని యేమి? ఈతగానిని ప్రోత్సాహకరములగు వాక్యములచే ద్విగుణీకృతశక్తుని చేయుచు 'నాయనా, అటు రాకుమోయి, అక్కడ జలగర్భమున గుట్టలున్నవి. ఈ వంక నీటిలో మునిగిన ముండ్లపొద లున్నవి. అంత బరువైనచో ఒకటి రెండు ఫలములను నీటిలో వదలుము. ఆవంక కొన్ని చెంగల్వలు కాన్పించు చున్నవి. వానిని కూడ సేకరింపగలవా" ఇత్యాది ఉపచార వాక్యములతో సంభావించుటయే. ప్రాయశః ఆనందమూర్తిగారి సిద్ధాంతవ్యాసము నాడుగాని పూర్వాపరములందుగాని నేను వహించిన భూమిక ఇంతయే అనుకొందును. కానైతే ఏ సన్నివేశమునందును లంకగుమ్మడికాయలను ఆమోదించలేదు.

ప్రస్తుత గ్రంథ భాగమునందు డాక్టరుగారు తాళ్ళపాక కవుల చరిత్రను రచనలను నిశితముగ చర్చించినారు. తెలుగు సారస్వతమునందు దేశీయతా ముద్రను అచ్చొత్తించుటలో ప్రాచీనులైన శివకవులును మధ్యయుగము వారైన తాళ్ళపాక కవులును సమఉజ్జీలుగా సంరంభించిరి. వీరి కృషియందలి సామ్యభేద తత్త్వమును ఆనందమూర్తిగారు పుటలు 130-135లలో చక్కగా కొని రాగలిగినారు. వారు తాళ్ళపాక వారివంక తలవెంట్రుక వాసి మొగ్గుదురు. విభూతి ప్రియుడనైన నేను శివకవులకు మొగ్గుదును. రుచిభేదము సారస్వత జీవాతువు గదా! ప్రాచీన శివకవులు భిన్న కుటుంబములవారు కాగా తాళ్ళపాకవారు ఏక వంశీయులగుట ఒక అపూర్వవిషయము. ఈ వంశ మూలపురుషుడగు అన్నమాచార్యులవారినుండి చిన్నన్న వరకు గల కవివరేణ్యుల వివిధరచనా ప్రక్రియలను వారి సంకీర్తన వాఙ్మయమును, వారి వైష్ణవ మతసేవను, సాంఘిక సేవను, అన్నిటిని ఆనందమూర్తిగారు కన్నులకు కట్టినట్లు చిత్రించినారు. సాళువ నరసింగరాయలు మొదలుకొని అచ్యుతదేవరాయలు, సదాశివరాయలు వరకును గల విజయనగర చక్రవర్తులతోను, ఒక శతాబ్దము పై బడి తిరుపతి దివ్య క్షేత్రముతోను వారికిగల గాఢ సంబంధమును చక్కగా విశదీకరించినారు. 'చర

న్వనాంతే మధుమంజరీషు' అను పూర్వశ్లోక భావమును తలపింప జేయుచు శ్రీకృష్ణదేవరాయలకును తాళ్ళపాకవారికిని సత్సంబంధములు లేకపోవుట 'బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా'అని సరిపుచ్చుకొనవలసియున్నది. తాళ్ళపాకవారి పదప్రయోగ విశేషములను గూర్చికూడ డాక్టరుగారు విజ్ఞానదాయకమైన అధ్యాయమును వ్రాసినట్లు జ్ఞాపకము. ఏ కోణము నుండి చూచినను శ్రీఆనంద మూర్తిగారి సాహిత్యకృషి హృదయ సంతర్పణముగ ఉన్నది. వీరి సంపూర్ణ సిద్ధాంతవ్యాసము ప్రచురింప బడవలెననియు వర్ధిష్ణువులైన వీరు పరిశోధనా రంగమునందు వెన్నెలలు కాయించుచుందురనియు ఆశీర్వదించుచున్నాను.

24-4-1974

# శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు

...మీ పుస్తకం పూర్తిగా చూచినాను. చాలా శ్లాఘ్యమైన పని చేసినారు. "అన్యం న యాతి హి విభూతి రపత్యభాజాం" "యథా పితా తథా పుత్రః" అన్న సూక్తులు పలుమారు జ్ఞప్తికి వచ్చినవని వ్రాయడం చాలు ననుకుంటాను. యశశ్శరీరులగు శ్రీ ప్రభాకరశాస్త్రిగారి కీర్తిలతలో పరమళించిన పెద్దపూఁగొమ్మ మీ రచన. మీకు నా హార్దాభినందనలు.

ఆనుషంగికంగా నాదృష్టికందిన 2-3 విషయాలు మీ పునశ్చర్వణకై సూచిస్తాను...

'సంకీర్తనలక్షణము' నా దృష్టిలో అంతకుముందు చాలాకాలంగా అనువర్తించి వచ్చిన శాస్త్ర ప్రమేయము. అందులోని ప్రబంధాల ధాతువులను అన్నమాచార్యుల కృతుల కన్వయించేది ఎక్కువప్రయోజనం కాజాలదు. 15వ శతాబ్ది కించుమించుగా వెలసిన కర్ణాట వాగ్గేయకారుల రచనలూ ఇట్టివే. నేటి కంటూ ఆ వివేచన నిష్ఫలమై పోయింది.

సంకుసాల నరసింహకవిని గూర్చిన శ్రీశాస్త్రిగారి ఊహను మీరుచక్కగా ఆనుషంగికమైన సందర్భాలు చేర్చి బలపరచితిరి. ఐనా మీరే భావించినట్లు ఇంత కంటె ప్రబల ప్రమాణము కావలసి యున్నది.

గ్రంథం కొంత పెరిగిందనుకోవచ్చును. కాని మీరందులో ఎన్నో ప్రాత క్రొత్త విషయాలు సంగ్రహించితిరి గనుక వాటి వైశద్యమునకై ఈ విస్తరం తప్పని సరైనదని భావిస్తాను.

ముద్రాక్షర శోధన చక్కగా జరిగింది. అక్కడక్కడ నాకంటికందిన చేజార్లను ఎర్రపెన్సిలు గుర్తులతో సూచించినాను...

తాళ్ళపాకవారి భాషావిశేషములను గూర్చిన మీ గ్రంథం త్వరలో వెలువడునని ఆశిస్తున్నాను.

749, క్రాసు 46, బ్లాకు 8
జయనగర, బెంగుళూరు.
560041.
25-4-1974

# అభిప్రాయములు

విద్యారత్న కళాప్రపూర్ణ

## శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు

ఆంధ్ర సాహిత్య ప్రపంచమున నిప్పటికి ముప్పది నలుబదేండ్ల క్రిందటి వఱకు, తాళ్లపాక కవులను గూర్చిగాని, తిరుపతి క్షేత్రమున పద, సంకీర్తన వాఙ్మయమునకు వారొనర్చిన లోకోత్తర సేవ గాని తెలియదని చెప్పవచ్చును. తాళ్లపాక కవులను గూర్చి, తొలుత పరిచయము గావించి, వారి నాంధ్ర సాహిత్యమున చిరస్థాయిగా నిలిపిన కీర్తి, కీర్తిశేషులగు వేటూరి ప్రభాకర శాస్త్రి గారిది.

శ్రీ శాస్త్రిగారు క్రీ.శ. 1918లో ప్రథమమున వారు ప్రకటించిన ప్రబంధ రత్నావళిలో తాళ్లపాక కవులలో ప్రథములగు అన్నమయ్య వేంకటేశ్వర శతకమును వెలుక పరచిరి. 1923 సంవత్సరమున, శృంగార శ్రీనాథమున, అన్నమయ్య తిరుపతిలోని రాగిరేకుల మూలమున నాతడు శ్రీనాథుని సమకాలికుడని తెలిపిరి. 1925లో, భారతిలో కొన్ని వేంకటేశ్వర వచనములను ప్రచురించిరి. 1927లో పాల్కురికి సోమనాథుని బసవపురాణ పీఠికలో తాళ్లపాక చిన్నన్న ద్విపద కవితా లక్షణములను ప్రచురించిరి. 1940 తరువాత వారు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థయందు పండితులై వేంకటేశ్వర వచనములు, ప్రభాతస్తవము, తాళ్లపాక తిమ్మక్క సుభద్రా కల్యాణము, అన్నమాచార్య చరిత్రము మున్నగు నపూర్వములగు తాళ్లపాక కవుల కృతులను ప్రకాశమాన మొనర్చుటయే గాక, అన్నమాచార్యోత్సవములను ప్రవర్తిల్ల జేసి, తాళ్లపాకవారి వేంకటేశ్వర వాఙ్మయ సౌధమును నిర్మించుటకు పునాది ఏర్పరచిరి.

ఈనాడు వారి పుత్రులును, వర్ధమానులునగు శ్రీ వేటూరి ఆనంద మూర్తి తండ్రిగారేర్పఱచిన ప్రాతిపదికపై తాళ్లపాక వేంకటేశ్వర వాఙ్మయ సౌధమును పూర్తి గావించుట యత్యంతము నభినందనీయము.

ఇది పరిశోధన గ్రంథము. సత్యాన్వేషణ ప్రధానాశయముగా గల యీ గ్రంథమున విషయ సేకరణము, సేకరణాంశ సమన్వయము, సాహితీ విమర్శ నము ప్రామాణికములై యుండుటయే గాక చాలావఱకు సమగ్రతను సంతరించుకొన్నవి.

తిరుపతి, శ్రీ వేంకటేశ్వరుడు, తాళ్లపాకవారు - ఈ మూడును నవినాభావ సంబంధముగల వ్యవస్థా త్రయము అరవై యేండ్ల క్రిందట ముక్కోటి ఆంధ్రులకు (నేటి జనసంఖ్య 4 కోట్ల 33 లక్షల 95 వేలు) నేకైకముగా నిలవేల్పయిన శ్రీ వేంకటేశ్వర స్వామికి సంబంధించిన తాళ్లపాకవారిని గూర్చినది గావున పరిశోధక గ్రంథములలో దీనికొక ప్రత్యేక విశిష్టత లభించినది.

ప్రస్తుత ముద్రిత గ్రంథ మా గ్రంథమున ప్రథమ భాగము. ఈ సంపుటము తిరిగి రెండు భాగములుగా విభక్తము.

తిరుపతి-తాళ్లపాక కవులు—చరిత్ర.
తాళ్లపాక కవుల సాహిత్య పరిశీలనము.

ఇట్లు చరిత్ర-సాహిత్యము వేఱు వేఱుగా నుండి మొదట చరిత్ర యుండుట సరియైన పరిశోధనా పద్ధతి—

## వేంకటాచల క్షేత్ర చరిత్ర

శ్రీ తిరుపతి క్షేత్రమును గూర్చి ఆంగ్ల భాషలో గ్రంథములు గలవు, గాని ప్రథమముగా తెలుగులో, తిరుపతి క్షేత్రము, దేవస్థానము, వీని యుదంతములను పౌరాణిక కాలమునుండి క్రీ. శ. పదునాఱవ శతాబ్దము వఱకు సంగ్రహముగా, సులభ సుందరరీతి నందించిన దీగ్రంథమే. పౌరాణికముగ, ఆదివరాహ క్షేత్రము, తమిళమున తిరు వేంగడము, ఆళ్వారుల ప్రశంసలు, స్తోత్రములు శైవ ప్రాబల్యము, శ్రీ రామానుజుల వైష్ణవభక్తి స్థాపన-యిందు చక్కగా నిరూపితములైనవి.

ఈ నాడు తిరుపతి క్షేత్రము, మహోచ్ఛ్రాయ దశలో నుండుటకు, విజయనగర రాజులు కారణము. వారిలో సంగమ, సాళువ, తుళువ, ఆర్వీటి వంశీయులలో సాళువ నరసింగ రాయలును, తుళువ వంశమున శ్రీ కృష్ణరాయలును. తమ భక్తి ప్రపత్తులచే, దానాదికములచే నీక్షేత్రమును దక్షిణాదినే గాక యావద్భారత వర్షమున క్షేత్రములకు మకుటాయమానముగా నొనర్చిరి.

కృష్ణరాయలు ఏడు పర్యాయములు తిరుపతి యాత్రలు సలుపుట, వాని వివరములు మన కుతూహలమును గలిగించును. రాయలేగాక మహామంత్రి తిమ్మరుసు, ఇతర మంత్రులు, దండనాయకుల దాన ధర్మములు తెలుపు భాగములును నాకర్షణీయముగా నున్నవి.

తాళ్లపాక కవుల సంపూర్ణ వంశవృక్ష మిం దీయబడినది. ఈ వంశ చరిత్ర యంతయు, తాళ్లపాక చిన్నన్న కృతమైన అన్నమాచార్య చరిత్ర అధారముగా తిరుపతి దేవస్థానమునందలి శాసన ప్రమాణముల మూలముగా రచితమైనది. క్రీ. శ. 1424 మొదలు క్రీ. శ. 1560-70 ప్రాంతము వఱకు వీరి చరిత్ర శాసనముల మూలమున నిర్ణీతమైనది. ఈ వంశీయులు నేటి వఱకును నవిచ్ఛిన్నముగా నుండుట విశేషమే[1]

## సాహిత్యము - మతము

పాశ్చాత్య విమర్శనా పద్ధతి విశ్వవిద్యాలయములలో ప్రారంభమైన నాటి నుండి సాహిత్య విమర్శనలో మత దృష్టి విస్మృతమైనది. స్వాతంత్ర్య వాతావరణము సోకగానే అది తెలుగు సాహిత్య విమర్శనమున పూర్తిగా నంత ర్హితమైనది. ఈ పరిశోధన గ్రంథముమాత్ర మట్టి సమకాలిక పరిస్థితి ప్రభావ ములకు లోబడక, మతమే సాహిత్యమునకు మూలమని, ఉదాత్తగంభీర భావ నతో నెట్లు నిరూపిత మైనదో చూడుడు.

"తాళ్లపాకవారి సాహితీ మందిరమునకు మతము పునాది. సంస్కృ తాంధ్రములు కట్టడపు శిలలు . సంకీర్తనాది సాహితీ ప్రక్రియలు సోపానములు. అందలి యారాధ్య దైవము శ్రీవేంకటేశ్వరస్వామి-ధర్మార్థకామ మోక్షములు నాలుగు ప్రాకారములు-మధురకవితలు ద్వార వాకిళ్లు. సార్వజనీనము సార్వ కాలికము నగు నుత్తమ భావసంపద తన్మందిరశ్రీభాండారము. ఆ కవులే అర్చ కులు. భక్తియే భగవత్ప్రసాదము; గానమే స్వామి కంగరంగ భోగములు;రసిక వర్యులే యాత్రికులు - ఇదియే వారి కవితా స్వరూపము" పుట 127

1. ప్రాచీన కవులలో తిక్కన వంశమువారు నేటివర కవిచ్ఛిన్నముగా మన్నట్లు తెలియుచున్నది. నా "తెలుగు కవుల చరిత్ర" తిక్కన, ఎఱ్ఱనల యుగము - అముద్రితము.

కావ్యము లౌకికము. మతమాధ్యాత్మికము. తెలుగు సాహిత్యమున-లౌకికమగు సాహితీ సంప్రదాయములతోబాటు ఆధ్యాత్మికమగు మత సంప్రదాయమును సమ్మేళనము చేసినవారు, శైవకవులు - వైష్ణవకవులు. భక్తి ప్రధానమగు శైవమత సంప్రదాయికములను కావ్యమున నిక్షేపించి కావ్యవస్తు శరీరమున, సమన్వయముచేసి, అటు కావ్యానందమును నిటు భక్తిరసానందము నేకత్ర ననుభవనీయముగా చేయుటచేత - శివకవుల కృతులు — సాహిత్యకావ్యములు మత కావ్యములుగా కూడ ప్రసిద్ధి కెక్కినవి - ఇట్లు తెలుగు కావ్యమునకు లౌకికత్వము ఆధ్యాత్మికత్వము నేకైకముగా ప్రతిష్ఠించిన వారు శివకవులు. శ్రీవేంకటేశ్వర వైష్ణవ భక్తిని ప్రతిపాదించిన- తాళ్లపాకవారు నట్లే, తమకృతులను, కావ్యకళా విశిష్టములుగను, వైష్ణవ వేంకటేశ్వర భక్తిమత, సంప్రదాయ సంపుష్టములుగను నొనర్చినారు.

ఇట్లు కావ్యకళను-ఆధ్యాత్మిక మత సంప్రదాయమును సమ్మేళనము చేసిన కతన-ఈ వాఙ్మయములు రెండును శైవవాఙ్మయము, వైష్ణవవాఙ్మయములను ప్రత్యేక నామములతో వెలయుచున్నవి.

ఈ శైవ వైష్ణవ కృతులలో నొక్క విశేషము గమనింపవలసియున్నది. ఈ కృతులన్నియు ఏకరసైకములు-అనగా వీనియందు భక్తిరసము తప్ప ఇతర రసములకు చోటేలేదు-కావ్యమున శృంగారముకాదు, భక్తిరసము ప్రధానమని నిరూపించినవి[1] ఈ దృష్టితో చూచిన పోతన భాగవతము, భక్తి రసైకకావ్యము.

ఇట్టి మత సంప్రదాయవివేచనతో, నీ గ్రంథమున తాళ్ళపాకవారి సాహిత్య పరిశీలనము కావింపబడినది. ఇట్టి పరిశీలన ఇతరత్ర కానరాదు-ఇది యీ గ్రంథమున తక్కిన వానికన్న నొక ప్రత్యేక విశిష్టత నాపాదించినది-

సాహిత్య పరిశీలనమున, వీరశైవ కవులకును తాళ్ళపాక కవులకు గల సామ్యములు ప్రదర్శితములైనవి. శైవకవుల ననుసరించుచు నా యాసాహిత్య ప్రక్రియలలో తాళ్లపాక వారెట్టి ప్రత్యేకత చూపినదియు వివరింప బడినది. దీని నింతకుముం దెవరు చూపలేదు.

---

1. నన్నెచోడుని కుమార సంభవము శైవమత సాంప్రదాయికము ఆధ్యాత్మికము-కావున నది లోకోత్తరమైన కావ్యకళా ఖండమైనను లౌకిక సాహిత్యమున దానికంత ప్రచారము లేక పోయినది. అది శైవమత గ్రంథముగా పరిగణితమైనది.

# సాహిత్యప్రక్రియలు

## ద్విపద కావ్యములు

ద్విపదకావ్య పరిణామ చరిత్రలో 'ద్విపద' అనుపేరును సార్థక పఱచు నట్లు రెండే ఘట్టములు-

1. శివకవి యుగము- పాల్కురికి సోమనాథుడు
2. కృష్ణరాయయుగము-తాళ్ళపాక చిన్నన్న.

పాల్కురికి సోమనాథుని బసవపురాణ పండితారాధ్యచరిత్రలు సుపరిష్కృతములై విపుల పీఠికలతో వెలయుటచేత సోమనాథుని ద్విపద కవితా వైదుష్యము మనము గ్రహింపగలిగినాము. కాని చిన్నన్న కృతులు-ముద్రితములైనను, అవి సంస్కృత ముద్రణములు గాక పీఠికారహితము లగుటచే చిన్నన్న ద్విపదరచనా పాటవము మనము గ్రహింపలేదు- ఈ గ్రంథమున ప్రథమముగా చిన్నన్న-

### "చిన్నన్నద్విపద కెఱుఁగును"

అను తెనాలి రామకృష్ణుని సూక్తి యెట్లు సార్థక పఱచినాడో వివృత మగుటయేకాక-ఆతని నాలుగు ద్విపదకృతులు- అష్టమహిషీ కల్యాణము-ఉషా కల్యాణము-పరమయోగివిలాసము-అన్నమాచార్యచరిత్ర-వీని కవితా సమీక్ష స్తవనీయముగా గావింపబడినది. వీనిలో-అష్టమహిషీకల్యాణము, ఉషాకల్యాణము పౌరాణికములు-పరమయోగి విలాసము-విశిష్టాద్వైత మతసంప్రదాయికము-అన్నమాచార్య చరిత్ర చారిత్రకము-ఈ ప్రణాళిక తోడనే-చిన్నన్న ద్విపద కావ్య సమీక్షసాగుట-ప్రశంసనీయము.

చిన్నన్న కృతుల సమీక్ష-184 పుటలలోనుండి ఈ గ్రంథమునకు కండ పట్టన దగియున్నది.

## మంజరీద్విపదకావ్యములు

అన్నమాచార్యునిశృంగార మంజరి
పెదతిరుమలాచార్యుని చక్రవాళ మంజరి
తాళ్ళపాక తిమ్మక్క—సుభద్రా కల్యాణము

ఈ మూడింటిలో-తిమ్మక్క సుభద్రాకల్యాణము మాత్రమే—యీవఱకు సాహిత్యలోకమునకు పరిచితము-ఇందుశృంగార మంజరి, చక్రవాళ మంజరి యందలి విశేషములు తెలుపబడినవి.

## శతకములు

తాళ్లపాక పెద తిరుమలయ్య నీతి సీసపద్య శతకము క్రీ. శ. 1917లో ముద్రితమైనను,[1] ఇంతవఱకు శతకకవుల చరిత్రలో తక్క తక్కిన వానిలో దీని ప్రస్తావన లేదు. శతకకవుల చరిత్రలో స్వల్పముగా గలదు. కాని యిందీ శతకమును గూర్చి విపుల సమీక్ష గలదు. తరువాత వెడలిన కూచి మంచి తిమ్మకవి కుక్కుటేశ్వర శతకము, అడిదము సూరకవి రామలింగేశ్వర శతకమున కిది వరవడి. ఈ శతకమునకు సంస్కృత ముద్రణ విపుల పీఠిక ఆవశ్యకము. ఇందున్నవన్ని సూక్తులే. ఈ శతకమున, "తన వాసి తప్పిన తఱుగు వన్నె" "అమృత హస్తుడు వైద్యుడు"- మొదలగు సూక్తులు నేటికిని విశాఖ, శ్రీకాకుళ మండలములలో వాడుకలో నున్నవి. శృంగారామరుక శతక సమీక్ష సరసముగా నున్నది.

## దండకములు

శృంగార దండకము మానవపరముగా గాక, దైవ పరముగా రచించిన వారు తాళ్లపాక కవులు. పెద తిరుమలాచార్యుని శృంగార దండకము శ్రీ వేంకటేశ్వర పరిణయమును దెలుపునది. తరువాతి కవులకు మార్గదర్శక మైనది. చూ. పోతన (భోగినీ దండకము),

దండకము పదకవితకు చేరక, పద్య కవితలో పరిగణితము. అది మాలా వృత్తము, కావున శివకవులు దీనిని గ్రహింపలేదు.

---

1. తాళ్లపాక కవుల రచనలను, తిరుపతి దేవస్థానమున రాగిరేకుల నుండి వ్రాయించి, మొదటి సారిగా ముద్రించిన యశస్సు ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారిది.

పరిషత్పత్రిక. 3 సం. 1 సం. (1915) లో రేఫఱకార నిర్ణయము, సంకీర్తన లక్షణము.

6. సం. 1 సం. (1917) నీతి సీసపద్య శతకము. ఇది ప్రత్యేక గ్రంథముగా వెలువడినది.

పరమయోగి విలాసము పిఠాపురము మహారాజావారు 1928 లో ముద్రించిరి.

# అష్టభాషా దండకము

(రచన క్రీ.శ. 1537)

ఇందు 1. సంస్కృతము; 2 ప్రాకృతము; 3. శూరసేనీ; 4. మాగధీ; 5. పైశాచ భాషా = అపభ్రంశ భాషా; 6. ప్రాచీభాషా; 7. అవంతీభాషా; 8. సార్వదేశీభాషా.

అనునవి అష్టభాషలుగా పేర్కొనబడి ఉదాహరణలీయబడినవి కాని - క్రీ.శ. 1656లో అప్పకవి తన గ్రంథమున - అష్టభాషల నిట్లు నిర్వచించినాడు.

సంస్కృతము, ప్రాకృతంబును, శౌరసేని
జగతిపై మాగధియును బైశాచికయును
జూళికయు నపభ్రంశంబు సౌరిది నంధ్ర
భాషయును నివి చను నష్టభాష లనఁగ

అప్పకవి మతమున : సంస్కృతము; ప్రాకృతము; శౌరసేని; మాగధి; పైశాచి; చూళిక; అపభ్రంశము; ఆంధ్రభాష - అనునవి అష్టభాషలు.

అప్పకవి తెలుగును అష్టభాషలలో చేర్చినాడు. తాళ్లపాక చిన తిమ్మాచార్యుడు - తెలుగును చేర్చలేదు. సార్వదేశీ తెనుగు భాష కాదు- అది ప్రాకృత భాషాభేదమే. అప్పకవి సమకాలికురాలు - రంగాజమ్మ మన్నారుదాసవిలాసమున - 1. చూళిక 2. అపభ్రంశము 3 ప్రాకృతము 4. పైశాచి 5. శౌరసేని 6. మాగధి 7. దేశి 8. సంస్కృతము అని అష్టభాషలలో సమస్యాపూరణము జరిగినట్లు స్పష్టపఱచినది. ఈ ప్రాకృత భాషాభేదముల విషయమై చర్చించుట కిట వీలులేదు. ఇంతకుముందు, అష్టభాషా దండకము ననుసరించి, దీనిని చర్చించియున్నాను.

సంస్కృతాంధ్రములు - షడ్విధ ప్రాకృతములు (ప్రాకృతము, శూరసేని, మాగధీ, పైశాచి, చూళిక - అపభ్రంశము) అనునవి అష్టభాషలు.

ఈ అష్టభాషా ప్రసక్తి తెలుగున, పదునాల్గవ శతాబ్దిని ప్రారంభమైనది. అంతకు ముందు లేదు.[1]

---

1) అష్టభాషలు-భారతి జూలై 1966. ప్రాకృత భాషలను గూర్చి తెలుగున జరిగిన పరిశ్రమ చాల తక్కువ చూ. ప్రాకృత భాషలు అను నా వ్యాసము. భారతి జూను 1966.

కేవలము భాషా విషయమునే ఇతి వృత్తముగాగొని దండకము రచించిన వారిలో - ప్రథముడు చిన తిరుమలాచార్యుడే - 19 వ శతాబ్దిలో దీని ననుసరించి - గుండ్లూరి నరసింహకవి భాషీయ దండకము రచించినాడు. ఇందు తెలుగు దేశమున నాయా వర్ణములవారి వ్యావహారిక భాష చక్కగా నుదాహరణములతో చూపబడినది.

## ర గ డ లు

రగడలు అనియతపాదములుగలవి యగుటచే నన్నయాదుల కావ్యములలో ప్రయుక్తము కాలేదు - నన్నెచోడని క్రౌంచ పదవృత్తమునకు రగడకు సంబంధము లేదు- నన్నెచోడని క్రౌంచ పదవృత్తము - సీసపద్యమునకు సంబంధించినదని మా. రామకృష్ణ కవిగారు వ్రాసినారు.[1] ఇంతకు నన్నెచోడకవి వ్రాసినది - క్రౌంచగతిగాని - క్రౌంచపదముగాదు. "క్రౌంచగతుల్ వీక్షించుచు" అన్నచోట ముద్రాలంకారము గలదు. (10-30)

నన్నెచోడకవి తక్కిన చోట్లవలె నిచ్చటను క్రౌంచగతి వృత్తము ముద్రాలంకారమున చూపినాడు. ఇది సంకృతి ఛ్ఛందమునుండి పుట్టినది. అప్పకవి దీనిని 'సరసిజము' అని పేర్కొన్నాడు.

పెద తిరుమలాచార్యుల సుదర్శన రగడయందలి విశిష్టత చక్కగా వివృతమైనది - సుదర్శన చక్రము వర్ణించిన యితర కవుల రచనలు నుట్టంకింపబడినవి.

శ్రీనాథుడు, భీమఖండమున "శ్రీ సుదర్శన చక్రచిహ్నాంకితముగాని" అని సుదర్శన చక్రమును స్మరించినాడు - పాల్కురికి సోమనాధుని గద్యకృతులన్నియు రగడలు-

## ఉదాహరణములు

పాల్కురికి సోమనాధుడు, శతకమునందు తెలుగు ఉదాహరణమునందు చంపకోత్పలములే వాడుటకు హేతువున్నది. ఈ రెండును పుష్పసంబంధములు- చంపకము, ఉత్పలము - ఈ పేళ్లుగల వృత్తములతో శతకము రచించిన వాక్పుష్పముల శివుని పూజించునట్లగును - అందుచే - ఉదాహరణమున

1) కుమార సంభవము - ద్వితీయ భాగము (1914) పుట. 36

సార్వవిభక్తికమున ఉత్పలమునే వాడినాడు. కాని - వృత్తౌచిత్యము వలన సార్వవిభక్తికముగా పద్యసమన్వయమునకు వీలులేకపోయినది. సప్తమీవిభక్తి "నీభావమునందు" అని కలదు. ఇచట 'నీ యందు' అనియుండవలెను-వృత్తము వలన నట్లైనది.

రావిపాటి త్రిపురాంతకుడు ఈ సప్తమీ విభక్తి చక్కగా పై వృత్తములో కుదురలేదని శార్దూలము వాడినాడు - శ్రీ వేంకటేశ్వరోదాహరణమున నట్లేగలదు

## అంకితాంకపద్యము

సోమనాథుని సంస్కృత బసవోదాహరణమున - అంకితాంక పద్యమున్నది. అది యట్లుంచుట ఆవశ్యకము - ప్రతాపరుద్రీయ లక్షణమునలేదు - సంస్కృతమున నట్లు చెప్పకపోయిన గ్రంథ కర్తృత్వమునకు భంగము వాటిల్లను. తెనుగున నితర కృతులలో నీ యుదాహరణ ప్రసంగముండును గావున సోమనాథుడు మానినాడు - త్రిపురాంతకుడును నందువలననే - అంకితాంక పద్యము వ్రాయలేదు.

ప్రతాపరుద్రీయ వ్యాఖ్యలో నిది ప్రత్యేకముగా తెలుపబడుట వలన - శ్రీ వేంకటేశ్వరోదాహరణమున నిది పాటింపబడినది. సార్వవిభక్తికముగా, శార్దూల వృత్తము వ్రాయుటయు, అంకితాంకపద్యము వ్రాయుటయు - నను నీ రెండు లక్షణములను పాటించి, తెలుగు ఉదాహరణ కావ్యమునకు, ప్రస్తుత గ్రంథమున తెలిపినట్లు, ఆ సాహిత్య ప్రక్రియకు సర్వాంగీణ స్ఫూర్తి చేకూర్చినది.[1]

## సంకీర్తన లక్షణము

ఈ సంకీర్తన లక్షణము తక్కిన కృతులవలె ముద్రితమైనను - నింతవఱ కెవ్వరును లక్ష్యలక్షణ సమన్వయము చేయలేదు. ఈ గ్రంథమున మొదటిసారిగా నట్టి లక్ష్యలక్షణ సమన్వయము చేయబడియున్నది - లక్షణము లన్న

---

1. పెదకోమటి వేముని సాహిత్య చింతామణి (అముద్రితము) యందు ఉదాహరణ ప్రక్రియ యంతయు ప్రపంచితమైనది. అది ముద్రితము కానున్నది గాన దానిని పరిశీలించి, ఈ విషయము స్థలాంతరమున విస్తరించెదను.

మయ్యవి గావున, లక్ష్యము లాయన సంకీర్తనలనుండి చూపుట - ఎంతో సంప్రదాయిక పద్ధతి ననుసరించినది - గ్రంథకర్త సంగీత సాహిత్యలక్ష్యలక్షణ పరిజ్ఞాన మిందు పరిస్ఫుటమగుచున్నది.

## వ్యాఖ్యలు — వివరణలు

నేడు వ్యాప్తములో నున్న గురుబాల ప్రబోధిక - (అమరము) తెలుగు టీక - తాళ్లపాక తిరువేంగళసూరిదియని యిందు సప్రమాణముగా నిరూపితమైనది.

## భగవద్గీత వచనము

పెద తిరుమలాచార్యుని భగవద్గీత వచనమే ప్రస్తుతము తెలుగు భాషలో వెలసిన భగవద్గీతానువాదముల కాది. సామాన్య జనులకు గీత గంభీరార్థమవగాహనమగునట్లు వ్యావహారిక రచన నీ వచన గ్రంథము గలదు - వ్యావహారిక భాష వ్యాప్తమగుచున్న ఈ రోజులలోనిది అవశ్యకముగా ముద్రింపదగినది. పెద తిరుమలాచార్యులు క్రీ. శ 1450 - 1554 ప్రాంతమువాడు గావున తెలుగున వ్యావహారిక భాషలో వ్రాయబడిన తొలి రచన - ఆంధ్ర వేదాంతమేమో పరిశీలించవలసి యున్నది.

## తాళ్లపాకవారు తత్సన్నిహితులు

### కవికర్ణ రసాయనము - నృసింహకవి

కవుల చరిత్రలో సంకుసాల నృసింహకవియే యిందు తాళ్లపాక నృసింహకవిగా నిర్ణీతుడైనాడు. ఆతడు అన్నమాచార్య తనయుడు - ఇట్టి నిర్ణయము వాఙ్మయ చరిత్రకారుల కెంతో ఉపయుక్తము - తెనాలి రామలింగనిచే ప్రస్తుతుడైన నరసింహకవి కవికర్ణరసాయనమునుగూర్చి యింతవఱకు విమర్శయే లేదు. ఈ గ్రంథమున విపుల సాహితీ విమర్శయేగాక - కవికర్ణరసాయనము విశిష్టాద్వైత సిద్ధాంతము ప్రతిపాదించిన కావ్యమని చక్కగా నిరూపితమైనది. కవికర్ణరసాయనము విద్వత్కవి కర్ణరసాయనమైనది.[2]

---

1. ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ ముద్రణ పీఠికలో సాహిత్య విమర్శన లేదు.

2. విశాఖపట్టణ మండలమున కొత్రట శాలకవి, మాంధాతృ చరిత్రనే - విమలాంగి పరిణయమను పేర రెండు శతాబ్దుల క్రింద రచించినాడు. అది అముద్రి

## రేవణూరి వేంకటాచార్యుడు - శ్రీపాదరేణు ప్రభావము; శకుంతలా పరిణయము

ఈ వేంకటార్యుడు - అన్నమయ్య దౌహిత్రవంశము వాడనని చెప్పుకొన్నాడు - (సంకీర్తనాచార్య దౌహిత్ర) కాని శకుంతలా పరిణయమున నవతారికలో - అన్నమాచార్యుడు మొదలుగా నేడు పురుషాంతరములు గడిచినట్లు చెప్పి వారి నామములను దెలిపినాడు - అన్నమాచార్యుడు క్రీ. శ. 1424-1503 గావున నప్పటినుండి 6 పురుషాంతరములు గడిచిన - క్రీ. శ. 1450 నుండి $6 \times 25 = 150$ — ఏండ్లు మనము లెక్కించిన - వేంకటాచార్యులు కాలము - క్రీ. శ. 1450+150=1600 ప్రాంతమగును — వేంకటార్యుడు పేర్కొనిన తాళ్లపాక వంశీయుల శాసనములు — క్రీ. శ. 1574 వరకును, మనకు లభించుచుండుటచే వేంకటాచార్యుడు క్రీ. శ. 1600 లుకు తరువాతివాడు.

అవతారికలో—"పెద్దిభట్టకుల వార్ధినిశాకర [1]" అని పెద్దిభట్టును పేర్కొన్నాడు — ఈ పెద్దిభట్టు వేంకటాచార్యులకు కూటస్థ పురుషుడై యుండును— మఱియు నీతడే—అన్నమయ్యకు అల్లుడై యుండును — అతని వెనుక 5, 6 తరముల వెనుక—వేంకటాచార్యుడుండియుండును—

## శ్రీపాదరేణు మాహాత్మ్యము

శ్రీవేంకటేశ్వరుని శ్రీపాదరేణు మాహాత్మ్యమను నాలుగు ఉల్లాసములు గల కావ్యముగా రచించుటచే, వేంకటాచార్యుడు, కవియేగాక, మహాభక్తుడైనట్లు

---

తము-కేవలము ప్రబంధధోరణి నున్నది. భక్తిపరముగా నృసింహకవి, కవికర్ణరసాయనము వ్రాయగా మానవపరము తిట్టు కవితతో - "ఖలకర్ణవిషాయనము" అను కావ్యమును వీరేశలింగముగారి గురువగు పన్నాల సీతారామబ్రహ్మశాస్త్రి వ్రాసియున్నాడు. (1824-1900)

1. సంస్కృత వాఙ్మయమున. వైష్ణవ భక్తిలో నిట్టి రచనలున్నవి. రంగనాథకవి పదసహస్రమను చెప్పగా, వేదాంతదేశికులు పాదుకాసహస్రమును చెప్పినారు. పదసహస్రము చెప్పుటకు కొంత కవితా సామగ్రి యున్నది. కాని పాదుకా సహస్రము చెప్పుట కంత కవితా సామగ్రి లేదు. అరువదేండ్ల క్రిందట బొమ్మకంటి నరసింహశాస్త్రి యను పండితుడు. పాదుకాసహస్రము చెప్పుటలో విశేషము లేదని. "తిలకసహస్రము" చెప్పినాడు.

మనము భావింపవచ్చును —ఏలననగా, ఎంత చిన్న కథనైనను, పెంచి మహా కావ్యముగా వ్రాయవచ్చును—ఇచ్చట కథావస్తువే లేక భంగవంతుని సంపూర్ణ వర్ణనావిశేషమునులేక, ఆ దేవుని పాదరేణువును మాత్రమే నాలుగుల్లాసములలో వర్ణించుటకు అతని భక్తియే హేతువు — ఆ భక్తియే నాలుగు ఉల్లాసములలో శ్రీపాదరేణు వర్ణనకు ననువైన భావనాశక్తిని సమకూర్చినది — భావనాశక్తియే గాదు కవితా సామగ్రి సమకూర్చినది. శ్రీపాదరేణు మాహాత్మ్యమును, ప్రప్రథమముగా చదివినపుడు వేంకటాచార్యుని భక్తిప్రపత్తులకు మురిసినాడను—

అముద్రితమైన వేంకటాచార్యుల శకుంతలా పరిణయమును గూర్చి యిందు సమీక్ష గలదు—

తాళ్లపాకవారి కృతులలో కొన్ని ముద్రితములైనను నవి సాహిత్య లోకమునకు పరిచితము కాకపోవుటచే నముద్రితములుగానే పరిగణింపవచ్చును— ముద్రితములే గాక, అముద్రితములైన తాళ్లపాకవారి రచనలను గూడ కూలంకషముగా పరిశీలించి, వారి సాహిత్య సమగ్ర స్వరూపము దర్శింపజేయుటచే నీ గ్రంథము—

## మౌలిక పరిశోధన

గ్రంథముగా భాసించినది — ఇట్టివీనాడు వ్రేళ్లపై లెక్కబెట్టదగినవిగా నున్నవి—ఈ గ్రంథము రెండవ సంపుటము ప్రకటితమైనయెడల, తాళ్లపాకవారి శ్రీ వేంకటేశ్వరవాఙ్మయ మాంధ్రసాహిత్యప్రపంచమున జ్యోతిర్మయ రూపముతో ప్రకాశింపగలదు.

ఇప్పటికి ముప్పదియైదేండ్ల క్రిందట ననగా క్రీ. శ 1935 లో, తాళ్లపాకవారి గ్రంథ పరిష్కరణములకు సంపాదకునిగా, శ్రీ తిరుపతి దేవస్థానమువారు నన్నాహ్వానించినారు. కాని నేనప్పుడు, ఇంపీరియల్ బ్యాంకు (నేడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) లో గుమస్తాగా నుండుటచే, నా యవకాశము నాకు తప్పిపోయినది. ఆవెనుక, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనా సంస్థలో నుద్యోగము లభించినది కాని యది గ్రహించుటకు వీలుకాకపోయినది-వేంకటేశ్వర

విశ్వవిద్యాలయమున ఆచార్య పదవికి ప్రయత్నించితిని గాని, అది లభ్యము కాలేదు—నేడు తిరిగి ఈగ్రంథము మూలమున—**తాళ్లపాక**వారిని గూర్చి—శ్రీవేంకటేశ్వర వాఙ్మయమును గూర్చి-కొన్ని విషయములు వ్రాయుటకు తగిన అవకాశము లభింపజేసినందులకు గ్రంథకర్త నభినందించుచున్నాను—

"కలౌ వేంకట నాయకః"

లక్ష్మీకాంత నిలయము
2-2-1137/5
సరస్వతీ నగర్ (కొత్తనల్లగుంట)
హైదరాబాదు.
28-4-74

ఏ. వి శ్రీనివాసాచార్యులు,
తెలుగుశాఖ, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ
ఓరియంటల్ రిసర్చి ఇన్స్టిట్యూట్, తిరుపతి.

పూజ్యులు అస్మద్గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు తాళ్లపాక వారి సంకీర్తనల సారస్యమునకు తన్మయులై నలువది సంవత్సరములకు పూర్వమే—

"ఇవి తాళ్లపాకవారు రచించినవై యుండవలెను. వీనిలో విష్ణుభక్తి యూటలూరుచున్నది ప్రాచీనములలో, ఇంత రసవంతము, భక్తిభరితము నగు వచనరచన యసాధారణముగా నున్నది. కృష్ణమాచార్య సంకీర్తనములు, శంకర వచనములు మొదలగునవి, వేళ్లలెక్కకుఁ జాలినవి యిట్టివి కొన్ని యున్నవి. వీనినెల్లఁ గ్రమముగా వెల్లడింపఁ గోరికపడుచున్నాఁడను.

మదరాసు విడిచి శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల సన్నిధి సేవకావింప వచ్చుటలో నా తొల్తటికోరిక తాళ్లపాకవారి రచనల నన్నింటిని వెల్లడించుట. ఎంత ప్రయత్నించినను నడ్డంకులతో నింకి పోవుచున్న నా సంకల్పపుటూటలు చక్క సాగుట కద నిప్పటికి సమకూడినది."

మా గురుదేవులవారి సత్సంకల్పము శ్రీ తాళ్లపాకవారి సంకీర్తనలు నసిగా ప్రకటింప బడడమే అయితే శ్రీ ఆనందమూర్తిగారు అంతకంటే ముందంజ వేసి అనితరసాధ్యమైన విధంగా "తాళ్లపాకకవుల కృతులు–వివిధ సాహితీ ప్రక్రియలు" అనే గ్రంథాన్ని రచించినారు. ఇందులో చారిత్రక విషయాలు, సారస్వత విషయాలు చాలా సూక్ష్మాతిసూక్ష్మంగా విమర్శనాపూర్వకంగా తెలుపడమే గాక మొగమోటమిలేకుండా కూడా తమ అభిప్రాయాలను తెలిపినారు. విషయ వివరణ పద్ధతిలో కూడా కొత్త పోకడల నవలంబించినారు. వీరశైవ కవులు తాళ్లపాక కవులు వీరిరువురకుగల కవితాసామ్యమును చక్కగా వివరించినారు. ఇంకా చిన్నన్నకృతులు. మంజరీద్విపదలు, శతకములు, దండకములు, రగడలు, ఉదాహరణములు, స్థలమాహాత్మ్యములు, వచన సంకీర్తనములు, వ్యాఖ్యలు వివరణలు అన్న భాగములు విమర్శనా పూర్వకముగ వివరింపబడినవి. ఒక్కొక్క

భాగము ఒక రసగుళిక. తెలుగు సంకీర్తన లక్షణమును లక్ష్యలక్షణ పూర్వక ముగా తెలిపినారు. తాళ్లపాక కవులు తత్సన్నిహితులు అన్న భాగమున కవి కర్ణరసాయనకర్తను గూర్చి చాల శ్రమపడి రచించినారు. పుస్తక పఠనమున కారంభించినవారికి విసుగుగొల్పక ఆమూలాగ్రముగా పఠింపవలయునన్న కోరిక కలుగునట్లు వీరి రచన సాగినది.

వీరు నూతన సిద్ధాంతముల కొన్నింటిని వెలార్చినారు. అందు మచ్చుకు కొన్ని :—

1. పెదతిరుమలయ్యయు నన్నగారితోఁ బాటు తుళువ నరసనాయకుని దుండగీని తనమును ధిక్కరించి సాళువరాజు పక్షమువహించి పోరాడినట్లున్నాడు. పుట 113.

2. కృష్ణరాయడు ప్రాభవమునకు వచ్చిన తర్వాత తాళ్లపాకవారు పరిస్థితులకు లొంగి ఆ ప్రభువు నాశ్రయించుటకుఁ గొంత యత్నించినట్లున్నది. కాని ఫలితము లేకపోయినందున పశ్చాత్తాపపడినారు. పుట 115.

3. కృష్ణరాయడెట్లున్నను అచ్యుతరాయడు మాత్రము తాళ్లపాకవారికి జాల కావలసినవాడు. అచ్యుతుడు స్వయముగా కృష్ణరాయని దౌష్ట్యమును తాళ్లపాకవారి ధార్మికతను అనుభవించిన వాఁడగుటయే దానికి హేతువు. పుట 116.

4. సాళ్వ తిమ్మరుసయ్య కూడ తుది దినములలో కృష్ణరాయనిచేత పరిభవింపబడి పదవీచ్యుతుడై చిన్ననాటి నుండి తన్నెరిగిన పెదతిరుమలయ్యా కడకే వచ్చి చేరుకొనెను. తిమ్మరుసయ్యమీద దమకుగల భక్తితాత్పర్యములతో తిరుమలయ్య వారి నాదరించి తన కృతజ్ఞతను ప్రకటించుకొనెను. పుట 117.

5. నరసింగన్న చింతించి విరక్తుడై తుదకు సన్యసించినట్లున్నాడు. పుట 111.

6. పెదతిరుమలయ్య తమిళమునందు కూడ కవిత చెప్పగలవాఁడు కాఁబోలును. పుట 118.

ఆయా సందర్భములలో చేర్చదగినవని నాకు తోచిన విషయములు కొన్ని తెలుపుచున్నాను. ఇట్టివి చేర్పుట వలన గ్రంథమునకు కొంత పరిపుష్టి కల్గునని నా నమ్మకము. మచ్చుకు కొన్ని :

1. తాళ్లపాకవారు శ్రీ స్వామివారికి సమర్పించిన గ్రామముల పట్టీలో–మన్న సముద్రము-వల్లాత్తంజేరి-పెరీచ్చంబాకము. పుట 72.

2. రగడకు రూపాంతరమైన క్రౌంచపదము నన్నిచోడడు మాత్రమే రచించె నన్నచోట–తిక్కనకూడా స్త్రీపర్వమున "కౌరవసేనా వీరులు" 166 పద్యముగా రగడకు రూపాంతరమగు క్రౌంచపదమును వాడినాడు. పుట 391.

ఇతరుల వ్రాతల వలన వీరు తప్పుదోవను పడినట్లున్నారు. అట్టివి మచ్చుకు రెండు :–

1. పెదతిరుమలాచార్యాదులు తిరువెంగళనాథుని కంకితముగా చెప్పిన సంకీర్తనములు రాయల కభీష్టముగా చెప్పినట్లున్నది. (I No. 20 of Vol 4. క్రీ. శ. 1532) పుట 85.

పెదతిరుమలాచార్యుడు అచ్యుతదేవరాయల కభీష్టముగా తిరువెంగళనాథ దేవునకు సంకీర్తనములు చెప్పుటను మనము శాసనములందు గుర్తింప గలము పుట 117.

**"As per the order of the emperor Tallapakam Tirumalacharyulu who sung various Srinagara Sankirtanas in praise of Sri Venkatesa."**

ఈ ఆంగ్ల పరివర్తనము నాధారముగా గొని పై విధమైన అభిప్రాయము వెలార్చినారని నా నమ్మకము. వీరు చూపిన శాసనమిది :–

1. స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశక వరుషంబులు ౧౪౫౪ అగునేంటి ..................................................

2. మహారాజాధిరాజ రాజ పరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీవీర అచ్యుతరాయ మహారాయ..........................................

3. ప్టంగాను తిరువెంగళనాథునికి శ్రింగార సంకీర్తనలు చెప్పిన తాళ్లపాక అన్నమయ్యకు..........................................

4. దపూర్వమైన కోనేరి పునః ప్రతిష్ఠగాను నూతన శిలలచేతను కట్టించి చుట్టిరాను అంకణగో......................................

5. రుచుట్టు మహా ప్రాకారాలున్ను ఆ......ట్టిరి మండపమున్ను తిరువెంగళ నాథదేవర ............................................

ఇది అసమగ్రమైనది. 641–642 **T.T.** లుగా నున్నట్లు పేర్కొని యున్నారు.

కాని యిదే విషయమును తమిళమున అదే సంపుటమున 40వ సంఖ్యగా ప్రకటించియున్నారు. అందు శా. శ. 1410 మన్మథ వైయాశి మాసమున పూర్ణిమ రోజున వేసినట్లున్నది. 1410 కీలక సంవత్సరమగుచున్నది. 1457లో మన్మథ సంవత్సరము వచ్చుచున్నది. ఇందు శకవత్సరమో మన్మథవత్సరమో పొరపాటుగా పడియున్నది. దీనికి ఆంగ్లపరివర్తనచేయు సందర్భముననే పెద తిరుమలయ్య తమిళకవి యన్నారు.

"ఎణ్ శీర్ నెడిల్ ఆశిరియ విఱుత్తమ్ (?)" అన్న ఛందోరీతిలోకల పై శాసన రచయిత ఆనాడు తిరుమలస్థానాచార్యుల తరపున అన్ని శాసనములను రచించి చెక్కించిన "తిరునిన్రావ్ వుడయర్" అని నా నమ్మకము.

పై 20, 40 సంఖ్యలలోని విషయమే 41వ సంఖ్యలో తెలుగు సీసపద్యమున చెక్కించి యున్నారు. అది కూడ కొంత అసమగ్రముగనే కలదు.

సరియైన తీరున ప్రకటించబడిన ఈ క్రింది పద్యము చూడుడు :—

సీ॥ శ్రీ శాలివాహనాంచిత శకాబ్దము లెన్న
        నిల వేయు నన్నూఱట యేబదియును
నాలవ యేఁడగు నందన వత్సర
        వైశాఖ పూర్ణిమా వాసరమున
శ్రీ వెంకటాధీశ శృంగార సంకీర్త
        నాచార్య తాళ్లపాకన్నమార్య
పుత్ర తిమ్మార్యుండు పూర్వపు గోనేఱు
        కట్టించె నవశిలాకలితముగను
తత్తటాంకణ గోపుర ద్వారములను
భువన సన్నుతుఁడైనట్టి భూవరాహ
ఘనుని తిరుచుట్టుమాలె ప్రాకారవరము
తానె కట్టించె నాచంద్రతారకముగ

—అన్నమాచార్యచరిత్ర పీఠిక. పుట 98.

ఇందు పేర్కొన్న 1454 నందన వైశాఖ పూర్ణిమలు సరిగా సరిపోవు చున్నవి. కావున ఈ పద్యము, 41వ శాసనము సరియైనవనీ, 20,40 శాసనములు సరియైనవి కావనీ తెలియుచున్నది.

(ఇట్లే అదేసంపుటమున అచ్యుతరాయలు చక్రతీర్థము (కపిలతీర్థము)ను జీర్ణోద్ధారము చేసిన శాసనము తెనుగున 8వ సంఖ్య గాను, కన్నడమున 9 సంఖ్య గాను, తమిళమున 10వ సంఖ్యగాను చెక్కియుండడము గమనింపగలము.)

కావున 14-9-1532 **A. D.** నందన సంవత్సర వైశాఖ పూర్ణిమ స్వాతి నాడు సీసపద్యరూపమున వేయించిన 41 శాసనమువలనను, పై సీసపద్యము వలనను నరస్తుతి విముఖులైన తాళ్లపాకవారు రాయలప్రీతిగా కీర్తనములు రచించ లేదని స్పష్టముగా తెలియుచున్నది.

ఇక రెండవది :— పెద తిరుమలయ్య సన్యాసాశ్రమమును స్వీకరించెననియు, ఆతర్వాత వెంకటయోగి యని నామాంతరము కలిగెననియు వ్రాసినారు. పుట. 358,462.

వీరు పైవిధముగా వ్రాయుటకు శ్రీవజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రిల వారి వ్రాత ఆధారమని తెలియుచున్నది. ఇంకా "శ్రీ కృష్ణ పదారవింద మకరందరసానుభవుండైన వెంకటపతి యోగి వ్రాసింది" అన్న వాక్యమును తమ అభిప్రాయమునకు ప్రోద్బలకముగా చూపినారు. ఇందులో 'రచించె' నని కానీ 'తెనిగించె' నని కానీ లేదు. "వ్రాసింది" అనియే కలదు. ఇతడు వ్రాయసకాడే కాని రచయిత కాదు. వేంకటేశ్వర పంచచామరముల కర్త-అద్వైతమతానుయాయియైన వెంకటపతియోగి తన స్వంతమునకు వ్రాసుకొన్న భగవద్గీతలోని భాగమిది. చూ. D. 2145_G,O.M.L. భగవద్గీత.

తాళ్లపాక వారు ఏనాడూ సన్యాసాశ్రమమును స్వీకరింపలేదు. వేంకటేశ్వరుడే వారికి దైవము. ఇతర దేవతల నెవరినైన స్తుతించియున్న శ్రీ వేంకటేశ్వరునితో నభేదము కల్పించి స్తుతించినారు. శ్రీ కృష్ణ భక్తివలన భగవద్గీత తెనుగు చేయలేదు. శ్రీమద్రామానుజ మతానుయాయులగుటచే శ్రీరామానుజ విరచిత గీతాభాష్యము నకు వ్యావహారిక వచన రచన చేసిరి. భగవద్గీత **No. 7653. S.V U O.R.I** తిరుపతి అందు "ఇది శ్రీమద్రామానుజ విరచిత

మైన శ్రీ గీతాభాష్యక్రమూన శ్రీమత్తాళపాక అన్నమాచార్యుల పుత్రులు తిరుమలయ్య గారు తెనుగుచేసినది" అని కలదు. "శ్రీమద్రామానుజ మతప్రతిష్ఠాపనాచార్య" బిరుదాంకితుడు పెద తిరుమలయ్య. ఆ బిరుదు సార్థకమగుటకై చేసిన తెలుగు సేత ఇది.

ఈ గ్రంథమున తాళ్ళపాక కవులను గూర్చిన సర్వవిషయములు అద్దమునందు వలె స్పష్టముగా ప్రతిఫలించుచున్నవి. ఈ గ్రంథము తాళ్ళపాక కవులను గూర్చి పరిశోధన సల్పువారికి ఎంతో సహాయపడగలదని నా నమ్మకము. తండ్రికి తగిన కుమారుడనిపించుకొనిన శ్రీ డాక్టర్. వేటూరి. ఆనందమూర్తి గారు నాకీ అవకాశము కలిగించి నందులకు నేనెంతో ఋణపడియున్నాను.

'పుత్రోత్సాహము తండ్రికి...'అన్న ప్రాచీనుల మతానుసారం నేడు పూజ్యులు మా గురుదేవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు భౌతికముగా లేకున్నా, వారి ఆత్మ ఈ గ్రంథాన్ని చూచి పుత్రోత్సాహంతో తృప్తిపొందుతున్నదని నా నమ్మకము. ఇట్టి సుపుత్రుల గన్న మా గురుదేవులకు నమోవాకము లర్పిస్తున్నాను.

ఆనంద-చైత్ర బహుళ
దశమి-ధనిష్ఠ
16-4-1974.

# కృతజ్ఞతలు

1965లో పిహెచ్. డి. పట్టము కొరకు ఉస్మానియా విశ్వవిద్యాలయమునకు సమర్పించిన పరిశోధన గ్రంథమునందలి కొంత భాగమిది — తాళ్లపాక కవుల సమగ్ర సాహిత్య సమీక్షలో వారి కృతులకు-వివిధ సాహితీ ప్రక్రియలకు సంబంధించినది-తొలిసంపుటము.

వైష్ణవాంధ్ర వాఙ్మయమును గూర్చియు, తాళ్లపాక కవులను గూర్చియు సమగ్రమైన పరిశీలనము జరుపవలెనన్న కాంక్ష నాలో కుసుమించుటకు పితృపాదులు శ్రీ ప్రభాకర శాస్త్రిగారి సంకల్పబలమును, వారి మౌలిక రచనలును దోహదములైనవి. అందుకు తొలుత వారి కిట భక్త్యంజలి ఘటించుచున్నాను.

1954-55 లో నేసీ రచనా వ్యాసంగము నారంభించినది మొదలు 1964-65 లో విశ్వవిద్యాలయమున పరిశోధన వ్యాసమును సమర్పించు పర్యంతము ఎంతో వాత్సల్యముతో నాయీ రచనా పరిశ్రమమును నిశితముగా పర్యవేక్షించి, అమూల్యములగు సూచనల నొసంగి ప్రోత్సహించిన దర్శకులు ఆచార్య శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారికి కృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాను.

నాయీ పరిశోధన వ్యాసము నామోదించి పట్ట మొసగియు, వెలువరించుట కనుమతించియు తోడుపడిన ఉస్మానియా విశ్వవిద్యాలయాధికారులకు — నాడు ఉపాధ్యక్షులు గానుండిన శ్రీ డా॥ డి. యస్. రెడ్డిగారికిని, నేటి ఉపాధ్యక్షులు శ్రీ నూకల నరోత్తమ రెడ్డిగారికిని నా హృదయపూర్వకాభివందనములు.

పరిశోధన సలుపువేళ మత విషయమై నా సందేహములను తీర్చి, వలసిన సామగ్రి నందించి ప్రోత్సహించుచుండిన కీ. శే. డా. K C. వరదాచార్యులవారిని, ఎడనెడ నా యోగక్షేమములను విచారించి నా రచనను విని ప్రోత్సాహమొసగుచుండిన స్వర్గీయ శ్రీ విస్సా అప్పారావు పంతులుగారిని భక్తితో స్మరించుచున్నాను

చరిత్ర విషయమై తాళ్లపాకవారి గుంటూరు మండల శాసనముల పాఠము లొసగియు, నా సందేహములను తీర్చియు తోడుపడిన డా॥ నేలటూరి వేంకట రమణయ్యగారికి నా కృతజ్ఞతలు.

తాళ్లపాక కవుల ముద్రితాముద్రిత రచనలను పరిశీలించుట కనుమతించి తోడ్పడిన తిరుపతి దేవస్థానాధికారులకును, ప్రత్యేకముగ శ్రీయుతులు చెలికాని అన్నారావుగారికిని నా కృతజ్ఞతలు.

విశ్వవిద్యాలయమునకు సమర్పింపవలసిన మూడు వ్రాత ప్రతులను సిద్ధము చేయుటలో నాకు తోడుపడిన హైదరాబాదు పబ్లిక్ స్కూలు ఆంధ్రోపన్యాసకులు శ్రీ నరసింహాచార్యులుగారి కీసందర్భమున ధన్యవాదము లర్పించు చున్నాను.

దయతో స్వామివారి శ్రీ పాదముల బ్లాకు నొసగిన చిత్రకారులు సిద్దిపేట లలితకళా సమితి అధ్యక్షులు నైన శ్రీ కె. రాజయ్యగారికిని, ముఖ చిత్రముబ్లాకు నొసగిన ప్రభుత్వ సమాచార శాఖవారికిని కృతజ్ఞతాభివందనములు.

ఈ గ్రంథమును ప్రకటించుటకై ఆర్థిక సహాయమును కోరినంతనే కొంత ఒసగి అనుగ్రహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారికిని; సహృదయులు, భాషా ప్రియులు అయిన అప్పటి ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావుగారికిని నా హార్దికాభివందనములు.

ఈ గ్రంథము నిట్లు ముచ్చటగా ముద్రించిన మురళీ పవర్ ప్రెస్సు వారికిని, మేనేజరు శ్రీమాన్ పార్థసారథిగారికిని కృతజ్ఞతలు.

కోరినంతనే నా యీ గ్రంథమును పరికించి తమ ఆశీస్సులను, అభిప్రాయములను అందజేసిన పెద్దలకు వందనములు. వారి దీవెనలను, సూచనలను శిరసా వహించు—

విధేయుడు,

**వేటూరి ఆనందమూర్తి**

# విషయసూచిక


1. ప్రథమాధ్యాయము.

**తిరుపతి చరిత్ర-తాళ్లపాకకవులు** **1–186.**

వేంకటాచలక్షేత్రము—పౌరాణికాధారములు - 1; ఆళ్వారులు—తిరుపతి - 7; తొండమండలము—తిరువెంగడ కొట్టము - 10; వైష్ణవాచార్యపురుషులు—తిరుపతిలో శ్రీరామానురాజులవారి కైంకర్యము - 14; విజయనగర యుగము, సంగమవంశము—తిరుపతి - 19; సాళువ వంశము—తిరుపతి-22; తుళువ వంశము—తిరుపతి-27; శ్రీకృష్ణదేవరాయల కాలము - 28; రాయల తిరుపతి యాత్రలు - 29; మధ్వాచార్యులు—తిరుపతి - 39; ఆదివణ్ శఠగోపయతి—తిరుపతి - 40; అచ్యుత దేవ రాయల కాలము—తిరుపతి - 41; సదాశివరాయలకాలము —తిరుపతి - 46; ఆరవీటి వంశము—తిరుపతి - 52.

తాళ్లపాకవారు—కాలము - 53; తాళ్లపాకవారు—తిరుపతి - 70; తాళ్లపాకవారు—సాహిత్యము - 89; అన్నమాచార్యుని చరిత్రము-95; తాళ్లపాక తిమ్మక్క-109; నరసింహకవి - 110; పెదతిరుమలాచార్యుడు-113; చినతిరుమలాచార్యుడు - 119 అన్నయ్య - 121; పెద తిరువెంగళనాథుడు — చిన తిరువెంగళనాథుడు - 122; కోనేటి తిరువెంగళనాథుడు - 125; తిరువెంగళప్ప - 126; వీరశైవకవులు — తాళ్లపాక వారు - 128.

## 2. ద్వితీయాధ్యాయము.

తాళ్లపాకవారి సాహిత్యము:-పరిశీలనము 187-474

ద్విపద కావ్యములు - 137 ; తాళ్లపాకవారి ద్విపదకావ్యములు - 142 ; ద్విపదలక్షణ నిర్వచనము - 144 ; ద్విపద విరాడ్ఛందోవతీర్ణయా? - 148 ; అన్నమాచార్య రామాయణము - 156 ; భాగవతరామాయణము-165; పెద తిరుమలాచార్యుని కృతులు—హరివంశము - 167 ; శ్రీ వేంకటేశ్వర ప్రభాత స్తవము - 169 ; చిన్నన్న కృతులు—అష్టమహిషీకళ్యాణము - 172 ; ఉషాకళ్యాణము - 194 ; పరమయోగి విలాసము - 213 ; అన్నమాచార్య చరిత్ర-291 ; చిన్నన్న ద్విపదలలోని రసరామణీయకము - 297 ; మంజరీద్విపదకావ్యములు-306 ; శృంగారమంజరి - 307 ; చక్రవాళ మంజరి - 311 ; సుభద్రాకళ్యాణము - 314.

శతకములు-320 ; తాళ్లపాకవారి శతకములు - 324 ; శ్రీవేంకటేశ్వర శతకము - 325 ; మంగాంబికా శతకము - 332 ; పెద తిరుమలాచార్యుని శతకములు - 334 ; శృంగారవృత్తపద్యాల శతకము - 335 ; నీతి సీసశతకము - 343 ; శ్రీ కృష్ణ శతకము (రేఫ ఱ కారనిర్ణయము) - 356 ; శృంగారామరుశతకము-373. దండకములు - 381 ; శృంగార దండకము - 383 ; అష్టభాషాదండకము - 387.

రగడలు - 390 ; సుదర్శన రగడ - 396.

ఉదాహరణములు-401 ; శ్రీవేంకటేశ్వరోదాహరణము-403 ; స్థలమాహాత్మ్యములు — శ్రీవేంకటాచలమాహాత్మ్యము - 415 ; వచనసంకీర్తనములు - 427 ;

శ్రీ వేంకటేశ్వర వచనములు - 428 ; తెలుగు సంకీర్తన లక్షణము — లక్ష్య లక్షణ సమన్వయము - 434 ; వ్యాఖ్యలు—వివరణలు 458 ; సంకీర్తన లక్షణవ్యాఖ్య - 461 ; భగవద్గీత వచనము - 462 ; నామలింగాను శాసనవ్యాఖ్య—(గురుబాల ప్రబోధిక) - 466 ; కావ్య ప్రకాశవ్యాఖ్య - 471.

3. తృతీయాధ్యాయము.

తాళ్లపాకవారు—తత్సన్నిహితులు 475—515

కవికర్ణరసాయనము - 476 ; రేవణూరి వేంకటాచార్యుడు - 502 ; శ్రీపాదరేణు మాహాత్మ్యము - 505 ; శకుంతలా పరిణయము - 510; రామచంద్రోపాఖ్యానము - 514

అనుబంధము

కావ్య ప్రకాశికా టీకా 516-521

ఉపకరించిన రచనలు 522-524

కొన్ని ముఖ్య సవరణలు 525-528

ప్రథమాధ్యాయము

# తిరుపతి చరిత్ర-తాళ్లపాక కవులు

(పుటలు 1 – 136)

# తిరుపతి చరిత్ర-తాళ్లపాక కవులు

దక్షిణ భారతమున ఆంధ్రరాష్ట్రమున చిత్తూరు మండలమున వెలసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమే తిరుపతి. తూర్పుకనుమలలో నల్లమల అని ప్రఖ్యాతిగాంచిన పర్వతపంక్తులు కృష్ణానదికి దిగువన విచిత్రమగు నాకృతినిదాల్చి కర్నూలు, చిత్తూరు, కడప మండలములందు వ్యాపించి యున్నవి. వాని యాకృతి చూపరులకు పరున్న శేషాహివలె విడ్డూరము గొల్పినది. అందుకే ఈ పర్వతపంక్తికి శేషాచలమనియు పేరైనది. చిత్రమేమన ఈ పర్వతపంక్తి పైననే దక్షిణభారతమున ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రములు రెండుమూడు వెలసి ఉన్నతమును అచంచలమునునగు భారతీయుల భక్తి సామరస్య భావములను వెల్లడించుచున్నవి. శేషాచలపు పుచ్ఛభాగమున (కర్నూలు మండలమున) శ్రీశైలము, పృష్ఠభాగమున అహోబిలము, శీర్షమున వేంకటాచలము, ముఖమున శ్రీ కాళహస్తి వెలసి జీవిత మార్గమున భగవదభిముఖముగాఁ బయనించుచున్న భక్తవరుల కారని వెలుఁగు దివ్వెలై బాటనుఁ జూపుచున్నవి. వీనిలో మనకు ప్రస్తుతమైనది వేంకటాచలమని ప్రశస్తి వహించిన తిరుపతి క్షేత్రమే.

## వేంకటాచల క్షేత్రము-పౌరాణికాధారములు

ఈ క్షేత్రము మన దేశమున మిక్కిలి ప్రాచీనమైన వానిలో నొకటి. ఒక్క ప్రాచీనతలోనేకాదు మహిమలోను అద్వితీయమైనది. అసలిది మానవనిర్మితమగు క్షేత్రము కాదనియు సాక్షాద్వైకుంఠ వాసుఁడగు శ్రీమన్నారాయణుఁడే యిలపై వెలయఁగోరి యీ చల్లనిచోటు వెదకుకొనినాఁడనియు పురాణములు వాకొనుచున్నవి. ఈ క్షేత్రమునకు సంబంధించిన పురాణ కథాసార మిట్లున్నది. ఒక

తూరి ఋషిసంఘమున త్రిమూర్తులలో నుత్తమోత్తముఁ డెవరన్న వాద ముదయింపగా పరిశీలింపఁగోరి భృగుమహర్షి పయనమాయెను. ఆయన క్రమమున సత్యలోకాదులను పరిభ్రమించెను. బ్రహ్మదేవుఁడు భృగుమహర్షినిఁ గాంచియు తన సృష్టియేగద యన్న రాజసభాపమున సన్మానింపఁడాయెను. పరమశివుఁ డుమాదేవితో కామక్రీడలఁ దేలియాడుచు తామసమున భృగుమహర్షిని కానివేళ వచ్చినందులకు కినిసి తరుమఁగొట్టెను. తదుపరి వైకుంఠమున యోగనిద్రావశుఁడైన నారాయణుని చూడఁజని పరాకున నున్నందులకు వక్షమున నొక తాపుతన్నినను, తాచినతాపును సైతము మన్ననగాఁగొని మహర్షిని మన్నింప వేడికొని మెలకువతో నుండునట్లు చెప్పుకొని సత్కరించి పంపెను. భృగుమహర్షి కావించిన యీ యాత్రకారణమున నారాయణుఁడే పరమోత్తముఁడని తేలుట మాత్రమేకాదు - ఇలలో నీ తిరుమలలో నొక వైకుంఠము వెలయుటకూడ జరిగినది. అదెట్లన- నారాయణుని వక్షమున భృగుమహర్షి తన్నినతాపు ఆతనికి మన్ననగానే తోఁచినదేమోగాని ఆ స్థానము నాక్రమించుకొనిన లక్ష్మీదేవికి మాత్రము దుస్సహమైనది. తాపుఁ దిన్న వక్షమున దానింక నుండనని యలిగి లక్ష్మీదేవి వైకుంఠమునుఁ బాసిపోయినది, అనురాగమయుఁడగు లక్ష్మీప్రియుఁడు ఆ విరహము నోపఁజాలక దివినుండి భువికి దిగి తిరుమలనే నివాసముగా నేర్పఱచుకొని ప్రియురాలిని చేరఁదీసికొనఁగల్గెను. ఆ నారాయణుఁడే నేఁటి తిరుమల శ్రీనివాసుఁడు. ఆతల్లియే పద్మావతీదేవి. ఇప్పటికి కొన్ని మన్వంతరములకుఁ బూర్వము ఆ స్వామి ఆదివరాహరూపమున తొలుత నాకొండపై నెలకొనెను. పిదప నొకభక్తునివాంఛను దీర్చుటకై వక్షమున లక్ష్మినిఁ దాల్చిన శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహమునుఁ దాల్చెను. కొంతకాలమునకు చీమలు పుట్టలుపెట్టి స్వామివిగ్రహమును మఱుఁగుపరచినవి. ఇట్లుండ నాప్రాంతమును నేలుతొండమాన్ రాజుగారి పశువులను మేపుకాపరు లొకతూరి ఒక వింతవార్తను తొండమాన్ రాజునకు నివేదించిరి. మేతకువెళ్ళిన పశువులు నిత్యము పుట్టకడకుపోయి తమకుఁదామై యందు పాలుస్రవింపఁజేసి యింటికి వట్టిపొదుగుతో రాసాగినవి, రాజు

పరిశీలించెను. అది యట్లే జరిగెను. వెంటనే ఆతఁడా పుట్టను త్రవ్వించెను. అందుండి శ్రీనివాసుని విగ్రహము వెలువడెను. రాజు ఆశ్చర్యపడి అచట నొక మందిరమునుఁ గట్టించి పూజాక్రమము నేర్పరచెను. ఇది శ్రీనివాసునకు సంబంధించిన పురాణములగాథ.

ఇట్లు నెలకొన్న శ్రీనివాసుఁడు లక్ష్మీవిరహమున వేఁగుచు కాలక్షేపమునకై తఱచు వేటకు వెళ్ళుచుండెను. ఇట్లుండ ఒకతూరి ఆ ప్రాంతముల నేలుచుండిన తొండమాన్ రాజుల వంశమునకు చెందిన ఆకాశరాజునకు పెంపుడు బిడ్డయగు పద్మావతియను యౌవనవతిని తాను వేటకై వెళ్ళినవాఁ తోటలోఁగాంచి మోహించును. పిదప రాయబారాదులుసాగి పద్మావతీశ్రీనివాసులపరిణయ మగును. హరికథాపరులను, భక్తులను పరవశింపఁ జేయు పురాణాంతర్గతమగు శ్రీనివాస కళ్యాణ కథాసారమిది. కల్పన లధికముగాఁగల పురాణ కథ యిది యైనప్పటికిని వేంకటాచల క్షేత్రమునకు సంబంధించి గుర్తింపఁదగిన చారిత్రకాంశ మిందు కొంత లేకపోలేదని వ్రాయుచు శ్రీ॥ కృష్ణస్వామి అయ్యంగారు తత్సమన్వయమునకుఁ గొంత యత్నించిరి.[1]

ఈ క్షేత్రమునకు వేంకటాచలమని నేఁటికిని పేరు. మన దేశమందలి ప్రాచీన పుణ్యక్షేత్రములలో నిది మిక్కిలి గణింపఁ దగినది. దీనికి ద్రావిడ భాషలో 'వేంగడ' మని నామాంతరము. ఈ క్షేత్రము యొక్క ప్రాచీనతను చారిత్రకముగా నిర్ధారించుటకు ద్రావిడ భాషలో బహుళ సాధనములున్నవి, ఆ భాషలో తొలిగ్రంథమును, ఆదిమ వ్యాకరణమును నగు 'తొల్‌కాప్పియం'నందు 'వడవేంగడ'మని యుదాహృతమైనది. 'ఉత్తరమునగల వేంగడ' మను ప్రాంత మీవడవేంగడమున సూచితమగుచున్నది. ఈ ప్రాంతమునకు దక్షిణమున తమిళ భాషయు, ఉత్తరమున దానికి భిన్నమగు నాంధ్ర (ఉత్తరాది)

---

1. చూ. A History of Tirupati- by Sri S. Krishna Swamy Ayangar. T. T. D. Publication IEd. 1939, IIEd. 1952.

భాషయు వ్యవహారమున నుండినవి. భాషలో మార్పు ఈ వేంగడమను ప్రాంతమున గుర్తింపనగునట్లు తొల్‌కాప్పియ గ్రంథరచయిత పేర్కొనెను. అందు పేర్కొనఁబడిన 'వేంగడము' నేఁటి వేంకటాచల ప్రాంతమే యగుట సుస్పష్టము. కావున తద్రచనాకాలముననే ఈ ప్రాంత మానామమున వ్యవహృత మగుచుండిన దనవచ్చును.

తొల్‌కాప్పియము వేంగడ ప్రాంతముయొక్క ప్రాచీనతను సూచించును. అట్లే తొల్‌కాప్పియము తరువాత వెలసిన ద్రావిడుల ప్రాచీన సంగమ సాహిత్యము కూడ ఆ ప్రాంతమునకు సంబంధించిన మత భౌగోళిక చారిత్రక విషయ విశేషముల నెన్నిటినో మన దృష్టికి తెచ్చుచున్నది. ఈ సాహిత్యము వెలసిననాటికి వేంగడమను శబ్దము ఆంధ్రదేశపు దక్షిణ సరిహద్దు ప్రాంతములకే కాక కేవలము నేఁటి తిరుపతికే పర్యాయముగా కాననగుచున్నది. ఈ తిరుపతి లేక వేంగడమే ఆంధ్ర ద్రవిడ మండలముల నడిమి సరిహద్దు గ్రామముగా పేర్కొనఁబడినది. ఇట్లు తిరుమల-తిరుపతులను పేర్కొనిన సంగమ సాహిత్య కాలపు కవులలో, కల్లాదనార్, నక్కీరార్, శణక్కాయనార్, తాయంగణ్ణన్, కణ్ణన్, మామూలనార్ ప్రభృతులు ముఖ్యులు. వీరందరిలోను కడపటివాఁడగు మామూలనారే తిరుపతి చరిత్రపై నెక్కువ వెలుఁగును ప్రసరింపఁ జేసినాఁడు.

వీరి రచనలలో తిరుపతియు పరిసర ప్రాంతములును మనకీ క్రింది రీతిని దర్శితము లగుచున్నవి. ఆ ప్రాంతము ఆంధ్రద్రవిడ మండలముల సరిహద్దు దేశము. అచ్చట వడుగర్ (ఉత్తరాదివారు- ద్రావిడ దేశమునకుత్తరదిశ యందున్న నేఁటి రాయలసీమ యాంధ్రులు) నివసించుచుండిరి. వారి భాష యుచ్చారణమున వింతగా సుదీర్ఘ స్వరములతో సాగఁదీయఁబడి నట్లుండెడిది. ఆ ప్రాంతమంతయు నరణ్యమయమై యేనుగులతో నిండియుండెడిది. నివసించు జనులు ప్రాయశః వేటయే వృత్తిగాఁగల యాటవికులుగనో పశువుల మేపుకొను వారుగనో యుండుచుండిరి. అట్టి యా యరణ్యప్రాంతమునకు 'పుల్లి' యను వాఁడు పాలకుఁడుగా నుండెడివాఁడు. అతని తరువాత బహుశః

పెత్తనము 'తిరైయాన్' అను వానిచేతికి వచ్చియుండును. ఆతడు వేంగడమును ముఖ్య రాజధానిగాను, పవత్తిరి (నేటి నెల్లూరుజిల్లా, గూడూరు తాలూకా రెడ్డిపాలెము) అనుగ్రామమును రెండవ రాజధానిగాను కావించుకొని పాలించుచుండెను. ఈ ప్రాంతములన్నియు నాఁడు తొండైయార్- మండలము (తొండమండలము) నకు సంబంధించినవి. ఆ దినములలో చోళ మండలపాలకులు అచ్చటి 'వడుగరు' ను అదుపులోనికి తెచ్చుకొనుటకై దండయాత్రలు కూడ సలిపిరి.

ఈ పై విషయములే కాక మామూలనార్ రచనలలో అహనానూర్ నందలి 61వ పద్యమునుబట్టి వేంగడము ఆ దినములలో ఉత్సవ విశేషములతో శోభిల్లి సంపద్భరితముగా నుండెడిదని కూడ మనకు తెలియుచున్నది. మొదట పేర్కొనిన ఆధారములన్నియు వేంగడమునకు సంబంధించిన చారిత్రక భౌగోళిక విశేషములనే వెల్లడించినను తరువాత పేర్కొనిన మామూలనార్ రచన మాత్రము పుణ్యక్షేత్రముగా నేఁడు ప్రశస్తిఁగాంచియున్న వేంకటాచలము యొక్క ప్రాచీనతనే విశేషముగా వెల్లడించుచున్నది. అనఁగా అచ్చట నేఁడు జరుగుచున్న ఉత్సవ విశేషములకు బీజావాపము ఆ నాఁటికిఁ గొంత పూర్వమే జరిగినదని తెలియనగుచున్నది. పురాణములలో నొక తొండమాన్ రాజు శ్రీనివాసుని విగ్రహమును పుట్టనుండి యుద్ధరించి, మందిరము గట్టించి పూజాక్రమము నేర్పరచినట్లున్నది. మామూలనార్ రచనలలో వేంగడమునందలి ఉత్సవ వైభవము ప్రస్తుతమైనది. ఇట్టి క్షేత్రమునకుఁ జెందిన పురాణములందలి యాధారములను, సంగమ కాలపు సాహిత్యమునందలి యాధారములను సేకరించి సమన్వయించి వేంకటాచల క్షేత్రముయొక్క ప్రాచీన చరిత్ర నుద్ధరించుటకు డాక్టర్ యస్- కృష్ణస్వామి అయ్యంగారు 'History of Tirupati' అను గ్రంథమున యత్నించినారు. వారి యభిప్రాయ సారమిది.

పురాణములును, సంగమ సాహిత్యమును కూడ వేంకటాచల క్షేత్రమునకు తొండమాన్ రాజులతోఁ గల సంబంధమును చాటి చెప్పుచున్నవి. పురాణములు శ్రీనివాసుని విగ్రహము నుద్ధరించి యాలయ

మందిరమును నిర్మించిన యొక తొండమానుని పేర్కొని ఆతఁడొక చోళ ప్రభువునకును, స్థానికురాలగు నొక సుందరాంగికిని జన్మించిన వాఁడుగా వివరించుచున్నవి. ఆతనికే శ్రీనివాసుఁడు తనయాయుధ ములను బలమును ఇచ్చి యుద్ధ సందర్భమున సహాయ మొనర్చె ననియుఁ గలదు. ఇఁక సంగమకాలపు సాహిత్యము వడుగరు (ఉత్తరాదివారు) లలో కళ్వర్ తెగకు చెందిన వారికి నాయకుఁడగు 'పుల్లి' తరువాత వేంగడ ప్రాంతమును 'పవిత్తిరి' రాజధానిగా పాలించిన తిరైయాన్ తొండమాను నొకనిని పేర్కొనుచున్నది. బహుశః ఈతఁడే పురాణములలోఁ బేర్కొనఁ బడిన తొండమాను చక్రవర్తియై యుండును. ఇట్లూహించుటకు కొంత సాక్ష్యమున్నది. పురాణము లందే శ్రీనివాసుని యాలయ స్థాపనముఁ గూర్చిన కాలవివరణము కొంతగలదు. అది కలియుగమున విక్రమాదిత్య శకమారంభించి శాలి వాహన శక మింకను ప్రారంభము కాని సమయమున జరిగినట్లున్నది. ఈ విషయమును విశ్వసించితిమేని ఈ ఆలయ స్థాపనము క్రీ॥ పూ॥ 57 క్రీ॥ శ॥ 78 సంవత్సరముల నడుమ నెప్పుడో జరిగి యుండునని తలఁప వలసియున్నది. మఱి సంగమ సాహిత్యమును, అందు పేర్కొనఁబడిన తొండమాన్ - తిరైయాన్ ప్రభృతి సమకాలికులను గూర్చిన విషయ ములనుఁ జారిత్రకముగాఁ బరిశీలించితిమేని ఈతిరైయాను కాలము గూడ పైని పేర్కొనిన ఆలయస్థాపన కాలమే కాఁగలదు, కావున వీరిరువురు నొక్కరగుదురనియు, తొండైయార్ జనులు నివసించు తొండమండలమునుఁ బాలించు తొండమాన్ రాజుల శాఖకు చెందిన వాఁడీతఁ డనియు తెలియనగును. వీరిరువురునుఁ గాక తొండమాన్ - ఇళమ్ - తిరైయాన్ అనునాతఁ డింకొకఁడు ఈ సంగమ సాహిత్య మున ప్రస్తుతుఁ డైనాఁడు. తొండమాన్ - తిరైయాన్ వేంకటా చలమున ఆలయ నిర్మాణాదికముఁ గావించి పూజాక్రమ మేర్ప రచినట్లే ఈ తొండమాన్ - ఇళమ్ తిరైయాన్ కాంచీనగరమున విష్ణ్వాలయములకు విశేషమైన సేవ గావించినాఁడట కాని యాతనికిని వేంకటాచలమునకును నేమియు సంబంధమున్నట్లు కానరాదు. అందు వలన నతఁడు భిన్నుఁడై యుండును. ఈతఁడును చోళ శాఖకుఁ జెందిన

వాఁడే. తొండమాను రాజే. అందు వలన తొండమాను రాజుల శాఖకుఁ జెందిన ఇళమ్ - తిరైయాను పూర్వుఁడగు తిరైయానుని తరువాత వెలసి, కాంచీనగరమున సుప్రతిష్ఠితుఁడై యుండునని యనుమానింప వలసియున్నది.

పై ఆధారములనుఁ బట్టి తేలిన దేమన 'వడుగరు' జనులుండిన వేంగడ ప్రాంతమును 'పుల్లి' పాలించిన కొంత కాలమునకు చోళులు దండెత్తి వడుగరును అదుపులోనికిఁ దెచ్చిరి. ఆ సందర్భముననే చోళ ప్రభువు అచ్చటి యందగత్తెలలో నొకరితో రహస్యమున శృంగారవర్తనము నడపెను. వారికిఁ గలిగిన వారే తిరైయాన్ - తొండమాను శాఖీయులు. ఈ చారిత్రక విషయములే క్రమమున పురాణముల లోనికినిఁ బ్రవేశించినవి. కావున పై సాహితీ చారిత్రక సాక్ష్యములనుఁ బర్యాలోకింపఁగా వేంకటాచలము దైవప్రేరణముననే వెలసిన క్షేత్రమనియు, అది తొలుత వరాహ క్షేత్రముగా నెలకొనియు, పిదప శ్రీనివాసున కిరవైనదనియు, క్రీ॥ పూ॥ ప్రథమ శతాబ్ది యంతమున నెప్పుడో తొండమాన్ చక్రవర్తిచేత గుర్తింపఁబడి గొప్ప విష్ణుక్షేత్రముగా రూపొంది, పూజా విశేషములతో సర్వ జనాకర్షకముగా సంపద్భరితముగా వర్ధిల్లిన భూలోక వైకుంఠమనియుఁ దెలియుచున్నది.

## ఆళ్వారులు - తిరుపతి

సంగమ యుగము తరువాతి సన్నిహిత కాలమున కొంతవఱకు తిరుపతినిఁ గూర్చిన శాసన చారిత్రక సాక్ష్యము లేమియు మనకు లభింపలేదు. దీనికిఁ గారణము తిరుపతికి నాఁడు ప్రసిద్ధి లేమి కాదనియు సరిహద్దు దేశమగుటచేత ఆ దినములలో నా ప్రాంతమునుఁ బాలించిన పల్లవాది రాజవంశములకు తరువాతికాలపు రాజుల వలె నాయా విషయములను శాసనబద్ధము గావించుపరిపాటి లేకుండుటయే

యనియు డా॥ కృష్ణస్వామి అయ్యంగారు వ్రాసిరి.[1] కావున తిరిగి క్రీ॥ శ॥ రెండుమూఁడు శతాబ్దులు మొదలుకొని యేఁడు యెనిమిది శతాబ్దుల వరకును గల కాలఖండమున తిరుపతినిఁ గూర్చిన విషయము నెఱుఁగుటకు మనకు నాఁటి ద్రావిడ వాఙ్మయమే మూలాధార మగు చున్నది. తమిళ దేశమున వైష్ణవ మతమునకును, వాఙ్మయమునకును నుజ్జ్వలతనుఁ జేకూర్చిన పన్నిద్దరాళ్వారుల దివ్య ప్రబంధములే యిందు ముఖ్యములు. ఈ యాళువారల కాలము ప్రాయశః క్రీ॥ శ॥ 3-8. శతాబ్దుల నడుమ నగునని విజ్ఞుల యభిప్రాయము. కావున ఆ కాల మున నాయారచయితలు తిరుపతి నెట్లు పేర్కొనిరో వారి వారి రచనలు పరామర్శించిన తెలియనగును.

శ్రీ కృష్ణస్వామి అయ్యంగా రుదాహరించినట్లు ఆళ్వారుల ప్రబంధ గీతములను బట్టి వేంకటాచలము ప్రసిద్ధముగా వైష్ణవ క్షేత్రమే. పాలమున్నీటిపై పవ్వళించిన స్వామియే ఈ పర్వతాగ్రమున నెల కొన్నవాఁడు. తిరుమల సాక్షాద్వైకుంఠము. భూమ్యాకాశములనుఁ గొలిచిన త్రివిక్రముఁడు తనకుఁ దానై వలచి వచ్చి నిలిచిన చోటిది.

---

1 ఈ యభిప్రాయముతో శ్రీ T. K. T. వీరరాఘవాచార్యులుగా రేకిభవింపలేదు. 'Silappadhikaram does not tell us that the Hill was sacred, nor does it say when the God manifested there.

It was only the Alwars that have sung the glory of the Hill and the God (P. 59.) - Except for the Alwars singing its glory there was nothing historically great about it (P. 61.) The absence of any inscription showing grant of land or relating to the construction of a temple on Tirumalai cannot therefore be accounted for only a simple statement that inscriptions were rare in those days as Dr. S. Krishna Swamy Iyangar, would have us to believe.'

'History of Thirupathi,' T. T. D. Publication 1958.

వెహ్కా, విన్నగర్, తిరుక్కోవలూర్ వంటివిష్ణుక్షేత్రములలో స్వామి కూర్చుండి, పరుండి, నడువఁగా నీవేంకటాచలమున నిలుచున్నాఁడు. ఈయనే గోపాలుఁడు. ఈయనకును శ్రీరంగమందలి స్వామికిని భేదము లేదు. సర్వాంతర్యామియగు శ్రీమన్నారాయణుఁ డితఁడు. బ్రహ్మాది దేవత లీ స్వామినే భజింతురు, శివాదు లీయనయందే లీనమై యుం దురు. ఈ స్వామికి భక్తులు పూలతో దీపములతో పూజలు సేయుదురు. ద్వాదశినాఁడు స్త్రీలు గుమిగూడి యిచ్చటి స్వామికి ధూప దీప నైవేద్యాదు లొసఁగుదురు భక్తవరులకు పథమునుఁ జూపు 'కొండ మీఁది దీపమే' ఈ యేడుకొండలవాఁడు.

ఈ విధమున ఆళ్వారుల దివ్యప్రబంధములందు పెక్కు గీత ములు వేంకటాచలమునుఁ గూర్చి పలువిషయముల నెఱుకపఱచునవి గలవు. మచ్చునకుఁ గొన్నిమాత్రమే పైనఁ జూపఁబడినవి. ఈ ఆళు వారుల గీతములలో కొన్ని స్వామివారి స్వరూపమునుఁ గూర్చిన చర్చ కవకాశమిచ్చునవికూడఁ గలవు అట్టి వాక్యములను సందర్భమునకు భిన్నముగా గ్రహించినచో స్థూలదృష్టి కవి వేరు తీరుగనే అన్వయము లగును. ఉదాహరణమునకు తిరుమలమీఁది స్వామిని పొయిగై యాళ్వారు 'ఆయనే హరుఁడును హరియును. ఆయన వాహనములు నందియును పక్షియును. నిలయము కైలాసమును సముద్రమును. లయింపఁజేయుట సంరక్షించుట ఆయన ధర్మములు. త్రిశూలము చక్రము ఆయన ఆయుధములు.' ఇత్యాదిగా (5-74) వర్ణించును. ఇందు మనకు స్వామియొక్క అద్వైతమూర్తి గోచరించును. పేయా ళ్వారుకూడ నిట్టి (63) వర్ణనమునే గావించును. కొన్నితావుల నీ స్వామియే 'ఇళంకుమారన్'గా వర్ణితుఁడైనాఁడు. ఈ వర్ణనము కుమారస్వామిని స్ఫురింపఁజేయుచున్నది. ఆళ్వారుల రచనలయందు వలెనే తిరుమలమీఁదిస్వామి యాకృతికూడ శైవసంబంధము గలదిగానే తోఁచునట్లు చూచినవారు చెప్పుదురు. కాని పై అభిప్రాయములనెల్ల నిశితముగఁ బరిశీలించి తిరుపతి శైవక్షేత్ర మను వాదము నూచ

ముట్టుగా తెగడినారు డా॥ యస్. కృష్ణస్వామి అయ్యంగారు.[1] ఆళ్వారులు పరమవైష్ణవు లనువిషయము వారి రచనలే వ్యక్తము చేయుచున్నవి. అట్టివారు పై తీరున స్వామిని వర్ణించుటలో సర్వాంత ర్యామియగు విష్ణువునందే శివాదులందరు నంతర్భూతులై యుందురన్న యంశ మిమిడియున్నదే కాని వేఱుకాదనియు ఆకృతిలోని శైవ స్ఫూర్తికూడ సాంకేతికముగా విష్ణుస్వరూపమునే వెల్లడించుననియు, వారు సమంజసముగా నిరూపించియున్నారు. కావున శాసనాధార ములు మృగ్యమైనను క్రీ॥ శ॥ 7, 8, శతాబ్దముల నాఁటికే వేంకటా చలము ప్రసిద్ధికెక్కుచు భక్తుల నాకర్షించుచుండిన వైష్ణవ పుణ్యక్షే త్రమను నంశము సాహిత్యాధారమునుబట్టి భావింపనగుచున్నది,

## తొండమండలము - తిరువేంగడ కొట్టము

నాఁటి వేంగడము తొండమండలమునకు సంబంధించిన ఇరువది నాల్గు 'కోట్టము'లలో నొకటియగు 'తిరువేంగడ కొట్టము'నకు చెందిన 'కుడవూరునాడు'నకు చేరినది.కృష్ణవేణ్ణకు దక్షిణమునఁగల భూభాగము కొంతప్రాయికముగా నాఁడు 'తొండైమండలి' మని వ్యవహార్యమగు చుండెను. ఈపేరు అచట వివసించు 'తొండైయార్' జాతి జనులవలన నేర్పడినదని భావింపవచ్చును. తొండైయారులు నివసించు ప్రాంతము తొండైమండలము - తత్పరిపాలకుఁడు 'తొండైమానుఁడు'. నాఁడు ఈ తొండమండలమునకు కాంచీపురము రాజధాని. తొండమండలము నదుపులోనికిఁ దెచ్చుకొని పరిపాలనావ్యవస్థను కొంత సుస్థిరపరచిన వాఁడు తొలుత కరికాలచోళుఁడని ద్రావిడవాఙ్మయము సాక్ష్య మిచ్చుచున్నది. ఆతనితరువాత కొలదికాలమునకే తొండమండలము నుత్తరభాగమున తిరుగుబాటులు చెలరేగి స్థానికులగు వీరులు కొందఱు అధిపత్యము వహించిరి, పిదప వారినణచి తిరైయాను ప్రభృతి తొండ మాను లుత్తర తొండమండలము నదుపులోనికిఁ దెచ్చిరి. తదుపరి క్రీ॥ శ॥ మూఁడవశతాబ్ది ప్రారంభమునకు ఆ ప్రాంతమంతయు పల్ల

1. చూ A History of Tirupathi, Pages 83-43.

వుల పాలనక్రిందికి వచ్చినది. వారి యనంతరము చోళులు, చాళుక్యులు పాలించిరి.

పల్లవుల పాలనకాలమున (క్రీ. శ. 225 - 880) వేంగడమునుగూర్చిన చరిత్రలో విశేషాంశము లేవియు మనకు తెలియరాకున్నవి. కాని నాటి తొండమండలమునకు చెందిన 24 కొట్టములలో నొకటియగు తిరువేంగడ కొట్టమునకు సంబంధించిన భౌగోళిక వివరములు మాత్రము కొన్ని లభ్యమగుచున్నవి. ఈ తిరువేంగడ కొట్టమున నాలుగునాడు లుండినవి. అందు తిరుపతిప్రాంతము కుడవూరునాడునకును, చంద్రగిరి ప్రాంతము వైకుంఠవలనాడుకును, చిత్తూరుప్రాంతము తూయ్యనాడునకును, శ్రీ కాళహస్తిప్రాంతము ఆర్రూర్ నాడునకును జెందియుండినవి. ఈ 'నాడు'ల, 'మండలము'ల వ్యవహారము నాఁడేకాదు తరువాత చోళచాళుక్యుల కాలమునను నల్లేయుండినది. ఇట్లు భౌగోళికవివరము లిన్ని తెలిసినను కుడువూరునాడునందలి వేంగడము పుణ్యక్షేత్రముగాఁ బ్రసిద్ధిచెందిన విషయముమాత్రము వారి శాసనాదులలో మన కధికముగా తెలియరాలేదు. దీనికి కారణము లనేకములున్నవని శ్రీ కృష్ణస్వామి అయ్యంగారు భావించిరి. వేంగడము సరిహద్దు దేశమగుటచేత రాజకీయముగ నాప్రాంతము అలజడులతో కూడియుండినది. అదియునుగాక పుణ్యక్షేత్రమెక్కడో మారుమూల జనసంచార మంతగాలేని కొండలనడుమ నున్నది. దీనికితోడు భక్తిప్రపత్తులప్రదర్శించు ప్రజానాయకులన్య మీయాలయమునఁ జూపుచుండిన శ్రద్ధాసక్తులను శాసనబద్ధము గావించు పూనిక కొంత ప్రభుత్వము వారికి లేకుండుటయుఁ దటస్థించినది. ఈ యన్నికారణములనుఁ బురస్కరించుకొని పరిశీలించినపుడీ పుణ్యక్షేత్రమునకు సంబంధించిన శాసనాధారము లధికముగా లేకుండుటలో నాశ్చర్య మంతగా కానరాదు. ఆధారము లధికముగా లేనంతమాత్రమున తిరుపతి ప్రసిద్ధిలో లేకుండినదనిమాత్రము తలఁపఁబనిలేదు. పిలన తరువాతికాలమున లభించిన శాసనములనుబట్టి పరిశీలించినపుడు అప్పటికాలమునకుఁ బూర్వమునుండియు వేంకటాచల క్షేత్రమున పూజాక్రమమొక వ్యవస్థతో కొందరు వైఖా

నసుల మూలమున సునిశ్చితమార్గమున జరుగెచుఁడినదనియూహింప నగుచున్నది.

ఆ దినములలో ప్రజలు అవైష్ణవక్షేత్రమున దీపదానాదికములు విరివిగా చేయుచుండెడివారు.[1] దానికై భూములనో, పశువులనో, ధనమునో ఆలయమున కిచ్చెడివారు. వానిమీఁదవచ్చు నాదాయముతో శ్రీవైష్ణవరక్షలో నాదానవిషయములు నిర్వర్తితము లగుచుండెడివి వైష్ణవులకై అన్నసత్రములు, మఠములు, ఆలయమునకు సంబంధించి నిర్వహింపఁబడెడివి. ఈ మఠములలోని వారిలో శ్రీకార్యపరు లుందురు వారు ఆలయవ్యవహారములనుఁ జూతురు. ఇంక ఆలయమునకు సంబంధించిన భూముల వ్యవహారములను పాలించుటకు కొన్ని సభ[2] లుండెడివి. తిరువేంగడ కోట్టమున తిరుచ్చానూరు సభ నాడు ప్రసిద్ధి గాంచినది. ఈ సభలు ఆలయ వ్యవస్థకును, ప్రభుత్వ వ్యవస్థకును నడిమి సంధాయక సంస్థలు. ఆలయమునకు సంబంధించిన లెక్కలను పత్రములను 'ఊర్ నియోగము' (గ్రామసభ- Village Council) లో నీసభలు భద్రపరచి వ్యవహారము నడుపుచుండెడివి. ప్రభుత్వ ప్రతినిధు లవసరమయినపుడు వచ్చి యాసభల నిర్వహణమును పరిశీలించి మంచిచెడుగులను విచారించుచుండిరి. క్రీ.శ. 9, 10 శతాబ్దులనాఁటికే అచట నిట్టివ్యవస్థ యుండిన దన్న నంతకుఁ గొంత పూర్వమునుండి యా క్షేత్రము ప్రజల యొక్కయు స్థానిక ప్రభుత్వముల యొక్కయు దృష్టి నాకర్షించుచు ప్రఖ్యాతి కెక్కుచుండినదని భావింపఁదగును. ఇట్లు ద్రావిడవాఙ్మయమునఁ బ్రదర్శితమైన

1 No. 219-223 - G. T. తి. తి. దే. శా॥ సం. 1- పు9.
No. 20 - T.T. ,, సం. - 1 పు. 23.
అన్నసత్రము - No. 220, G. T. తి. తి. దే. శా. సం. 1. పు11.
మార్గశిర ద్వాదశీ ఉత్సవము. No 18. తి.తి దే.శా.సం 1-పు.13

2. సభ - పరిపాలనా వ్యవహారములు చూచు వ్యవస్థ. తిరువేంగడ కోట్టమునందలి తిరుచ్చానూరు సభలో 108 మంది శ్రీవైష్ణవ బ్రాహ్మణ సభ్యులుండిరి.

వేంగడము యొక్క స్వరూపము చాలవఱకు సత్యము కావచ్చునని ఈ కాలపు శాసనములు చారిత్రకముగా చాటి చెప్పుచున్నవి.[1]

## వైష్ణవ ఆచార్యపురుషులు - తిరుపతి (11-12 శతాబ్దులు).

వేంకటాచలము నందలి శ్రీనివాసాలయమున పూజా విధానా దులను గూర్చిన వివరము లింతకు ముందుకాలమునఁ గొంత గుర్తింప నైనప్పటికిని తద్వ్యవస్థ కొక సుస్థిర రూపము నావిష్కరించిన ఖ్యాతి శ్రీమద్రామానుజాచార్యులవారికే దక్కినది. ఆయా విషయము లెల్ల రామానుజ శిష్యులగు అనంతాళ్వారు సంధానించినట్లుగా తలఁపఁబడు 'వేంకటాచల ఇతిహాసమాల' యను గ్రంథమున తెలియ నగును. ఇంతకుఁబూర్వము అక్కడి యాలయమున వైఖానసాగ మోక్తవిధానమున కొందఱు వైఖానసులు పూజాక్రమమును జరపు చుండిరి. వైష్ణవులే అక్కడి పెత్తనము వహించువారు. సకల వ్యవ హారమును వారే నిర్వహించుచుండిరి ఇట్లు అక్కడి సర్వవిషయము లును ఆ వైష్ణవ సమాజమువారి చేతులలోనే యుండుచుండెను. ఒక్కొక్క సమయమున అక్కఱతో భక్తులు వెచ్చించి కావించిన యేర్పాటులను వారు నిర్లక్ష్యభావమున విస్మరించుచును నుండెడి వారు. ఈ దుస్థితి భక్తులకును. స్థానికప్రభువులకును కొంత వెగటును కలిగించినది. ఒక తూరి ఇట్టి దేమో జరుగఁగా స్థానికమండలాధిపతి దండించిన కారణమునఁ గాఁబోలును అక్కడి పూజారులు ఆలయమును వదలి వెళ్లిపోయిరి. అవ్యవస్థ యేర్పడినది. అది యదనుగాఁ గొని శైవులు కొంద రాస్థానముల నాక్రమించి శైవ క్షేత్రముగా దీనిని చాటఁ దొడఁగిరి. నాఁటి కేంద్ర ప్రభుత్వ పాలకులగు చోళుల శైవా భిమానముకూడ దీనికి కొంతదోహద మిచ్చినది. అట్టితరి నదనెఱిగికొని యాదవరాయఁడను స్థానిక ప్రభువు రామానుజాచార్యులను రప్పించి

---

1 No. 18 19. తి తి దే శా సం 1-పు 13 సామవై వేయిం చిన శాసనము. ఈమె వేంకటాచలస్వామికి ఉత్సవమూర్తిని వెండితో చేయిం చినది. ద్వాశీ ఉత్సవము నేర్పాటు చేయించినది.

శైవవైష్ణవుల వాదములను దీర్చి వేంకటాచల మేదైవతక్షేత్రమో నిర్ణయింపఁ గోరెను. రామానుజుఁడు వాదములఁ దీర్చి యది వైష్ణవ క్షేత్రమని నిరూపించెను. అక్కడి యవ్యవస్థను దొలఁగించి సువ్యవస్థను నెలకొల్పెను. పూజాక్రమమునకు నూతన విధివిధానములను కల్పించెను. అంగబలమును సమకూర్చెను. ఇట్లుద్ధరించి యచటి వాతావరణమునే సుసంపన్నము సుందరతరము గావించెను. నాటినుండి వేంకటాచల క్షేత్రము యొక్క శోభ యిమ్మడి ముమ్మడి కాఁజొచ్చినది.

రామానుజులకుఁ బూర్వము నాథమునులు, యామునాచార్యులు తిరుపతిని దర్శించి యాలయ వ్యవహారములు తిన్నఁగా లేవని నొచ్చుకొని సంస్కరించుటకై కొంత యత్నము సలిపియుండిరి. వారి శిష్యుఁడు తిరుమలనంబి కొండమీఁదనే కాపురముండెను. పూలు లేనిపూజ లేమిపూజలని తోటలు పెంచి స్వామికై పూలు పూయించెను ఆకాశగంగాతోయములతో నభిషేకము చేయించెను. నాఁటి నుండి కొండమీఁద స్వామికి పుష్పకైంకర్యములు అభిషేకోత్సవాదులు అతిశయించినవి. తదుపరి వారి మేనల్లుఁడగు రామానుజుఁడు వారి యడుగుజాడలలోనే వర్తించి నూతన సంప్రదాయముల నారంభించెను. 'వేంకటాచల ఇతిహాసమాల' లో రామానుజుఁడు తిరుపతి క్షేత్రమునకుఁ గావించిన సేవ వేవిధముల కొనియాడఁబడినది.

## తిరుపతిలో శ్రీ రామానుజులవారి కైంకర్యము

రామానుజులవారి రాకతో తిరుపతి క్షేత్రమునకేకాదు తిరుపతి నగరమునకే వినూత్న శోభ కల్గినది. ఘట్టిదేవ యాదవరాయని (క్రీ. శ. 1135) యాహ్వానమును బురస్కరించుకొని రామానుజుల వారు తిరుపతికి విచ్చేసి వేంకటాచలము వైష్ణవ పుణ్యక్షేత్రమని లోకమునకు నిరూపించుటయేకాక ఆ సామంతప్రభువును తన పలుకుబడి లోనికిఁ దార్చుకొని యచ్చటి యాలయ పూజావిధానమున కట్టుదిట్టములు గావించి కలకాలము సాగునట్లు కూడ నేర్పాటు చేసిరి. వేంకటాచలఇతిహాసమాలలోని యేడు స్తబకములును తిరుపతికి

శ్రీ రామానుజులవారును వారి శిష్యులగు అనంతాళ్వారులును గావిం సేవనే కొనియాడుచున్నవి. ఈ యంశములు చాలవరకు సత్యము లనియే మనము విశ్వసింపవచ్చును.

వేంకటాచలస్వామి కంతకుఁ బూర్వము ధూప దీప నైవేద్యాదులేగాని అభిషేకాదులు పుష్పార్చనము లేకుండెడివి కాఁబోలును. తిరుమలనంబి ప్రభృతుల రాకతో కొండమీఁద ఆ కొదువ తీరినది. పూలతోటలు వెలకొన్నవి. వారి స్మృతి చిహ్నముగా విజయనగర రాజుల కాలమువఱకునుఁ గూడ 'రామానుజ తిరునంద (న) వన' మనియు, అనంతాళ్వారుల తిరునంద (న) వన' మనియు పూఁదోటలు వెలయసాగినవి. ఇట్లే తిరుమలనంబి సుదూరముననున్న పాపవినాశన తీర్థమునుండి జలముల నభిషేకార్థమై తెచ్చుచుండ స్వామియే విలుకాని రూపమునవచ్చి యంతకంటె దగ్గరలోనున్న 'ఆకాశగంగ' తీర్థమును చూపినాఁడట. తదాదిగా ఆ జలములే అభిషేకాదులకు వినియోగములైనవి.

శైవుల చేతులలోనుండి తిరుపతి క్షేత్రమును స్వాధీనపరచుకొనిన పిదప రామానుజులు స్వామివారి యాలయమున మహాసంప్రోక్షణాదులు గావించెను. యథాపూర్వము వైఖానసాగమోక్త రీతిని ఆలయగర్భ మంటపమును ఆనందనిలయమును బాగు చేయించెను. అనంతరము మూలవిరాట్టును యథాస్థానమున స్థాపించి, మెడలో పద్మావతీదేవియాకృతి చిత్రితమైన బంగారు కంఠాభరణ మొకదానిని చేయించి వేయించెను.

వైఖానసాగమములలోని ఆనంద సంహిత ననుసరించి ప్రతి శుక్రవారము తిరుమంజనాదు లేర్పాటు చేయించెను. పచ్చకర్పూరము, తిరుచూర్ణములతో నూర్ధ్వ పుండ్రములు రచియింపఁ జేసెను. గురువారమునాఁడు స్వామివారి యాభరణాదులన్నియుఁదీసి పూల తొడుగు నియమించెను. ఈ సందర్భముననే ద్రావిడ ప్రబంధ పారా

యణమును కూడ విధించెను. ఈ పూజావిధానము సక్రమముగా సాగుటకై బింబాధర వైఖానస వంశమువారినే యోగ్యులను నియమించెను.

కొండమీఁద స్వామి యభిషేకాదులకు, ఆలయావసరములకు తగిన నీటి సదుపాయములు కావించెను తొట్టతొలి తొండమాన్ చక్రవర్తి యాలయమును నిర్మించినపుడు రంగదాసుఁడను శూద్రుఁడు త్రవ్వించినట్లు చెప్పఁబడు రెండు నూతులలోని పూడికను తీయించి వానిని జలసమృద్ధములొనర్చి భూదేవీ శ్రీనివాసుల ప్రతిరూపములను ఆ నూతి గోడలపైన చెక్కించెను. ఇందలి జలములు ఆలయావసరములకును స్వామివారి పూఁదోటకును వినియోగింపబడును. రంగదాసే త్రవ్వించిన పోటుబావిలోని జలములు ఆకాశగంగా తోయములతో సమములని ఆళువందారు లనుగ్రహించుటచేత ఆ 'సుందరస్వామి బావి' లోని నీరే తళిగెలకు వాడవలసినదిగా నియమించెను. పురాణములలో తొండమాను రాజు శ్రీనివాస విగ్రహము నుద్ధరించిన చోట నొక చింతచెట్టు, సంపెంగ మ్రాను కూడియుండినవనియు ఆలయ నిర్మాణ సందర్భమున నవి దూరముగా జరిగి వీలు కల్పించిన వనియు నుండుటచేత అ వృక్షమునకును రామానుజుఁడు పూజనేర్పరచెను.

గజపతి రాజెవరో రామేశ్వరమునకు యాత్రవోవుచు మార్గమున తిరుమలకువచ్చి స్వామివారి యాలయమునకు ప్రవేశగోపురము లేకుండుటచేత కట్టించుట కాజ్ఞయిచ్చి వెడలెనఁట! ఆగోపురము భారము మోయఁజాలక శేషాచలాకృతినున్న అనంతుఁడు కలలో రాజునకు గోచరించి యానిర్మాణమునాపఁ గోరెనట! ఆ నిర్మాణ మంతటితో నాగిపోయినను తత్స్మృతి చిహ్నముగా నారాజు నాగాభరణ మొకటి స్వామివారి యొకభుజమునకుఁ దొడిగించెను. రామానుజుఁడా కథ విని నాగాభరణములు రెండు చేతులకును రెండు చేయించి తొడిగించెను.

శ్రీనివాసాలయమునందే నృసింహ, రామ, వరాహస్వామి విగ్రహములనుగూడ స్థాపనఁజేసి పూజాక్రమము నేర్పరచెను.

ఇక అనంతాళ్వారు పారతోఁగొట్టగా నేర్పడినదని చెప్పఁబడు స్వామివారి గడ్డముమీది గాయపు గుంటలో పచ్చకప్పురమద్దు పద్ధతి రామానుజులవారే కల్పించిరి. ఇట్లే అనంతాళ్వారు పెంచిన తోట లోనికి పద్మావతీ శ్రీనివాసులు విహారములకు వచ్చిన పురాణ కథనుఁ బురస్కరించుకొని పురట్టాసి ఉత్సవ సందర్భమున నేడవదినముత్సవ మూర్తిని అనంతాళ్వారుల తోటలో నిలిపి దీసికొనిపోవుటయు, ఎనిమిదవ దినమున ఆళ్వారులపేర పూదండ నొసగుటయు నను సంప్ర దాయములను వారే కల్పించిరి.

తిరుమలనంబికడ తాము రామాయణంబు అధ్యయనము చేసిన తావుఁ గల చింతచెట్టు క్రింద నంది పూజావసరమును గుర్తించి స్వామివారే స్వయముగా తమ శ్రీపాదముల వెలయఁజేసిరను పురాణకథననుసరించి కొండయెక్కుడు మొదట గల శ్రీపాదచిహ్న ములకు పూజావిధి నేర్పరచిరి. కులమత భేదములు లేక ఈ శ్రీపాద ములు సర్వులకు నారాధింపఁదగినవి.

వేంకటాచలము తొలుత వరాహక్షేత్రమనుపురాణకథ నను సరించి స్వామిపుష్కరిణీ తటమునఁ గల వరాహస్వామికి కొండమీఁద తొలిపూజయు, శ్రీనివాసుని యాలయమున పూజా విధి ముగిసిన తరువాత ద్వార వాకిళ్ళు మూయు సందర్భమున విష్వక్సేనునకు మలిపూజయు జరుగునట్లు రామానుజు లేర్పరచిరి.

ఇట్లే వీరెన్నో విధి విధానములను కల్పించి పూజాక్రమము సాగునట్లేర్పరచిరి, కాని యివియెల్ల నిర్విఘ్నముగ సాగుటకు కట్టు దిట్టములగు నేర్పాట్లు జరుగవలెను. అందుకే ద్రష్టలగు రామా నుజులు దానికొక చక్కని వ్యవస్థను గల్పించిరి.

కొండమీఁద శ్రీకార్యపరులు మాత్రమే వశింపవలెను. మిగిలిన వారు భక్తులవలె స్వామిని సేవించుకొని దిగిరావలసినదే. వారైనను స్వార్థమునకు భోగమునకు గాక కేవల కైంకర్యమునకే జీవితములను

వెచ్చింపవలెను. వారు ఇతర దైవతములనారాధింపరాదు. స్వామి కొఱకే వారు. అచట పూఁదోటలలోని పూలు కేవలమా స్వామి పుష్పార్చన కొఱకే. అవి ఇతర విధముల వినియోగము కాకూడదు. స్వామి వారికిడిన నైవేద్య తళిగె ప్రసాదములే వీరికి భుక్తిగా నుండవలెను. అదియు పూజానంతరమే. కొండమీఁది జీవకోటి నెవరును హింసింపరాదు. పాదరక్షల నుపయోగింపరాదు. ఈరీతిని రామానుజుల వారన్ని కట్టుబాట్లు కావించిరి. కావుననే తరువాత చాలాకాలము వఱకు ఆలయ వ్యవహారము లొడుదుడుకులు లేక సాగిపోయినవి. ఇట్లు కొండమీఁద మాత్రమే కాక దిగువ తిరుపతిలోఁ గూడ వారెన్నో అభివృద్ధి కార్యక్రమములు నిర్వహించిరి. అచటి గోవిందరాజస్వామి వారి యాలయము ఘట్టిదేవ యాదవరాయని చేత వీరు నిర్మింపఁ జేసినదే. అసలా విగ్రహము తొలుత చిదంబరమున నటరాజాలయమున నుండెనట. వీరశైవుఁడగు నప్పటి చోళ ప్రభువు పరున్నట్లున్న ఆవిగ్రహమున కుచితస్థానము సాగరమే కాని శివాలయము కాదని పరిహసించి దానిని సముద్రమునఁ ద్రోయించెనట! ఎట్లో శ్రీవైష్ణవుల శ్రద్ధ వలన నది తిరుపతికిఁ గొనిరాఁబడినది. రామానుజుని ప్రేరేపణమున యాదవరాయఁడు గోవిందరాజస్వామి కాలయమును నిర్మించి పూజావిధుల నేర్పరచెను. ఆలయము చుట్టును వైష్ణవులకై యిండ్లు కట్టించి యిచ్చెను. రామానుజాచార్యులవారి పేరిట రామానుజాగ్రహారమను నొక అగ్రహారమునే ఆలయమున కంకితమొనరించెను. క్రమమునఁ గొంతకాలమునకు ఆయాలయములోనే గోదాదేవి విగ్రహమునుకూడా స్థాపింప జేసెను. దానినిఁ బురస్కరించుకొని యాదవరాయఁడు ఆణి - మార్గశిమాసములలో రెండుత్సవములను కూడ ఏర్పాటు చేసెను. ఈ యాదవరాయఁడు కట్టించిన వైష్ణవ గృహములలోనే వార్ధక్యమున తిరుమల నంబియు, అనంతాళ్వారులును వసించినట్లు చెప్పుదురు. ఈ విధమున దిగువ తిరుపతికిఁ గూడ ప్రాముఖ్యముఁ గల్పించి రామానుజులవారు నాటి మత ప్రపంచమున తిరుమల తిరుపతుల కీడు లేని ప్రాభవమును సమకూర్చి పెట్టిరి. వైష్ణవ విజయ పతాకమును ఏడు కొండల మీఁద నెగురవేయించిరి.

రామానుజుల వారి తరువాత ఒక శతాబ్ది తిరుగక పూర్వమే ద్రావిడ దేశమున చోళుల ప్రాభవ మడుగంటినది. క్రమమున నప్పటి రాజకీయ వాతావరణము నదనుఁగాఁగొని యంతకుముందు సామంతులుగా నుండిన వారెందరో విజృంభించిరి. కాలము జరుగగా వారి నణచి మరికొందరా స్థానముల నాక్రమింపసాగిరి. నాటి దేశ సముద్రమున రాజకీయపు గాలులు వీచినట్లెల్ల తెరచాపలాడి ప్రభుత్వపు నావలిట్టునటు నూగసాగినవి. అట్టి రాజవంశములలో నుత్తరతొండ మండలమున పెత్తనము వహించిన వారిలో యాదవరాయాదులు, గండగోపాలురు, హొయసలభల్లాళులు ముఖ్యులు. చోళుల పతనము మొదలుకొని హంపి విజయనగరరాజులు సుస్థిరముగ నెలకొను వఱకును-దాదాపు ఒకటి యొకటిన్నర శతాబ్దుల కాలము పైని పేర్కొనిన రాజకుటుంబములే తిరుమల తిరుపతుల కున్నతిని చేకూర్చి ఆ క్షేత్రపు విశిష్టతను చాలవఱకుఁ గాపాడినవి. 13 వ శతాబ్ది తుది భాగమున దక్షిణ దేశమునకు తటస్థించిన మహమ్మదీయుల దండయాత్రల వలన కూడ, దుర్గమారణ్యముల నడుమ శేషాహి యొడిలో నున్న ఏడు కొండలవాని క్షేత్రమున క్షేమాత్రపుటొడుదుడుకులును జరుగలేదనియే చెప్పవచ్చును. ఇట్లు ఒక కేంద్ర ప్రభుత్వము లేక దేశము చీలికవాలికలై సామంతులయు మండలాధిపతులయు చేతులలో పడి చివుకుచున్న దశలో మహమ్మదీయుల దండయాత్రల తాకిడికిఁ దట్టుకోఁజాలక హైందవ జాతియు మతమును విధ్వంసము కానున్న సమయమున విజయనగర సామ్రాజ్యముదయించినది. దానితో తెలుఁగు దేశమునకును జాతికే కాక మతమునకునుఁ గాలక్రమమున వేంకటాచల క్షేత్రమునకును మహోచ్చ దశ ప్రాప్తించినది.

## విజయనగర యుగము

## సంగమ వంశము-తిరుపతి (క్రీ. శ. 1336-1485)

మహమ్మదీయుల దండయాత్రల నుండి దక్షిణ భారతమును సంరక్షించి కేంద్ర ప్రభుత్వమును సంస్థాపించి హిందూ మతమును, సామ్రాజ్యమును పునరుద్ధరించిన రాజకుటుంబములలో విజయనగర

సంగమ వంశము ముఖ్యమైనది. వీరు తొలినాళ్లలో విరూపాక్షస్వామి భక్తులైనను, ఆదర్శమును నెరవేర్చుకొనుటకై అద్వైతమునే మత విధానముగా అనుసరించిరి. అందుకే ప్రత్యక్షముగా కాకున్నను పరోక్షముగానైనను వీరి పలుకుబడిని వేంకటాచలక్షేత్రమునకు విశేషమగు సేవ జరిగినది. బుక్కరాయని పేర తిరుమల స్వామికి రెండు పూటల నివేదనలు జరుపుటకై గ్రామదానము కావింపఁబడిన యంశము శాసన (భాగము)ము లందు గుర్తింపనగుచున్నది.[1] శాసన కాలమును బట్టి ఈ బుక్కరాయఁడు మొదటి హరిహరరాయల సోదరుఁడే అని భావింపఁదగును. ఇట్లు ఈ బుక్కరాయని కాలము మొదలుకొని సంగమ వంశమునఁ గడపటివాఁడగు విరూపాక్షరాయల కాలము వఱకును వీరి మంత్రులు, సామంతులు, దండనాయకులు, ప్రజలు పలువురు వేంకటాచలక్షేత్ర సౌభాగ్యమునకై దానధర్మాదికములు విశేషముగా కావించి యచటి వాతావరణమును మెఱుఁగు పఱచి, స్వామియెడ తమకుఁ గల భక్తి తాత్పర్యములను పలువిధములఁ వెల్లడించిరి. వీరిలో మధురా నగరమున మహమ్మదీయుల నణచుటలో నసహాయశూరుఁడనిపించుకొనిన కుమార కంపరాయలకు దండనాయకుఁడగు సాళువమంగు మహారాజును, అతని వంశము వారలును, ప్రెగ్గడలగు మల్లన గోప నార్యులును ముఖ్యులు. వీరే కాక సంగమ రాజులనుఁ గొలిచిన మల్లన, దేవన, నాగన ప్రభృతి యుద్యోగులును కొందఱు గలరు. ఇంక సామాన్యులు, వైష్ణవులు, ఏకాంగులు (విరక్తులైన వైష్ణవులు) మఱి కొందరు గలరు.

వీరి కాలమున తిరుపతిక్షేత్ర మెంతయో బాగుపడినది. కాలువలు త్రవ్వించి విరివిగా నీటి పారుదల యేర్పాట్లు కావించిన కారణమున తిరుపతి ప్రాంతమున వ్యవసాయము పెరిగి పాడిపంట అభివృద్ధి చెందినవి. అట్టి సస్యశ్యామల క్షేత్రములుగల గ్రామములు దానము చేయుట వలన స్వామివారి యాదాయము కూడ పెరిగినది. నగరమున నాగరికత హెచ్చినది. ప్రజలు సుఖముండిరి. సమాజము,

(1) No. 178. తి. తి. దే. శా. సం. 1 - పు. 167.

మతము కూడ నుద్ధరింపఁబడినది. రామానుజుల కాలమున వారు ప్రారంభించిన పూజా విధానములన్నియు, నిర్విఘ్నముగా కొనసాగించుటకు వీరు యత్నించిరి. ఆలయ వ్యవహారములనుఁ జూచు శ్రీ వైష్ణవ సమాజమునకు వీరెంతయో చేయూఁత నొసంగిరి. వైష్ణవ క్షేత్రములందు సాధారణముగా దర్శనీయములగు శోభలన్నియు నుండి అంతవఱకు నక్కడ లేకుండిన వేదపారాయణమను నంశము కూడ నూతనముగ వీరి కాలమున నారంభమైనది. ద్రావిడ ప్రబంధముల పారాయణము కూడ నుత్సవదినములలో నేర్పాటైనది. ఆలయమందే కాక ఉత్సవ సందర్భములం దూరేగింపులవెంటకూడ పారాయణము నిరంతరాయముగా జరుగుటకై 24 మంది ప్రముఖ వైష్ణవ బ్రాహ్మణులు నియమితులైరి. [1] రెండవ దేవరాయల కాలమున (క్రీ. శ. 1433) తిరుపతిలోని ప్రముఖ శ్రీ వైష్ణవాచార్యుఁడగు తిరుకలి కణ్ణిదాసుని కుమారుఁడు అలఘుప్పిరానార్ [2] దేవరాయల మంత్రియగు దేవనప్రెగడకు విన్నవించి, ఆతనిచేత మహారాజు పేర నంతవఱకును అక్కడ వేదపారాయణము లేనికొఱఁతనుఁ దీర్పించెను. వైకుంఠవలనాఁడు లోని కొత్తాళస్థలమునకుఁ జెందిన సిద్ధకోటై (శ్రీనివాస పురాగ్రహారము) నుండి రాజభాండారమునకుఁ బోవు సగము ఆదాయమే కాక శ్రీ భాండారమునకుఁ బోవు మిగిలిన సగము ఆదాయము కూడ వేదపారాయణ మొనర్చు 24 మంది శ్రీ వైష్ణవులకునుఁ జెందునట్లు ఏర్పాటు జరిగినది. ఇట్లే తి. తి. దే. శాసన సంచయము సంపుటి I— 200, 201 సంఖ్యలు గల శాసనములు కూడ పై యేర్పాట్లు నిర్విఘ్నముగా కొనసాగుటకు కావలసిన కట్టుదిట్టములను పేర్కొనుచున్నవి.

---

1. Nos 199-202 శాసనములు తి తి దే.శా.సం॥ 1 పు 189; 197.

2. ఈతఁడే స్వామివారికి దక్షిణాయనమున ఆరు నెలల పాటు అరుణోదయమున ఆరాధన మొనరించుట కేర్పాటు చేయించెను. (207- తి తి. దే. శా. సం. I) తిరుపతిలోని వైష్ణవ ప్రముఖుఁడు ఈతని ప్రేరణమున వేంకటాచలక్షేత్రమున నెన్నియో అభివృద్ధి కార్యక్రమములు నిర్వహింపఁబడినవి.

క్రీ॥ శ॥ 1359 లో మహామండలేశ్వర, మేదినిమీసరగండ సాళువ మంగిదేవ మహారాజు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ విమానగోపురమున బంగారు పూఁత పూయించి కలశమెత్తించినాఁడు[1] రెండవ దేవరాయల తనయుఁడును, మల్లికార్జునుని తండ్రియునగు శ్రీగిరిదేవరాయలు వేంకటేశ్వరస్వామివారి కొక బంగారు పట్టము చేయించెను.[2] (1430 క్రీ శ.). దేవరాయల మంత్రి మల్లన (1409 క్రీ.శ.) కొండ మీఁద గర్భమందిరము కడ తిరుమామణి మంటపమును గట్టించి ఆలయమును సుందరతరమొనర్చెను.[3] శ్రీ 'మాధవదా'సను నామాంతరముగల యీ మల్లనయే గర్భమందిరమగు 'ఆనంద విమానము'ను బాగు చేయించినట్లు కూడా[4] తెలియుచున్నది.

ఇట్లు సంగమ రాజుల యేల్బడిలో ప్రభుత్వోద్యోగులే కాక సామాన్య ప్రజలు, కొందఱు శ్రీవైష్ణవులు కూడ దానాదికములు గావించిరి. వీరిలో తిరుకళి కన్నిదాసు, అళహుప్పిరానార్, రామానుజదాసు, ఎంబెరు మానార్ జియ్యరు, ముల్లై తిరువెంగడ జియ్యర్ ప్రభృతులు ముఖ్యులు. వీరిలో అళహుప్పిరానార్, తిరుకళి కన్నిదాసువంటి మఠాధిపతులు ప్రభుత్వాధికారులచేత స్వామివారికి కైంకర్యములు చేయింపఁ జాలినంత ప్రముఖులుఁగా కూడ కానవత్తురు[5]. ఈ యుగమున తిరుమల స్వామికే కాక తిరుపతిలోని గోవిందరాజస్వామివారికి కూడ ఉత్సవ నైవేద్యాదుల కేర్పాట్లు జరిగినవి. ఇట్లు ఈ క్షేత్రము యొక్క మహోచ్చదశకు ఈ యుగముననే ప్రాతిపదిక వేయఁబడినదని చెప్పవచ్చుచు.

## సాళువ వంశము—తిరుపతి (క్రీ. శ. 1485-1504)

విజయనగర సామ్రాజ్య స్థాపనకాలము నుండియు సాళువ మంగి దేవాదులు దండనాథులుగను మంత్రులుగను నిలచి విజయనగర

1. చూ: తి తి దే.శా.సం. 1-180, 2. తి.తి.దే.శా.సం. 1-198, 3. తి.తి దే.శా.సం. 1-196, 4. తి.తి.దే.శా.సం. 1-198. 5 తి. తి దే. శా. సం॥ 1-185; చూ. మఱియు 1-199; 202.

ప్రభువులకెన్ని విధములుగనో సహాకారమొనర్చిరి. వారి కారణముననే మహామ్మదీయుల నెదుర్కొని విజయనగర ప్రభువులు సామ్రాజ్యమును నిలద్రొక్కుకొనగల్గిరి. కాని సంగమ వంశమున రెండవ దేవరాయల తరువాత రాజ్యమునకై దుష్టులు, దుర్బలులునయిన మల్లికార్జున విరూపాక్షరాయాదులు పెనగులాడి సామ్రాజ్యమునకే ముప్పుదెచ్చు పరిస్థితులు కల్పించిరి. ప్రజలలో నసంతృప్తి పెరిగిపోయినది. అది యదనుఁగా నుత్తరమున బహామనీ సుల్తానులు గజపతులు కుతంత్రములు పన్నసాగిరి. రాజకీయముగా నిట్టి యలజడులలో దేశము మునిగియుండఁగా ప్రమాదముల నెదుర్కొనుటకై దూరదృష్టిగల సాళువగుండ నరసింహరాయలు సామ్రాజ్య పీఠమును స్వయముగా నాక్రమించి (క్రీ.శ. 1485) సార్వభౌముఁడాయెను.[1] ఉచితత్వమెరిగి యాతఁడు కావించిన కార్యముతో విజయనగరము విచ్ఛిన్నము కాకుండ మిగిలినది. సంగమ వంశమంతరించి సాళువ వంశము నిలచినది.

నరసింహరాయలు గుండరాయల కుమారుఁడు. మహామండలేశ్వర, మేదిని మీసరగండ, కటారి, సాళువ, బిరుదాంచితుఁడు. ధైర్యసాహస పరాక్రమములు గలవాఁడు. చంద్రగిరి రాజ్యము నేలువాఁడు. రసికుఁడు. భక్తుడు. అసలీ వంశము వారెల్లరట్టిదట్టలే. వారిలో తలమానిక మీతడు. విజయనగర సార్వభౌములై వీరు (సాళువరాజులు) పాలించిన కాలము (1486-1504) పందొమ్మిది సంవత్సరములే యైనను సామ్రాజ్య సంరక్షకులుగా సర్వతంత్ర స్వతంత్రులుగా వీరు అంతకు ముందునుండి వర్తిల్లిరనియే చెప్పవచ్చును. వీరు దండనాథులుగా, మండలాధిపతులుగా నుండినది చంద్రగిరి రాజ్యముననే కావున తిరుపతి క్షేత్రమునకును సాళువ వారికిని సన్నిహితత్వ మేర్పడినది. సంగమ రాజుల కాలమున ఈ క్షేత్రముతో ప్రభుత్వమునకు పరోక్షముగా నుండిన సంబంధము వీరి పాలనాకాలమున ప్రత్యక్షముగా మారినది ఈ యుగమున ప్రభుత్వ మతము వైష్ణవమై ప్రభువుల దైవము వేంకటాచలస్వామియై ప్రజలకును ఆ క్షేత్ర

(1) తి. తి. దే. శా సం - 2 82

దైవతము లారాధ్యములైనవి. ఈ కాలమున ప్రభువులు-ప్రభుత్వోద్యోగులు-ప్రజలు-స్త్రీలు-పురుషులు - అన్ని తరగతులవారు అన్ని జాతులవారు-ఒక్కరననేమి అందరును కలసికట్టుగా ఒక ప్రణాళిక ననుసరించి ఒకే విధమున స్వామి కైంకర్యమునకును, క్షేత్రసౌభాగ్యమునకును, తన్మూలమున దేశవికాసమునకును పలుతెఱంగుల పాటుబడిరి.

సాళువ రాజులే ఆరేడు గ్రామములను సర్వమాన్యములుగా జేసి స్వామి కర్పించిరి. వాని మీద రాజభాండారమునకుఁ జెందు నాదాయమునుఁగూడ ఆలయమునకే అర్పించిరి. అంతేకాదు. ఆ గ్రామముల ఆదాయము పెరుగుటకై సొంత పైకమును వెచ్చించి కాలువలు త్రవ్వించి వ్యవసాయపు టేర్పాటులనుఁ గూడఁ గావించిరి. ఇట్లే పలువురు విశేష ధనమును శ్రీ భాండారమున మూలధనముగానుంచి దాని మూలమున గ్రామాభివృద్ధి కార్యక్రమములు కొనసాగించి స్వామివారి కాదాయము పెరుగునట్లు చేసిరి. మూలధనము మీఁద వచ్చు వడ్డీలతో స్వామివారికి నివేదనలు. కైంకర్యములు చెల్లుబడియగునట్లు ఏర్పాటు చేసిరి. ఎన్నో మంటపములు, పూఁదోటలు, అన్న సత్రములు, మఠములు వెలయింపఁజేసిరి. నూతనోత్సవముల నారంభించిరి. సేవయే మతముగా పెట్టుకొని దాతలు తమకు చెందవలసిన ప్రసాదములు కూడ శ్రీ కార్యపరులకే చెందునట్లేర్పరిచిరి. ఇట్లు కొండమీఁదనే కాక దిగువ తిరుపతిలోని ఆలయములకు గూడ విశేషముగా దానధర్మములు జరిగినవి. రామానుజులవారు ప్రారంభించిన విధానముననే అప్పటి ఆలయ వ్యవస్థ చక్కని ధర్మసూత్రములపై సమర్థుల చేతులలో నిరంతరాయముగా సాగిపోయినది.

ప్రభుత్వము యొక్కయు, ప్రజల యొక్కయు ప్రశంసలకుఁ బాత్రుఁడయి, అన్న సత్రములకు (రామానుజ కూటములకు) నిర్వాహకుఁడుగను, ఆలయ వ్యవహారములకు కార్యకర్తగను పేరు మోసిన కందాడై రామానుజాచార్యులు నాఁటి వైష్ణవాచార్యులలో ప్రముఖుఁడు. శ్రీ భాండారమెల్ల వారి చేతులలో నుండినది. వారు నిర్వ

హించిన అభివృద్ధి కార్యక్రమములకు కొదువయే లేదు. అన్నిటితోఁ బాటు స్వామివారి ఆభరణములు, అర్చాపాత్రలు మున్నగువాని విషయమున మంచిచెడుగులు విచారించి, బాగుచేయించుటో, మంచివి మఱి కొన్ని చేయించుటో చూచుకొను భారము అధికారము కూడా వారే నిర్వహించిరి[1]. సత్యమే. అట్టి ప్రభువులు, ఇట్టి భృత్యులు నుండగా స్వామికైంకర్యమునకు కొదువయేముండును? ఆ వివరము లెల్ల కనులఁ గట్టినట్లు వెల్లడించు శాసనములు పదులకొలఁదిగా తిరుపతిలో మనకు లభించినవి.

క్రీ॥ శ॥ 1456 నుండి యాశతాబ్ది యంతము వరకునుఁ గూడ సాళువనరసింహరాయలయు, తదనుయాయులయు, దానశాసనములు తిరుపతిలో నున్నవి. ముఖ్యములైనవి మాత్రము కొన్ని యిందు పేర్కొనుచున్నాను. సాళువనృసింహరాయలు క్రీ॥ శ॥ 1473 లో స్వామివారికి ప్రప్రథమముగా డోలామహోత్సవము నేర్పాటుచేయించెను. దానికై యాతఁడు దొమ్మరపర్తి గ్రామమును స్వామికర్పించినాఁడు. దానిమీఁద వచ్చు ఆదాయముతో నీయుత్సవ మయిదుదినములు జరుగునట్లును, కందాడై రామానుజాచార్యులవారు ఆదేశించినరీతిని కైంకర్యము జరుగునట్లును తన తల్లిగారైన మల్లాయమ్మ పేర నివేదన జరుగునట్లును - పర్పాటు గావించెను. ఈ యుత్సవమున కగుఖర్చు పోగా మిగిలిన యాదాయముతో తన తనయులగు కుమార నరసాదులపేర మఱికొన్ని నివేదనలును, కొండమీద అన్నసత్రాదులను నిర్వాహముచెందున ట్లేర్పరచెను[2]. కుమారుల పేరనే ఆలయమున సంపంగి ప్రదక్షిణము చుట్టును నాలుఁగు మూలల నాలుఁగు మండపములనుఁ గట్టించెను స్వామి పుష్కరిణినడుమ వసంత మంటపమునుఁగూడ నితఁడు గట్టించెను[3]. ఇట్లే నరసింహరాయనిభార్య శ్రీరంగాంబయు, ఆలయమునకుఁ జెందిన యొక గ్రామమును బాగు చేయించి దానిమీద వచ్చు ఆదాయముతో స్వామివారికి దినమునకు

1, తి.తి దే శా. సం॥ 2-133. 2. తి.తి.దే శా. సం॥ 2-5?.51
3. తి. తి. దే. శా. సం॥ 2-51, 81;

నాలుగు నివేదనలు జరుగునట్లేర్పరచెను. సాళువమల్లయ దేవమహారాజు (చంద్రగిరి మండలాధిపతియగు పెదమల్లయదేవుని సోదరుఁడు) 1464 క్రీ శ. లో తిరుమలస్వామికి పవిత్రోత్సవము నేర్పరచెను. ఇందుకై యీతఁడు చంద్రగిరి రాజ్యములోని యొక గ్రామమును, దానము చేసెను. ఈ మల్లదేవుఁడే కొండమీఁద నాలయమునకు ముందున్న వెయ్యికాళ్ల మంటపమును నిర్మించినాఁడు[1]. పై యుత్సవములే గాక 'తోపుతిరునాళ్' అనునొక యుత్సవముకూడ ఆదినములలో కొండమీఁద జరుగుచుండినట్లు శాసనముల వలన తెలియుచున్నది. (తి. తి. దే. శా. సం. 2-113) ఈ యుగమునందే ఆళ్వారులయు, నాచార్యపురుషులయు జన్మనక్షత్రములందు ప్రత్యేకముగా నివేదనలొనరించుటారంభమైనది. ఈ సమయములందు ప్రబంధ పఠనముకూడ విధింపఁబడినది[2]. నివేదనలందు అతిరసాలు, పానకము అర్పించుట పరిపాటియైనది[3]. వీరేకాక సాళువతిమ్మరాజు, రామచంద్రరాజు, పర్వతరాజు, గోపరాజు ప్రభృతి రాజబంధువులును, అహోబలరాజు, ఎఱ్ఱమరాజు, రావు నృసింహదేవ ప్రభృతిరాజోద్యోగులును. వెంకటవల్లి అప్పనాయక ప్రభృతి సామాన్యులును; తోళప్పయ్యంగారు, కుమారతాతయ్యంగార్, పసింది తిరువేంకటత్తురైవర్ ప్రభృతి వైష్ణవాచార్యులును, పలువురు పలువిధములఁగావించిన దాన ధర్మములకు స్వామివారి యాలయమే సాక్ష్యము పలుకుచున్నది కందాడై రామానుజయ్యంగారు శ్రీభండారమును, రత్నభండారమును పర్యవేక్షించుచుండినట్లే ఆలయగ్రామములలో వ్యావసాయిక వికాస కార్యక్రమములను తిరువ్వేణి పిళ్ళై, ఎంబెరుమానార్ ప్రభృతి ప్రభుత్వోద్యోగులు పరిశీలించుచుండిరి. పై పరిశీలనమున తిరుమల తిరుపతులకీ యుగమున కలిగిన ప్రశస్తియెట్టిదో తెలియనగుచున్నది. తిరుపతిలో గోవిందరాజస్వామి వారి యాలయముకూడ నితరదైవతములతో పెరిగి పెద్దదై విశేషములగు పూజలనందుకొన్నది. అహోబిలమఠ స్థాపకులగు ఆది-వన్-శఠగోపజియ్యర్ తిరుపతిలోఁ గొంతకాలముండి

---

1. తి. తి. దే. శా. సం॥ 2-13. 2. చూ. తి తి దే.శా సం 2-63. 3, చూ. తి. తి. దే శా. సం. 2-44- 33.

స్వామికై ంకర్యముగావించినట్లు శాసనాధారములున్నవి.[1] గోవింద రాజస్వామివారి యాలయమున పిరొకమంటపమును గొంతవరకు గట్టించినట్లును, నల్లార్ అన్‌గాండై అనువారు దానిని పూర్తి జేసినట్లును తెలియుచున్నది. శఠగోపజీయ్యర్ వారికి శిష్యపరంపర బహుళము. క్రీ॥శ॥ 1491 లో బైచరాజ తిమ్మయ దేవుఁడు శ్రీభాండారమునఁ గొంత సొమ్మునుంచి, దానిని ఆలయగ్రామములపై వెచ్చించి వచ్చు నాదాయముతో శ్రీనివాస, గోవిందరాజస్వాములవారి యాలయములలో ఉగాది, దీపావళి పండుగలనాఁడు పూర్ణచంద్రాకృతిలోనున్న పుష్పమాలలతో పూజా విశేషములు ఆస్థానములు జరుగునట్లేర్పఱచెను.[2] ఇట్లు ఉభయదేవాలయములకు సమముగా నివేదనలు జరుగునట్లు మఱి కొందఱుకూడ దానములు చేసిరి. ఈ సాళువరాజుల కాలముననే తిరుపతిలో రఘునాథుని యాలయముకూడ నిర్మితమైనది[3]

ఈ విధముగా ఆంధ్రదేశమున ప్రముఖవైష్ణవ కేంద్రమై సాళువ రాజుల పాలనా కాలమున తిరుపతి క్షేత్రము నిత్యోత్సవములతో విరాజిల్లినది.

## తుళువ వంశము – తిరుపతి.

సాళువనరసింగరాయఁడు కుమారులగు ఇమ్మడి నరసింహరాయాదులను తన దండనాథుఁడగు తుళువ నరసానాయకుని సంరక్షణమునునుంచి పోయెను. తండ్రి యనంతరము ఇమ్మడి నరసింహరాయలు (ధర్మరాయలనియు నామాంతరము) క్రీ॥ శ॥ 1504 వఱకును పాలించినట్లు తెలియుచున్నది.[4] కాని తదుపరి తుళువ నరసానాయకుఁడు రాజ్యము నెట్లాక్రమించెనో స్పష్టముగా నెఱుఁగుటకు వలసినన్ని యాధారములు కానరాకున్నవి— కాని సాళువ వంశము వారి

1. తి తి.దే.శా. సం. 4-33-1, 1 (క్రమముగా క్రీ॥ శ॥ 1485-1498 సం॥లవి). 2 చూ తి. తి. దే. శా. సం. 2-94. (3) తి. తి దే. శా. సం. 2- పుట. 78, 143. 4. తి. తి. దే శా సం. 2-133.

నుండి బలప్రయోగమున రాజ్యమును కైవసము చేసికొనినాఁడని మాత్రము తలఁపవచ్చును. ఆతని యనంతరము నరసానాయని కుమారుఁడు వీరనరసింహరాయలు క్రీ॥ శ॥ 1505 లో సింహాసనమెక్కి 1509 వరకునుఁ బాలించెను. ఈస్వల్పకాలమున వీరనరసింహరాయఁడు తిరుపతికి ప్రత్యక్షముగ వచ్చినట్లు ఆధారములు లేవు కాని ఇక్కడి శాసనములలో పరోక్షప్రశంసలున్నవి.[1] అహోబలనాయక, అప్పాపిళ్లె ప్రభృతియుద్యోగులును; అనుసంధానం తిరువేంకటజియ్యరు, రామానుజతిమ్మయ్యంగార్ ప్రభృతివైష్ణవాచార్యులును; మఱికొందరు సెట్లును, యథాపూర్వము స్వామివారికైంకర్యములకై దాన ధర్మములు గావించి శ్రీభండారమును నింపిరి. కృష్ణదేవరాయలవారి రాకతో తిరుపతి క్షేత్రమునకు తిరిగి ప్రాభవము మిన్నుముట్టినది.

## శ్రీ కృష్ణదేవరాయల కాలము

వీరనరసింహరాయల పాలన కాలమంతయు దేశమున నేర్పడిన రాజకీయ కల్లోలము నణచుటతోనే సరిపోయినది. కాని అప్పటి పరిస్థితుల కాతఁడు చాలఁజాలక పోయినాఁడు- ఒకమూల బహమనీ సుల్తానులు, వేరొకమూల గజపతులు విజృంభింపసాగిరి. గజపతులు ఆంధ్ర దేశములోని కొన్ని ముఖ్యదుర్గముల నాక్రమించుకొనిరి. దక్షిణదేశమున కొందఱు సామంతులు కేంద్రమునకెదురు తిరుగుచుండిరి. ఇట్టి రాజకీయపరిస్థితులలో నరసానాయని రెండవకుమారుఁడు శ్రీకృష్ణదేవరాయలు క్రీ॥శ॥ 1509 లో సింహాసన మాక్రమించెను. రెండు మూఁడేండ్లలోనే రాజ్యమునఁ గుదురొకొని క్రమమున శత్రునిర్మూలనమునకుఁబూని విజయములు సాధించెను. కలమును కత్తిని రెండు చేతులలోనుఁ బట్టి సాహిత్య సమరాంగణములందు సార్వభౌముఁడనిపించుకొనెను. వేంకటేశ్వరస్వామియెడ విశేషమగు భక్తితాత్పర్యములు కలవాఁడై వైష్ణవమున కెంతయో సేవగావించెను. తాను పాలించిన 21 సంవత్సరములలో తిరుపతికి ఆరేడుమారులు కుటుంబ

---

1. చూ. తి. తి. దే. శా సం. III-పు. 47

సమేతముగావచ్చి స్వామిని సేవించుకొనెను. ఆ దినములలోను తరువాతను వేంకటాచల క్షేత్రమునకుఁ గల్గినవిఖ్యాతి వర్ణింప నలవికాదు.

రాయల కులదైవము వేంకటాచలాధీశుఁడు. సమ్రాట్టుగా నాతఁడు సర్వమతములయెడ సమరస భావమునే ప్రకటించినను వేంకటాచలాధీశునియెడమాత్రము వ్యక్తిగతముగ విశేషమగుభక్తి శ్రద్ధలనుఁ గనపరచెను. అప్పటి కౌటుంబిక రాజకీయ వాతావరణము లలో నాతనికి కలిగిన ఆనుకూల్యము బహుశః ఆ స్వామిదయవల్లనే అని యాతఁడు భావించి యనుభవించియుండును. ఏమైనను రాయల వారి భక్తితాత్పర్యముల కారణమున వేంకటాచల క్షేత్రమునకు వైభవ మేర్పడినట్లే స్వామివారి మహిమవలన రాయలవారికి నఖండవిజయము లభించినది. ఇరువురి కారణమున దక్షిణభారతమునకే వర్ణింపనలవికాని వైశిష్ట్యమేర్పడినది. మతసాహిత్య రాజకీయ సాంఘికాది సర్వరంగము లందును కృష్ణరాయలయుగము స్వర్ణయుగమనిపించుకొన్నది. కృష్ణ దేవరాయలును, తరువాత అచ్యుతదేవరాయలును ఒకరినిమించి యొకరుగా తిరుపతిక్షేత్రమున కఖండమగు వైభవమునుఁ జేకూర్చిరి. అప్పటి భూలోకవైకుంఠ వైభవమునుగుర్తించుటకు ఆయాప్రభువులు తిరుపతి విచ్చేసి కావించినసేవల వివరములనుఁ గొన్నిటినిట సమీక్షించుట అవసరముకాకపోదు.

## రాయల తిరుపతియాత్రలు

తిరుపతిశాసనములనుబట్టి క్రీ॥శ॥1513-1514సం.ల నడుమ ఏడు మారులు తిరుపతికి స్వామిదర్శనార్థమై—కొన్నిమారులు కుటుంబసహితముగాకూడ— వచ్చి వెళ్ళినట్లు తెలియుచున్నది. ఆయాసమయము లలో వారు వేయించిన శాసనములే బహుభాషలలో దాదాపు 54వఱకునుఁ గలవు. అందు తనవి—28. తిరుమలదేవీ చిన్నాదేవులవి 26. ఈ యాత్రలన్నియుఁ జాలవరకు స్వామియనుగ్రహము కారణమున తనకుఁ గలిగిన విజయములకును,శుభములకును, కృతజ్ఞతను వెల్లడించుకొనుటకు చేసినవే. ఈ యాత్రలలో నాతఁడు వేయించిన శాసనము లందు స్వామివారికి తాము గావించిన కైంకర్యములనుగూర్చి

మాత్రమేకాక తన దిగ్విజయయాత్రలలోని విజయప్రశస్తిని గూర్చిన వివరణముకూడ మనకు లభ్యమచున్నది.

*మొదటియాత్ర* : తిమలదేవి చిన్నాదేవులతో కూడుకొని రాయలవారు 1513—ఫిబ్రవరి పదవతేదీ స్వామిదర్శనార్థము తిరుపతి వచ్చిరి.[1] ఆ సందర్భమున స్వామివారికి రాయలు నవరత్న ఖచిత మగు కిరీటము, 25 వెండిహారతిపళ్ళెములు, ఒక త్రిసరము సమర్పించెను. అదేసమయమున తిరుమల దేవి చిన్నాదేవులు ప్రత్యేకముగా పాలారగింపునకై రెండు బంగారుగిన్నెలను, ఒక బంగారు హారతిపళ్ళెమును అర్పించుకొనిరి.[2]

*రెండవయాత్ర* : మరల మూఁడునెలలు తిరుగకపూర్వమే క్రీ॥శ॥ 1513 మే 2 తేదీ రాయలవారొక్కరే తిరువేంగళనాథుని దర్శనమునకై విచ్చేసిరి.[3] ఈ సమయమున వారు స్వామివారికి పంచ రత్న ఖచితమగు నొక ఉదుహారము, పతకము, జతవంకి, భుజకీర్తులు రెండు,మూఁడు బంగారు సరములు మొదలుగాగల బహుళాభరణములు సమర్పించిరి. శ్రీదేవి భూదేవి శ్రీనివాసుల ఉత్సవమూర్తులకై వజ్ర వైడూర్యాలు పొదిగిన మూఁడు కిరీటములనుకూడ నర్పించిరి.

*మూఁడవయాత్ర* : క్రీ॥శ॥ 1513 జూన్ 13 తేదేని మరలనొక తూరి రాయలు తిరువేంగళనాథుని దర్శించినట్లు తెలియుచున్నది.[4] ఈతడవ స్వామివారికి రాయలు చత్రవాడ, తురూరు, కరికంబాడు (గొడగరనాడులోనిది), మున్నగు గ్రామములు మూఁడు నాలుగింటిని నిత్యనైవేద్యములకును తాయ్ మాసమున తమపేర జరపువత్సరమహోత్సవమునకును — తలిదండ్రులైన నాగలాంబా నరసానాయకులకు ధర్మముగా - దానముచేసెను. నవరత్నఖచితమగు నాభరణములనుఁగూడ నిచ్చినట్లున్నది - కాని శాసనాక్షరములు శిథిలమై తిన్నగా

---

1. చూ. తి. తి. దే. సం. 3- పు. 123. 2 చూ. తి. తి,దే.శా. సం॥ 3- పుట 135, 136. 3. చూ. తి తి. దే. శా. సం. 3- టపు. 140, 4.చూ. తి. తి. దే. శా. సం. 3- పుట 148.

గుర్తింప నలవికాకున్నవి. ఈ శాసనములు వేయించినమాసములోగా నా గ్రామములు శ్రీ భండారమునకు వర్తిల్లునట్లుగా కూడ నిందున్నది.

ఇట్లు ఒక సంవత్సరమున ఇంతస్వల్ప వ్యవధానముననే రాయ లిన్నిసార్లు తిరుపతికి విచ్చేయుట తిరువేంగళనాథునియెడ నాయనకు గల యసాధారణ భక్తివిశ్వాసములనే వెల్లడిచేయుచున్నది.

ఈ తొలిమూఁడు యాత్రల నడిమికాలమందు రాయలు తిరు పతితోఁబాటు మఱికొన్ని దివ్యక్షేత్రములనుకూడ దర్శించి దానధర్మ ములుచేసిన ట్లితరాధారములనుబట్టి తెలియనగును. అప్పటికప్పుడే ఉమ్మత్తూరు, శివసముద్రము తిరుగుబాటుల నణచి రాయలు విజయము చేకూర్చుకొని యుత్తరమున గజపతుల నెదుర్కొనుటకై యుంకించు చుండెను. ఈ యాత్రల తొలివిజయమునకు కృతజ్ఞతగాను, భావి యత్నము నిర్విఘ్నముగా సాగుటకు మ్రొక్కుబడిగాను గావింపఁ బడినవని భావింపఁదగును.

*నాలుగవ యాత్ర* :- ఆ పిదప క్రీ॥శ॥ 1514 జూలై 6 వ తేదీ తిరువేంగళనాథుని దర్శనమునకు కృష్ణదేవరాయలు కుటుంబ సహిత ముగా వచ్చెను.[1] వెంట కుల పురోహితులగు రంగదీక్షితులువారు కూడ నుండిరి. ఈ యాత్రను విశదీకరించు శాసనములందే మొట్ట మొదటి మారుగా రాయలవారి దిగ్విజయ యాత్రల ప్రశంస కూడ కావింపఁబడినది. ప్రతాపరుద్ర గజపతిని కొండవీటిదనుకను విరుగం బొడిచి ఉదయగిరి దుర్గమును కైకొని తిరిగి విజయనగరమునకు వచ్చుచు మార్గమున తిరుపతికి వచ్చెనట. ఆ విజయోత్సాహమున స్వామికి 30,000 వరహాలతో రాయలు కనకాభిషేక మొనరించెను. ముత్యాలతోను మాణిక్యాలతోను పొదిగిన మూఁడు బన్నసరములు, వజ్రమాణిక్యాల కడియాలజోడు కూడ నర్పించెను. పొత్తపినాటి సీమలోని తాళ్లపాక గ్రామమును రొఖధాన్యాలతోసహా ధారా

(1) చూ. తి.తి దే శా.సం. పుటలు 162; 166; 170.

పూర్వకముగా శ్రీ భండారానకు సమర్పించెను. దానిమీఁది యాదాయముతో నైవేద్యముల కేర్పరచెను. ప్రసాదమున కొంత భాగము రంగదీక్షితుల వారికిని, తిరుప్పణి పిళ్లగారికిని చెందునట్లు చేసెను.

ఈ సందర్భముననే రాయల పట్టమహిషి తిరుమలదేవి స్వామికి వజ్రమాణిక్యాలు పొదిగిన చక్రపదకమును సమర్పించెను. తొండ మండలమునందలి పిరాట్టికుళత్తూరును ధారాపూర్వకముగా శ్రీ భండారానకు సమర్పించెను. అట్లే- రాయల రెండవ భార్య చిన్నాదేవి తిరువేంగళనాథునకు ముత్యములు, మాణిక్యములు పొదిగిన పదకమును, కంఠమాలను సమర్పించి తొండమండలమునందలి ముడియూరు గ్రామమును శ్రీ భండారమున కర్పించెను. అన్న సత్రమున బ్రాహ్మణ భోజనములు పెట్టించుటకై తిరుప్పణి పిళ్లకు ప్రసాద భాగము చెందునట్లు పర్పాటు గావింపఁబడినది.

బహుశః రాయలు విజయలక్ష్మిని వరించి తిరుమలకు విచ్చేయు సమయమునకు రాజపురోహితులగు రంగదీక్షితుల వారి వెంట రాయల వారి యంతఃపుర స్త్రీలును అచ్చటికి వచ్చి చేరిరేమో! రాయలవారి కులపురోహితులు వృద్ధులునగు రంగదీక్షితులవారే కాక వారి కుమారులు యజ్ఞదీక్షితులవారును అప్పుడు తిరుపతికి వచ్చినట్లు తెలియుచున్నది.[1] వారు ప్రత్యేకముగా స్వామివారి నైవేద్యములకై 10,000 సొమ్ము శ్రీ భండారమునకు మూలధనముగా నర్పించిరి. ఇట్లు అందరును స్వామిని సేవించి, యాశీస్సులను బడసి ఆనందమును బంచుకొనిరి.

అంతటితో రాయలవారి రణచర్య ముగియలేదు. ఉదయగిరితోఁబాటు కొండవీడు మున్నగు దుర్గములను కూడ శత్రువర్గము నుండి హస్తగతము చేసికొనుటకై తిరిగి దండు వెడలెను. ఈ తూరి రాయలు ఏకధాటిని అద్దంకి, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జున కొండ, తంగెడ, కేతవరము, మొదలయిన గిరిదుర్గ స్థలదుర్గములను

(1) చూ. తి. తి. దే. శా. సం. 3- సం. 89 పూట 191.

జయించి కొండవీటిని కూడ సాధించెను. గజపతులను, ఇతర శత్రు వర్గములను లొంగఁదీసికొనెను. కళింగమును జయించి పొట్నూరి కడ జయస్తంభమును నాటించెను.[1] పిదప విజయనగరమునకు విచ్చేసి యంతఃపుర స్త్రీలతోఁ గూడి తిరువేంగళనాథుని దర్శనార్థము తిరుమలకు బయలుదేరెను.

*అయిదవయాత్ర.* క్రీ॥ శ॥ 1517 నకు పూర్తిగా కళింగ దేశము రాయలకు వశమైనది. వెనువెంటనే విజయనగరమునకు వచ్చి 1517 జనవరి 2వ తేదీ తిరుమలకు కుటుంబముతో వచ్చెను.[2] ఈ తడవ రాయలు స్వామివారికి విలువగల కంఠమాలను, పచ్చలు తాపిన పదకము నొకదానిని దానము చేసెను. మఱియు గర్భగృహము మీఁది ఆనందనిలయ విమానమునకు బంగారు మలాము చేయించుటకై 80,000 వరహాలను, స్వామివారి పులికాపునకై గొడగరనాటి గ్రామముల మీఁది యాదాయము 1000 వరహాలను శ్రీ భండారమున కర్పించెను. ఇంకను తిరుపతి ప్రాంతములందు వసూలగు సుంకము 500 వరహాలతో స్వామివారి ప్రాతఃకాలపు నైవేద్యము తమపేర

1. చూ. తి.తి.దే.శా.సం. No. 76 and 80- Vol. III P. 172- & 178- నెం. 76 శాసనమున రాయలవారి తూర్పు దిగ్విజయ యాత్రకు సంబంధించిన విజయములు – దానాదికములు విపులముగా పేర్కొనబడినవి. శాసనకాలము, 25-10-1551, పైన పేర్కొనఁబడిన వివరములే కాక కృష్ణవేణ్ణానదీ తీరమున అమరేశ్వర దేవుని సన్నిధిని రాయలు తులాపూరుష మహాదానమును జరుపుటయు తిరువేఁగళనాథునకు నవరత్న ప్రభావళి (మకర తోరణము) నర్పించుటయు, మున్నగాఁగల విశేషములున్నవి. ఈ సందర్భమున రాయలు ప్రత్యక్షముగా తిరుపతికి వచ్చినట్లులేదు. దానములు విజయ నగరమునుండియే జరిపించి యుండును. నెం-80 వ శాసనమున కొండవీటి దుర్గవిజయానంతరము కావించిన కళింగ విజయయాత్రా వివరములు కూడ నున్నవి. ఈ సందర్భమున 'తిరుమల మీఁదికి విచ్చేసి' యని శాసనమున ప్రత్యక్షముగానున్నది. కాలము. 2-1-1517.

2. చూ. తి. తి. దే. శా. సం. No. 80-Vol. III P. 178.

జరగునట్లు ఏర్పఱచి విజయనగరమునకు వెడలిపోయెను. శాసనమందు పేర్కొనఁబడిన విధులన్నియు, యథాక్రమమున జరిగినవి. ఆనందనిలయమునకు బంగారు పూత పూయుట కెనిమిది నెలలు పట్టినది. ఆ కార్యము క్రీ॥ శ॥ 1518-సెప్టెంబరు 8వ తేదీకి ముగిసినట్లు తెలియుచున్నది. ఈ ఆనందనిలయమునకు బంగారు మలాము చేయుంచుట ఇది యప్పటికి నాలుగవ తడవ. [1]

*ఆరవయాత్ర* : పై యాత్ర తరువాత రాయలు తిరిగి పట్టపు రాణియగు తిరుమల దేవమ్మగారితోను,లేక లేక స్వామి యనుగ్రహామున తమ కాసంవత్సరమే కలిగిన కుమారునితోను తిరుమలకు విచ్చేసెను. బహుశః అయిదవయాత్ర చేసిన తరువాత కొంతకాలమునకు రాయలవారికి కుమారోదయము జరిగియుండును. బళ్లారి జిల్లా కమలాపురము నందలి శాసనమును బట్టి యీ యాత్ర క్రీ॥ శ॥ 1518 అక్టోబరు 16 వ తేదీన చేసినట్లు తెలియుచున్నది. [2] ఈ సందర్భమున రాయలు కుమార రాజగు తిరుమలరాయ మహారాయని పుణ్యాభివృద్ధులకుఁగాను కొంత భూమిని స్వామి కర్పించెను. కానియాతని దురదృష్టమున కుమార తిరుమల రాయఁడు మరి యారేండ్లకే తనువుచాలించెను.

*ఏడవయాత్ర* : లభించిన శాసనములనుఁ బట్టి మఱియొక్కతూరి మాత్రమే రాయలు తిరుపతికి విచ్చేసి స్వామిని దర్శించినట్లున్నది. అదియే బహుశః రాయలవారి ఆఖరిదర్శనమై యుండును. క్రీ॥ శ॥ 1521 ఫిబ్రవరి 17వ తేదీ తిరువేంగళనాథుని దర్శించి నవరత్న

---

1. మొదట 14 వ శతాబ్దిలో జటావర్మ సుందర పాండ్యుఁడును, రెండవతూరి 14వ శతాబ్దిలో సాళువ మంగిదేవమహారాజును.

మూఁడవతూరి : 14 వ శ॥ లో సాళువనరసానాయని కాలమున అమాత్యశేఖర మల్లనయు ఆనందనిలయ విమానమున కింతకుఁ బూర్వము బంగారు పూతలు పూయించియుండిరి.

2. చూ. పు. 165 T. T. D. Epigraphical Report (Pb 1930) (Vide-Mad-Ep-Rep 1923, Para 79 Page119)

ఖచితమైన పీతాంబరమును, ముత్యాలు మాణిక్యాలు తాపించిన కుళ్లాయిని, రత్నఖచితములగు వింజామరములు రెంటిని స్వామివారికి రాయలు సమర్పించెను. పట్టపు రాణియగు తిరుమల దేవమ్మచేత నవ రత్న పధకము నొకదానిని సమర్పింపఁజేసెను. మరియు 10,000 వరహాలను కానుకగా చదివించెను.[1]

ఇట్లు మొత్తముమీఁద ఆరేడుమారులు రాయలవారు తిరుమలకు విచ్చేసి తిరువేంగళనాధుని సేవించినట్లు తెలియనగుచున్నది. ఇందు నాల్గవ, అయిదవ, ఏడవ యాత్రలకు సంబంధించిన శాసనములందు 'తిరుమల మీఁదికి విచ్చేసి' అని స్పష్టముగా నుండుటనుబట్టి రాయల వారు ప్రత్యక్షముగా వచ్చి కైంకర్యములఁ గావించిన ట్లెరుగనగును. ఆరవ యాత్రను తలపించు శాసనము కమలాపురమున వేయించిన దగుట చేత రాయలవారు ప్రత్యక్షముగా తిరుమలకు వచ్చిరో లేక కమలాపురమునుండియే దానవిషయమును నిర్వహించిరో తెలియదు. లేకలేక కల్గిన కుమారుఁడగుటను బట్టియు, తిరుమలనాయకుని పేరే యిడుకొనుటను బట్టియు స్వయముగా వచ్చినను వచ్చియుండ వచ్చును. ఇఁక ఒకటి, రెండు, మూఁడు యాత్రలను గూర్చిన శాసన ములందు కేవలము 'తిరువేంగళనాథ దేవునికి సమర్పించిన' అని మాత్రమే కలదు. ఆమూఁడు యాత్రలును ఒకే సంవత్సరమున, ఫిబ్రవరి, మే, జూన్ మాసములలోఁ జేసినట్లున్నది. ఇందు అసంభవ మేమియును లేకపోవచ్చును. కాని తిరుమలకు మూఁడవ యాత్ర చేసిన దినమునందే శ్రీకాళహస్తీశ్వర క్షేత్రమునఁగూడ కావించిన దాన శాసనములున్నవి. ఒకే దినమున రెండు క్షేత్రములును రాయలు సందర్శించి యుండవచ్చును. లేదా తిరుమల నుండియే తక్కిన దాన విషయములు చెల్లుబడి యగునట్లు ఆజ్ఞాపించెననియో లేక కేంద్రము నుండియే పై దానములన్నియు నిర్వహించెననియో తలఁచుట సమం జసమనుకొందును. వ్యక్తి ప్రత్యక్షముగ లేకున్నను దాన విషయమును శాసనబద్ధముగావించి నిర్వహించుటకు తగినవ్యవస్థ ఆ దినములలో

(1) తి. తి దే. శా. సం॥ No. 89 Vol III P. 178

ఆలయమందుండినది. ఆ కార్యములను తిరుప్పణి పిళ్లయు, శ్రీభండారాధికారియు నిర్వహించుచుండిరి. కావున పై మూఁడు శాసనములందును రాయలు స్వయముగ వచ్చినదీ లేనిది స్పష్టముగా నెఱుగుటకు వీలు లేకున్నది. ఇఁక నాల్గవ యాత్ర సందర్భమున రాయలు తిన్నగా ఉదయగిరి దుర్గ విజయానంతరము తిరుమలకు వచ్చినట్లున్నది. కాని రాణులు కూడ ఆ సందర్భమున తిరుమలలో దానము లొనర్చినట్లున్నది. ఇట్లే అయిదవ యాత్రకు సంబంధించిన శాసనమున కొండవీడు దుర్గ విజయానంతర మమరేశ్వరమును దర్శించి తులాపురుషాది దానములు సేయ నవధరించిన సందర్భమున నంతఃపుర స్త్రీలచేతను దానాదికములు చేయింప నవధరించి నట్లున్నది. ఈ విషయములను సమన్వయింపవలసి యున్నది. రాయలు దిగ్విజయ యాత్రలకుఁ బోవు సందర్భములందు రాణులను వెంట తోడుకొని పోవుచుండెనా? అట్లని తలఁపను. శాసన పరిభాషను బట్టి రాణుల పేర ఆ దానధర్మములు రాయలే నిర్వహించెనని భావింతును. ఇఁక ఉదయగిరినుండి రాయలు తిరుమలకు వచ్చినపుడు మాత్రము రాజ పురోహితులగు రంగదీక్షితులవారి వెంట బహుశః అంతఃపుర స్త్రీలు తిరుమలకు వచ్చిన వచ్చియుండవచ్చును. ఏది ఎట్లున్నను, స్వయముగా తామై వచ్చుటచేత నైతే నేమి, దాన ధర్మములు చేయుటచేత నైతేనేమి రాయలవారు తిరువేంగళనాథ దేవుని దివ్యసన్నిధినే సదా కాంక్షించుచుండి రనవచ్చును. బహుకార్యభార మగ్నుఁడగు రాయలు స్వామికి తాననుకొన్నంత దగ్గరగా నుండుటకు వీలుకాని కారణమున గాబోలును తన యొక్కయు తన దేవేరులయొక్కయు విగ్రహములను సేవాంజలి ఘటించునట్లు రాగితో పోయించుకొని ఆలయ ప్రాంగణమున వెలయింపఁ జేసికొనెను. ఈ దేశమునకు రాయలు ప్రభువే యైనను ఆ జగత్ప్రభువగు శ్రీనివాసుని ముందు మాత్రము తానొక నిమిత్తమాత్రుఁడగు సేవకుఁడే యను నంశమును వినయపూర్వకముగా నిరూపించుకొనెను. అట్టిది రాయలవారికి శ్రీనివాసుని యెడఁగల భక్తి విశేషము.

*రాయలనాఁటి యితర శాసనములు :* ఆకాలమున రాయల తరువాత తిరుమల తిరుపతులలో పేర్కొనఁదగిన దానధర్మములు చేసిన

వారు మంత్రులు, ఉద్యోగులు, సెట్లు, మఠాధిపతులు, ఊరిపెద్దలు పలువురు స్త్రీలు పురుషులు కూడ నున్నారు. ఈ దానములన్నియు చాలవఱకు స్వామి నైవేద్యములకై భూవసతియో, సొమ్మో శ్రీ భండారమున కర్పించి కావింపఁబడినవే. ఆ కాలమున కొన్ని నిర్మాణములు జరిగినవి. మఠములు వెలసినవి. నూతన సత్రములు రామానుజ కూటములు నిర్వహింపఁబడినవి. వరాకులేక స్వామి సేవ నియమబద్ధముగా నిర్వాహము నొందినది. ముఖ్యముగా మూఁడు బ్రహ్మోత్సవములతో లెక్కలేనన్ని నిత్యోత్సవములతో నా క్షేత్రము కలకలలాడినది.

రాయలవారి ప్రధానియు, విజయనగర విజయ ప్రశస్తిని తన భుజస్కంధములపై మోసినవాఁడుననగు సాళువ తిమ్మరుసయ్య తిరువేంగళనాథుని తిరుప్పాణక్కములకై పొత్తపినాఁటి సీమలోని పందలూరు గ్రామమును దానముచేసెను. స్వామికి తళతళ మెఱయు సాటిలేని పీతాంబరమునుఁ గప్పించెను.[1] ఇట్లే ఆయన సతీమణి లక్ష్మీదేవి కొంత సొమ్మును స్వామివారి తిరుప్పాణక్కమునకై శ్రీ భండారమున కర్పించినది.[2] సోదరుఁడు గోవిందరాజు రాయల వారి పుణ్యాభివృద్ధులకై గండికోట సీమలోని మేల్పాది గ్రామమును స్వామికి దానముచేసెను.[3] దానిమీఁది ఆదాయముతో స్వామి వారికి విశేషదినములందు నైవేద్యములు జరిపించుట కేర్పరచెను. వీరుకాక అప్పాపిళ్లమన్నార్ పిళ్ల ప్రభృతి రాజోద్యోగులును రాయల వారి పుణ్యమునకై దానములొనర్చిరి.[4] అప్పాపిళ్ళ పేర నొక మంటపము కూడ వెలసినది. స్వామివారు కొన్ని యుత్సవ సమయములలో నా మంటపమునకు వేంచేసెడి వారఁట.

ఇట్లే రాయలవారి ననుసరించి వారి పుణ్యాభివృద్ధులకై నల్ల గంగమ్మ, చిన్నప్పరెడ్డి, వడమలై అన్నంగళ్ మొదలగు వారు,

1. తి.తి.దే.శా. సం. 21,22 Vol III P. 92, (2) తి.తి.దే శా సం-3-19, (3) తి.తి.దే శా. సం.3-154, (4) తి.తి.దే:శా. సం. 3-18, 29

స్త్రీలు, పురుషులు, పలువురు తిరుమల తిరుపతులలోని శ్రీ భండారము లను నింపిరి. గోవిందరాజస్వామి వారి పుష్కరిణి రాయలపేర కృష్ణ రాయ కోనేరైనది.[1] కందాడై రామానుజయ్యంగారి శిష్యుడు మాధవయ్యంగారు విజయనగరపు పట్టపురాణి పేర తిరుమలదేవి పురమను గ్రామమును స్వామివారి కర్పించెను.[2]

యధాపూర్వము తిరుమలమీఁద పూఁదోటల పెంపకము అభివృద్ధి చెందినది. రామానుజ కూటము లను పేర అన్న సత్రములను పలువురు నిర్వహించిరి.[3] అప్పాపిళ్లై ప్రభృతులు మంటపములను తమ తమ పేరులఁ గట్టించిరి. ఆదివన్ శఠగోపయతులయు[4] వ్యాస రాయల వారి యొక్కయు[5] మఠములు తిరుమల తిరుపతులలో వెలసి శిష్య పరంపర తామరతంపర కాఁజొచ్చినది. ఆదివన్ శఠగోపయతి శిష్యుఁడు నారాయణ జియ్యరు శ్రీనివాస గోవిందరాజ స్వాములకు నైవేద్యము లేర్పఱచెను. శఠగోపయతి జన్మనక్షత్రమునందు నూతన ముగా నివేదనలు జరపించెను. అట్లే వ్యాసతీర్థులవారును మఠ ములు నిర్మించి బహుకాలము తిరుమల తిరుపతులలో నివసించి నాటి మత ప్రపంచమున కుజ్జ్వల ప్రకాశముగా నుండిరి. వీరేకాక సుప్ర సిద్ధ వైష్ణవ కుటుంబము లెన్నియో తిరుపతిలో నెలకొని స్వామివారి కైంకర్యమున కాలము గడపినవి. ప్రతివాదిభయంకర, పరవస్తు, కందాడై వంశములవారు వారిలో ముఖ్యులుగా పేర్కొనఁదగిన వారు. వీరుకాక నందవరీక స్మార్త బ్రాహ్మణులైన తాళ్ళపాక కుటుంబము వారు మఱికొందరు గలరు.[6] వారిలో[6] రాయల కాల మున వర్తిల్లిన పెద తిరుమలాచార్యులు 1500 సొమ్ము మూలధన ముగా శ్రీ భండారమున కర్పించి స్వామివారి తిరుప్పొణకము జరపించెను.[7]

---

(1) తి.తి దే.శా. సం. 3-194 (2) తి.తి.దే.శా. సం.3-142, (3)తి.తి. దే.శా. సం. 3-83. (4) తి.తి.దే. శా.సం. 3-110-118, (5) తి.తి.దే.శా. సం. 3-157, 158, 159. (6) ముమ్ముందు వీరినిఁగూర్చి విపులీకరింతుము. (7) తి.తి,దే.శా.సం. Vol III P. 265 (సంఖ్య 122)

ఇట్లు అందరి సహకారమున, భక్తి భావమున రామానుజుని కాలము నుండియు వచ్చుచుండిన మత వ్యవస్థయు, సాళువ నృసింహ రాయని కాలము నుండియు సాగుచుండిన ఆలయ పరిపాలనావ్యవస్థయు రాయల కాలమున మఱింత కట్టుదిట్టముగా పోషింపఁబడినది. ఈ వ్యవస్థలు ప్రభుత్వ ప్రమేయములేని స్వతంత్ర వ్యవస్థలు. సర్వ తంత్ర స్వతంత్రులుగా నా వ్యవహార మంతయు శ్రీ వైష్ణవులే నియమబద్ధముగా జరపించుచుండిరి. దృష్టికిఁ దేఁబడినప్పుడో అవసర మైనప్పుడో మాత్రమే ప్రభుత్వము జోక్యము కల్గించుకొని వ్యవహారములను పరిష్కరించుచుండెడిది. ఈవిషయమున రాయల ప్రభుత్వమెంత జాగరూకత వహించెనో ఈ కాలపు శాసనములు వెల్లడించుచున్నవి. సాళువ నృసింహరాయలే ఆకాలమున స్వామివారి యర్చనకై నియమితులైన యర్చకులొకరు ఆలయమునకు చెందిన ఆభరణములను దొంగిలించిన కారణమున తీవ్రముగా శిక్షించి వారి యాస్తియంతయు శ్రీ భండారమునకు చెందున ట్లుత్తరువు చేసిరట. అట్లు నాఁడు శిక్షితుఁడైన నంబి సిరప్పయ్య యిండ్లు వాకిండ్ల స్థలమును క్రీ॥శ॥ 1528 లో రాయలవారు పరమహంస పరివ్రాజకాచార్యులును, శ్రీ మద్వైష్ణవ సిద్ధాన్త ప్రతిష్ఠాపనాచార్యులును నైన శ్రీమద్వ్యాస తీర్థ శ్రీ పాదరాయల వారికి సమర్పించి తిరుమల తిరుపతులలో నాతావులందు తమ మఠములను గట్టించుకొనుట కనుజ్ఞ యిచ్చిరి.[1] వ్యాస తీర్థులవారు మఠములను గట్టించి శిష్య పరంపరను నెలకొల్పి తమ యునికిచేతనే ఆ క్షేత్రము నందలి ఆలయ పరిపాలనా వ్యవస్థను సుస్థాయికిఁ దెచ్చి చక్కఁబరచిరి.

## మధ్వాచార్యులు - తిరుపతి

మధ్వాచార్యు లగు నీ వ్యాసరాయస్వామివారి జీవిత చరిత్రము రచించిన సోమనాథకవి ననుసరించి వారు సాళువ నృసింహ

---

1. తి.తి.దే.శా.సం. No. 157, 158, 159 - Vol No III P. 328, 329, 330.

రాయని కాలమునుండియు విజయనగర రాజులకుసన్నిహితులై యుప దేశకులై యుండిరని తెలియుచున్నది. రాయలకాలమున వృద్ధులైన వీరు తిరుమల తిరుపతులలో బహుకాల ముండినట్లును, శ్రీనివాసుని యాలయమున నర్చకత్వము నిర్వహించినట్లును సోమనాధకవి వివ రించెను. కాని తిరుపతిలో పై విషయములను సమర్థించు శాసనము లేవియు మనకు లభ్యముకాలేదు. అట్టి శాసనములు లేమికి వారి వైరాగ్యవృత్తియే కారణమని భావించి పై శాసనములందు వెల్లడి యగు వారి తిరుపతి సంబంధమే చాలవరకు పై యంశములను సమ ర్థింపఁగలవని భావింపనగును. శిక్షితులైన పూజారులు తొలగింపఁ బడిన తరువాత సాంప్రదాయక బింబాధర వైఖానసు లప్పుడు తగిన వారు లేక యొకవేళ ఆదినములలో వీరి యర్చకత్వము కొంతకాలము సాగినదేమో! నేటికిని ఆ వైఖానస శాఖకుచెందినవారు కారు అచటి యర్చకులు. రామానుజులవారు నియమించిన యీ యర్చకత్వవిధి ఆ బింబాధర వైఖానసులనుండి మారినది. వ్యాసతీర్థులవారి కాలము ననే జరిగినను జరిగియుండవచ్చును. ఏమైనను ఈ మధ్వాచార్యులవారు ఆ కాలమువారికి ఆదర్శ పురుషుఁడు.

## ఆదివన్ శఠగోపయతి - తిరుపతి

రాయలకాలపు శాసనములలో శఠగోపయతుల మఠమును గూర్చిన ప్రశంసయున్నది. ఈ యతి అహోబిలస్థాపకుఁడగు ఆదివన్ శఠగోపయతియే. ఈయన కొంతకాలము తిరుపతిలో నుండినట్లు తెలియుచున్నది. ఆ మఠమునకు సంబంధించిన శాసనములను, సాంప్ర దాయిక వివరములను సమన్వయించి పరిశీలించినచో నీ యాదివన్ శఠ గోప యతికాలము దాదాపు క్రీ॥శ॥ 1430-1510 సం॥ల నడుమనై యుండునని తలఁపవచ్చును. అనఁగా నీతఁడు సాళువ నరసింగ రాయా దుల కాలమున ప్రముఖ జీవితమును గడపి దాదాపు రాయలవారి కాలమువరకు నుండియుండును. ఈ యతి తరువాత వారి శిష్యులు పలు వురు ఆమఠవ్యవహారములను చూచిరి. వారిలో రాయలకాలమున 1516 లో ప్రస్తుతుఁడైన నారాయణ జియ్యర్ తొలిశిష్యుఁడు.

ఇట్లు పలువురు మహాపురుషులు తిరుపతి నప్పుడప్పుడు దర్శించియుఁ, గొంతకాలము నెలకొనియు నచటి వాతావరణము నెంతగనో వృద్ధిలోనికి దెచ్చినవారున్నారు. శ్రీమద్రామానుజులవారి తరువాత స్వామివారి ఘంట యంశమున జన్మించిన వేదాంతదేశికులవారును వారి శిష్యులును నున్నారు. అటుపై నీ శఠగోపయతులును, వ్యాస తీర్థులవారును నున్నారు. వీరికాలమునందు మత ప్రపంచమున నూతన సంప్రదాయములు నెలకొన్నవి. తత్తత్సంప్రదాయముల ప్రచారమునకై నూతన వ్యవస్థలును, శిష్యపరంపరయుఁ బెరిగినవి. ఇట్లు నాఁటి మత వాతావరణమున నెంతగానో ప్రభావముఁ జూపిన మహాపురుషులు పలువురు తిరుపతిలో కొంత కొంతకాలముండినను వారినిగూర్చిన ప్రశంస లేమియు ఆకాలపు శాసనములందు మనకు లభింపకుండుట చిత్రముగా నుండును. దీనికి బహుశః వారినిస్సంగత్వమే చాలవఱకుఁ గారణమై యుండును.

ఏమైనను రాయలకాలమున తిరుపతి మహోచ్చదశ ననుభవించినదని చెప్పవచ్చును. కాని పోల్చిచూచినపుడు కృష్ణరాయల కాలమునకన్న అచ్యుతదేవరాయలవారి కాలముననే తిరుమలకు మఱింత వైభవము చేకూరిన దనవలసివచ్చును.

## అచ్యుతదేవరాయల కాలము-తిరుపతి. (క్రీ.శ. 1529-1542)

కృష్ణదేవరాయల తుది దినములలో కొన్ని చిక్కులపాలై[1] ప్రభుత్వ వ్యవహారములను సోదరుఁ (ఓబాంబా నరసానాయకుల పుత్రుఁ)డగు అచ్యుత దేవరాయల కర్పించినట్లు తెలియుచున్నది.

---

1. చిన్నాదేవి మరణించెను. కుమారతిరుమలరాయఁడు పసితనముననే (1525 లో) పరమపదించెను. రాచనగరులో రాజ్యప్రాప్తికై కుట్రలు సాగినవి. గృహచ్ఛిద్రము లెదురైనవి. రాయలు చివరిదినములలో అనారోగ్యము చేత పీడితుఁడైనాఁడు. రాజకీయముగ కొందరు తిరుగుబాటులను లేవదీసిరి. ఇవియన్నియు చివరి దినములలో రాయలను కలవరపఱచిన యంశములు "Whatever it was during the last five years of Krishna's

క్రీ॥ శ॥ 1529 లోనే, రాయ లింక నొక సంవత్సరమునకు మరణించు నను‌గా అచ్యుత దేవరాయలు రాజ్యవ్యవహారములను జక్కఁదిద్దుటకై సింహాసన మధిష్ఠింపవలసివచ్చెను. అతఁడు శీఘ్రకాలము ననే అలజడులను చాలవఱకు తొలగించుకొనగల్గెను. రాయల పాలనకాలమునఁ దొలుత రాజకీయకారణముల మూలమున అచ్యుతదేవరాయలు చాలకాలము చంద్రగిరిలో నుండవలసివచ్చెను. ఆ కారణముచేత నాతనికి తిరుపతితో సన్నిహిత సంబంధ మేర్పడినట్లున్నది. తాను విజయనగర ప్రభువైన పిదప కృష్ణరాయలను తలపింపఁజేయు విధముననే తిరువేంగళనాధునకు ఘనముగా కైంకర్య మొనరించినాఁడు.

అచ్యుతరాయలు విజయనగర ప్రభువైన పిదప దాదాపు మూఁడు తూరులు తిరుమలకు విచ్చేసి స్వామిసేవ జరిపినట్లు శాసనములనుబట్టి తెలియుచున్నది. ఈతఁడును, ఈతని యాదరము ననుభవించిన ప్రముఖులు పలువురును తిరుపతిలోను, తిరుమలమీఁదను కావించిన కైంకర్యములకు, వేయించిన శాసనములకు కొదువయే లేదు.

ప్రథమయాత్ర: అచ్యుతదేవరాయలు క్రీ॥శ॥ 1533 జనవరి 31 వ తేదీని పట్టపురాణి వరదాంబికతోడను, కుమారరాజు వెంకటపతితోడను గూడి తిరుమలకు విచ్చేసెను.[1] శ్రీవైష్ణవులు సహస్రనామములు జపించుచుండఁగా స్వయముగా రాయలే అర్చనగావించెను. ఆ సందర్భమున తిరువేంగళనాధునికి విలువగల ఆభరణములెన్నో అర్పించెను. కంఠమునకు, తలకు, నుదుటికి, బాహువులకు, మెడకు

---

administration, Achuta was associated with him. The coming of Aliya Rama Raja to power along with Achuta coincided with the fall of the great minister Saluva Thimma, all apparently the result of the death of the Prince Tirumala" అని డా॥ కృష్ణస్వామి అయ్యంగారు వ్రాసిరి.

1. తి తి. దే. శా సం॥ No 16-Vol IV P 84.

తిరువాది (తిరువాంకూరు) మండలములోని తిరుగుబాటు నణచిన యనంతరకాలముననే అచ్యుతరాయ తీర్థయాత్ర గావించెను.

శరీరమునకు తొడుగఁదగిన ఆభరణముల వివరణ[?] మీశాసనమునందు విపులముగా నీయఁబడినది.[1] అప్పుడే కపిలవశు, స్వర్ణమేరు మహాదాన ములను [?]తమొనరించెను.

*రెండవయాత్ర* : ఇటుతరువాత క్రీ॥శ॥ 1535 డిసెంబరు 26వ తేదీ అచ్యుతదేవరాయలు తిరుపతికి రెండవయాత్ర చేసినట్లు శాసనము లున్నవి.[2] ఈసందర్భమున కొండవీటిసీమలోని కొన్ని గ్రామములమీఁది యాదాయమగు 300 బంగారురేఖలను శ్రీ భండారమునకు సమర్పిం చెను. లక్ష్మీదేవి మహోత్సవ మనునొక నూతనోత్సవము నీతఁడు తిరు మలలో నారంభించెను. ఇందే అచ్యుతరాయలు తనయొక్కయు, కుమారునియొక్కయు, తలిదండ్రులయొక్కయు పేరులమీఁద నేడు మండపములు గట్టించినట్లును, వానియందు కొన్ని విశేషసమయము లలో నుత్సవమూర్తులూరేగింపువేళల నాగుచుందురనియుఁ బేర్కొనఁ బడినది. ఇందు వివరింపఁబడిన మంటపములుమాత్రమేకాక అచ్యుత రాయలు తిరుపతిలో నిర్మాణము లనేకము కావించినాఁడు. అతనిపేర నొక తటాకము, నగ్రహారముకూడ నుండినవి అచట నొక ఆలయ మునుగట్టించి 'అచ్యుతరాయ పెరుమాళ్'ను ప్రతిష్ఠాపించెను. దానికి విడిగా దానధర్మముల నెన్నో గావించెను. అప్పటికింకనుఁబూర్వమే తిరుపతిలోని ఆళ్వార్ తీర్థమును మరమ్మతుచేయించి మెట్లను, సంధ్యా వందన మంటపములనుగట్టించిచక్రాంకితములగుశిలలను నాలుఁగువైపులఁ బాతించెను.[3] నాఁటినుండియు చక్రత్తాళ్వార్ తీర్థమునకుఁ బ్రాము ఖ్యము హెచ్చినది. ఇట్లు తిరుమల తిరుపతుల నగరనిర్మాణమునకును వికాసమునకును అచ్యుతదేవరాయలు బహుయత్నము సలిపినాఁడు. ఈ రెండవయాత్రలో రాయలు తానొక్కఁడే వెళ్ళినట్లు తోఁచుచున్నది.

---

1. చూ. పాదసూచిక పుట 36 తి తి. దే. శా॥సం॥ 4-16.

రాజనాథకవి విరచిత 'అచ్యుతరాయాభ్యుదయము'నం దీవిషయము వివ రింపఁబడినది. ఈ సందర్భమున కొంతకాలము తిరుపతిలో నున్నట్లును స్వామి వారికి (మకరతోరణము) మున్నగు నాభరణముల నర్పించినట్లును వర్ణిత మైనది—

2. తి.తి. దే.శా సం॥ 4-54, 58. 3. తి. తి. దే. శా సం॥ 4-8.

*మూఁడవయాత్ర* - అచ్యుతదేవరాయలు మరల నొకమారు క్రీ॥శ॥ 1537 జనవరి 12 వ తేదీ కొంఁదఱు రాజోద్యోగులతోసహా తిరుమలకు వేంచేసినట్లు శాసనములనుబట్టి తెలియుచున్నది.[1] రాయల వలెనే తఱచు నీతని యుద్యోగులును పలువురు తిరుమలకువచ్చి దానధర్మములు చేయుచుండిరి. బహుశః అట్టిసమయమున వారితో నొకతూరి రాయలును వచ్చెనేమో! అచ్యుతరాయల ప్రోత్సాహము ననే ఆయుద్యోగి మల్లాపుర గ్రామమును స్వామివారి కర్పించెనట!

ఇట్లు అచ్యుతరాయలు రెండుమూఁడు తడవలు తిరుమలకు విచ్చేసి దానములు చేయుటయేకాక శ్రద్ధతో నక్కడి విషయములను గమనించుచు తగినవసతులు ఏర్పాటుచేయుచుండెను. రాయలప్రోత్సాహముననే పలువురుద్యోగులు తిరువేంగళనాథుని దర్శించి దానధర్మములఁ జేసిరి. రాయలే శ్రద్ధతీసికొని ముద్దుకుప్పాయి అను ప్రముఖ నట్టువకత్తెను (దేవదాసి) తిరుమలలో స్వామికైంకర్యమునకై విజయనగరమునుండి ప్రత్యేకముగా పంపించెను. ఆ దేవదాసి విద్వత్సభా రాయరంజకురాలఁట! అంతటి ప్రఖ్యాతనర్తకిని స్వామిసేవకై రాయలు తిరుపతికిపంపి యామె జీవనమునకు తగినయేర్పాట్లుగావించెను. ఇట్లే సంకీర్తనములుపాడి స్వామిని రంజిపఁజేయుచు, జీవితమెల్ల స్వామికైంకర్యమునకే అంకితము గావించుకొన్న తాళ్ళపాకవారికి రాయలెన్నో గ్రామములు దానముచేసెను. వారు తిరిగి ఆయా గ్రామములను స్వామివారికే అర్పించుకొని ధన్యజీవనులైరి.

అచ్యుత దేవరాయలతోపాటు రాయలవారి పట్టపుభార్య వరదాంబిక తనపేరిటను, భర్తగారిపేరిటను కృష్ణరాయలవారిపేరిటను కొన్ని 'యవసరము (పూజ)లు జరిపించుటకై తిరువేంగళనాథునికి కొన్ని గ్రామములు దానముచేసినది [2]

---

1 తి. తి. దే శా. సం. 4-39.

2 తి. తి. దే. శా. సం॥ Vol 4 - P. 59 (సంఖ్య 29)

ఇఁక అచ్యుతదేవరాయల కాలమున వారి యుద్యోగులు, తదితరులు వేయించిన దానశాసనములే ఒకటిరెండువందలవరకు నున్నవి. వారిలో రాజప్రతినిధి చంద్రగిరిరామభట్టరు, సాళ్వతిమ్మరుసు, దళవాయి తిమ్మరసయ్య, బయ్యప్పనాయక విశ్వనాథనాయక కృష్ణప్పనాయక ప్రభృతి దండనాయకులు, సలకం తిమ్మయ్య ప్రభృతి రాజబంధువులు, సంకీర్తనాచార్యులగు తాళ్ళపాకవారు, మఱికొందరు ఆచార్యపురుషులు, వైదిక బ్రాహ్మణులు, జియ్యర్లు, ఏకాంగులు, సెట్లు మున్నగువా రెందరో పేర్కొనఁదగినవా రున్నారు.

వీరి దానధర్మముల తెఱఁగు పూర్వయుగమునందువలెనే యున్నది. ధనమును, గ్రామములను శ్రీ భండారమున కర్పించుచుండిరి. ఎప్పటివలెనే ఆ మూలధనముమీఁది వడ్డీ ఆదాయము దాతల యభీష్టము ననుసరించి వెచ్చింపఁ బడుచుండెడిది. శ్రీభండార వ్యవహారమును 12 మంది సభ్యులతోఁగూడిన సభయొకటి నిర్వహించుచుండినది. గ్రామదానములు చేయఁబడినపుడు వానిమీఁదవచ్చు ఆదాయమును సభవారే రాఁబట్టుకొనుచుండిరి. దాతలు నూతన నిర్మాణము లెన్నియో తిరుమల తిరుపతులలోఁ గావించిరి. మఠములు మంటపములు అంగణ మంటపములు, కట్టించిరి. తటాకములు త్రవ్వించిరి. నూతనగోపుర ప్రాకారాదులు నిర్మించిరి. తోటలు పెట్టి పోషించిరి. రథములు కట్టించిరి. నీటిపారుదల యేర్పాటుచేసి ప్రజోపయోగ కార్యములు నిర్వహించిరి. వీరి దాతృత్వము కారణముగా స్వామివారికి వైభవముతోఁగూడిన విశేషోత్సవములు, నిత్య నైవేద్యములు కొనసాగినవి. ఆళ్వారులయు, ఆచార్యపురుషులయు జన్మనక్షత్రములందును, పుణ్యకాలములందును స్వామివారికి నైవేద్యములు జరిగినవి. సంకీర్తన వాఙ్మాలలు సాగినవి. ఉత్తమస్థాయిని నృత్యసేవ నూతనముగా ప్రారంభమైనది. సంవత్సరమునకు 9 బ్రహ్మోత్సవములు వైభవముతో జరిగినవి. ఈకాలమందు గుర్తింపఁదగినవిశేషమేమన దాత లెవరికి వారు నూతనోత్సవముల నారంభించుటయు, తోచిన కైంకర్యములు చేయుటయునను పద్ధతిని కాక చాలవరకు పూర్వమునుండియు కొనసాగుచు వచ్చుచుండిన విశేషోత్సవముల సందర్భములందే వీరి

'యుభయ్యము' నిర్వహింపఁ బడునట్లును; పెద్దయెత్తున సంవత్సరము పొడుగునను కైంకర్యము సాగునట్లును దానములు' నిర్వహింపఁ బడుచుండినట్లు శాసన పరిశీలనమువలన తెలియుచున్నది. అంతేకాదు. ఆ క్షేత్రమునందలి అన్ని దేవాలయములకును సమప్రాధాన్యము గోచరించుచున్నది. నూతనాలయములతో అగ్రహారములతో తిరుపతి ప్రాంతము విస్తరించి వికాసమునొందినది.

ఈ విధమున అచ్యుతరాయల కాలమున తిరుపతిక్షేత్రము ప్రజాసామాన్యము నధికముగా నాకర్షించుచు మహిమోపేతముగ వర్ధిల్లినది.

## సదాశివరాయల కాలము-తిరుపతి (క్రీ. శ. 1541-1575)

అచ్యుత దేవరాయల పాలనాకాలముననే అతని సోదరుని పుత్రుఁడగు సదాశివరాయలు క్రీ॥శ॥ 1537లో యువరాజుగా నెన్నుకొనఁబడినట్లు శాసనముల వలనఁ దెలియుచున్నది.[1] ఈ యేర్పాటు ఎందు వలన జరిగెనో తెలియరాదు. న్యాయముగా యువరాజు కాఁదగిన వాఁడును, అచ్యుత దేవరాయల కుమారుఁడును నగు వేంకటపతి రాయలు క్రీ॥శ॥ 1541-42 సంవత్సరములవరకును జీవించియున్నాఁడు. మహారాజుగాకూడ పేర్కొనఁబడినాఁడు.కానియతఁడు తండ్రితరువాత సామ్రాజ్యమును పాలించినట్లు తోఁపదు. తుదకు సదాశివరాయలే ప్రభువాయెను. బహుశః అచ్యుతదేవరాయలు 1542 లో మరణించిన తరువాత సింహాసనమునకై ఘర్షణ జరిగియుండు ననియు, తుదకు సదాశివరాయలే, కృష్ణరాయల యల్లుఁడగు అళియరామరాయాదులసహాయమున సామ్రాజ్యమునాక్రమించి యుండుననియు చారిత్రకు లభిప్రాయపడుచున్నారు. అచ్యుతరాయల కుమారుఁడగు వెంకటపతిని వెనుకవేసికొని అతని బావమరదులు సలకం తిమ్మయ్య ప్రభృతులు బీజపూరు సుల్తాను సహాయమున కుట్రపన్ని రాజ్యము నపహరింపనుండఁగా దానికి ప్రతిభాశాలియు, కృష్ణరాయల నాఁటినుండియు

---

1 Ar. Sur. Rep For 1908 -09 Page 198.

రాజకీయ వ్యవహారములలో నారితేరినవాడును నగు అళియ రామరాయలు ప్రతిక్రియ లాలోచించి, వారి యాటలు కట్టించి, రాజ్యమున సదాశివరాయలనే నిలబెట్టెను. ఇట్లు వ్యతిరేకశక్తులను జయించి సదాశివరాయలు 1543 లో విజయనగర సామ్రాజ్యమునకు మహాప్రభువాయెను. యథావిధిని అళియ రామరాయలు మహా ప్రధానియయి రాజకీయ వ్యవహారములను పర్యవేక్షించుచుండెను.

ఇట్లు 1537 నుండి యువరాజుగా కార్యములు నిర్వహించి 1541 లోనే మహారాజ పదవి కాంక్షించి - తుదకు 1543 లో రాజ్య సింహాసనమున గుదుర్కొన్న సదాశివరాయల పరిపాలనా కాలమునను గూడ తిరుపతికి పూర్వవైభవ మేమంత పెరుగకున్నను తరుగలేదనియే చెప్పవచ్చును. నృసింహరాయ, కృష్ణరాయ, అచ్యుతదేవరాయాదుల వలె ప్రత్యక్షముగా కాకున్నను, సదాశివరాయలు అనేక విధముల తిరువేంగళనాథుని పరోక్షముగా సేవించెననియే చెప్పవలయును. ఈతడు స్వయముగా స్వామికి చేసిన కైంకర్యముకన్న నీతని నిమిత్తమున తిరుపతి క్షేత్రమునకు జరిగిన సేవయే అధికము. సదాశివరాయలే కాదు అతని రాజకీయ పరిపాలనాధికారి అళియరామరాయాదు లారవీటివారును, నంద్యాలవారును, మట్లవారును, మఱికొందరు దండనాయకులు, జియ్యర్లు, ఆచార్యపురుషులు, వైదిక బ్రాహ్మణులు, పండితులు, కవులు సంకీర్తనాచార్యులు పలువురు పలువిధముల స్వామికైంకర్యమును పూర్వముకన్న నధికముగనే కావించిరని చెప్పవచ్చును. లభించిన శాసనాధారములను బట్టి సదాశివరాయలు రెండు మూడు మారులు తిరుపతికి వేంచేసినట్లు తెలియుచున్నది.

*మొదటియాత్ర* : క్రీ॥ శ॥ 1546 ఆగష్టు మాసమున సదాశివరాయలు తిరుమల మీదికి వచ్చినట్లు తెలియుచున్నది.[1] ఈ సందర్భమున రాయలు స్వామి కేమికైంకర్యము చేసినాడో తెలియదు కాని

1. ఈ విషయము తిరుపతి శాసనములలో నెక్కడను పేర్కొనబడలేదు. కాని No. 419–Ar-Sur-Rep 1915లో ఈ విషయము గుర్తింపనగుచున్నది. (Vide P. 297 of T. T. D. Epi. Rep.)

ప్రఖ్యాత వైష్ణవాచార్యుఁడగు తాళ్ళపాక తిరువేంగళనాధునకు నేఁటి గుంటూరు మండలములోని గోరిజవోలు గ్రామమును స్వామిసన్నిధిని ధారాదత్తము చేసినట్లు మాత్రము తెలియుచున్నది. తిరుపతి శాసనములలో సీయాత్రను గూర్చిన వివరము లేల గుర్తింపఁబడలేదో తెలియదు.

రెండవయాత్ర : క్రీ॥ శ॥ 1554 ఫిబ్రవరి 3వ తేదీ సదాశివరాయలు అళియ రామరాయనితో తిరుమలకు వేంచేసినాఁడు.[1] ఈ సందర్భమందు కూడ రాయలు స్వామికిఁ గావించిన కైంకర్యము విషయమేమియును తెలియవచ్చుటలేదు. కాని అచ్యుతదేవరాయలవారిపేర అచ్యుతరాయ అన్నసత్రములందు బ్రాహ్మణ భోజనము నిమిత్తము అర్పితమగుచుండిన ప్రసాద భాగమును ఆలయ నిర్వాహకుల సూచన ననుసరించి సదాశివరాయలు శ్రీనివాస నామకుఁడగు నొక భక్తునకును మఱికొందరికిని చెందునట్లు ఆజ్ఞాపనఁ గావించెను. ఇంతకన్న విశేష మీ శాసనమున కానరాదు.

మూఁడవ యాత్ర : ఇట్లే స్వామికిఁ గావించిన కైంకర్యముల ప్రస్తావన లేకుండనే క్రీ॥ శ॥ 1553 డిశంబరు 28వ తేదీ సదాశివరాయలు మరియొకతూరి తిరుమల మీఁదికి వేంచేసి యున్నట్లు శాసనముల వలన తెలియుచున్నది.[2] ఇందు స్వామి సన్నిధినుండి సదాశివరాయలు ఆరవీటి కొండరాజు తిరుపతిలో నిర్వహించుచుండిన రామానుజ కూటమునకై కొన్ని వసతులను కల్గించుచు శాసనము వేయించెను. ఆనమ్మాళ్వారు రామానుజ కూటమునకు హంస ముద్ర గల 200 ఎద్దులను బరువులు మోయుటకై దానము చేసెను. ప్రభు

---

1. తి. తి దే. శా. సం. Vol. V-P. 392. (సంఖ్య 152)

2. తి. తి. దే. శా. సం-4- P. 406. ఈశాసనకాలము 12-7-1558 అప్పటికి ముందటి మకర సంక్రమణ పుణ్యకాలమువ నీదానము నిర్వహింపఁబడి నట్లుండుట చేత ఆ సమయము 28-12-1558 కాగలదు. ఇదేవిషయము No. 150 లోను ప్రస్తావింపఁబడినది.

త్వమునకుఁ జెందునట్టి కొన్ని కొన్ని సుంకముల నారామానుజకూట మునకే చెల్లుబడియగునట్లు కూడ శాసించెను.

ఇట్టి ప్రశంసలే తప్ప సదాశివరాయలు స్వయముగా స్వామి వారికిఁ గావించిన దానములను పేర్కొను శాసనమేదియు తిరుపతిలో మనకు లభ్యముకాలేదు. ఈ కారణమున సదాశివరాయాదుల కాల మునుండియు ప్రభువులకు తిరువేంగళనాథుని యెడ భక్తి ప్రపత్తులు క్రమమున క్షీణింప సాగెనేమో! యనికూడ డా. యస్. కృష్ణ స్వామి అయ్యంగారు అనుమానించు చున్నారు.[1] ప్రభువులమాట యెట్లున్నను ప్రజా సామాన్యమునకు మాత్రము తిరుమల భూలోక వైకుంఠముగనే యుండినదని చెప్పవచ్చును.

సదాశివరాయల కాలమున ఆతని పుణ్యాభివృద్ధికై తిరువేంగళ నాథునికి దాన ధర్మములు చేసినవారు పలువురు గలరు. ముఖ్యముగా నాఁటి రాజకీయరంగమున వ్రేళ్ళుదన్ని ఊడలు దిగిన మట్టివలె వ్యా పించిన ఆరవీటి కుటుంబమువారు గావించిన కైంకర్యములు మిక్కిలి గానున్నవి. ఈ యుగమునందు కూడ అచ్యుతరాయల కాలమునందు వలెనే సంవత్సరము పొడుగునను ఉత్సవములు నిరంతరాయముగా సాగుటకును, పూర్వులు ప్రారంభించిన విశేషోత్సవములు మఱింత వైభవముతో జరుగుటకును వసతులు కల్పింపఁబడినవి. నూతనాలయ ములు, మంటపములు నిర్మింపఁబడినవి. విగ్రహ ప్రతిమలు ప్రతిష్ఠా పింపఁబడినవి. అగ్రహారములు వెలసినవి. నగర మనేకవిధముల నభివృద్ధి చెందినది. ఈ కాలమున విశేషముగా నొక 'దైవనాయకప్పెరుమాళ్' దైవతము యొక్క ప్రశంస కానవచ్చుచున్నది. ఈ పేరు పూర్వము వినరాలేదు. అల్లే కుప్పయ్య అను ఆలయోద్యోగి తిరుపతిలో 'గోవింద కృష్ణస్వామికి' ఆలయమును, మంటపములనుఁ గట్టించి పూజ లేర్పఱచెను. ఉదయగిరి దేవరాయ భట్టరనువారు గోవిందరాజస్వామి వారి యాలయమందలి హనుమాలయముకడ విఠలేశ్వరదైవమును

1. చూ. History of Tirupati, Part II Page 188.

నూతనముగా ప్రతిష్ఠాపించిరి. ఈయాలయాభివృద్ధి కొఱకై సమీపమందలి తిరుచ్చానూర్ ప్రాంతమునందు విఠలేశ్వరాగ్రహారమును వెలయించి, కాలువలు త్రవ్వించి వ్యవసాయాదుల నభివృద్ధి పరచెను. తరువాత కాలమున నీదైవమునకు విశేషోత్సవములు కూడ జరిగినట్లు తెలియుచున్నది. ఇట్లే తాళ్ళపాకవారు తిరుపతి సమీపమందలి ఆళ్వార్ తీర్థమున దక్షిణ నారాయణ పెరుమాళ్ విగ్రహమును ప్రతిష్ఠాపించిరి. చక్రత్తాళ్వార్ మూర్తిని కూడ నచటనే వారు వెలయింపఁజేసిరి. ఇట్లే సెవ్వసానియను నొక దేవదాసి అచ్చటనే వినాయకుని ప్రతిమను ప్రతిష్ఠాపించి పూజలేర్పరచినది. గోవిందరాజాలయమెంతో అభివృద్ధి చెందినది. అచ్యుతదేవరాయలు వెలయింప చేసిన అగ్రహారము, ఆలయము, ఉత్సవ విశేషములతో కలకలలాడినది. ఇదే రీతిని తిరుమలమీఁదకూడ నూతనముగా మంటపములుపూఁదోటలువెలసినవి. ఆనాళ్ళలోను వేంకటాచలక్షేత్ర మెంతయో వికాసముచెందినది.

*వేంకటాచల మాహాత్మ్య పఠనము:* ఇది మరియొక విశేషము. తిరుమల తిరుపతులలోని యాలయములలో ప్రబంధ వేదపారాయణముతోఁబాటు పురాణపఠనమను నంశముకూడ వ్యాప్తికి వచ్చినది. ఉత్థానద్వాదశినాఁడు కైశికపురాణము, మఱికొన్ని సమయములందు వేంకటాచల మాహాత్మ్యము పరిపాటిగా పఠింపఁబడునట్లేర్పాట్లు జరిగినవి. తిరువేంకటత్తురైవర్, అనంతయ్య, తిరువేంకటయ్య ప్రభృతులు పౌరాణికులుగా నుద్యోగింపఁబడిరి.[1] వారికై వసతులు కల్పింపఁబడినవి.

---

1. తిరుపతి శాసనములను బట్టి, తిరుమలలో వడమామలయ్య కుమారుఁడు తిరువేంకటత్తురైవర్ అను నాతఁడును, తిరుపతియాలయములో ఉరుపుత్తూరు కరుప్పుతిరువేంకటయ్య కుమారుఁడు అనంతయ్యయు, అతని కుమారుఁడు వేంకటత్తురైవరు అను మఱియొకరును, వేంకటాచల మాహాత్మ్య పఠనమునకై నియుక్తులైనట్లు తెలియుచున్నది. క్రీ॥శ॥ 1546 తరువాత అన్ని యాలయములందును అనంతయ్యగారి కుమారునిపేరు వినవచ్చునుగాని వడమామలయ్య కుమారుని పేరు గానరాదు. బహుశః అప్పటి కాతఁడు పరమపదించెనేమో.

వేంకటాచలమాహాత్మ్యపఠన మాదినములలో నుత్సవకార్య క్రమములందొక నిత్యావసరమై పోయినది. దీని నారంభించినవాడు అరవీటి తిమ్మరాజని తిరుపతి శాసనములు వెల్లడించుచున్నవి. తరువాత విఠలేశ్వరరాజు, తాళ్లపాక తిరువేంగళనాథుడు, శ్రీనివాస య్యంగారు, కాళా త్తిసెట్టి ప్రభృతులీ వేంకటాచల మాహాత్మ్య పఠనము నకై తాము గావించిన ప్రత్యేకోత్సవములలో వసతులు గల్పించిరి.

ఈకాలమున పూర్వముజరుగుచుండిన వానితోబాటు మరి కొన్ని నూతనోత్సవములుకూడ నారంభింపబడినవి. పల్లవోత్సవము, వైవాహికోత్సవము మున్నగునవి వానిలో పేర్కొనదగినవి. కొన్ని ఉత్సవ సమయములందువచ్చిన భక్తులకు, యాత్రికులకు ప్రసాదములతోబాటు నూతన వస్త్రములను బహూకరించుటయు, దాహమునకై మజ్జిగతేట నిచ్చుటయు, మున్నగు రీతులగూడ కైంకర్యము జరుగుచుండినది. కొండమీద త్రాగుటకై మంచినీటి వసతులు

---

అంతకు పూర్వమే సాళువ నరసింహరాయల కాలమున No. 95 T. T. D. Vol II P. 193ని బట్టి (కాలము క్రీ॥శ॥ 1491) వసించి తిరువేంకటత్తురైవర్ అను వారొకరు తిరువేంగళనాథుని సన్నిధిని వేంకటాచల మాహాత్మ్యమును పఠించుచుండినట్లు తెలియుచున్నది, బహుశః అతఁడే పైన పేర్కొనఁబడిన వడమామలయ్య కుమారుఁడై యుండును. ఈ వేంకటాచలమాహాత్మ్య గ్రంథపఠనము సాళువ నృసింహరాయల కాలమున నారంభమై నాటినుండియు కొనసాగి వచ్చుచున్నది. కాని యాదినములలో మార్గశిర మాసమునవే పఠనము జరుగుచుండినట్లు తెలియనగును సదాశివ రాయల కాలమున అరవీటి తిమ్మరాజు అళగప్పిరానార్ తిరుమంజనమయిన తరువాత ప్రతినిత్యము ఆ పఠనము జరుగునట్లు విధించెను. అంతే కాదు తొలుత కొండమీద మాత్రమే పైపఠన ముండెడిది. అది యా కాలమున తిరుపతిలోని గోవిందరాజ, వరదరాజ, అచ్యుత పెరుమాళ్ ఆలయములన్నింటిలోను నిత్యము జరుగునట్లుగా తిమ్మరాజాదు లేర్పరచిరి. (ఈ వేంకటాచలమాహాత్మ్య కర్తృత్వమునుగూర్చి మున్ముందు తెలియఁదగును.)

బహుళముగా కల్పింపఁ బడినవి. ఇఁక కొందఱు స్త్రీలు, దేవదాసీలు కూడ తిరుపతి క్షేత్రమునకు దానధర్మములు గావించిరి. అచ్యుతదేవరాయలు విజయనగరమునుండి ముద్దుకుప్పాయితోఁబాటు నాగసానియను నామెనుకూడ పంపెను. ఆమెయు, లింగిసాని, గోవింది, సెవ్వ, వెంగు, మాణిక్యం మున్నగుసానులు మఱికొందఱును, నృత్యసేవతోఁబాటు యథాశక్తి మఱికొన్ని కైంకర్యములుకూడ కావించిరి. వీరు తమకుచెందు ప్రసాదభాగములను తమగురువులగు కుమారతాతాచార్యులకు చెల్లుబడియగునట్లు నియోగించిరి. వీరిలో కొందరిపేర తిరుమల తిరుపతులలో పూఁదోటలు మంటపములుకూడ నున్నవి. వైయందరిలోను నాగసాని, మాణిక్యం ప్రతిభావంతురాండ్రుగా గోచరింతురు.

ఆరవీటి తిమ్మరాజు స్వామియనుగ్రహమునకుఁ బాత్రమైన యీ తిరువేంకటమాణిక్యమున కొక ముత్యాలపల్లకి నిచ్చి సత్కరించినట్లుకూడ తెలియుచున్నది.

ఈ రీతిని సదాశివరాయల కాలమునను తిరుపతిక్షేత్రమునకు విశేషమగుసేవ జరిగినదని చెప్పవచ్చును.

## ఆరవీటి వంశము:- తిరుపతి (1575-1630).

సదాశివరాయల యనంతరము ఆరవీటి రామరాయల సోదరుఁడు తిరుమలరాయలు విజయనగరసింహాసన మధిష్ఠించెను. అటు పై తిరుమలరాయని కుమారులు శ్రీరంగరాయలు, వేంకటపతిరాయలు పరిపాలించిరి. పిదప యథాపూర్వము రాచరికమున కై రాజ కుటుంబమున రవరవలురేగి రామరాయాదులు రాజ్యమునకు వచ్చిరి. అటుపై క్రమముగ కొంత కాలమునకు విజయనగర సామ్రాజ్యము అంతరించి పోయినది. ఒక విధమున చూడఁగా సదాశివరాయల కాలమున అళియ రామరాయాదులు పెత్తనము వహించుచుండినపుడు క్రీ॥ శ॥ 1565 లో జరిగిన తళ్లికోటయుద్ధము తోడనే విజయనగరసామ్రాజ్యము విచ్ఛిన్నమై వైదేశిక శక్తులకు

లొంగిపోయినదనవచ్చును. అప్పుడే హంపి విజయనగరము నాశనమై సామ్రాజ్య లక్ష్మి పెనుగొండ, చంద్రగిరిదుర్గములను వెదుకుకొనం బోయినది. ఆగడ్డుదినములలోకూడ తిరుపతికి సంబంధించిన ఒకటి రెండు విషయములు చెప్పుకోందగినవి కలవు. సదాశివరాయల యనంతరము రాజ్యమునకు వచ్చిన తిరుమలరాయలు క్రీ॥శ॥ 1561లో తిరువేంగళ నాథుని యాలయ ప్రాకారాంతర్భాగమున నొకవిశాల మగు మంటపమునుం గట్టించెను. అది నేంటికిని తిరుమలరాయమంటప మను పేరున దర్శనీయముగా నున్నది. సాళువ నరసింగరాయని కాలమునుండియు, తిరుమలలో సాగుచుండిన వసంతోత్సవ సమయము లందు వలసిన సదుపాయములకై యీ మంటపము నిర్మింపంబడినట్లు తెలియుచున్నది. అటుపై వేంకటపతిరాయలు స్వామిని భక్తితో నర్చించినట్లు తెలియవచ్చుచున్నది. ఆదినములలో సుప్రసిద్ధవైష్ణవ కుటుంబము లెన్నియో తిరుపతిలో నెలకొని రాజకీయములతో నిమిత్తములేకుండ యథాశక్తి కైంకర్యములు చేసినవి. రాజ కుటుం బములలో మట్లగారు తిరుపతి నెంతగనో అభివృద్ధి పఱచిరి. సామ్రాజ్యమెంత పతనావస్థలోనున్నను ముఖ్యముగా ప్రజలు, కొంత వఱకు ప్రభుత్వము, తిరుపతిక్షేత్రముయొక్క పూర్వవైభవమునుం జాలవఱకు నిలంబెట్టుటకే పాటుపడిరి. రాజకీయరంగమున నెట్టిరవరవలు పొడమినను ఏడుకొండలవాని యనుగ్రహమున ఆక్షేత్రమున మాత్ర మెట్టి యొడుదుడుకులును కలుగలేదనియే చెప్పవలయును. ఆ శ్రీని వాసుని మహిమ యట్టిది.

## తాళ్లపాకవారు

సంగమరాజులపాలనముననే ప్రాభవమునందిన సాళువనరసింహ రాయని కాలము మొదలుకొని, యారవీటిరాజులపలుకుబడితో నేలు బడి సాగించుకొనిన తుళువ సదాశివరాయల యంతమువరకును గల నడిమికాలమున తిరుపతిక్షేత్రము మహోచ్ఛ్రదశ ననుభవించినదని తెలిసికొంటిమి. సరిగా ఆదినములలోనే స్వామి యనుగ్రహమున తిరుపతిలో తాళ్లపాక కుటుంబమువారు నెలకొని ఆక్షేత్ర సౌభాగ్య మును పదివేల జిహ్వలతో పాడియాడి లోకమునకుం జాటినారు.

తిరుపతివేంకటేశ్వర స్వామివారి యనుగ్రహమున తాళ్లపాకవారికి పేరు ప్రఖ్యాతు లతిశయించినట్లే తాళ్లపాకవారి మూలమునను తిరుమల స్వామికి ప్రశస్తియెక్కువైనది. అవినాభావ సంబంధమున వీరికి పరస్పరము కీర్తి హెచ్చినదనియే చెప్పవచ్చును. ఇంతవఱకు నెవ్వరు ఏక్షేత్రమునకును చేయనిసేవ తాళ్లపాకవారు తిరుపతికి చేసినారు. ఇంతవరకు నెచ్చటను నేకవిసంఘమునుఁ గాంచని ఖ్యాతిని వారు గాంచినారు. విజయనగర రాజులు వేంకటాచలక్షేత్రమునకు చేసిన సేవయంతయు నొకయెత్తు; తాళ్లపాకవారు చేసిన దొకయెత్తు. సాళువ నరసింగరాయని సమకాలికుఁడుగా వర్తిల్లిన తాళ్లపాక అన్నమాచార్యుఁడు మొదలుకొని సదాశివరాయల తరువాతకాలము వఱకును విఖ్యాతితో వర్ధిల్లిన యీ వంశమువారు ఆంధ్రుల భాషాసాహిత్యములకును సంగీతమునకును మాత్రమేకాదు మతమునకును, తిరుమలక్షేత్రమునకుఁగూడ విశేషమగు సేవగావించిరి. వారిసేవ నేఁటికిని అక్షరరూపమున తిరుపతిలో మనకు దర్శనీయమగుచున్నది. తాళ్లపాకవారు నందవరవంశీకులు. వైదిక బ్రాహ్మణులు. ఋగ్వేదులు. ఆశ్వలాయన సూత్రులు. భారద్వాజసగోత్రులు. పొత్తపినాఁటి సీమలోని తాళ్లపాక గ్రామమున[1] వర్తిల్లినవారు. వీరి జన్మస్థానము తాళ్లపాక గ్రామమే యైనప్పటికిని, ఈ వంశాంబుధికి చంద్రముఁడైన అన్నమాచార్యుని మొదలుకొని వీరందరును (క్రీ॥ శ॥ 15-16 శతాబ్దులలో) తిరుమల తిరుపతులందే స్వామిసన్నిధిని స్థిరనివాస మేర్పరచుకొని అక్కడే కాలము గడపిరి. దేశమంతయుఁ దిరిగి వైష్ణవమత ప్రచారముగావించిరి. స్మార్త బ్రాహ్మణులయినప్పటికిని ఆదివన్ శఠగోపయతుల శిష్యులై మతము పుచ్చుకొని వీరు వైష్ణవులయినారు. వైష్ణవ మతమునకును వేంకటాచల క్షేత్రమునకును ఎనలేనిరీతిని కైంకర్యమొనర్చి ధన్యజీవనులయినారు. తాత్త్వికులై, వేంకటాద్రీశునకు పరమభక్తులై, సార్వజనీనమును, తాత్త్వికమతమును నగు విశిష్టాద్వైతమును లోకమునకుఁ జాటుటకై దీక్షాకంకణులైనారు. తామనుభవించిన తన్మతాను

1. తాళ్లపాక నేఁటి కడపజిల్లా రాజంపేటతాలూకాలో నున్నది.

భూతివైశిష్ట్యమును పదిమందికి పంచిపెట్టుటకై తహతహపడినారు. సంగీతసాహిత్యములను సాధనముగాఁగొని తత్త్వదృష్టితో మత సాహిత్య సంగీతములకు మేలుకలయికను చేకూర్చి కళాలక్ష్మి కందాలు దిద్దినారు. ప్రాతనెఱఁగి క్రొత్తను క్రొంగ్రొత్తగా నావిష్కరించి నారు. అనుభవించి భూతమునందలి మాలిమిని తొలఁగించి లక్ష్యాలోకమున భావియందలి మేలిమిని వర్తమానమున మహనీయముగా సాధింపఁ జాలినారు.

వీరశైవ మతప్రచారమునకై శక్తిసామర్థ్యముల నంకితముఁ గావించికొని సాహిత్యమునే సాధనముగాఁగొని క్రొంగ్రొత్తరీతులను వెలయించిన అలనాఁటి శైవకవుల నవ్యతయు, మతమన్నది నేత్రపట్టమై సాహితీచంద్రాలోకనముఁ గోల్పోయి అంధకారమున తడవులాడు కొనుచుండిన అక్షరాస్యులకు మహాకవిత్వదీక్షావిధిఁబూని రసాలోకనముఁ గల్పించిన తిక్కనగారి మనీషయు తాళ్లపాకవారిలో అతి రమ్యముగ మేళవించిన దనవచ్చును. ఆంధ్రసాహిత్య గౌరవభారమును వారు కలసిమోసినంత ఈ కుటుంబము వారొక్కరొక్కరే మోసినారు. అందుకే ఆంధ్రవాఙ్మయ ప్రపంచమున తాళ్లపాక వారికి విశిష్టమగుస్థానమున్నదనుట. తాళ్లపాక వారొక్కరు కారు పదిమంది. పదిమందియు భిన్నులుకారు. ఒక్క కుటుంబమువారు. ఆయొక్కకుటుంబమువారే పదిమందియు పుత్రులు, పౌత్రులు, ఆడు వారు, దౌహిత్రులు అందరుకలసి ఒక్కసంస్థగాచేరి కళారాధనము గావించుచు స్వామిసేవలో తరించినారు. క్రీ॥శ॥ 15-16 శతాబ్దులలో వర్తిల్లి ప్రసిద్ధులగు తాళ్లపాకవారి వంశవృక్షమును దిగువనిచ్చు చున్నాను.[1]

1. ఈ వంశవృక్షము తాళ్లపాక చినతిరువేంగళనాథ (చిన్నన్న) విరచితమగు అష్టమహిషీకళ్యాణమను ద్విపదకావ్యము ననుసరించి గైకొనినది.

ఈతఁడే రచించిన అన్నమాచార్య చరిత్ర ద్విపదలో తాతముత్తాతల విషయమై మరికొన్ని వివరము లిచ్చినాఁడు. దానిననుసరించి:

భరద్వాజఋషి
(తద్వంశమున)

తాళ్లపాక అన్నమాచార్యుఁడు
(భా. తిమ్మక్క మఱియు అక్కాంబ)

- నరసింహ కవి (తిమ్మక్క-తనయుఁడు) (భా. నాంచారమ్మ-అనంతమ్మ)
  - నారాయణయ్య (నాంచారమ్మ తనయుఁడు)
  - అప్పలార్యుఁడు (అనంతమ్మ తనయుఁడు)
  - అన్నయార్యుడు (అనంతమ్మ తనయుఁడు)
- పెద తిరుమలాచార్యుఁడు. (అక్కాంబ తనయుడు.)
  - చిన తిరుమలయ్య (భా. పెదమంగమ్మ)
    - తిరువేంగళప్ప
  - అన్నయ్య
  - పెద తిరువేంగళనాధుఁడు
  - చిన్నన్న
  - కోనేటి తిరువేంగళనాధుఁడు
- నరసమాంబ
- తిరుమలాంబ (భ. తిరుమల కొండయార్యుఁడు.)
  - రేవణూరి వేంకటాచార్యుఁడు.

హరికీర్తనాచార్యుడు,
తాళ్ళపాక అన్నమాచార్యులు
చూ. పుట - 95 →





చనవరిసుతుడు
తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు
← చూ. పుట - 113



ముద్దుల మనుమడు
తాళ్ళపాక చినతిరుమలాచార్యులు
చూ. పుట - 119 →

"ఆస్యేనాలంబయేద్గీతం హస్తేనార్థం ప్రదర్శయేత్"



'అన్ని విద్యలయందు సరసు మున్నింటి
అన్నయార్యుని బోలు నన్నయార్యుండు'



'విశేషించియు సత్తిరువేంగళనాథుండు
సంకీర్తనలు పాడిన నాడందొడంగె'



'రత్నశుంభదనుపమ శ్రీ వేంకటాద్రీశదత్త
కరకుండలయుగ్మమండిత కర్ణుడు' చిన్నన్న

చూ. పుటలు - 121, 122, 123, 126)



'కాయసిద్ధిని లంబికాయోగమార్గంబు
తెలిసియేఘనుడు సాధించినెగడె
కువలయాప్తుండు కోనేటి గురువరుండు'

వీరిలో పలువురకు విభిన్నములగు వ్యవహారనామాంతరము లున్నవి. సౌలభ్యమునకై వానినిగూడ నిటనే పేర్కొనుచున్నాను.[1]

**1. తాళ్లపాక అన్నమాచార్యుఁడు:.** అన్నమయ్య, అన్నమయ్యంగారు, అన్నయాచార్యులు, అన్నయ్యగురు, అన్నయార్య, కోనేటి అన్నమయ్యంగారు-నామాంతరములు.

**2. తాళ్లపాకనరసింహకవి:-** నరసయ్యంగారు, నరసయాచార్యుఁడు, నరసింగన్న, నరసింహగురుఁడు- నామాంతరములు.

**3. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు:-** పెదతిరుమలయ్య, పెదతిరుమలయ్యంగారు, అన్నయతిరుమలార్య, పెరియ తిరుమలయ్యంగారు, తిమ్మయ్య, తిమ్మయార్య, తిరుమల తిరుమలాచార్య,

---

భరద్వాజఋషి
|
నారాయణయ్య I
|
విఠలయ్య I
|
నారాయణయ్య II
|
విఠలయ్య II
|
నారాయణయ్య III
|
నారాయణసూరి IV
(భార్య లక్కమాంబ)
|
అన్నమాచార్య

ఈ అన్నమాచార్యున కగ్రజుఁడొకఁడుండినట్లు గ్రంథవిషయమును బట్టి తెలియనగును గాని అతని పేరిందు తెలియవచ్చుట లేదు.

1. ఈ వంశమువారు తాళ్లపాక వారని, తాళ్లపాకము వారని, తాళులపాక వారని, తాళపాక వారని, తాళమపాక వారని- పలుతెరఁగుల పిలువఁబడుచున్నారు.

తిరుమలగురు, తిరుమలదేశికులు, వేంకటపతియోగి, తిరుమలయ్యంగారు, తాళపాక తిరుమలయ్య, తిమ్మఁడు- నామాంతరములు.

4. **తాళ్ళపాక చినతిరుమలయ్య:-** చినతిమ్మయ్య, చినతిమ్మ దీక్షితులు, *చినతిరుమలాచార్యులు*, చినతిరుమల దీక్షితులు, చినతిమ్మ, చిన్నతిరుమలయ్య, చిన్నతిమ్మన్న, *చిన్నతిరుమలయ్యంగారు*, పిన తిమ్మదేశికులు, సిరుతిరుమలై అయ్యంగారు, తిరుమలవేంకటేశదీక్షితులు - నామాంతరములు.

5. **తాళ్ళపాక అన్నయ్య :-** అన్నమయ్యంగారు, అన్నయాచార్య— నామాంతరములు.

6. **తాళ్ళపాక పెద తిరువేంగళనాథుఁడు:—** తిరువేంగళయ్య, *తిరు వెంగళనాథయ్య*, తిరు వేంకటప్పన్- నామాంతరములు.

7. **తాళ్లపాక చిన్నన్న:—** *చిన్న తిరువేంగళనాథయ్య*, చిన తిరువెంగళయ్య, తిరువెంగళనాథయ్య, తిరువెంగళ నాథయ్యంగారు, వేంగళార్య, తిరువేంకట నాథర్, *తిరు వేఙాథర్*, తిరువేఙాథయ్యర్ -నామాంతరములు.

8. **తాళ్లపాక కోనేటి తిరువేంగళనాథయ్య :—** కోనేటి వేంగళనాథయ్య, కోనేటి వేంకటనాథయ్య, కోనేటి తిరువేంగళ నాథయ్యంగారు - నామాంతరములు.

9. **తాళ్ళపాకతిరువేంగళప్ప:-** తిరువేంగళప్పర్, తిరువేంకటయ్యన్, తిరువేంగళ దీక్షితులు -నామాంతరములు.

**కాలము :**

సుప్రసిద్ధులగు నీ తాళ్ళపాకవారిలో వంశవిఖ్యాతికి మూలపురుషుఁడగు అన్నమాచార్యుఁడు క్రీ॥శ॥ 1424 లో జన్మించినట్లు తెలియుచున్నది. అటుపై నీ తాళ్ళపాకవారిలో సుప్రసిద్ధ రచయితలగువారి కాలమితిని స్పష్టముగ నెఱుఁగుటకుఁదగిన శాసనాధారములు కొన్ని క్రీ॥శ॥ 1553, 1559, 1564 సంవత్సరముల వఱకును కాననగు

చున్నవి. ఆమీఁదకూడ నీవంశమువారు వర్ధిల్లి నేఁటికిని ఆంధ్ర దేశమున విద్యావివేకములతో వర్ధిల్లుచున్నారు కాని రచయితలుఁగా విద్వాంసులుగా పేరుపొందిన తాళ్ళపాకవారిలో చినతిరుమలా చార్యుని తనయుఁడగు తిరువేంగళప్పయు, పెదతిరుమలా చార్యుని కుమారుడగు కోనేటి తిరువేంగళ నాథుఁడును గడ పటి వారుగాఁ బ్రస్తుతపరిశీలనమున మనము గ్రహింపవచ్చును. వీరి శాసనములు [1] క్రీ॥శ॥ 1564 సంవత్సరము వఱకును కాననగుచుండుట

---

1. చూ. No. 684 of 1920-21 గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఈమని గ్రామము. క్రీ॥ శ॥ 1564 లో సిద్ధిరాజు వేంకటదేవ మహారాజు, తాళ్లపాక కోనేటి తిరువేంగళ నాథయ్యకి కొంత భూమి దానము చేసిన విషయము.

ఈ కోనేటి తిరువేంగళనాథాదులు దానము, గొన్న అగ్రహారముల విషయమును తెలుపు శాసనములనేకములున్నవి.

పెద తిరుమలాచార్యుని రెండవ కుమారుఁడు కోనేటి అన్నయ్య.

1. చూ. No. 814 of 1915,16. గుంటూరు జిల్లా నరసారావుపేట తాలూకా మిన్నకల్లు. క్రీ॥ శ॥ 1546 లో మిన్నకల్లు గ్రామము సదాశివ రాయ లీ అన్నయ్యకు దానము చేసెను.

2. చూ. No. 686 of 1920-21 గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా దంతలూరు, ఈమని-సిద్ధిరాజు వెంకట్రాజు ఈ గ్రామములను అన్నయ్యకు దానము చేసెను.

పెదతిరుమలాచార్యుని కడపటికుమారుఁడు కోనేటితిరువేంగళనాథయ్య.

1. చూ. 419 of 1915,16. గుంటూరు జిల్లా, నర్సరావుపేట తా॥ గొరిజవోలు క్రీ॥శ॥ 1546 లో సదాశివ మహారాయలు గొరిజవోలు గ్రామ మును కోనేటి తిరువేంగళనాథయ్య గారికి దానము చేసెను.

2. చూ. 684 of 1920-21 గుంటూరు జిల్లా, తెనాలి తా॥ ఈమని క్రీ॥ శ॥ 1564 లో సిద్ధిరాజు వెంకట్రాజు కోనేటి తిరువెంగళ నాథయ్యగారికి కొంత భూమిని దానము చేసెను

3 చూ॥ 182 of 916-17- గుంటూరు జిల్లా-గుంటూరు తా॥ ఉంగుటూరు. ఈ శాసనమున గుండవరమను నగ్రహారము తిరువెంగళ నాథయ్య గారికి ధారాదత్తమైన విషయమున్నది. ఈయూరు ఉంగుటూరు నకు 2 మైళ్ల దూరమునఁ గలదు—

చేత అప్పటికిని మఱికొంతకాలము తరువాతవఱకును (ఆ శతాబ్ది యంతమువరకును) గూడ స్వామిసేవయు సారస్వతారాధనముఁ గావించుచు సంపదభివృద్ధులతో వర్ధిల్లియుందురనఁదగును.

అనఁగా దాదాపు ఒకటిన్నరశతాబ్ది కాలము విజయనగరరాజుల పరిపాలనాకాలమున వీరు విఖ్యాతితో వెలసి వైష్ణవ మతమునకును ఆంధ్రభాషకును నిరుపమానమగు సేవగావించినారన్నమాట! ఆంధ్ర రాజకీయ మత, సాంఘిక, భాషాసారస్వత రంగములలో స్వర్ణయుగ మని ప్రఖ్యాతిఁగాంచిన ఆకాలఖండముననే తాళ్ళపాకవారు వర్ధిల్లి ఆ గౌరవభారము నెంతగానో తమభుజస్కంధములపై మోసి యుందు రనుట అతిశయోక్తి కాదు.

ఇట్లు విఖ్యాతితో వెలసిన వారికాలపరిమాణము నెరిగిన పిదప లభ్యమగు నాధారములను బట్టి విడివిడిగా వారిజీవితకాల పరిమాణము లనుఁ గూర్చియు, జీవిత విశేషములనుఁగూర్చియు మనము కొంత దెలిసికొనవచ్చును.

## అన్నమయ్య (క్రీ.శ. 1424-1503)

తాళ్ళపాకవారి సంకీర్తనపు రాగిరేకులలో ప్రారంభమున నీ శాసనాక్షరములు లిఖింపఁబడియున్నవి.

"స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగునేఁటి క్రోధిసంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు తిరువేంగళనాధుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ నిరుధానకు తిరువేంగళ నాధునిమీఁదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన శృంగార సంకీర్తనములు"

ఇందలి వాక్యనిర్మాణ వైఖరినిబట్టి అన్నమాచార్యులు అవతరించినవత్సరము క్రోధి (1424 AD) యని తెలియనగును.[1] ఇట

1. కాని T. T. D Epigraphical Report లో శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అన్నమాచార్యులు అవతరించిన పదారుయేండ్లకు-

దేవస్థానము ఎపిగ్రాఫిస్టు శ్రీసాధుసుబ్రహ్మణ్యశాస్త్రిగారు భావించి నట్లు 'అన్నమాచార్యులు అవతరించిన పదారుపండ్లకు క్రోధి సంవత్సర మునందు తిరువేంగళనాధుండు ప్రత్యక్షమైతేను' అని అన్వయించు కొనుటలో దూరాన్వయ దోషమున్నది. ఆంధ్రకవితరంగిణీకారులు శ్రీ చాగంటి శేషయ్యగారుకూడ 'శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారి యూహ దూరాన్వయ దోషమునకుగురియైనది', ప్రభాకరశాస్త్రిగారి నిర్వచనము సంగదలేదు. అని యంగీకరించినారు.[1]

---

క్రోధి సంవత్సరమందు తిరువెంగళ నాధుండు ప్రత్యక్షమైతేను-అనురీతిని అన్వయ మేర్పరచుకొని అతని జననము క్రీ॥శ॥ 1408 అగునని వ్రాసిరి. Tallapaka Annamacharya commenced composing both the Sanki rtanas in Saka 1346 Krodhi (= 1424 AC) being there in his 16th year of age during which he had a manifestation of God Tirumala Nadha and Continued his work until the 12th day of the dark fortnight of Phalguna in Saka 1424-Dundubhi (23 February 1508 AC). This is to say for a period of 80 years from 1424 to 1508, Annamacharya went on composing Sankirtanas-" (Epi-Rep P.280)

దీని ననుసరించియే కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తొలుత 1945 లో ప్రకటించిన వేంకటేశ్వర వచనముల పీఠికలో "ఈతఁడు తొంబదియారేండ్లు జీవించెను............క్రీ॥ 1408 నుండి 1508 దాక జీవించెను." (పుటలు 12,18) అని వ్రాసినారు. కాని పిదప అన్నమాచార్య చరిత్ర ప్రకటన కాలము నాఁటికి (1949) ఆవాక్య నిర్మాణ వైఖరిని బట్టి తమయభిప్రాయమును మార్చుకొని "అన్నమయ శక 1346 క్రీ॥ 1424 క్రోధి వైశాఖ మాసమున విశాఖా నక్షత్రమున జన్మించినాఁడు-వైశాఖ పూర్ణిమ జన్మతిథిగా కూడ నిర్ణయింపవచ్చును. శక 1424-క్రీ॥శ॥ 1508 దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశి నాఁడాతఁడు దివ్యధామమందినాఁడు. అతని జీవిత పరిమాణము 79 పండ్లు" (చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక పుటలు 2, 3,) అని వ్రాసినారు. వారి యీ రెండవ యభిప్రాయమే సమంజసమగునని నేను భావించుచున్నాము.

1. చూ. ఆంధ్రకవి తరంగిణి సం 3-పుట 122. శ్రీ శేషయ్యగారు

అందువలన పై వాక్యములందు గల క్రోధి దుందుభివత్సరములు క్రమముగా అన్నమయ్యగారి జనన నిర్యాణ వత్సరములనే సూచించు ననవచ్చును

క్రీ॥ శ॥ 1424 లో జన్మించిన అన్నమాచార్యులకు పదునారవ యేట, అనఁగా క్రీ॥ 1440 లో, స్వామి ప్రత్యక్షమయ్యెను. అది మొదలుగా సంకీర్తనరచనఁగావించుకొనుచుఁ బ్రఖ్యాతిఁగాంచిన అన్నమయ్యగారి మహిమ విని టంగుటూరి పరిపాలకుఁడుగా, దండనాథుఁడుగా నుండిన సాళువ నరసింహరాయఁడు బహుశః క్రీ॥ శ॥ 1450-60 ల నడుమ వారి స్నేహమపేక్షించియుండును. అన్నమాచార్యుని యాశీర్వాద బలమున నాతఁడు క్రమముగా విజయపరంపరనంది విజయనగరాధీశుఁడై యుండును. చిన్నన్న పెనుగొండనే రాజధానిగా పేర్కొనెను గాని విజయనగరమును గూర్చి ప్రస్తావన చేయలేదు. కనుక చిన్నన్న వ్రాతనుబట్టి నరసింగరాయఁడు 1470-80 ల నడుమ విజయనగర సామంతాధీశుఁడుగా పెనుగొండలో వర్తిల్లిన దినములలోఁగాని లేక రాయఁడు విజయనగరాధీశుఁడైన వెనుక 1485 - 90 ల నడుమఁగాని అన్నమాచార్యుని శృంఖలాబద్ధునిగావించియుండును.[1] చిన్నన్నరచనలో నట్టికాలవ్యవధానము నూహించుట కవకాశముండుటను బట్టియు, శృంఖలాబద్ధుఁడైననాఁటికి అన్నమయ్య వృద్ధుఁడుగాఁ దోచుచున్నాఁడు కాబట్టియు, శృంఖలా యోగవిషయము 1485 ప్రాంతమునందు జరిగియుండునని భావింపవచ్చును. దీనినిబట్టి అన్నమయ్య రచనయారంభించిన పదిపదు

---

ఇటదూరాన్వయదోషమున్నదని యంగీకరించియు "దీనిని వ్రాయునపుడు కావ్యదోషములు మనసు నందుంచుకొని వ్రాసినవికావు" అని సరిపుచ్చుకొని కారణాంతరములఁ జూపి అన్నమయ్య జననము క్రీ॥శ॥1408 విరోధియగునని తీర్మానించుటకు యత్నించినారు (చూ. పుటలు 128 నుండి 129) కాని క్రీ॥శ॥ 1424 అన్నమయ్య జననము కాఁజాలదనుటకు వారు చెప్పిన యభ్యంతరములు నిలువఁదగినవి కావని నా అభిప్రాయము.

1. అన్నమాచార్యుని మనుమఁడు చిన్నన్న వ్రాసిన 'అన్నమాచార్య చరిత్ర' పుటలు 81,82. చూడఁదగును.

నై దువత్సరములలోనే ప్రసిద్ధివహించుటయు, నరసింహారాయలచే సన్మానముఁ బడయుటయు జరిగియుండుననవచ్చును. అదియే ఆతని జననము క్రీ॥ శ॥ 1408 అనుకొనినచో నాతఁడు రచన యారంభించిన ముప్ప దేఁడులకుఁగాని అట్టిస్థితి కలుగలేదనవలసి యుండును. ఇట్లాలోచించినను అన్నమయ్య జననము క్రీ॥శ॥ 1424 అనుటయే సమంజసము. కాని శ్రీ చాగంటి శేషయ్యగారు క్రీ॥శ॥ 1424 ఈతని జననమగుచో వివాహ మగుట, సంతానమునుఁ బడయుట, మనుమనికి బ్రహ్మోపదేశము చేయుట మున్నగు విషయములందు కొంత విప్రతిపత్తి కల్గునని భావించి 1408 యే యాతని జననవత్సరమని నిర్ధారించుటకు కొంత చర్చనుఁ జేసిరి.[1] కాని వారి సందేహములు నిలువఁదగినవికావు.

అన్నమయ్య క్రీ॥ శ॥ 1503లో నిర్యాణమందెను. అంతకుఁ బూర్వమే ఆతఁడు, మనుమఁడగు చిన తిరుమలాచార్యునకు బ్రహ్మోపదేశము కావించెను. ఈ బ్రహ్మోపదేశానంతరము తాతగారు కొంతకాలము జీవించియుండినట్లు మనుమని సంకీర్తనములనుబట్టి తెలియవచ్చు చున్నది. 1496-98 ప్రాంతముల చినతిరుమలయ్య యుపనయనము జరిగినదనుకొన్నచో నాతని జన్మము 1488-90 ప్రాంతమగును. అప్పటికి చినతిరుమలయ్య తండ్రి పెదతిరుమ లయ్యకు 30 ఏండ్లనుకొన్నను ఆతని జన్మము 1458-60 ప్రాంత మగును. అనగా అన్నమయ్యకు 35 ఏండ్ల వయస్సు దాటిన పిదప ద్వితీయ సంతానమగు పెద తిరుమలయ్య కలిగినాఁడన్నమాట. ఇట్లు భావించుటలో కాలమునందుగాని, వయస్సునందుగాని ఎట్టి విప్రతి పత్తియునులేదు. శ్రీ శేషయ్యగారనినట్లు అన్నమయ్యకు వివాహ మగు నాటికి 35 ఏండ్లుదాటియుండుననుకొనవలసిన పనిలేదు. 'ఎల జవ్వనము మేన నిగురొత్తు' వయసు వచ్చినను పెండ్లిమాట తలఁపక హరి గోవింద యనుకొను అన్నమయ్యకు పిల్లనీయ వెనుకాడుచున్న తండ్రులకు వారిజోదరుఁడు కలలో కానవచ్చి కర్తవ్యము నుద్బోధిం పఁగా వారు పిల్లలనిచ్చి పెండ్లిండ్లు చేసిరి. దైవనియోగమున జరిగిన యాతని వివాహము పాతికేండ్ల వయసున జరిగి యుండుటలో విడ్డూ

---

1. చూ. ఆంధ్రకవితరంగిణి సం. 8.

రములేదు. శ్రీ శేషయ్యగారూహించినట్లు అప్పటికాపడుచులు రజస్వలలు కాని పదిపంద్రెండేండ్ల బాలలేయైనను మఱి నాల్గుమూఁడేండ్లలో వారు వ్యక్తురాండ్రగుటలోను, వారికి సంతానము కలుగుటలోను వింతలేదు. కావున అన్నమయ్యగారి ప్రథమ సంతానమగు నరసింగన్న 1453-54 ప్రాంతముననుు, ద్వితీయ సంతానమగు పెద తిరుమలయ్య క్రీ॥ శ॥ 1458 ప్రాంతమునను కలిగియుందురనవచ్చును.

చిన్నన్న వ్రాసిన ద్విపదలనుబట్టి "వారిసోదరుఁడు దారియు మొనఁజూపి తనదు భక్తునకు నన్నయార్యునకుఁ గన్యకల నిమ్మనిన" చొప్పున తిరుమలమ్మ అక్కలమ్మలను అన్నమాచార్యుఁడొక సమయమున నాగమోక్తి ప్రకారమునఁ బెండ్లియయినట్లు తోఁచుచున్నది. దీనికి విరుద్ధముగా మనమూహింపవలసిన పనిలేదు. కవయిత్రియయి ఘనత వహించిన తాళ్లపాక తిమ్మక్క-అక్కలాంబా పరిణయమునకుఁ బూర్వమే మరణించియుండునని తలఁపను.[1] ఒకవేళ నామెమరణానంతరమే అక్కలమ్మను రజస్వలాత్పూర్వము వివాహ మాడెనను కొన్నను చిక్కులేదు. నరసింగన్న జన్మించిన పిదప తిరుమలమ్మ చనిపోయి వెంటనే పదిపంద్రెండేండ్ల బాలయగు అక్కలమ్మను వివాహ మాడియుండినను మఱియైదారేండ్ల వ్యవధి తరువాత అనఁగా 1458 నాఁటికి అన్నమయ్యకు పెదతిరుమలాచార్యుఁడు కలుగుటలోను,ఆతనికి ముప్పదేండ్లకుఅనఁగా 1488-90నాఁటికి చినతిరుమలార్యుఁడు కలుగుటలోను-ఆతనికి తాతగారు ఎనిమిదవయేట ఉపనయనము చేసియుండుటలోను వింతలేదు. కావున చినతిరుమలయ్య కన్నమాచార్యులు బ్రహ్మోపదేశము చేయుట కవకాశములేని స్థితియేర్పడునని శ్రీ శేషయ్యగారు వ్రాసినది వట్టిమాట.

---

1. చిన్నన్న అష్టమహిషీకల్యాణమందు కూడ "అధిరమతికి దిమ్మాంబ, యక్కాంబ శ్రీధరాధినజా శ్రీభూరాసతుల, కఱణి నిద్దఱు కులకాంతాలలామలరయ" అని వర్ణించినాఁడు. ఈ వాక్యసరణినిబట్టి కూడ తిరుమలాంబా అక్కాంబలిరువురును శ్రీధరాసతులవలె కలసి సంసారము చేసినట్లు తెలియుచున్నది.

అన్నమయ్య జననము 1424 A. D. అనియే నిర్ణయింప వచ్చును. ఆతని నిర్యాణ వత్సర మాస దివసములు స్పష్టముగా నెరిగిన మనకు ఆతని జనన మాస నక్షత్రాదికమును గూర్చిన వివరము లారాగిరేకులందు లేకుండుట కొంతగొఱఁతయే గొల్పుచున్నది. అయినను ఆలోపము ఇతర సాధనముల మూలమున తీరుచునే యున్నది. చిన్నన్న వ్రాసిన అన్నమాచార్య చరిత్ర మూలమున 'చక్కని గ్రహము లుచ్చమున మూఁడలర, అనుపమలగ్నంబునందు వైశాఖమున విశాఖను జగంబున నుల్లసిల్ల, జనియించె నన్నమాచార్యుఁడు-' అని యున్నది. వైశాఖమాసమున విశాఖానక్షత్రమున అన్నమయ్యగారి జన్మనక్షత్రోత్సవ కైంకర్యము జరుపఁబడుచుండినట్లు తిరుపతి శాసనములందున్నది [1] వీనిని పరిశీలించి క్రీ॥1424 క్రోధి వైశాఖమాసమున విశాఖానక్షత్రమున అన్నమయ్య జన్మించినాఁడనవచ్చును. క్రోధి వైశాఖబహుళ పాడ్యమి విదియలలో విశాఖానక్షత్ర ముండుటచేత అందేదేని యీతని జన్మదివసమైయుండ వచ్చునని తలఁపనగును.[2] నిర్యాణము క్రీ॥ 1503 దుందుభి నామ వత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశినాఁడు కావున నీతఁడు 79 యేండ్లు జీవించినాఁడు సాళ్వనరసింహరాయనియు, తత్పుత్రుఁడు ఇమ్మడి నరసింహరాయనియు కాలమున వర్తిల్లినవాఁడు.

---

1 Ref No 71 of 10 5 dated 1546 A.D

2 కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠకలో "వైశాఖ మాసమున విశాఖా నక్షత్రము ప్రాయికముగా పూర్ణిమాతిథికి వచ్చును. కనుక వైశాఖ పూర్ణిమ జన్మతిథిగాఁ గూడ నిర్ణయింప వచ్చును.' అని వ్రాసినారు. సాధారణముగా పూర్ణిమాతిథియగు చుండుటచేత దేవస్థానము వారిచే అన్నమాచార్యోత్సవముల నిర్వహింపఁజేయు నుద్దేశముతో కొండ గుర్తుగా వైశాఖ పూర్ణిమ జన్మతిథిగాఁగూడ నిర్ణయింపవచ్చునని వారు వ్రాసిరి. అంతే కాని ఈ పూర్ణిమా ప్రసక్తి తాళ్ళపాక వారి రచనలలో కానరాలేదు. కావున దీనినిబట్టి క్రోధి వైశాఖమున విశాఖానక్షత్రము పూర్ణిమనాడులేదు కావున నది జన్మదివసము కాఁజాలదని శ్రీ శేషయ్య గారనుకొనుట సరికాదు.

## నరసింగన్న (క్రీ.శ. 1454-1546)

ఈతఁడు తాళ్ళపాక అన్నమాచార్యునకును పెద్దభార్యయగు తిరుమలాంబకును జన్మించినవాఁడు. అన్నమాచార్యునిఁగూర్చి వ్రాయు సందర్భమున పేర్కొన్నట్లు ఈ నరసింగన్న క్రీ॥శ॥ 1454 ప్రాంతమున జన్మించియుండు ననవచ్చును. 'అరయఁ దిమ్మాంబకు నాత్మసంభవుఁడు ! పాడఁ, జెప్పఁగ వర్ణపద్ధతి నీడు, జోడులేఁడని సభ సొచ్చి వాదించి, పరఁగిన ధీశాలి ప్రతివాదిదైత్య నరసింహుఁడనఁగల్గె నరసింహగురుఁడు' అని అష్టమహిషీకళ్యాణకర్త చిన్నన్న చెప్పుటను బట్టి ఈతఁడు ప్రఖ్యాతుఁడగు కవీశ్వరుడనియు, సంగీతజ్ఞుఁడనియు తెలియనగుచున్నదే కాని దేవస్థానము శాసనములలోఁ గాని, తాళ్లపాక వారి యిండ్లలోఁ గాని, లోకమునఁ గాని యీతని విషయమేదియు గానరాకున్నది. చిన్నన్నయే క్రీ॥ 1546 కొండవీటి సీమలోని చెందలూరు మల్లవర గ్రామములను స్వామి కైంకర్యములకై సమర్పించుచు నందు మాఘశుద్ధ చతుర్థీతిథి తన పెద తండ్రిగారయిన నరసయ్యంగారి ప్రత్యాబ్దిక దినముగా పేర్కొనినాఁడు. దీనినిబట్టి నరసింగన్న క్రీ॥శ॥ 1546 నాఁటికి పూర్వమే దివ్యధామముఁ బడసెనని తలఁపనగుచున్నది.

## పెద తిరుమలాచార్యుఁడు (క్రీ.శ. 1458-1554)

అన్నమాచార్యుని చిన్న భార్యయగు అక్కలాంబయం దీతఁడు జన్మించెను. ఈతనికి నరసమ్మ, తిరుమలమ్మ యని యిర్వురు చెలియండ్రునుఁ గలరు. క్రీ॥శ॥ 1503 వరకును జీవించిన అన్నమాచార్యుఁడు ఈ పెద తిరుమలయ్యగారి కుమారుఁడగు చిన తిరుమలాచార్యునకు బ్రహ్మోపదేశము చేసినాఁడను నంశమునుబట్టి చిన తిరుమలయ్య జననము క్రీ॥ 1488-90 ప్రాంతమగు ననియు, అప్పటికి పెద తిరుమలయ్యగారి వయసు 30 ఏండ్లనుకొనినను-ఆతని జననము క్రీ॥శ॥ 1458-60 ప్రాంతము కాదగుననియు అన్నమాచార్యుని కాలనిర్ణయము చేయు సందర్భమున వివరించినాను. తాళ్ల పాకవారి శాసనములలో చైత్రమాసము, మృగశిరానక్షత్రమున

వీతని జన్మ నక్షత్ర సందర్భమున కైంకర్యము జరుపఁబడుచుండినట్లు తెలియుచున్నది.[1] అప్పటికాతఁడు జీవించియే యున్నాడు. అట్లే మఱల క్రీ॥ శ॥ 1558 లో చిన్నన్న వేయించిన మఱియొక శాసనమున[2] నాతఁడు తన తండ్రిగారి జన్మ నక్షత్రోత్సవసందర్భమునుఁ బురస్కరించుకొని పూర్వము నుండియు జరగుచుండినవి కాక మఱి కొన్ని విశేష కైంకర్యములను జరపించుటకేర్పాటు చేసినట్లు కలదు. అప్పటికి పెద తిరుమలయ్య జీవించి యుండెనో లేదో మన కెరుగ రాదు కాని యప్పుడు జరిగిన విశేష కైంకర్యములను బట్టియు, చైత్ర మృగశీర్ష మొక్క యుత్సవముగా జరుగుటను బట్టియు, నది యాతని నూరవ జన్మవత్సరోత్సవమై యుండునేమోయని నేను భావించుచున్నాను. ఈయూహ సరియగు నేని పెద తిరుమలాచార్యుని జననము సరిగా వెనుకఁదలఁచినట్లు క్రీ॥ 1458 కాఁదగును.[3] నాఁటి నుండి యాతఁడు క్రీ॥ శ॥ 1554 వరకును జీవించి యున్నట్లు

1. తి. తి. దే. శా. సం. 5. నెం. 71 క్రీ. శ. 1546.

2. తి. తి. దే. శా. సం. 5. నెం. 159 క్రీ. శ. 1558

3 కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో నీ పెద తిరుమలయ్య జీవితకాలమును గూర్చి వ్రాయుచు 1500 ప్రాంతముల జన్మించిన చిన తిరుమలయ్య తండ్రి యప్పటి కిర్వదేండ్లవాఁడే యనుకొన్నను 1478 ప్రాంతముల జన్మించిన వాఁడగును. ఈతని నిండు యౌవనము శ్రీకృష్ణరాయల వారి కాలమున గడచినది (చూ.పు. 84) అని వ్రాసి యున్నారు. పెద తిరుమలయ్య గారి సంకీర్తనములను చదివి నపుడును ఆతని శాసనములను బరిశీలించినపుడును కృష్ణరాయల కాలమునకే ఆతఁడు పండబారిన జీవితానుభవము నొంది లౌకిక దృష్టి వీడికొని మానసికముగా వ్యభిచారము లేనివాఁడై యుండినట్లు తోచును. అదియునుఁగాక 1490-93 ప్రాంతములలో చిన తిరుమలయ్య జన్మించె ననుకొన్నప్పుడు పెద తిరుమలాచార్యుని జననము 1458-60 ప్రాంతముఁగుటయే సమంజసమని నేను భావించుచున్నాను.

శాసనాధారమున్నది [1] కావున నీతఁడించుమించు తొంబదియేండ్లు జీవించి నృసింహరాయ కృష్ణరాయ అచ్యుతరాయాదుల పరిపాలనము లను జూచియుండును. జీవితమున పండబారిన యనుభవముఁతో గూడిన నడివయస్సు కృష్ణరాయల కాలమునఁ గడపియుండును.

## చిన తిరుమలాచార్యుఁడు (1488 - 1562)

ఈతఁడు పెదతిరుమలాచార్యునకును, భార్య తిరుమలాంబ కును 'పంచకల్పతరువులవోలె' నుదయించిన అయిదుగురు తనయు లలో పెద్దవాఁడు. చారుతర అష్టభాషా చక్రవర్తి. ఈ చిన తిరుమ లయ్యకు తాతగారు ఉపనయనము గావించినట్లు తెలియ వచ్చిన యాధారమును బట్టి యీతఁడు క్రీ॥ శ॥ 1488-90 ప్రాంతముల జన్మించినాఁడనుకొన వచ్చునని అన్నమాచార్యుని కాలమును గూర్చి వ్రాయు సందర్భమున వివరించితిని. ఈతని శాసనములు 1540, 1547 సంవత్సరములలో విరివిగా నుండి తదుపరి 1553, 1562 ప్రాంతము లందు కూడ నున్నవి. ఈతఁడును తండ్రియగు పెదతిరుమలాచార్యుఁ డును కలిసి కంజీవరమున వేయించిన శాసనమును బట్టియు, చిన తిరుమలార్యుని మంగళగిరి శాసనమును బట్టియు,[2] నీ విషయము తెలియనగును. కావున చిన తిరుమలయ్య 1558 తరువాత కొంత కాలము వరకును కూడా జీవించి యుండును. కృష్ణరాయ, అచ్యుత రాయ, సదాశివరాయాదుల పరిపాలనా కాలమున ప్రశస్తి వహించి తండ్రి తాతల మార్గము ననుసరించి, యీతఁడు రచనావ్యాసంగమును నిర్వహించి యుండును.

---

1. పరీధావి నామ సంవత్సరము క్రీ॥శ॥ 1553 లో చిన కంజీవర మున పెద, చిన తిరుమలాచార్యులు కలసి కొన్ని కైంకర్యములు జరపినట్లు శాసనమున్నది. చూ. T.T.D Epi Report page 291 క్రీ॥శ॥ 1554 లో ఉదయగిరిలోని రాజప్రతినిధియగు రామభట్లయ్యచేత కడపజిల్లా నందలూరి యాలయమున కతఁడు అందుపూరు అగ్రహారము యథాపూర్వము చెందు నట్లు చేయించినాఁడు.

2. చూ. తి. తి. దే: Epi Report page 291 మరియు S.I.I Vol 4-710.

## చిన్నన్న (1500–1558)

పెద తిరుమలాచార్యుని తనయు లైదుగురిలో నీతఁడు నాల్గవ వాఁడు. చిన తిరుమలయ్య క్రీ॥ శ॥ 1468-90 ప్రాంతముల జన్మించి, యుండు ననుకొనుటచేత నాతనికి మూఁడవ తమ్ముఁడగు చిన్నన్న జననము క్రీ॥ శ॥ 1500 ప్రాంతమయియుండవచ్చును. కృష్ణదేవరాయల రాజ్యాంతకాలమున కీతఁడు ముప్పదియేండ్లవాఁడయి యుండును. అచ్యుత సదాశివరాయాదుల కాలమున నీతఁడు గొప్ప రచయితగా ప్రఖ్యాతిగాంచి వారిచే ఘనముగా సన్మానితుఁడాయెను.[1] ఆ ప్రభువులు తమ కిచ్చిన యగ్రహారాదికములను మరల స్వామికే యర్పించుకొని ధన్యజీవితము గడిపెను. ఈతఁడే కాదితని సోదరులు నిట్లే యాప్రభువుల చేత సన్మానితులై యా సన్మానములనెల్ల స్వామికే తిరుగ నర్పించుకొనిరి[2] చిన్నన్న శాసనములు తిరుపతిలో మనకు క్రీ॥ శ॥ 1558 వరకు కాననగుచున్నవి.[3]

ఈతని కగ్రజుఁడగు పెద తిరువేంగళనాథుఁడు క్రీ. శ. 1546 నకుఁ బూర్వమే దివ్యధామమందినాఁడు[4] అవరజుఁడగు కోనేటి తిరువేంగళనాథుఁడు క్రీ॥ శ॥ 1560 తరువాతఁ గూడ నున్నట్లు శాసనములను బట్టి తెలియుచున్నది.

---

1. నెల్లూరి శాసనములు నెం. 21 శాసనమునను సరించి సదాశివ రాయఁడీతనికి అద్దంకి సీమయందలి మల్లవర గ్రామమును క్రీ. శ 1545 లో దానముచేసినట్లు తెలియుచున్నది. దానినే ఈతఁడు మరుసటి సంవత్సరము క్రీ. శ. 1546 లో వేంకటేశ్వరస్వామివారి కర్పించుకొనెను. (తి.తి.దే.శా.. సం. 5-71).

2. క్రీ॥ శ॥ 1546లో సదాశివరాయల నుండి కావచ్చును వినుకొండ సీమలోని మిన్నకల్లు గ్రామమును చిన తిరుమలాచార్యుని తమ్ముఁడును, చిన్నన్న కగ్రజుఁడును నగు అన్నయ్య ధారా పూర్వకముగాఁ బడసినట్లు తెలియుచున్నది. ఇట్లే చిన్నన్నకు తమ్ముఁడగు కోనేటి తిరువేంగళనాథుఁడు, అద్దంకి సీమలోని ఓలిపల్లి బొల్లాపల్లి గ్రామములను సదాశివ మహారాయని చేత క్రీ॥ శ॥ 1544-1545 సం॥ లలో ధారాపూర్వకముగాఁ బడసెను.

3. చూ. తి.తి.దే శా సం. 5-159.

4. తి.తి.దే.శా.సం. 5-71 క్రీ. శ. 1546.

## తిరువేంగళప్ప (1515 – 1565)

ఈతఁడు చినతిరుమలాచార్యునకును పెదమంగమ్మకును జన్మించినాఁడు. క్రీ॥ శ॥ 1553, 1554 సంవత్సరములలో నీతని దానాదికమును తెలుపు శాసనములు కొన్నియున్నవి.[1] ఈతఁడును కోనేటి తిరువేంగళనాథులును సమకాలికులై క్రీ. శ. 1560, 1565 ప్రాంతముల వరకును వర్తిల్లి యుందురు. పితృపాదులు శ్రీ ప్రభాకర శాస్త్రి గారు అన్నమాచార్యచరిత్ర పీఠికలో వ్రాసినట్లు 'తాళికోట యుద్ధమును, విద్యానగర వినాశనమును జూచు దౌర్భాగ్యమునకుఁ బాల్పడక 1565 కుఁబూర్వమే వీరందరును దివ్యధామము వడసి యుందు'రన వచ్చును.

పై పరిశీలనమున తాళ్ళపాక వంశమువారును వారి దగ్గరి బందుగులును ఒక సంస్థగా పనిచేసి క్రీ. శ. 1424 మొదలుకొని దాదాపు 1565 వరకును దీక్షతో మత సాహిత్యములకు సేవచేసినట్లు తెలియనగుచున్నది.

## తాళ్ళపాకవారు – తిరుపతి

వీరి జన్మస్థానము నేఁటి కడపజిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామమైనప్పటికిని ఈకుటుంబికులు 15, 16 శతాబ్దులలో తిరుపతిలో స్థిరనివాస మేర్పరచుకొని అక్కడే కాలము గడిపినట్లు పూర్వము వ్రాసితిని. స్మార్త బ్రాహ్మణులైనప్పటికిని ఆదివన్ శఠగోపయతుల శిష్యులై మతము పుచ్చుకొని వీరు వైష్ణవులైనారు. వైష్ణవ మతమునకును, వేంకటాచల క్షేత్రమునకును, ఎనలేని రీతిని కైంకర్యమొనర్చి ధన్యజీవనులైనారు. ఆలయ సంకీర్తనాచార్యులై పరమపదనివాసుని భక్తి శ్రద్ధలతో నర్చించినయట్టి తాళ్ళపాకవారిలో కొందరి శాసనములు మాత్రమే నేఁడు మనకు లభ్యములగు చున్నవి. ఈ వంశ విఖ్యాతికి మూలపురుషుఁడగు అన్నమాచార్యుని కుమారుఁడు

1. చూ. పుట. 294. తి తి.దే Epi. Report.
చూ. తి.తి దే.శా. సం. 5-No 158 క్రీ. శ. 1554.

పెదతిరుమలాచార్యుని యొక్కయు, తద్వంశీకులు చిన తిరుమలాచార్య తిరువేంగళనాధాదులయు శాసనములు దాదాపు పాతిక వరకు తిరుపతిలో నున్నవి. ఇక తాళ్ళపాకవారి ప్రస్తావన గల శాసనములు విజయనగర రాజుల కాలమునకు చెందినవిమఱికొన్ని యున్నవి. దీనిని బట్టి విజయనగర రాజుల కాలమున తాళ్ళపాకవారెట్టి ప్రాభవమున వర్తిల్లిరో, స్వామివారి కెన్నివిధముల కైంకర్యమొనర్చిరో తెలియ నగును.

వీరు కొన్ని కొన్ని గ్రామములను, కొంత సొమ్మును శ్రీ భండారమున కనేక సందర్భములలో సమర్పించి, తన్మూలమున వివిధ కైంకర్యముల కేర్పాటులు గావించిరి. కొన్ని నూతన నిర్మాణములను గావించిరి. కొన్నిటిని పునరుద్ధరించిరి. కొన్ని నూతనోత్సవముల నారంభించిరి. సంకీర్తనవాఙ్మ్యజలతో స్వామి నర్చించి సంకీర్తన భండారము నొకదానిని నెలకొల్పిరి. ఆ వ్యవస్థ నిర్విఘ్నముగా సాగుటకై తగిన జాగ్రత్త వహించిరి. ఆత్మశుద్ధితో, భక్తిశ్రద్ధలతో వర్తిల్లి ఆచార్య పురుషులై శిష్యులను, అనుయాయులనుఁ గూర్చుకొని సుప్రసిద్ధులగు వారి సమకాలికుల కెందరికో మార్గదర్శకులై మనిరి. వీరు సాళువ నరసింగరాయని కాలమున అనఁగా పదునైదవ శతాబ్ది మధ్య భాగము నుఁడియు, తిరుపతిలో ప్రసిద్ధులై యుండినప్పటికిని వీరి శాసనములు పదునారవ శతాబ్ది ప్రారంభము నుండి మాత్రమే కానవచ్చుచున్నవి. తిరుపతిలో లభించిన వానిలో వీరి తొలి శాసనము పెదతిరుమలాచార్యునిది. కృష్ణరాయల కాలమునాఁటిది క్రీ. శ. 1517 నవంబరు 30 వ తేదీన వేయించినది. ఇఁక చివరిది తిరు వేంగళ నాధునిది. సదాశివరాయలకాలము నాటిది. (క్రీ. శ. 1558 జనవరి 13 వ తేదీ వేయిఁచినది.) ఆ నడుమ ఈ వంశమువారు వేయిఁచిన శాసనములు ఇరువది నాల్గు లభిఁచుచున్నవి. వానిలో వీరు స్వామి కర్పించిన గ్రామములు 23 వరకు నున్నట్లు తెలియుచున్నది.

వివరము లివి:—

1) రాయల్పాడు—అవుకుసీమ (నేఁటి కోయిలకుంట తాలూకా కర్నూలు జిల్లా)

2) సోమయాజుల పల్లె — కాలవాయ్ సీమలోని ముద్దులూరు గ్రామముతో చేరినది.
3) గడ్డము (కత్తము) వారిపల్లె — తూపూర్ కంచిగుంట సీమ.
4) తిప్పనపల్లి — తూపూర్ కంచిగుంటసీమ, సిద్ధపటం, ప్రొద్దుటూరు తాలూకాలు - కడప జిల్లా.
5) ఎట్టిగుంటాయ పల్లె — సిరివోలుసీమ (సగము గ్రామము మాత్రమే)
6) పూండి
7) సంగమ కోట } మేర్తై సీమ
8) మరువాకర్తై
9) కావనూరు
10) వల్లిపురం — కంచిగుంటసీమ
11) కుప్పం
12) కీలంగుణ్రం } కావనూరు సమీప గ్రామములు.
13) ముత్యాలపట్టు
14) గండమ తిమ్మాపురం — కారియపల్లివద్ద
15) నేడియం (సగము గ్రామము మాత్రమే)
16) వేదుమపాకం — మాదనల్లూరిసీమ
17) పున్నియం — నగరిసీమ
18) చెందలూరు — కొండవీటి సీమ
19) మల్లవరం
20) దేవరాయపల్లి — వినుకొండసీమ.
21) తూప్పిల్ అగ్రహారము. (20 వృత్తులు మాత్రమే)
22) అంబత్తూరు — నగరిసీమ
23) కొత్తూరు — పెరింబాక రాజ్యము,
24) అలర్ మేల్మంగాపురము — చంద్రగిరి రాజ్యము.

వీనిలో పూండి, సంగమకోట గ్రామములు విజయనగర చక్రవర్తియగు అచ్యుత దేవరాయలు 1532 నకుఁ బూర్వ మెన్నఁడో తాళ్లపాక పెదతిరుమలాచార్యునకు రాగి శాసనము వేయించి ధారాదత్తము చేసినవి. ఆ గ్రామముల నాతఁడు 1532 మార్చి 27వ తేదీ తిరువేంగళనాథున కర్పించుకొని ప్రతి దినమును అళగప్పిరానార్ తిరుమంజన మప్పుడు 40 తిరుపొణకములు, 3 యజ్ఞోపవీతములు, శుక్రవారము సంకీర్తనముల సమయమున ఒక పన్నీరుబుడ్డి సమర్పితములగునట్లేర్పాటు గావించెను.[1] అట్లే తూవూర్ కంచి గుంటసీమలోని పళ్లిపురం గ్రామమును బుక్కరాజు తిమ్మరాజువద్ద కొని పెదతిరుమలయ్య స్వామి కర్పించెను. దానిమీఁద వచ్చు 133 వరహాల ఆదాయముతో నిత్యము గోధుమ పణ్యారము స్వామికి సమర్పితమగునట్లు విధించెను.[2] ముత్యాల పట్టు గ్రామముకూడ పూర్వమెన్నడో విజయనగర చక్రవర్తులచేతనే దానమీయఁబడిన గ్రామముగా తోచును. దానిని పెదతిరుమలయ్య స్వామివారి కర్పించి ఆ గ్రామము మీఁద వచ్చుచుండిన 280 బంగారు రేఖల ఆదాయముతో తమ పేర కొన్ని విశేషోత్సవములు జరుగునట్లేర్పరచియుండెను. కాని అచ్యుత దేవరాయల యనంతరము సదాశివరాయలు రాజ్యమునకు వచ్చులోపుగా రాజ్యప్రాప్తికై సాగిన సమరము కారణముననో మరేకారణముననో ఆ గ్రామముమీఁది ఆదాయము శ్రీభండారమునకు చెందకుండ నాగిపోవుపరిస్థితులు కలిగినవి. శ్రీ భండారమునిర్వాహమువారు ఆవిషయమును దాతయగు పెదతిరుమలార్యునకు విన్నవింపఁగా నాతఁడు ప్రభువులగు సదాశివరాయలకును, వ్యవహారజ్ఞుఁడగు అళియరామరాయలకును విన్నపము పంపుకొని క్రీ॥ శ॥ 1545లో ఆ గ్రామముమీఁది యాదాయము యథావిధిగా శ్రీభండారమునకు చెందునట్లుగా అనుమతి పత్రములను పొందెను. ఆ నడుమ కాలమున స్వామివారికి తమ పేర జరగు కైంకర్యము లాగిపోకుండుటకై 100 రేఖలు వెచ్చించి అచటి తటాకమును బాగుచేయించి

1 తి.తి.దే. శా. సం. 4-14.

2. తి.తి.దే. శా. సం. 4-122.

మలల స్వామి కర్పించుచు తాను 36 రేఖలను, తనశిష్యుఁడు శ్రీపతి తొండయ్య 70 రేఖలను వెరసి 106 రేఖల సొమ్ము నదనముగా నర్పించి పూర్వము జరగుచుండిన వానితోఁబాటు మఱికొన్ని యుభయ్యములుకూడ నిర్వహింపఁబడునట్లు 1545 జూలై 3వ తేది పెదతిరుమలయ్య ఏర్పాటులు గావించెను[1].

విజయనగర రాజులు వీరికి సర్వమాన్యముగా సమర్పించిన అలర్ మేల్మంగాపురమును అచటి కళ్యాణవేంకటేశ్వరాలయ పున రుద్ధారముతో నొక పుణ్యక్షేత్రముగనే మార్చివేసిరి. ఆ యూరి మీఁది యాదాయముతో వేంకటేశ్వరులయు, పరమాచార్యులయు, పన్నిద్ద రాళ్వారులయు నుత్సవములను చినతిరుమలాచార్యాదులు నిర్వహింపఁజేసిరి.[2]

పై గ్రామములవలెనే మిగిలిన గ్రామములుకూడ పరమభక్తాగ్రేస రులును, హరికీర్తనాచార్యులును నగు తాళ్లపాకవారికి విజయనగర సామ్రాట్టులే దానమిచ్చినవై యుండును. కాక వీరు స్వయముగా ధనమిచ్చి కొన్న గ్రామములుకూడ కొన్ని యిందుండిన నుండ వచ్చును. ఏమైనను తమ ప్రతిభావిశేషములకు మెచ్చి ప్రభువులు ప్రభుత్వోద్యోగులు సమర్పించిన కానుకలనెల్ల వీరు తిరుమల స్వామికే యర్పించుకొని యాదేవుని సేవలోనే తమజీవితములను వెళ్లబుచ్చిరి. తిరుమల తిరుపతులలో వీరుకావించిన నూతన నిర్మాణ ములు బహుళముగా నున్నవి. కొండమీఁద సంకీర్తన భండారము ముందుగా చెప్పఁదగినది. తరువాత స్వామివారి యాలయములోను తమయింటిముందును తాళ్లపాకవారు రెండుమంటపములను గట్టించిరి. ఆమంటపములలో నుత్సవమూర్తికి బ్రహ్మోత్సవసమయములందు ఉంజల్ సేవలు నైవేద్యములు జరుగుచుండినవి.[3] వీరే స్వామి

1. తి తి. దే.శా సం 5 No. 47

2. తి తి దే శా.సం. 4-144

3 No. 6 and 100 Vol IV పెద తిరుమలాచార్యుని కైంకర్యము

పుష్కరిణి నడుమనున్న నీరాళిమంటపము నుద్ధరించి చుట్టును ప్రదక్షిణ మంటపములు గట్టించి పరిసరములను బాగుపరచిరి.[1] పుష్కరిణి గట్టుననే వారొక రాతిదీప స్తంభమును నిలఁబెట్టిరి. ప్రతి గురువారము అందు దీపమును వెలిగించుటకై జీతగాండ్లను నియోగించిరి. ముక్కోటి ద్వాదశినాఁడు ముప్పదిరెండు దీపములను పుష్కరిణి గట్టున వెలిగించుటకై కూడ ఏర్పాటులు కావించిరి.[2] కొండమీఁదనే కార్తికమాసమున వనభోజనానంతర ముత్సవమూర్తి యాలయము నకు వచ్చునపుడు పూజా నైవేద్యము లందుకొనుటకై యాగుట కొలకు శ్రీభండార నిర్వాహకులు పండ్రెండుగురిపేరిట పండ్రెండు మంటపములను వీరుకట్టించిరి.[3] ఇట్లే తిరుపతి సమీపగ్రామమగు తిరువేంకట పురమునను అచ్యుతరాయ పెరుమాళ్ లేట ఉత్సవము సందర్భమున నుండుటకై యొక మంటపమును గట్టించిరి. ఈ మంట పమునందే ఒక స్తంభమున రఘునాధుని విగ్రహమునుఁ జెక్కించిరి. తరువాత కాలమున నీవిగ్రహమునకుగూడ పూజానైవేద్యములు సాగి నవి.[4] ఇట్లే మన్నసముద్రం గ్రామమువద్ద నొక పొంగల్ మంట పమును, ఆళ్వారు తీర్థమున తీర్థవారి మంటపమును నిర్మించిరి.[5] కొండ మీఁద వరాహస్వామివారి యాలయ ప్రాకారములను వీరే కట్టించిరి. తూర్పుదిక్కునందొక గోపురమునుకూడ స్వామివారికి వీరుకట్టించిరి.[6] ఈ నిర్మాణములేకాక వీరు కొన్ని నూతనాలయములను గట్టించిరి విగ్రహప్రతిష్ఠాపనములనుకూడ కావించిరి.

---

1. తి తి. దే.శా.సం 4. సంఖ్య. 14 పెదతిరుమలాచార్యుని కైంకర్యము.
2. తి.తి.దే.శా.సం. 4.సంఖ్య. 129 పెదతిరుమలాచార్యుని కైంకర్యము
3. తి. తి దే శా. సం 5 సంఖ్య 47A పెద తిరుమలాచార్యుని కైఁకర్యము.
4. తి. తి. దే. శా. సం. 5 సంఖ్య 99. చిన తిరుమలాచార్యుని కైఁకర్యము
5. తి. తి దే శా. సం. 4 - సంఖ్య 100 and Vol V No. 68 పెద తిరుమలాచార్యుని కైంకర్యము
6. తి. తి. దే శా. సం. 4 - సంఖ్య 14 పెదతిరుమలాచార్యుని కైంకర్యము.

క్రీ॥ శ॥ 1540 మార్చి 22వ తేది చంద్రగిరి సమీపమందలి అలర్ మేల్మంగాపురమునను కళ్యాణవేంకటేశ్వరుల విగ్రహముతోఁబాటు నాచ్చియార్, అనంత గరుడ విష్వక్సేనాదులను పన్నిద్దరాళ్వారులను, ఉడయవరులను, పూర్వాచార్యులను, తమ ఆచార్యులైన తాళ్లపాక అన్నమాచార్యులనుఁగూడ ప్రతిష్ఠాపించిరి.[1] విజయనగర రాజులు తమకు సర్వమాన్యముగా సమర్పించిన యాయగ్రహారముమీఁది యాదాయముతో నక్కడి యుత్సవ విశేషములు నిర్విఘ్నముగా నిర్వహింపఁ బడునట్లు వీరు తగినయేర్పాటులను గావించిరి. ఇట్లే వీరు తిరుపతిలోని ఆళ్వార్ తీర్థమున లక్ష్మీ నారాయణ పెరుమాళ్‌ను, గోవిందపుష్కరిణి గట్టున చక్రత్తాళ్వారుల (సుదర్శన చక్రము)ను, కటారి హనుమాలయములో నరసింగ దేవుని ప్రతిష్ఠాపించి నిత్యనైమిత్తిక పూజావిశేషములు మాసోత్సవ వర్షోత్సవములు నిరంతరాయముగ జరుగుటకై వీరు వసతులు గల్పించిరి.[2] ఆళ్వార్ తీర్థసమీపమందలి పెద్ద చీముగు కొండపై శ్రీనివాసునియు, పెరియాళ్వారులయు విగ్రహములను ప్రతిష్ఠాపించి ధూప దీపనైవేద్యాదుల నేర్పరచి అధ్యయనోత్సవము పండ్రెండు దినములు జరుగునట్లు వసతులు గల్పించిరి [3]

ఇట్లు తాళ్లపాకవారు నూతనాలయములను నిర్మించి నూతన క్షేత్రములను వెలయింపఁజేయుటయే కాక ఆయాదైవతములకును, తమకుఁ బూర్వము పలువురు ప్రతిష్ఠాపించిన దైవతములకును విశేషముగా మాసోత్సవవర్షోత్సవములు నిర్విఘ్నముగా కలకాలము సాగునట్లుకూడ వసతులు కల్పించిరి. పూర్వమునుండియు జరుగుచుండిన

1. తి. తి. దే. శా. సం. 4 - సంఖ్య 144 చినతిరుమలాచార్యుని కైంకర్యము.

2. తి.తి.దే శా సం. V సం. 68 పెదతిరుమలయ్య-Vol 5-159 తిరువెంగళనాథయ్య Vol 5-99 చినతిరుమలయ్య—

3. No. 158 of Vol V dated 19th Feb. 1554 తాళ్ళపాక తిరువేంగళ నాథయ్య తన తల్లి పెద్దమంగమ్మ గారి పుణ్యమునకై యీ పెద్ద చీముగుకొండ దేవునకు తిరుపొంగము లేర్పరచెను.

యుత్సవములను కనులపండువుగా చేయుటయేకాక విశేషించి వారు కూడ కొన్ని నూతనోత్సవములను ప్రారంభించిరి.

**ఉత్సవములు:-** తిరుపతిలోను, కొండమీదను తాళ్లపాకవారు నూతనముగా ప్రారంభించిన యుత్సవములలో ముఖ్యముగా పేర్కొనఁదగినవి వైవాహికోత్సవము, ఉట్ల ఉత్సవము, వనభోజనోత్సవము అనునవి. ఇవికాక పూర్వమునుండియు సాగుచుండిన బ్రహ్మోత్సవములు, అధ్యయనోత్సవములు, వసంతోత్సవ గ్రీష్మోత్సవములు, డోలామహోత్సవము మున్నగునవి వీరికాలమున తగినశ్రద్ధవహించిన కారణమున మఱింత వైభవముగా జరిగినవి.

*వైవాహికోత్సవము* :— దీనినే పెండ్లి తిరునాళ్ అనియు నందురు. ఇది చైత్ర ఫంగుణి మాసమునం దయిదు రోజులు జరుగు స్వామివారి వివాహ మహోత్సవము. తిరుపతి శాసనములను బట్టి యీ యుత్సవమును తాళ్లపాకవారే ప్రారంభించినట్లు తెలియుచున్నది. క్రీ॥శ॥ 1546లో కొండమీఁద తాళ్లపాక తిరువేంగళనాథయ్య శ్రీనివాసునకును[1] తిరుపతిలో చిన తిరుమలయ్య క్రీ॥శ॥ 1547లో గోవిందరాజునకును[2] మఱల క్రీ॥శ॥ 1554,1558 సంవత్సరములలో తిరువెంగళనాథయ్య కొండమీఁదను[3] ఈయుత్సవములను వైభవముగా జరపించినట్లు శాసనములున్నవి. క్రీ॥శ॥ 1554 ఫిబ్రవరి 19వ తేదీ తాళ్లపాక తిరువేంగళనాథయ్య వేయించిన శాసనములలో నాతఁడే యీయుత్సవముల నారంభించినట్లు పేర్కొనఁబడినది.[4] దీనినిఁబట్టి తాళ్లపాక తిరువేంగళనాథుఁడే స్వామివారి వైవాహికోత్సవమును 1546నకు పూర్వమెన్నఁడో ప్రారంభించినట్లు తెలియనగును.[5] తరువాత మన చిన తిరుమలాచార్యాదు లీయుత్సవమును

---

1. తి.తి.దే.శా.సం. 5 సంఖ్య 71.
2. తి.తి.దే.శా.సం. 5 సంఖ్య 99.
3. తి.తి.దే.శా.సం. 5 సంఖ్య 153, 159.
4. తి.తి.దే.శా.సం. 5 సంఖ్య 158.
5. క్రి. శ. 1586 లో వేయఁబడిన No. 69 of Vol IVను బట్టి

గోవిందరాజస్వామివారికిని జరిపించి యుందురు. ఈ యుత్సవ మయిదు రోజులలోను క్రమముగా చేయఁబడు విశేష కార్యక్రమములును వానికై వలయు సంభారములును సవివరముగా పైన పేర్కొనఁబడిన శాసనములు వెల్లడించుచున్నవి. తొలిరోజు అంకురార్పణమైన పిదప అనుగ్రహమునకై సోమ బ్రహ్మమూర్తులకు నైవేద్యములర్పించుట, విన్నపము సేయువారు దేవతల యనుమతి నర్థించుట, పాలతో పాదాభిషేక మొనరించుట, దండలమార్పు, (ఎదుర్కోలు) హంసచాతక వాహనముపై నూరేగింపు, పంచవర్ణ పీఠముపై నుండగా కర్పూర హారతులిచ్చుట, పట్టుబట్టలు మధుపర్కము సమర్పించుట, హోమము, చందనాభిషేకము, మున్నగునవి శాస్త్రోక్తముగా జరగును. రెండవదినమున చందనవసంతోత్సవము, వసంత తిరుమంజనము, శేషవాహనముపై నూరేగింపు. మూఁడవ దినమున యథావిధిని హోమము,- ఆస్థానము-రాత్రివూట వైకుంఠ విమానమున నూరేగింపు. నాల్గవ దినమున హోమము, సుమంగళులకు చందన తాంబూలాదులు సమర్పించుట, హనుమంత వాహనము. అయిదవ దినమున మఱికొన్ని విధులు- హంసవాహనము, ఏనుఁగు వాహనము,- ఈ రీతిని వివాహ మయిదు దినములకగు వ్యయమును వీరే భరించిరి. మేల్నాయకమువారికి, విన్నపము సేయువారికి, నంబులకు, అనుసంధానము సేయువారికి, తిరువేంకటాచలమాహాత్మ్య పఠితలకు, పెండ్లి మంటపము నలంకరించువారికి, సుమంగలులకు, కట్నములు మోయువారికి జీతములు వస్త్ర ధనరూపముల నర్పించుచుండిరి. ఈ విధమున తాళ్లపాకవారే పెండ్లిపెద్దలై స్వామివారికి అయిదు రోజుల పెండ్లి ఘనముగా జరిపించుచుండిరి. ఈ అయిదు దినములందును ఊరేగింపులలో వీరి యిండ్లముందు మనోహారపడులు సమర్పితములగు చుండెడివి. కొండమీఁదను క్రిందను జరుగు నీయుత్స

---

స్వామి వారి తిరుకళ్యాణము ఆ దినములలో కూడ జరుగుచుండినట్లు తెలియనగును. బ్రహ్మోత్సవ సమయములలో జరుగుచుండిన ఆ తిరుకళ్యాణమే క్రమమున తరువాతి కాలమున ప్రత్యేకమగు నీ యుత్సవముగా రూపొంది యుండవచ్చును.

వములకై తాళ్లపాకవారు చెందలూరు మల్లవరము నేడియము మున్నగు గ్రామములను శ్రీ భండారమున కర్పించిరి.[1] ఒక తూరి కారణాంతరమున మల్లవర గ్రామమునుండి శ్రీ భండారమునకు చెందుచుండిన యాదాయము నాపి తిరువేంగళనాథయ్య తత్స్థానమున నాదాయ మధికముగా వచ్చు దేవరాయపల్లియను మఱియొక గ్రామ మును సమర్పించి యుత్సవము మఱింత వైభవముగా జరుగునట్లు నియోగించెను.[2] ఈ యుత్సవమును వీరే ప్రారంభించుటలోను, శ్రద్ధతో నంతరాయములేని విధమున సాగించుటలోను నొక విశేష మున్నది. రేవణూరి వేంకటాచార్యుఁడు[3] రచించిన శకుంతలా పరి ణయ ప్రబంధమున తాతగారైన అన్నమాచార్యుని మహిమమును వర్ణించుచు వారి సంకీర్తనములు విని తనిసిన తిరుపతి వేంకటేశ్వర స్వామి యితరుల సంకీర్తనములను వినఁజాల మనినట్లును స్వామివారు అన్నమాచార్యులవారిని మామగారుగా సంభావించుకొనినట్లును, పెదతిరుమలాచార్యునకుఁ గోచరించి యాతనికిని ఆతని వంశము వారి కిని మూఁడు పురుషాంతరముల వఱకును మోక్షమును ననుగ్రహించి నట్లును వివరించి యున్నాఁడు. వారి విశ్వాసము ననుసరించి వేంక టేశ్వరస్వామి తాళ్లపాకవారి కల్లుని వరుస వాఁడగును. ఆకారణము ననే కాఁబోలును స్వామివారి వివాహ మహోత్సవమును వారంత ఘనముగా నిర్వహించినది!

ఈ వైవాహికోత్సవము తరువాత తాళ్ళపాక వారు విశేష ముగా పెంచి ప్రత్యేకముగా నిర్వహించిన యుత్సవములలో పేర్కొనఁ దగినరెండవది· ఉరి — అడి అను ఉట్లుకొట్టువేడుక. క్రీ॥శ॥ 1545 జూలై 3 వ తేదీ పెదతిరుమలాచార్యుఁడు వేయించిన శాసనమున తాళ్ళ

1. నేడియము గ్రామమును చినతిరుమలయ్య- చెందలూరు మల్ల వరము దేవరాయపల్లి గ్రామములను తిరువేంగళ నాథయ్య- శ్రీభండార మునకు సమర్పించిరి

2. No- 153 of Vol. V

3. తాళ్ళపాక అన్నమాచార్యుని మనుమఁడు (కూతురు కొడుకు)

పాక తిరువెంగళప్పయే తిరుమలమీఁద నీయుత్సవమునారంభించినట్లుగా పేర్కొనఁబడినది.[1] కాని యందే 'తిరుమలయ్యగారి ఉరి అడి' అని మఱియొక తావున కలదు. క్రీ॥ శ॥ 1547 ఆగస్టు 17 వ తేది చినతిరుమలాచార్యుఁడు వేయించిన శాసనమున చిన తిరుమలాచార్యుఁడే ఎగువ దిగువ తిరపతులలో నీ యుత్సవమును ప్రత్యేకముగా నేర్పరచినట్లు ప్రశంసింపఁబడినది.[2] వీనినిఁబట్టి పరిశీలింపగా నీ యుత్సవము క్రీ॥ శ॥ 1545 సంవత్సరమునకుఁ బూర్వమే తాళ్ళపాక చిన తిరుమలాచార్యాదులు జరిపించుచునుండి యుండ వచ్చునని తెలియును. ఇది ముఖ్యముగా శ్రీకృష్ణుని బాల్యక్రీడలకు సంబంధించిన వేడుక. కొండమీఁద తాళ్ళపాకవారి యింటి ముంగిటనున్న వేటాడు కృష్ణునకును, తిరుపతిలో గోవింద - కృష్ణునకును నీయుత్సవము జరుగుచుండినది. దీనికై పెద తిరుమలాచార్యుఁడును ప్రత్యేకముగా కొంత ధనమును వెచ్చించి ఉట్లవేడుకల నేర్పరచినట్లు తెలియుచున్నది.[3] శ్రీకృష్ణుఁడు బాల్యమున దొంగచాటుగా నుట్లుకొట్టి పాల్వెన్నమీఁగడలు భక్షించుచుండిన యుదంతము నీ యుత్సవము కనుల కట్టించును. పంచామృతము నింపిన ఘటమును కొబ్బరికాయలను, అరటిపండ్లను, మరికొన్ని తినుబండారములను ఉట్లకుఁగట్టి పొడవైన గడలతో నిర్మించిన మంటపమున గిలక త్రాటికి బంధించియుందురు. దానిని గొట్టి గ్రహించుటకై యొకఁడు కృష్ణుని యవతారమెత్తును. ఆయుట్టి వాని కందకుండ క్రిందికి మీఁదికి నెత్తుచు దించుచు నూరించు చుందురు. ఇది కోలాహలముతో నిండిన వేడుక. తుద కాతఁడు ఉట్టినిఁ గొట్టఁ గలిగినప్పుడు ఆ కోలాహలము మిన్నుముట్టును. మిక్కిలి ప్రాచీన మగు నీ యుత్సవము నేఁటికిని వేడుక గొల్పునదిగా దేశమునఁ బలుతావుల

1. No. 47 of Vol V.

2. No. 99 of Vol. V.

3. ఉరి అడి-శ్రీ జయంతి ఉత్సవము ప్రశంస తిరుమలతిరుపతులలో సాళువగుండ నరసింహరాయల కాలమునుండియుఁ గానవచ్చుచున్నది. ఈ వేడుకల పుట్టుపూర్వోత్తరములనుఁ గూర్చి ముమ్ముందు వివరముగా తెలియనగును.

నున్నది. తిరుమల తిరుపతులలో ప్రత్యేకోత్సవముగా దీని నేర్పరచిన వారు తాళ్ళపాకవారే యనవచ్చును. వెన్న, తేనె, పాలు, పెరుగు చక్కెర కలిపిన పంచామృతము, కలశము, కొబ్బరికాయలు, అరటి పండ్లగెలలు చెఱకులు మరికొన్ని ఫలములు, పొడుగుపాటి వెదురు గడలు పూలు, ఇవియే దాని కవసరమైనవి. వీని నెల్ల తాళ్ళపాక వారు శ్రీ భండారము వారిచేత సమకూర్పఁ జేయుచుండిరి. ఇక ఉట్ల మంటపము నలంకరించువారికి, శిల్పులకు, వేడుక ముగిసిన తరువాత పరిసరములను బాగుచేయు పనివారికి, వెదుళ్ళను, ఉట్ల స్తంభములను చెడిపోకుండ జాగ్రత్త చేసెడివారికి కైజీతముల నేర్పరచి వీరి యుత్సవము జయప్రదముగ జరపించుచుండిరి. కొండమీఁద తాళ్లపాక వారి యింటిముందు జరుగు నీ యుత్సవమును స్వామివారి యుత్సవ మూర్తి దర్శించుచుండువారట కూడ!

దీని తరువాత తాళ్లపాకవారే యారంభించిన మఱియొక యుత్సవము వనభోజనోత్సవము. ఇది కార్తిక మాసమున జరుపఁబడుచుండినది. తాళ్లపాకవారి శాసనములలో తొలుత దీని ప్రశంస క్రీ॥ శ॥ 1587 లో కాననగుచున్నది.[1] పెద తిరుమలాచార్యులీసందర్భమున బంధుమిత్రులతోడను శ్రీవైష్ణవ సమాజముతోడను వలస వెళ్లి వనభోజనోత్సవము జరుపుకొన్నట్లున్నది. తరువాత కాలమున వీరి శాసనములందును, వీరి మిత్ర బృందమునకు చెందినవారగు నారాయణసెట్టి, శ్రీనివాసయ్యంగారు ప్రభృతుల శాసనములందును విరివిగా నీ యుత్సవ ప్రశంస కాననగును.[2] కార్తిక మాసమున శ్రవణానక్షత్రమున బంధుమిత్ర వర్గములతోఁ గూడి సమాజమంతయు దాపుననున్న తోపులకు వలస వెళ్లి సమారాధనముఁ గావించుటయే ఈ యుత్సవ విశేషము. దానిని సామాజికోత్సవముగా పేర్కొనవచ్చును. దైవము పేరిట సమాజమున సామరస్యము పెరుగుట కిట్టి యుత్సవము లెంతేని

1. తి.తి.దే.శా.సం. 4 నం. 100 (1587)

2. No. 25 of Vol 5 - క్రీ. శ. 1544 by నారాయణసెట్టి and No. 157 of Vol. 4 క్రీ. శ. 1540 by శ్రీనివాసయ్యంగారు.

తోడ్పడును. క్రీ॥శ॥ 1545 లో సదాశివరాయల కాలమున పెదతిరుమలాచార్యుఁడు వేయించిన శాసనమునం దీవనభోజనోత్సవ సందర్భమున జరుపఁబడు కైంకర్యములనుఁ గూర్చియు, ప్రసాద భాగముల పంపకమును గూర్చియు వివరము లనేకములున్నవి. తోఁపులో ఆస్థానము అయిన తర్వాత ఆలయమునకు తిరిగివచ్చు సమయమున శ్రీ భండారము నిర్వాహమువారైన పంద్రెండుగురి పేరిట గట్టిన పంద్రెండు మంటపములందును, మఱికొన్ని తావులందును, చేయవలసిన నైవేద్యమునుఁ గూర్చియు, తన్నిర్వాహమువారినిఁ గూర్చియు, వివరములున్నవి. ఈ యుత్సవ సందర్భమున పనిపాటలలో సహాయపడు వారందరికి విడివిడిగా జీవిత మేర్పరుపఁబడినది. ఇఁక ఈ శాసనమున ప్రసాదభాగములనుఁగొనినవారి పేరులను బట్టియే ఆ నాళ్లలో తాళ్లపాకవారికి గల స్థాయిని వారి పరిచయములను మనము గుర్తింపవచ్చును. వారిలో ప్రసిద్ధులు నారాయణసెట్టి, కుమార తాతాచార్యులు, చక్రవర్తి అప్పయ్యంగారు, కందాళ అప్పయ్యంగారు, ఆనంద పిళ్లయ్యంగారు, తిరుమలయ్యంగారు, దొడ్డయ్యంగార్ అప్పా, శుకవస్తు అణ్ణన్, అప్పు అణ్ణన్ అప్పు, అప్పు తిరువేంకటయ్యంగారు, అణ్ణన్ నాయినార్, వెకంటత్తురైవర్, అప్పాచ్చి అణ్ణన్ అప్పన్, పల్లి భట్టర్ మలయణ్ణన్, తిరువణిపిళ్ల (నిర్వాహకులు) రామానుజ కూటము నిర్వాహకులు, కొందఱు కుమ్మరులు, కంసాలులు, వర్తకులు, వ్యాపారులు, దేశాంతరులు ప్రభృతులు పలువురున్నారు. ఆ దినములలో ఆలయమే వికాసమునకు, సాంస్కృతికాభివృద్ధికి కేంద్రమై సహాన సామరస్యముల కాలవాలమై యుండినది. ఇట్టి యుత్సవము లావిషయమున నెంతయో తోడ్పడిన వనవచ్చును.

పై యుత్సవములే కాక పూర్వము నుండియు సాగుచున్న మఱికొన్ని యుత్సవముల విషయమున కూడ వీరు తగు శ్రద్ధవహించి యవి మఱింత వైభవముగా జరుగునట్లు చేసిరి. వీరి కాలమున ముఖ్యముగా బ్రహ్మోత్సవములు మహా వైభవముతో నిర్వహింపఁబడినవి. వీని సంఖ్య సంవత్సరమునకు పది పదకొండు వరకును పెరిగినది. అంతకుముందు 12 రోజులు జరుగుచుండిన యీ యుత్సవము వీరి

కాలమున 13 దినములపాటు జరిగినది ఆణి మాసమున తాళ్లపాక వారి పేరనొక ప్రత్యేక బ్రహ్మోత్సవమే పర్పాటైనది.[1] దాని నిర్వహణమునకు వీరు విపులములగు పర్పాట్లు గావించిరి. దానికే కాక అచ్యుతరాయాదుల పేరిట జరగు బ్రహ్మోత్సవములందు సైతము వీరి యుభయ్యములు కొన్ని యేర్పాటైనవి. ఇట్లే తిరుపతి లోని ఆలయములందుకూడ వీరు కొన్ని విశేషోత్సవముల నేర్పరచిరి. ఇట్లు తాళ్లపాకవారు తమ సంపద లన్నియు స్వామికే అంకితము చేసికొని తరతరాలు వర్ధిల్లిరి.

*సంకీర్తన భండారము* :— తాళ్ళపాకవారు తిరుపతిక్షేత్రమునకు చెందిన సంకీర్తనాచార్యులు. ఆంధ్రదేశమున శాస్త్రీయమగు సంకీర్తన సంప్రదాయపద్ధతులకు మూలపురుషులు. విజయనగర ప్రభువుల మన్ననలంది సంకీర్తన వాక్పూజలతో స్వామినే అర్చించిన ఆచార్యపురుషులు. వారిలో క్రీ॥ శ॥ 1440 నుండి సంకీర్తన రచనకుఁ బూనిన తాళ్ళపాక అన్నమాచార్యుఁడే ఆదిపురుషుఁడు. ఆతఁడు జన్మించిన పదాఱవయేట స్వామి ప్రత్యక్షమైతేను అది మొదలుగా క్రీ॥ శ॥ 1502 నకు సరియగు దుందుభి ఫాల్గుణ బహుళ ద్వాదశి వరకును దినమున కొక్క కీర్తనకేని తక్కువకాకుండ తిరువేంగళనాథుని మీఁదను అంకితముగా శృంగార వైరాగ్య కీర్తనములను విన్నపము గావించెను. ముప్పదిరెండు వేలకు పైగా నాతఁడు సంకీర్తనములను రచించెనట! తదుపరి తత్పుత్రులునట్లేబహుళసంఖ్యలో సంకీర్తన రచనగావించిరి. తొలుత వీరు తమ రచనలన్నియు తాళపత్రములందే లిఖించుకొని యుండినప్పటికిని చెక్కుచెదరకుండవానిని శాశ్వతముగా నుంచి కాపాడుటకై తరువాతి కాలమున వానినెల్ల రాగి రేకులపై కెక్కించిరి. తిరుమల మీఁద స్వామివారి బంగారు వాకిలికి సమీపమున నొక సంకీర్తన భండారమును నెలకొల్పి యందు వానిని

---

1. మా. తి. తి. దే. శా. సం. Vol. 4 No 110 క్రీ. శ 1537
మా. తి. తి. దే. శా. సం. Vol 4 No 129 క్రీ. శ. 1539
మా. తి. తి. దే. శా. సం. Vol. 5 No 47 క్రీ. శ. 1545.

సురక్షితముగా నుంచిరి. ఇట్లు అసంఖ్యాకములుగానున్న వారి రచనల నెల్ల రాగిరేకులపై కెక్కించుటన్న తేలిక పని కాదు. మంది బలగములతో నెంతో సొమ్మును, కాలమును వెచ్చించి యుండవలెను. ఆసంకీర్తన భాండాగార కార్య నిర్వహణమునకు వారొక చక్కని వ్యవస్థనే కల్పించి యుండవలెను. ఆ వ్యవస్థ ఎప్పుడేర్పడినదో తెలియదు కాని దానిని గూర్చిన వివరములు తొలుత మనకు తాళ్ళపాకవారి శాసనములలో క్రీ॥ శ॥ 1530 సం॥ననే తెలియనగుచున్నది. అనఁగా అంతకుఁ గొంతకాలము పూర్వమే ఆ వ్యవస్థ వ్యవహారములోనికి వచ్చియుండవలెను. అన్నమాచార్యుని యనంతరము పెదతిరుమలాచార్యుని పర్యవేక్షణమున ప్రాయశః విజయనగర చక్రవర్తియగు అచ్యుత దేవరాయల వారి సహకారమున నీ సంకీర్తన భండాగార వ్యవస్థ ప్రారంభింపఁబడి యుండునని తలఁప వీలగుచున్నది. కృష్ణరాయల నిర్యాణమునకై రెండ్లకు పూర్వమునుండియే అచ్యుతరాయలు పరిపాలనమునపలుకు బడి కలిగియుండెను. ఆ దినములలో ననగా క్రీ॥ శ॥ 1525–1530 సం॥ల నడుమ నెప్పుడేని ఈసంకీర్తన భండారము నెలకొల్పఁబడియుండ వచ్చును. క్రీ॥ శ॥ 1530 సం॥న అచ్యుతరాయని బ్రహ్మోత్సవసందర్భమున సంకీర్తనభండారము ముందు నైవేద్యము సమర్పించినట్లు తాళ్ళపాకవారి శాసనమున నున్నది.[1] క్రీ॥ శ॥ 1541 లో అచ్యుత దేవరాయలు తమకిచ్చిన కుప్పం, కీలంగుణ్రమ్ గ్రామాలమీఁది 300 రేఖల మూల ధనమును వినియోగించి, శ్రీ భండారము వారి చేత తాళ్ళపాకవారు నిర్వహింపఁజేసిన కైంకర్యములందును సంకీర్తన భండాగార ప్రశంస యున్నది,[2] దానిముందు నిత్యము 4 తిరుపొంగకములు చొప్పున సమర్పించుటకును దీపములు పెట్టుటకును సంవత్సరము పొడుగుననగు వ్యయమును తాళ్ళపాకవారు భరించిరి. సంకీర్తన భండార కార్య నిర్వాహకులగు శ్రీవైష్ణవులకు కొందరకు ప్రసాద భాగములు తిరుకైవళక్కం (Cash Offerings) చెందునట్లుకూడ

1. No. 6 of Vol 4 క్రీ. శ. 1530
2. No. 155 of Vol 4 క్రీ. శ. 1541

నేర్పాటున్నది. దీనినిఁబట్టి యప్పటికే పలువురు శ్రీవైష్ణవులతో పండితులతో కూడిన ఈ వ్యవస్థయందు పని ముమ్మరముగా సాగుచుండినట్లు తెలియనగును. పెదతిరుమలాచార్యాదులు తిరువేంగళనాథుని కంకితముగా చెప్పిన సంకీర్తనములు రాయల కభీష్టముగా చెప్పినట్లున్నది.[1] అసలీ సంకీర్తనరచనారంభము గ్రీష్మమున జరిగినట్లున్నది. అందుకే గ్రీష్మోత్సవ సందర్భములందు తత్ స్మృతిగా పెద తిరుమలాచార్యుఁడు 20 దినములపాటు 12 రేఖల వ్యయముతో నిత్యనైవేద్యము లేర్పరచినాఁడు.[2] ఈ విశేషమునే 'సంకీర్తన అరుళప్పాడు' అందురు. క్రీ॥ శ॥ 1558 లో తాళ్ళపాక తిరువేంగళనాథయ్యకూడ ఈ సంకీర్తన అరుళప్పాడు సందర్భమున చందన తాంబూలములు సమర్పించుట కేర్పాటు గావించెను.[3] ఈ సంకీర్తన భండారమునకు సంబంధించిన ప్రవీణులగు నిరువురు సంగీత విద్వాంసు లుద్యోగులుగా పని చేయు చుండిరి. వారు స్వామి సన్నిధిని ప్రతినిత్యము తిరుమంజన వేళయందు సంకీర్తనము లాలపించు చుండిరి. వారిరువురకును ప్రసాద భాగములటుంచి సంవత్సరమునకు 16 రేఖల 8 పణములు విడిగా జీతము. అట్లే తిరుపతి గోవిందరాజస్వామివారి యాలయమున కూడ మరి యిరువురు సంగీత విద్వాంసు లదే కట్టుబడిని కైంకర్యము గావించుచుండిరి. ఆనాళ్లలో జరుగుచుండిన 11 బ్రహ్మోత్సవములందలి తొలి తొలి దినములందును, రథోత్సవసందర్భములందును సంకీర్తన గానము ప్రత్యేకముగా జరిపించుటకును అప్పుడు భక్తులకు చందన తాంబూలము లర్పించుటకును తాళ్లపాకవారు వసతులు గల్పించిరి.[4] ప్రతి శుక్రవారము పునుగుకాపుసమయమున విడిగా సంకీర్తనసేవ జరిగెడిది.[5] ఈ రీతిని సంకీర్తనములను రచించుటలోను, స్వయముగా గాన మొనరించుటలోను మాత్రమేకాక మఱికొందరు విద్వాంసులను

---

1. No. 20 of Vol 4 క్రీ. శ. 1582
2. No. 47 of Vol 5 క్రీ. శ. 1545
3. No. 159 of Vol 5 క్రీ. శ. 1558
4. No. 153 of Vol 5 క్రీ. శ. 1554
5. No. 14 of Vol 4 క్రీ. శ. 1532

గూడ నియోగించి వానిని ప్రచారములోనికిఁ దెచ్చుటకును తాళ్లపాక వారు విశేషముగా పరిశ్రమించిరి. ఇట్లు వారు స్వామిని సేవించుచునే సరస్వతీమూర్తులై సంగీత సాహిత్య రంగములందు నూతన సంప్రదాయముల నెలకొల్పిరి.

*ఇతర కైంకర్యములు* :—సాళువ నరసింగరాయని కాలమున కందాడై రామానుజయ్యంగారు ఆచార్య స్థానమును వహించి శిష్య వర్గమునుఁగూర్చుకొని తిరుపతి క్షేత్రమున విశిష్టమగు సేవగావించినట్లే అచ్యుత సదాశివరాయంద్ర కాలమున తాళ్లపాక పెదతిరుమలాచార్యాదులాపూజ్యస్థానమును వహించి కైంకర్యములు గావించిరి. దొడ్డాచార్యులు, కుమార తాతాచార్యులు, కందాడై అప్పయ్యంగార్, నారాయణసెట్టి మున్నగువారు వీరిమిత్రులు. శ్రీపతి తొండయ్య, పల్లిపట్టారయ్య, పొత్తపి వెంగళయ్య ప్రభృతులువీరిశిష్యులు. వీరేకాక పలువురు సాతానివైష్ణవులును వీరికి శిష్యులుగానుండిరి. తాళ్లపాకవారి మార్గముననుసరించి వీరందరును యథాశక్తి స్వామిసేవ గావించినవారే. తాళ్లపాకవారి యాదేశానుసారము తిరువేంకటత్తురైవర్ స్వామిసన్నిధిని వేంకటాచల మాహాత్మ్యమును పఠించుచుండెను. పొత్తపి వేంగళయ్య 'కయ్యార్ చక్ర శ్లోకము' (వేదాంత దేశికులవారిరచన) లను పఠించెడివాఁడు మఱియొకరెవరో శ్రీ భాష్యమును చదువుచుండిరి. ఇట్లు శిష్యమిత్ర బృందముల సహకారమునను, ప్రభువుల యాదరమునను తిరుపతిలో తాళ్లపాకవారు విశిష్టమగు రీతినే స్వామిని సేవించిరి.

వీరు తిరుమలతిరుపతులలోనే స్థిరనివాస మేర్పఱచుకొన్నను, తీర్థయాత్రలు గావించి, అనేక పుణ్యక్షేత్రములను దర్శించి ఆయా క్షేత్ర దైవతములపై సంకీర్తనములుచెప్పి-కొన్నికొన్ని దానధర్మములుకూడచేసినట్లు తెలియుచున్నది. క్రీ॥శ॥ 1531లో పెదతిరుమలాచార్యుఁడు విజయనగరమును దర్శించి విఠలస్వామి యాలయమునకు కొంతదానము చేసినాఁడు.[1] క్రీ॥ శ॥ 1534 (మన్మథ)లో అచ్యుత

1. (No. 8 of 19(4) Vide page 283 cf T. T. D. Epi. Report.

రాయల యనుమతితో ఉదయగిరిలో రాజప్రతినిధిగా నుండిన రామ భట్లయ్యచేత కడపజిల్లా నందలూరిలోని యాలయమునకు అందపూరు గ్రామము చెందునట్లు పెదతిరుమలయ్య చేయించినాఁడు.[1] క్రీ॥ శ॥ 1553 లో చినకాంచీనగరమున అరుళాళ్ పెరుమాళునకు పెద తిరుమలాచార్యుఁడును, చినతిరుమలాచార్యుఁడును కొన్ని యుత్స వముల నేర్పఱచి నైవేద్యములు జరుగునట్లు గావించిరి.[2]

క్రీ॥ శ॥ 1536 లో సాళువ తిమ్మరుసు ఆతని సోదరుఁడు గోవిందరాజు తాముపూర్వము విజయనగర ప్రధాన మంత్రులుగను, దండనాథులుగను వర్తిల్లునపుడు కావించిన కైంకర్యముల మూలమున తమకు లభించుచుండిన ప్రసాదభాగములను పెదతిరుమలాచార్యునకు మొత్తము 11,703 పణముల విత్తమున కమ్మికొనిరి.[3] ఆ విక్రయ పత్రములందలి విశేషములివి జిజ్ఞాసువులకు ముచ్చటగొల్పనవే. ఆం గ్లానువాదమునందలి కొన్ని పంక్తులను తిలకింపుఁడు.

1. "Hail prosperity ! I Saluva Timmarasa, the son of Rachiraja have registered this sale and for the prasadam offered in favour of Tallapakam Tirumalaiyyangar, son of Annamayyangar on the 1st day of the Panguni month in the year Manmadha current with the Salivahana Saka year 1457 (Equivalant date is 26th Feb 1536 AD)

As I have received from you the sum of 4,600 panam this day, you are entitled to receive from this day onwards the quarter share of the donor's Prasadam, as detailed below from the offerings made by my younger brother Saluva Govinda Raja at Tirumalai :

---

1. No. 607 of 1937 Vide page 291 of T. T. D. Epi. Report
2. No. 496 1919 Vide page No. 291 of T.T.D Epi. Report of.
3. No 72,74 and 93 of Vol 4 dated క్రీ. శ. 1536

5 prasadam ; ½ Akkali mandai ; ¼ palam of Chandanam ; 13 Atirasam, 12½ areca nuts ; and 25 betels :

The above mentioned Prasadam, akkalimandai etc, shall be delivered to you throughout the succession of your descendants till the lasting of the moon and the sun and you are eligible to sell, transfer, make charities etc. of the same.

*(on the west wall of the second prakara in Tirumala Temple) (4-72)*

2. "..............As we have received from you the sum of 5203 Panam this day, you are entitled to receive from this day onwards the quarter share of the donor's prasadam as detailed below from the offerings made by us for Sri Govinda Raja abiding in Tirupati..............." (4-74)

*[on the east wall (inner side) north of first Gopuram and east of Hanuman's shrine in the first Prakara of Sri Govinda Raja Swami Temple in Tirupati]*

ఈ శాసనమున తేదీ వివరములుగల భాగమునకు ప్రతిబింబము తీయ వీలుగాక పోయినదట !

3. "Hail prosperity...etc...Sale deed for the Prasadam offered, in favour of Tallapakam Tirumalaiyyamgar.........on the 1st day of the Tai month in the year Durmukhi, current with the Salivahana Saka year 1458 (Equivalant Date is 28th December 1536 AD.)

As I have in return for the sum of 1,900 panam paid by you, executed in your favour this Sale deed for the prasadam arranged by me to be offered to Sri Venkatesa, you are entitled, from this day on wards to the daily enjoyment of my quarter share.........

In addition to the above Prasadam you are permitted to collect again a second quarter share of the donor from the prasadam offered occasionally......on the days of all the monthly and yearly festivals......................besides you are empowered

to sell, transfer and grant as charity the said prasadam provided you must reside at Tirumalai and do divine services before lord Sri Venkatesa

[*on the west wall of the second Prakara in Tirumalai Temple.*]

ఈ శాసనములందెచ్చటను పూర్వపు శాసనములందువలె సాళువ తిమ్మరుసయ్యకు ప్రధాని బిరుదము కానరాదు. అంతేకాక శాసనములందు పరిపాలకుఁడగు ప్రభువుపేరు పరిపాటిగా నుండవలసినది లేదు. రాజకీయముగ నప్పుడు వారెట్టి దుస్థితిలో నుండిరో యేమోగాని ఆ సంవత్సరము (మన్మథ-దుర్ముఖి) కొద్ది కొద్దిగా మూఁడు దఫాలలో 11,703 పణముల మొత్తమునకు సంపూర్ణాధికారములతో సహా ప్రసాద భాగములను అమ్ముకొన్నట్లు తెలియుచున్నది. తాళ్ళపాకవారు కొండ మీదనే స్థిరముగానుండి స్వామి కైంకర్యము యథావిధిగా జరుగునట్లు చూచుచుండుటకును-వారి ప్రసాదభాగములను తరతరము లనుభవింపగల్గుటకును ఆ విక్రయ పత్రములందు నిర్ణయము జరిగినది

ఇట్లు తాళ్ళపాకవారు నాటి ప్రజల సంపూర్ణ విశ్వాసమునకు పాత్రులై శ్రీ వేంకటేశచరణసేవామగ్నమానసులై తిరుమల వైకుంఠమునే స్థిరనివాసముఁ గావించుకొని యుండిరి.

## తాళ్ళపాకవారు - సాహిత్యము

దాదాపు ఒకటిన్నర శతాబ్దికి పైగా తిరుపతిలో నెలకొని దీక్షాబద్ధ కంకణులై యాంధ్రుల మతసాంస్కృతిక రంగములలో నూతనోత్తేజమును గల్పించిన తాళ్ళపాక వంశీకులందరును విద్యావిశారదులే. ప్రాయికముగా నందరును కవి పండిత గాయకులే. వారు పదుగురైనప్పటికి నొక సంస్థగా పనిచేసి, యాంధ్ర సారస్వత ప్రపంచమున కెనలేని సేవగావించినారు. వారిలో నొక్కొక్కరొకరిని మించియొకరుగా బహుకృతులను రచించిరి. బహుళములగు సాహితీ ప్రక్రియలను సాధించిరి. తమకుఁ బూర్వమున్న సాహితీ ప్రక్రియలనన్నిటి నాకళించుకొని యనుసరించి కవితారంగమున నూతన ప్రయోగములను గావించిరి.

పూర్వ సాహితీ మార్గముల యథేచ్ఛావిహారము గావించి, నవ్యమార్గముల నావిష్కరించిరి. అలనాఁటి సాహిత్యాకాశమున నీ తాళ్ళపాక కవిచంద్రులకుగలఁ స్థానమెట్టిదో తెలిసికొనుట కించుక పూర్వము బహు సాహితీ ప్రక్రియలలో రచితములైన వారి కృతి బాహుళ్యమును గూర్చియు, వారి వారి జీవిత విశేషములను గూర్చియుఁ దెలియుట అవసరమే.

ఈ దిగువ తాళ్ళపాకవారి కృతులనెల్ల నొక క్రమమున పేర్కొనుచున్నాను.

## 1. తాళ్ళపాక అన్నమాచార్యుడు.

### (మూలపురుషుడు)

| | | |
|---|---|---|
| 1. శృంగార సంకీర్తనములు | | వెరసి ముప్పది రెండు వేలు. |
| 2. ఆధ్యాత్మ సంకీర్తనములు | | కొన్ని ప్రకటింపఁబడినవి. |
| 3. శృంగారమంజరి | — | ప్రకటితము |
| 4. శతకములు | — | పంద్రెండు. వీనిలోనలమేల్మంగాంబపై చెప్పబడి "వేంకటేశ్వరా" యనుమకుటముతోఁ గల శతక మొక్కటియే ప్రకటితము. తక్కినవలభ్యములు. |
| 5. ద్విపద రామాయణము | — | అలభ్యము. |
| 6. వేంకటాచల మాహాత్మ్యము | — | (సంస్కృత రచన) అలభ్యము |
| 7. సంకీర్తన లక్షణము | — | లక్షణగ్రంథము, సంస్కృతరచన-అలభ్యము. |

## 2. తాళ్ళపాక తిమ్మక్క

### (అన్నమయ్య గారి భార్య)

1. సుభద్రా కళ్యాణము — మంజరీ ద్విపద - ప్రకటితము.

## 3. తాళ్ళపాక నరసింగన్న

(అన్నమయ్యగారి పెద్దకుమారుఁడు)

కృతులు తెలియరావు.

(కవికర్ణ రసాయనము? — ఆంధ్రప్రబంధము, ప్రకటితము.)

## 4. తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు

(అన్నమయ్య గారి రెండవ కుమారుఁడు)

1. శృంగార సంకీర్తనలు } అప్రకటితములు.
2. అధ్యాత్మ సంకీర్తనలు }
3. వేంకటేశ్వర వచనములు — వచన మాలికా గీతములు.
4. శృంగారదండకము — దండకము.
5. చక్రవాళ మంజరి — మంజరీ ద్విపద.
6. శృంగార వృత్త శతకము — శతకము.
7. వేంకటేశ్వరోదాహరణము — ఉదాహరణము.
8. నీతి సీస శతకము — శతకము
9. సుదర్శన రగడ — రగడ.
10. రేఫ అకార నిర్ణయము — లక్షణగ్రంథము.

(ఇవి అన్నియు ప్రకటితములు)

11. భగవద్గీత తెలుగు వచనము — అనువాదము
ఆంధ్రవేదాంతము అప్రకటితము.
12. ద్విపద హరివంశము — ద్విపద, (అలభ్యము).
13. సంకీర్తన లక్షణ వ్యాఖ్య — వ్యాఖ్యానము(అలభ్యము).
14. శ్రీవేంకటేశ్వర ప్రభాత స్తవము—ద్విపద, ప్రకటితము

## 5. తాళ్ళపాక చినతిరుమలాచార్యుఁడు

(పెదతిరుమలయ్య గారి పెద్దకుమారుఁడు)

1. శృంగార సంకీర్తనములు | ప్రకటితములు
2. అధ్యాత్మ సంకీర్తనములు |

3. అష్టభాషా దండకము — దండకము. (ప్రకటితము).
4. సంకీర్తన లక్షణము — తెలుఁగు లక్షణ గ్రంథము. అనువాదము, (ప్రకటితము).

## 6. తాళ్ళపాక చిన్నన్న (తిరువేంగళనాథుఁడు)
(పెద తిరుమలయ్యగారి నాలుగవకుమారుడు)

1. అన్నమాచార్య చరిత్రము—జీవిత చరిత్ర.ద్విపద.ప్రకటితము.
2. పరమయోగి విలాసము — ద్విపద. ప్రకటితము.
3. అష్టమహిషీ కల్యాణము — ద్విపద. ప్రకటితము.
4 ఉషాపరిణయము — ద్విపద. ప్రకటితము.

## 7. తాళ్ళపాక తిరువేంగళప్ప
(చినతిరుమలాచార్యుని కుమారుఁడు)

1. అమరుకము — కావ్యము. అనువాదము. (ప్రకటితము).
2. బాల ప్రభోధిక — అమరమునకు తెలుఁగు వ్యాఖ్య అప్రకటితము.
3. సుధానిధి — మమ్మటుని కావ్యప్రకాశికకు వ్యాఖ్య - అప్రకటితము.
4. రామచంద్రోపాఖ్యానము — కావ్యము. అలభ్యము.

## 8. రేవణూరి వేంకటాచార్యుఁడు
(అన్నమాచార్యునిదౌహిత్రుఁడు-తిరుమలాంబా తిరుమల కొండయార్యుల తనయుఁడు)

1 శకుంతలా పరిణయము - ప్రబంధము. అప్రకటితము.
2. శ్రీపాదరేణు మాహాత్మ్యము — కావ్యము. ప్రకటితము.

తెలియవచ్చినంతవరకు చూడఁగా 15, 16 శతాబ్దులలో వర్తిల్లిన తాళ్లపాకవారియు, వారి బందుగులయు రచనలు, సంకీర్తనములను వదలి, దాదాపు నలువది రెండు వరకున్నవి. వానిలో నేఁటికి

18 కృతులు ప్రకటితములు, 5 అప్రకటితములు, 19 కృతు లలభ్యములు. ఇవికాక వారు రచించినవియు, మనకెరుగరానివియు మరికొన్ని కృతులుండియుండును.[1] తెలియవచ్చిన వానినిఁబట్టి చూడఁగా తాళ్ల పాక కవీశ్వరులు విభిన్నములగు సాహితీ ప్రక్రియలలో రచనా వ్యాసంగము నెరపినట్లు గుర్తింపనగును.

ఇక తాళ్లపాకవారి రచనలలో ప్రధానములైనవి, వారి సంకీర్తనములు. ఇవి అధ్యాత్మ శృంగార సంకీర్తనము అని రెండు తెఱగులు. అన్నమాచార్యుఁడును, తత్పుత్రుఁడు పెదతిరుమలాచార్యుఁడును, తత్పుత్రుఁడు చినతిరుమలాచార్యుఁడును మన మెరిగినంతలో సంకీర్తన రచయితలుగా గుర్తింప నగుచున్నారు. వీరిలో అన్నమాచార్యుఁడొక్కఁడే "పరమతంత్రములు ముప్పదిరెండు వేలు" యోగ వైరాగ్య శృంగారమార్గముల ననుసరించి వ్రాసినట్లు చిన్నన్న వ్రాసిన అన్నమాచార్య చరిత్రమును బట్టి తెలియుచున్నది. అటుపై పెద చిన తిరుమలాచార్యాదు లికనెన్ని విరచించియుండిరో ఆ వివరములు తెలియరావు. కానినేఁడు వానిఁలో కొన్ని మాత్రమే రాగిరేకుపై చెక్కఁబడి తిరుపతి దేవస్థానమున వదిలపరుపఁబడి కాననగుచున్నవి. మరికొన్ని అహోబలము శ్రీరంగాదులలో కూడ నున్నట్లు తెలియుచున్నది. ఏమైనను పై మువ్వురురచయితలవి సంకీర్తనలు చెక్కఁబడిన రాగిరేకులే తిరుపతిలో నేఁడు మనకు 2600 వరకున్నవి. అనగా సంకీర్తనముల మొత్తము సంఖ్య దాదాపు పదునైదు పదునారు వేల నడుమ నుండును. $2600 \times 6 = 15,600$. వానిలో దాదాపు మూడువేలు అధ్యాత్మ కీర్తనలు. మిగిలినవి శృంగార సంకీర్తనలు.

1. అన్నమాచార్య చరిత్ర వ్రాతప్రతిలో గ్రంథము ముగిసినతర్వాత 7 వ పుటలో తాళ్లపాక తిరువెంగళనాథుని జీవిత చరిత్రము కార్వేటి నగర సంస్థానములో ఉన్నది. చూడవలెను. అని కలదు. అట్లది కార్వేటినగరమునఁ గలదేమో అని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు తమ అన్నమాచార్య చరిత్ర పీఠిక పుట 1 లో అధోజ్ఞాపికలో వ్రాసిరి. ఇదియు ద్విపదకృతియై యుండనగును. దాని కర్తయెవరో ? ఇట్టి గ్రంథములింక నెన్నియెరుగరాకున్నవో?

వీనిని బట్టి చూడ తాళ్లపాకవారు సాహితీ ప్రక్రియలలో వై విధ్యమును సాధించుట మాత్రమేకాదు. కృతిబాహుళ్యమునందును అవధులు దాటిపోయినారనవలసియున్నది.

తాళ్లపాక వంశవిఖ్యాతికి మూలపురుషుఁడు అన్నమాచార్యుఁడు ఈతఁడు సంగీతసాహిత్యములం దసాధారణ పాండిత్యమును సంస్కృతాంధ్రములం దనితరసాధ్యమగు కవితాశక్తియుఁ గలవాఁడు. పరమభక్తుఁడు. "హరికీర్తనాచార్యుఁడు" "పదకవితా పితామహుఁడు" "పంచమాగమ సార్వభౌముఁడు", ద్రావిడ వేదమును తెనుఁగుచేసినవాఁడు. వైష్ణవ కావ్యములను, శతకములను, క్షేత్ర మాహాత్మ్యములను మాత్రమే కాక తన్మతప్రచారమునకై నూతనముగా తెనుఁగునఁ బదకవితకుఁ దొడఁగినవాఁడు. ముప్పదిరెండు వేలకుఁబైగా నీతఁడు తిరువేంగళనాథ దేవునిపేర శృంగారాధ్యాత్మ కీర్తనములను రచించినాఁడు. అవియెల్ల వైష్ణవతత్త్వము ముల్లెగట్టిన ముత్యాల మూటలు. ఈతని రచనలు-

"శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞాన సారంబులై
యతిలోకాగమవీథులై విపులమంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకటశైలవల్లభరతిక్రీడారహస్యంబులై
నుతులై తాళ్ళపాక యన్నయవచో నూత్నక్రియల్ చెన్నగున్"

అని పొగడ్తగాంచినవి.

ఇట్లు మహనీయుఁడగు అన్నమాచార్యుని పవిత్ర జీవితచరిత్రము చిన్నన్నకృతమగు ద్విపదగ్రంథమువలన మనకు విశేషముగాఁ దెలియవచ్చినది-[1] తదనుసార మాతని చరిత్రమును సంగ్రహముగా మనవి చేయుదును.

---

1. అన్నమాచార్యుని సమగ్ర జీవిత విశేషము నెరుగుటకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి "అన్నమాచార్య చరిత్ర" చూడఁదగును. (తి. తి. దే. ముద్రణము 1949.)

అన్నమాచార్యుని చరిత్రము : నందవరీక బ్రాహ్మణుఁడు, ఋగ్వేది, ఆశ్వలాయనసూత్రుఁడు, భారద్వాజసగోత్రుఁడు నైన నారాయణసూరికి అతని ధర్మపత్ని లక్కమాంబకు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి యనుగ్రహమున 'బిరుదుగజ్జియల ముప్పిడికటారంబగు నందకాంశమున వైశాఖ విశాఖానక్షత్రమున, చక్కని గ్రహము లుచ్చమున మూఁడలర నన్నమార్యుఁడు జన్మించినాఁడు. పన్నిద్దరాళ్వారులలో నమ్మాళ్వారును వైశాఖ విశాఖనే యవతరించినారు. పసిబిడ్డఁడయ్యు నాతఁడు శేషశైలేంద్రునిమీఁది బాళినేపడియుండువాఁడు. "జోలి బాడెనేనియును వెంకటపతిపేరు వివరించి పాటపొంకించకుండినఁ" బోరూరడిలెడివాఁడుకాఁడు-[1] ఉచితకాలమున తల్లిదండ్రులాతనికి జాతకర్మాదికమునుఁ గావించిరి. "పంచమంబులైనంత నియతిమై గురుఁడుపవీతుఁగావించినయవేది నధ్యయనంబు సేయించె"ను-[2]వెన్నుని వరముచే నాతనికి విద్యలన్నియు జిహ్వారంగసీమ తమఁ దామె సొచ్చి నర్తనమాడఁదొడఁగినవి. ఆ పిన్నప్రాయముననే అతఁడు 'ఆడినమాటెల్ల నమృతకావ్యముగ పాడిన పాటెల్ల బరమగానముగ' కాఁజొచ్చినవి.

అట్టి బాలుఁడగు అన్నమాచార్యునకు జననియును నన్నయు, జనకుండు వదినయుఁ బిలచి పనులు సెప్పుచుండ విసువక చేయుచుండెడివాఁడు. ఒకతూరి వారు పసులకుఁగసవుఁదేఁబనుపఁ బాలుండు కష్టపడి 'ఎన్నటి చుట్టంబు లిటువంటివార లెన్నటి బంధుండ నేనువారలకు" అని చింతించి శేషాద్రినాథుని గొలచి మనియెద ననుచు తలఁచి యిల్లువిడచి "గోవింద గోవిందగోవింద యనుచు" నేగు పరుసలవెంట నొంటరిగా ప్రయాణమై తిరుపతినిఁ జేరుకొనెను. అచట గ్రామంపు శక్తి గంగమ్మను దర్శించెను. అటుపై 'నళిపురి సింగరి నర్చించి' 'తలియేఱుగుండు

1. చూ. కళాపూర్ణోదయము "కువలయాధిపు పాటలు పాడినం గరం బలరుచుఁ గేరికేరి నగు నన్యుల పాటలు పాడినం గరంబలుకుచునేడ్చు" 6-166

2. అయిదేండ్లకే "గురుఁడన్నమార్యునుపనీతు" గావించినట్లున్నది. ఇది ఉపనయనమునే సూచించునో లేక "గురుఁడు దగ్గరకుఁజేర్చి" చదువు చెప్పుటనే సూచించునో!

దర్శించి' పెద్ద యెక్కుడు నెక్కి 'కపురంపుఁగాలువఁగడచి' మోకాళ్ల ముడుపునిమ్ముఁలఁ జేరవచ్చి, మిగులబడలిక నొకరాతిపై సొమ్మసిలి పడిపోయెను. అప్పుడలమేలుమంగ ప్రత్యక్షమై యాబాలుని సేదదీర్చి 'కందర్పజనకునిగనఁ జేయు' మార్గమును సూచించి యంతర్హిత యాయెను. అంతట నా 'శిశువు' మేల్కాంచి కలనిజంబని తెలిసి, యాపద్మ తనకేలనిడు ప్రసాదభావమున పరమసారస్వతపారీణుఁ డగుచు సరసకవిత్వవాచా ప్రౌఢి మెఱసి యలమేలుమంగకు నాళుమార్గమున నొక్క శతకంబుఁ జెప్పెను.[1] ఆమె యాదేశానుసార మాశేషశైలము నధిరోహించి, స్వామి పుష్కరిణి సోయగమున కబ్బురమంది, 'యాదరిఁ బెంపొందు నాదివరాహునాదరంబున' సేవించి పెద్దగోపురము దర్శించి నీడతిరుగని చింతకడనమ్రుఁడై గరుడ గంబమునకు సాగిమ్రొక్కి చంపకపు ప్రదక్షిణము చనుదెంచి స్వామిపుష్కరిణి బూజించి తిరుమలప్పనికి నివేదితమైన మీఁద' నమ్మెడు ప్రసాదము నారగించి, 'నడగోపురము సొత్తెంచి', 'శ్రీనివాసునికి నమస్కృతిచేసి, దండగానుపించిన భాష్యకారుల బొగడి శ్రీ నరసింహుని సేవగావించి', జనార్దను సన్నుతించి, యలమేలుమంగ కభివందనము లాచరించి, చెంగటి యాగశాల గీర్తించి, 'ఆనందనిలయంబు గాంచి' 'కళ్యాణమంటపంబునకు కరములు మోగిచి' 'చెంగటి తేఱకెఱగి' బంగారు గరుడఁని భజియించి, శేషునిఁ గొలిచి పరుషలతో బాటు మ్రొక్కులిడి, 'బంగారు గాదెలపట్టి సాష్టాంగమంగ వింపుచుఁ' బులకాంకితుఁడయి పరమాత్ముని దివ్యమంగళ విగ్రహమును 'కనుల కరువెల్లఁదీర సేవించెను'-[2] 'కంటినయ్యఖిలాండకర్తనే నధికుఁగంటి నాయఘము నిక్కము వీడుకొంటి' నని అన్నమయ్య పాడుకొని పరవశించెను-[3] ఆపాట కచ్చట నందఱు మెచ్చి మెచ్చి

---

1. ఇదియే "మంగాంబికా" శతకము.

2. పై కథావివరమును స్ఫురింపఁజేయు కీర్తనము లెన్నో అన్నమాచార్యునివి గలవు. వానినెల్లనదేక్రమమున పితృపాదులు తమ అన్నమాచార్య చరిత్రపీఠికలో నుదాహరించియున్నారు. చూడఁదగును.

3. కథాసందర్భమున నీ పాటను శ్రీ శాస్త్రిగారుదాహరింపలేదు. అదే వల్లవిగాఁగల కీర్తనగలదు. చూ. దేశాత్మి - "కంటినఖిలాండ" 11-2-58 కీర్తనము.

చనవిచ్చి తీర్థప్రసాదంబులిడి శఠగోపమిడుచు దీవించి చనిరి. ఆరీతి నెనిమిది యేడుల పిన్నబాలుఁ[1]డగు నన్నమయ ఆరాత్రి యచ్చట గడపి మరునాఁడు పాండవనామాది దేవతీర్థముల నవగాహనమాడి యుదికినబట్ట యారునంతలో "వితతవృత్తంబుల వెంకటపతికి శతకంబు కుతుకంబు సమకూరఁ జేసెను".[2] గుడిముం దాశతకమునే పఠింపగా తాళములు వీడి యాలయపుఁదలుపులు తమంతతామే తెఱచుకొనినవి. మరల నొకతూరి లోన శతకమునుఁ జదువగా "పెట్టినముత్యాలపేరా యశోదపట్టిపాదములపైఁ బడఁ బ్రసాదించెను." ఆ వింతలుచూచి వైఖానసార్చకుఁ డరుదంది యందరి యెదుట బాలునిఁ గీర్తించెను. ఇదియొక ద్వాదశినాఁడు జరిగినది.[3] అట్లాదినమున నాతఁడు స్వామిని

---

1. అన్నమాచార్యుఁడు తొలుత కొండనెక్కునాటికి 'ఎనిమిదియేడుల' పిన్నవాఁడని చిన్నన్న పేర్కొనినాఁడు. అప్పటికే అతఁడు సంకీర్తన రచన కారంభించినట్లును అతఁడు పేర్కొనెను. కాని తాళ్లపాకవారి రాగిరేకు లందు అన్నమయ్యకు "పదారుయేండ్లకు తిరువెంగళనాథుండు ప్రత్యక్షమై తేను-అదిమొదలుగా...విన్నపముచేసిన సంకీర్తనలు" అని కలదు. ఈ విషయమును సమన్వయించుచు శ్రీప్రభాకరశాస్త్రిగారు "దాని నుపనయనముచే ద్విజత్వమువచ్చినదాదిగా నని యన్వయించుకొని యెనిమిదేండ్లవాఁడని, మాతృగర్భము నుండి పుట్టినదాది పదునాఱేండ్లవాఁడని సరిచూచుకోవలెను" అని వ్రాసినారు. రేకులందున్న యంశమే విశ్వసింపఁదగునని తలఁతును.

2. ఇది అన్నమాచార్యుని రెండవ శతకము. ఆకుమార్గమునఁ జెప్పినట్టిది. "వేంకటపతి శతక" మని దీనిపేరు.

3 ఆద్వాదశికి క్రిందటిదినమగు నేకాదశినాఁడే అన్నమార్యుఁడు కొండనుఁజేరి యారాత్రి అచ్చట గడిపినట్లు చిన్నన్న వ్రాఁతనుఁబట్టి తెలియుచున్నది. అందుకేకాఁబోలును

మునునీనగరిత్రోవ మొగమైనయప్పుడె
ఘనయామ్యమార్గము గట్టుపడియె
వొనర నీ తిరుపతి నొకరాత్రివున్నప్పుడే
కనలు కాలసూత్రాదిఘాతలెల్లఁ బాడె (1.12)

అని అన్నమయ్య ఒకకీర్తనమునఁ బాడుకొనెను.

సేవించి 'యొక పంచతిన్నెపై' నుండగా ఘనవిష్ణుఁడను మౌని యేతెంచి, తనకు స్వామి యాక్రిందటిరాత్రి స్వప్నమున అన్నమార్యుని రాకనుఁగూర్చి తెలిపి పంచసంస్కారములుచేయ నుద్బోధించిన విషయము నెరుకపరచి "ముద్రాధారణంబున శంఖ చక్రాంకితునిఁ జేసి" యాబాలునకు పంచ సంస్కృతులు గావించెను. శరణాగతిధర్మమును గూర్చియు నామౌని అన్నమార్యున కుపదేశించెను. అంతలోఁ గొన్నాళ్ళకు అన్నమార్యుని వెదకికొనుచు నాతని తల్లి యచ్చటికివచ్చినట్లున్నది[1]. మౌనివాక్యమును ద్రోయఁజాలక అన్నమయ్య తల్లితో నింటికేగెను. 'ఎలజవ్వనము'న తలిదండ్రుల ప్రయత్నమునను, పరమాత్ముని యనుగ్రహమునను అన్నమార్యుఁ డిద్దఱు పడఁతులనుఁ బెండ్లియాడెను. వారిలో నొక్క తిరువాలుగంటి తిరుమలమ్మ. మఱియొక్క కన్య అక్కలమ్మ.[2] ఇట్లు వారిని ఆగమోక్త ప్రకారమున వివాహమైన వెనుక, అహోబల నృసింహుఁడే "గురుభావమునఁ జేరుకొని త్రిదండంబు నారసింహ చక్రాది మంత్రములు" దయసేయఁగొనుచు హయగ్రీవుఁ బ్రత్యక్షంబుఁ జేసి ధర సర్వతంత్ర స్వతంత్రుఁడైనట్టి వేదాంతదేశికు వేంకటాచార్యు నాదివ్యసాంప్రదాయమున వర్తించు శఠగోపముని వద్ద సకల వేదాంత పఠనంబుఁ గావించెను.[3]

మంచి ప్రాయమున నున్నప్పుడే వాల్మీకిరామాయణ మెల్ల సంకీర్తనాత్మకముగా వెలయించెను.[4] అన్నమచార్యుని సంకీర్తన

---

1. చిన్నన్నరచనలో నడుమకొంత గ్రంథపాతమున్నట్లున్నది.

2. వీరిలో పెద్దభార్యయగు నీ తిరుమలమ్మయే "సుభద్రాపరిణయ" కర్త్రియగు తాళ్ళపాక తిమ్మక్క. నరసింహగురుని తల్లి.

3. "ఈ శఠకోపముని అహోబలమఠ ప్రతిష్ఠాపనాచార్యులయిన యాదివన్ శఠకోపమునీశ్వరులగుదురు. అన్నమయనాఁట నీ శఠకోపయతులే వర్తిల్లిరి" అని శ్రీ శాస్త్రిగారు అన్నమాచార్యచరిత్ర పీఠికలో వ్రాసియున్నారు.

4. అన్నమాచార్యుని సంకీర్తనములలో రామాయణ కథాఘటితములు చాలఁగలవు

పద్ధతి జగన్మోహనమై ప్రఖ్యాతికెక్కెను. అతని హరిభక్తిని సంకీర్తన రచనాశక్తిని, గానశక్తిని తలపోసి "తుంబురుఁడో నారదుఁడో కాక యీ విధంబునఁ దిరుగు గంధర్వుఁడో" యని ప్రజ లరుదందసాగిరి. ఆవార్తలు విని "ఆచేర్వ టంగుటూరను పురంబేలు రాచమూకలలోఁ బరాక్రమశాలి. నాళీకబాంధవా (శాత్రవా?) న్వయుఁడ జేయుఁ" డగు సాళువ నరసింహజనపాలుఁ డన్నమయ్యా నాశ్రయించి, 'శ్రీకృష్ణు మన్ననఁ గ్రీడి భూచక్రమేకచక్రంబుగా నేలినవగిది' నాతని సాహాయ్యమున నేలుదునని యర్థింపఁగా అన్నమయ్య ఆ విన్నప మాలకించి యాతని ననుగ్రహించుట కంగీకరించెను.[1] అతఁడు భృత్యప్రాయుఁడై కొల్చిరాగా అన్నమయ్య టంగుటూరి కేతెంచి, కేశవస్వామినిదర్శించి యాకోవెలదండఁ దనకు సకల సంపదలతో సవరించియున్న యొకపెద్ద నగరిలో నుండుచుండెను. రాయఁడు తన సంపదలన్నియు నన్నమయ్యవేయని తలఁచుచు "హితునిగా గురునిగా నెల్లబంధువుగ నతనినే భావించుచుండెను. అన్నమాచార్యునను గ్రహమున నీరాజు పరిపంథిబలముల నణచి సింహాసనముచేకొని రాజధానియగు పెనుగొండలో నివాసమేర్పరచుకొని అన్నమాచార్యు నటకు రావించెను. తనకుఁగల్గిన యభ్యుదయమునకుఁ గృతజ్ఞతా సూచకముగా రాయఁడు అన్నమయ్యకు మ్రొక్కి కనకాంబరాదుల గ్రామసంతతుల నొసగి పూజ సేసెను. అతని కీర్తనములను విన నభిలషించెను. అన్నమయ్య కెలనఁజూపట్టు సంకీర్తనపరులతోఁగూడి శ్రుతికలిపి రసరాగభావములుట్టిపడునట్లు వేంకటపతిపైఁ దాను సవరించిన మేలైన కీర్తనము[2]

---

1. ఈ పట్టున చిన్నన్న సూచించిన కీర్తనము లివి తిలకింపుడు.

'పలుక వైష్ణవ భాష లెందునుండినాను
వలనుగ మాకుసహవాస యోగ్యులే
తలకొన్న దాసానుదాస్యమెందుండినాను
అల కర్మదూరులైన నంతరంగులు' (9-201)
'సహజ వైష్ణవాచారవర్తనుల సహవాసమె మాసంధ్య.'
(ᒧ-10)

2. అన్నమాచార్యుని కీర్తన రచనా వైభవమును గూర్చి యీ పట్టున చిన్నన్న-

లను పాడి వినిపింపగా "కవులెల్లఁ జేయెత్తి మ్రొక్కి"రి. అతని శృంగార కీర్తనములందలి కవితయు, శృంగారభావంబును కాళిదాసాదు లైన కవులందుఁ జిక్కినకవులందుఁ గానరాదని ప్రభువు కీర్తించెను. కీర్తించి వచ్చల కడియాలు, బంగారుమ్రాతపచ్చడాలు కెంబట్టు కుళాయి, అంగదంబులు, నుభయాతపత్రములు, రంగైన వింజామరల తోడు, గిండియును, గళాచికయు బహూకరించెను. "తన పెద్దనగరి యొద్దనె యొక్క పెద్దనగరు నను వొందఁజూపించి యలనుండఁ" బనిచెను. అనుదినంబును వేంకటాద్రీశుమీఁది వినుతులు వేడుక విను చుండెను. కొన్ని నాళ్లు గడిచినవి.

ఒకనాఁడు రాయల యాహ్వానముపై లాంఛనములతో జతు రంత యానంబునెక్కి సంకీర్తనపరులు సేవించి వెంటరాగా నృపతి యాస్థానము కేగెను. పల్లకి డిగి వెంటఁబరగు వైష్ణవుని నల్లన చేయూది లోనికరిగి తనరాక నీక్షించు నారాజును నెయ్యము తియ్య మెసగ 'శ్రీనివాసో రక్షు' తనుచుఁ జేతిరుమణి నిచ్చెను. అతఁడును సాగిమ్రొక్కి పసిడిగద్దియ మీఁద గూర్చుండఁబెట్టి కవులు విద్వాంసులు గాయకుల్ భూమిధవులు సామంతులుఁ దనుఁజుట్టి కొలువఁ దీర్చిన సభలో "చెలులార వెంకటశిఖరి నాయకుని కలికిఁ గడగంటగనువట్టు నెలుపు చెలువ మేగతినుండెఁ జెప్పరే"[1] అను శృంగార పదమును పలుమారు బాడించుకొని 'యిది కవిత్వం' బని మెచ్చి గర్వించెను.

---

చక్కెరై చవిజూపి జాతై తావిచల్లి
అక్కజవుమాతువజ్రాలై మెరసీని
నిక్కుటద్దములై మా నిలువునీడలు చూపి
అక్కర తాళ్లపాక అన్నమయ పదములు'

అని పెద తిరుమలాచార్యాదులు కీర్తించిన తెలుగున చిత్రించెను.

1. ఇదియే

"ఏమొకో చిగురుటధరమున నెఱనెఱ కస్తురిచిలికెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా"

అను శృంగారపదము. చూ. 3-487

అన్నమాచార్యుల మహాత్త్వమంతయు వీనులార వినియు, కన్నార కనియు నరసింగరాయఁ డప్పుడు గర్వాంధుఁడై యట్టి పదమొక్క దానిని తనపైఁ జెప్పుఁడని యర్థించెను. 'హరిహరీ!' యని అన్నమయ్య చెవులు మూసికొని హరిముకుందునిఁ గొనియాడు నాజిహ్వ నినుఁగొనియాడంగనేరదెంతైన[1] అని యతని నైచ్యంపుబలుకును ఖండించి స్వస్థానమునకుఁబోదునని దిగ్గనలేచి చనెను. రాయఁ డవమానితుఁడై ప్రతీకారబుద్ధితో అన్నమయ్యకు "మూరురాయరగండ సంకెలనిడి మొగసాలలో నిడ" భటుల కాజ్ఞ యిచ్చెను. బంధితుఁడై అన్నమయ్య ప్రహ్లాదునివలె మురవైరిఁ దలఁచి 'సంకెల లిడువేళ' అను కీర్తనమును పాడెను.[2] సంకెల లూడిపడెను. ఆ వార్త విన్న రాయఁడు "పగగొన్న బెబ్బులిపగిది నేతెంచి" మరల తన సమక్షమున

---

1. చూ. కీర్తనము

గరిమల నెరఁగరు గాకమానవులు
సిరులఁ దియ్యని నోరఁ జేదుమేసేదా
హరినారాయణ యనియెడి నోరను
ధర నితరుల పేళ్లు దడవుపెట్టు
సరవితో వేదములు చదివేటి నోరను
పరులమీఁది పదాలు పాడేనా" 9-16

అప్పుడు సభలోని పెద్దలు అన్నమార్యునకు నచ్చచెప్పఁబోయినట్లున్నారు.

తలఁగరో లోకులు తడవకు రోమమ్ము
కలిగిన దిది మాకాపురము
నరహరి కీర్తన నానినజిహ్వా
పరునుతింపఁగ నోపద జిహ్వా 3-144

అవి వారిని వారించినాఁడు. నరుల నాశ్రయించిన తన యవివేకమునకు నొచ్చుకొనినాఁడు చూ. కీర్తన 5-252

2. చూ. కీర్తనము

"ఆఁకటి వేళల నలపైన వేళలఁ
దేకువ హరినామమె దిక్కు మఱిలేదు" 5-100

సంకెలను వేయించెను. అతని యెదుటనే మరల అన్నమయ్య స్వామి నర్థించుటయు సంకెలలూడుటయు జరిగెను. భూపతి భయమంది యాచార్యుని చరణాబ్జములకు సాగిలిమ్రొక్కి "అపరాధినపరాధి నన్నమాచార్య కృపఁజూడు కృపఁజూడు కృపణశరణ్యా" అని దీనుఁడై విలపించెను. నరసింగరాయఁడు పట్టమహిషితోఁగూడి యాతని పాదములనుఁ బన్నీటితోఁ గడిగి పూజించి సాగనంపునపుడు పసిడి యనుసుల చతురంతయాన మెక్కించి తనమూఁపున పల్లకి కొమ్ముఁబట్టి యెత్తెను. అన్నమాచార్యుఁ డాతనిఁ "జిన్ననాఁట నుండియును బనుపడ బంటుగాఁ గొనియాడుటచేత ప్రసన్నుఁడై యనుగ్రహించెను.

నరహరి సంకీర్తనము సేయువారినికఁ బరసమానులుగాఁగఁ బరికింప వలదని మందలించెను. కృతయుగమున ధ్యానమునకును, త్రేతాయుగమున క్రతువులకును, ద్వాపరమున నర్చనలకును మెచ్చి పరమాత్ముఁ డిచ్చెడి యీవులన్నియుఁ గలియుగమున జలజోదరుఁడు నిజ సంకీర్తనమున ననుగ్రహించును - అని యాతఁడు చెప్పిన వెనుక తదాది రాయఁడు భయభక్తులతో మెలఁగఁజొచ్చెను.

పిమ్మట నారాజు వీడ్కొని అన్నమయ్య తిరుమలకు విచ్చేసి స్వామివారికి 'శృంగారమంజరి'[1] ని సమర్పించెను. శేషాచలాధీశుఁడును అన్నమాచార్యుని సంకీర్తనములకుఁ జొక్కి యానందించుచుండెను. ఇట్లు అన్నమార్యుఁడు ప్రతివత్సరము తప్పక వృషభాద్రిపతికిఁ గావించు నా బ్రహ్మోత్సవములు సేవించుకొనుచు నా శ్రీశైలనాథునను గ్రహమున సకల వాచాశుద్ధి గలిగి మహామహిమాన్వితుఁడై వినుతి కెక్కెను.

అతని మహిమలను విని ప్రజలు పరిపరి విధముల దీనులై యనుగ్రహమర్థించుచుండిరట. చిన్నన్న తాతగారి మహిమలొకటి రెంటిని గ్రంథస్థముఁ గావించినాఁడు.

---

1. అన్నమాచార్యుని రచనలలో "శృంగార మంజరి" యొకటి. ఇది యాతని చివరి కృతులలో నొకటియని చిన్నన్న రచనను బట్టి తలఁపనగుచున్నది. కథాసందర్భమునుబట్టి యప్పటికి అన్నమయ్య వృద్ధుఁడుగాఁ దోచుచున్నాడు.

తమ యగ్రహారమగు మరులుంకులోని పుల్లని జీడిమామిడి పండ్ల చెట్టును,మాధవునకుఁ బండ్లు పులియకుండుటకై ,తియ్యమామిడి చెట్టుగా నొనరించినాఁడట. ఎవరో "పెండ్లియాడఁ గాసువీసము కల్గనను గ్రహించవలసినదిగా నర్థింపఁగా నన్నమయ్య "అటువలెనేగాక" యనెనట. పిదప నావిప్రుఁడట వీధి కేగినపుడు రాజొకఁడు వాని నాదరంబునఁ బిలిచి వలసిన ధనమిచ్చి వివాహమున కేర్పాటు చేయించెనట.

ఇట్లు వృద్ధుఁడై మహిమాన్వితుఁడగు నన్నమార్యుని మహాసీయుఁడగు పురందరదాసాహ్వాయుండు దర్శింపవచ్చెను. తాళ్లపాక శాసనుఁడగు నన్నమయ్య నాతఁడు వెన్నునిగానె భావించి కీర్తించి సన్నుతి చేసెను. ఆచార్యవర్యుఁడును పురందరదాసుని విట్టలునిఁగాఁ దలఁచి సంభావించెను.

ఈ విధమున చిన్నన్న విపులముగా తాతగారి జీవితమును రచించి, తుదకు వారి రచనలనుగూర్చి కొంత వ్రాసినవాఁడై "తన యంతవారిఁ బుత్రకులఁ బడసియుండిన వారై శౌరికథాసుధాసల్లాప గరిమ ధారుణి నెంతయుఁ దనరారు చుండి"రని ముగించెను.

ఈ జీవిత చరిత్రమందలి విశేషములే కాక అన్నమాచార్యుని సంకీర్తనములనుబట్టి కూడ మఱికొన్ని వైయక్తిక విషయములు వెల్లడియగుచున్నవి.

అన్నమయ్య "చుట్టపు బంధాల రొచ్చు" (5-111) న కేవగించుకొనినాఁడు. దొరలైయె యప్పులవారిఁ దోసిదోసి పరిభవములనెల్ల బాయఁజేసికొనినాఁడు (2-218). నరసింగరాయని యజ్ఞతను దలచి కాఁబోలును "నరులను బొగడు జీవనముకన్నా చెట్టుగనో మృగముగనో పుట్టుట మే"లని(5-222) చింతించెను. సంకెల లిడి రాయఁడు అన్నమయ్యను బాధించినపుడు కావచ్చును

"నీ దాసుల భంగములు నీవు చూతు రా
యేదరి చూచేవు నీకు నెచ్చరింపవలెనా

ద్వారకానగరములో తగనెత్తమాడే నీకు
బిరాన ద్రౌపది మొరవెట్టినయట్లు
ఘోరపు రాజసభలఁ గుంది విన్నవించితిమి
యేరీతి పరాకు నీకు నిక రక్షించరాదా (8-266)

అని మొరవెట్టుకొన్నాడు స్వామికి.

గజపతుల దండయాత్రల సందర్భమున వారి పలుకుబడికి లొంగి కాఁబోలును "వోగినొడ్డె భాషలాడి వొడ్డెవాఁడనైతిని, తెగి తెలుఁగాడ నేర్చి తెలుఁగు వాఁడనైతి" (9-90) నని చెప్పుకొనినాఁడు.

అన్నమయ్య విజయనగరములో దేవుని యూరేగింపుల వెంట భజన కూటముల నిర్వహించినట్లున్నాడు. చూ. కీర్తన

విజయనగరములో వీధుల వీధులవెంట
భుజమురికలతోడఁ బొద్దుపుచ్చేవో
త్రిజగములు నేలిన తిరువేంకటేశుండ
భజన నిలిచితి భూపతిచెరువుకాడను (4-40)

నరసింగరాయఁడు సింహాసన మాక్రమించి కొన్నాళ్లు పెనుగొండలో నుండి పిదప విజయనగరరాజధానిని చేరుకొనినట్లున్నాఁడు. ఆ దినములలో అన్నమాచార్యుఁడును రాయనితోఁబాటు పెనుగొండ విజయనగరములం దున్నట్లున్నాఁడు. రాయఁడు పెనుగొండలో సామంతాధిశుఁడుగా నుండఁగా అన్నమాచార్యునకు అగ్రహారాదికములిచ్చి సన్మానించినాఁడు. "వేంకటాద్రీశుమీఁది వినుతులు వేడుకవినుచుండి యుండె-నరనాథుఁడట నొక్కనాఁడు" అని చిన్నన్న కొంతకాల వ్యవధానమును సూచించుటను బట్టి రాయఁడు విజయనగరాధీశుఁడైన సందర్భమున క్రీ. 1485 ప్రాంతములందెప్పుడో అన్నమయ్యను శృంఖలాబద్ధునిఁ గావించి యుండుననవచ్చును. అన్నమార్యుఁడప్పటికి వృద్ధుఁడు. "వల్లకి దిగి వెంటఁ బరగు వైష్ణవుని నల్లన చెయ్యూది యాలోనికరిగి" నాఁడట. (చూ. ద్విపద ౬౫). ఏమైనను అన్నమాచార్యుఁ డీశృంఖలాబంధనోదంతము జరిగిన

పిమ్మట రాయని వీడి తిరుమలకు విచ్చేసినాఁడు. కాని వార్ధక్యమున నాతఁడు తిరుమల మీఁదనే స్థిరనివాసముండినట్లు కానరాదు. చిన్నన్న ప్రతి వత్సరము తప్పక వృషభాద్రిపతికిఁ గావించు నా బ్రహ్మోత్సవములు సేవించుకొనుచు నుండినట్లు వర్ణించుటనుబట్టి కూడ మనమా విషయమును గుర్తింపవచ్చును. ఆ తుది దినములలో "తాళ్ళపాక శాసనుఁ" డగు అన్నమార్యుఁడు తన కుటుంబము వారితోఁగలిసి తాళ్ళపాకయందే ఉండుచుండెనని తలఁపవచ్చును. తమ యగ్రహారమై తనరుచున్న మరులుంకు (?) నందుకూడ కొంతకాలముండినట్లు న్నాడు. తుది దినములలో అన్నమయ్య తిరుమల చేరుకొనవలెనని తాపత్రయ పడినాఁడు. పాలమురాజుల వెంటఁబోయెడి దైన్యము తగదని అనుభవ పూర్వకముగాఁ దమవారికి చాటి చెప్పినాఁడు. చూ

చీచీ వివేకమా చిత్తపు వికారమా
యేచి హరిఁగొలువక హీనుఁడాయె జీవుఁడు.
బలికేనంటాఁబోయి పయిడిపుచ్చుక తన
పతియవసరమునఁ బ్రాణమిచ్చీని
బతుకందులోననేది పసిడి యెక్కడనుండు
గతి హరిఁగొలువక కట్టువడె జీవుఁడు (6-18)

అన్నమయ్య గారి కుమారులు నృసింహ పెద తిరుమలయ్యలు సాళువ నృసింహుని యనంతర మాతని తనయుల పక్షము వహించి, సర్వసేనాధిపతియై రాజ్యమును గైవసము చేసికొనవలెనని దుస్తంత్రములఁ బన్నుచుండిన తుళువ నరసారాయనితో విరోధించినట్లున్నారు. అన్నమయ్య వృద్ధుఁడైనాడు. అతని కప్పటి రాజకీయ వాతావరణము తృప్తిని గొలుపక పోయినది. అందుకే అట్లు హితము చెప్పినాడు. మఱియుఁ జూడుఁడు.

వెగ్గలమింతా వృథావృథా
తగ్గి పరులతో దైన్యములేలా
తడవఁగఁ దడవఁగ దగిలీబంధము
విడువఁగ విడువఁగ వీడునది

గుడిశలోన నొక్క కుక్కిమంచమున
వొడలు సగమునను వుండెడిదింతే... (10-242)

ఆ యవస్థలను భరింపలేక నే "వేంకటాద్రి పొంతనుండ వేగ మమ్మునంపవే" (9-148) అని ప్రార్థించుకొనినాఁడు. అంతేకాదు.

కాలము కాలము గాదు కపటాలె తలచాయ
చాలు నింక దీనితోడి జాలిమానరే
పిన్ననాటనుండి తన పెంచిన యీ దేహము
మున్నిటివలెగాదు ముదిసీని
యెన్నిఁదినాలచేత నెప్పుడేడఁబడునో
కన్నవారి చేతికి గక్కున నియ్యరే
కింకపు కిసరు చేత కీడైన దేహము
వంకవంక తెరువుల వడిసీని
యింక నీ విధిచేత నెప్పుడేడ బడునో
వేంకటేశుఁ జేరఁ పడవేయగదరే. (5-208)

అని తనవారి నర్థించినాఁడు.

అన్నమాచార్యుఁడు తమ యగ్రహారములందున్నప్పుడెప్పుడో ప్రయాణములందో మరియే కారణముననో ఆతని యింటి పూజా విగ్రహములు పోయినవి. ఇట్లు విలపించినాఁడు.

'నీవు నాసొమ్మవు నేను నీ సొమ్ము
యీవల నీవెప్పుడు మాయింటనుండఁదగవా?' (11-184)

'ఇందిరారమణుఁ దెచ్చియియ్యరో మా కిటువలె
పొంది యీతని పూజింపఁబోద్దాయనిపుడు'(11-184)

మరల నెట్లో ఆ పూజావిగ్రహము వారికి లభించినట్లున్నది ఇట్లు పాడుకొనినాఁడు.

కంటిమి నేఁడిదె గరుడాచలపతి
యింటి వేలుపగు నీశ్వరుఁ డితఁడు (11-209)

తాళ్ళపాకవారు తమయింటి దేవతార్చనావిగ్రహములను పలు సంకీర్తనములలో ప్రస్తుతించుకొనినారు. చూ. "బలుపగు లక్ష్మి పతియగు శ్రీవారి యిల మాయింటను యిదివో నిలిచె" (8-10). 'బలదేవుఁడైన శ్రీపతి మాయింటిలోన అలరివున్నాఁడు మాయంత వారు వేరి' (8-54)

తుదిదినములలో నన్నమయ్య విరక్తుఁడై జీవనమును గడపినను చుట్టు వున్న వారాతని పలుకుబడిని మహిమలను విని యేవేవో అర్థించుచుండెడివారు కాఁబోలును— వారి బాధ పడఁజాలక ఇట్లు చెప్పుకొనినాఁడు.

పరమాత్మ నిన్నుగొల్చి బ్రతికేము
విరసపు జాలి జిక్కి వెతఁబడనోపము
పొసఁగ దేవుఁడిచ్చినా పూజారి వరమీఁడు
విసిగి నే విడిచినా విడువరు లోకులు
కొసరేరు ముసరేరు కోరికఁ దీర్చమనేరు
వనిలేని పనులకు బడలనేనోపను. (8-220)

అన్నమయ్య యిట్లు 79 యేండ్లు జీవించి కొడుకుగూతుంద్ర యభ్యుదయమును గాంచుచు తుది దినములు ఈశ్వరారాధనముతోఁ గడిపెను. కాని యాతఁడు జీవించియుండఁగానే యెవరో తమయింటి వారు చనిపోయినారు. ఇట్లు చింతించినాఁడు.

వెట్టిమోపువంటి మేను విడనాడి వీఁ
డిట్టె దాటిపోయె నెటువంటి జాణే
కన్నవారిఁదన్నుఁ బ్రేమనన్నవారి దిగనాడి
వున్నతమైన చోటనుండఁబోయి
తన్నుఁదా వేంకటపతి దాసులఁజేరినాఁడు
యెన్నఁడుఁ దిరిగిరాఁడే యెటువంటిజాణే (5-115)

తనవారని యాసం దగిలి భ్రమయనేల
తనువుం బ్రాణునికంటె తగులేది

తనువుం బ్రాణుండు తగిలి గర్భమునందు
వొనరనేకమై యుదయించి
దినములు చెల్లిన తివిరి యీ ప్రాణుండు
తనువు విడిచిపోయె దయలేక. (2-211)

ఇందొక వ్యక్తి బాల్యముననే పోయినట్లున్నాడు. మరియొక వ్యక్తి కొన్ని యేండ్లు మాత్రమే జీవించి యంతరించినట్లున్నాఁడు. ఇరువురును బురుషులే. అన్నమాచార్యుని నిర్యాణమునకు పూర్వమే పరమపదించిన వీరెవరో స్పష్టముగా తెలియరాదు. కాని తాళ్ళపాక నరసింహాకవి తనయులు ముప్పురినిఁ గూర్చియుఁ దరువాతి కాలమున మనకేమియుఁ దెలియరాని కారణమున వీరు వారై యుండవచ్చునేమో అని తలఁచుచున్నాను.

అన్నమయ్య జీవిత కాలమున 1472-74 నడుమ నొకప్పుడు పెద్దకరవు వచ్చినట్లు దెలియుచున్నది.[1]

"కడునజ్ఞానపు కరువుకాలమిదె
వెడలదొబ్బి మావెరపుదీర్పవే" (8-19)

అని అన్నమయ్య అప్పుడే వ్రాసినాఁడు కాఁబోలును. ఆ కరువు ప్రభావము క్రీ॥ శ॥ 1475 మన్మథ నామ సంవత్సరమందునుఁ గలదు కాఁబోలును. అన్నమయ్య యిట్లువ్రాసెను:

చింతలచిగురే చిచ్చులట
యిఁతటిలో నింక నేలాగే
చక్కని మన్మథ సంవత్సరమున
చుక్కలరాజే సూరియుఁడై
యెక్కువరాత్రుల నెండగాయునట
యెక్కడిదింక బ్రతుకేలాగే

1. చూ. వ్యాసయోగి చరిత్ర పీఠిక పు. CXIV శ్రీ బి. వెంకోబ రావుగారు ధార్వార్ గెజిటీర్ నుదాహరించి వ్రాసినారు.

కుంకుమ గుబ్బల కుంభరాసికిని
వంకల చంద్రుడు వచ్చెనట. (3-660)

ఇట్లు తాళ్ళపాకవారి వంశీకులలో నొక్క అన్నమయ్యగారి జీవితమునుః గూర్చి మాత్రమే గొన్ని విషయములు తెలియ వచ్చు చున్నవి. మిగిలినవారి జీవిత విశేషములు మనకంతగాఁదెలియఁదగిన చారిత్రకాధారములు లేవు. అయినను సంకీర్తనములను బట్టి గుర్తింపఁ దగినంతవట్టు వివరింతును.

## తాళ్ళపాక తిమ్మక్క

తిమ్మక్క అన్నమాచార్యుని పెద్దభార్య. నృసింహకవికిఁదల్లి. అన్నమాచార్యుఁడు తిమ్మక్క అక్కమాంబ లిరువుర నేకకాలము ననే పెండ్లి యాడినట్లు చిన్నన్న రచనమును బట్టి తెలిసికొంటిమి. ఈమె జీవితమునుఁ గూర్చి తక్కిన వివరము లేమియుఁ దెలియరావు గాని యామె విదుషీమణి యనియుఁ గవయిత్రియనియు మాత్రము దెలియవచ్చు చున్నది. ఈమె 'సుభద్రాపరిణయ' మను కృతిని మంజరీ ద్విపద యనఁదగిన గేయచ్ఛందమున సంధానించినది. మన మెరిగి నంతలో నీమెయే తొలి తెలుఁగు కవయిత్రి యనవలసి యున్నది. అట్టి యీ తిమ్మక్క ప్రేయసిగా, భక్తిమయ గేయ రచన కవితఁగా తత్కవితావల్లభుఁడు శ్రీ వేంకటేశ్వరస్వామిగా, అన్నమాచార్యు నకు లభించినది. ఆయన ధన్యుఁడు. ఒక శృంగార సంకీర్తనమున అన్న మాచార్యుఁడు తానే నాయికయై కాబోలు నిట్లు చెప్పుకొనినాఁడు.

సాగిన సభలలోన సరివారిలోననెల్లా
యీగతి మన్నించితివి యీమెదేపో బ్రతుకు
వంచిన చెలి శిరసు వడినెత్తి పలికించి
చంచలించక నవ్వితి చాలదా యింత
కొంచకాపె గుణములు కొనియాడి కొలువులో
యెంచి మన్నించితి విట్టియీమెదేపో బ్రతుకు (3-516)

అని, ఇందేమేని అతని భార్యామణియగు తిమ్మక్క ప్రశంస ధ్వనిగా నున్నదేమో!

## నరసింహ కవి

పద కవితా పితామహుఁడగు అన్నమాచార్యునకును, విదుషీ మణి యగు తిమ్మక్కకును కల్గిన సుపుత్రుడే నరసింగన్న. నిరుపమాన సుకవితా నిర్వాహకుడఁగు తెనాలి రామకృష్ణ కవి తన సమీపకాలము వారగు తాళ్ళపాక కవుల నిట్లు సన్నుతించెను.

క. చిన్నన్న ద్విపద కెఱఁగును
పన్నుగఁ బెద తిరుమలయ్య పదమున కెఱఁగున్
మిన్నంది మొరసె నరసిం[1]
గన్న కవిత్వంబు పద్య గద్యశ్రేణిన్.

అతఁడీ పద్యమున తనకు సమకాలికుఁడుగా వర్తిల్లిన చిన్నన్నను అతనితండ్రియగు పెదతిరుమలాచార్యుని, అతని యన్నయగు నరసింగన్నను మెచ్చినాఁడు. "ద్విపదమునకు చిన్నన్న వ్రాలును. పదములకు పెదతిరుమలయ్య వ్రాలును. పద్య గద్య (ని) శ్రేణిని నరసింగన్న మిన్నంది మ్రోగును- అని దీనియర్థమనుకొందును" అని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వివరించి, వృద్ధానుశ్రుతినిబట్టి కవికర్ణరసాయన కర్త యగు నరసింగన్నయే తాళ్లపాక నరసింగన్న కాఁగూడునను నభిప్రాయముఁ బలపరచిరి.

పై పద్యమున తాళ్లపాక నరసింగన్న కవితా విషయమున మిక్కిలిఁగా ప్రస్తుతుఁడయ్యెను. చిన్నన్న అష్టమహిషీ కళ్యాణమున "పాడఁజెప్పఁగ వర్ణపద్ధతి నీడుజోడు లేఁడన సభఁజొచ్చి వాదించి వరగిన ధీశాలి ప్రతివాది దైత్యనరశింహుఁడనగల్గె నరశింహ గురుఁడు" అని యీతనిని స్తుతించెను. ఇంతకుమించి యీతనిఁ గూర్చిన విషయ

1. రామకృష్ణునకు చిన్నన్నకు నూరేండ్ల తర్వాత నవ్వకవీయమున నీపద్య ముదాహృతమైనది.

మేదియు లోకమునఁ గానరాకున్నది. పై వర్ణనములను బట్టి యాతఁడు గొప్పకవియేకాక సంగీతశాస్త్రమున గొప్ప ప్రవేశము గలవాఁడనియుఁ దెలియుచున్నది. చక్కని పదములకూర్పుతోఁ గవితఁ జెప్పి కమ్మని కంఠముతోఁ బాడగలవాఁడనియేకాక ధాతుమాతువుల వివేకముతో గానక్రియనెరిగి సంగీతమును జక్కఁగాఁ బాడి యితరులకుఁ జెప్పఁగలవాఁడనియుఁ దెలియుచున్నది.

అతనికి సంతానము ముగ్గురుండినట్లు చిన్నన్న పేర్కొన్నను వారినిఁగూర్చిన వివరము లేవియు మనకుఁ దెలియరాకుండుటనుబట్టి వారు ముప్పురునుఁ బుట్టిన కొలదికాలమునకే-తాతగారి నిర్యాణమున కన్నమునుపే - పరమపదించినారేమో అనిపించును. అతనికి సంతానముకూడ నించుక ఆలస్యముగ కలిగెనేమో. కవికర్ణరసాయన కర్త యాతఁడేయగునేని పుత్రవ్యామోహమున యువనాశ్వుఁడు పరితపించుచుండినట్లాతనినోట చెప్పింపఁబడినపద్యము లైదారును నరసింగన్నకు సంతానముమీఁది మమకారమును సూచించునవే కాఁగలవు."ఏలాబిడ్డలు లేని యీ బ్రతుకు గొడ్డేరయ్యో జింతింపఁగన్"అని నరసింగన్న చింతించి, విరక్తుఁడై తుదకు సన్యసించినట్లున్నాఁడు. క్రీ. 1546 నకుఁబూర్వమే యీతఁడు దివ్యధామమందినాఁడు. చిన్నన్న వేయించిన యొక శాసనమున (తి.తి.దే.శా. 5-71) తనపెదతండ్రి నరసయ్యంగారి ప్రత్యాబ్దిక దినమున మాఘ శుద్ధ చతుర్థీ తిథిని కొన్ని విశేషార్చనములనుగూర్చిన ప్రసక్తి కలదు.

అన్నమాచార్యుని నిర్యాణానంతరము అతని తనయులగు నరసింగన్నయు, పెదతిరుమలాచార్యుఁడును రాజకీయ చతురంగపు పెత్తులలోఁదగుల్కొని చీకాకులపాలై స్వస్థానమగు తాళ్లపాక గ్రామమును విడనాడి పోవలసిన వారైనట్లున్నారు. పెదతిరుమలయ్య తిరుపతికిఁ జేరుకొనెను·నరసింగన్న అహోబలముమీదుగా చివరిదినములలో శ్రీరంగము చేరినట్లున్నాఁడు. ఆనడుమఁకొంతకాలమిం కెక్కడనేని యుండెనేమో ! అన్నమాచార్యుని నిర్యాణమున కించుక పూర్వమే క్రీ. 1490 ప్రాంతములందు సాళ్వ నరసింహారాయఁడు పరమపదించుటయు నాతని తనయుఁడును బాలుడునునగు నిమ్మడి

నృసింహారాయలను చాటుగాఁ బెట్టుకొని సర్వసేనాధిపతియగు తుళువ నరసానాయకుడు రాజ్యమును స్వైవసము చేసికొనుటకు యత్నించుటయు జరిగెను. అప్పు డీకుటుంబమువారు సాళువరాజు పక్షము వహించినట్లున్నారు. తుళువ నరసానాయకున కప్పుడు ప్రతిపక్షులు పలువురుండిరి. వారిలో వీరు నొకరై ప్రధానపాత్ర వహించి యుండిరేమో! అన్నమాచార్యుని కీర్తనములు కొన్నియావిషయములనుఁ దలపించునవి గలవు.

ఏమిసేయవచ్చుఁగర్మమిచ్చినంతకానిలేదు
తాము నేసినంతవట్టు తమకుఁబోరాదు
అడిగి పరుల బతుకాసపడ్డలేదు భీతి
విడిచి నెత్తుటఁ దోగి పీరుఁడైన లేదు
అడవులెల్లఁ దిరిగి అలమటించినలేదు
ఇడుమపాటుఁ జొచ్చి యియ్యకున్నలేదు (11-2-29)

నరసానాయకుఁడీ కుటుంబమువారి నిబ్బందులపాలు చేసినట్లున్నాఁడు.

దిక్కులేకపోయె నిట్టే దినదినము
వెక్కసపులోక మేలే విభుఁడెవ్వఁడో
గుత్తముగా నెల్లవారుఁ గుడిచేటి కంచము
ఎత్తుక లోఁబెట్టుకొనె నెవ్వఁడో దొంగ
కొత్తగానే యింతి గట్టే కోక బయట వేసిన
మెత్తని దంటాఁ బట్టిమింగె నెవ్వడో (12-154)

ఇమ్మడి నరసింహారాయల నప్పటికే నరసానాయకుఁడు పెనుగొండలో బంధితునిఁగావించి యుండెను. అందుకేనేమో "లోకమేలే విభుఁడెవ్వఁడో" అని అన్నమయ్య తలపోసెను. పై పదమునఁ గవి తమకెవరో తిండి బట్ట యిల్లు లేకుండఁజేయుటగూర్చి వాపోయెను.

తుళువ నరసానాయకుఁడును, ఆ పిదప వీరనరసింహారాయలును తాళ్లపాకవంశమువారి ప్రాభవమును దగ్గించుటకే యత్నించిరి. ఆ దినములలోనే బహుశః తమయగ్రహారముసువదలుకొని నరసింగన్న

యేసుంకేసులకో చేరఁ కొనినట్లున్నాఁడు. పిదప కృష్ణరాయని కాలమునఁగూడ ప్రభువుల యౌదాసీన్యముకారణముగా నరసింగన్న ప్రతిభ గుర్తింపఁబడక పోయియుండవచ్చును. జీవితమున విరక్తుఁడై తుదకల్లే యంతరించియుండును. ఈతని జీవితమునకు సంబంధించిన చారిత్రికాధారము లేమియుఁదెలియరాని కారణమున తాళ్లపాక వారి సంకీర్తన సంచయములనుఁబట్టి యింతకంటె నధికముగా గుర్తింపవలనుపడకున్నది.

## పెద తిరుమలాచార్యుఁడు

ఈతని జీవిత చరిత్రమును చిన్నన్న రచించియుండెనేమోయని తలఁపనగుచున్నది. అన్నమాచార్య చరిత్ర వ్రాతప్రతిలో "తాళ్ళపాక తిరువెంగళనాథుని జీవిత చరిత్రము కార్వేటి నగర సంస్థానములో ఉన్నది. చూడవలెను." అని వ్రాసియుండుటను శ్రీ ప్రభాకరశాస్త్రిగారు గుర్తించి యున్నారు. (చూ. అన్నమా. పీఠిక పు 1 పాదసూచిక.)[1] పెదతిరుమలాచార్యుని జీవితకాల పరిమాణమునుఁ గూర్చియు, తదితర చారిత్రికాంశములనుఁ గూర్చియు స్థలాంతరమున గొంత వివరముగాఁ జర్చించి యుండుటవలన నిచట గ్రంథస్థ సాక్ష్యముల వలన దెలియనగు నాతని జీవిత విశేషములనుఁగూర్చి మాత్రమే వివరింతును- పెదతిరుమలయ్యయు నన్న గారితోఁ బాటు తుళువ నరసానాయకుని దుండగీనితనమును ధిక్కరించి సాళువరాజు పక్షము వహించి, పోరాడినట్లున్నాడు. క్రీ॥ 1508 లో అన్నమయ్య దివ్యధామమందినాఁడు, తుళువ నరసానాయకుఁడును అంతమొందినాఁడు. వీర నరసింహరాయఁడు నరసానాయకుని అడుగుజాడలననుసరించినాఁడు. ఆ యిరువురి తోడను పెద తిరుమలయ్యకు వైరుధ్యమేర్పడినది. వారిలో నెవరో తిరుమలయ్యనుఁ జంపుటకు కూడ యత్నించినట్లున్నారు. అతఁడే యిట్లు చెప్పుకొనినాఁడు.

---

1. నేనీ సంస్థానమువారికి సంబంధించినవారితో నీ విషయమై ముచ్చటించియుంటిని అట్టి గ్రంథమేదియు నచట కానరాకున్నదని తెలియవచ్చినది. ఇంకను పరిశీలింపఁదగును,

"నాటికినాఁడు గొత్త నేటికి నేఁడు గొత్త
నాటకపు దైవమవు నమోనమో

సిరుల రుక్మాంగదు చేతి కత్తిధార దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయ
హరి నీ కృప కలిమి నట్లనే అరులచే
కరఖడ్గధార నాకుఁ గలువ దండాయ
ఘన ఖడ్గధార నాకుఁ గస్తూరి వాటాయ
అలర శ్రీ వెంకటేశ ఆపదలన్నియుఁ బాపి
యిల నన్నుఁ గాచినది యెన్నఁగతలాయ. (6-85)

"మండెము కోటలో మండలం బెరుగ - మండలాగ్రాహతి మహనీయ పుష్ప, దామమై ధర్మాంగద స్థితిఁబొలిచె - నే మహా మహుని యహీన గాత్రమున" అని చిన్నన్న చెప్పినాఁడు. ఈవృత్తాంతము పెద తిరుమలాచార్యునిఁ గూర్చి గల మరియొక కీర్తనమున కూడా గుర్తింప నగుచున్నది.

కరము జీడి పులుసు కలిగిన మామిడి కరముసోకిన యంతనే
సరవిఁజక్కెరవలెఁ జవి గలిగించువాని చనవరి సుతుఁడితడే...
వేఁకరి మండెము కోట వెళ్ళుతా విచ్చనవిడిరాగా నొక
వీఁకతో వేసిన కత్తితునకలాయ వెన్నుసోకిన యంతనే
గుములుగూడి యలుగులు తిరుగబాటి చుట్టుకొన్న కురుదోవ
నతఁడు
కమలనయనుని దలఁచిన మాత్రాన కకపికలై పాఱెను
దేవుడొక కన్ను దయచేసి తనవద్దకి నంపిన నతఁడు
పావనుఁ డితఁడు తానొక్కకన్నిచ్చె వరుసలుచూడగా
శ్రీ వేంకటప్పని సేవజేయఁగోరి చేకొన్నతను వితడు
భావించి పొగడరే భాగ్యముకల తాళపాక తిరుమలయ్యను[1]

---

1. శేషాచార్యులవారి వ్రాతప్రతినుండి ఉదాహృతము. చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక పు. 65.

పై కీర్తనములందున్నట్లు తిరుమలయ్యమీఁద కత్తి విసరిన ఘనుడీ నరసానాయకుఁడో లేక వీరనరసింహుఁడో కావలెను. "మంటెము రాయ నామక నరసింహదండనేత్రు (తృ?) న కిష్టధన బలస్ఫూర్తి ననుపమంబుగ వేంకటాద్రి చెంగటను తన యగ్రహారమై తనరుచు నున్న మరులుంకు" అని వ్రాసిన చిన్నన్న వాక్యములను వ్యాఖ్యానించుచు, శ్రీ ప్రభాకరశాస్త్రి గారు పై కీర్తనమును సమన్వయించి, దేవకీపుర వాస్తవ్యుఁడగు నరసింహ దండనాథుఁ డిందు ప్రయోజకుడేమో! అని వ్రాసినారు. సత్యమే కాఁదగును. అప్పుడే తిరుమలయ్య తాళ్ళపాకను, మరులుంకును వీడుకొని తిరుపతికిఁ జేరు కొన్నట్లున్నాఁడు. నరసనాయకుని తోడి వైరస్యమే పిదప కృష్ణ రాయఁడు తాళ్లపాక వారియెడ నౌదాసీన్యము వహించుటకు హేతువై యుండును. కృష్ణరాయఁడు ప్రాభవమునకు వచ్చిన తర్వాత తాళ్ళ పాకవారు పరిస్థితులకు లొంగి ఆ ప్రభువు నాశ్రయించుటకుఁ గొంత యత్నించినట్లున్నది. కాని ఫలితము లేకపోయినందున పశ్చాత్తాప పడినారు. క్రీ॥ 1514 లో కృష్ణరాయలు తమ యగ్రహారమగు తాళ్ళ పాకను తమ కిచ్చుటకు బదులుగా రొఖ ధాన్యములతో స్వామివారి కర్పించెను. ప్రసాద భాగములను కూడ రాయఁడు తాళ్ళపాకవారి కిప్పింపలేదు.

పుట్టుభోగులము నేము భువి హరిదాసులము
నట్టనడిమి దొరలు నాకియ్యవలెనా
గ్రామములు రత్నములు గజముఖ్యవస్తువులు
ఆమని భూకాంతకు నంగభేదాలు
భామినియాకె మగని ప్రాణధారిలెంకలము
వోమి మా కాతఁడే యిచ్చి వొరులియ్యవలెనా
(10–94)

అని యాతఁ డప్పుడు పాడుకొనినట్లున్నాఁడు. మరియు చూ. కీర్తన:

గద్దరి జీవుఁడు కామధేనువు మాని
యెద్దు బిదుకఁ బొచ్చె నేది తెరగు

మటుమాయములఁ దనమనసే చంచలమంది
ఇటునటుఁ దిరిగిన నేదితెరఁగు
కటకట వూరేలు కర్తే దొంగలఁగూడి
యెటువలెఁ జేసిన నేదితెరఁగు. (10-2-65)

కృష్ణరాయఁడు తాళ్ళపాకవారి విషయ మంతగా పట్టించుకొనలేదు. వైరస్యమున్నను ప్రకటింపక రాయఁడిట్లుఁ ఉదాసీనుఁడై యుండుటకు సాళ్వ తిమ్మరుసుమంత్రి ప్రధాన కారకుఁడై యుండును. తిమ్మరుసు తాళ్ళపాకవారిని బాగుగా నెరిగినవాఁడును వారియెడ నాదరమును విశ్వాసమునుఁగలవాఁడును. కృష్ణరాయఁడెట్లున్నను, అచ్యుతరాయఁడు మాత్రము తాళ్ళపాకవారికిఁ జాల కావలసినవాఁడు. అచ్యుతుఁడు స్వయముగా కృష్ణరాయని దౌష్ట్యమును, తాళ్ళపాకవారి ధార్మికతను అనుభవించినవాఁ డగుటయే దానికి హేతువు. అందుకే కృష్ణరాయని తుది దినములలో నచ్యుతుఁడు ప్రాభవమునకు వచ్చుచుండఁగాఁ గాబోలును పెదతిరుమలాచార్యుఁడీ కీర్తనమును చెప్పి తమవారి నోదార్చెను.

అతఁడుభక్త సులభుఁడు అచ్యుతుఁడు
రాతిగుండెవాఁడు కాఁడు రంతుమానుఁడికను

జీవుఁడా వేసరకు చిత్తమా జడియకు
దైవము కరుణింపఁ దడవుగాదు
తోవచూపె మనకు తొల్లే ఆచార్యుఁడు
కావలసినట్లయ్యీఁగలఁగకుఁడికను

కాలమా వేగిరించకు కర్మమా నన్ను మీరకు
పాలించి దైవానకు నే భారమిఁకను
ఆలించి తిరుమంత్రమే అతని నన్నుఁ గూరిచె
వేళగానియందాకా వేసరకుఁ డిఁకను (8-99)

అచ్యుతుఁడు అచ్యుతరాయలనుధ్వని యిందు లేకపోలేదు. అచ్యుతదేవరాయలు రాజ్యమునకు వచ్చిన వెంటనే అతనికి తాళ్ళపాకవారికిని అనుబంధ మధికమైనది. పెదతిరుమలాచార్యుఁడు

అచ్యుతదేవరాయల కభీష్టముగా తిరువేంగళనాధ దేవునకు సంకీర్తనములు చెప్పుటను మనము శాసనములందు గుర్తింపఁ గలము. ఆ ఇరువురి యనుబంధమున తిరుమల శ్రీనివాసున కఖండవైభవము చేకూరినది. సాళ్వ తిమ్మరుసయ్యకూడ తుది దినములలో కృష్ణరాయని చేత పరిభవింపఁబడి, పదవీచ్యుతుఁడై చిన్ననాఁటి నుండి తన్నెరిఁగిన పెద తిరుమలయ్యకడకే వచ్చి చేరుకొనెను. తిమ్మరుసయ్యమీఁదఁ దమకుగల భక్తి తాత్పర్యములతో తిరుమలయ్య వారి నాదరించి తన కృతజ్ఞతనుఁ బ్రకటించుకొనెను.

వైరస్యమే కారణము కాకున్నచో సాళువ నరసింహరాయలును, అచ్యుతదేవరాయఁడును, ఆ తరువాత వచ్చినప్రభువు లందరును ఆదరించిన తాళ్ళపాకవారిని తుళువ నరసానాయకుఁడును, తత్పుత్రుఁడు కృష్ణరాయఁడును పండిత పక్షపాతము గలవారయ్యు నాదరింపకుండు టటుంచి అనాదరమును ప్రదర్శించుటకు వేరొక హేతువు కానరాదు.

వచన సంకీర్తనాచార్యుఁడగు తిరుమలయ్య ఒక పదమున తన వచనముల ప్రశంస నిట్లు దెచ్చెను.

> "రుచులు నేనిటు గొనని వేడవి రోఁతలయ్యెడి గాక నేఁడు
> వచనముల హరి నీకు శరణని వసుధఁబావనమైతిగాక" (9-116)

పెద తిరుమలాచార్యుని కీర్తనము లింకనుఁ బ్రకటితములు కాలేదు. అవియన్నియుఁ బ్రకటింపఁబడినపుడుగాని మనకు తక్కిన విశేషము లెరుగరావు. తిరుమలయ్య తన రూపము నిట్లు దిద్దుకొనినాఁడు. చూడుఁడు కీర్తన [1]

---

1. పెద తిరుమలాచార్యుని కీర్తనము లనేకము లిట్లే రాగిరేకులు వ్రాసినవారి పొరబాటువల్లనో యెట్లో అన్నమాచార్యుని సంకీర్తనములుగా ముద్రితములై యున్నవి. రచనా సందర్భమునుబట్టి యట్టి వానిని గుర్తింపవచ్చును.

నీ గురుతులు చూచుకో నీ బిరుదు లెంచుకో
యీగతిని కలబంటు నిఁక నన్నుఁ గావవే

కానీలే నేనెంత కఠినచిత్తుఁడనైన
నా నోసల నివే పట్టె నామములు
మేను తోలు నెమ్ములతో మెరసినదైనాను
పూనితిఁ దమ్మితులసి పూసలపేరులు

భ్రమసి నేఁజేసినది పాపకర్మములైనాను
జమళిభుజాల నివే శంఖచక్రాలు
అమరఁదలఁచుగా నేనాడేవి కల్లలైనా
తమిఁ బాడినాలిక నీతగు సంకీర్తనలు

తలచితే నావోజ తామసగుణమైనాను
పిలిచేది భువిలో నాపేరు తిమ్మఁడు
అలర శ్రీ వేంకటేశ అన్నిటనే దుష్టునైనా
తలకొనె నాయందు దాసరితనములు (11-181)

పెద తిరుమలయ్య తమిళమునందు కూడ కవిత చెప్పఁగల వాఁడు కాఁబోలును.

తి.తి.దే. శాసన సంచయమునందలి 4-40 సంఖ్యగల శాసన విషయము చక్కని తమిళ కవితలో నున్నది. శాసన పరిష్కర్తలు (This piece of Tamil Poetry must have been necessarily composed by the same author (Tirumalai Ayyangar) అని యభిప్రాయపడినారు. పెదతిరుమలయ్య పదకవితలో పేరుమోసినవాఁడు. ఈతని యీరచనారంభమునుఁ గూర్చి రాగిరేకులందిటున్నది."శాలివాహనశకవర్షంబులు 1424అగునేంటి దుందుభి సంవత్సర ఫాల్గున బహుళ ద్వాదశి మొదలుగాను తాళ్ళపాక అన్నమాచార్యులుంగారు తమ కొమారుండు తిరుమలాచార్యులను దినమొక సంకీర్తన శ్రీ వేంకటేశ్వరునకు అంకితంచేసి చెప్పుమనంగాను విన్నపము శేసిన సంకీర్తనలు." రేకులందు అన్నమాచార్యుని నిర్యాణానంతరమే పెద తిరుమ

లయ్యె సంకీర్తన రచన కారంభించినట్లున్నను అతఁడంతకుఁబూర్వము కూడ రచనలు చేయుచుండెననియే తలఁపఁదగును. అతఁడు-వేదాంత విద్యా ప్రవీణుఁడు. సంగీత సాహిత్య సార్వజ్ఞకత్వమంగళ సామ్రాజ్య మహితుఁడై యలరినవాఁడు. శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్య, శ్రీ రామానుజ సిద్ధాంత స్థాపనాచార్య, వేదాంతాచార్య, కవి తార్కిక కేసరి, శరణాగతవజ్రపంజర, ప్రభృతి బిరుదాంచితుఁడు. కవి. గాయకుడు. పండితుడు, బహుభాషావేత్త. వైష్ణవమత ప్రచార దృష్టితో సాహిత్యమును సాధనముగాఁగొని వివిధ సాహితీ ప్రక్రియ లలో వినూత్న యత్నములు గావించుచు నాఁటి సారస్వత సామ్రా జ్యము నేలిన ధురంధరుఁడు. స్నేహితులనుఁ గూర్చుకొని, శిష్యులను జేర్చుకొని సంకీర్తనభాండారము నొకదానిని నెలకొల్పి యా సాహిత్యసంస్థకొక చక్కని వ్యవస్థ నేర్పరచినవాఁడు. శ్రీ వేంక టేశ్వరుని గళము నలంకరించిన తాళ్ళపాక కవిమణిహారమున నాయకమణియైనవాఁడు.

## చిన తిరుమలాచార్యుఁడు

ఈతఁడు పెదతిరుమలాచార్యుని కుమారులలోఁ బెద్దవాఁడు. ఈతనికి అన్నమాచార్యుఁడే బ్రహ్మోపదేశము (ఉపనయనము) గావించినాఁడు. ఇందుకు కీర్తనము గలదు.

తాళ్లపాకాన్నమాచార్య దైవమవు నీవు మాకు
వేళమే శ్రీహరిఁ గన వెరవానతిచ్చితివి
గురుఁడవు నీవె సుమ్మీ కుమతినైన నాకు
సరవి బ్రహ్మోపదేశము నేసితి
పరమబంధుడనైనా పరికింప నీవేసుమ్మీ
వరుసనేఁ జెడకుండ వహించుకొంటివి (16-1-39)

ఈతఁడు సంస్కృతాంధ్రములందు మహాకవి. మహా విద్వాం సుఁడు. అష్టభాషాకవిచక్రవర్తియని బిరుదుగలవాఁడు తండ్రి తాతలవలెనే శృంగారాధ్యాత్మ సంకీర్తనములను రచించినవాఁడు.

ఈతఁడేనాఁటినుండి సంకీర్తన రచన నారంభించెనో తాళ్లపాకవారి రేకు లందు తెలియ రాకున్నది. కాని అతఁడొక కీర్తనమున "గరిమనావయసున తాటకిఁజంపిన కౌసల్యానందన రాఘవ" అనుటను బట్టి "గరిమనావయసు" అని యన్వయించుకొని రామాయణకథాసందర్భము లనుఁ బట్టి రాముఁడు పదియునై దేండ్ల ప్రాయమున తాటకినిఁ జంపినట్లు తెలియుచున్నదిగాన తిరుమలయ్యాయు పదునైదు పదనాఱేండ్ల నడుమనే కీర్తనరచన కారంభించి యుండునని 16వ సంపుటమును పరిష్కరించిన శ్రీమాన్ ఉదయగిరి శ్రీనివాసాచార్యులవారు వ్రాసినారు. కావచ్చును. చిన తిరుమలయ్యా తన కీర్తనములందు తాతగారగు అన్నమాచార్యుని భక్తి శ్రద్ధలతోఁ గీర్తించినాఁడు. అన్నమయ్యాకు పెదతిరుమలయ్యా "చనవరి సుతుఁడు"ను, చిన తిరుమలయ్యా ముద్దుల మనుమఁడునుఁ గాఁదోఁచుచున్నారు. అన్నమాచార్యుఁడీ మనుమని ఆదరించి యభిమానించినతెఱఁగునుఁబట్టి అతనికి తన పెద్దకుమారుని వలన గలిగిన మనుమలెవ్వరును చేతికందివచ్చి నిలువక పోవుటయే హేతువుకావచ్చునేమో. అందుకే అంత అభిమానముతో తానే బ్రహ్మోపదేశము గావించినాఁడు. అన్నమాచార్యుఁ డాపిదపకూడ కొన్నియేండ్లు జీవించి యున్నాడు. చిన తిరుమలయ్యా తన సంకీర్తనములలో నొకదానియందు తమ కులమువారు (నందవరీకులు) 'పచ్చితామసులనియు' అట్టివారిని 'పరమసాత్త్వికులనుఁగాఁజేసి' యెన్నఁడు లేని వైష్ణవ మచ్చముగాఁ గృపసేసి 'సంకీర్తన మదన నుపదేశించి' 'కడువివేకులఁజేసి యిడుమలెల్ల' బాపెనని అన్నమాచార్యునిఁ గూర్చి పేర్కొనినాఁడు. అతఁడు గురుభక్తి యపారముగాఁ గలవాఁడు, భగవద్భక్తినిఁ గోల్పోయి లౌకిక ప్రాభవమునకై ప్రభువులవెంటపడి ప్రాకులాడు దైన్యమును చినతిరుమలయ్యా గర్హించినాఁడు (చూ. 16-1-42, 55)

ఈతఁడు శ్రీ వేంకటేశ్వరస్వామికి, దిగువ తిరుపతిలోని వేల్పులకుఁగూడఁ జాలకైంకర్యములు కావించినాఁడు. వానిని స్మరించు కీర్తనములుకూడ కొన్నియున్నవి. క్రీ. 1540లో తమ యగ్రహారమగు మంగాపురము నందలి కళ్యాణ వేంకటేశ్వరదేవాలయ జీర్ణోద్ధర

ణము గావించినాఁడు. అచ్చట ఆళ్వార్లతో భాష్యకార్లతో దేశికులతో సహా తన తాతగారగు అన్నమాచార్యుని విగ్రహము నక్కడ ప్రతిష్ఠించినాఁడు ఈ విగ్రహము నేఁడు కానరాకున్నను గుడి గోపురము మీఁదను మంటప శిలా స్తంభములందును తాళ్లపాకకవుల మూర్త్యంతరములు నేఁటికిని దర్శనీయముగ నున్నవి. శాసనాధారములనుఁబట్టియు కీర్తనములనుఁ బట్టియు నీతఁడు మతప్రచారమునకును సంకీర్తనప్రచారమునకును చిత్తూరు, అనంతపురము, కడప, కర్నూలు, నెల్లూరు, గుంటూరు మున్నగు మండలములందు సంచారము గావించినట్లు తెలియుచున్నది. మంగళగిరి దేవాలయమున నీతఁడు సంకీర్తన అరుళప్పాడునకేర్పాటు గావించెను. ఈతఁడు క్రీ శ. 1562 వఱకును జీవించి యున్నట్లు తెలియుచున్నది.

## అన్నయ్య

ఈతఁడు చిన తిరుమలాచార్యుని తమ్ముఁడు. పెదతిరుమలాచార్యుని రెండవకుమారుఁడు. తాతగారి పేరే యాతనిది అగుట వలన గుర్తించుటకై యాతనిని 'కోనేటి అన్నమయ్యంగా' రని వ్యవహరించుచుండిరి. అప్పటికి తాళ్లపాకవారి కుటుంబము తిరుమల మీఁద కోనేటి సమీపమున స్థిరనివాసమేర్పరచుకొనుట జరిగియుండెను. పెదతిరుమలాచార్యుని కుటుంబసభ్యులు క్రీ. 1540-50 సంవత్సరముల నడుమ నెప్పుడో తిరుమల తిరుపతులను కేంద్రముగఁ బెట్టుకొన్నను మతప్రచారము దృష్టిలో నిడుకొని దేశము నాలుగు మూలలకును ప్రాకిపోయినట్లున్నారు. వారిలో ఈ కోనేటి అన్నమయ్యగారి కుటుంబము గుంటూరు మండలమునకుఁ బోయినారు. కొండవీటి దుర్గమునకుఁ జెందిన వినుకొండసీమలోని మిన్నికల్లు గ్రామమును (గుంటూరు నరసరావుపేట తాలూకా) సదాశివరాయ మహారాయలు 15-5-1548లో తాళ్లపాక తిరుమలయ్యంగారి కుమారుఁడగు అన్నమయ్యంగారికి దానము చేసినట్లొక శాసనమున్నది-[1] మఱియొక శాస

---

1. చూ. శాసనము సంఖ్య 314-1915-16

నమునఁగూడ సామెటిరాజు అన్నయ్యంగారికి 1557లో ఆలూరి సీమలోని "తండువ" మను గ్రామమును దానము చేసినట్లు తెలియుచున్నది-[1] ఇట్టితఁడేకాదు, ఈతని చిన్నతమ్ముఁడగు కోనేటి తిరువెంగళనాథుఁడును గుంటూరు మండలమునుఁ జేరుకొనినాఁడు. ఈ అన్నమయ్య క్రీ. 1492 ప్రాంతములందు జన్మించి దాదాపు అరువది యేండ్లు జీవించియుండెనేమో! ఈతఁ 'డన్ని విద్యలయందు నరయ మున్నింటి యన్నయార్యునిఁ బోలు నన్నయాచార్యుఁ'డట!

## పెద తిరువెంగళనాథుఁడు

ఈతఁడు సాత్త్విక శుభమూర్తి. సంగీత సత్కవిత్వాధికుఁడని చిన్నన్నచే స్తుతింపఁబడెను. స్వామి సన్నిధి నితఁడు సంకీర్తనములు పాడుచుండఁగా స్వామి యాడుచుండెడు వాఁడట! రేవణూరి వేంకటాచార్యుఁడు శకుంతలాపరిణయ ప్రబంధమున "విశేషించియు నత్తిరువెంగళనాథుఁడు సంకీర్తనంబులు పాడిన నాడఁదొడంగె" నని చెప్పియున్నాఁడు. చిన్నన్న 1546లో వేయించిన శాసనమునందు పెద తిరువెంగళనాథుని ప్రత్యాబ్దిక దినమున జేయు విశేషార్చనలఁ గూర్చి ప్రస్తావించియుండుటచేత నీతఁ డంతకు ముందే దివ్యధామమందియుండెననుట నిశ్చయమే. ఈతఁ డేబది యేండ్లకన్న నెక్కువకాలము జీవించియుండఁడు.

## చిన తిరువెంగళనాథుఁడు (చిన్నన్న)

ఈతఁడు పెదతిరుమలార్యుని నాల్గవ కుమారుఁడు. ద్విపద కవిత్వమునఁ బేరుగాంచినవాఁడు. రసవత్ప్రబంధములనేకములు ద్విపదచ్ఛందమున నిబంధించినవాఁడు. పండిత లోకమున నంతకుఁ బూర్వము ద్విపదరచనకుండిన యనాదరణమును శిష్టము, లక్షణబద్ధము

---

1. మెకంజీ రికార్డులలో నీశాసన విషయమున్నట్లు శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు గుర్తించియున్నారు. చూ **Annals of S. V. O. I. Vol I. Part I, Page 100, & 101.**

నగు తన ద్విపదలమూలమునఁ దొలఁగించి వానికి గావ్యత్వసిద్ధిఁగల్పిం చినవాఁడు. తాతగారి జీవితచరిత్రమును సమగ్రముగా ప్రామాణిక ముగా రచించినవాఁడు. సుకవి. పండితుఁడు. 'జలజాతవాసిని చను బాలపుష్టిచే' కవితారచన కుద్యమించినవాఁడు. "రత్నకుంభదనుపమ శ్రీ వేంకటాద్రీశద త్తమకరకుండలయుగ్మమండిత" కర్ణుఁడు. "సకల వైష్ణవ పాదసంసేవకాబ్జసదనా వధూలబ్ధ సరసకవిత్వవిదితమానసుఁడు". "దినము లోననె వేయి ద్విపదలింపొంద వినుతవర్ణనలతో విరచించు" వాఁడు. "కస్తురి వీడెగోసినకరణి, తెలిగప్పురపుఁ గ్రోవి దెఱచిన సరణి విరవాది పొట్లంబు విడిచినమాడ్కి పరిమళించుచు కవుల్ బళిబళీ యనఁగ" కవితచెప్పిన సులక్షణకవి.

కవితా విషయముతోఁబాటు మతప్రచారవిషయమునఁగూడ నీతఁడు చాలపాటుపడినాఁడు. అతని శాసనములును, పరమయోగి విలాసాదికృతులును పై విషయమును నిరూపించునవిగాఁ గలవు. క్రీ. 1546లో సదాశివరాయలచేత గోరిజవోలు గ్రామమును దాన ముగాఁ గొన్న 'తిరువెంగళనాథయ్యంగారు' చిన్నన్నయే కాఁదగునని శ్రీ సాధుసుబ్రహ్మశాస్త్రి గారు వ్రాసి యున్నారు (చూ. T. T. D. Epi. Report P. 297.) ఆ తిరువెంగళనాథుఁడీతఁడుకాక కోనేటి తిరువెంగళనాథుఁడని నేను తలఁచుచున్నాను.

చిన్నన్న పింగళి సూరనార్యునకు సమకాలికుఁడేకాక అతనిని, అతని కృతులను చక్కఁగా నెరిగిననాఁడని తెలియనగుచున్నది. ఈతని తమ్ముని వలెనే యాతఁడును యోగవిద్యారహస్యము లెరిగినవాఁడ నియు తెలియుచున్నది.

అర్వాచీనులు కొందరు 'తాళ్లపాక చిన్నన్న దండెమీటులు గావు' అనియు 'అలతాళ్లపాక చిన్నన్న రోమములైన తంబురా దండెకుఁదంత్రులౌనె' అనియు నీతని గొప్ప గాయకుఁడగునట్లుగా స్మరించిరి. చిన్నన్న వాగ్గేయకారుఁడనుటకుఁ దగిన యాధారము లేవియు తిరుపతి రాగిరేకులందు మనకు తెలియరాకున్నవి. "చిన్న న్నకు అన్న, తండ్రి, తాత, గొప్ప గాయకులుగాన యిటీవలివారు గ్రంథములనుబట్టి చిన్నన్ననే యెరిగినవారుగాన వారియోగ్యత నీత

నిఁ జేర్చి చెప్పియుండవచ్చు" నని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు (చూ. అన్నమా. పీఠికపు 95) వ్రాసిన విషయము సంభావ్యమే కాఁదగును. చిన్నన్న వాగ్గేయకారుఁడు కాకపోవచ్చునుగాని సంగీతపరిజ్ఞానముగల వాఁడనుటను సందేహింపవలసిన పనిలేదు. అతని ఉషాపరిణయ మావిషయమును వెల్లడిసేయుచున్నది.

"ద్విపద నొనర్పను జిన్నన్నను" అని గణపవరపు వెంకటకవి యీతనిని స్మరించినాఁడు. చిన్నన్న పద్మసాలెవారి కాచార్యపురుషుఁడు. చిన్నన్న వంశపారంపర్యముగా సాలెకుటుంబములవారు గురుశిష్యతాసంబంధమున వర్ధిల్లఁగోరి, కానుక లర్పించుకొని యొక తామ్రశాసనమునుఁ గూడ క్రీ. 1541లో వెలయించి యుండిరి-[1]

ఈతఁడు క్రీ. 1558 ప్రాంతములందు మరణించినట్లున్నాఁడు దాదాపు అరువదియేండ్లు జీవించెనేమో! శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు చిన్నన్నవంశమువారిని నేఁటితరము వఱకును ఆ కుంటుంబమువారినుండి తెలిసికొన్న విషయము నిట్లు పేర్కొనినారు.

చిన్నన్న
- వెంకటేశయ్య
  - సోమయ్య
    - బుచ్చన్న
      - పెరుమాళయ్య
        - రామయ్య
          - పెరుమాళయ్య
            - వెంకటరమణయ్య
              - సూర్యనారాయణయ్య
          - అప్పళాచార్య
- అప్పయ్య

1. చూ. Annals of S.V.O I. Vol I. Part I. P. 89-106

"Taking 1570 AD, as the latest date of Chinnana, three hundred and seventy years till this day is covered up by eight generations."

అనియు వారు వ్రాసినారు-[1]

నేఁడు ప్రసిద్ధిలోనున్న తాళ్లపాకవారు పలువురు తాము చిన్నన్న వంశములోనివారమని చెప్పుదురు. చిన్నన్న సుప్రసిద్ధుఁడు.

## కోనేటి తిరువెంగళనాథుఁడు

ఈతఁడు పెదతిరుమలాచార్యుని కుమారులలోఁ జివరివాఁడు. చిన తిరుమలార్యునకు నాల్గవ తమ్ముఁడు. ఈతఁడానాళ్లలో గొప్ప వైష్ణవాచార్యుఁడై, యోగసిద్ధులనుఁ బడసినవాఁడై ప్రఖ్యాతిఁగాంచి యుండినట్లు తెలియుచున్నది. ఈతఁడు సదాశివరాయాదులచే క్రీ. 1544, 1545, 1546, 1564 ప్రాంతములందు పెక్కు అగ్రహారములను బడసి సన్మానితుఁడై నాఁడు-[2] 1559లో కడపజిల్లా పుష్పగిరి చెన్న రాయనికిఁ గొంతభూమిని సమర్పించినాఁడు. ఈతఁడు గ్రహించిన యగ్రహారములలో అద్దంకి సీమలోని బొల్లాపల్లి, ఓలపల్లి, కొండవీటి సీమలోని గోరిజవోలు; నేఁటిగుంటూరు మండలమునందలి ఈమని, ఉంగుటూరు, దంతలూరు, గుండవరము మొదలగునవి తెలియవచ్చు చున్నవి. ఈతని కుటుంబమువారును గుంటూరు మండలమున వ్యాపించినట్లున్నారు. పై శాసనములం దీతఁడు గొప్ప శ్రీవైష్ణవా

---

1. చూ. Annals of S. V. O. I. Vol I. Part I. P. 108 తిరుపతి శాసనములలో చిన్నన్నఁ గూర్చిన ప్రశంస మనకు క్రీ. శ. 1558 తరువాత కానరాకున్నది. ఈ సంవత్సరమును బట్టియే వారట్లుభావించిరేమో అని తలఁతును.

2. చూ. తి.దే.తి.దే. Epi-Report. P. 298. మఱియు సం॥ 419 క్రీ. 1915-16; 684 of 1920-21; 182 of 1916-17; 686 of 1920-21:

చార్యుఁడుగాను, వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యుఁడుగను కీర్తింపఁబడి నాఁడు. అళియ రామరాయని మేనల్లుని వంశమువాఁడగు సిద్ధిరాజు వెంకటరాజ మండలేశ్వరుఁ డీ కోనేటి తిరువెంగళనాథు నాదరించి నాఁడు. ఆ వంశమువారి కీతఁడు ఆచార్యుఁడుగా నుండెను కాఁబో లును. ఈ మహనీయుడు గొప్ప వైభవమనుభవించినాఁడనుట క్రింది పద్యము సాక్షి.

సీ. మొకరివాతెర కీర్తి ముఖము బంగరుదండె
పాలకి యేగుఱుం డోలి నెక్కి
శ్రీజగన్నాథు నూర్జిత పదాంభోజముల్
సేవించి యేబుధాశ్రితుఁడు వెలసె
కాయసిద్ధిని లంబికాయోగమార్గంబు
తెలిసి యేఘనుఁడు సాధించి నెగడె
భక్తితోఁబట్టాభిషిక్తులు ధరసాగి
మ్రొక్క నేవిభుఁడు పెంపెక్కి చెలఁగె
నతఁడు పొగడొందు హారనీహారగంధ
సార కర్పూర గోక్షీర సదృశయశుఁడు
ఘనుఁడు పెదతిమ్మ దేశిక గర్భజలధి
కువలయాప్తుండు కోనేటి గురువరుండు-[1]

1504 ప్రాంతములందు జన్మించి యీతఁడు దాదాపు 70 పండ్లపైగా జీవించియుండెననవచ్చును.

## తిరువెంగళప్ప

ఈతఁడు చిన తిరుమలాచార్యుని కుమారుఁడు. గొప్ప విద్వాంసుడు. రసవత్కవితసెప్పిన యుజ్వలకవితానిధి. అమరు కావ్యమునుఁదెనిఁగించి లఘు వివరణమునుగూడ వ్రాసియున్నాఁడు.

---

1. ఈ పద్యమును శ్రీ తాళ్ళపాక సూర్యనారాయణగారి వ్రాత కాగితముల నుండి యుద్ధరించి శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు ప్రక టించినారు. [చూ. అన్నమా. పీఠిక పు 96.]

నామలింగానుశాసనమునకుఁ దెలుఁగువ్యాఖ్య రచించినాఁడు. సుప్రసిద్ధ అలంకారికగ్రంథమగు కావ్యప్రకాశికకు సంస్కృతమున నొకవ్యాఖ్యను వెలయించినాఁడు. తిరుపతి గోవిందరాజస్వామి యాలయమునకును, కంచిలోని అరుళాలప్పెరుమాళ్లకును కొన్నిభూములను సమర్పించి యుత్సవములను నిర్వహింపఁ జేసినాఁడు.

క్రీ. 1554 లో నీతని తల్లి పెద మంగమ్మ పరమపదించినది. ఈతఁడు చిన తిరుమలార్యుని ముప్పదియవ యేట జన్మించినాఁడను కొన్నచో క్రీ॥ 1518 జననమగును. కోనేటి తిరువేంగళనాథునివలెనే ఈతఁడును క్రీ॥ 1565-70 ల వరకును జీవించియుండును. ఇట్లు తాళ్ళపాకవారి వంశమువారు పలువురు ప్రసిద్ధులై విజయనగర యుగమున విఖ్యాతులై యుండిరి.

తాళ్ళపాకవారి సాహితీమందిరమునకు మతము పునాది. సంస్కృతాంధ్రములు కట్టడపు శిలలు సంకీర్తనాది సాహితీ ప్రక్రియలు సోపానములు. అందలి యారాధ్యదైవము శ్రీ వేంకటేశ్వర స్వామి. ధర్మార్థకామమోక్షములు నాలుఁగు ప్రాకారములు. మధుర కవితలు ద్వారవాకిళ్ళు. సార్వజనీనము సార్వకాలికము నగు నుత్తమ భావ సంపద తన్మందిర శ్రీభాండారము. ఆ కవులే యర్చకులు. భక్తియే భగవత్ప్రసాదము. గానమే స్వామి కంగ రంగ భోగములు. రసికవర్యులే యాత్రికులు. ఇదియే వారి కవితా స్వరూపము.

అసలు భారతీయ సాహిత్యశరీరమునకు మతమే వెన్నుపూస వంటిదనుట నిర్వివాదాంశము. ఆంధ్ర సాహిత్యమారంభించిన తొలిదినములలోనే శైవవైష్ణవము లాంధ్రదేశము నుఱ్ఱూతలూపినవి. తత్ఫలితముగా నాంధ్ర సాహితీ సాగర మథనమారంభమైనది. శైవులొక వంక వైష్ణవులు వేఱొక వంక బాషా సూత్రములను చేపట్టి మతమను మందరమునుఁ గట్టి మథింప సాగిరి. తత్పూర్వపసానమున ననేకములగు నూత్న ప్రక్రియ లావిర్భవించినవి. తొలుత పరస్పర నిందామయమగు హాలాహలము కొంత పొడసూపినను పిదప ప్రజ్ఞాపూర్ణ చంద్రోదయ

మైనది. ఉత్తమ భావ సంపల్లక్ష్మి కలకలలాడినది. రసామృతము సిద్ధించినది. కవిబ్రహ్మలందియఁగా తాళ్ళపాకవారు దానిని తర తరముల వారికి పంచిపెట్టిరి. ఇదియే తాళ్ళపాక కవిశేఖరు లాంధ్ర రసికలోకమునకుఁ గావించిన సేవ.

పై కారణములనుఁబట్టి యాంధ్రసారస్వత ప్రపంచమున తాళ్లపాక కవులొక విశిష్ట స్థానమునే ఆక్రమించుకొనుచున్నారనవచ్చును. నిజముగా వారి కాలమున, వారి సాహిత్యము మూలమున కలిగినంతటి చైతన్యము, వృద్ధి తెలుఁగు భాషకిక నెవరి కాలమునను, ఎవరి మూలమునను జరిగియుండ లేదనుట అతిశయోక్తి కానేరదు. రాజసభాంతరాళములనుండి యాంధ్రభాష నుద్ధరించి ప్రజాసామాన్యమున కందుబాటులోనికిఁ దెచ్చినవారును, తన్మూలమున వారి నిత్యావసరములఁ దీర్చికొనుట కనువు గల్పించినవారునుఁ తాళ్లపాక కవులే. వీరికా విషయమున కొంతవఱకు మార్గదర్శకులైన వారంతకు పూర్వపు వీరశైవ కవులు. మతదృష్టితో వారు సాహిత్యమునఁ గల్గించిన చైతన్యమును గుర్తించి, చరిత్ర బోధించిన పాఠమునెఱిగి, యన్ని విధముల వారి ననుసరించియు ననేక విధముల వారి నతిక్రమించినారీ తాళ్లపాక కవులు.

## వీరశైవకవులు : తాళ్లపాకవారు

పురాణ యుగమున ప్రాయికముగా 12, 13 శతాబ్దులలో వెలసినవారు వీరశైవకవిపుంగవులు. ప్రబంధ యుగమున 15, 16 శతాబ్దులలో వర్తిల్లినవారు తాళ్లపాక కవీశ్వరులు. ఇరువర్గముల వారును మత ప్రచారమునకై సాహిత్యమును సాధనముగాఁ గొని యాంధ్ర వాఙ్మయ ప్రపంచము నేలిన ప్రజాకవిసార్వభౌములే. వారు భిన్నవ్యక్తులు. భిన్న దేశములలో భిన్న సమయములలో నొకే మతదృష్టితో సారస్వత యజ్ఞమునకుఁ గడంగిన వారు. వీరు ఒకే కుటుంబములోని వారు. ఒకే చోట ఒకరి తరువాత ఒకరుగా నొకే మతదీక్షతో నొకే సారస్వతయజ్ఞమును కొనసాగించినవారు. ఇర వురును

సరస్వతీ సమారాధకులే. మతమే సాహిత్యమునకు జీవగఱ్ఱయని గుర్తించి మతవికాసమునకు సాహితీవికాస మెంతయో తోడ్పడునని యూహించి తత్ప్రచారమునకై జనాకర్షకమగు నూతన చైతన్యమును, వైవిధ్యమును, సాహిత్యమున సాధించినవారే వారును వీరును. ఆ నూతన ప్రయోగములలో నిరువర్గములవారును భాషా ప్రయోజనమునుగుర్తించిప్రజలకందుబాటులోనికిఁదెచ్చినారు. వారును వీరును కావ్యరచనలోఁ గైకొన్న భాష దేశీయమగు జాను తెనుఁగే. ఒక్క భాష మాత్రమేకాదు, భాషాసాధనమున బహిర్గతమగు రచనా ప్రక్రియను, దానినాశ్రయించు వస్తువిషయమును, దానినాలంబన ముగాఁగొను భావసంపదను—మూఁటినిఁగూడ ప్రజాసామాన్యమునకు సన్నిహితముగాఁదెచ్చి వానిపై దేశీయతాముద్రను వైచినారు. ఈ శైవవైష్ణవ కవులిరువురి కవితకును భక్తియే జీవము. ఆవేశ మిరువురకును సమానము. భక్త్యావేశము తరువాత వీరశైవకవుల రచనలలో కవిత్వకళ యుండియుఁ బాండిత్యగౌరవమే అధికముగా కానవగును. కాని తాళ్ళపాక కవుల రచనలలో భక్త్యావేశముతోఁబాటు, కవిత్వకళయుఁ బాండిత్య గౌరవము రెండును సమాన స్థాయిలో గోచరించును. వీరశైవ కవీశ్వరులు తొల్దొల్త మతప్రచారకులుగను, పిదప పండితులుగను, ఆ పిదప కవులుఁగను సాక్షాత్కరింతురు. వైష్ణవ తాళ్ళపాక కవీశ్వరులట్లు గాక ఒక్కయాకళింపుననే మతప్రచారకులుగాను, కవులుఁగాను పండితులుగాను దర్శనమిత్తురు. శైవకవులలో నన్నిచోడుఁ డాద్యుడు. పాల్కురికి సోమనాథుఁడు ప్రముఖుఁడు.

వైష్ణవ తాళ్ళపాక కవులలో అన్నమాచార్యుఁ డాద్యుఁడు. పెదతిరుమలాచార్యుఁడు ప్రముఖుఁడు. శైవకవుల రచనాభారమంతయు పాల్కురికి సోమనాథుని భుజస్కంధములపై నున్నట్లే తాళ్ళపాకవారి కవితాగౌరవమంతయు పెదతిరుమలాచార్యుని శిరస్సున నున్నది. వారి వారి రచనలలోని భేదసామ్యముల నీ దిగువ పరిశీలనమున గుర్తింపనగును.

| (వీర)శైవ కవులు | తాళ్ళపాక కవులు |
|---|---|
| 1. 12, 13. శతాబ్దులు. | 15, 16 శతాబ్దులు. |
| 2. పలువురు. భిన్నులు. అందరును పురుషులే. | ఒక కుటుంబములోనివారే. పలువురు. వీరిలో స్త్రీలుకూడ నున్నారు. |
| 3. మతము వీరి సాహితికి జీవగఱ్ఱ. | మతము వీరి సాహితికి జీవగఱ్ఱ |
| 4. భక్తి ప్రధానము. | భక్తి ప్రధానము. |
| 5. మత ప్రచారకులు, పండితులు, కవులు. | మత ప్రచారకులు, కవులు, పండితులు. |
| 6. ఆద్యుఁడు నన్నిచోడుఁడు. | ఆద్యుఁడు అన్నమాచార్యుఁడు. |
| 7. ప్రముఖుఁడు పాల్కురికి సోమన. | ప్రముఖుఁడు పెదతిరుమలాచార్యుఁడు. |
| 8. వీరిభాష జానుఁదెనుగు. | వీరి భాషయు జానుతెనుఁగు. |
| 9. మతప్రచారమేదృష్టిగా వీరు వస్తువునందు, భావనయందు, రచనయందు నూతనత్వమును సాధించిరి. | వస్తువునందు, భావమునందు రచనయందు నూతనత్వమును సాధించిరి. |
| 10. వీరి వస్తువు ప్రధానముగా భగవద్విషయము పౌరాణిక చారిత్రకేతివృత్తములను పరిగ్రహించిరి. భగవద్భక్తుల గాథలు రచించిరి. | వీరి వస్తువు కూడ ప్రధానముగా భగవద్విషయము. పౌరాణిక చారిత్రకేతివృత్తములనే పరిగ్రహించిరి. భగవద్భక్తుల గాథలను రచించిరి. |
| 11. భావన లోకమునకు సన్నిహితముగా నుండును రచనలో ఆత్మాశ్రయ కవితా భావనయే ప్రముఖము భక్తియే ప్రముఖము | భావన లోకమునకు సన్నిహితముగా నుండును. రచనలో ఆత్మాశ్రయ కవితాభావనయే ప్రముఖము. భక్తితోబాటు శృంగార వైరాగ్య తత్త్వములకుఁగూడ నవకాశమేర్పడినది. |

| | |
|---|---|
| 12. రచనలో వైవిధ్యమును వీరు సాధించిరి. మతప్రచారమే దృష్టిగా భిన్నసాహితీ ప్రక్రియల నారంభించిరి. | రచనలో వైవిధ్యము నపారము కావించిరి మతప్రచారమే దృష్టిగా నంతకు పూర్వమున్న భిన్నసాహితీ ప్రక్రియల ననుసరించుట మాత్రమే కాక, నూతనముగా మరి కొన్నిటినిఁగూడ నారంభించిరి. |
| 13. వీరి రచనా ప్రక్రియ లివి: | వీరి రచనా ప్రక్రియ లివి: |
| (1) ఉదాహరణములు :- సంస్కృతాంధ్రములందు వీరు ఆరంభించిరి. బసవోదాహరణము. | ఉదాహరణములు :- ఈ ప్రక్రియను వీరుచేపట్టి మనోజ్ఞముగ రచన సాగించిరి. వేంకటేశ్వరోదాహరణము. |
| (2) చంపూకావ్యములు:- నన్నిచోడుని కుమారసంభవము. | చంపూకావ్యములు :- శకుంతలాపరిణయ శ్రీపాదరేణు మాహాత్మ్యాదులు. |
| (3) జీవిత చరిత్రలు :- బసవ పండితారాధ్యుల జీవితములను సామిచారిత్రకము (Semi-historical) గా రచించి జీవిత చరిత్ర రచనకు పునాదులువేసిరి. | జీవిత చరిత్రలు:- అన్నమాచార్యుల జీవితమును చారిత్రకముగా చిత్రించి నిసలైన జీవితచరిత్ర రచన లారంభించిరి. తాతగారిచారిత్రమును మనుమఁడే రచించుట యిందలి విశేషము. |
| (4) ద్విపదలు :- ద్విపదచ్ఛందమును కావ్యరచనకుపయోగించుకొనుటలో తొలియత్నముఁగావించిరి. బసవపురాణ పండితారాధ్య చరిత్రములను రచించిరి. | ద్విపదలు :- దినములోనె వేయి ద్విపదలిం పొందునట్లుగా కవికర్కశ వయోగ్యనవ బిరుదాంకితులై నిష్కృష్టమగు లక్షణము ననుసరించి ద్విపదకావ్యముల రచించిరి. పరమయోగివిలాసాష్టమహిషీ కల్యాణోషా పరిణయాదులు రచించిరి. ద్విపద |

| | |
|---|---|
| | రచనము నియమబద్ధముఁ గావించి పండితపామరజనామోదము పొందునట్లు గావించిరి. |
| (5) రగడలు :- బసవ రగడాదులు, బసవస్తుతి పరముగ రచించిరి. | రగడలు :- సుదర్శనరగడాదులు. వైష్ణవ రచనలు గావించిరి. |
| (6) వచనములు :- నమస్కార గద్య. అక్షరాంక గద్యాదులు రచించిరి. వీరి వచనములు గద్యములనబడినవి. కేవల వచనైకరచనకు వీరు ప్రాతిపదిక వేసిరి. | వచనములు :- వేంకటేశ్వర వచనాదులు రచించిరి. వచనైక రచనా సంప్రదాయమును పరిపుష్టము గావించిరి. స్తుతిమాత్రసుందరము,గానానుయోగ్యము నగు రీతిని వాని నావిష్కరించినారు. |
| (7) వ్యాఖ్యలు :- రుద్రభాష్యాదులు. సంస్కృతమున వెలయింపఁజేసిరి. వేదమునందలి రుద్రాధ్యాయమునకు వీరశైవ పరమగు వ్యాఖ్యానమే రుద్రభాష్యము. | వ్యాఖ్యలు :- భాషా సాహిత్య సంగీత గ్రంథములకు సంస్కృతాంధ్రములందు రెంటను వ్యాఖ్యలు విరచించిరి. బాలప్రబోధికా సుధానిధీ సంకీర్తనలక్షణవ్యాఖ్యానాదులు పేర్కొనఁదగినవి. |
| (8) శతకములు. | శతకములు |
| శతకరచనాప్రక్రియను వీరు ప్రారంభించిరి. మల్లికార్జున పండితారాధ్యుని శివతత్త్వసారము, సోమనాథుని వృషాధిపశతకము మొదలగునవి పేర్కొనఁదగినవి. మకుట నియమముగల శతకములకు వీరే పరికల్పకులు. | శతకరచనా ప్రక్రియను పరిగ్రహించి స్తుత్యాత్మకములును రసమయములునగు ననేకశతకముల రచించిరి. మకుట, వృత్త సంఖ్యా నియమములను పాటించిరి. భక్తిని, నీతిని, శృంగారమును ప్రపంచించినవి వీరి శతకములు. ఈ వాఙ్మయ శాఖకే వీరి రచనలు పరిపుష్టినిఁ గల్పించినవి |
| వీరశైవ కవులు పై సాహితీ ప్రక్రియలను మాత్రమే చేఁబూని | తాళ్లపాక కవులు పై సాహితీ ప్రక్రియలనన్నిఁటిని చేఁబూని మత |

| వీరశైవకవులు | తాళ్ళపాకవారు |
| --- | --- |
| మత పరివారముతోపాటు వాఙ్మయమునఁ గూడ వైవిధ్యమును సాధించినారు. | పరివారముతోపాటు వాఙ్మయమున వైవిధ్యము విస్పష్టమగునట్లును, పరిపుష్టమగునట్లునుఁ గావించిరి. అంతే కాదు వీరశైవ కవులనుసరించని మరికొన్ని ప్రక్రియలను కూడ వీరు చేపట్టి సాహిత్య ప్రపంచమున వారి నతిక్రమించిరి. |
| (9) దండకములు:- ఈ ప్రక్రియను వీరశైవ కవు లనుసరించినట్లు తోపదు. | దండకములు:- స్తుత్యాత్మకమగు నీ రచనా ప్రక్రియలోని సౌందర్యమునకాకృష్టులై తాళ్లపాకవారు శృంగారాష్టభాషా దండకముల రచించిరి. |
| (10) క్షేత్ర మాహాత్మ్యములు:- వీరశైవ కవులు క్షేత్ర మాహాత్మ్యములను విడిగా వ్రాసినట్లు కానరాదు. | క్షేత్రమాహాత్మ్యములు:- సంస్కృతమున వేంకటాచలక్షేత్ర మాహాత్మ్యమును అన్నమాచార్యుఁడు రచించెను. |
| (11) మంజరీ ద్విపదలు :- వీరు ద్విపదలనే రూపొందించిరి కానితద్వికారరచనలను గావింప లేదు. | మంజరీ ద్విపదలు :- శైవుల ద్విపదలను నియమబద్ధ మొనరించి కావ్యరచనకుపయోగించుకొనుట మాత్రమేకాక ద్విపద రచనావికారమనఁదగు మంజరీ ఛందమునఁ గూడ రచనలు గావించిరి. తాళ్ళపాక తిమ్మక్క రచించిన సుభద్రా పరిణయము మంజరీద్విపద లోనే కలదు. |
| (12) లక్షణ గ్రంథములు :- వీరశైవ కవులు లక్ష్యగ్రంథములే కాని లక్షణ గ్రంథము | లక్షణ గ్రంథములు:- వీరు లక్ష్యగ్రంథములతోపాటు లక్షణ గ్రంథములనుకూడ సంగీతము |

లేమియు రచించినట్లు కానరాదు. పాల్కురికి సోమనాథుఁడు సంగీతమునందపార ప్రజ్ఞగలవాఁడని పిడుపర్తి సోమనాథుఁడు తన పద్య బసవపురాణమున నుడివినాఁడు. అంతేకాని వీరి సంగీత రచనలు, లక్షణకృతులు మనకు తెలియరాలేదు.

(18) సంకీర్తన పదరచనలు :-

వీరశైవ కవియగు పాల్కురికి సోమనాథుఁడు తన పండితారాధ్య చరిత్రాదులందు అంతకు పూర్వ మాంధ్రదేశమున నుండిన సంగీత రచనలనుఁ గూర్చి విపులముగా ప్రస్తావించుటయే కాని వానికి లక్ష్యము ఉదాహరించుట కాని, రచించుటకాని కావించి యుండలేదు. వీరశైవులు సంకీర్తన పదరచనను మత ప్రచారమున కనువగు నొక ప్రక్రియగా భావించియు పరిగ్రహించియు నుండలేదు.

నకు, భాషకు సంబంధించి వ్రాసిరి. సంకీర్తన లక్షణ, రేఫ ఱకార నిర్ణయాదు లిట్టివే. అన్నమాచార్యాదులు గొప్ప సంగీతశాస్త్రవేత్తలు. ఔత్తరాహ దాక్షిణాత్య సంగీత పద్ధతులకు సమన్వయమార్గ మరసి కల్పించినవారు. వాగ్గేయకారులు మాత్రమే కాదు; వీరు లక్షణ కారులును—

సంకీర్తన పదరచనలు :-

తాళ్ళపాక కవులు సంకీర్తన పద కవితా పితామహులు. మత ప్రచారమునకును స్వామి కైంకర్యమునకును, సంకీర్తన పదరచనా ప్రక్రియ మహోదాత్తమైనదిగా భావించి తొట్టఁదొలుత నాప్రక్రియలో వేనవేలు లక్ష్యములు రచించుట మాత్రమే కాదు; తల్లక్షణమునుఁ గూడ విశదీకరించిరి. సోమనాథాదులు పేర్కొన్న పదరచనలకెల్ల వారు స్వయముగ లక్ష్యము లనేకములు విరచించిరి. రచించుట మాత్రమే కాదు; పాడి యాడి పరమపదము చెందిరి. వీరశైవు లనుసరింపనివియు, పైని పేర్కొనఁబడినవియు నగు క్షేత్రమాహాత్మ్యములు, దండకములు, లక్షణ గ్రంథములు, మంజరీ ద్విపదలు మున్నగువానిని తాళ్ళపాకకవు లంతకుఁ బూర్వపు

| | |
|---|---|
| | సాహిత్యలోకమునుండి చేపట్టినా రనవచ్చును గాని యీ సంకీర్తన పద రచనాప్రక్రియమాత్ర మటుల కాదు. ఆంధ్రమున వీరే దానికి పరి కల్పకులు. ఈ ప్రక్రియలో సాహిత్య లోకమే వీరిని తరువాతి కాలమున ననుసరించినది. వీరి పద రచనాసంప్రదాయమే తరువాత భజన, నాట్య, సంగీత పద్ధతులకు దారితీసినది. |
| (14) వీరశైవ కవులు సంస్కృతాంధ్ర కర్ణాటక భాషలందు కవులు. బహుభాషా పండితులు. | తాళ్లపాకవారు సంస్కృతాంధ్ర ద్రావిడ భాషలందు కవులు. షడ్విధ ప్రాకృతములందునుఁ గవితల్లిన వారు. బహుభాషా పండితులు. |

ఇట్లు అనేక విధముల వీరశైవ కవులకును, తాళ్లపాకవారికిని సామ్యము గుర్తింపవచ్చును. కాలమున తాళ్లపాకవారు వీరశైవులకు తరువాతివా రగుటను బట్టియే అనవచ్చును, మత ప్రచారసాధనములుగా వారనుసరించిన సాహితీ ప్రక్రియలు మాత్రమే కాదు, నడిమి కాలమున నితరకవు లనుసరించిన దండకములు, క్షేత్ర మాహాత్మ్యములు మున్నగు మరికొన్ని ప్రక్రియలనుఁ గూడ ననుసరింపఁగల్గిరి. అంతేకాదు, నూతన సాహితీ ప్రయోగములనుఁ గూడ నొనరించి తెనుఁగున సంకీర్తన వాఙ్మయమున కాదిభిత్తి పెట్టినారు. తన్మూలమున మతమునకే కాక సంగీతసాహిత్యములకు నాట్యకళకు నెంతయో ఉత్తేజమును కల్గించిరి. మత సాహిత్యములు పాతికములుగాక పరమార్థమున సామరస్యసాధకములు నానందోద్బోధకములును కావలెనని గుర్తించి తదాదర్శము వీడని విధమున రచనలుగావించిరి,

వీరశైవుల మతాభినివేశము, తిక్కనగారి రసోత్తేజము దేశితెనుఁగు లోని తీయనిమధురకవితాంశముతో మేళవించి తాళ్లపాకవారి నావేశించినది. అందుకే సాహితీ వైవిధ్యమునందే కాక సాహితీ పరమార్థమునందును తాళ్లపాకవారి కవిత సమగ్రమును పుష్టిమంతమును కాఁజాలినది. అందుకే ఆంధ్ర సాహిత్య ప్రపంచమున తాళ్లపాక కవుల స్థానము అద్వితీయమైనది.

ద్వితీయాధ్యాయము

# తాళ్లపాకవారి సాహిత్యము

(పుటలు 187 – 474)

# తాళ్లపాకవారి సాహిత్యము-పరిశీలనము

## ద్విపద కావ్యములు

ఆశు మధుర చిత్ర విస్తరము లనెడిచతుర్విధకవితలలో మధుర కవితాశాఖకు చెందినది ద్విపదరచన. పేరును బట్టియే 'ద్విపద'పదకవితా విభాగమునకుఁ జెందినదనుట స్పష్టము. వస్తువునుబట్టియు, భావనను పురస్కరించుకొనియు, రచన ననుసరించియు మార్గ దేశి సంప్రదాయములుగా ప్రవర్తిల్లిన తెలుఁగు కవితలో నీ ద్విపద దేశిరచనాసంప్రదాయమునకు చెందినది. దేశీయమగు మధురపదకవితాశాఖకుఁ జెందిన ఈ ద్విపదఛందస్సే కొలఁది కొలఁది భేదములతో తరువోజ, మంజరి, గీతము, సీసము మున్నగు ననేక దేశిచ్ఛందోరచనాప్రభేదములకు ప్రాతిపదిక కల్పించినది. ఈ కారణముననే గేయాంశ కలిగి గాన యోగ్యమగు తెలుఁగు కవితలోని దేశిచ్ఛందములకెల్ల ప్రాయికముగ ద్విపద తల్లివంటి దనవచ్చును. పాదమునకు మూడింద్రగణములు, నొక్కసూర్యగణము చొప్పున రెండేసిపాదములు ప్రాసముతో బంధింపఁబడి ప్రతిపాదమున మూఁడవ గణము మొదటి యక్షరమున యతి చెల్లుచునుండునది ద్విపద. ఇట్టి ద్విపద రెండు పాదములతో మాత్రమే యాగక మాలికగా నెన్నివందలైన పాదములు కలిగి గాన యోగ్యము, ధారణాయోగ్యము నగుచున్నది. ఇందలి పాదముల పరిమితిని బట్టియు, పాదములందలి గణముల, లేదా మాత్రల పరిమిత సంఖ్యను బట్టియు, సరిగా యతిస్థానమున చరణము సగమునకు విరుగుటను బట్టియు నీ ద్విపద రచనమునకేగాక పఠనపాఠనములకు సైతము సులువైనది. అందుకే జానపదుల రచనాపరిశ్రమమున రూపు దిద్దుకొన్న ఈ ద్విపదచ్ఛందమునకు, తెనుఁగునందలి దేశి మధుర కవిత

లలో విశేషప్రచారము, నాదరణము తొలి కాలము నుండి గుర్తింపనగుచున్నది.[1]

ఈ తీరు రచన తెలుఁగున ప్రాయికముగా తమిళుల 'పాట్టు'లను, కర్ణాటకుల రగళగీతములనుఁ బోలినదనవచ్చును. పాటలరూపముగా పాడుకొనుటకు వీలుగా నుండు నీ ద్విపదలకు దేశమున గల ప్రాచుర్యమును గమనించియే తాము రచించిన కావ్యేతివృత్తములు జనబాహుళ్యమునఁ జొచ్చుకొని పోవలెనని వాంఛించిన రచయితలు పలువురు ఆ ఛందో ప్రక్రియయందే విరివిగా రచన సాగించిరి.[2]

ఇట్లు ద్విపదయనెడి ఈ పదప్రక్రియ నెన్నుకొని దానికి సాహిత్యగౌరవము కల్పించి బృహద్గ్రంథముల రచించిన ఖ్యాతి తెలుఁగున మొదట 12, 13 శతాబ్దముల నడుమ వర్తిల్లిన వీరశైవ కవులకే దక్కినది. తరువాత ఆ ద్విపదరచనాప్రక్రియ నుద్ధరించి సంప్రదాయసిద్ధముగ నుచిత సంస్కారము లొనరించి చిక్కిలిచేసి వన్నెలు దిద్ది దానికి కావ్యత్వసిద్ధిఁ గల్పించిన విఖ్యాతి 15, 16 శతాబ్దులలో వర్తిల్లిన వైష్ణవ కవులకే మిగిలినది. ఇట్లు చూడగా నీ ద్విపదరచన నాదరించి పోషిం

---

1. "నాఁడు నేఁడు నాంధ్రలోకము నాలుకలపై నాట్యమాడుచున్న పాటలు పదాలు మొదలగు దేశి రచనలలో నూటికిఁ దొంబదివంతు రచనములు ద్విపదలును, దద్వికారములునై యున్నవి. ఒక్క ద్విపదమే విషయభేదమునుబట్టి, స్థలభేదమునుబట్టి, పాఠకలోకమునుబట్టి పఠించు తీరులలో బహుభేదములను బొందుచున్నది. తోలుబొమ్మలవాండ్ర యాటలలోను స్త్రీలపాటలలోను, పంబవాండ్రయు, బవనీండ్రయు సుద్దులలోను, మఱియుఁ బెక్కు విధములగు పామర రచనములలోను బహుళముగా ద్విపదయు మంజరియుఁ గానవచ్చును" (బసవ పురాణ పీఠిక. పుట 87 శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1926).

2. "తన గ్రంథములు సుగ్రాహ్యములుగా నుండవలెనని యాతఁడు (పాల్కురికి సోమనాథుడు) తలంచెను. సంస్కృత భాషలో ననుష్టుప్పు సులువుగా రచింపఁదగినదై, యక్షరబాహుళ్యము లేమిచే సులువుగాఁ జదువదగి

చినవారు ముఖ్యముగ మత దృష్టితో కావ్యరచనకుగడంగిన కవులుగానే తెలియవచ్చుచున్నారు. కావున నీ ద్విపదరచనాప్రక్రియ యొక ప్రసిద్ధ సాహితీప్రక్రియగా రూపొంది యందు విశేషముగా కావ్యములు రచితములగుటకు తెలుఁగు దేశమున సాహిత్యముపై మతము చూపిన ప్రభావమే కారణమనవచ్చును. ద్రవిడ కర్ణాటకములందును నీ తీరు సాహితీ ప్రక్రియలందే మతసాహిత్యము ప్రజాబాహుళ్యమున వ్యాప్తి గాంచినది.[1] ఆ రీతినే తెలుఁగువారు ననుసరించినారు.

తెలుఁగుదేశమున వర్ణవ్యవస్థలేని భక్తిప్రధానమగు వీరశైవ మతమును వ్యాప్తిఁ దెచ్చుటకై సాహిత్యమును సాధనముగాఁగొని నూతనప్రయోగములు గావించుచు ద్విపదను చేపట్టి తన్మార్గమున బసవపురాణ పండితారాధ్యచరిత్రాది బృహద్గ్రంథముల రచించి యా వాఙ్మయప్రపంచమున కాదిస్రష్టయైన వాఁడు పాల్కురికి సోమనాథుఁడే.[2] ఈతఁడు లోకమునందలి యీ దేశిచ్ఛందమును పరిగ్రహించి దానిని సర్వసామాన్యము గావించుటకై తద్రచనమునఁ గొంత

నదై, యన్వయ క్లేశము లేమిచే సులువుగా నర్థము చేసుకోదగినదై పురాణాదులందు లక్షల కొలఁది గ్రంథసంఖ్యలో వెలసి యుండుట యెఱిఁగి దానివలెఁ దెలుఁగున వెలయఁదగినది ద్విపదయని గుర్తించి సోమనాథుఁడు తన ప్రధానగ్రంథములగు బసవపురాణ పండితారాధ్య చరిత్రములను ద్విపదరచనములందే నెలకొల్పెను. అగాధగద్యపద్యాది ప్రబంధపూరిత సంస్కృత భూయిష్ఠరచన సర్వసామాన్యముగాదనియు జానుదెనుఁగు మిక్కిలి ప్రసన్నముగా నుండుననియు నది ద్విపద రచనమున మిక్కిలి పొసఁగియుండు ననియుఁ బయిద్విపదలందు సోమనాథుఁడు సూచించినాఁడు." (బసవపురాణ పీఠిక పుట 56-శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1925).

1. 'స్త్రీ పామరాదుల గేయ రచనములనియ నాదరమునఁ జూచు పదరచనముల వరుసలే ద్రవిడ భాషలోని ప్రౌఢకావ్యములందలి వృత్తములుగా నెలకొన్నవి.' (బసవపురాణ పీఠిక. పుట 85.)

2. 'ఈతఁడు దేశీయ కథలను దేశిచ్ఛందో జనితమగు ద్విపదమున దేసి తెనుఁగుభాషలో రచించినవాఁ డగుటచే నతని కవితలో నాంధ్రతా ముద్ర సక్రమముగా నత్తికొనెను.' (బసవపురాణ పీఠిక పుట 85).

స్వాతంత్ర్యమును వహించినాఁడు. మాత్రాగణఘటితములగు జాతు లందు ప్రాస యతి చెల్లునని నిర్ణయము చేసినాఁడు. ఇట్లే యతుల యందును, ప్రాసములందును, పదప్రయోగములందును ద్విపదతో ద్విపదను సంధించు విషయమునందును సర్వత్ర సంప్రదాయమున కన్న భిన్నముగ ద్విపదచ్ఛందోనిబంధమునఁ గొంత స్వాతంత్ర్యము వహించి మాఱుపాటు గావించెను. సోమనాథుఁడు తన ద్విపద రచన నిట్లు ప్రశంసించుకొనెను.

తేట తెనుఁగున ద్విపదరచింతుఁ - బాటగాఁ దత్కథాప్రౌఢి యెట్లనిన
జాతులు మాత్రానుసంధానగణవి - నీతులుగాన 'యనియతగణై'ర
నియును 'ప్రాసో వా' యనియు 'యతిర్వా'య - నియుఁ జెప్పు ఛందో
విహితోక్తిగాన,
ప్రాసమైనను యతి పైవడియైన - దేసిగా నిలిపి యాదిప్రాసనియతి
దప్పకుండగ ద్విపదలు రచియింతు - నొప్పదు ద్విపద కావ్యోక్తి నావలదు
అగాధ గద్యపద్యాది ప్రబంధ - పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వ సామాన్యంబుగామిఁ - జానుఁ దెనుఁగు విశేషము ప్రసన్నతకు
అట్లనుగాక కావ్యము ప్రౌఢి పేర్మి - నెట్టన రచియింపనేర్చినఁ జాలు·
నుపమింప గద్యపద్యోదాత్తకృతులు - ద్విపదలు సమము భావింప నెట్లనిన
సరళత సరణి ప్రసన్నత చెన్ను - పరిణత గణ పద పద్ధతి శబ్ద
శుద్ధి ప్రయోగ ప్రసిద్ధి గళా సమృద్ధి నానుడి వడిమితి యతి యర్థ
పుష్టి నైజము రసపుష్టి వినూత్న - సృష్టి విశేష్య విశేషణ శ్లేష
సొంపు గుమారత బెంపు మాధుర్య - మింపు మృదుత్వంబుగుంపోజు సదువు
యమకంబు గమకంబు యతిగతి వార - కము పూరకము ప్రియ గాంతి
విశ్రాంతి
రంగు బెడంగు మెఱుంగు సమాస - సంగతి యక్షరశయ్యా సంఘటన
నిపుణత రసికత నెఱి సమాసార్థ - ముపమాన ముపధాన ముత్ప్రేక్ష్యలక్ష్య
లక్షణ వ్యక్తి యలంకార యుక్తి - దక్షత సుమతి విచక్షత యనిన
జాతుల రచనా ప్రణీతులు గావ్య - నీతుల రీతుల నేతులుట్టంగ
వరకవుల్ గొనియాడ వర్ణన కెక్క - ధర తెప్పుకృతియ యుద్యత్కృతి
గాక

......వడ్లను తెలుఁగు - విసుకు ఛందము జిలిబిలికృతుల్ గృతులే
అటుగాన యతిప్రాసానందితోక్తి - పటు గద్యపద్యప్రబంధ సామ్యముగ
కావ్యకళాప్రౌఢి గల్పింతు ద్విపద - కావ్యంబు భవ్యంబుగాఁగ నట్లయ్యు

* * *

దేసిగా వచియింతు ద్విపదకు వళ్ళు - ప్రాసంబులనుఁ బొందుపఱఁగఁ దావలయు
ననుచుఁ దదీయ సూక్తాక్షర పంక్తిఁ - వెనకక యింతొప్పఁ జెప్పవేయనుచు
సన్నుతిఁ జేయుచు సత్కవులలర - దిన్నని సూక్తుల ద్విపద రచింతు
నదియునుగాఁ గైహికాముష్మికద్వి - పదహేతువగుట ద్విపదగాఁగఁ బరగు
ద్విపదాంబురుహముల ధృతి బసవేశు-ద్విపదాంబురుహములకిఁ బ్రీతిఁబూను.'

చూ. పండితారాధ్య చరిత్రము.

తానురచించిన ద్విపదలు పండితులకు మాత్రమేకాక పామరులకుఁగూడ నుపాదేయములు కాఁగలవని, యట్లుకావలయునని, సోమనాథుఁ డభిమానించి యట్లే పైరీతిని ద్విపదకావ్యరచనకు పునాదివైచినాఁడు. ఈతని ద్విపదకృతులు బహుజనాదరపాత్రము లైనప్పటికి నిందలి సంప్రదాయధిక్కార స్వాతంత్ర్యముల కారణమునఁగావచ్చును-నాఁటి పండితులచేత తద్రచనయుఁ గృతులునుఁ గొంతవఱ కీసడింపఁబడినవి. అందుకే శ్రీనాథాదికవిశేఖరులు తరువాతి కాలమున నీ ద్విపద కృతులలోని యతివృత్తగౌరవమును పండితవేద్యము గావించుటకై కావచ్చును, వానిని ప్రబంధీకరించినాఁడు ఏమైనను ద్విపదకావ్యరచనకు వీరశైవ కవుల కారణముననే బహుళప్రచారము లభించినదనవలెను. ఇది యీ వాఙ్మయప్రక్రియలో ప్రథమదశ.

ఈ వీరశైవకవుల ద్విపదలకు గల్గిన ప్రచారమున కబ్బురపడి కావచ్చును, తరువాత మఱికొందరుకవు లామార్గముననే ద్విపదకవితలోని మెఱుఁగు తఱుఁగులను బరికించి పండితులచేత నీసడింపఁబడిన తఱుఁగును తొలఁగించి మెఱుఁగునకు మరింత మెఱుపుఁ దెచ్చుటకు యత్నించినారు.తరువాత శైవవైష్ణవకవులు పలువురీ ద్విపదనాదరించి పండితులకు, పామరులకుఁ గూడ నొప్పిదమగు రీతిని కావ్యములు

రచించినారు. సోమనాధుని తర్వాత వచ్చినవానిలో రంగనాధుని రామాయణము, గౌరన హరిశ్చంద్ర చరిత్రము పేర్కొనఁదగిన కావ్యములు. ప్రాచీన సంప్రదాయానురోధమున వీరెల్లరు ద్విపదలను మాఱుపాటు లేక సలక్షణముగా రచించినారు.[1] అదిమొదలుగా ద్విపదయు లక్షణయుక్తమగు సాహితీప్రక్రియగా పండితజనామోదమును గాంచి ప్రసిద్ధికెక్కినది. ఇది ఆవాఙ్మయశాఖా వికాసమున రెండవదశ.

ఇఁక దాని మూఁడవదశ తాళ్ళపాకవారి కాలమున వారి మూలమున నారంభమైనది. ద్విపదరచనలో చెయితిరిగిన దిట్టలగు తాళ్ళపాక వారి రచనలలో నా ప్రక్రియ పరిపూర్ణవికాసమునొంది రచనయందును, భావమునందును గూడ పుష్టినందుకొన్నది. వీరిమూలమున ద్విపదరచనకు కావ్యత్వసిద్ధి లభించిన దనవచ్చును. వీరివంశమున పలువురు కవులు ద్విపద నాదరించినారు. పలుకావ్యములు రచించినారు. వీరికి ద్రావిడవేదములను నాలాయిరప్రబంధముగా రచించిన యాళ్వారుల 'పాట్టు'లాదర్శములును, విశేష ప్రచారముఁ గాంచిన శైవుల ద్విపదలు మార్గదర్శకములు నైనవి. అందుకే వీరి ద్విపదరచనలు వైష్ణవమతసాహిత్యముల ప్రచారమునకు విశిష్టముగా నుపకరించినవి.

## తాళ్ళపాకవారి ద్విపద కావ్యములు

తాళ్ళపాకవారి వంశమున ప్రఖ్యాతులగు కవులందరును ద్విపద చేపట్టినవారే. ఆవంశవిఖ్యాతికి మూలపురుషుఁడగు అన్నమాచార్యుఁడును, తత్పుత్రుఁడు పెద తిరుమలాచార్యుఁడును, తత్పు

(1) 'రంగనాథ రామాయణమున గాని గౌరన హరిశ్చంద్ర చరిత్రమున గాని ప్రాసయతి యెక్కడను గానరాదు ......... మఱియు ద్విపదయు ద్విపదయుఁ గలయునప్పు డొక్క పదమే యటు గొంతయు నిటు గొంతయు నైయుండునట్లు రంగనాథాదు లెక్కడను గూర్పరయిరి. 'ద్విపదతో ద్విపద సంధిల నేకశబ్దమవుడు ప్రయోగింప నది యయుక్తంబు' అని చిన్నన్న స్పష్టముగా నీ విషయమును నిరూపించినాఁడు.

(బసవపురాణ పీఠిక పుట 93, 99)

త్రుఁడు (తిరువేంగళనాథుఁడు) చిన్నన్నయు ద్విపదచ్ఛందమున ననేకకృతులు విరచించినారు. అయినను వీరి ద్విపదలందు సమకూడిన వైవిధ్యము, పుష్టి, మఱియెవరి ద్విపదరచనలందున గూడలేదను టతిశయోక్తికాదు. వస్తువునందును, భావనయందును, రచన యందును. వీరి ద్విపదరచన విశిష్టమై వైష్ణవ సాహిత్యమున పరాకాష్ఠ నందుకొన్నది. అన్నమాచార్యుఁడు రామాయణమును ద్విపదలో ననువదించినాఁడు. పెదతిరుమలయ్య హరివంశము నాంధ్రీకరించి నాఁడు. వీరిరువురును వైష్ణవతత్త్వమున కాకరములనదగు రామాయణ హరివంశములందలి మూలసారము నాంధ్రసాహిత్యక్షేత్రమున ద్విపదవాహినులుగా ప్రసరింపఁజేసినారు. ఇఁక చిన్నన్నయు నాసాహితీమార్గమున ఉషాపరిణయాష్టమహిషీకళ్యాణపరమయోగివిలాసాన్నమాచార్యచరిత్రాది బహుద్విపద కృతిలతానికుంజములఁ బెంచి సుందర బృందావన వాతావరణమును వినిర్మించినాఁడు. ఈ మార్గమున పరమయోగులేకాదు పరమాచార్యులును విహరించి తమ జీవితసందేశామృతమును బంచిపెట్టినారు. ఇట్లు వీరు వస్తువునందు కావ్య. పురాణప్రబంధాదిరీతులను నవముగా ననుసరించినారు. ఆ ప్రబంధములందును పౌరాణిక చారిత్రక సాంఘికేతివృత్తములఁ గైకొని వానికి వైవిధ్యమును గల్పించినారు. ఇఁక భావనయందు వైష్ణవ దివ్యతత్త్వము సర్వత్ర స్ఫురించుచుండును. భాగవత భగవద్భక్తి, తన్మాహాత్మ్యము, విష్ణుసంబంధిగాథలు, పరమాత్మకృత లీలావిలాసాదులు నందులోకోత్తరముగా వర్ణితములు. వీరికృతులయందలి భావన రసమయమై సార్వజనీనము సార్వకాలికమునై యుండును. వేద తుల్యములై ద్రావిడవేదములనఁబరఁగిన ఆళ్వారుల నాలాయిరప్రబంధములలోని దివ్యభావముల క్రిందలి భావన ఛాయామాత్రముగా సాగుటయేకాక ఎడనెడ అనువాదరూపమునఁగూడ విలసిల్లుచుండును. ఇఁక రచనలో వీరు స్వతంత్రత వహించియు ఛందస్సంప్రదాయమును మాత్రము బోషించుకొనినారు.

ద్విపదరచనలో వీరు పూర్వుల నెందర ననుసరించి యుండినను వీరినడక వీరిదే యై విశిష్టతనందుకొన్నది. ద్విపదలక్షణమును వీరు నిష్కృష్టముగా నిర్వచించినారు.

## ద్విపద-లక్షణనిర్వచనము

అంతవఱకును ద్విపదలక్షణము నట్లు నిర్వచించినవారుగాని, అనుసరించినవారుకాని వైష్ణవేతరకవులు కానరారు. [1]అందు వీరే ప్రథములు. వీరి నిర్వచనమిది.

"వాసవుల్ ముప్పురు వసుధాప్తుఁడొకఁడు - భాసిల్ల నది యొక్క
పదము శ్రీకాంత
క్రమమున నీవ ల్గు గణములు నడచుఁ - గ్రమదూరముగ ప్రయోగము
సేయరాదు.
ఆ పాదమునకు మూఁడవగణంబావె - దీపించుయతియంబుధిప్రియతనయ
యుపమింప నవి ప్రాసయుతములై రెండు - ద్విపద నావిలసిల్లి వికచాబ్జపాణి
ద్విపదకుద్విపదకుఁదెగఁ జెప్పవలయు - నెపుడు సంస్కృతమున
నితర భాషలను
యతులలోపలఁ బ్రాసయతి దక్కసకల - యతుల చెల్లును బ్రయోగాను
సారమున
ద్విపదతోద్విపదసంధిల నేకశబ్ద-మపుడు రెంటను గూర్పనది యయుక్తంబు
మఱియు సంస్కృతపుసమాసరూపమున - నెఱయనెన్నిటనైన
నిర్మింపఁదగును.
తెలుఁగున గూర్చిన ద్విపదయంత్యమున - నొనరఁ గ్రియాంత
సముచ్చయాంతముల
దనరు నకారమంత్యము గూడెనేని - వినుతింప నుత్తర ద్విపదాదియందు
గొనకొన్న స్వరముతోఁగూడఁ గాదనుచు - నొనరింప సుకవీంద్రు
లుద్దండ్రమంద్రు

---

1. మన ఛందోగ్రంథములో ప్రాచీనమగు కవిజనాశ్రయమున నీ ద్విపదకు లక్షణము—'ఇంద్రగణములుమూఁ డినగణంబొకటి చంద్రాస్య ద్విపదకుఁజనుఁజెప్పరేచ' అనురీతిని జాత్యధికారమున సామాన్యముగాఁ జెప్పఁబడినది. పెద్దిరాజు కావ్యాలంకారచూడామణిలోను నిదేరీతిని నిర్వచింపఁబడినది. కాని యితఁడు ద్విపదను "ద్విపది" యని పేర్కొనినాఁడు—.

అరసున్న నొనగూర్ప మనవైనహల్లు - గరిమ నీద్విపదాది గనుపట్టెనేని
తొలివిభక్తికిఁ దగఁ దుది విభక్త్యంతములు నకారములునుముకురబింబాస్య
యా నకారము చెల్లు నరసున్నలగుచు-వానీలకచభృంగ నలమేలుమంగ
యనులక్షణంబుల ననువొంద సుకవి - జనమప్రయోగైక శరణమై నిఖిల
జగదేకనుత విరాట్ఛందోవతీర్ణ - యగుచునే ద్విపద విఖ్యాతిచెలంగ
వితతలక్షణ ద్విపదమార్గమున - మతినెన్ని కృష్ణాష్టమహిషీ వివాహ
కృతి యొనర్పెదఁ జమత్కృతి సంఘటింప:—"

(చిన్నన్న కృత అష్టమహిషీకళ్యాణము పుట. 6-7)

(1) రెండుపదములు గలది ద్విపద-పదమునకు 3 ఇంద్రగణములు 1 సూర్యగణము చొప్పున నుండవలెను. ఈ నాల్గుగణము లిట్లేయుండవలెను. 'క్రమదూరముగ ప్రయోగముసేయరా' దనుటలో మాత్రాచ్ఛందస్సు ననుసరించి గురులఘువులను మాఱుపాటు లేక అట్లే ప్రయోగింపవలెనని భావము.

(2) ప్రతిపాదమున మూడవగణము మొదటియక్కరమునయతి దీపించును. ఇట్టి రెండు పాదములును ప్రాసయుతములై ద్విపద మగును.

(3) ద్విపదయు ద్విపదయు నేకశబ్దముతో సంధించునట్లుగాక తెగునట్లు చెప్పవలయును. అనఁగా.

"అపరాధి నపరాధి నాగమగణ్య
కృపఁజూడు కృపఁజూడు కృపణశరణ్య-

(అష్టమహిషీ - పు. 52)

కడుపులోపలి బిడ్డ కాలఁ దన్నినను
జిడిముడి తల్లికిఁ జెల్లునే తండ్రి.

అనుకీలిని గాని,

"శ్రీవత్స కౌస్తుభ శ్రీవనమాలి - కావర చందన కలితవక్షుండు
వరహీర దర్పణోజ్జ్వల గండయుగళ - నిరుపమచాంపేయ నిభనాసికుండు"

(పరమయోగి)

అను రీతిని గాని ద్విపదలు విడివడి యుండవలెనేగాని,

"అతిశయ ప్రీతి బ్రహ్మాండపురాణ - మత మహామోహాస్య మాహాత్మ్య
మన ము
దలఁద్రిపుండ్రం మోహదం త్యక్తమన వి-రళ మేతదన్యత్ర రమ తేయనఁగను
చిత సూక్తి యట్ల వాసిష్ఠలైంగంబు." (పండితారాధ్య)

అనురీతిని ద్విపదయు ద్విపదయుఁ దెనుఁగున గాని సంస్కృత మున గాని నేకశబ్దముతో సంధింపఁ జేయరాదు.

(4) కాని ద్విపదలన్నియు సంస్కృతపు సమాసరూపమున నున్నచో నెన్నిఁటినైన జేర్చి నిర్మింపవచ్చును.

కంకణరుణఝుణత్కారసంకీర్ణ-సంకులపద్మహస్తాహస్తవళిత
పరశుభ్రచామరావళిజాతశైత్య-కరపోతవారిత ఘర్మశీకరుని॥

(అష్టమహిషి -పు. 184)

పై రీతి నెన్నిటినేని గూర్పవచ్చును.

ఇట్టిసమాసములకూర్పులో భావము ద్విపదకుద్విపదకు తెగక తీగ సాగవచ్చును. ద్విపదలెన్నియేని సమాసరూపమునఁగొనసాగవచ్చునే గాని యందైనను రెండుద్విపదల నేకశబ్దమున సంధింపరాదు. అనఁగా

కుందేందుచంద్రికాగోక్షీరఫేన-సుందరామల పరిస్ఫురితసద్వర్గ
భస్మసమాలిప్తభావజదేహ-భస్మసాత్కరణ విభావనులోచ
న బ్రహ్మగీర్వాణనాకేశవంది-తబ్రహ్మయోగి సదాపూజనీయ

(పాల్కురికిసోమన - పండితా-వాదపత్రిక)

అనిశైవకవులు ప్రయోగించినరీతిని ద్విపదరచన యుండరాదు. తాళ్లపాకవారి ద్విపదలం దెచ్చటను నీతీరురచన కానరాదు.

(5) యతులలోఁ బ్రాసయతి దక్క సకలయతులు చెల్లును, ప్రయోగానుసారమున[1] · అనగా వీరశైవులరచనయందువలె.

---

1. తాళ్ళపాకవారి ముద్రిత ద్విపద ప్రబంధములలో నొండు రెండు తావుల 'అమ్మునివతులకు నమ్మికల్పెట్టి' (అష్టమహిషి . పు. 70) అను రీతిని ప్రాసయతి కాననగుచున్నది. కాని యది వారికి సమ్మతము కాద నియు, వాపట్టులు సంస్కారము నొందవలసిన వనియు తెలియనగును.—

తనకరవాలు బొమ్మునదూనిమోపి-కొనికుతుకయచూచుచును తెప్పవిడక;
(బసవ. పు. 65).

అను రీతిని ప్రాసయతులను ప్రయోగింపరాదనుట.

(6) తెలుఁగున గూర్చిన ద్విపదయంత్యమున క్రియాంతసము చ్చయాంతములఁదనరు నకారము అంతమున గూడెనేని అది యుత్తర ద్విపదాదియందు గొనకొన్న స్వరముతో కూడరాదు. అనగా ద్విపద పాదాంతమున గనుక క్రియాంతనకారమో (చేయుచున్-అనుచున్-చెలగన్ ఇత్యాదులలోని ద్రుతమో) లేక సముచ్చయాంత నకారమో (ఒబురు జంగులు ఫిరంగులును-ఇత్యాదులలోని ద్రుతమో)నిలచినట్లైన నా ద్రుతమును తరువాతి ద్విపదాదియందున్న వర్ణముతోఁ గూర్పరాదని భావము.

'అలకీరపికములకందందయులికి - యిటవచ్చియీ కార్య మెరిగించిమిమ్ము
అఁట వేగఁదోడితెమ్మని నన్ను బనిచె - నేఁటిమాటలుగావు నిఖిలేశ!నిన్ను
ద్వారకా నగరినెంతయు వేడ్క నుండె - ఈ కృష్ణచరితంబు నెవ్వరువిన్న
తమ్ములోకూర్మి మొ త్తమ్ములోయనుచు ఈరీతిగొనియాడియిందిరావిభుఁడు
(అష్టమహిషి. పు. 288).

ఉండెన్ + ఈకృష్ణచరితంబు — అనుచున్ + ఈరీతి - అను పై ప్రయోగములందలి ద్రుతము ద్విపదాంతముననుండుటచేత నుత్తర ద్విపదాదిస్వరముతోఁ గూర్పఁబడక విడువఁబడవలె ననుట. ఇట్టి సంద ర్భములందు ద్రుతమును సంధింపక వ్రాయుటయే వీరియభిమతము.[1] ద్విపదాంతమున భావము ముగియుటచేత వాక్యావసానమై ద్రుతము నకు లోపమగుటయు శాస్త్రసమ్మతమే. ద్విపదరచన ప్రసన్నమగుటకీ నిర్వచనము తోడ్పడును. ఈరీతిరచనను సుకవీంద్రులు 'ఉద్దండ' మందు రట! అది ప్రశంసయో లేక అసంప్రదాయమునకు పేరో! వీరకైవుల ద్విపదలలో నీకట్టుబాటు కానరాదు.

---

1. తాళ్ళపాక వారి ముద్రితద్విపదగ్రంథములలో పలుచోట్ల నీతీరుగా ద్రుతమును విడచి వ్రాసినతీరు గానవచ్చినను కొన్నియెడల ద్రుతకార్యము జరుపఁబడియు రచన ముద్రణమున గానవగుచున్నది ఇది వీరికి సమ్మతము కాదు

(7) ఇఁక ద్విపదాంతమున గల ద్రుతము వ్యాకరణకార్యమున నరసున్నగా మారఁదగిన హల్లుగనుక ఉత్తరద్విపదాదియం దున్నచో నట్టి ప్రథమేతరవిభక్త్యంతములందలి నకారములరసున్నలయి వెలయఁ గలవు. ప్రథమావిభక్త్యంతమున ద్రుతప్రసక్తిలేమిచే నితరవిభక్త్యంత ములు మాత్రమే పేర్కొనఁబడినవి.

'భామలందఱుఁ బలువడిఁ జూడఁ జూడఁ-బిలిచి యేకతము జెప్పెదనంచునోటఁ
బలికి చూఁపగరాని పలుకుల పలుకుఁ-బులు గాకులేల బో పొమ్మన్న మమ్ముఁ
బలుగాకులాడు నీపలుగాకువాఁడు.' (అష్టమహిషి -పు. 22)

'కలికి రేరాజు నక్షత్రమాలికకుఁ గొలికిపూసనఁగ వేగురుచుక్క పొడిచెఁ
గలుక చీకట్లను కరులమాయింప' (అష్టమహిషి –పుట 220)

సరళాదేశ సంధి ఈ తీరున జరిగి ద్విపదాదియందు సరళా దేశము కావచ్చును.

ఇట్లు పైన పేర్కొనఁబడిన లక్షణములతో నొప్పి సుకవి ప్రయోగైక శరణమై 'విరాట్ఛందోవతీర్ణయగుచు' నీద్విపద విఖ్యాతిగాంచిన దని చిన్నన్న విశదీకరించినాఁడు.

## ద్విపద విరాట్ఛందోవతీర్ణయా?

చిన్నన్న ద్విపదచ్ఛందము 'విరాట్ఛందోవతీర్ణ' యని పేర్కొనెను. బహుశః ఈతనియుద్దేశ్యమున ద్విపద దేశిచ్ఛందముకాక సంస్కృతప్రాకృతవృత్తజన్యమని కాఁబోలును! ఈయభిప్రాయమునఁ గొంతసత్యమున్నదనియే తోఁచుచున్నది. మనమీఁనాడు ప్రాయిక ముగా దేశిచ్ఛందములని తలచుచున్నవాని కన్నిఁటికిని మూల ములు వైదికచ్ఛందమునందలి అక్షరవృత్తములును సంస్కృ తము నందలి వర్ణ వృత్తములును, ప్రాకృత అపభ్రంశము లందలి మాత్రావృత్తములునునై యుండుననవచ్చును. భారతీయ వాఙ్మయముల కన్నిఁటికిని వైదికవాఙ్మయమే మూలాలవాలము. అట్లే ఛందమునకును· వేదమునందలి అక్షరవృత్తములే కాలక్రమమున ప్రాచీనసంస్కృతమునందలి గురులఘుసమ్మేళనమున నేర్పడిన వర్ణ వృత్తములై యుప్పతిల్లినవి.ఈరెంటియందునుఁగానరాని స్వరమాధుర్య

మును సాధించుటకే తరువాతికాలమున ప్రాకృతములందలి మాత్రావృత్తము లేర్పడినవి. ఈ మాత్రావృత్తములకు చెందినవే గాధా (ఆర్యా), మాత్రాసమక, వైతాళీయ జాతివృత్తములు. ఇవి క్రమముగా ద్విపదీ సమచతుష్పదీ అర్ధసమచతుష్పదీ వృత్తవర్గములకు చెందినవి. ఆతరువాత నీఛందోవర్గము లొకొక్కటియు మఱియెన్నో జాతులపుట్టుకకుఁ గారణములైనవి. పై గాధావృత్తమే పథ్యా,విపులా, చపలా భేదములతో విరాజిల్లినది. దానినుండియే గీతి (గీతికా), స్కంధకాది వర్గములెన్నియో కల్గినవి. ఛందోవిషయమున బహు పరిశ్రమముగావించిన ఆచార్యవేలఁకర్ గారి వాక్యములివి. చూడుఁడు:

"Akshara Vrittas are the Vedic metres whose padas were constituted with a certain number of Aksharas, whether short or long. While the Varna Vrittas, which were evolved out of the Akshara Vrittas in course of time, are based upon a Varna which is of two kinds, short and long. While a number of Aksharas alone was essential for the former, a definite succession of the two kinds of these in addition to their number was necessary for the latter. Metrical-music in the Vedic Akshara Vrittas was controlled by the number of the Aksharas now raised and now lowerd in their pronunciation according to a scheme of word accentuation introduced early in the speech system of the Vedic people. The music of the Varna Vrittas of classical Sanskrit on the other hand, depended upon the pleasurable variation of the word sounds produced by the different orders of succession in which the two kinds of Aksharas or Varnas followed each other in a metrical line. As against these two metrical systems there exists a third, in which the metrical music arises neither from the number of raised or lowered Aksharas, nor from the order of succession of the two kinds of these Aksharas, but from the adaptation of the recitation of these Aksharas to a regularly recovering stress conveyed either by the movements of the body or by a musical instrument and controlled by passing time measured with a uniform unit. Naturally in this system, the number of the Aksharas and the orderly succession of their two kinds played only a secondary role and they were employed as their use was inevitable in any Vocal

music intended to convey a meaning. But this association of the Aksharas and their two kinds with a uniform time unit in the production of this type of metrical music necessitated the use of a corresponding uniform unit in the case of the Aksharas, a unit which could help the correct measurement of these when employed in such a metrical line. This unit may be called the Akshara matra as opposed to the line unit which may be called the Kala matra for the sake of distinction. The general mode of pronouncing the two kinds of Aksharas show that a long Akshara takes double the time which is taken by a short Akshara in its pronunciation. This means that the syllabic content of a short Akshara is one Aksharamatra and that of a long one is two Akshara matras and further that short and long Aksharas could be employed on the basis of their syllabic content to produce a metrical music controlled by a time unit. It should be clearly understood that this time controlled metrical music was essentiatly a popular one and the uneducated bards who had a natural talent for word music and for a selection and employment of appropriate words for that purpose sometimes negllected the grammatical correctness of the pronunciation of their words or their constituent Aksharas not much caring for the usual proportion of the syllabic content of an Akshara with the time taken for its correct pronunciation. Such lapses naturally offendend the susceptibilites of the educated Sanskrit Pandits; who indeed very much liked this type of music but were not prepared to sacrifice their conventionally and grammatacally correct pronunciation of short and long Aksharas which respectively took one and two time moments or Kala matras. It is breifly in this manner that the advent of the Akshara matras and the Chatur matra gana in the field of classical Sanskrit prosody is, I think to be explained. Yet it is a fact that this time controlled music was never holly adopted by Sanskrit prosodists. Though their adoption of the matra unit lead to the origin of a few metres like the Matra Samaka and the 'Arya' groups of metres.

*(Prof. Velankar's Introduction to Hemachandra's Chandonusasanam pages 14, 15.)*

"Gatha known as Arya in its Sanskrit garb is certainly the earlist and the most popular metre of Prakrit Prosody Bharata at Natya Sastra 16, 151-163, gives all the details about the constitution of this metre and mentions its three main kinds namely, the Pathya, the Vipula and the Capala, not forgetting even the subdivisions of the last one. But he does not define any of the derivaties of the Aryas like the Giti or the Gitika and the Skandhaka." (P-14)

ఈ వృత్త జాతులే తరువాతికాలమున ఆంధ్రచ్ఛందమునను ప్రవేశము కల్పించుకొని యతిప్రాసలనెడి నూతన ప్రక్రియలతో వినూతనమగు దేశీయతను గూర్చుకొన్న వనవచ్చును, తెలుఁగువారి కందగీతాదు లిట్టివే కావచ్చును. ద్విపదయునిట్టిదేయని చిన్నన్న యభిప్రాయమై యుండవచ్చును.

'ద్విపద' నామమే సంస్కృత ప్రభావమును సూచించుచున్నది. ద్విపద అనగా రెండుపదములు = పుం-ద్వే పదే యస్య అనియు, పద-పవద అచ్, చిహ్నె,స్థానే,ఉద్యమే, త్రాణే, వస్తుని,శబ్దభేదే (సుప్తింత రూపే) ప్రదేశే, శ్లోకపాదేచ - అనియు సంస్కృతకోశములు తెలుపుచున్నవి. ఇట్లు రెండు పాదములుగల యీ ఛందమునకు ' ద్విపద' అను నామమగుటయు దాని ప్రాచీనతనే చాటుచున్నది దీనికి పేరు తెలుఁగున ద్విపద కావ్యరచనకు శ్రీకారము చుట్టిన పాల్కురికి సోమనాధుఁడే కల్పించెనన వీలులేదు. ద్విపదచ్ఛంద మాతని కాలమునకు చాలపూర్వమే కలదు. దానికాపేరు నుండియుండు ననుటలో విప్రతిపత్తిలేదు. అతిప్రాచీనమగు వైదిక ఛందమునందలి రెండు పాదముల 'ద్విపద' ననుసరించియే దీనికి పేరు కలిగియుండును.

'అష్టకో దశకః సప్తకో విద్యాంపావితి పాఘురిక్ ।
'సనో వాశేషు పాదా ద్వాజాగతా ద్విపదోచ్యతే'

(పటలః 16 - సూ 17, 28)

ఇతి ఆద్యా యథా :

విద్వాంసా విద్దురః వృచ్ఛే

దవిద్వా నిత్థాపరో అచేతా.

నూచిన్నుమర్తే అక్రౌ. (ఋ. సం - 1-8-22-2)

కాత్యాయన స్త్విమాం కకుభము క్తవాన్.

ద్వితీయా యథా

సనో వాజే ష్వవితా పురూవసుః

పురస్థాతా మఘవా వృత్రహాభువత్. (ఋ. సం. 6-4-33)

క్వచిదష్టాక్షర పాదద్వయవత్యపి ద్విపదా గాయత్రీ దృశ్యతే.

యథా :-

తే సుతా సోమదింతమా;

శుక్రావాయు మసృక్షత, (ఋ. సం. 7-2-16-3)"

(చూ. పింగళ ఛందము-పుట. 16)

ఇట్లే ప్రాకృత ఛందమునందును 'ద్విపదీ', ద్విపదీఖండాదు లున్నవి, (చూ. వివరణమునకు హేమచంద్రుని ఛందోనుశాసనగ్రంథ పరిశిష్టమునగల 'జానాశ్రయీ' పుటలు 240-6,7)

ఇట్లు ద్విపద - ద్విపదీనామములు ప్రాచీనములే. అది రెండు పాదములుగల ఛందమునకు పేరగుటయు ప్రసిద్ధమే. కావున దాని నుండియే ద్విపద ద్విపదీనామములను మనవారు గ్రహించియుందురు. మన ఛందోగ్రంథములలో ప్రాచీనమగు కవిజనాశ్రయమున నిది 'ద్విపద' గను- పెద్దిరాజ విరచిత కావ్యాలంకార చూడామణియందు 'ద్విపది'గాను పేర్కొనఁ బడినది. సంస్కృత లాక్షణికు లీ శబ్దరూప భేదమున కర్థభేదమునుగూడఁ జాటించినారు, వైదిక వాఙ్మయమున ఋక్కున కర్థమైనప్పుడు 'ద్విపద' యనియు, మాత్రాచ్ఛందో విషయ మున కర్థమైనప్పుడు 'ద్విపది' యనియు వారు వ్యవహరించినట్లు నిఘంటువులనుబట్టి తెలియుచున్నది. కావున వైదికమగు నక్షర చ్ఛందము నందలి 'ద్విపదయు' ప్రాకృత అపభ్రంశములమాత్రాఛందము నందలి 'ద్విపది' యు మన తెలుఁగుద్విపదకు నామమునుప్రసాదించి నవి.

ఇఁక ఛందః ప్రస్తారవిషయమున సంస్కృత ప్రాకృత చ్ఛందములందలి 'ద్విపద' కును తెలుఁగు ద్విపదకును భేదముండుట విదితమే. కాని సంస్కృత ప్రాకృతములందలి ఆ ఛందః ప్రక్రియల నుండియే తెలుఁగు ద్విపదచ్ఛందము రూపొంది యుండుననుటలో వింతలేదు. (చూ. యక్షగానములు తంజావూరు 1951-52. ఖర సంవత్సరాది సంచిక. 17-32 పుటలు. డా॥ నేలటూరి వెంకట రమణయ్యగారు). వేదమునందలి అక్షర వృత్తములనుండి సంస్కృత వర్ణవృత్తములును, వానినుండి మాత్రా వృత్తములును నేర్పడినవని ప్రామాణికులు చెప్పిన విషయమే. అట్లేర్పడిన మాత్రా వృత్తములలో నతిముఖ్యమగు ద్విపదచ్ఛందముకూడ తరువాతికాలమున మాత్రాగణప్రస్తార భేదములవలన ప్రాకృతకవితలో దశాధిక రూపభేదముల గాంచినది-

చూ. "I have discussed the name Dvipadi and its application to metres of four lines elsewere and concluded that the name was first given to a pair of stanzas, each stanza being considered as a Pada or the foot on which the metre seems to move and that even when the number of stanzas of a song exceeded two, it still retained its name Dvipadi, where the word 'Dvi' was only secondarily applied.................................... It is also important to note that according to the Janasrayi the Bhanga Dvipadi is of many kinds, the shortest among them being a Samachatushpadi Matra Vritta having from 12 to 15 Matras in a pada, while the longest may have from 4 to 7 ganas in its pada, the gana signifiying either a Chaturmatra or Panchamatra Gana. In any case, however the longest among them may not have more than 30 matras in its pada..............

This strophic Dvipadi, which I believe is the earliest form of the descriptive kind of Prakrit poetry, dwindled in its importance in course of time; untill every thing about it was almost forgotten except a single form of its initial canstituent stanza viz, the dvipadi with 28 matras in each of its four padas"

*(Prof. Velankar's introduction to Hemachandra's Chandonusasana. P. 29-31)*

కావున మనద్విపదచ్ఛందము సంస్కృత ప్రాకృత వృత్తజన్య మైనప్పటికిని తెలుఁగున వెలసినపిదప రూపాంతరమునంది యుండ వచ్చును. ఈ భావముల కనుగుణముగనే చిన్నన్న -ద్విపదను విరాట్ఛందోవతీర్ణ యనినట్లున్నాఁడు- అనగా విరాట్ఛందమునుండి యేర్పడినదని ! ఈ విరాట్ఛందము సంస్కృతమున పంక్తిచ్ఛందము నకు చేరిన శుద్ధవిరాట్ఛందమే. దానికే 'విరాట్' అనియు నామాంతరముగలదు. పింగళాచార్యుఁడు తన ఛందశ్శాస్త్రమున నీ విరాట్ఛందమును గూర్చి విపులముగా చర్చించినాఁడు. 'శుద్ధవిరాట్ మసజగా'అని యాతని సూత్రము. "యస్యపాదే మకార (◡◡◡), సకార (।।◡) జకార (।◡।) గకారా (◡) భవంతి తద్వృత్తం 'శుద్ధవిరాట్' సమా। యత్రోదాహరణమ్.

విశ్వం తిష్ఠతి కుక్షికోటరే
వక్త్రే యస్య సరస్వతీ సదా
అస్మద్వంశ పితామహో గురు
ర్బ్రహ్మా శుద్ధావిరాట్ పునాతు నః ॥.

అత్ర పాదాంతే యతిః —. ఉక్తదశాక్షర ప్రస్తారస్య పంచ చత్వారింశదుత్తర త్రిశతతమోఽయం భేదః (345) శుద్ధ విరాట్ నామ్నా ప్రసిద్ధాః విరాట్ ఇత్యపి నామాంతరం క్వచిత్." అని వివరించినాఁడు.

ఈ దశాక్షర ప్రస్తారముగల పంక్తిచ్ఛందమున 1024 భేదములు పుట్టుచున్నవి. అందు 345 వ భేదమీ శుద్ధవిరాట్ ఛందము. ఇది కాక ఈ వర్గమునకే చెందినవి కలగీతా, ఆందోళికా, దీపకమాలా, పథ్యా ప్రభృతి వృత్తభేదములెన్నియో వివరింపఁబడినవి. వీనియం దన్నిఁటను పాదమునకు మూఁడు గణములమీఁద నొక గురువధికముగా నుండి సాధారణముగా 15, 16, 17, 18 మాత్రలుండుచుండును. ప్రకృతము విరాట్ ఛందమున పాదమునకు 16 మాత్రలున్నవి. మూఁడు గణములతరువాత నొక దీర్ఘాక్షరముతో పాదము విరుగు చున్నది. ఇట్టి విరాట్ఛందము నుండి ద్విపదయవతరించినదని చిన్నన్న

చెప్పుటలో సత్యము లేకపోలేదు. మనద్విపదచ్ఛందమునగూడ 'వాసవుల్ మువ్వురు వనజాప్తుఁడొకఁడు భాసిల్ల నది యొక్క పదము రూపగును.' అందలి మాత్రలుఁ లెక్కించి చూచినను పాదమునకు 15 మొదలుకొని 18 వరకు నుండగలవు. ఇంచుమించు పై రెండు వృత్తముల మాత్రాకాలము సమానమే. అందుకే కావచ్చును చిన్నన్న ద్విపదను 'విరాట్ఛందోవతీర్ణ' యనుట. చిన్నన్న తన అష్టమహిషీ కళ్యాణమున వివరించిన ద్విపదలక్షణమున 'ఎపుడు సంస్కృతమున నితరభాషలను' అనుటనుబట్టి యీ ఛందము సంస్కృతమందును గలదా యని తోచును. పంక్తిచ్ఛందమునకుఁ జేరిన ప్రభేదములలో నీద్విపదను బోలిన ఛందమొకటి యుండినను నుండి యుండవచ్చును. ఏమైనను సంస్కృత వర్ణవృత్తములు ప్రాకృతమాత్రావృత్తములకు దారి తీసిన తరువాతి కాలమున నెపుడో తెలుఁగున నీ ద్విపద వెలసియుండుము. యతి ప్రాసలను గూర్చికొని ప్రచారముగాంచి దేశీయతను వెలార్చి యుండును. ద్విపదపాదమును రెట్టింపగా తరువోజపాద మేర్పడినది. తరువోజలు తెలుఁగున క్రీ॥శ॥ 8-9 శతాబ్దులనడుమ పండరంగని అద్దంకి శాసనమునఁగాననగుచున్నవి. కావున ద్విపదయునికి అంతకింకను పూర్వమే యనవలెను. ద్విపదనుండియే తరువోజ- దాని నుండియే కాలక్రమమున సీసము, ఆటవెలది, తేటగీతి, మున్నగు జాతులన్నియు సంక్రమించినవి. ద్విపదయే ప్రాసవిరహితమై మంజరీద్విపదయగుచున్నది.

సంస్కృతచ్ఛందమునకు వైదికచ్ఛందమువలె తెలుఁగునందలి దేశిచ్ఛందమునకు ద్విపదఛందము ప్రాతిపదికఁ గల్పించుచున్నదనన వచ్చును. ఆ దృష్టితో 'విరాట్ఛందోవతీర్ణ' యైనను ద్విపదను నేఁడు మనమనుకొనునట్లు దేశిచ్ఛందమనినను దోషములేదేమో !

ఏమైనను తాళ్ళపాకవారు ద్విపదను 'విరాట్ఛందోవతీర్ణ' యనిరి. పైన వివరించిన విధమున తాళ్ళపాకవారు ద్విపదలక్షణమును సమగ్రముగ వివరించియున్నారు. వారు వివరించినట్లే వారి ద్విపదలును లక్షణబద్ధములై యొప్పుచున్నవి.

వీరి ద్విపదలు ఛందస్సునందే కాక రచనావైఖరియందును విశుద్ధములైనవి. ద్విపదచ్ఛందము సాధారణముగా నొకేరీతిని పల్లవి పాటగా నుండుటచేత రచనాచమత్కృతిలేనిచో విసుగుదలఁగొల్పుచుండును. కాని తాళ్ళపాకవారిద్విపద లట్లు విసుగును గొల్పవు. వారా రచనను 'చమత్కృతి సంఘటింపఁ జతురవాచా ప్రౌఢి' మెఱయునట్లు గావించిరి. 'కొంకక తమ నోరి కొలఁదులుబలుకక అలఘు శబ్దార్థ సారసరీతి రసప్రభావముగఁ గులికి, కస్తురి వీణెఁగోసిన కరణిఁ, దెలిగప్పురపుఁగ్రోవి దెఱచినసరణి, విరవాది పొట్లంబు విడిచిన మాడ్కిఁ, బరిమళించుచు గవుల్ బళిబళి యనఁగఁ గవితచెప్పిన' 'సులక్షణులైన కవీంద్రులు వీరు. వీరిలోను పేరుపొందినవాఁడు చిన్నన్న. అతఁడు 'దినములోననె వేయిద్విపదలింపొంద వినుతవర్ణనలతో విరచించు' వాఁడట ! ఆ వినుతవర్ణనలును విసుగుగొల్పునట్లొకేరీతి నుండక చమత్కార వైవిధ్యములతో నొప్పి కవిశిరఃకంపయోగ్యములుగా నుండెడివి. అందుకే 'చిన్నన్న ద్విపదకెఱుగును' అన్ననుడి నాఁడే యేర్పడినది. దేవమనుష్యాది వర్ణనల మొదలుకొని ప్రకృతి వర్ణనల వఱకును అష్టాదశవర్ణనములందును కూడ చిన్నన్న చమత్కృతిని వైవిధ్యమును సాధించినాఁడు. నవరసములను బోషించినాఁడు. ద్విపదకవితలో నతనితో సాటి చెప్పఁదగినకవి యింకొకఁడు లేఁడనియే చెప్పవచ్చును. కావుననే తాళ్లపాకవారు ద్విపదకవితకు రచన యందును విశిష్టతను జూపి ప్రత్యేకతను వెలయింపఁ జేసినారనుట !

ఇట్లు కావ్యాంగములనదగు వస్తువు, భావన, రచన యను మూడింటియందును తాళ్లపాకవారి ద్విపదలు ప్రసిద్ధములై తత్కవితాప్రక్రియకే విశుద్ధతను, ప్రామాణికితను చేకూర్పఁజాలినవి. ద్విపదవాఙ్మయప్రపంచమున తాళ్లపాకకవులకే అగ్రతాంబూలము.

## అన్నమాచార్య రామాయణము - ద్విపద

కర్త : తాళ్లపాకవారి ప్రశస్తికి మూలపురుషుఁడగు అన్నమాచార్యుఁడు.

ఈతని మనుమఁడగు తాళ్లపాక చిన్నన్న తాను రచించిన అన్నమాచార్య చరిత్ర ద్విపదలో తన తాతగారగు అన్నమాచార్యుని రచనను ప్రస్తుతించుచు ని క్రింది విధమున వివరించెను.

"సారసనేత్రుపై సంకీర్తనములు సరసత్వమును దాళసముఖముల్ గాఁగ
వరమతంత్రములు ముప్పదిరెండువేలు ప్రవిమల ద్విపద ప్రబంధరూపమున
నవముగా రామాయణము;.....................................
ప్రతిలేని నానాప్రబంధముల్ చేసి" (అన్నమా. చరిత్ర. పు. 46-47)

ఇందు అన్నమాచార్యుఁడు ద్విపదరామాయణప్రబంధ రచయితగాఁ బ్రస్తుతుఁడయ్యెను. ఈ రామాయణమును 'ప్రవిమల ద్విపద ప్రబంధ' రూపమున 'నవముగా' రచించెననుటలో విశేషించి వీరి రచన లక్షణబద్ధమైనదనియు, నంతకుముందు వేరొక ద్విపద రామాయణ రచనయుండగా దీనిని వీరు క్రొంగ్రొత్తగా ప్రతిభామయముగా విరచించినారనియుఁ గూడ నూహింపనగుచున్నది. అన్నమాచార్యుని ద్విపదరామాయణము నేఁడు కానరాదు కాని రామాయణకథాప్రసక్తములు సంకీర్తనములనేకములున్నవి.[1] అన్నమయ్యగారి రచనలన్నియు శ్రీ వేంకటేశ్వరస్వామివారికే యంకితమగుటనుబట్టి యిదియునాస్వామికే యంకితమై యుండుననవచ్చును. దుర్లభమగు నీద్విపదరామాయణప్రబంధము నుద్ధరించుట తెలుఁగువారి పనియైయున్నది!

తెలుఁగు దేశమున రామాయణ ద్విపద కావ్యములు గ్రంథకర్తృ నామాదికములు తెలియఁదగినవి ఒకకొన్ని తంజావూరు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములందున్నవి. వీనిలో కొన్ని యముద్రితములు[2] ఇవికాక ఆద్యంతములు శిథిలములై కర్తృత్వ విష

1. చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక - పుట. 69 - 70. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు.

2. ద్విపద రామాయణ కృతులలో కాలక్రమము ననుసరించి యెఱుఁగఁదగిన వాటిలో మొదటిది రంగనాథరామాయణము (13 శతాబ్ది-

యాదిక మగోచరముగను, సంశయాస్పదముగను గల రామాయణ ద్విపదరచనాభాగములును, రామాయణకథాప్రసక్తములగు ద్విపద గ్రంథభాగములును గూడా నొండు రెండు గలవు.[1] వీనినెల్ల పరస్పరము

---

ముద్రితము), తరువాతిది అన్నమాచార్య రామాయణము (15 శతాబ్ది — అలభ్యము) ఆ తరువాతిది కట్టావరదరాజురామాయణము (17 శతాబ్ది — ముద్రితము), అటు తరువాతిది భోసల ఏకోజీ రామాయణము. (18 శతాబ్ది — అముద్రితము.) పేర్కొనఁదగినవి.

1. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భండాగారమున సంఖ్య 981 నుండి 1008 వరకుఁ గల గ్రంథములన్నియు, రామాయణ సంబంధముగలవే. వీనిలో కొన్ని సుస్పష్టముగా రంగనాథ రామాయణ భాగములే. అయినను వీనిలోఁ గొన్నిట రంగనాథ రామాయణమునఁ గానరాని పాఠ భేదములు గలవు. ద్విపద రామాయణములను గూర్చిన సమగ్ర పరిశీలనము గావించువారి క్రింది వానిని పరిశీలించినఁ గొంత విషయము తెలియఁగలదనుకొందును. సంఖ్యలు 990; 996, 1005.

ఇఁక తంజావూరు సరస్వతీమహాలుపుస్తకభండాగారమందు సంఖ్య 835 మొదలుకొని 852 వరకును గల ప్రతులన్నియు రామాయణ ద్విపదలే. వానిలో 836 నుండి 850 వఱకు నన్నియు రంగనాథరామాయణ ద్విపద భాగములు—

851 - కట్టా వరదరాజు రామాయణము.

852 - భోసల ఏకోజీ రామాయణము.

856 : విభీషణబుద్ధి యను గ్రంథభాగము కూడ చాల వరకు రంగనాథ రామాయణ రచనగనే గానవచ్చుచున్నది. కాని పాఠభేదము లధికముగ నున్నవి. మదరాసులోని 990 సంఖ్య. గల ప్రతిలో తొలుత తాళ్ళపాక వారి ఉషాపరిణయ - ద్విపద యున్నది. దాని తరువాత నున్న రామాయణ రచన అన్నమయ్యదగునా యని పరిశీలించితిని గాని యందలి ద్విపదలు చాలవరకు రంగనాథ రామాయణము నందలివి గానే గోచరమైనవి. ఆ ప్రతి విలేఖకుఁడు రఘునాథన్ అనువాఁడు తాళ్ళపాకవారి ఉషాపరిణయముతోపాటు రంగనాథుని ద్విపదలే వ్రాసికొనెను కాఁబోలును!

పోల్చి పరిశీలించినచో నేయేపంక్తు లేయేకవుల గ్రంథము లందలివో కొంతవరకెఱుఁగుట కవకాశమేర్పడును మనకు లభ్యములై సుప్రసిద్ధములగు రామాయణద్విపదకృతులలో రంగనాథ రామాయణము, కట్టా వరదరాజు రామాయణము, భోసల ఏకోజీ రామాయణము ముఖ్యముగా పేర్కొనఁదగినవి. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు వారు రంగనాథ రామాయణమును పరిష్కరించి శుద్ధప్రతిని ప్రకటించి పాఠాంతరములను, ప్రక్షిప్తములైన వానిని గుర్తించి యనుబంధములలో ప్రకటించిరి.[1] అటు పిదప కట్టా వరదరాజ రామాయణము తంజావూరు సరస్వతీమహాలు లైబ్రరీ పక్షమున ప్రకటితమైనది.[2] దీనిని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు తంజావూరులోని 361 సం. గల ఏకైక ప్రతినిబట్టి పరిష్కరించి ప్రకటించినారు. ఇఁక మూఁడవది అముద్రితమై, తంజావూరు గ్రంథాలయమందే 352 సంఖ్యతో గల ఏకోజీ రామాయణము. కావున తాళ్లపాక వారివిగా ననుమానింపఁదగిన ద్విపద గ్రంథభాగములేవేని లభ్యములగుచో వానిని పై మూఁడు గ్రంథములతో జాగ్రత్తగా పరిశీలించిన యెడల అన్నమాచార్యుని రామాయణమును గూర్చిన వివరణము కొంత తెలియగలదు. కాని ఇందులో కూడ కొన్ని చిక్కులున్నవి. రంగనాథరామాయణము నందలి వనుకొను ద్విపదలు కొన్ని వరదరాజ రామాయణములోనివి కానవచ్చుచున్నవి.[3] ఇఁక తాళ్ళపాకవారి ద్విపద పంక్తులెన్ని పైని పేర్కొనబడిన రామాయణ గ్రంథములందు లీనమైపోయినవో! వరదరాజ రామాయణాదులకు ప్రత్యంతరములు కూడ లేమిచే నిది యొక చిక్కు సమస్యగనే మిగిలిపోవుచున్నది.

---

1. రంగనాథ రామాయణము – ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ముద్రణము. (1942) పరిష్కర్త – శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి.

2. వరదరాజ రామాయణము — తంజావూరు సరస్వతీ మహాలు. గ్రంథమాల సం. 12. ముద్రణము 1950.

పరిష్కర్త శ్రీ నిడదవోలు వేంకటరావుగారు.

3. చూ. వరదరాజ రామాయణ పీఠిక — ప్రథమ సంపుటము పుట - 36.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారు ప్రకటించిన రంగనాథ రామాయణమున కడపట రెండు అనుబంధముల నిచ్చినారు. అందు రెండవ యనుబంధమున రంగనాథుని రచనలో చేరిపోయి, పలుప్రతులలో గానరాని ఇతరేతర కవికృత గ్రంధరచనా భాగములు ప్రకటింపఁ బడినవి. ఆయా భాగములలో కొన్ని చరణములు 16వ శతాబ్దములో రచితమైన వరదరాజ రామాయణము నందలివని తత్పరిష్కర్తలు శ్రీనిడుదవోలు వేంకటరావుగారు తమ పీఠికలో వివరించిరి. అట్లే అన్నమాచార్యకృత రామాయణ ద్విపదలు కూడ కొన్ని కొన్ని యందుండి యుండనగునని వారభిప్రాయపడిరి. ఇందలి యథార్థము అన్నమాచార్యునిదిగా ననుమానింపఁదగిన గ్రంథభాగ మెచటనేని లభ్యమయినపుడు వ్యక్తము కాగలదు. కాని, యున్నంతలో ముద్రితమగు రంగనాథ రామాయణమున పరిశిష్టమున నీయఁబడిన ద్విపదలలో అష్టమహిషీకళ్యాణకర్తయగు తాళ్ళపాక చిన్నన్న చెప్పిన ద్విపద లక్షణము ననుసరించిన పంక్తులు కొన్ని యందుండకను పోలేదు. అందందు తాళ్ళపాకవారి పలుకుబడి తీరును లేకపోలేదు. మచ్చునకు రంగనాథ రామాయణము :— రెండవ యనుబంధమునందలి పుటలు 686 (22-20), 702 (181-13), 704 (151-9), 725 (288-3) 736 (810-2), 738 (312-19), 746 (815 - 23) 752 (354-18) 753 (369-16) పరిశీలింపదగినవి.

పైని పేర్కొనఁబడిన ద్విపదలలోని లక్షణము, భాష, వైష్ణవ భావన, అవతార ప్రశంస మున్నగు నంశములు గుర్తింపఁదగినవి. పై యుదాహరణముల లోని పలుకుబడి, రచనారీతి, భావసంపద అన్నమాచార్యుని రామాయణసంబంధికీర్తనములందు పుష్కలముగా కానన గును. (చూ. సంకీర్తనములు సంపుటములు 2, 8, 11) కవితా స్వరూపమునుబట్టి వీనిలోఁ గొన్నియేని తాళ్లపాకవారి ద్విపదపంక్తులు కాఁగూడుననవచ్చును.

శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు తమ వరదరాజ రామాయణ పీఠికలో 'తంజావూరి' పుస్తకశాలలో 385 సంఖ్యగల 'రామకథ'

యను ద్విపదభాగ మీయన్నమయ్యగారి ద్విపదరామాయణము లోనిది కాఁదగును (పుట 82) అని వ్రాసిరి. కాని యందు గ్రంథకర్త నామముఁ దెలిసికొనుట కాధారములు లేవు. ఎవరి కంకిత మీయఁబడినదోకూడ తెలియరాదు. 'రామకథ' లో ప్రపంచితమైనది రామాయణగాథ కాదు. రామాయణకథాప్రసక్తముగా రామ సుగ్రీవుల సంభాషణము నడుమసాగిన కపోతగాథయే ఇందలి ఇతి వృత్తము. విభీషణుఁడు శ్రీరాముని శరణుఁజొచ్చినప్పుడు సుగ్రీవుఁ డభ్యంతరముచెప్పు సందర్భమున నీ యితివృత్తము ప్రపంచితమైనది. ఈగాథయే 'కపోతవాక్య' మనుపేరున మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున నాలుగైదుప్రతులు, విభిన్న కర్తృకములు

---

1. సంస్కృతరామాయణమున నీ కపోతవృత్తాంతము స్మరింప బడిన దంతే.

> శ్రూయతే హి కపోతేన శత్రుశ్శరణ మాగతః
> అర్చితశ్చ యథాన్యాయం స్వైశ్చమాంసైర్నిమంత్రితః
> సంహితం ప్రతి జగ్రాహ భార్యా హర్తారమాగతమ్
> కపోతో వానరశ్రేష్ఠ కింపునర్మద్విధో జనః
>
> శ్రీరామాయణే - యుద్ధకాండే - అష్టాదశస్సర్గః 24, 25

ఇందుదాహృతమగు కపోతవృత్తాంతమే (మహాభారత - శాంతి పర్వాంతర్గతమగు కపోతోపాఖ్యానమే) ఈతెల్గు కృతియందు వివరింపఁబడినది.

కాని రంగనాథరామాయణమందీ వృత్తాంతము భిన్నముగానున్నది.

> "అర్కజ! ఇతఁడు మేలాట గీడాట - తర్కింప నేటికి ధర్మంబుత్రోవ
> శరణని వచ్చిన శత్రువు నైన - బరికింపగా రాచపాడి రక్షింప
> నొక కపోతము డేగ యుద్ధతి దరుమ - వికల భావంబున వేగంబవచ్చి
> శిబిమాటు సొచ్చెఁ జొచ్చిన డేగయడుగ-శిబి తనువిచ్చి చెచ్చెరగువ్వగాచె"
>
> (రం. రా. యుద్ధ. పు. 349.)

కానవగుచున్నవి.[1] కాని నేఁజూచినంతవరకు నీరచనయు నారచనలును వేరుగానున్నవి. దీనికర్త ఎవరోమరి! రచన చదివి చూడగా తాళ్ళపాకవారిది కాఁదగునేమో యనఁదగియే యున్నది. కాని వారి రామాయణమున నీ యితివృత్త మింత విస్తృతముగా నుండియుం డునా యని యొక సందేహము కల్గును. ఇది రామాయణమున వైష్ణవ పరమధర్మమగు శరణాగతిని వివరించు కథాసందర్భము కావున గోవిందరాజీయాది రామాయణ వ్యాఖ్య లీపట్టున విపులముగా విశదీ కరించినట్లే తాళ్లపాకవారును దీనినింతగా విస్తరించి వ్రాసియుండ రాదా యని సమాధానము చెప్పుకొని సందేహనివృత్తి చేసికొనవచ్చును [2]. పైగా నీగ్రంథారంభము, ముగింపు, 'కపోతవాక్య'

ఈ యుదాహరణము కన్నను శరణాగతిధర్మప్రతిపాదనమునకు పూర్వోదాహరణమే తగినది - మూలానుసారియు. వరదరాజు రామాయణమునం దీపట్టున సంగ్రహమగు కపోతోపాఖ్యానమే పది పండ్రెండు ద్విపదలలో వర్ణితమై యున్నది.

1. సంస్కృత రామాయణమున ప్రస్తావింపఁబడి, మహాభారతమున విస్తరింపఁబడిన కపోతోపాఖ్యానమే రామాయణ కథా సంబంధిగా "కపోత వాక్య" మను పేరున తెలుఁగు దేశమున ప్రచారము గాంచినది. మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తకభండాగారమున సం. 1035 నుండి 1039 వఱకును గల "కపోత వాక్యము" అను ద్విపదకృతులందలి ఇతివృత్తము కూడ నిదియే. ఏతత్కృతికర్త లెవరో ఓబళయ్య, వెంకటగిరి ప్రభృతులు. ఇందు 1038 సం॥ గల గ్రంథకర్త కందాళ వరదాచార్యుల శిష్యుఁడట. ఈకపోత వాక్యమే తంజావూరు సరస్వతీ మహలునందుకూడ సం. 294 నందున్నది. అదియు నిదియు నొక్కటే.

2. రామాయణసార మంతయు నీ విభీషణ శరణాగతి ఘట్టమందే కల దని విజ్ఞులందురు. అందుకే దీనిని శరణాగతికావ్య మనియు నందురు. తెలుఁగు దేశపు రామాయణములందు దేశీయాభిమానమును పురస్కరించుకొని మూలమున గానరాని కథా వర్ణనాంశము లెన్నో చేరి, గ్రంథము పెద్దదైనది. అట్లే రామాయణ కథాసారమును పిండి పోయు నీ కథయు వీరి రచన యందు చేరి గుణాధిక్యమునే కల్గించి యుండవచ్చును.

మను పేరునగల ఇతర గ్రంథములందువలె కృత్యాద్యంత మర్యాదలతో లేక ప్రధాన రామాయణ కథకు నదుకఁదగినట్లేయున్నది. కావున నీగ్రంథము వానివలె నొక స్వతంత్రప్రబంధముకాక రామాయణ కావ్యాంతర్భాగమే కాఁదగు ననుటలో దోషములేదు. ఇదమిత్థముగ నిది అన్నమయ్యగారి రామాయణ రచనాభాగమే యని నొక్కిచెప్పఁగల ప్రబలసాక్ష్య మిందు లేకున్నను, నేడు మనకు లభ్యమగుచున్న రామాయణ ద్విపదలం దీ ద్విపదలను జొప్పించుటకు వీలులేని విధమున వానివాని రచనా ప్రణాళిక లుండుటనుబట్టియు [1] అందీ ద్విపదలు లేకుండుటనుబట్టియు ఈ గ్రంథభాగము వేరొకరామాయణము నందలి దగుట నిక్కమనవచ్చును. అట్టిదేదియని ప్రశ్నించుకొనినపుడు అన్నమాచార్యుని రామాయణమే కాఁదగునని సమాధానము తోచును. ఇది యూహా మాత్రమే.

ఈ రామకథలోని ద్విపదపంక్తులే కొన్ని యిపుడు ముద్రితమగు కట్టా వరదరాజు రామాయణమున గొన్ని పాఠభేదములతో కాననగుచున్నవి. మచ్చునకు—

"రవి లేనిదినము సారథిలేనిరథము...లేని పరువు మాలిమిలేనియోడ
తమిలేనివలపు చిత్తములేని కొలువు

... ... ... ...

మితిలేని ప్రియము, గామిడి లేని యూరు - సతిలేని గృహము
నిస్సారంబు గాదె" (రామకథ)

చూడుఁడు - వరదరాజ రామాయణము. (పీఠిక — పుట62)

"రవిలేని దినము సారథిలేని రథము - కవిలేని కీర్తి, యంకము లేనిపోటు
వ్రతి లేని వాదు తీర్పరిలేని సేవ - ధృతిలేని తెగువ కూరిమిలేని చెలిమి
సతిలేని గృహము వాసనలేనిపూవు-శృతిలేని కొలువు,కోయిలలేనివనము."

---

1 కపోతోపాఖ్యానమును గూర్చిన వెనుకటి అథోజ్ఞాపికను చూచునది.

రామకథాగ్రంథకర్తృత్వ విషయ మెట్లున్నను ఇతరేతర కవికృతరచనాభాగములు కొన్ని వరదరాజ రామాయణమునందును ప్రవేశించినవనుట కిదియే తార్కాణము. ఈ రామకథ శ్రీనిడుదవోలు వారూహించినట్లు అన్నమాచార్య కృతమే యగుచో నిట్టివే మరికొన్ని తాళ్ళపాకవారి రామాయణ ద్విపదలు వరదరాజ రామాయణమునందు దాగియుండుననియు భావింపవచ్చును.[1] ఈ సమస్య లెల్ల తొలఁగుటకు అన్నమాచార్యుని రామాయణమేని లభింపవలెను లేదా వరదరాజ రామాయణమునకు ప్రత్యంతరములేని లభింపవలెను. అప్పుడుగాని యథార్థము వెల్లడికాదు.

అన్నమాచార్యుని రామాయణమునకు సంబంధించిన దగునో కాదో గాని చిన్నన్న వ్రాసిన అష్టమహిషీకల్యాణ ద్విపద కథామధ్యమున ప్రథమాశ్వాసాంతమున 'భాగవత రామాయణ' మను పేరుతో కొంత గ్రంథభాగమున్నది. రామాయణ సంబంధముగల తాళ్ళపాక వారి ద్విపద పంక్తులగుటచేత నించుక వివరించుచున్నాను. బలరామ కృష్ణులు గోగోపగణములతో సంచరించుచుండగా శ్రీరామనామధేయుండైన గోపాలకుండు ధేనుకాసుర సంహారణార్థమై వారిని సమీపమందలి తాళవనమునకుఁ గొంపోయిన సందర్భమున నీవృత్తాంతము గలదు. ధేనుకుఁడావనమున ఖరాకారుఁడై శూరులగు తన జ్ఞాతులతో వర్ధిల్లుచుండెనను పురాణకథ ననుసరించి ఖరనామసామ్యమున లంకేశ్వరు ననుజన్ములును, ధేనుకుని వధించిన బలరాముని

1. వరదరాజు అన్నమాచార్యునకు తరువాతి కాలమువాఁడు. ఇరువురును కడప మండలము వారే. శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులే. వైష్ణవాభిమానమున తన్మతప్రచారమునకై రామాయణ రచన గావించినవారే. వరదరాజు తన గ్రంథమున అన్నమాచార్యుని స్మరింపకున్నను, నాతఁడు అన్నమయ్యగారి రచనల నెరిగినవాఁడనియే తలఁపవచ్చును. కావున కొన్నిపోలికలుండవచ్చును. కాలక్రమమున అన్నమాచార్యుని రామాయణ ద్విపదలుమ వరదరాజ రామాయణమునందు ప్రవేశించి యుండవచ్చును.

పేరులోని రామనామసామ్యమున దశరథరాముఁడును స్ఫురించి చిన్నన్న ఈపట్టును భాగవతరామాయణమను పేరున చమత్కారముగ నిర్వహించియుండును. ఈకథతో రామాయణమునకు గల సమన్వయ మిందే తప్ప సంస్కృత భాగవతమందుగాని, పోతన భాగవతాంధ్రీ కరణమందుగాని కానరాకున్నను భారతాంతర్గత రామాయణముం డగా, భాగవతాంతర్గత రామాయణ స్ఫూర్తియేల యిందు రారా దని తలచియే చిన్నన్న దీని నిట్లు నిర్వహించెనో, లేక తాతగారి రామాయణ ద్విపదల ప్రభావమునకు లోఁగియే యిట్లు పరిష్కరించెనో తెలియదు. ఆ రామాయణ కథాసమన్వయ మీక్రింది విధమున కలదు.

## భాగవత రామాయణము

"ఈ లంకనుండునయ్యింద్రారి బంధుజాలంబు తనుగొల్వ జగదేకవీర
యా మహారిపుఁ జంపి యచట నుత్తాల భూమిజామృత ఫలంబుననీవ
కొనుచు...
నను రామానుజుం డా రామచంద్రుఁడనయంబు హర్షించి...
అరితమ్ము గనుగొని యభయమన్నంత నరిది నీలంకకు నధిపు జేసెదము.
అనుచు నగాళి బిట్టగలంగ ... ... ... ...

* * * *

రామసైన్యంచిట్లు రణకేళిసలుప...

* * * *

అతికాయ వజ్రదంష్ట్రానలరోమ శత మాయ ఘనబాహుశాలిభుజంగ
రోమ ధూమ్రాక్ష విరూపాక్ష ఖడ్గరోమ వృశ్చికరోమరుధిరాక్షమేఘ
నాదనరామరాంతక దేవజిన్మహోదరభయదవిద్యుజ్జిహ్వ శార్య
భీకరదైతేయ బృందంబు వెడలి—

* * * *

ప్రబల విభీషణ పట్టంబుగాగ నామోదమున దిక్కులందు దద్భూమి

భూమిజాధిక ఫల పుంజంబుతోడ నమజన్ముతోడ భృత్యాళి సేవింప
వనరాశి గడచి ... ... ...

* * * *

భటకోటితో జనార్భటికోటి తోడఁజటుతరనిజనివాసము బ్రవేశించె.

(చూ అష్టమహిషీ, పుటలు 54-58)[1]

ఈరీతి నీద్విపద (భాగవత) రామాయణపంక్తు లిందలి కథాసందర్భమున చమత్కారముగ పొసగింపఁబడినవి. ఇందు బలరాముఁడు రాముఁడు ఖరాకారుఁడు ఖరసోదరుఁడు. తాలవనము లంక. భూమిజ భూమి జామృత ఫలంబు. ఈసమన్వయము సరిగానేయున్నదికాని, యా విభీషణుఁడెవ్వరో ! భాగవత పురాణమున ధేనుకునితోపాటు అతని బందుగులు, సోదరులు ఖరదైత్య భటులు నందరును మడసినట్లున్నది. కథాసమన్వయమునకై చిన్నన్న యిందు విభీషణు నొకనిని చిత్రించెనేమో ! ఏమైనను ఇందీ రామాయణ కథాంశములతోఁ గూడిన ద్విపద పంక్తులుండుట గమనార్హము.

తెలుఁగున రామాయణకథాసాగరాభిముఖమై ప్రవహించిన ద్విపద వాహినులెల్ల నేకమై తుదకు వేరుసేయరాని విధమున కలిసిపోయినవి. ఈద్విపదరామాయణముల విషయ మింత కలగాపులగ మయిపోవుటయు దేశమున వానికిఁ గల్గిన ప్రాచుర్యమునే వెల్లడించుచున్నది. అన్నమాచార్య కృత రామాయణము నేఁడు సమగ్రముగ గుర్తింపరాకుండుట మన దురదృష్టమే. శతకోటి ప్రవిస్తరమై మహాపాతకనాశనమైన రఘునాధుని దివ్యచరితమును అన్నమయ్య సంపూర్ణ రామాయణముగానే విస్తృతముగానే విరచించియుండును.

---

1. తి.తి.దేవస్థానమువారు 1937లో ప్రకటించిన అష్టమహిషీ కళ్యాణ ద్విపదకావ్యమునం దచ్చుతప్పు లధికముగా నున్నవి. దానిని చక్కగా పరిష్కరించి మఱల ప్రకటింప వలసిన యవసర మెంతేని గలదు. పై ద్విపద పంక్తు లచ్చులో నున్నట్లే ఉదాహరించితిని.

ఇతఁడే పరబ్రహ్మ మిదియె "రామకథ"
శతకోటి విస్తరము సర్వపుణ్యఫలము.
ధరలో రాముండు పుట్టె – ధరణిజఁ బెండ్లాడె
అరణ్యవాసుల కెల్లా – అభయ మిచ్చె
సొరిది ముక్కుఁ జెవులు చుప్పనాతికి గోసె
ఖర దూషణులను ఖండించి వేసె.

కినిసి వాలిఁ జంపి – కిష్కింధ సుగ్రీవు కిచ్చె
వనధి బంధించి దాఁటె – వానరులతో
కనలి రావణ కుంభ – కర్ణాదులను జంపి
వనిత జేకొని మళ్ళి – వచ్చె నయోధ్యకు.

సౌమిత్రియు భరతుఁడు – శత్రుఘ్నుండు గొలువఁగ
భూమి యేలె కుశలవ – పుత్రులఁ గాంచె
శ్రీమంతుఁడై నిలచె – శ్రీవేంకటాద్రిమీఁద
కామించి విభీషణు లం – కకు బట్టము గట్టె.

(అన్నమా. అధ్యాత్మ. 11–224)

స్థూలముగా నిదియే వీరిరామాయణ రచనా ప్రణాళిక గావచ్చును. శరణాగతికావ్య మని ప్రసిద్ధిగాంచిన రామాయణము నందలి రహస్యములనెల్ల వీరిరచన నిక్షేపించుకొనియుండును. అయినను వీరియనువాద పద్ధతి పూర్వరామాయణానువాదములందువలెనే స్వతంత్రమై దేశీయతతో తొణికిసలాడుచుండుననియే తలఁతును. ఇట్లూహించుటకు లభ్యములగుచున్న అన్నమాచార్యుని రామాయణ సంకీర్తనములే ముఖ్యకారణములు.

వీరిరామాయణము నుద్ధరించుటకై ఆంధ్రదేశము ప్రయత్నించునుగాక !

## పెద తిరుమాలాచార్యుని కృతులు

*హరివంశము*: ద్విపద-కర్త అన్నమాచార్యుని పుత్రుఁడగు పెదతిరుమాలాచార్యుఁడు. చిన్నన్న తాను రచించిన అష్టమహిషీ

కళ్యాణమున నీతని రచనలను పేర్కొనుచు "వేదాంత విద్యాప్రవీణుఁడై యాంధ్ర వేదాంత మొనరించి ద్విపదరూపమున, హరివంశకావ్యామాయత రసస్ఫూర్తి హరివంశమిగురొత్త ననువొందఁ జేసి" (పుట 4) అని రసమయముగ హరివంశమును ద్విపదరూపమున రచించినట్లు తెలిపినాఁడు కాని మన దురదృష్టమున మహోత్కృష్టమగు నీ ద్విపద హరివంశము దుర్లభముగా నున్నది.

రామాయణ హరివంశములు రెండును వైష్ణవుల కుపాసనా గ్రంథములు. వైష్ణవధర్మమున కూటపట్టులు అట్టివానిలో రామాయణమును అన్నమాచార్యుఁ డనువదింపగా కుమారుఁడగు పెదతిరుమలాచార్యుఁడు హరివంశమును చేపట్టినాఁడు ఆ యిరువురు నా రెండు గ్రంథములను లోకమున బహుళ వ్యాప్తిగాంచవలెనను తలంపుతో దేశయతతో తొణికిసలాడు ద్విపదచ్ఛందమున నావిష్కరించినారు. వారి తలంపు పండెనోయేమోకాని నేఁడవి తెలుగుదేశమున జీర్ణములై పోయినవి. "భారతమునకు పరాంశమని యింపారగ బుధులుపలుకు" నీహరివంశము నింతకుపూర్వము కవిత్రయములోఁ గడపటివాఁడైన ఎఱ్ఱాప్రెగడ చంపూ ప్రబంధరీతి ననువదించినాఁడు. అతని యనువాదము యథామూలమయ్యు విస్తృతమైనది. మూలము ననుసరించుచునే యందలి భావసంపదను తెనుఁగున పెంపు చేసినాఁడు. ఆ తరువాత హరివంశానువాదములలో నాచనసోముని ఉత్తర హరివంశము ప్రముఖమైనది. ఈయన యనువాద పద్ధతి స్వతంత్రమైనది. మూలమును ప్రాతిపదికగా మాత్రమేగొని మార్పులు కూర్పులు గావించినాడు. హరివంశ కథా వివరణ క్రమమునందే గాక తత్కథా నిర్వహణమునందును నీకవి స్వతంత్రించినాఁడు. పై యిరువురి తరువాత హరివంశమును తద్గతకథాభాగములను తెలుగున వెలయించినవారిలో ప్రముఖులు తాళ్లపాకవారే. పెదతిరుమలాచార్యుని హరివంశ ద్విపదయు, చిన్నన్న కృతమగు అష్టమహిషీ కళ్యాణోషా పరిణయాదులును పేర్కొనదగినవి. నేఁడు పెదతిరుమలాచార్యుని ద్విపదానుసరణమగు హరివంశము దుర్లభముగా నున్నను చిన్నన్న వ్రాసిన కృతులు మాత్రము లభించుచున్నవి. చిన్నన్న

తన ఉషాపరిణయ కావ్యమును హరివంశ మార్గోక్తరీతి ననువదించినట్లు స్పష్టముగా పేర్కొనినాఁడు. అట్లు చెప్పియు సంస్కృత హరివంశమున కానరానివిధమున కథానిర్వహణమునఁ గొన్ని మార్పులు గావించినాఁడు. ఈ మార్పులు ఎఱ్ఱన రచనలో లేవు. నాచన సోముని హరివంశానువాదమున మాత్ర మీ మార్పులన్నియు నిల్చియున్నవి. వీరిరువురును ననువదించిన రీతినే కథాక్రమముగల సంస్కృత హరివంశప్రతి వేరేదేని కలదో లేక నాచనసోముని రచననునుసరించి చిన్నన్నయు వ్రాసినాఁడో తెలియరాదు. తాళ్లపాకవారి కవితలో సోముని రచనా ప్రభావ మధికముగా కాననగును. ఇదియు దానికొక యుదాహరణము కావచ్చును. ఏమైనను పై విషయములనుఁబట్టి తాళ్లపాకవారి హరివంశానువాద పద్ధతియు రామాయణానువాదము వలెనే స్వతంత్రమైనదిగా తలంపవచ్చును. బహుశః తాళ్లపాకవారి రామాయణ హరివంశ కావ్యకన్యక లిరువురును శ్రీ వేంకటేశ్వర స్వామివారినే వరించియుందురేమో!

*శ్రీ వేంకటేశ్వర ప్రభాత స్తవము:*[1] - పెదతిరుమలాచార్యుని ద్విపద కృతులలో పేర్కొనఁదగిన రెండవ కృతి ప్రభాతస్తవము. ఇది యొక లఘుకృతి. ఇందు మొత్తము 63 ద్విపదలు కాననగుచున్నవి. "శ్రీగురుం డర్థితో శేషాద్రియందు- యోగనిద్రాకేళినున్న యత్తరిని వనజాసనాదిదేవత లేగుదెంచి" వినుతించిన విధమున శ్రీకృష్ణచరితము బాల్యమాదిగ స్తుతిరూపమున వర్ణితమై శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సుప్రభాతపు మేలుకొలుపుగ సాగినదీరచన. ఇందు ప్రతి ద్విపదాంత

1. చూ. శ్రీ వేంకటేశ్వర వచనములు. తి. తి. దే. ముద్రణము. (1945. పు 81-86, "శ్రీ వెంకటేశ్వర వచనములు ముద్రణము సాగుచుండగా రాజకీయ ప్రాచ్య లిఖిత పుస్తకశాలలో నీ ప్రభాత స్తవమును గుర్తించి ఏకకవి కృతి యని ఇందు దీనిని కూడ ప్రకటించితిని." Ed. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి గారు. ఇందు 56 ద్విపదలు మాత్రమే గానవచ్చుచున్నవి.

మున "మేల్కొనుము" అను ప్రబోధవాక్యము చర్వణమగుచుండును.

వసుదేవదేవకీ వరగర్భజాత-కిసలయాధర రామకృష్ణ మేల్కొనుము
తపము పెంపున యశోదానందులకును - గృహతోడశిశువైన కృష్ణ
మేల్కొనుము
పూతనాకైతవ స్ఫురితదుర్వార - చైతన్యహరణ ప్రశస్త మేల్కొనుము

ఇత్యాదిగా శ్రీకృష్ణుని జీవితవిశేషములన్నియు భాగవతోక్తరీతిని వర్ణితములైనవి.[1] ఇట్లు మేల్కొలుపైన పిమ్మట "శ్రీ వేంకటాచల శిఖరమధ్యమున సౌవర్ణమణిమయ సౌధంబులోన ...జనులకెల్ల మహాప్రసాదంబు లొనరఁ గోరినవారికిఁ గోర్కులీడేర జగములనేలుచునుండు" స్వామి మేల్కని "వెలిదమ్మి కన్నుఁగొనల నమృతంబుగురియ కరుణాకటాక్ష వీక్షణము" నిగుడ్చుటయు లోక మానందభరిత మగుటయు వివరింపఁబడినది.

సుప్రభాతస్తవ రూపమునగల రచన లిట్టివి ద్రావిడ సంస్కృత భాషలం దంతకు పూర్వమే గొన్ని యున్నవి. తొండరడిప్పొడి యాళ్వారు విన్నవించిన "తిరుప్పళ్ళియళిచ్చి" ఇట్టిరచనమే. ఇవి పది పాశురములు.[2]

ఇట్టిదే ప్రతివాద భయంకర అణ్ణన్ అనువారు రచించినదిగా ప్రసిద్ధిగాంచిన 'శ్రీ వేంకటేశ సుప్రభాతమను సంస్కృత రచన. ఈ రెంటిని ఆధారముగాఁ జేసికొనియే పెదతిరుమలాచార్యుఁడీ ద్విపదను సంతరించినాడు. బహుశః నాడే సుప్రభాత ద్విపద శ్రీ వేంకటేశ్వర

1. ఈ యంశములే చిన్నన్న కృత అష్టమహిషీ కళ్యాణ ద్విపదలో విస్తృతముగా వర్ణితములైనవి.

2 "లాలిత వేదజాల ప్రసూనముల మాలికగాగ
శ్రీమాలిక యనెడు కృతియును బ్రాబోధకీ ఖ్యాతిఁదనరు
వృతియును నవరించి కృతకృత్యుఁ డగుచు"

అని విప్రనారాయణుని చరితమున చిన్నన్న పేర్కొనిన ప్రాబోధకీ స్తుతి యిదే. ఈ స్తుతి శ్రీరంగనాథుని గూర్చి చేసినది.

(చూ. వరమ. పుట. 287)

స్వామివారి గర్భమందిరమున నుషఃకాల సంధిసందర్భమున గానము చేయఁబడుచుండెడిదేమో! ఆ యాలయమున నిట్టి సంప్రదాయమును బోధించినవారు తాళ్లపాకవారుగానే తోఁచుచున్నారు. క్రీ॥ శ॥ 1400 కుఁ బూర్వ మాయాలయమున నరుణోదయ కాలమున జరుగు చుండిన పూజావిధానమెట్టిదో యేమో మనకేమియుఁ దెలియదు. క్రీ॥ శ॥ 1476 నకు తరువాతనే ఆళ్వారులద్రావిడప్రబంధము లిక్కడి యాలయాంతర్భాగమునగానముచేయఁబడుచుండినవి. అంతకు బూర్వమాసంప్రదాయమేని అచటలేదనియే భావింపవచ్చును.[1] కావున తొండరడిప్పొడియాళ్వారుల "తిరుప్పళ్ళియెళిచ్చి" పఠన మంతకు బూర్వ మచట నుండియుండదు కాని రంగనాధునిపేరనున్న పై ప్రాబోధకీ స్తవము ననుసరించియే సుప్రసిద్ధమగు సంస్కృత సుప్రభాత రచన శ్రీ వేంకటేశ్వరస్వామివారిపేర రచితమై యుండును. ఇది బహుశః పదునైదవ శతాబ్ది ప్రారంభమునుండి తిరుమల దేవాలయ మున గానము చేయఁబడుచున్నదేమో![2] ఈ రచనను తాళ్లపాకవారు అభిమానించియుందురు. దానిననుసరించియే కావచ్చును- అన్నమా చార్య పెదతిరుమలాచార్యాదులును సుప్రభాతపుసంకీర్తనము లనేక

---

1. ద్రావిడ వేద పారాయణమును 'సాత్తుముఱై' యందురు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి యాలయమున నీ 'సాత్తుముఱై'ని గూర్చిన శాసన ప్రశంస తొల్త మనకు 1476 A. D. లోనే కానఁగు చున్నది. అంతకు పూర్వమీ సంప్రదాయ మచట లేదనియే తలపవచ్చును. అప్పుడైనను ఆనాళాయిర ప్రబంధ పారాయణము ఉడయవరులసన్నిధినే గాని గర్భ మందిరమునమాత్రము లేదు.

చూ. History of Tirupathi page 826 by T. K. T. Veera Raghavachari, pub 1953.

2. సంస్కృత సుప్రభాత రచన ప్రతివాదిభయంకర అణ్ణన్ అను వారు వ్రాసిరని ప్రసిద్ధి. వీరు వేదాంతదేశికులవారి కాలమునకు తరు వాత సన్నిహిత కాలమున వర్తిల్లినవారు. అనగా 1350 – 1450 A D నడుమ నున్నవారు. వీరి రచనయు ఆకాలముననే ఎప్పుడో పఠింపఁబడి యుండునని తలఁపవచ్చును. కాని క్రీ॥ శ॥ 1484 నేనే తొల్దొల్త తిరుమల

ములు రచించి యాలయమున పాడి, పాడించినారు[1]. అట్లే ఆ తరువాత నీ సుప్రభాత స్తవ రచనయు సాగియుండును.

## చిన్నన్న కృతులు

అష్టమహిషీ *కళ్యాణము* :—ద్విపద. కర్త అన్నమాచార్యుని మనుమఁడును, పెదతిరుమలాచార్యుని పుత్రుఁడును నగు చినతిరువేంగళనాధుఁడు చిన్నన్న. అనునామాంతరముగలవాఁడు. ఈతనికృతులలో

---

దేవాలయమున అరుణోదయ సంధిని గూర్చిన శాసన సాక్ష్యము కాననగుచున్నది అటు తర్వాతి కాలముననే ఈ సుప్రభాతశ్లోక పఠనము ఆ సంధి సందర్భమున సాగెనేమో!

1. చూ. తాళ్ళపాకవారి సంకీర్తనములు. 2-224; 2-400, 2-403; 5-81; 7-202; 9-254; మొ॥

'మేలుకో శృంగారరాయమేటి మదనగోపాల మేలుకోవే నాపాల
ముంచిన నిధానమా॥
సందడిచే గోపికల జవ్వనములోన కందువందిరిగే మదగజమవు.
యిందుముఖి సత్యభామ హృదయపద్మములోని గంధము మరిగినట్టి
గండు తుమ్మెదా॥
గతి గూడి రుక్మిణి కౌగిటి పంజరములో రతిముద్దు గురిసేటిరాచిలుకా
సతులు పదారువేల జంటకన్నులగలువల కితవై పొడమిన నాయిందు
బింబమా॥

-అన్నమాచార్య సంకీర్తనము. (2-2 4)

ఈ రచనను బోలినదే ఈ ద్విపదసుప్రభాతస్తవమును పోల్చిచూడుఁడు.
'సదమలానంద నిశ్చయములకంద - విదురుని వింద గోవిందమేల్కనుము.
భోజకన్యాముఖాంభోజ ద్విరేఫరాజీవనయనాభిరామ మేల్కనుము.
వరరూపవతి జాంబవతి తోడిరతుల నిరతిమై నోలాడు నిపుణ!
మేల్కనుము.
మంజుల సత్యభామామనస్సంగరంజిత గాత్ర సంరంభ! మేల్కనుము.'
ఇత్యాది॥
(సుప్రభాత స్తవము పుట 88)

నిది తొల్లిటిదగునేమో ! అష్టమహిషీకళ్యాణ మైదాశ్వాసముల ప్రబంధము. ఇంచుమించు 3683 ద్విపదలు (7366 పంక్తులు) గల గ్రంథము. పేరునకిది అష్టమహిషీకళ్యాణమేగాని యిందలి వస్తువును బట్టి చూచినచో నిది 'కృష్ణచరిత' మనఁదగి యున్నది.[1] అందుకే గ్రంథాంతమున చిన్నన్న ఫలశ్రుతిలో

"ఈకృష్ణ చరితంబు నెవ్వరు విన్న
వ్రాసుచ్చి తలచిన వారి కెల్లపుడు
చిరతరాయువులు చింతితార్థములు"

చేకూరునని చెప్పుకొన్నాఁడు. ఇందు భాగవత పురాణోక్త రీతిని శ్రీకృష్ణుని దివ్యచరిత్రము ప్రపంచితమైనది. తొలినాలుగాశ్వాసము లలో దశమస్కంధము ననుసరించియే శ్రీకృష్ణుని జననము, బాల్య చేష్టాదికములు, దుష్టసంహారము, తదితర లీలావిలాసములు విపుల ముగా వర్ణితములైనవి. ఇక నాలుగవ యాశ్వాసాంతమందును మిగి లిన యాశ్వాసముననను శ్రీకృష్ణాష్టమహిషీ కళ్యాణకథలు శీఘ్రగతిని సాగిపోయినవి. అందను రుక్మిణీజాంబవతీసత్యభామల పెండ్లిండ్లు మాత్రమే యించుక విస్తృతములు. మిగిలినవి సూక్ష్మములు. ఈ అష్టమహిషీ కళ్యాణ ప్రబంధము శ్రీ వేంకటేశురాణియగు నలమే ల్మంగ కంకితమీయఁబడినది.

"అని సుధావాణికి నబ్జపాణికిని వనజాస్యమాతకు వనధిజాతకును
ననుగన్నతల్లి కనర్మ భల్లికిని-గనకగాత్రికిని బ్రకామధాత్రికిని
వాణీశనుతకును వర్తికతీవిచల-దేణికి శ్రీవేంకటేశురాణికిని
సారసగేహకుఁ జారుబాహకును-సారలావణ్యకు సకలగణ్యకును
బరమకళ్యాణికి భ్రమరవేణికిని-దరుణేందుఫాల కుదారశీలకును
రామాభిరామ కృపతిమధామకును-హైమసంవ్యానకు హంసయానకును

---

1 అల్లసాని పెద్దన వరూథినీప్రవరులకథను పెంచి పెద్దగా వ్రాసినను గ్రంథాంతమందలి విషయమును బట్టియే 'స్వారోచిత మనుచరిత్ర'మని తన ప్రబంధమునకు పేరిడెను. అట్లే చిన్నన్నయు కృష్ణచరితమునే విపులీకరించియు తనప్రబంధమునకు అష్టమహిషీ కళ్యాణమని పేరుపెట్టుకొనెను కాబోలును.

నిందిరాభావితకు గజేంద్రసేవితకు-జందిరికావాసకుఁ జారునాసకును
నగసుతానతకుఁ బన్నగతల్పయుతకు మృగమదాంబకకు నలమేలుమంగకును
నంకితంబుగను........................"

ఈ ప్రబంధము రచితమైనట్లు అందలి యాశ్వాసాంత ద్విపదలను బట్టి తెలియుచున్నది.

కృత్యాది :—ప్రబంధరీతి ననుసరించి యిందును గృత్యాది సంప్రదాయము పోషితమైనది. కావ్యారంభమందే చిన్నన్న శ్రీయల మేల్మంగనుదలచి యిష్టదేవతాస్తుత్యాదికము, ఆళ్వారాచార్యాదిపుణ్య పురుష సంస్మరణము, స్వీయవంశకథనము, ద్విపదకవితా లక్షణవివరణము, కుకవితానిరాసము, స్వీయకవితా ప్రశంసనము, షష్ఠ్యంతరచనముమున్నగు ప్రక్రియలనన్నిటిని కథారంభమునకుఁ బూర్వము నిర్వహించెను. ఇందలి కృత్యాదిరచనమునుబట్టి చూడగా చిన్నన్నకుఁగల భాగవతభగవద్భక్తియు కవితాశక్తియు విదితములగుచున్నవి. ఆళ్వారాచార్యాదులను స్మరించుచు తమవంశమువారి ప్రశస్తినిగూడ వర్ణించుటతో మనకీనాఁడు తాళ్లపాకవారిని గూర్చిన యనేక చారిత్రకాంశములు వెల్లడియగుచున్నవి. ఆ వంశవృత్తమును, అన్నమాచార్యాదుల ప్రతిభాశక్తులను, వారివారి రచనలనుగూర్చిన విశేషముల నెరుగుట కిందలి ద్విపదలెంతయో సహాకారకములైనవి. ఇట్లే ద్విపదకవితా మర్యాదలనెఱుగుటకును, తల్లక్షణము ననుసంధించుకొనుటకును, నిందలి లక్షణద్విపదలే మనకు శరణ్యములగుచున్నవి.ఇందే వివరించినట్లు 'కావ్యంబుఁజెప్పి యెనలేని శ్రీవేంకటేశు మెప్పించి సకలంబు నెఱుఁగ నసాధారణాంక మకరకుండలము లిమ్మహిఁగొన్నవాఁడు' చిన్నన్న. దినములోననె వేయిద్విపద లింపొంద వినుతవర్ణనలతో విరచించువాఁడు. కవిశిరఃకంపయోగ్యప్రతిద్విపద నవబిరుదాంకుఁడు. నాళీకసదనవాసినీ వేంకటేశ్వర పాదపద్మ వాసనాలోలుప స్వాంతషట్పదుఁడు. వినుతశీలుఁడు. ఈతఁడే శ్రీకృష్ణాష్టమహిషీవివాహకృతిని 'చమత్కృతి సంఘటింపఁ జతురవాచా ప్రౌఢిమెఱసి'విరచించినాఁడు. దీని నతఁడు 'నోరికొలదులు బలుకుమంకుబోతులరీతి' నుడువక

'అలఘు శబ్దార్థసారసరీతి రసప్రభావముగఁగులికి కస్తురిపిసెఁగోసినకరణిఁ దెలికప్పురపుఁ గ్రోవి దెఱచినసరణి, విరవాది పొట్లంబు విడిచినమాడ్కిఁ బరిమళించుచు గపుల్ బళిబళి' యనఁగ జెప్పినాఁడు.

*కృతివిషయము* :— మున్నే చెప్పిన ట్లిందలి కథా విషయము శ్రీ కృష్ణ చరిత్రము. మున్నిటిమొఱనూలిముదిత నిధులను సకలాంబునిధులను మోచియు బుధకంటకుల మోవజాలక వగచి ప్రార్థింపఁగా వనజాతలోచనుఁడు ఫణినేతతోఁగూడి వసుమతి వసుదేవ వసుధేశ్వరులకు బలకృష్ణులను పేర ప్రభవించి యవని కవని తనమెల్ల కాపునట్లు అనుగ్రహించెను. అట్లే దేవకీ వసుదేవులకు క్రమమున సప్తమాష్టమగర్భంబులందు బలరామకృష్ణు లుదయించి నందవ్రజమున బెరుగుచుందురు. అశరీరిపలుకుల కారాటపడి, మహామాయ మాటలకు మాత్సర్యమంది యాఁకాలకుల జంపుటకు కంసుఁ డసురులను బంపును. కాని వారెల్లరు మున్నీటఁబడిన వానచినుకుల వలె బలరామ కృష్ణుల బలమునన అణగిపోవుదురు. కృష్ణుఁడు తొలుత పూతనను హరించును. పిదప శకటాసుర తృణావర్త యమళార్జున వత్సాసుర బకాసుర ధేనుకాసుర ప్రలంబ శంఖచూడారిష్టకేశిచాణూరాదులను, తుదకు జరాసంధుని, వధించి లోకమునకు గళ్యాణము గూర్చును. ఆనడుమనే శ్రీ కృష్ణుఁడు కాళియుని మర్దించుట గొల్లలతోఁ జల్లులారగించి వినోదించును. గోవర్ధన ముద్ధరించును. గోపికలతో రాసక్రీడ లనుభవించును. ద్వారకలో సుఖముండును. రేవతీ బలరాములకు పరిణయమగును. శ్రీ కృష్ణునకు క్రమమున రుక్మిణీ జాంబవతీ లక్షణాద్యష్టమహిషులతో గళ్యాణమగును. ఇదియే స్థూలముగా భాగవత పురాణోక్తరీతి నిందుగల యితివృత్తము. కాని దీనిని ప్రపంచించుటలోనే చిన్నన్న ప్రతిభ గోచరించును.

శ్రీకృష్ణుఁడు శ్రావణమేచకాష్టమి విధితార నావిర్భవించెను. వసుదేవుఁ డా బాలుని నందవ్రజమున జేర్పగా నచట వారానంద తాండవమొనర్చిరి. ఆకోలాహలమును కవి కనుల గట్టునట్లు చిత్రించెను. దినముల బిడ్డడగు నా దేవకీ తనయునకు గోపికలు లాల

పోయి వైఖరి నతిదేశీయముగా వర్ణించెను. ముదుకవన్నియ మూరకుఱుచ చీరలు కుచ్చెళ్ళుపోసి కట్టిన గోపికలు పరికరములు గూర్చ 'గద్దెపీట నాసీనయై చరణాబ్జముల్ సాఁచి పొసరించిన కుచంబులు ముద్దుగునియ నరలూడ్చు ననటివోయన నొప్పు నూరులర గానువడఁజేల యమరంగఁ జెక్కి కావుకావుమటంచు ఖచరులు వేడఁ గావు కావనువానిఁ గరములఁబూని' యొకతె 'కేలనెత్తి నడ్నెత్తి' నివురంగ నూనెయంటి 'యింపుగా నివిరి పెసలు గుంకుమ నల్లిబిల్లిగా మెదిచిన పసిమిదేఱెడు సూనపసనలంగిడుచు-జలంబార్చి, తావినేరెడు పండు తలిరులఁబోదవుకై వడిఁ బయ్యెద కడలినీరొత్తి - మణి పేటి కప్రంబునించుకరణి నుంగా యనుచు నుగ్గిడుచు-తెలిదమ్మిలోపలతేఁటి చెన్నొదవ వలిపెపొత్తులలోన వసియింపఁజేసి జోలపాడెను-

పురుడులేనట్టి యా పురుషోత్తమునకుఁ బురుడులేఁడను రీతిఁ బురుడెల్ల 'గడచినది. పరివేషమధ్య విభాసితుండైన తరణియోయనఁ దొట్ల తనరారు నాబాలుఁడు జీవరత్నము చలించిన మాడ్కి తుంటి క్రేవలెత్తుచు లిరుగేలు సాచెనట. అల యిలాభామకు నభిముఖుండైన పగిది బోరగిలెనట. కంసునిజంపి యుగ్రసేను నిట్ల చేయుదమని రామ కృష్ణులు కూర్చుండిరట. నడచుధర్మము భూమి నాల్గుపాదముల నని దోఁగియాడిరట. ఇతరమార్గము లిట్టివని చూపుగతి తప్పటడుగులు వెట్టిరట-మీఁదట గంసుఁడున్నెదరు వీరనఁగ మీఁదిపండ్లు గోచరించిన వట. ఇట్లుగా వారి బాల్యమెల్ల భావికళ్యాణమునే ప్రదర్శించినట్లు కవి చమత్కరించెను. రవిబింబమధ్య నారాయణాకృతులు రామ కృష్ణులు పూతనాద్యసురవ్రక్రుతులను పొలియించుటను కూడ కవి చాల విశదముగ వర్ణించెను. పూతన 'నివురుగప్పిన యట్టి నిప్పు పోలిక బవడించి యున్న యబ్బాలు నెత్తుకొని, జోలసొంపుగ బాడి పాడి కొనవేళ్ల దాపలికుచము గీలించి ఘనమైన విషమొలుకఁగ వాతనిడిన-శౌరి 'తీయని నోట చేదు మేయంగబోలుచునే యని పాల బుగ్గలుబ్బించి కలగి తీపైన యక్కరటి ప్రాణములు జలధిగ్రోలెడు కలశజురీతిఁ గ్రోలెను. పూతన విగతచేతనయై రాతుసీరూపమున గూలి పడెను. అపుడు చుట్టునున్న వారాశ్చర్యమంది 'గోపుచ్ఛగోమూత్ర

గోరోచనముల తూపొడిచియు మీఁద తుడిచి బొట్టిడుచు కమలజహరముఖుల్ గఱిమ నీపాద కమల ముఖ్యాంగముల్ గాతురటంచు—దృష్టితీసి దీవించిరి. ఈ పట్టున గవి సహజదేశీయతను గాపాడెను. ఇట్లే జయకాముఁ డలుగులు జళిపించి చిమ్ము క్రియఁ గరచరణముల్ గింజియాడుచు శకటాసురుని గూల్చెను. తుహినాద్రికన్నుఁ గడు బరువై తృణావర్తుని తుదముట్టించెను. మరుజనకుఁడు, సూనాస్త్ర దీపిక లనుగోపికల నల్లరిబెట్టగా, యశోద వానిని పెనురోల నురిత్రాటగట్టగా కట్టుగంబముతోడ నరుగు కలభమోయన నులూఖల మీడ్చుకొనుచు వచ్చి మద్దులనుగూల్చి నలకూబర మణిగ్రీవులకు శాపవిముక్తి గల్పించెను. క్రేవురక్కసుని మన్మథ తరువుతో మడియంగవైచెను. బకాసురుఁడు బాలకృష్ణుని మ్రింగఁబోగా గళము నెన్నడుము వెగ్గలముగాఁ బెరిఁగి మ్రింగుడువడక క్రక్కించి యాబకంబు తాలువు లాపాదతలములుగాగఁ జీల్చియార్చెను. బకదైత్య ననుజన్ముఁ డొకఁడు వన్యాజగరేంద్రమై గోపబాలురను మ్రింగగా భక్తసంరక్షణ బద్ధ కంకణుఁడగు బాలకృష్ణుఁ డాదైత్యుని కంఠమున గాలమైసొచ్చి వ్రచ్చి వారిని రక్షించెను. బలరాముఁడు తాలవనమున ధేనువుని వధించి,భూమిజామృత ఫలంబునుగొనెను. ప్రలంబుని వధించి రాముఁడు లోకాభిరాముఁడాయెను. కుబేరునిదూత శంఖచూడుఁడు నందుని గొనిపోవ వాని ప్రాణముల విడిపించి శ్రీకృష్ణుఁడు జనకుని విడిపించెను.[1] అరిష్టుఁడు భీమవృషాకృతిఁ బెఱిఁగి గోపమండలంబెల్ల తల్లడిల్లఁ జేయఁగా వానిని పరిమార్చెను. హయాకారమున విక్రమించిన కేశిని సంహరించెను. తన యింట విలుపండు వని కంసుఁడు పంపిన యాహ్వానము నక్రూరుని మూలమునగొని రామకృష్ణులు మథురకేగి కువలయాపీడమును పరిమార్తురు. ముష్టియుద్ధమున చాణూరముష్టి

1. భాగవతమున శంఖచూడుఁ డను కుబేరభటుఁడు రామకృష్ణ రక్షితలగు గోపికలం దన యోగబలంబున నుత్తరమునకు గొంపోయిన నేరమునకై కృష్ణుఁడు వానిని జంపి యన్నకు వాని శిరోరత్న మిచ్చినట్లు కలదు.

కులను సంహారింతురు. తుదకు కంసునిపై విక్రమించి, చంపి యుగ్ర సేనునకుఁ బట్టముగట్టిరి. తల్లిదండ్రులను బంధ విముక్తులఁ గావించిరి. కంసుని వధించిన వార్త విని జరాసంధుఁడు మధురపై దండెత్తెను. శ్రీకృష్ణుడు సముద్ర మధ్యమున ద్వారకానగరమును నిర్మింపఁ జేసి కొనెను. అందు వారు సుఖముండిరి. పిదప దేవకీవసుదేవులు రామ కృష్ణులకు వివాహాయత్నములు సేయుచుండిరి.

బాల్యము మొదలుకొని యౌవనారంభమువఱకు నీ విధముగా గల బలరామకృష్ణుల వృత్తాంతమును చిన్నన్న విశదముగా వర్ణించెను. ఆ వర్ణనములందు కవికి గల లోకవృత్తపరిశీలనాజ్ఞానము అపారమని తెలియనగును. శ్రీకృష్ణుని బాల్యమున గజ్జెలు, కటిసూత్రములు, పూసలపేరులు, ఫణిభూషలు, పులిగోరులు, రావిరేకలు, మద్ది కాయలు ధరించి ముద్దుగులుకుచుండెనట అప్పలప్పలు రమ్మటన్న నా యప్ప గబ్బిగుబ్బెతలకౌగిళ్ల కఱికెడివాఁడట. ఈ వర్ణనలు సహజాతి సహజములై ఎఱ్ఱన హరివంశరచనను దలపించుచున్నవి. ఇల్లే పండ్లమ్ముకొనవచ్చు బోయతవర్ణనము (పుట-38) దేశీయము. వ్రేపల్లె లోని వాతావరణము నతిమనోజ్ఞముగ నీకవి చిత్రించెను. సాధన సామగ్రులు, నాటలు పాటలు మున్నగున వన్నియు వర్ణితములు. వారుకుండెనలు, కొమ్ముకుండెనలు, చిట్టులు, నుట్టులు, చిక్కములు, చల్దిజాడియలు. తరిత్రాళ్ళు, వల్లియత్రాళ్ళు, జల్లెడలు, ఉరిత్రాళ్ళు, పగ్గాలు, ఉగ్గము, లురులు, సెలకట్టియలు, బల్పుచేపుమందులు, తల కోలలు, విండ్లు, తరికటంబులు, పంపరకవ్వమువల్పు, డామెనలు, గం పలు, నొడిసెండ్లు, గండగొడ్డండ్లు. పాటిమాడలు, కూటికుండలు, చలపమంచములు, కంచములు, కుంచములు, ములువాడికత్తులు- మున్నగునవి వారి యాస్తిపాస్తులు. చల్లచల్లాయని చల్లలమ్మ వారచ్చుట గానవత్తురు. గొల్లలు సుద్దులాడుదురు. పదములు పాడు దురు. తోడిగొల్లలు వేఱ్పుకత చెప్ప విని శిరఃకంపంబుసేసి చెలఁగి వీనులఁ గేలుసేర్చి గొబ్బిళ్లు పలుదెరంగులఁగూడి పాడుదురు. మొన

వ్రేళ్ళు శ్రుతులుగమ్మ్రుచు వెన్నెలారయనుచు బాడుదురు. ఆగొల్లలు వేలపదము లీరీతిని బాడుదురు[1]

"దండవేమముగాదు దయ బొల్లి మేక కొండవేలువుగదే కోడెవో రాజ
గొల్లయై యలరించి కొండపై మేయు పాలమున్నీటిలోపల నీదులాడు
లావునఁ జోరఁబారి లంకదూఁకాడి దీవులనెల్లను దిరుగు నోరాజ!
కల్లల పడదోయు గబ్బినాకోడె కల్లరి మన్నీలఁ గడకాలనూఁకు
కలరాజు నెరనన్న కన్నులై రాగ నలసన్న రిపుల నెంతయు గెల్చెరాజు!
సింగల నాకోడె సిరులిచ్చు నమచు మిసుదులుపచరించి పెక్కులాగులను
గంచుకొమ్ముల తాళగతులకు నూఁదఁ జంచుల చెలరేఁగి చప్పట్లుచఱువ
కోదండలిడి వీరకోల..............................
నాదింపవై చె..................................(పు. 79-80)

ఈ ఘట్టము కాటమరాజాదుల కథలను గొల్లలు పల్లెలలో గానము చేయుటను కనులగట్టించుచున్నది. ఇట్లే పెరుగు నేలకి సొంటి బిల్లలల్లంబు మిరియంపురవల సమ్మేళమౌచలిది నచట గోపబాలురు వచ్చుళ్ళతోను, గొఱుకఁ జిల్లునవేయి గురియుచువేఁగి గరగరమనుచుండు కారవేల్లములతోను నారగించుటను వర్ణించిన వైఖరి సహజమై చవులూరించుచున్నది. ఈ పట్టులం దీ కవి పూర్వకవుల రచనలను బుక్కిట పట్టినాఁడు.

ఇక గోపికావస్త్రాపహరణ కథయందును గోవర్ధనోద్ధరణ కథా సంవిధానమందును, రాసక్రీడావర్ణన ఘట్టమందును కవి తనకుఁగల శాస్త్ర

---

1. కొమ్ముగొల్లలు గొల్లలలో నొక తెగవారు. వీరునేఁటికిని కాటమ రాజాదుల కథలను వీరావేశముతో నాడిపాడుచుందురు. పైన వర్ణితమగు నీ సుద్ది యాకథకుఁ జెందినదే. ఎరనన్న నలనన్న లా కథలోని పాత్రలు. బొల్లియావు యుద్ధ మా కథలో ప్రసిద్ధము. దేశీయము చారిత్రకమునగు నీ గాథను శ్రీనాథ కవిసార్వభౌముఁడు ద్విపద రూపమున వెలయించెనని వాడుక. కాని నేఁడా గ్రంథసంచయము గంగుల పిన్న ఎల్లయాదు లెవరో కర్తలుగా కానవచ్చుచున్నది. ఏది యేమైనప్పటికి నిట్టి కథలు సుద్దులు నేలలు దేశమున చిన్నన్న కాలమున కించుక పూర్వమే దేశమునఁ గలవనుట కీఘట్టము ప్రబల సాధకము.

సంప్రదాయముల పరిజ్ఞానమును చక్కఁగా వెల్లడించినాఁడు. గోపికల నోమున గోదాదేవి కథ స్మరణమునకు వచ్చును. ఈ కవికి నాట్యసంగీతములం దుగల పరిజ్ఞాన మిందు పలుతావుల ప్రస్ఫుటమగుచున్నది. శ్రీకృష్ణుని వేణునాద వినోదమును వర్ణించుతరి మంద్ర మధ్య తారములు, ఏక వింశతిశ్రుతులు, సప్తస్వరములు, గ్రామగా రోహణావరోహణములు,సమశుద్ధ సాళగ సంకీర్తనగతులు వివరించును. శ్రీకృష్ణుఁడు రాధతోఁగదిసి *జోడుగానమున* సొగసుగాఁ బాడినాఁడట![1] మంద్ర మధ్య స్వరమార్గముల్ చూపి వరుస లేర్పడ *నిజావళి, భజావళియు* నరసి *సాళగము* లాయము లేర్పరించి *మార్గదేశిక తాళమానము* లింత మార్గంబులై యొప్ప మధురతల్ గుప్పి వేళలు జాతులు వేర్వేఱ దెలిసి డాలుగా *గాణతోడరుమల్లుఁ* డిట్లు వేణునాదంబు గావించెనట! ఇట్లే 'నవరసపూర్ణతానముల గానముల నవిరళగతి నారదాదులు' పాడుటను, తంత్రిమీటి చొక్కముగ నాళతి యొనరించియవగడంబుగను బెళుకు తాళములతోఁ బెరయసొంపరయ *జలసోదరుని మీఁదిపదము జక్కిణియు* వన్నెగా వరుసగా పాడుటను కవి వర్ణించెను. సంగీతముతోఁబాటు కవి యిందు నాట్యమునుగూడ ప్రస్తుతించెను. కాళీయ మర్దన ఘట్టమున ఫణిరాజుపై గూర్మపతినిల్చెననగ ఫణిశాయిపదము తత్ఫణవీధి మెట్టి-ప్రకృతియే రాగతాళములు పలుక తాండవమాడెను. రాసక్రీడలందు 'చారుపాదములందు సంచారభేదములు' నటియించి 'సరసిజాతుఁడు విలాసమున రాసమున సరసనాట్యముఁజూపఁ జరగె వెండియును తులితాంగసంగ బంధురరాస బంధములఁ బ్రవర్తిలి తానముల నిల్పినిల్పి వరమణి భూషణావళి వలి ముఖము నెరసి రేపగలుగా నిర్మింప భౌమమండలంబును, దేవమండలంబులునుఁ' జూపుచు కరణముల ప్రదర్శించెనని కవి వర్ణించెను.

చాణూరముష్టికులతోఁ కృష్ణుఁడు కలియఁబడిన ఘట్టమున కవి ముష్టియుద్ధమునఁ దనకుఁగల పరిజ్ఞానమును చక్కఁగా ప్రవ్యక్తపరచెను.

---

1. సంవాదపదములలో నాయికానాయకులు పాడు శృంగార ప్రధానమగు గీత వైఖరియె పైన వర్ణిత మగు 'జోడు గానము' - నేఁటి Duet.

వారిరుపురును చిత్రగతుల తలపడిరట. అప్పుడు శౌరి యడ్డము దూరి *శౌలమునకువచ్చి యుల్లాంగమునఁ* బట్టి యూరుల నొక్కెను. అరరంబుపట్టి లోఁగించి కనలుచుఁబొడిచి వేగంబ డొక్కరముఁగొనుచు మల్లుని పీడించెను. ఈ మల్లయుద్ధ విన్నాణములను నాచన సోమన పోతన మున్నగువారివలెనే చిన్నన్నయు నిందు వివరించెను.

శ్రీకృష్ణుఁడు జరాసంధునితోఁబోరు సందర్భమున 'ఖోవని నాల్గుదిక్కులఁజుట్టి పెటులు క్రోవులు, జబురుజంగులు, ఫిరంగులును, బుసకోవులును, గసాబులు, తుపాకులును' ప్రయోగించినట్లు చిన్నన్న వర్ణించుట సమకాలపు యుద్ధప్రయోగములను చిత్రించుటకే.

ఇట్లు శ్రీకృష్ణ చరిత్రమునఁ బూర్వభాగమున సమకాలిక వాతావరణము నెడనెడ చిత్రించుచు శాస్త్రసంప్రదాయముల పరిజ్ఞానమును వెల్లడించుచు చిన్నన్న విపులముగనే ద్విపదరచనఁ గావించెను. ఉత్తరభాగమున అష్టమహిషీ వివాహ విషయమునుగూడ నిట్లే సమకాలిక సాంఘికాచారములను సంప్రదాయములను జిత్రించుచు లలిత శృంగారరీతిని రచన గావించెను.

చతుర్థాశ్వాస ప్రారంభమందే రేవతీ బలరాముల వివాహమును కవి యొక్కపుటలో నిర్వహించెను. పిదప రుక్మిణీ జాంబవతీ సాత్రాజితుల వివాహములమాత్ర మించుక విపులముగ రచించి మిగిలిన యైదుగురి వివాహములను సంగ్రహముగాస్రి కృష్ణాష్టమహిషీ కళ్యాణ ఘట్టమును గ్రంథాంతమున నొక్క యాశ్వాసములోనే సంపూర్తి గావించెను.

*రుక్మిణీ కళ్యాణము* :— విదర్భ దేశావనీవిభుఁ డగు భీష్మకుని బిడ్డ రుక్మిణి 'ఒకనాటఁబెరుగుట యొకపూటఁబెరిఁగి' యౌవనవతియై 'కంజబాణుమోహనపుష్పశాఖలాకయో హేమశలాకయో' యనఁగ నొప్పినది. 'కనుకలికన్న నంగనలకు ప్రేమ వినుకలినేహెచ్చు' గాన రుక్మిణి శ్రీకృష్ణుని వరించి యయోగ శృంగారమనుభవించును. భీష్మకుఁడును 'వనజోదరునకె వనజాస్య తగు'నని తలచును. కాని రుక్మివ్యతి

రేకించును. రుక్మిణికి 'హరిమీఁదసనురక్తి యన్నపై గినుక' కలిగినది- 'శౌరినొల్లనివారు జగతిఁగల్గినను నారినేనొల్ల మావారైననేమి' యని భక్తి శృంగారములమేళవించి 'దిక్కెవ్వరునులేరు దేవరేకాని' యనుకొని నిజపురోహితునిచే రాయబారమంపును. 'వేయుబాగుల నాదు విధమెల్లఁ దెలిపి తోయజాక్షుని వేగతోడితెమ్మనుచు'. పలుమారులుగ చెప్పిపంపును. పురోహితుఁడు శ్రీకృష్ణుని దర్శించి రాయభార విషయమును వివరించి 'కామధేనువు పాలు ఘనుఁడైన సోమయాజికిఁగాక శునకార్హముగా'దనియు రుక్మిణికి శ్రీకృష్ణుడే తగినవరుఁడనియు తెలుపును. శ్రీకృష్ణుడు మహారాజశివియొలుక పయనమైవచ్చును. రుక్మి కృష్ణునితో పోరాడి యోడును. రుక్మిణిని దలఁచి యతఁడు రుక్మిని ప్రాణములతో విడచును. కాని తన ప్రతాపము నాల్గుదెసలకును వెలయంగ జూపిన విధము దీపింపఁగా నిడువాలు పదనుతూపునను గొలిచిన రీతిని డొంగులుబువాఅ గొఱిగి పాలుమాలిచి లజ్జబండని జేసి గేలిఁబెట్టుచు రుక్మిని తొలగద్రోయును రుక్మిణీ కృష్ణులకు ఆగమోక్తముగ వివాహము జరుగును. బాసికాలు కట్టుట, మధువర్కములిచ్చుట, పేరటాండ్లు ధవళంబులుపాడుట, గడియారముచూచి జేగంటనాదింపగా పగుడజీరకములుంచుట, మంగళసూత్రముగట్టుట, తలంబ్రాలుపోయుట మున్నగు నాచారములతో తెలుఁగునాట పెండ్లి వర్ణితమైనది. ఈ ఘట్టమున చిన్నన్న చతురవాక్యప్రౌఢిమతో లలిత శృంగార రీతిని కవితారచనము గావించెను. రుక్మిణీవర్ణనమున ద్విపదలలో పలుతెఱంగుల సోయగములు ప్రదర్శించెను. ద్వారకానగరమున శ్రీకృష్ణుని కొల్వుకూటంబును-అందాతని యునికిని నాఁటి విజయనగర ప్రభువుల దర్పము కనులగట్టునట్లు చిత్రించెను. శ్రీకృష్ణుఁడు వివాహామునకు తరలివచ్చుటను వర్ణించిన వైఖరి నాఁటి విజయనగర ప్రభువులు (సామంతులు) దండువెడలెడిరీతినే తలపించును. యుద్ధమును వర్ణించుపట్టున చిన్నన్న వీరావేశముదాల్చెను ఈ ఘట్టమును కవి రుక్మిణీకళ్యాణముతో మాత్రమే ముగింపక ఆమెగర్భమునుదాల్చి కుమారునిగాంచు వఱకును నిర్వహించినాఁడు—

*2, 3. జాంబవతీ-సాత్రాజితుల పరిణయములు* :— ఈ కథా విషయమును కవి కొంత శీఘ్రగతినే వివరించెను. సత్రాజిత్తు సూర్యుని మెప్పించి శ్యమంతకమణిని గొనును. శ్రీకృష్ణుఁడు దానిని యాదవపతి కిమ్మనగా 'నగములకేగి వానలఁదొప్పఁదోఁగి చిగురులనమలి మించిన యెండఁ గమలి భానుచేగొని యటు పటురత్న మొరులకీను బంగరుకుప్పలీను నాయిఁట'నని సత్రాజిత్తు పలుకును. ఒకనాఁడాతని తమ్ముఁడు ప్రసేనుఁ డామణినిదాల్చి వేటకు వెళ్ళును. అపరంజి పట్టెడల్నిగుడసాగి గుజ్జునునాగ జాగిలంబులును కక్కెరలఁ గొక్కెరల జరగనీయక పట్టుజాలు డేగలు, తోఁచిగాడులు, మువ్వల సాళ్వములు, బండిపులులు, సెలకట్టియలు, చిక్కలవలలు, విండ్లు జాబిల్లి యమ్ములును, కత్తులు, ఈత్తులు, మున్నగు ననేక సాధనములతో బయలుదేరెను. కుక్కలను, డేగలను బఱచి నేర్పుతో బహుకాలము వేటాడెను. ఒక దుప్పిని తరుముకొని పోయెను. మార్గమున సింహమొకటి వీనిని చంపి మణిని గ్రహించెను. దానిని చంపి జాంబవంతుఁడు మణిని గైకొని తనపట్టి తొట్టిమీఁదట గట్టెను. సూర్యాస్తమయమైనది. రాత్రియైనది. ప్రసేనుఁడు తిరిగిరాలేదు. కృష్ణుఁడు తనపై నిందలేకుండుటకై వాని నన్వేషింపజనును. ఋక్షపతికిని కంసధ్వంసికిని పోరాటమగును. జాంబవంతుఁడు కృష్ణునెఱిగి క్షమాభిక్షవేడి యాతనికా రత్నముతోఁబాటు తన కన్యకారత్నమునుకూడ నొసగును. శ్రీకృష్ణుఁ డాశ్యమంతక రత్నమును సత్రాజిత్తున కొసగును. అతఁ డనవసరముగ కృష్ణుని నిందించినందులకు పశ్చాత్తాపపడి వనజాప్త మణితోఁబాటు తన కుమారితయగు సత్యభామామణిని సమర్పించును. ఈ వధూమాణిక్యమే చాలు ననుచు చతురవాచామృతాసారంబుచేత నాతని శోకాగ్నిమాన్పి సత్యనంగీకరించును. జాంబవతీ సాత్రాజితులకు వివాహము కృష్ణునితో నేకముహూర్తమున అగమోక్తముగ వైభవముగ జరుగును. బాసికములు, సూసకములు ననుర్తురు. ముత్తయిదువలు శోభనములు పాడుదురు. పురోహితుఁడు మంగళాష్టకములు చదువును. జాంబవతీ సాత్రాజితులు నాల్గుచేతుల తలంబ్రాలు పోయుదురు. బ్రాహ్మణులు, బ్రాహ్మణ ముత్తయిదు

నలు పరస్పరము పిలచుకొని వివాహమున కాయత్తమగుదురు. ఫాలముల్ పచ్చగాఁ బసపులు పూసి దళముగా నవతైలధారతో మెదిచి వెలయఁ జెంద్రపు బొట్లువింతగాఁ బెట్టి పచ్చనతుత్రము లాపై నిడి గచ్చు విచ్చుటాకులు వెడవెడ జుట్టితాల్చి కాటుక కన్నులఁగలయంగ నలిది, కురులు కూడ గట్టుకొని కొప్పులువెట్టి చాయగలచీర వెల్లి ముడుకుల నొరయంగ ముఱియుచుఁగట్టి— కన్నబిడ్డలను ఱంకలఁ బెట్టి, కుసిగుంపు నడకల కోడె బాపెతలు అసమానగతి నచటికి విచ్చేసిరి. ఆ పెండ్లిలో నీ బావన బాపెతల కోలాహలము, విందుల సందడి చాలమనోజ్ఞముగా వర్ణితమైనది. ఆ పైన పెండ్లి కొమరుఁడు బాలేందు సమఫాల బాలలతోడ సమరభూపాల వాహనంబు నెక్కి యూరేగింపున బోవును. పిదప వనకేళి, జలకేళి, చతుర వాక్య ప్రౌఢిమతో లలితశృంగార రీతిని వర్ణితమైనది. ఆమీఁద విందు. రాజాన్నములు, నేతులు, కొత్తిమిరి మిరియముల మెఱయుచు రుచులచే మించు చేరులును, పరమాన్నములు, రసావళ్ళు, నంబళ్ళు, నోటి నిడినంతతోన కరగునోయననొప్పు కజ్జాయములును, మీగడ పెరుగులు, ఉప్పురవ గూడి సొంటి లవయుక్తమైన చల్లని మజ్జిగ, ఎడనీరు, కుడి నీరు, మున్నుగా గలుగు సంభారములతో పెండ్లి విందు జరుగును. పిదప సార కర్పూర పూర చారు వీటికలెల్ల జనులకు నొసఁగి సౌఖ్య కేళి వికచాబ్జముఖులతో శ్రీకృష్ణుఁడు విహరించును. ఈ ఘట్టమున పెండ్లి కన్న పెండ్లికి వచ్చువారి తారతమ్యములు, వారి యలంకారములు, కోలాహలము— వాని వలన పెండ్లి వేడుకలకు గలుగు నిండుదనము చక్కగా వర్ణితములైనవి.

ఈ ఘట్టము ముగిసిన తర్వాతనయిన కాళింది, మిత్రవిందా, సత్యాకీర్తి, భద్రా, లక్షణల పరిణయ వృత్తాంతము లతిసంగ్రహముగా ప్రశంసింపఁబడినవి. అన్నిటను తెలుఁగునాటి పెండ్లి మర్యాదయే. పెండ్లి కుమార్తెల వర్ణనములందు కవి యనేకవిధములగు చమత్కారమును, చాతుర్యమును ప్రదర్శించెను. ఈ పెండ్లిలో మిత్రవిందది స్వయంవరము. సత్యాకీర్తిని కృష్ణుఁడు ఏడు మల్లరపు గోడియల నొక్కత్రాట గట్టి తన పరాక్రమమును ప్రదర్శించి పరిణయమాడును.

భద్ర కృష్ణునకు మేనత్త కూతురే. లక్షణను మీనయంత్రము భేదించి కై పట్టును. ఈ వివాహముల వర్ణనములందును కవి శోభనములు మంగళములు పాడు నాడువారి పెండ్లి సరదాలన్నియు పేర్కొనఁ బడినవి.

'మంగళం బరవిందమందిరాపతికి మంగళం బహివైరి మహిత కేతునకు
మంగళం బమృతాబ్ధిమధ్యగేహునకు మంగళం బసురు మధుసూదనునకు'
(పు. 278)

ఇత్యాదిగా వారు మంగళములు పాడిరట !

ఇట్లుగా నీ యష్టమహిషీ వివాహము విషయము నొక్క యాశ్వాసమున చిన్నన్న నిర్వహించెను

'మదవతీ కుల శిరోమణి రుక్మిణికిని వరనెందు సౌభాగ్యవతి జాంబవతిని
నమిత గుణస్థేమ యగు సత్యభామఁ గమల శోభనగాత్రి కమలాప్తపుత్రిఁ
నమితశోభనవింద యగు మిత్రవింద నమరజాలముత్మ యైనట్టి సత్యఁ
బ్రకట లావణ్య సంపద్భద్ర భద్ర సకల కళ్యాణ లక్షణను లక్షణను
గనుఁగొని యంతరంగమునఁ బ్రేమంబు ననలొత్త - నిందిరావిభుఁడు-
వారితో వేడ్క గైవార నందంద వారిత పంచాస్త్ర వరకేళిఁ దేలి
వారిజాసన దేవవరముఖుల్గొలువ నిచ్చకళ్యాణము ల్నెరయఁగ నింటఁ
బచ్చతోరణములు భాసిల్లుచుండ నారూఢిగానులోకారాధ్యుఁడగుచు
ద్వారకానగరి నెంతయు వేడ్కనుండె"
(పు. 282)

ఇదియే శ్రీకృష్ణచరితము.

వస్తు స్వీకరణమునుబట్టియే చిన్నన్నకు వైష్ణవమునందలి భక్తి ప్రపత్తులెట్టివో తెలియనగును. ఆయన గొప్ప భక్తుడు. పరమభక్తుల వంశమున జన్మించినాఁడు. సొగసైన వైష్ణవ కావ్యములఁ జెప్పి యెన లేని శ్రీవేంకటేశుమెప్పించి లోకమెఱుగునట్లు ఆ స్వామివలన మకర కుండలముల నసాధారణముగఁ గొన్నవాఁడు. అందుకే, ఆయన రచనలో నడుగడుగున వైష్ణవభక్తియే తాండవించుచుండును. తుదకు

వర్ణనములందునైతమాతనికి వైష్ణవభావనయే శరణ్యమగును. కృత్యాది యందు పెదతిరుమలయ్య సంతానమైదుగురిని 'పంచకల్పతరువులు నొప్పు'నట్లు వర్ణించెను. వనమున నాభీరనాయకులు విడిసినపట్టున 'వని యనునిండుజవ్వని దాల్చు నామమన బండ్లు లర్ధచంద్రాకృతి' నున్న వనును. శ్రీకృష్ణుడు రుక్మిణిని గొంపోయిన తెఱఁగును 'గరుడఁడు సుధాకలశముఁగొన్న కరణి రాజులు చూడఁగా ప్రతాపించి'నట్లుగా చమత్కరించును. ఇఁక లక్షణావర్ణనమున నామెయలంకారములఁ బ్రశంసించుచు 'హరికథామృతము కర్ణాంతరాళములఁ బరిపూర్ణమగుచు పైపైనుబ్బెననఁగ-పండుముత్యముల బవెరలువెలసె'నను. చిన్నన్నకు సర్వమును విష్ణుమయముగనే గోచరించును. ప్రకృతియందే స్వామి తత్త్వము గోచరించు నాతనికి స్వామిదర్శన వర్ణనములందొక పారవశ్యము కలుగును. పాలసంద్రమున బవ్వళించినస్వామిని "పటికపుఁ బెట్టెలోపలినీలమనగ - బటుఫణాదరసీమభాసిల్లువాని, పరనికషాంతరోజ్జ్వలహేమరేఖ - సరవినిందిరయురః స్థలినొప్పువాని, దెలినీటి పుట్టువు తేటయైకరుణ — లొలుకుచుండెడు నేత్రయుగళంబువాని - కమలాప్త విధుమధ్య గగనమోయనఁగ - గమనీయదరచక్ర ఘనమూర్తివాని - పటిజోటికిఁ బుట్టినింటైనరాతిఁ బోటిఁజేసిన పదములనొప్పువాని-శ్రుతి లక్ష్మియూగు భాసురపుటుయ్యాల-గతిగుండలములచే గరమొప్పువాని-గందువాసిన చంద్రకళలననొప్పు-నిందిరసవతులయెదనొప్పువాని—నహిరాజగరుడ సేనాధిపముఖ్య-బహునిత్యము క్తులఁబాలించువాని"(పు.12) దర్శించి యానందించును 'పాలితాంబుజభవరభవుఁడైన శౌరిబాలుఁడై యొక్కగోపాలుఁడై యుండె-నాతని సౌలభ్యమేమని చెప్పవచ్చు!'నని ముగ్ధుఁడై పోవును.'ముకురకపోలముల దువాడించు మకరకుండలములు-అలకల జుట్టిన నొయారపుఁ బింఛము, కొదమనవ్వులవెల్గు నిడువాలు గన్నులు-కెమ్మోవిచెంగట పిల్లనగ్రోవి, నెఱిగప్పుగలకొప్పు, వరహారముల సోయగముగల గళంబు, వంకనెలవంకనామము, బంగారువన్నెల దట్టి' చూడమనోహరమగుకమలాక్షుని సౌందర్యమునకా గోపికలవలె నే తానును మైమఱచును. ఒక్కొక్కతూరి యాస్వామిని కథాకథనమందు స్వాభావికత నాపాదించుటకై లౌకికరీతిని స్థూల వివరములతో వర్ణించును. ఆ పట్టుల సమకాలపు రాచఠీకము, ఠీవి యావర్ణనము

లందు పోహాళింపఁబడినట్లు గోచరించును.(చూ. పు. 156). "కప్రంపు బాగాలు కొమ్మలందియ్యగా-చెంగావిపావడపట్టిన యడపకత్తె వెంట నుండఁగా, వైరిరాజుల జెక్కియున్నకాళాంజియొక పద్మగంధికావింపగా, కలికిముద్దియ లిరుగడల సేవింపఁగా చతురసీమంతినీ సంగీతపరస చతుర వాణులలోన సమకొన్నవాఁడగు సిరికూర్మిమగఁడు" జగన్మోహనాకారుఁడై యుండెఁట! ఈ పైవర్ణనములందు వర్ణితుఁడు సాక్షాత్ కృష్ణపరమాత్ముఁడై నప్పటికి నందు మనకు నాటి విజయగనర ప్రభువగు రాయలో వారి సామంతులో గోచరింతురు. ఇట్లు కృష్ణుని వర్ణనములం దెడనెడ మనకిందు రాయలే దర్శనమిచ్చునట్లుండును. రుక్మిణీ పరిణయ కథా సందర్భమున శ్రీకృష్ణుఁడు పెండ్లికొడుకై, రాక్షసమున నైన రుక్మిణినిచేబట్ట సన్నద్ధుఁడై తరలి వెళ్ళుచుండెను-ఆ ఘట్టమెల్ల విజయనగర ప్రభువులు విజయముచేసినవైఖరినే వెల్లడించును. డాకాల గండపెండారము, చంద్రికదట్టి, గీరునామము, నవరత్నమయ కంకణములు, డాకాలసరిపెణులు, నీలభూధరముపై నిర్ఝరుల్ పొలుచుపోలికమై హారములు, మకరకుండలములు, బాహుపురులు, ముద్దుటుంగరము, వలిపెపేరణి, మావుకుళ్ళాయి,—తాల్చి నిద్దంపుటద్దమున దనయలంకారమీక్షించుకొని, రింగులువారమడిచి బంగారువలువ వలెవాటువైచి, పాదుకలుమెట్టి యుద్ధవుని కైదండగాబట్టి, సకలయాదవులు కొలువగా పుడమిసురులు గోవిందాష్టకములు చదువఁగా, ఆతపత్ర ద్వంద్వమెసఁగఁగా, చామరములవారు వీవనలిచ్చుచుండ, ఎచ్చరికలవారెచ్చరికలు పలుచుకుండ, వందిమాగధులు కైవారమొనరింప. వేత్రహస్తులు కడలనేశేర, బిరుదము లుగ్గడింప శంఖములు మ్రోగుచుండ, మునుకొని యూడిగములవారు నడువ, కనకతప్పెటలు, కాళెలు, పటహాభేరీతూర్య వణవాది వాద్యములు చెలగుచుండ—వైష్ణవాంకములతో చిహ్నితమగు భీకరస్యందనమెక్కి :—

బారై యలో తమ్మ బందనుకృష్ణ
కారొయాహరిగె సాధన మాడబేకు—

అనికర్ణాటక వీరభటులును,

అయిత్త మాఘ వందలి మున్ని బన్ని
అయఃధం గొండునియంగెవా!

యనుచు ద్రవిడ సద్భటులును,

ఆహో ఆడె ఆగె హరిజగన్నాధ
దాసు హెబలుఖండదారురే యటంచు.'

కాళింగవీరులును, నింకను వివిధదేశాధి విభులు వెంటనేతేర వాహినీపతివలె వాహినీసమితి కదలగా శ్రీకృష్ణుఁడేగెనట! ఇందు స్పష్టముగ కవి విజయనగర ప్రభువుల వీరదర్పములనే వెల్లడించెనన వచ్చును. ఇట్లు చిన్నన్న తన కావ్యమున వైష్ణవమునకు లౌకికతను జోడించి వర్ణనములందు భక్తితోబాటు సహజతనుగూడ పోషించి నాఁడు. చిన్నన్నకు విజయనగర ప్రభువులతోడిపరిచయ మెంతయో గలదు. ఆ పరిచయమును, పలుకుబడిని కవియిట్లు స్మరించెననవచ్చును.

*అష్టాదశ వర్ణనలు* :— వర్ణనములం దీకవి ప్రబంధరీతి ననుస రించెను. ప్రాబంధిక వర్ణనములని చెప్పఁబడు పదునెనిమిది వర్ణనలలో దాదాపు అన్నింటిని చిన్నన్న గావించెననవచ్చును. నగరవర్ణనమున ద్వారకానగర వర్ణనము మనోజ్ఞము.

"సారకస్తూరికా సహిత నీహార - నీర కర్పూర వర్ణిత కాంతిజాల
హీర కల్పిత గృహానేకాంశ విజిత - తారక వేష్టతోదార సముద్ర
హారక కమలాకరాంచిత హంస - కీరకదంబ సంకీర్ణ సౌధాగ్ర
చారక గగనాధ్వ చారకవ్యూహా - దారక నమ్మహాద్వారకఁగాంచి."
(వు. 188)

ఈ వర్ణనము సమాసాఢ్యము.

ఈ నగరమే నిర్మాణసందర్భమున మఱియొక తెఱగున వర్ణిత మైనది. విశ్వకర్మ ఘటదీపమును బోలి కడలిలో మునిఁగి వటుశాంతి నలరు నప్పట్టణంబరసి జలధి పండ్రెండు యోజనముల మేర తొలగించి నగరమును నిర్మింపఁజేసెను. సముద్రమే- పరిఘ. కుందనపుకోటలు,

గోపురంబులు, నట్టిళ్ళు, సౌధములు, భువనేశ్వరములైన భవనేశ్వరములు, సాంద్రచందన పారిజాత నీహారచంద్రచంద్రోజ్జ్వల చంద్రశాలలును, మణికుట్టిమములు మున్నగువానితో ననేకవిధములుగా నా పట్టణము శోభిల్లుచుండెను. అందు 'బ్రహ్మ నైశానక యపారంబులైన బ్రహ్మవిద్యలుగల్గు బ్రాహ్మణోత్తములు, వరసవాసపుని మైత్రవణమ్ము తెలంచు స్ఫురిత ప్రతాపాంకభుజులు భూభుజులు; ధనదుని ధనమెల్ల దమవట్టి పైడికెనరాదటని హసియించు నూరుజులు, ఫాలాక్షుబ్రదుకును బ్రదుకే యటంచుఁ జాలనవ్వెడి హరిచరణ సంభవులు'[1] నుండిరి. పుష్పలావికలుండిరి. ఆ నగరంబు వైకుంఠనగరంబుభాతి మిగుల నొప్పుచుండెను. 'వారక యిహావరద్వారక యగుట ద్వారకయనువేరు తగుదీని కనుచు' హరి దానిని నివాసయోగ్యము గావించుకొనెను.

ఇట్లే జాంబవతీ సాత్రాజితుల పరిణయానంతరము చిన్నన్న వనకేళిని జలకేళిని చమత్కారముగ వర్ణించెను. ప్రసేనుడు వేటకు వెళ్లిన ఘట్టమున మృగయావర్ణనము సహజాతిసహజముగ వర్ణితమైనది. జరాసంధునితోఁ బోరుసందర్భమున సమకాలిక యుద్ధవర్ణనము విపులముగనే కావింపఁబడినది. ఇట్లే దేవకీగర్భవర్ణనము, అష్టమహిషీ కళ్యాణవర్ణనము, రుక్మిణీ విరహ పుత్రోత్పత్తి వర్ణనము, ఉద్ధవరాయబారవర్ణనము, శ్రీకృష్ణరచిత వివాహప్రయాణ వర్ణనము, గోపికా విరహవర్ణనము మున్నుగాగల్గు ప్రాబంధిక వర్ణనములన్నియు నిందు చక్కగా పొందువరుపఁబడినవి.

*అనుకరణములు* :—భాగవత దశమస్కంధగాథయే ఈ కావ్యమందలి ఇతివృత్తమగుటచేత నిందు చిన్నన్న పోతన్నను బహువిధముల ననుకరించెను. ఇట్లే నన్నిచోడ, తిక్కన, పాల్కురికి సోమన, నాచనసోమన, పెద్దన, తిమ్మన, సూరనాది పూర్వకవుల పలుకుబడులను, రచనా సంప్రదాయమును పలువిధముల నీ కవి

---

1. ఈ నగర వర్ణనము అల్లసాని పెద్దన మనుచరిత్రమునందలి 'అచటి విప్రులు మెచ్చ రఖిల విద్యాప్రౌఢి ముదిమది తప్పిన మొదటి వేల్పు' అను పద్యమును దలపించుచున్నది—

పుణికిపుచ్చుకొనెను. పోతన్న రచన యితనికి మార్గదర్శకము. బాలకృష్ణుఁడు మన్నుదిన్న ఘట్టమున నాతనివదన మీక్షించి యశోద 'విష్ణుమాయయొ యిది కనుమాయయో' యనుకొనును. గోపికా వస్త్రాపహారణఘట్టమున 'స్మరగేహ పల్లవాంచత్తోరణముల కరణి సిగ్గులపట్ల కరము లింపొంద' నుంచుకొందురు. రుక్మిణీ విరహావర్ణనమున 'ముకురంబు చూడవే ముకురబింబాస్య పికముఁల బిలువవే పిక వాణి నీవు' అని తోడిచెలు లర్థింతురు. మగువల నలపించు మగువయగు రుక్మిణికి 'గగనమో భృంగసంఘమొ కలాపంబో మొగమొ యీాలలితాంగి మురువై నతురుము, హరిమధ్యమో, సందియమొ బట్టబయలో పరమాణువో దీని పసనిగ్గునడుము.' అనఁదగి యవయవములున్నవి. ఈ తావుల పలుకుబడియు, భావసంపదయు, రచనారీతియు పోతన రచనను తలపించుచున్నవి.

ఇట్లే దినముల బాలుఁడగు కృష్ణుడికి తలయంటి యుగ్గుపట్టు వర్ణనమున పాల్కురికి సోమనాథుని బెజ్జమహాదేవికథా రచన స్మరణమునకు వచ్చును. శ్రీకృష్ణుని మహిమలను వర్ణించుతరి బసవపురాణ రచనారీతి గోచరించును.

శ్రీకృష్ణుని బాల్యక్రీడలను వర్ణించు సందర్భమున నెట్టిన రచన తలపునకు వచ్చును.

ద్వారకానగర వర్ణనమున పెద్దన మనుచరిత్రమునందలి యరుణాస్పదపుర వర్ణనము స్ఫురించును.

ఇట్లే పలుకుబడిలోను రచనారీతిలోను ఇంక పలువురుకవుల రచనల నీకవి సంగ్రహించెను. 'ఏయు వాఁడుండ నమ్మెమిగావించు' (పు.117) ననుటలో నన్నిచోడ తిక్కనలను, 'అచ్చదామరల మేలంతయు నూర్చి పుచ్చుకొన్నట్టి, యొప్పుల వదంబులును' (పు. 165) అని స్త్రీ సౌందర్యమును వర్ణించుటలో తిక్కనయు, 'తమ్ములై మెఱుగు ముత్యమ్ములై శోభితమ్ములై బెళికెడు తళుకు గన్నులును' (పు. 223) అనువర్ణనమున భట్టుమూర్తియు, 'తరుణి పుల్లడిగిన దర్పకాస్త్రంబు:'కలువలో మగమీలొకావు నేత్రంబు లలవాడు వేడగంబులు

లేవు గాన'; (పు.260) ఇత్యాది వర్ణనములందు తిమ్మనయు మనస్మృతి పథంబున మెలగుదురు. చిన్నన్న రచన పలువురు పూర్వకవుల పలుకు బడితోడను, భావసంపదతోడను, పరిపక్వ మందినట్టిది. ఈతని గ్రంథ మొక ద్విపదప్రబంధము. అందుకే ప్రబంధరీతిని చిత్రకవిత్వమునుకూడ నిందు పొందుపరచెను-

'కమలేశ నరహరి ఖగరాజగమన.........
కరుణాకటాక్ష శ్రీకలితోరువక్ష. (పు. 223)

అని వర్ణించుటలో నీకవి గోమూత్రికా బంధమును చిత్రించెను.

'వరకుశాలనవనవనలశాకురవ కరకసారస కనక సరసా కరక
కలదరవీరక కరవీరదలక కలద సివాసిక కసివాసిదలక' (పు. 248)

అనుటలో పాదభ్రమక రచన గావించెను-

*ద్విపదలలోని వైవిధ్యము*:—ఇఁక ద్విపదరచనా విధానమున చిన్నన్న చూపిన సోయగములకు కొదువయే లేదు. విసుగుగొల్పని విధమున తీరుతీరుల నడిపించునేర్పు చిన్నన్నకుఁ దెలిసిన ట్లితరులకుఁ దెలియదను టతిశయోక్తి కానేరదు. అందుకే కావచ్చును. "చిన్నన్న ద్విపదకెరగు" నన్న నుడియుఁ బుట్టినది.

'సుదతీ కదంబ యశోద యశోద' (పు-16)

"చూరాడఁ గంటి గంటి నటన్నఁ గదిసి యూమచ్చకంటికేమ్మోవిపై
గంటుగావించె. (పు.81)

"నను చు కందముల కందముల కుందములు ఘనలవంగములఁలుంగములఁ
దుంగముల (43)

"వారితో నొనగూడి వారిలోఁజొచ్చి వారికేశి యొనర్చి వారని వేడ్క.
(పు 111)

'కొమ్ము గంధము పూసి. కొమ్ము నీవంది కొమ్ము పూవులు జాతికొమ్ము
నామమ్ము (పు. 114)

'రదనముల్ వదనముల్ రాలగొట్టుచును బదములు మసములు వాయ
మోముచును
గాత్రముల్ నేత్రముల్ గత్తిరింపుచును ఛత్రముల్ ల్పాత్రముల్ జక్కు-
సేయుచును" (పు. 275)

ఇత్యాదిగా ననేక విధములగు గతులతో యమక గమకములతో లలితశృంగారరీతిని చిన్నన్న తనవాచాప్రౌఢి నిందు వెలార్చినాఁడు. సామెతలను తీయని తెలుఁగు పలుకుబడులను గుప్పించినాఁడు. ప్రత్యేకముగ ద్విపదలలో స్త్రీ వర్ణనమునెంత వైవిధ్యముతోఁ గావించినాఁడో చెప్పఁదరముకాదు. ఆస్త్రీ వర్ణనమున వ్రాసిన తీరున మఱల వ్రాయక బహుగతుల వింతసోయగములు చూపినాఁడు. అందును సంప్రదాయము ననుసరించి మనుష్య వర్ణనమున కేశములనుండి పాదముల వఱకును, దేవతావర్ణనమున పాదములనుండి కేశముల వరకును ఆరోహావరోహ క్రమములనుసరించి వర్ణించెను. ఈరీతినిసాగు విభిన్నములగు ద్విపద గతులె అతని కవితకు వైవిధ్యమును చేకూర్చినవి. మచ్చునకొకటి రెండుదాహరణములఁ దిలకింపుఁడు :

స్త్రీ వర్ణనము :—

1. "కలకంఠి ముకురాస్య కంజాయతాక్షి - నలికుంతాలక బిసహస్త లతాంగి
హరిమధ్య గిరికుచ హరిచక్రజఘన - సరసరంభోరు కాంచనతూణజంఘఁ
గిసలయపదవల్లకీవాణి దంత - హసిత కోమల కుంద యగు మిత్రవింద॥
(249)

అని యిట్లొక్కొక్క తూరి సర్వసాధారణముగా విశేషణములతోఁ గూర్చుకొనుచు ద్విపద రచన సాగించును.

2. "ఈరాజబింబమ్ము నీఁదెన్నుటెట్లు - శ్రీరామరామ యచ్చెల్వమోమునకు
సరసిజ పత్రముల్ సరిపోల్చుటెట్లు - హరి హరి జగతిలో నతివ కన్నులకు
భూధరంబుల వెస బురుణించుటెట్లు - మాధవమాధవ మగువ గుబ్బలకు
వంకజనేత్ర యప్పడతి లావణ్య-మింకొక్క తెఱగున నెటిఁగింతువినుము."
(పు. 186)

ఇది రుక్మిణీ వర్ణనము.

ఈ వర్ణనవిధానమునఁ దృప్తిగానక కవియే వేరువిధమున వర్ణించుననుట గమనార్హము-

3. గగనమో భృంగ సంఘమొ కలాపంబో - మొగమొ యీ లలితాంగి మురువైన తురుము.
అనటులో యుగములో హస్తి హస్తములో ఘన శరభములో ఈ కాంత యూరువులు
తలిరులో తమ్ములో................ (పు. 204)

ఇదియు రుక్మిణీ సౌందర్య వర్ణనమే. ఇందు వర్ణనము అవరోహణ క్రమమున నుండుట చూడనగును. చూ. పు. 204. రుక్మిణీ సౌందర్య వర్ణన మిదియు నవరోహక్రమముననే కలదు. చూ.పు.223. జాంబవతీ వర్ణనము కూడ నవరోహక్రమముననే కలదు. చూ.పు. 225. సత్యభామా వర్ణనమున అవరోహక్రమమే పాటింపఁబడినది. కాని యిందే పాదమున కాపాద మొక్కొక్క యవయవమునకు విడివిడిగా నున్నది. ఇట్లె చూ. పుట. 232-

సత్యాభామా వర్ణనము: స్త్రీ వర్ణనమున నీకవి యనుసరించిన పెక్కు గతులలో నిది యొక గతి. ఇందు అవరోహక్రమము పూర్వమువలెనే పాటింపఁబడినను రెండేసి రెండేసి ద్విపదల కొక్కొక్క భావము పూర్తియగునట్లు శిల్పమర్యాదను ప్రదర్శించినాఁడు. ఇట్టిదే మఱియొక రీతి. చూ. పు. 251-

మిత్రవిందావర్ణనము : ఇందు వర్ణితవిషయ మేపాదమున కాపాదము విడివడి యున్నది. ఇట్లే సత్యకీర్తి, భద్రాదేవి, లక్షణాదేవి, మున్నగువారి వర్ణనములందును గవి చెప్పినరీతిని జెప్పకుండ చిత్రగతులను ప్రదర్శించెను.

స్త్రీల సౌందర్య మెన్ని తెఱఁగులో అన్ని తెఱఁగుల వర్ణించినాఁడు స్త్రీలను చిన్నన్న. వారి యందచందము లిట్టివని చెప్పఁదరము గాదు. కావుననే తుదకు

4. "ఇప్పడంతుల కొప్పు లిందనీలముల - కుప్పలో యొప్పుల
కుప్పలో యనుచుఁ
గొమ్మల నేత్రముల్ కోమల జలచ - రమ్ములో వరచకోరమ్ములో
యనుచుఁ
బ్రవిమలాంగుల యధరము లంబరాగ - లవములో కాల పల్లవములో
యనుచుఁ
బోలతుల మాట లబ్బురమైన చిలుక - పలుకులో కప్రంపుఁబలుకులో
యనుచు
నంబుజాననల సొంపారు గళములు - కంబులో తజ్జనకంబులోయనుచుఁ
గువలయాక్షుల చన్ను గుబ్బలు గిరులో - కవలో క్రొమ్మెఱుఁగు
జక్కవలోయటంచు
ఉరుపయోధరలూరు లున్నతకుంభికరములో మోహనాకరములో
యనుచు
నమ్మానినుల మించులైనపాదములు - తమ్ములో కూర్మ మొత్తమ్ములో
యనుచు"

అనేకవిధములఁగొనియాడఁదగునని చిన్నన్న విశదీకరించెను. ఈ గ్రంథమునందలి యీ స్త్రీవర్ణనములన్నియు మానవీవర్ణనములుగానే యున్నవి. కాని యవియెల్ల నాలంకారికములై విచిత్రగతుల నడచినవి. ద్విపద రచన కెంతయో వైవిధ్యమును జేకూర్చినవి.

**ఉషాకళ్యాణము** :— ద్విపద— కర్త అష్టమహిషీకళ్యాణకర్త యగు చిన్నన్నయే. ఈతని కృతులలో నిది రెండవ దనవచ్చును. ఈ యుషాకళ్యాణము 'ఉషాపరిణయ' మనియు నామాంతరముతో, రెండు భాగములలో, దాదాపు 990 ద్విపదలలో నున్న చిన్న ద్విపద ప్రబంధము. అలమేలుమంగాంబ కంకితము. కృత్యాదియందే కవి జగన్మాతయగు నలమేల్మంగను స్మరించును. పిదప 'నాత్మీయ గురుని సంయమినాథుఁబొగడి', శారదను గీర్తించి, గౌరిఁబూజించి, శంకరుని భజించి, 'శ్రీ వధూవర లబ్ధ సిద్ధవాక్ ప్రౌఢిమావిర్భవన్మతి స్వాంతుఁ'డగుచు 'అతులిత హేమాంగ నలమేలుమంగ నింపుసొంపార నధీశ్వరిఁజేసి' 'జలజకంధరకు సజ్జనధురంధరకు పొలుపొంద నంకితంబుగ'

'హరివంశ మార్గోక్తమగు నుషాకన్యా కరమొప్పఁబరిణయక్రమ' మును వర్ణించినట్లు చిన్నన్న చెప్పుకొనినాఁడు. ఇందలి కథావిషయము బాణుని పుత్రియగు నుషాకన్యను శ్రీకృష్ణపౌత్రుఁడగు ననిరుద్ధుఁడు వివాహమాడుట. ఈ కథా విషయము నీకవి చాల శీఘ్రగతిని రసవంతముగ నౌచితీసమంచితముఁగ సిద్ధవాక్ ప్రౌఢిమతో వర్ణించెను.

ఇతివృత్తము :— ద్వారకా నగరమున శ్రీకృష్ణుఁడుండఁగా బలితనూభవుఁడైన బాణాసురుఁడు శోణితపురమేలుచుండెను. అతఁడొకనాఁడు తన వాకిటకాపున్న పరమశివుని జూచి 'దురముగావలయును ధూర్జటి!' యనును. అప్పుడాతఁడు' నీనీల కంఠకేతనము తనుదానదెగి వసుంధరగూలునాఁడు నిను గెల్చు నను గెల్చు నిఖిలంబు గెల్చు ఘనుతోడ గయ్యంబు గలుగుపొ'మ్మనెను. పట్టరానియానందమున బాణుఁడుండఁగా నాతని హితమంత్రియైన కుంభాండుఁడు విస్మయ చిత్తుఁడై దానికి కారణమడిగి తెలిసికొని "ఏమివేఁడితి" వని చప్పరించి "మీ తండ్రిఁ బదమునమెట్టి పాతాళపాతిగా జేసిన పద్మేశ్వరుండె యెదిరిన నీవు నయ్యోణాంకధరుఁడు కదనంబులో నిల్వ గలరె?"యని మాటపరుస కనుచుండగనే ఘనతరమగు నీలకంఠధ్వజము నేలగూలినది. అపశకునము లెదురైనవి. కుంభాండుఁ డరుదంది యింటి కేగెను. దానవేశ్వరుఁడు మానినీయుక్తుఁడై మధుపానాసక్తిమై మఱచి యుండెను.

బాణు పుత్రిక యుషాబాలిక వన జల కేళీవిహారములు సల్పుచుండిన గౌరీశంకరులఁ జూచి పార్వతి సౌభాగ్యమునకుఁ బ్రియపడుచు మాటలాడెను. అంత నాబాణాత్మజ భావంబు తెలిసి పరమేశ్వరి 'అలకంతునకు నెక్కుడగు చక్కదనముగలవాఁడు సఖి! నీకు గాంతుఁడై నీదుతలపు నీడేర్చు' నని యాశీర్వదించును. అది యెప్పుడనఁగా 'సితపక్షగమున భాసిల్లు వైశాఖ సితపక్షమున ద్వాదశీదినాంతమ్ము నిద్రపోయెడు వేళ నీకలలోన రతికేళి నినుగూడి రమియించువాఁడు' పతియగునని వివరించును.

ఒక దినమా బాల సౌధాంతమున వీణావాదనమునసలసి నిదురించువేళ 'కలలోన మన్మథాకారుఁ డొక్కరుఁడు కలసినాఁడు'. కుంభాండుతనయ చిత్రలేఖ 'అజుఁడైననేమి కాయజుఁడైననేమి త్రిజగములెవ్వదకి సాధింతునొండేని'యని యామెనూరార్చి, నేర్పున తన చిత్రరచనాపాటవమును ప్రదర్శించి సకలదేవగంధర్వమనుష్యాదివర్గములకుఁ జెందిన యువసుందరులను జిత్రించి యాయువకుఁడెవరో చూచి చెప్పఁగోరును. ఉషాబాలక్రమమున యాదవులలో కృష్ణపౌత్రుఁడును, ప్రద్యుమ్నతనయుఁడును నగు అనిరుద్ధునిఁజూఁచి "ముచ్చ మన్మథుఁడు మునిముచ్చువీఁ'డనుచు పారవశ్యమునొంది పలికెను. సాహసియగు చిత్రలేఖ నారదుని సహాయమున తాపసవిద్యవలన శంబరాహితుపుత్రుని నిదురించుచుండిన వానినట్లే అతిరహస్యమున దెచ్చి యుషాకన్య యంతఃపురమున నుంచి వెడలిపోవును. ఉష యానందపారవశ్యమున నాతని నాలింగనము చేయ నాతఁడులికి మేల్కాంచి 'కలగన్న చందమో కాకనిజంబో' యెఱుగఁజాలక యుండి యానందించును. ఉష విషయము నెరిగించును. అంతలోనావృత్తాంతమెరిగిన బాణాసురుఁ డాగ్రహించి సైన్యములనంపును. 'గురుగహ్వరీధరగుహానుండి వెడలి కరుల ఢీకొను హరికరణి గర్జించి' యనిరుద్ధుఁ డాసైన్యమును చెండాడును. వారోడఁగా బాణుఁడే సమరమునకు సన్నద్ధుఁడగును. సర్పబాణమున ననిరుద్ధుని బంధించి ఖండింపఁబోఁగా కుంభాండుఁడు 'విచారించి ఘనుఁడైన మన్నింపు కాకయుండినను దనుజేశ నీదు చిత్తము వచ్చినట్లు కావింతుగాని' యని తత్కాలమునకు వారించును. బాణుఁడు మండిపడి 'అనిరుద్ధుతోఁగూడ నయ్యుషాకన్యను' చెర వేయించెను.

అట ద్వారకయందనిరుద్ధుని గానక యన్వేషింతురు. పలువురు పలు తెఱగుల చెప్పుదురు. శ్రీకృష్ణుఁ డా వాక్యసరణివిని పిన్న నవ్వుతో 'వనితలు చాపల్యవర్తన ల్వారి నిలువెల్ల గపటంబు నిజమింత లేదు, పలుకులు మృదువులు, భావముల్కిలలు-ఇట్టి భామలలోన నెట్టి రట్టడియో' తన పౌత్రుని దక్కించుకొని యుండునని సరిగానూహించి చెప్పును. సర్వలోకములు గాలింతురు. కానరాఁడు. నారదునివలన

నసలు విషయము తెలియును. బలిపుత్రుఁడగు బాణుపై దండువెడ లుటకు వాహినీతతులను గూర్చుకొని శ్రీకృష్ణుఁడు సిద్ధుఁడగును. ఖగనాథుఁడు కదలును. శివసైన్యము బాణాసురుసైన్యము వీరి నెదుర్కొనును. బలరామ ప్రద్యుమ్నాదులు శత్రుసైన్యముల సంహ రింతురు. శంకర శ్రీకృష్ణ ప్రేషిత శివజ్వర విష్ణుజ్వరములు విజృంభించి వీరతాండవము లొనర్చును. ప్రద్యుమ్నుఁడును సుబ్రహ్మణ్యుఁడును తలపడుదురు. ఇరువైపుల భయంకరయుద్ధము సాగును. బాణుఁడు బ్రహ్మశిరోనామకాస్త్రమును ప్రయోగింపఁగా శ్రీకృష్ణుని సుదర్శన చక్రము వానిని ఖండించును. శంకరుఁడు కింకరుఁడగును. బాణుఁడు దీనుఁడగును. శ్రీకృష్ణుఁడు వానిని మన్నించును. అనిరుద్ధుఁడు విడు దల యగును. బాణుపినగర మలంకరింతురు. ఉషానిరుద్ధులకు సకల శోభనముల కళ్యాణమగును. ఇదియే ఉషాపరిణయగాథ :—

ఆకరము-మార్పులు-కూర్పులు :— ఈ గాథను చిన్నన్న హరి వంశమార్గోక్తమగు రీతిని రచించినట్లు గ్రంథాదిని పేర్కొనెను. మూల కథ సంస్కృత హరివంశమున విష్ణుపర్వమున పదునైదు అధ్యాయము లలో దాదాపు 1357 శ్లోకములలో విపులాతివిపులముగ నున్నది. కాని చిన్నన్న రచన హరివంశ మూలకథ యందలి రచనా ప్రణాళికను గాని, వైపుల్యమునుగాని యనుసరించినట్లు కానరాదు. ఇందు వర్ణ నములన్నియు స్వతంత్రములు. సంస్కృత హరివంశ కథను స్థూలముగ నాధారము చేసికొని దీనినిట్లు చిన్నన్న మలచుకొన్నట్లే తోచునుగాని 'హరివంశ మార్గోక్తమగు రీతిని' చెప్పెననుటకు మాత్రము నేఁడు మన కుపలభ్యమగు సంస్కృతహరివంశమునం దవకాశ మత్యల్పముగనున్నది.[1]

1. హరివంశోక్తమగు నీ యుషాపరిణయ కథను తెనిగించిన పలు వురు కవులలో నెఱ్ఱాప్రగ్గడయు, నాచనసోమనయు ముఖ్యులు. ఎఱ్ఱన యనువాదము సంస్కృత మూలమునకు సుందరము, విపులము, వ్యాఖ్యా రూపమునగునట్టిది. కాని నాచన సోమనాథుని తెనిగింపు దానికి భిన్న ముగ స్వతంత్రము, సంగ్రహము, సరసమునై యున్నది. వీనిలో సోముని రచన ననుసరించియే చిన్నన్న రచనయు సాగినది. ఈ యిరువురు కవు

కాని చిన్నన్న రచనకు మూలములనఁదగిన రచనలు వేరుగనున్నవి. వానిలో భాగవతమునందలి దశమస్కంధోత్తరభాగమున గల ఉషాపరిణయకథయొకటి. హరివంశ కథాసంవిధానముతోఁ బోల్చినపుడీ కథసంగ్రహమేయైనను ఔచిత్య దృష్టితో చూచినపుడు గుణవత్తరముగనే భాసించును. దీని యథామాతృకముగ పోతనయుఁ దెనిఁగించెను. ఈ సం

---

లును సంస్కృత హరివంశమునే తెనిగించిరి. 'హరివంశ ప్రథమ కథాంతరమున' అని నాచనసోమనయు, 'హరివంశ మార్గోక్తమగు 'ఉషాకన్య' పరిణయమును రచించుచున్నట్లు చిన్నన్నయు కంఠోక్తిగనే పై విషయము చెప్పిరి. దీనిని బట్టి చూడఁగా నేఁడుపలభ్యమగు సంస్కృత హరివంశమున నున్నట్లు కాక ఉషాపరిణయ కథాఘట్టము సోమన చిన్నన్నలు వ్రాసిన రీతిని పాఠాంతరములు గల హరివంశ ప్రతి వేరేదేని కలదా యని నా కనుమానమగు చున్నది. కాని చూచినంతలో నాకట్టి ప్రత్యంతర మేదియు లభ్యము కాలేదు.

ఇఁక వారి మాటలు పొల్లుమాటలైతె హరివంశగాథను తెనిగింతుమనిరే కాని, మూలముమాత్ర మదికాదని చెప్పికొనిననేగాని యీ చిక్కు వీడకున్నది. భాగవత పురాణమున గూడ (దశమస్కంధే - ద్విషష్టితమోధ్యాయః) నీ యుషాపరిణయ కథ యున్నది. అందలి రచనా ప్రణాళిక కొంతవరకు సోమన చిన్నన్నలకు మార్గదర్శకమై యుండుననదగి యున్నది బహుశః వారిరువురును కథలో ఔచిత్యమును పాటించుటకై హరివంశ మూలమును విడిచి భాగవత మూలము ననుసరించిరి కాఁబోలును! చిన్నన్న అష్టమహిషీ కళ్యాణకథకు భాగవత దశమస్కంధమే యాకరము. అట్లే దీనిని గూడ కొంతవరకు భాగవతమునుండియే పరిగ్రహించెనేమో!

సంస్కృత హరివంశ ప్రతులలో నెందేని యీతీరురచన గలదని తెలియవచ్చు వరకు నీ కవుల కూర్పులోని యుచితములగు మార్పులకు భాగవత పురాణ కథయే మూలమని వారు చెప్పకున్నను, మనము భావింపవలసి యున్నదనుకొందును - పద్మ పురాణాంతర్గత మగు నుషాపరిణయ గాథయు వీరి రచనకుఁ జాల సన్నిహితముగ నున్నది.

స్కృత భాగవత కథానుసారమే నాచనసోమనయు ప్రాయశః తన ఉత్తరహరివంశానువాదమున గొన్ని మార్పులనుదెచ్చి కథకు మెరుగులు దిద్దియుండును. చిన్నన్నయు బహుశః ఈ రెండు రచనల నాధారముగా జేసికొనియే పద్మపురాణాంతర్గత గాథను గూడఁ జూచి మఱికొన్ని మార్పులతో నీ కథను సంతరించియుండును. ఎట్టన హరివంశానువాదము యథామాతృకముగావున దానినుండి చిన్నన్న గ్రహించిన యంశ మెక్కువలేదు. ఇంతకుఁదేలిన దేమన హరివంశ మార్గోక్తమగు రీతిని తానీ 'ఉషాపరిణయ కథ'ను రచించినట్లు చెప్పుకొన్నను, చిన్నన్న, సంస్కృత హరివంశమందలి యీ గాథకు భాగవత పద్మపురాణములందలి యుషాపరిణయ కథాంశమును గూడ జోడించియే మనోజ్ఞమగు నీ ద్విపద రచనగావించియుండును. చిన్నన్న కథా విధానమునకును, ఇతర కవుల కథాసంవిధానమునకును గల భేద సాదృశ్యములను బోల్చి పరికింపవచ్చును.

*చిన్నన్న రచన యందలి యౌచిత్యము* :— చిన్నన్న రచించిన ఉషాపరిణయకథకు మూలమేదియైనప్పటికిని దాని నీతఁడు తెనుఁగున ద్విపదలలో నిర్వహించిన తీరుమాత్రము ప్రశంసనీయము.ఔచితీ సమంచితము. కథాకథనమున చిన్నన్న తెచ్చిన మార్పులు సుందరములు. పార్వతీ పరమేశ్వరులు వనకేళీసందర్భమున 'చిత్రలేఖాహ్వయమైన యచ్చర నగపుత్రియాకృతి నపుడు ధరియింప'ఁగా 'పార్వతి యనుచు గామించిన పరమశివునిజూచి గౌరియుం జెలులు వేమారు నవ్విరి. మరల జలకేళివిహారమున, నచ్చటి భామయోర్తు.

"చెంగల్వపూరేకు చేర్చి ఫాలమున - రంగైన శుభ్రసారసకాండతతుల
పీనుల లాహుల వివిధ సంగతుల - బూనినాణియమైన బురివట్టుగట్టి
సరసనీలవుకఁరవరి యమరించి - విరివోడి మైబూసి విదియ చందురుని
నగు వంకగేరఁగి నన జటాగ్రమున దగిలించి మలసి ముందర విల్వనగజ
మించి మదించి కామించి భావించి - కాంచి శంకరుడఁని కదియనూహించి
యంచు ముట్టుగ జూచి యంతలో శిరము-వంచిన శంభుఁ డవ్వలనుండి నవ్వ
గిరిసుతాశవులిట్లు గ్రీడింప నచట - నిరుపురి ప్రేమంబు నీక్షింప వారి

చెంతనుండిన ఉషాకన్య వారివారి భ్రాంతులను ప్రణయపార వశ్యమును జూచి మనమున నానందించి తోడిచెలులతో,

"కళలంటి విభుని చొక్కగచేయు మగువ తఁపోయ మున్నెంత
తపము చేసినదో!" (పు. 19)

అనితలపోసినది. అపుడు బాణాత్మజ భావంబుతెలిసి పార్వతి వరమను గ్రహించుట మున్నుగాగల కథా ఘట్టమెల్ల నిందు మూలమున కన్న మనోజ్ఞ ముగనున్నది. మూలమున పరమశివుఁడు అచ్చరకన్నెను జూచి పార్వతియని పైబడుటయు ప్రమథదంపతులెల్లరు నాదిదంపతు లయి క్రీడించుటయును నుషాకన్యకుల్లాసము గల్పించిన యంశములు-ఇందు భ్రాంతి పార్వతీపరమేశ్వరుల కిరువురకును వర్ణితము. ఇట్లు పరస్పరము భ్రాంతికి లోనయి ప్రణయాతిరేకమున విహరించు నాది దంపతులే ఉషాకన్య కుల్లాసము గొల్పినవారు. ఇందు భ్రాంతికి హేతువును నిరూపించువర్ణనము మనోజ్ఞము. ఈ మార్పు సుందరము.[1]

మూలమున చిత్రలేఖ ఉషామనోహరుని గుర్తించుటకై చిత్ర రచనచేసి చూపిన సందర్భమున యదువులలో ననిరుద్ధునిజూచి యుష విస్మయోత్ఫుల్లలోచనయైనట్లు సంగ్రహముగ వర్ణితమైనది.[2]

---

1. నాచనసోముని ఉత్తర హరివంశమున గూడ రచన యీ తీరుననే శృంగార మనోజ్ఞముగా నున్నది. ఈ ఘట్టమును చిన్నన్న సోముని రచన ననుసరించియే రచించెనని తోచును. (చూ. ఉ. హ. 5. ఆ. 44-67)

2 హరివంశమూల మిట్లున్నది.

"దేవ దానవ గంధర్వాన్ విద్యాధరగణానథ
అతీత్య చ యదూన్ సర్వాన్ దదర్శ యదునందనమ్
తత్రానిరుద్ధం దృష్ట్వా సా విస్మయోత్ఫుల్లలోచనా
ఉవాచ చిత్రలేఖాంతా మయం చోరః సతే సఖి"

ఈ ఘట్ట మీద్విపద రచనమున పరిణామక్రమమున పోషిత మైనది. దేవదానవ గంధర్వుల చిత్రముల దిలకించినపిదప ఉషాకన్య నర పాలకుల చిత్రముల చూచినది. వారిలో యాదవులను దిలకించుచుం డెను. బలభద్రు నిజూచి 'కలలోనివాఁడేనొ కాఁడొ వీఁ'డని మదినెన్న లేక యూరుకొనినదట. కృష్ణుని చూచినది. 'మఱియు ననుమానపడినదట!' ఆటుపై ప్రద్యుమ్నుని దర్శించినది 'తలయెత్తి చూచి యీతఁడెయాతఁ డనుచు తలఁచు తలంపు లీతఁడుగాడటంచు తలవంచి తలవంచి తలఁచి క్రమ్మరను తలయెత్తి చింతించు'నట! ఆపిదప ననిరుద్ధుని మనోహరా కృతిని చిత్రలేఖ చూపఁగా చూచును. 'మదిలోన హర్షించి వెన్న ముచ్చు మన్మధుఁడు మునిముచ్చువీఁడనుచు నారూపు చనుదోయినంటి యొత్తుచును పారవశ్యమునొంది' ప్రేమమున పలికెనట! పరిణామ క్రమమున వర్ణితమైన యీతీరురచన ఉషాకన్యలోని యౌత్సుక్య మును రెట్టించు విధమున పఠితలమనములను గూడ నాకట్టి పరవశింపఁ జేయుచున్నది.

చిత్రలేఖ ద్వారకకేగి అనిరుద్ధకుమారుని తెచ్చిన విధమెల్ల స్వతంత్రము, సుందరము, ఔచితీ సమంచితము. ఆమె ద్వారకకు ప్రచ్ఛన్న వేషమున నేగినది. తురుము బిగజుట్టి; కాసె పొందుపఱచి కట్టి; చలువవారిసపట్టుచనుకట్టమర్చి, కనకంపుగత్తి, భృంగంబుల క్రోవి, చిన్నారి సెలగోల, చిప్ప, చేయమ్ము, తిలకంపుబిసుము, కత్తెర, సొక్కుమందు, బలపంపు బలముళ్లు, బంతికొంకియును మొద లైన సాధనంబులు గొని యొక నడురేయి నేగినది. ఈ వర్ణనము స్వతంత్రము. ఇట్లు వెడలి ఈ కుమారకచంద్రు నేరీతిగాంతు నేరీతిఁ

---

భాగవతమున నిట్లు గలదు.

'మధుశేషు చ సాత్వృష్ణిన్ శూరమానకదుందుభిమ్.

వ్యలిఖద్రామ కృష్ణౌ చ ప్రద్యుమ్నం వీక్ష్య లజ్జితా

అనిరుద్ధం విలిఖితం వీక్ష్యోషావాఙ్ముఖీ స్థితా'

దెత్తు'నని యోచించుచుండగా 'మంత్ర రహస్యార్థ మాధుర్య కవిత తంత్రీనినాదంబు తనవీను' సోకినది. అచట నారదుఁ డుండవోలునని తలఁచి 'దాని చొప్పున బోయిపోయి - ఒక పద్మాకరము చెంగట - ఉరుతరాంచద్ద్వాదశోర్ధ్వపుండ్రాది వరచిహ్న సహితు శ్రీవరపద ధ్యాను శారదాహితచంద్రు శరశరత్కాల సీరదరుచి మించు నారదు' గాంచెను. ఈ కథనము సహజమగు కథాకథన వైఖరి సాగినది. కాని మూలమున నట్లుగాక 'తవ యోగప్రభావేన శక్యం తత్ర ప్రవేశనం' అని యుషాకన్య పలుకగా చిత్రలేఖ కడచిచనుటయు, ద్వారవతిలో భవనాంతికమున తత్ప్రవేశమునకై చింతించుచుండఁగా నారదుఁ డగుపడుటయు వర్ణితము. భాగవతమున యోగమాయచేత వెళ్లియనిరుద్ధుని దెచ్చినట్లేకాని నారదుని ప్రసక్తియేలేదు. చిన్నన్న యీ భాగమును పౌరాణికముగా కాక సహజసుందరముగా చిత్రించినాఁడు.

నారదుఁడు తామసీవిద్య ననుగ్రహించిన పిదప చిత్రలేఖ అనిరుద్ధుని ప్రాసాదమునకేగి 'వామాక్షులుభయపార్శ్వముల నిద్రింప గలిత డోలాశయ్య గనుమోడ్చియున్న జలజాక్షు మనుమని చంద్రబింబాస్య గనుఁగొని-మునిచేత గైకొన్నయట్టి ఘనతరమాయచేగప్పియుప్పొంగి శంబరాహితపుత్రుఁ జయ్యనగొనుచు నంబరాధ్వమున వతిరహస్యముగ నరిగి యుషాకన్య యంతఃపురంబున' జేర్చినది. ఈ రాకపోకలు ముహూర్తత్రయమున ముగిసినవి. అనిరుద్ధుని బలిపుత్రపుత్రి పాన్పుపై నిడి యామెవీడ్కొని చనినది. అంతట నుషాదేవి తమకమున ప్రద్యుమ్నసూను నాలింగనము చేసికొన్నది. ఆతఁ డులికిపడి మేల్కాంచినాఁడు. ప్రక్కనున్న జవరాలి యందచందముల కచ్చెరువంది 'కల గన్న చందమో కాక నిజంబో' తలపోయలేని స్థితిలో ననిరుద్ధుఁడుండెను. ఉష సర్వమును దెలియపలుచును. ఇంతే. ఇంతలో తలవరులైన కాంతలుపోయి పరపురుషుని రాకనుగూర్చి భయభ్రాంతులై బాణునకు నివేదింతురు. బాణుఁడు హుంకరించి అనిరుద్ధునిబట్ట సేనల నంపును. యుద్ధ మారంభమగును. ఉషాపరిణయగాథలో నీఘట్ట మతి ముఖ్యమైనది. దానిని చిన్నన్న నిర్వహించినతీరు మిక్కిలి మనోజ్ఞము. ఈ కథాభాగము హరివంశమూలముకన్న భిన్నముగఁ జిత్రింపఁబడినది.

శృంగారమెంతయో సంయమనమున పోషితమైనది. చిన్నన్నకుగల "సిద్ధవాక్ప్రౌఢిమత్వము"నకీ సన్నివేశమే ప్రబలోదాహరణము.

హరివంశమూలమున చిత్రలేఖ అనిరుద్ధుని ప్రాసాదమునకేగి 'యింపెసగ మధువు గ్రోలుచును జుట్టు నతివలు గ్రాల' నడుమ మైమరచి యందగత్తెల నృత్యగీతములకు సొక్కుచుండిన అనిరుద్ధుని గాంచెను. తామసీవిద్యచేత చుట్టునున్నవారిని మోహితులజేసి చిత్రలేఖ అనిరుద్ధునితో ప్రసంగించును. కుశలాదిక సంప్రశ్నానంతరము ఉషాకన్యామనోరథమును గూర్చి జరిగిన దంతయు నివేదించును. 'నీమీఁది యాసచేతనే ఆమె బ్రదికియున్న'దనును. ఆ మాటలకు సంతసిల్లి అనిరుద్ధుఁడును నట్టికలయేగాంచి వ్యథితుఁడగు చుండిన యట్లు చెప్పుకొనును. తనను తీసికొనిపోయి ప్రియాదర్శనలాభమును గల్గించి స్వప్నవృత్తాంతమును సత్యము చేయఁగోరును. అను వెరిగి చిత్రలేఖ యాతనితో నంతర్ధానమై నిజవిద్యాప్రభావమున శోణితపురమునకు వచ్చిచేరును. ఉషానిరుద్ధులిరువురును పరస్పరము చూపులఁ జొక్కి మనస్సు లేకము జేసికొందురు. గాంధర్వమున బరిణయమాడి బహుకాలము సురతకేళీమగ్నులగుదురు. ఇట్లుండ నొకఁనాడు అంతఃపురవర్తులనిరుద్ధుని గుర్తించి బాణునకు నివేదింతురు. ఈ విధమున మూలకథ సాగును.[1]

1. "తత్రానిరుద్ధం సాఽపశ్యత్ చిత్రలేఖా వరాప్సరాః
మధ్యే పరమ నారీణాం తారాపతి మివోదితమ్.
క్రీడావిహారే నారీభిః సేవ్యమాన మితస్తతః
పిబంతం మధుమాధ్వీకం శ్రియాపరమయాయుతం.
* * * * *
చిత్రలేఖావచః శ్రుత్వా సోఽనిరుద్ధోఽబ్రవీదిదమ్
దృష్ట్వా స్వప్నే మయా పాహి తన్మత్తః శ్రుణుశోభనే.
రూపంకార్యం మతించైవ సంయోగం రుదితం తథా
ఏవం సర్వ మహోరాత్రం ముహ్యామి పరిచింతయన్

అనిరుద్ధుఁడు స్త్రీ పానమత్తుఁడై సుఖోపభోగము లనుభవించు చుండినట్లు వర్ణితమైన మూలకథ వాచ్యమైయున్నది. ఇఁక తానునట్లే కలగని పురుషుఁడయ్యును గలంగుచుండినట్లు చెప్పుకొనుటయు, తనను గొంపోయిన వత్తునని దూతగావచ్చిన పడతిని వేడుకొనుటయు నాతని నాయకలక్షణమునకు మచ్చదెచ్చునవిగానున్నవి. ఈన్యూనత చిన్నన్నయనువాదమున గానరాదు. ఈ కథాసంవిధానమున చిన్నన్నకు నాచనసోమన మార్గదర్శకుఁడు. ఈ యిరువురకును మూలము కొంత భాగవత పద్మపురాణములందలి కథలు కావచ్చును. అనిరుద్ధుని జూచి నిద్రితుఁడైన వానినట్లే శోణితపురమునకు గొనివచ్చునట్టి కథాంశ మందుగలదు.[1] దానినే ఔచిత్యదృష్టితో సోమనయు, చిన్నన్నయు పరిగ్రహించియుందురు. భాగవతానువాదమున పోతన 'నిజాంగనారతిశ్రమంబుననిద్రాసక్తుఁడగు ననిరుద్ధుని' అనిరచించినాఁడు. ఏమైనను హరివంశ మూలమునందువలె శృంగారమును వాచ్యము సేయక చిన్నన్న వ్యంగ్యమును గాపాడినాఁడనవచ్చును. ఇట్లే ఉషా నిరుద్ధుల కలయికనుగూడ కవి చాల చమత్కారముగ వ్యంగ్యమర్యాదతో వర్ణించెను. మూలమునందువలె నిందు వారి సురతకేళివినోదముల వర్ణనము కానరాదు. హరివంశమున వారు బహుకాలము యథేచ్ఛా

యద్యహం సమనుగ్రాహ్యో యది సఖ్యం త్వమిచ్ఛసి
నయస్వ చిత్రలేఖే! మాంద్రష్టు మిచ్ఛామ్యహం ప్రియామ్.
కామం సంతాప సంతప్తః ప్రియా సంగమ కామతః
ఏషోఽంజలిర్మయాబద్ధః సత్యం స్వప్నం కురుష్వ మే.
* * * * *
హర్మ్యే(స్త్రీ)గణమధ్యస్థం కృత్వాచాంతర్హితా తదా
ఉత్పపాత గృహీత్వాసా ప్రాద్యుమ్నిం యుద్ధదుర్మదమ్.
సా తమధ్వాన మాగత్య సిద్ధచారణసేవితమ్
సహసా శోణితపురం ప్రవివేశ మనోజవా.
(ఉషాకల్యాణ ప్రకరణ శ్లోకాః - హరివంశ ప్రతిపాదితాః-275-851)

1. తత్రసుప్తం సుపర్యంకే ప్రాద్యుమ్నిం యోగమాస్థితా
గృహీత్వా శోణితపురం సఖ్యై ప్రియమదర్శయత్.
(భాగవతే - దశమస్కంధే)

భోగముల ననుభవించినట్లుగలదు. భాగవతము ననువదించిన పోతన 'ఉషాబాలాలలామ కొయ్యనఁజూలేర్పడి గర్భమొదవె' ననియే వర్ణించినాఁడు. కాని చిన్నన్న పై కథావిషయములనట్లు సాగనీయక సంయమనమున సంగ్రహముగా నిర్వహించి యౌచిత్యమును బోషించినాఁడు. అనిరుద్ధుఁడు మేల్కాంచి,

"కలగన్న చందమో కాకనిజంబో తలపోయనిట్టి చందంబెందుగాన
మనుచు సత్యంబుగా నాత్మనూహించి వనితచే నెంతయువలనుగాఁదెలిసి"

కొనుటయు, 'తలవరులైన కాంతలు వారి పొత్తుపొలుపు కన్గొని పరపురుషుఁడా వేళ' నంతఃపురమును జేరినవైనమును బాణున కెరిఁగించుటయు నిందు వర్ణితము. ఈ వర్ణనము మూలమునకన్న సొగసుగ నున్నదని వేరుగ చెప్పనవసరములేదు.

ఈ విధమున ఉషాపరిణయ కథారచనమును నిర్వహించుటలో చిన్నన్న ప్రధానకథకు పరిపోషకములుకాని యనేకవర్ణనలు మూలమునందున్నవానిని పరిహరించియు, కొన్నిఁటివి సంగ్రహించియు పరిపోషకములగువానిని మూలమున లేకున్నను జేర్చియుఁ బెంచియు నేర్పుఁజూపినాఁడు. మొత్తముమీఁద నీతని రచన శీఘ్రగతిని రసవంతముగా సాగినది.

ఈ కథారచనలో చిన్నన్న శక్యమైనతావులను తన విష్ణుభక్తిని చాటుకొనినాఁడు. మూలమునందలి విష్ణుస్తుతులనట్లే సంగ్రహించినాఁడు. శివజ్వరకృత శ్రీకృష్ణ స్తోత్రమును, శంకరకృత కృష్ణస్తోత్రమును మూలముననుసరించిన సంగ్రహరచనలు :—

"మలసి బ్రహ్మను గావ మత్స్యంబవై తివి వలనాఁడు కృష్ణుఁడవై తివి నేఁడు
చలమున హైహయశత్రుఁడవై తివి వలనాఁడు కృష్ణుఁడవై తివి నేఁడు.
బలగర్విట్టగ రామచంద్రుఁడవై తివి వలనాఁడు కృష్ణుఁడవై తివి నేఁడు."[1]

(పు. 66)

---

1. ఈ రచన వాచన సోమనాథుని ఉత్తరహరివంశమందలి స్తుతులను బోలియున్నది.

ఈ రీతిని శివజ్వరము స్తుతించుటలో నా పరమాత్ముని యవతారములు ప్రశంసింపఁబడినవి. ఇట్లే శంకరకృత కృష్ణస్తోత్రమున:—

"ఇందిరావాధ సంహృతదైత్యయూధ, బృందారకాధార పృథుగుణాధార
జలజాప్త విధునేత్ర సౌవర్ణగాత్ర సలలితాచార కౌస్తుభరత్నహార!
శ్రీదేవితోఁగూడి చెలువు మీరఁగ సర్వమయుఁడవై సగుణుండవగుచు
నిర్వికారుండవై నీవె యుండుదువు." (పు. 81-82)

అని యాతని యనంత కళ్యాణ గుణములు ప్రస్తుతింపఁబడినవి. ఇట్లు స్తుతులందేకాక సమయోచిత వర్ణనములందును చిన్నన్న స్వతంత్రించి వైష్ణవ ప్రపత్తిని చిత్రించును. చిత్రరేఖా విరచిత తైలవర్ణ చిత్రములందలి బలభద్ర కృష్ణప్రద్యుమ్నానిరుద్ధుల యాకృతి సౌభాగ్యమును కనులఁగట్టునట్లు నిల్పినాఁడు చిన్నన్న. అందు కథాప్రయోజనముతోఁబాటు కవికిగల ప్రపత్తియు వ్యంజితమగుచున్నది.

ఈ యుదాహరణము తిలకింపుఁడు :—

"శ్రీనగిన్న కౌస్తుభశ్రీవత్సుఁ డాదిదేవుండు హరివాసుదేవ నందనుఁడు
జలదకంధరుఁడు చంచత్కటాక్షుఁడు మకరకుండల వనమాలికా భరణుఁ
డకలంక శంఖచక్రాయుధధరుఁడు శంఖక రార్చిత దివ్యచరణుఁ డనేక
పంకజోద్భూతాండ భాండగర్భుండు పీతాంబరుఁడు నవ్యబింబాధరుండు
వీఁడు కృష్ణుఁడు చూడు వీఁడె వాఁడవునొ?" (పు 38)

ఇట్లే శ్రీకృష్ణుని శంఖచక్రాదులను వర్ణించునపుడును, గరుత్మంతుని పరాక్రమమును వెల్లడించునపుడును కవి వీరావేశము దాల్చును. తుదకు నారదుఁడు కూడ 'నురుతరాంచద్ద్వాదశోర్ధ్వపుండ్రములతో' ప్రత్యక్షమగును. ఇట్టి వర్ణనములందే కాక కథా కథనమునందు సైతము కవి వైష్ణవ పక్షపాతమును వహించును. బాణుఁడు శివుని వేడి 'కరదండసాహస కర్జంబుదీర దురముగా వలయును ధూర్జటి' యనినపుడు 'మక్కంటి' యా 'మూఢాత్ముని' జూచి 'నీ నీలకంఠకేతనము' తను దానదెగి వసుంధర గూలునాఁడు నిను గెల్చు నను చెల్చు నిఖిలంబు గెల్చు ఘనుతోడ కయ్యంబు

గలుగుపో'మ్మనెను. ఈ పలుకులలో నాగామికథా సూచనమున్నది. చిన్నన్నకుగల విష్ణుభక్తియు వ్యంజితమగుచున్నది. ఇట్లే బాణుఁ డానందమందు చుండినపు డాతని హితమంత్రియగు కుంభాండుఁడు 'కన్నది విన్నదికాదు నీవిపుడున్నచంద' మేమాయె నెరిగింపుమని కోరు సందర్భమునఁగూడ రచనా విధానమున చిన్నన్నకుఁగల విష్ణుభక్తి పారమ్యమే గోచరించును.

> "సురరాజు తోడ నీసునఁబోరివాని కరిదెచ్చి నీకాలఁ గట్టితో కాక
> శ్రీపతిభక్తి పూజించి మీతండ్రి భూపతిత్వంబును బొందెనో మరల
> నేడు నాతోడ నీ నిర్ణయంబెల్ల వేడుకతోఁ జెప్పవే రాక్షసేశ!" (పు. 9)

అని కుంభాండుఁడడుగుటలో మిగిలినవన్నియు బాగున్నవి కాని 'శ్రీపతి భక్తి పూజించి మీతండ్రి భూపతిత్వంబును బొందెనో మరల'యను ప్రశ్న చిన్నన్న విష్ణుభక్తికే నిదర్శనముగాని బాణుని యుత్కర్షకు మాత్రము కాఁజాలదు. ఈ పట్టున నెఱ్ఱన 'కఱదులాఁడగు చక్రి కపటంపుటనువుఁ దను మోసపుచ్చిన ధర్మరతుఁడు గాన సత్యంబను కట్టునఁ దగఁగట్టు వడిపోయి పాతాళభువనకోటికెల్ల నుగ్రంబైన యిలుకుననున్న మీతండ్రి విరోచన తనయుఁడెలమి నీ యట్టి సత్పుత్రు నాయతవిక్రముఁగనుటఁ దద్బంధ మోక్షణంబుపడసి నేఁడు వెలువడి తనతొంటినెలరు రాజ్యగరిమ నేతెంచెనే' (హరివం - ఉ.భా. 7 ఆ॥) అనిపించినాఁడు. నాచన సోమన 'మీ తండ్రిచే గుజ్జుమెకరిగొన్న భూగగనంబు లేలంగకలిగె నొక్కొ' (ఉ. హ. 5 ఆ - 23) అనిపించెను.మూలమున గూడ నీ భావము లిట్లే యున్నవి.[1] చిన్నన్న మాత్ర

1. 'విబుధావాస నిరతా భవిష్యంతి మహాసురాః
బలిర్విష్ణు పరిక్రాంతో బద్ధస్తవ పితా నృప
సలిలౌఘా ద్వినిష్క్రమ్య కచ్చిద్రాజ్య మవాప్స్యతి
దివ్యమాల్యాంబరధరం దివ్యస్రగ్గంధలేపనమ్
కచ్చిత్ వైరోచనం తాత! ద్రక్ష్యామః పితరం తవ
కచిత్ త్రిభిఃక్రమైః పూర్వం హృతాన్ లోకానిమాన్ ప్రభో!"
(హరివం 116 అధ్యా-45-47 శ్లో.)

మల్లే యనును. కుంభాండుఁడు బాణునితో నేమివరమువేడితివని చెప్పరించుచు 'మీ తండ్రి పదమునమెట్టి పాతాళపాలిగా జేసిన పద్మేశ్వరుండె యెదిరిన నీవు నయ్యేణాంకధరుఁడు కదనంబులో నిల్వగలరె?' యని ప్రశ్నించును. కుంభాండుఁడు బాణుని మంత్రియైనను కవి తనకు గల వైష్ణవ పక్షపాతము కారణముననే అతనిచేతనట్లు పలికించి ఆగామి కథా సూచనము చేయుచున్నాఁడు. తుదకు పార్వతి కూడచిత్రలేఖతో పలుకుచు 'శ్రీపతియాన' యని తన వాక్యములను ప్రమాణీకరించుకొనును. ఈ విధమున కవికిఁగల వైష్ణవ పక్షపాతము గ్రంథమందచ్చటచ్చట కానవచ్చుచునే యుండును.

*అష్టాదశవర్ణనలు*: ప్రబంధవర్ణన లనఁదగిన అష్టాదశ వర్ణనలలో ముఖ్యములైన నగర స్త్రీ వనవిహార జలకేళీ విరహాయుద్ధాది వర్ణనల నాలంకారికముగనే వర్ణించినాఁడు కవి. గ్రంధారంభమందే ద్వారకా నగరమును వర్ణించెను. ఆ నగరము వరచుకొమ్మలతోడి ప్రాకారచయము గురుతైన నాకంబుకొమరు దీపించును. 'పాదైన యప్పురి పరిఘలన్నియును ఆదికచ్ఛపసద్విహార యోగ్యములు'. 'ముదితలా పురిసౌధముల మీఁది నుండి చదలేటిలోడిగ్గి జలకమాడుదురు.' అందు భాగవతులు, యతులు, బుధులు, భూపతులు, వైశ్యజనులు, విష్ణుపాదజులు, నన్నివర్ణములవారును గలరు. అచటి స్త్రీలు మన్మధుని సీమలోని సౌభాగ్యమును మూర్తిగొన్ననారు. స్త్రీవర్ణనమున చిన్నన్న ప్రదర్శించిన వైవిధ్యమునకు కొదువయేలేదు. వనకేళీ జలకేళీ వర్ణనములను కూడ కవి ప్రబంధరీతినే వర్ణించెను. 'కాయజుండను వేటకాఁడు నిచ్చలును పాయని కుచచక్రపక్షులంబట్టి చివురు గండియలు మైజిమ్మెనోయనఁగ పవమాన చలితపుష్పరసార్ద్రలతలు పలుమారు దళుకు గుబ్బలమీఁద నొరయ ఫలములు గోయుచుండిరట', అచటి వనమున వనజాక్షులు చివురులను, పూవులను, కాయలను, పండ్లను గోసి పరస్పరము పైపై చికొని వారు పరస్పరము పరియాచకము లాడుకొనిరి. క్రొత్త కస్తురిచే కుముదాస్త్రుఁడేసి విరుల చప్పరములో

వేడుకలు చేసికొనిరి. చిమ్మనగ్రోవులతో వసంతములాడిరి. పుష్ప రజంబును, కప్పురమును, కన్నులఁ జల్లుకొని యాటపాటలతో నిచ్ఛా విహారములు సల్పిరి. పిదప జలకేళిసలుపు కాంతలు దైవార సలిలముల దోగాడిరి. 'పయ్యెదల్ జారంగ పాలిండ్లు కదల నొయ్యారమున గొప్పు లొయ్యనవీడ బెట్టూర్పులదరంగ పెనగొని వింతపట్టు చీరలు తడబడగ లేదొడల కౌను లల్లాడ ముంగురులు నటింప సానబట్టిన మరు శరములో యనఁగ' వారందరును జలాశయమును జొచ్చి క్రీడించిన వైఖరి మనోజ్ఞముగ వర్ణితమైనది. ఆ జలజాకరమే 'రాయంచ కవలతో మేటి జక్కవలతో మించు తొవలతో శావిచెందొవలతో దేఁటిగములతో తరళభంగములతో సారసములతో నవసారసములతో' నొప్పారి కన్నుల పండువగ నుండెనట; జలకేళి సవరించుచు వారం దరు నోలలుపాడి కేకిసలుగొట్టిరి. ఈ వర్ణనములు సహజముగను మనోజ్ఞముగను వర్ణితములైనవి. ఇట్లే ఉషాకన్యా విరహతాప తాపోపశమనాది వర్ణనములును యుద్ధ వర్ణనములును విపులముగా ప్రబంధరీతిని సాగినవి. యుద్ధ వర్ణనమున వర్ణితములైన శివనారా యణులయు, శివజ్వర వైష్ణవజ్వరములయు, ప్రద్యుమ్న కుమారు లయు, గణపతి బలరాములయు రణవైఖరులు వీరరసోత్తేజకములుగ నున్నవి. శ్రీకృష్ణుని పక్షమున గరుడ సుదర్శనాదుల విజృంభణమును శత్రుపక్షమున బాణాసుర కింకరుల వీరావేశమును వర్ణించిన విధా నము రసస్ఫోరకము. ఈ వర్ణనము లందు చిన్నన్న ప్రత్యక్ష దర్శన ముగా వీరరౌద్రబీభత్సరసము లుట్టిపడునట్లు వర్ణించెను. ఇట్లు ప్రాబం ధిక వర్ణనములతో నీ ద్విపద ప్రబంధము రసమయముగ నావిష్కృత మైనది.

ఉషానిరుద్ధుల వివాహము నాఁటి తెలుఁగునాటియాచార ముల ననుసరించియే జరిగినట్లిందు వర్ణితమైనది. బ్రాహ్మణశ్రేష్ఠులు లగ్నంబును నిశ్చయించినపిదప నగరమెల్ల కడుచిత్రముగ మేలుకట్లు కట్టి కదళికాస్తంభములునాటి యలంకరించిరి. పురోహితుఁడు మంగ ళాష్టకములు చదువుటయు, దంపతులు ముత్యాల తలంబ్రాలు పోసి

కొనుటయు, పెద్ద ముత్తైదువలు కూడఁబలుకుకొని ధవళంబులు పాడుటయు, భోజన ప్రియులగు బ్రాహ్మణులు కమ్మగ పెండ్లి విందారగించుటయు చక్కగ వర్ణితములైనవి. ఇట్లు వివాహ వర్ణనమందేకాదు పలువిషయములందు కవి సమాజపరిశీలనాసక్తితో సమకాలిక వాతావరణము నచ్చటచ్చట కొంత చిత్రించుటకు యత్నించెను.

ఉషాకన్య తన ప్రాసాదోపరిభాగమున వీణవాయించి యలసి సొలసి కలగన్ననాఁటి రాత్రి యచటి వాతావరణమునెల్ల మనోజ్ఞముగ చిత్రించెను. మంచము మీఁద పఱుపుపై చలువ దుప్పటి పఱచి, కొదమచేమంతి రేకులు నిండజల్లి మృదువైన తలగడ మీటుగానునిచి యొయ్యొన పవ్వళించి చెలియొకర్తుక గవుసెనయూడ్చిన వీణె నందీయంగా వలకేల గీలించి, వలుదజక్కవల బలుమారుదెగడు గుబ్బలమీద మోపి, మొనవ్రేళ్ళ శ్రుతితంత్రి ముట్టి జీవాళిపనుపడ జీఱన బలుకంగ బెట్టి, సరిగమపధనిస సనిధపమగరిస, సరిగమరిగమపసనిధపమనుచు, బహువిధాలంకృతుల్ పాడుకొనంగ రహిమించివాయించి, గ్రామ సంతతుల మేళముల్ సేసి సమ్మేళముల్ గాగ యాలాపమార్గంబులలర జూపుచును సంకీర్తనము, చిందు, జక్కిణి గీత మంకించి, శుద్ధంబులలర మీటుచును - పాడి యానందించెనట ! ఈ వర్ణనమందు వీణెను శ్రుతిచేసి వాయించు విధానము, నలంకారములు సాధనచేయు తెరగు-నింకకొన్ని సంగీత ప్రక్రియలను గూర్చిన వివరణమును గలవు. ఇట్లే శ్రీకృష్ణుని ముందర బాణుఁడు పారవశ్యమున నాట్యముచేసిన తావునను ఉషా కళ్యాణమును వర్ణించుపట్టునను గూడ కవి తనకుఁగల సంగీత నాట్యముల పరిజ్ఞానమును వెల్లడించుకొనెను.

"పలుమరు నంది సంభ్రమము రెట్టింప తతతత్తజకికఝాతఝుదిద్దిమికు
తతతోంగిణనుచు గౌతఁబుగ్గళింప చండీశుఁడును భృంగి సరినారజముల
నొండొరుల్ తాచటలొరవుగానొత్త సింధురాస్యుఁడు మహాసేనుఁడుమొరసి
దిఁధిమ్మనంగ మద్దెళలు వాయింప నాలాపమొనరింప నశ్వరధుండు
తాలమ్మానమునకు గానంబు సేయ, నమరారి యిట్లు నృత్యంబుగావించె"

(పు. 85)

ఇందు నాట్యమునకు సంబంధించిన శబ్దప్రక్రియలు వర్ణితములు. ఉషాపరిణయమున 'పెద్ద ముత్తయిదువులు పాడరే యొక పెండ్లిపాట సొంపార' యని పరస్పర మెచ్చరించుకొని కలసి ధవళాలు పాడిరట !

"కవగూడి యిద్దరు గబ్బిగుబ్బెతలు ధవళంబు పాడి బిత్తరముగా నిలువ
దొమ్మి పేరంటాండ్రుతోడనే వేడ్క ఘుమ్మని పల్లవుల్ గూడిపాడంగ"
(పు. 89)

నుద్యుక్తులయిరట, ఇందు చరణము నిరువురు కలిసి పాడుటయు, పల్లవిని పదిమందియు కలిసి బృందగానమొనరించుటయు వర్ణితము. ఇది నాఁడు ధవళములు పాడునట్టి వైఖరి.

సంగీత నాట్య విషయములే కాక చిన్నన్న తనకుఁగల చిత్ర రచనా పరిజ్ఞానమును గూడ నిందు సువ్యక్తపఱచెను. ప్రాచీనాంధ్ర సాహిత్యమున చిత్రరచనా విధానమును గూర్చి యింత విపులముగ ప్రశంసించిన వారిలో నన్నచోడుఁడే ప్రథముడు. అతని తరువాత నంత విపులముగ వర్ణించిన వారిలో నీతఁడె ప్రముఖుఁడు. చిత్రలేఖ—

"కొలదిగా వన్నియల్ గూర్చి బంగారు చిప్పలలోనుంచి చెలువొందుచున్న
కొప్పున ముంగురుల్ గూడ దువ్వుచును డాకేలు వల్లపట్టంబుపై నూఁది
తూకొని వలకేల తూలికదాల్చి వంచి ముఖ్యముదోయ వలనొప్ప చిప్ప
యంచుఁదీఁడి చయ్యని దిట్టపెట్టి రూపరేఖలు వ్రాసి రుచిరభావములు
దీపింప నొరవులు దీర్చి నూహింప తూలికవన్నియందోచి యొక్కటికి
లీల వన్నువలిడ లేమ కేలెత్తి, చూపులు మెయికాంతి సొంపు లేనవ్వు
ప్రాపైనకెమ్మోవి పవడంపుచాయ మరకతతాటంక మహనీయ రుచియు
వరుస నచ్చటి పంచవర్ణంబులగుచునిండ......" (పు. 28)

చయ్యన చరాచరము ప్రాచుర్యముగ చిత్రపటముపై విలిఖించెనట. ఇందుఫలకమునుగొని వన్నియలు గూర్చుటయు, తిట్ట

వెట్టి వన్నువలిడుటయు, పంచవర్ణములతో చిత్తరువులను లిఖించుటయు విపులముగా వర్ణితములైనవి.[1]

చిన్నన్న ఉషాపరిణయప్రబంధరచనమున పలువురు పూర్వకవులరచనావిధానమును బుణికిపుచ్చుకొనెను. కథా సంవిధానమందును, వర్ణనలయందును చిన్నన్న పలుతావుల నాచన సోమనాథు ననుసరించినట్లు తెలియనగును. గరుత్మంతుని ఱెక్కల గాలిని వర్ణించిన ద్విపదలలో రాయలవారి ఆముక్తమాల్యదా పీఠికలోని గరుత్మంతుని వర్ణనవిధానము గోచరించును. చిత్రరచనావిధానమును ప్రపంచించుటలోను, అమరారినృత్యవర్ణనమునందును, చిన్నన్న నన్నెచోడకవి ననుసరించెననవచ్చును. ఉషాకన్యతో పార్వతి "అలకంతునకు నెక్కుడగు చక్కదనము గలవాఁడు సఖి! నీకు గాంతుడై నీదుతలపు లీడేర్చు"నని పలుకుట కళాపూర్ణోదయమున "నినుబోలు వనిత నీకును వనజముఖి యితని బోలువాఁడితనికి" (1-61) అని నారదుఁడాడిన తెఱగున నున్నది.

ఇట్లు పూర్వకవుల రచనల నెడనెడననుసరించియు, చిన్నన్న ఈ ద్విపదప్రబంధరచనలో తన స్వాతంత్ర్యము, వాక్చమత్కారమును, వర్ణనావైవిధ్యమును పలువిధముల పోషించుకొనెను. ముఖ్యముగా స్త్రీవర్ణనమున చిన్నన్న పోయినపోకడలకు మితిలేదు. ఆ విషయమున తన పూర్వకావ్యమునందుకన్న నిందు కవి ఆరోహణావరోహణ క్రమములఁబాటించి మఱికొంత వైచిత్రిని సాధించినాఁడు. (చూ. 5. 6, 92 మున్నగు పుటలలోని వర్ణనలు).

---

1. చూ. నన్నిచోడుని కుమారసంభవము (5 ఆ. - వ 118) "చిత్రసాధనంబులుగొని పలకఘట్టించి, మెఱుంగిడి, త్రివటించి లిట్టంబుకొలదికిందెచ్చి, ఋజ్వాగతంబున రేఖనూల్కొలిపి, పత్రకబిందుక, నిమ్నోన్నతా పాంగ మానోన్మానంబులలవఱచి సలక్షణంబుగాఁ జిత్రించి వన్నువగొలిపి కందెఱ తెఱచిన."—

*పరమయోగివిలాసము* :- ద్విపద. కర్త తాళ్ళపాక చిన్నన్న. ఈతని కృతులలో నిది మూడవదియు, నుత్కృష్టమైనదియునని చెప్పవచ్చును. అష్టమహిషీకళ్యాణోషాపరిణయకృతులకన్న నిది గ్రంథమునను, గ్రంథ గౌరవముననుబెద్దది. మొత్తమిందు ఎనిమిది యాశ్వాసములున్నవి. లభ్యమై ముద్రితమగు గ్రంథము దాదాపు 6377 ద్విపదలు గలది. గ్రంథ విషయము పన్నిద్దరాళ్వారులయు, నాచార్యాదులయు పుణ్యచరిత్ర కథనము. భాగవతుల చరిత్ర వినుటయు, వ్రాయుటయు, చదువుటయు పుణ్యప్రదములు. కావున ఆ పుణ్యముతో బాటు వైష్ణవ మత ప్రచారమును పురుషార్థమును కూడ పరమయోగివిలాసరచనమున చిన్నన్న సముపార్జించుకొనినాడు.

వైష్ణవ గురుపరంపరా ప్రభావమును జిత్రించు ద్రావిడ గ్రంథముల నాధారముగాఁగొని జానుగా దీని నీతఁడు ద్విపదరూపమున తెనుఁగు గావించినాఁడు. గ్రంథమును దివ్యదంపతులగు నలమేలు మంగాంబకును శ్రీవేంకటేశ్వరులకును నంకితము గావించినాఁడు.

*కృత్యాది* : ఒకతూరి చిన్నన్నకు శ్రీ వేంకటేశ్వరస్వామి కలలోన 'వైష్ణవాకారంబుదాల్చి యేతెంచి–తనదుచేతఁ–దానారగించినప్రసాదంబు గృపసేసి – పరమయోగివిలాసమనఁగ – కాసారయోగీంద్రాది కథలు జానుగా సిరికిని, సపరివారుండైన యట్టి తనకును, అంకితంబుగ- పనుపడ ద్రవిడ ప్రబంధంబు చూచి–తెనుఁగున-ద్విపదరూపమున' రచియింపుమని కోరఁగా విని మేల్కాంచి 'యలమేలుమంగను ననుపమ శ్రీ వేంకటాధీశుఁదలఁచి' వారి కంకితముగా నీ కృతిని గావింపమొదలిడెను. గ్రంథాదియందే 'శ్రీవేంకటేశసంశ్రితకుచదేశదేవేంద్రవినత నాదిమవచోనుత - వరకృపాపాంగ శ్రీయలమేల్మంగను- శ్రీవేంకటాధీశుఁ జిరకృపావేశు దేవాధిదేవుఁ' దలఁచి–'భూనీళలఁ దడవి యాచక్రజలజకౌమోదకీ శార్ఙ్గఖడ్గముల దిరమొందు భక్తి నుతించి-యనంతగరుడ విష్వక్సేన కరుణయుంబడసి–తన యాచార్యుని 'శ్రీకరవైష్ణవ సిద్ధాంత విభవపాకశాసనుఁ దాళ్ల

పాకశాసనుని యాచారవిజితామరాచార్యుఁ దిరుమలాచార్యుని, పరమార్యు వాధూలపతినప్పగారిని, మఱియు పూర్వాచార్యులగు రామానుజాచార్యులను, మహాపూర్ణులను, ఆళవందారులను, రామ మిశ్రులను, పుండరీకాక్షులను, నాథమునులను, పరాంకుశమునులను-[1] ఇఁకను 'ద్రావిడాగమసార్వభౌములగు' తన (వంశము) వారలను ఆళువారలను, నిఖిలముక్తౌఘంబు, నిత్యవర్గంబు, నఖిలభాగవతుల

1. తిరుమలాచార్యుఁడు :- పరమయోగివిలాసకర్తయగు చిన్నన్నకు తండ్రి.

వాధూలపతినప్పగారు :- కందాడప్పగారు. కందాళ అన్నం గారు (కందాళ అప్పన్నంగారు) వీరి తండ్రి. వీరిది వాధూల గోత్రము. ఆపస్తంబ సూత్రము యజుశ్శాఖ. గోత్రమును బట్టి వీరికి వాధూలపతినప్పగారని యిందున్నది. తండ్రియు, కుమారుఁడును ప్రసిద్ధ వైష్ణవాచార్యులు. తెనాలివారి పాండురంగమాహాత్మ్య కృతిపతియగు విరూరి వేదాద్రి మంత్రికాచార్యుఁడగు 'ఆళవందారు కందాళ అప్పగారు'ను, సారంగు తమ్మయ్య కవికి గురువగు 'కందాళ అప్పగారు'ను, ఈ వాధూలపతి నప్పగారును ఒక్కరే.

రామానుజాచార్యులు :- పరమాచార్యులు, ఉడయవరులు, విశిష్టాద్వైత మత సిద్ధాంత ప్రతిపాదకులు.

మహాపూర్ణులు :- పెరియనంబిగారు.

ఆళవందారు :- యామునాచార్యులు.

రామమిశ్రులు :- వీరికే మణక్కాల్‌నంబియనియు పేరు. నాథమునులకు ప్రశిష్యుఁడు. పుండరీకాక్షునకు శిష్యుఁడు. యామునుఁకు ద్వయ మంత్రమును ప్రబోధించిన వారు.

పుండరీకాక్షులు :- నాథమునుల శిష్యులలో నొకరు.

నాథమునులు - కొట్టై కులమునకుఁ జెందిన ఈశ్వరభట్టరను వారి కుమారులు. యామునాచార్యుని తాతగారు.

పరాంకుశముని :- ప్రసిద్ధులు. నమ్మాళ్వారు.

నాత్మలోఁ దలఁచి' వేంకటాచలపూర్ణుని, కురువనంబిని, తొండమాన్ చక్రవర్తిని, భట్టరాచార్యవర్యుని, అనంతాళ్వారులను, శఠకోపము నులను, కృష్ణమాచార్యులను, తాళ్లపాక అన్నమాచార్యులనుఁ[1] దలఁచి యంజలిచేసి దత్ప్రసాదంబుకలిమిని తిరుమలాచార్య వినుతనంద నుఁడగు తిరువేంగళనాథుఁడను పేరి చిన్నన్న నమ్ముఁడై యుడుత భక్తిని, 'సామజబృందంబు చనుదెంచు త్రోవఁ జీమలపంక్తి వచ్చిన విధంబునను' పూర్వాచార్యుల మార్గముననుసరించి తత్పాదకమల సేవకుఁడై' తానీకృతిని 'జలజాతవాసిని చనుబాలపుష్టి' చే సమకూర్చు కొన్న కవితాశక్తి చేత గావించెను.

---

1. వేంకటాచల పూర్ణులు :— యామునాచార్యుని పౌత్రులగు తిరు మలనంబి వారికే శ్రీశైలపూర్ణ, మహాపూర్ణ నామము లున్నవి. వెంకటా చలపూర్ణులు వీరే కా దగుదురు.

కురువనంబి :- ఒక కుమ్మరి. విష్ణుభక్తుఁడు. శ్రీనివాసుని బంకమట్టి పూవులతో నర్చించి ధన్యుఁడైన వ్యక్తి.

తొండమాన్ చక్రవర్తి :- తొండమండల స్థాపకుఁడు తంజాపూరి చోళరాజునకును, నాగ కన్యకకును కలిగిన 'ఆదొండైకే' తొండమాన్ చక్ర వర్తి అనిపేరు.

భట్టరాచార్యులు ;- ప్రసిద్ధ వైష్ణవాచార్యులగు పరాశర భట్టరు. కూరేశభట్ట, భట్టసూరి ప్రభృతి నామాంతరములు గలవారు.

అనంతాళ్వర్లు :- శ్రీ రామానుజుల వారి ముఖ్య శిష్యులలో నొకరు. తిరుమలమీఁద నివాసమేర్పరచుకొని పూఁదోటలను పెంచి స్వామి వారికి మాలాకైంకర్యము జరిపించిన వారు.

శఠగోప ముని :- నమ్మాళ్వారు (= పరాంకుశ ముని) ని దలఁచి యుండుట చేత వీరు అహోబలమఠ ప్రతిష్ఠాపకులు కాఁదగుదురు.

కృష్ణమాచార్యులు :- సుప్రసిద్ధ వచన సంకీర్తనాచార్యుఁడు

అన్నమాచార్యుఁడు :- పదకవితాపితామహుఁడు, చిన్నన్నకు తాత గారు.

**కావ్యకథారంభము** : నారదముని చెప్పినట్టి "యాదవశైల మాహాత్మ్యము'న గల తెఱగునను, భాగవతమందు పూర్వాచార్య కథితమైన విధమునను, వృద్ధపాద్మంబునఁ బద్మ తెఱఁగొప్ప సూత్రవతికిఁ జెప్పిన' తీరునను చిన్నన్న 'పరమయోగివిలాస' కావ్యకథనారంభించుచున్నట్లు చెప్పుకొనెను. శ్రీహరిరాజధానియగు అయోధ్యానగరమున "లుంఠిత సంసారలోల శోకంబు' కుంఠితాఘంబు వైకుంఠంబు గరమొప్పు భువన మాగమసన్నుతంబై నిరతిశయానందనిలయమై" యొప్పుచుండెను. అట్టి వైకుంఠనాధు నివాసమున 'అగణితమణిమయంబై వేదవిదితమగు సహస్రస్తంభమను మంటపమున'గల సింహాసనమున శేషుని భోగంబునందు అఖిలశేషియును గురుతరుండును నిరంకుశ మహోదయుఁడు పరమేశ్వరుఁడునైన పద్మావిభుండు నెమ్మితో శ్రీభూమినీళలంగూడి నెమ్మోము చక్కినవెన్నెలవ్వు చిలికించుచుండెను. ఆస్వామికి విమలాదిసతులు వింజామరములు వీచుచుండిరి. అనుగ్రహ బంగారుకుంచియ వైచుచుండెను. అనంతుఁడా పొంతను, పతీంద్రుఁడొక వంకను, విష్వక్సేనుఁడు వేరొక ప్రక్క భజింపుచుండిరి. చండకుముదాది నిత్యులును, కుంజిరాస్యాది ఘనులును చెంతలనూడిగంబువారలై యుండిరి. పార్శ్వముల పంచాయుధంబులుప్పొంగి సన్నుతులుగావించుచుండఁగా నిత్యులును, ముక్తులును, నిగమసంతతులు నెలమిజంకలఁ జేతులిడి కొల్చుచుండిరి. అట్టియెడ సర్వశేషియగు జగదీశ్వరుని సర్వశేషిణియగు నిందిరాదేవి యొక ప్రశ్నకు సమాధానమపేక్షించును.—

"నిఖిల జీవులనెన్న నీ శేషభూతు లఖిల జీవులకు నీవయ్య వట్లయ్యుఁ
గొందఱ విగతదుఃఖులఁ జేసి మఱియుఁ గొంద రవిహతదుఃఖులఁ జేయ
దగునె
జాడతో దేవర సకలజీవాళి నీడేర్పువిధము నాకెఱిఁగింపుమయ్య"

అని. దానికి సమాధానముగా నిందిరావిభుండు తానుధరలోన నానావతారములు దాల్చి యున్నట్టివేళ కొందఱు శత్రుగాఁ గొందఱు మిత్రుఁగా గొందఱు రాజుఁగాఁ గొందఱు బాలుగా నిట్లనేకరీతుల తన్ను గోరియుండుదురనియు; నట్టి ప్రాకృతులకు తనువు

లింద్రియములిచ్చి తన్ను గొల్వుఁడన్నను అజ్ఞులై ఇధ్మములఁ దేనిచ్చిన కత్తిఁ గొని యాలతోఁకలుగోసినరీతిఁ దను గొల్వ నిచ్చిన తనువులు దాల్చి యనయంబు విషయాసక్తులై యుండుదురనియు; అట్లు వర్తిలెడి జీవుల నుద్ధరించుటకే వారి కంతర్యామియగుచు శ్రీరంగాది దివ్యదేశముల నర్చావతారంబు లంగీకరించి యర్చనా సుముఖుండై యుండుదుననియుఁ దెల్పి — యింటఁ బెంచిన యిఱ్ఱిఁజూపి కానలో నిఱ్ఱులఁ గైకొన్నకరణి నరయ సజాతీయులగు వారిచేతఁ జిరజీవతతుల వశీకరింపనెంచి యా సహాకారమునకై శ్రీభూమీనీళాయుధపారిష దాది పరిసరవర్తులను భూలోకమున పెక్కు దేశముల పెక్కు వర్ణముల వెలసి పెక్కుభాషల పెక్కు గబ్బములనేర్చి వదరక భక్తిప్రపత్తి మార్గములఁ బదవుల నొందించి భవంబులడంచి పరమార్థమగు పరాత్ప రుఁడని తన్ను నరయంగఁ జేయుఁడాయని నియోగించెను.

"సర్వాధికారముల్ సకల వేదాంత నిర్వాహకంబులు నిగమరూపములు
నతుల సద్గుణ వర్ణనాలంకృతములు నతులముల్ ద్రవిడ భాషానురూపములు
గేయముల్ నిత్య సంకీర్తనాత్మకములాయత రసపోషణానుభావ్యములు
నగుచు నొప్పఁగఁజేసి"

జగతికి భక్తిప్రపత్తు లలవరుపవలసినదని ముదలయిడెను. ఆయా దేశానుసారము శ్రీభూమీ నీళాయుధ పారిషదాది పరిసరవర్తులు ద్రవిడదేశమున నవతరించి శేషాచల శ్రీరంగాది ముఖ్యదేశముల నర్చావతార రూపములఁదాల్చి భక్తసంతతులఁ బ్రోచుచుండిన పర మాత్మునెడ భక్తి ప్రపత్తులను ప్రజలలో నంతకంత కధికముచేయ సాగిరి. వారెల్లరు ద్రావిడ దేశముననే యవతరించి వేదములకు ద్రావి డత్వ మొనరించుటకు హేతువేమని శ్రీదేవి నారాయణుని ప్రశ్నింపగా దాని కాదేవుఁ డిట్లు సమాధానమిచ్చెను. హరపార్వతీ వివాహమును జూడఁగోరి కాశీనగరమునకు సురలు మునీంద్రు లేతేరగా నాభారమున కుత్తర భూభాగము క్రుంగెను. దానియొరఁగు దిద్దంగ కుంభతన యుఁడు వలదిక్కు కడకుఁ బోవలయునని విశ్వకర్మ వెల్లడిసేయును. దానికి నొచ్చుకొని కుంభతనయుఁడు 'శావకాన్వయులకును బని యధి

కంబు నల్పంబు కూలియగునుగా' కని విశ్వకర్మను శపించును. దానికి కుంభజన్మునిమీఁద కనలి 'నీవు తాల్చినయట్టి నిగమసంతతులు ద్రావిడ రూపముల్ తాల్చుగా కనుచు' విశ్వకర్మ ప్రతిశాపమిచ్చెను. పర్యవసానముగ కుంభతనయుఁడు దక్షిణోర్వికిఁ బ్రయాణమై వెయ్యి న్నిన్నూఱు దివ్యసమములు విష్ణునిగూర్చి తపమొనరించి తన వేద ములకు విశ్వకర్మ శాపాయత్తమైన ద్రావిడత్వము కల్గుటనుగూర్చి విన్నవించుకొని విచారించును. అపుడు విష్ణుఁడు ప్రసన్నుండై 'ద్రావి డత్వ మొనరిన శ్రుతులె సర్వోన్నతత్వంబు గలిగి మదీయ భక్తశ్రేణి చేత వెలయునట్లుగఁ జేసి వివరింతు'నని వరంబిచ్చియుండెను. తత్కారణ మునసే వారు ద్రావిడ దేశములం దవతరించి, ద్రావిడ వేదముల సవ రింపవలసెనని నారాయణుఁడు విశదీకరించెను. తదనుసారమే ఆళ్వా రాచార్యాదులు ద్రవిడదేశమున నవతరించి ద్రావిడ వేదరచనమున కును దాని వ్యాపకత్వమునకును బాటుపడి విష్ణుమత సర్వోత్కృష్ట తను జగద్విఖ్యాతము గావించిరి. ఆ పుణ్యపురుషుల యవతార చరిత్ర కథనమే ఈ గ్రంథమందలి యితివృత్తము.

*పరమయోగివిలాసకావ్యేతివృత్తము :* ఈ కావ్యమున గల యెనిమిది యాశ్వాసములలో

ప్రథమాశ్వాసమున :— కృత్యాది గ్రంథ కథారంభ వివరణముతో మొదలాళ్వారుల ముువ్వురి వృత్తాంతమును,

ద్వితీయాశ్వాసమున :— భక్తిసార, కణికృష్ణుల వృత్తాంతమును,

తృతీయాశ్వాసమున :— నమ్మాళ్వారు, మధురకవి యాళ్వారు, కులశేఖరాళ్వారు, తిరుప్పాణాళ్వారు ప్రభృతుల వృత్తాంతమును,

చతుర్థాశ్వాసమున :— విప్రనారాయణుల వృత్తాంతమును,

పంచమాశ్వాసమున :— విష్ణుచిత్తమునులయు, గోదాదేవియు వృత్తాంతములును,

షష్ఠాశ్వాసమునను } తిరుమంగై యాళ్వారుల వృత్తాంతమును,
సప్తమాశ్వాసమునను }

అష్టమాశ్వాసమున :- యామునాచార్య, రామానుజాచార్యాదుల వృత్తాంతములును,

విపులాతివిపులముగా ప్రపంచింపఁబడినవి. ద్రావిడ గురువరంపరాప్రభావము సవిస్తరముగ ప్రస్తరింపఁబడిన తొట్టతొలి తెలుఁగు గ్రంథమిది యనవచ్చును. ఆచార్య సూక్తిముక్తావళి మున్నగునవి యాతరువాతివే. విశేషమేమన నిదియాళ్వారాచార్యుల జీవితవిశేషములతోఁబాటు వారివారి రచనలను, సందేశములను, ఎడనెడ వారి రచనల యనువాదములను కూడ కూర్చుకొని దివ్యవైష్ణవ భావసంపదకు తుల లేనిగనియై, విజ్ఞానసర్వస్వమై, తన్మతప్రచారకగ్రంథమై, దేసి తెనుఁగున ద్విపదరూపమున పాడుకొనుటకు వీలుగా రచితమై యున్నది. ఇది ద్రావిడగురుపరంపరల కనువాదరూపమగు రచనమైనప్పటికిని, తెలుఁగున వైష్ణవ సాహిత్య సౌరభమును చవిజూపిన పుణ్యపురుష జీవితకథా ప్రగ్రథిత దివ్యసుమదామము. ఈ యాళ్వారాచార్యులజీవితవిశేషములు వైష్ణవమతవికాసమునకు మూలములగుట చేత వానిని మనమించుక వివరముగా పరిశీలించుటవసరమే కాగలదు.

మొదలాళ్వారులు - సరోనామయోగి ఆశ్వయుజ శ్రవణమున జననము

పన్నిద్దరాళ్వారులలో సరోనామ, భూతనాథ, మహదాహ్వయులనుమువ్వురిని మొదలాళ్వారులందురు.[1] వీరిలో సరోనామ యోగి ప్రథమయోగి. వీరు

---

1. మొదలాళ్వారులు ;- (అ) సరోనామయోగి; వీరికే పొయ్గై యాళ్వారు, కొళత్తాళ్వార్, కాసారయోగి, ఆదియోగి, దీపముని, ప్రథమయోగి, శ్రవణముని, పద్మయోగి, పాంచజన్యాంశయోగి మున్నగునామాంతరములున్నవి —

(ఆ) భూతనాథ :— వీరికే భూతత్తాళ్వార్, ద్వితీయ యోగి, మల్లాపురయోగి, ఉత్పలముని, గదాంశయోగి మున్నగు నామాంతరములు.

కాంచీ నగరమందలి వరదరాజస్వామివారియాలయప్రాంతమందుండిన కాసారమున జనించిరి, స్వామివారి పాంచజన్యాంశము వచ్చి యచటి పసిడి నెత్తమ్మి గర్భము ప్రవేశింపఁగా కాసారలక్ష్మికి గర్భ చిహ్నములు కానవైనవి. కొంతకాలమునకు హరి నాభి నుదయించు నజుని చందమున 'హరితారనాశ్వయుజాఖ్యమాసమునఁ గాంచనపంకజ గర్భంబునందుఁ బాంచజన్యాంశముద్భవమయ్యె'ను.[1] ఆ యోగి రవి యుదయముతో నజ్ఞానాంధకారమణగిపోయినది. కమలాక్షుడపుడు కమలవాసిని యైన కమలతో వచ్చి భ్రమర పంక్తులతోఁ దూగు రమణీయమైన సారసపు దొట్టెలను వేదనాదంబు గావించు బాలకుని చూచి గైకొని లాలించి పోషించిరి. వారే వీరికి సరోనామ మొసగి 'జీవుల నెల్ల రక్షించి వేదంబు త్రోవకు తెమ్ము తనయ! నీ యండ మేమును నిలచెద'మని ఆ యోగి డెందమున నెలకొని యుండిరి. సరోనామ యోగియు నిండారు వేడ్కతో నిఖిల దేశముల నిచ్చా విహారములు సల్పుచు దైవ కార్యమును నెరవేర్చుచుండిరి.

2. భూతత్తాళ్వారు :— సరోనామ యోగి జనించిన మరు నాడే అనఁగా ఆశ్వయుజ మాసమున (వసుతార) ధనిష్ఠానక్షత్రమున సముద్రతీరగ్రామమగు మల్లాపురమున కౌమోదకీ దివ్యశక్తి మయుండైన ద్వితీయయోగివరుండు నీలోత్పలాంతంబునందు జనియించెను.[2] ఇందిరాసహితుఁడై శౌరి యాబాలునకు సత్వగుణమనుపాలును

---

(ఉ) మహదాహ్వయయోగి :— వీరికే పేయాళ్వారు, మహాయోగి, తృతీయయోగి, భక్తిసారగురు, మయూరపురముని, శతభిష యోగి, కూపముని, కైరవకూపముని మున్నగు నామాంతరము లున్నవి చూ పరమయోగి - టేబిల్ 14.

1. సరోనామయోగి:-'తులాయాం శ్రవణే జాతం కాంచ్యాం కాంచన వారిజాత్ । ద్వాపరే పాంచజన్యాంశం సరోయోగిన మాశ్రయే' - చూ, పరమ. టేబిల్ 15. (వేదాంత దేశికులవారి శిష్యులగు బ్రహ్మతంత్ర స్వామి వారి రచన).

2. భూతత్తాళ్వార్ :- తిరుక్కడల్ మల్లై యను ద్రావిడ నామము

హరిభక్తియను స్నేహమును మేళవించి యుగ్గుబోసి పోషించెను. భూతతతిని సంస్కృతి సముద్రముఁ దరింపఁగఁ జేయును గాన వారాతనికి భూతత్తాళ్వారులని నామమిడిరి. అసురప్రకృతి చేత నజ్ఞానులగువారి కాత్మవిద్యోపదేశము చేయుచు ముకుందుఁడు తోడు నీడై యుండఁగా నాయోగివరుఁడు మోదముననుండెను.

3. మహదాహ్వయముని :— అశ్వయుజ మాసముననే సముద్రాగారతార (శతభిషానక్షత్రము) న మయూరాహ్వయ పురియందలి లతికాప్రహదంబను కొలంకున రత్నకైరవాంతమున [1] శ్రీ నందకాంశమై చెలువొందు నీయోగి యవతరించెను. ఆ బాలుని జగదేకమాతయు జలజాతుఁడను గడు నెయ్యమునఁ బెంచి పెద్దలకెల్ల పెద్దయై జగతి దీపించును గాన మహదాహ్వయంబతని కొసఁగిరి. అయ్యోగి హృదయాంబుజాతమున నయ్యాదిదంపతులు నెలకొని యుండిరి

ఇట్లు ఆశ్వయుజ మాసముననే వరుసఁగా శ్రవణము, ధనిష్ఠ శతభిషా నక్షత్రములయం దీయోగిపుంగవులు ముప్వురును ద్రావిడ దేశమున మూఁడు తావులందు జన్మించి పరిపూర్ణ చిత్తులై బ్రహ్మ విన్యస్త భరులై- తముఁ బోలినట్టి యుత్తములైన యోగితములెవ్వ రని దేవతామందిరముల, నదుల, దేశముల, నానాతీర్థములను వెదకుచు

---

గల మల్లాపురమున నీ యోగివరుఁడు అత్తిపువ్వునందు పరిమళమువలె నవతరించినట్లు కొన్ని యాధారగ్రంథములందున్నది.

(P. 5 ఆళ్వారాచార్యుల చరిత్రము. కర్త. టి. లక్ష్మణాచార్య) కాని యిందు 'నీలోత్పలాంతంబునందు' జనించినట్లు గలదు.

'తులాశ్రవిష్ఠా సంభూతం భూతం కల్లోలమాలినః
తీరే ఫుల్లోత్పలే మల్లాపుర్యా మీడే గదాంశకమ్'

(బ్రహ్మతంత్రస్వామిరచన)

1. 'తులాశతభిష గ్జాతం మయూరపురి కైరవాత్
మహాంతం మహదాఖ్యాతం వందే శ్రీనందకాంశజమ్'

(బ్రహ్మతంత్రస్వామి రచన)

నుండిరి. ఆ ముప్వురి మూలమున లోకము నావరించిన యజ్ఞాన మోహాతిమిరము నగలింపనెంచి పద్మాక్షుఁడుండెను. ఒకతూరి వారు ముప్పురును దేవనగరినగుచుండు వామన క్షేత్రము (దీనికే తిరుకోవలూరని ద్రావిడనామము.) న గలిసికొనిరి. వారు పురోపకంఠమున నునికి చేసికొనియుండగా నిశివేళ వనజోదయము లేని వానయారంభమై పెచ్చు పెరిగి, వడగండ్లతో జోరు జోరుగ కురియసాగెను. ఆవేళ ఆదియోగీంద్రుఁ 'డొకనికి గూర్చుండి, యుండఁగఁ జాలునొక చిన్న గేహాళియుండంగఁజూచి' యందు ప్రవేశించెను. పిదప రెండవ యోగియు నటకే విచ్చేసెను. అప్పు డాదియోగి 'చనుదెంచి తేటికీ సంకటస్థలికిఁ జినుకునకోడి యాసీనుండనగుచు నే నుండి తిరువురమిట మీఁద నిలిచియైన యుండుదము రమ్మని చేరఁబిలిచిన నిరువురును నొకరీతి నొదిగికొనియుండిరి. అంతలో మూఁడవ యోగియు నట కేతేర 'ఒకనికి శయనించి యుండరా దిచట. - నొక రీతి నొదుగుచు నొదుగుచు మేమయీాలోన నున్నార మిరువుర మిప్పు డీలోన జను తెంచి తీవు నిచ్చటికి' అని యట్లే ఒండొరులకు మన మొద్దికై సదరు కొందము రమ్మంచు' నా యిరువురు మూఁడవవారినిగూడ చేర్చుకొని యా గేహాళిలో నిలచియుండిరి.[1] అపుడు యోగి హృదయంబు నరసెద ననుచు తలపోసి తపసిడెందపుసందడీడు గణియంబు లోలిఁ బ్రక్కల నున్న చెలుకు గణికల నొత్తిడిగావించుపగిది కక్కసమున నక్కడ నున్న వారి నడుమ నొత్తెంచి నొత్తిడిచేయసాగెను. తన రూపు చందంబు డాచి నడుమ నిఱకెడి యాతఁడెవ్వఁడో తెలియఁగోరి ఆది యోగి నిచ్చలంబగు భక్తిని డెందమున నిలిపి 'ధరణి పంతియ, సముద్రంబులు నేయి యరుణు దీపముఁ జేసి' నీరజాతునకు నీరాజన మిచ్చెను. రెండవయోగి యతనిపైఁ 'ప్రేమపంతియ, మితిలేనిభక్తియే చమురు, నానందభరిత హృదబ్జంబె వత్తిగా' నొనరించి జ్ఞానంబు

---

1. ఈ సందర్భమున ఆధార గ్రంథములందు 'ఒరువర్ పడుక్కలామ్, ఇరువర్ ఇరుక్కలామ్, మువ్వర్ నిరుక్కలాం' (ఒక్కరు పరుండ వచ్చును ఇరువు రుండవచ్చును ముప్పురు నిలుచుండ వచ్చును.) అని పోయ్గై యాళ్వారులు చెప్పినట్లున్నది.

దీపంబు జేసి పెరియ నారాయణా ర్చితము గావించెను. అపుడు అంధ కార ష్మణగెను. మూడవ యోగి తనదు ముందరనుఁ ప్రత్యక్షమై నిలువ

"సిరిగంటిఁజెన్ను మించిన మేనుగంటి గరమొప్పు వదనవికాస ముగంటి
సల్లలితావనీస్త న కుంభకుంభపల్లవంబుఁబోలు పాదముల్గంటి
సరసిజహాల శంఖచక్రాంకిత కాంక చరణముల్ జగదేకశరణముల్గంటిఁ
దరణిబింబము చాయఁ దరశించు కనకసురుచిరాంశుక మునంశుకముఁ
గన్గొంటి
శ్రీమించుకటికట శ్రీసతీవరణ దామముల్ మేఖలాదామముల్గంటి
వాత్సల్య జలధి కైవడి నొప్పుచున్న వక్షంబుగంటి శ్రీవత్సంబుఁగంటిఁ
జుట్టుగెదువువలచుట్టు శంఖంబు పట్టి చూపట్టిన బాహువుల్గంటి
శాతాఁకు మండలశతకోటికోటిరీతిఁ జూపట్టు కిరీటంబుఁ గంటి
మలఁగు లైతె తెల్లదామరలఁదామరల గలహించు నిడువాలుగన్నులఁగంటి
మకరకుండల కాలమార్తాండరుచుల వికసించు వదనారవిందంబుగంటి"

(పరమ - పు 38)

నని భక్తి పారవశ్యమున ఆపాదమస్తకము స్వామిని దర్శించి సంస్తుతింప సాగెను. అది విని తొలి యిరువురు యోగులునట్లే సర్వ మయుని వీక్షించి మ్రొక్కి యానందపరవశులైరి. 'ఆ నందసుతు రూప మపుడు దర్శించి యానందపరవశులగుచు నుప్పొంగి యంతాదు లను పేర నలరు ప్రబంధ చింతామణులు ముక్తిఁ జేర్చు నిచ్చెనలు వేద రూపములు గావించిరి మూడు.'[1]

---

1. మొదలాళ్వారుల రచనలను అంతాదు లందురు.
సరోయోగి - ముదల్ తిరువన్దాది 100 పాశురములు.
భూతత్తాళ్వారు - ఇరణ్డామ్ తిరువన్దాది 100 పాశురములు.
మహాయోగి - మూన్ఱామ్ తిరువన్దాది 100 పాశురములు.
మొత్తము 300 పాశురములు.

వేదాంత వేద్యుఁ డా విశ్వమయుఁడు ఆత్మ స్వరూపుఁడై వెలుఁగ నా యోగినాథులు దివ్యయోగ సామ్రాజ్యభోగులై భువిఁ జరింపుచు నుండిరి ఇదియే ఈ మొదళ్వారులఁ గూర్చిన కథ.

ఈ ముప్పురి చరిత్రలందును తాత్త్వికమగు సాంకేతికత కొంత గోచరమగుచున్నది. వీరు ముప్పురును క్రమమున పాంచజన్య కౌమోదకీ నందకాంశజులు. ఇందు శంఖము సాత్త్వికతకును, గద తామసమునకును, కత్తి రాజసమునకును సూచకములు. వారు పొత్తామర నీలోత్పల రక్తోత్పలములందు జన్మించినట్లు చెప్పఁబడిన యంశము నందును తద్వర్ణములను బట్టి యీ త్రిగుణ స్వరూపములే చిత్రితములైనవి. ఆ ముప్పురును మూఁడు గుణములకు ప్రతీకములు. వారు త్రిగుణాతీతుఁడగు నాత్మస్వరూపుని కనుగొను ప్రయత్నమున తొలి యోగి భక్తిని, మఱియోగి జ్ఞానమును నాధారముగఁ గొనిరి. కాని తదాత్మ స్వరూపదర్శనానుభూతి భక్తిజ్ఞాన మార్గముల నవలంబించిన తొలియిరువుర కన్నను సర్వాత్మ సమర్పణము గావించుకొని తన్మయులై యుండిన మూడవయోగికే అధికముగా లభించినది. అది ప్రపత్తి మార్గము. జీవునకు భగవద్దర్శనానుభూతిని దార్చునది ప్రపత్తిమార్గమే. ఈ విషయమే మొదలాళ్వారుల చరిత్రమున వ్యంజితమగుచున్నది.

*4. భక్తిసారయోగి* : వీరు పన్నిద్దరాళ్వారులలో నాలుగవవారు. చతుర్థ కులజులు. తిరుమళిశైయాళ్వారులనియు హరిపాద యోగి యనియు ప్రఖ్యాతిఁ జెందిన వారు.[1] సుదర్శన చక్రాంశజులు.

---

1. తిరుమళిశైయాళ్వారులకే చతుర్థయోగి, మహీసారయోగి, అక్షపాదయోగి, భార్గవముని, దీక్షితపోముని, చక్రాంశయోగి, హరిపాదముని, ఊర్ధ్వ పుండ్రముని, శబరయోగి, యాగముని, మంత్రముని, సిద్ధిముని, శాక్యజిద్యోగి, పన్నగయోగి, తేజోయోగి, జ్వాలాముని, గుహాయోగి, తీర్థయోగి, మఖాయోగి, వేత్రకుంజయోగి, కణికృష్ణగురుముని - మున్నగు నామాంతరము లనేకములున్నవి.

అతుల లగ్నమున మఘతారకను పౌష్యమాసంబునందు వీరి లోకమున నవతరించిరి. వీరు మహామహిమోపేతులు.

"శరణొందు భక్తిమై నీ భక్తిసారు చరితల నీ ధరాస్థలి నెవ్వఁడేని
కృతియొనర్చిన యట్టి కృతకృత్యమతికి హితబుద్ధిఁ బ్రతిదినంబెన్నువారలకు
వినిన వ్రాసినఁ జదివిన వారికెల్లను ననుపమదీర్ఘాయు రైశ్వర్యతతులు
నకళంక శుభములు నభిమతార్థములు సకలసిద్ధులుఁ గరస్థలినుండు నెపుడు"

అట్టి యా యతిపాదుని యా బాల్యమహిమములను భక్తులు వేయి విధముల నీ రీతి వివరించి సంస్తుతింతురు—

భజనము;- "ఓ సుదర్శనమూర్తి యురుతపోరాశి
రాసికి నెక్కు భార్గవమునీంద్రునకుఁ
బొడమి యీ ప్రాకృతభోజ్య వస్తువులఁ
గుడువక హరి దివ్య గుణ సుధారసముఁ
గ్రోలుచు (నున్న నీ మహిమ వర్ణింపనేర్తుమే)

పుడమిఁ గాంచికి తూరుపునఁ బయోరాశి పడమట సర్వసంపదఁ జెన్నుమీరు మహీసారమను పుణ్యక్షేత్రమున భార్గవుఁడను ముని— పుడమిపైఁ బోకయిడి—ఆ పోకపై సూదియిడి—దానిపై పాదమూని బహుకాలము తపమాచరించెను. అతని తపోవహ్నికీలలు మిన్నుముట్టి వాసవలోకమంటగా వెఱపుఁ జెంది యింద్రుఁడాతని తపము చెఱచుటకై కనకాంగి యను నచ్చరకన్యను బంపును. ఆమె తన విలాసమను చొక్కుఁజల్లి యాతని తపోధనము చూఱగొనును. గాధిసుతుఁడు మేనకను గలసిన కరణి నాభార్గవమౌని కనకాంగిని కవయును కడలిలో నుప్పు నడవిలో నుసిరికాయయుఁ గూడినట్లు వారిరువురు నేకము కాఁగా కనకాంగికి సద్యోగర్భమున సుదర్శనాంశజుఁడు పుష్యమాస

"మఘాయాం మకరే మాసే చక్రాంశం భార్గవోద్భవమ్
మహీసార పురాధీశం, భక్తిసారమహం భజే"
[శ్రీమత్తంత్రిస్వామి రచన)

మున మఖా నక్షత్రమున జన్మించెను. ముని తీర్థయాత్రల కేగెను. కన కాంగి కొమరు నొక వేత్రకుంజములోన నిడి దివి కేగెను. ఆ బాలుఁడు సామవేదనాదముల విలపించుచుండఁగా మహీసారక్షేత్రనాథుఁడు తన కటాక్షామృత ధారలచేత నాతని సేదదేర్చి యాదరించెను. ఆ వెంట హరిదాసుఁడను వేణులావకుఁడొకఁడు వెదుళ్లు కోసికొనుచు బాలుని యేడ్పువిని వెదకి యింటికిఁ దెచ్చుకొని పెన్నిధిగన్న పేదచందమున మురిసి పెంచుకొనెను. ఆ బాలుఁడు హరిపదధ్యానామృతాహార లహరి బరితృప్తిఁ జెంది ప్రాకృతభోజ్య వస్తువులేవియు ముట్టక పెరుగ సాగెను. తలిదండ్రు 'లరయవీఁడు దయ్యముగాని భూమివారి బిడ్డల వంటివాఁడే' అనుకొనియు నల్లారుముద్దుగా చూచుకొనిరి. ఆ బాలుఁడు పసితనమునుండియు మహిమలను బ్రదర్శించుచుండెను.

> "... వృద్ధులు గొని వచ్చినట్టి పాలు గైకొని భక్త పరతంత్రబుద్ధి
> సగమారగించి వాత్సల్యంబు తోడ సగము వారలకుఁ బ్రసాదించి కరుణ
> వారికి మరల జవ్వనము గాఁజేసి ధారుణి పొగడ సంతానంబు నొసగె"

ఆ బాలుఁ డట్లు ప్రాకృత వస్తువులను ముట్టకయే చిక్కక నలుగక చెలువగ్గలించి పెరుగుట కచ్చెరువంది యూరివారు వచ్చి చూచి పోవుచుండిరి. ఆ నగరినే వృద్ధుఁడగునట్టి పుత్రహీనుఁడొక్కరుఁ[1] డావార్తవిని యాతఁడె దైవమని నమ్మి 'ఒక సోలనేయి పాలునొక చేరెడన్ని' కొనివచ్చి యారగింపుమని వేడుకొనఁగా సగమారగించి నిశ్చలదయాదృష్టి సగము వారలకు ప్రసాదించెను. ఆ వృద్ధదంపతులా పాలను గొనినతోడనే వారికి యవ్వనము ప్రాప్తించినది. పిదపవారికి చక్రపరిచరాంశజుఁడగు కణికృష్ణుఁడను పుత్రుఁడు కలిగి పెరిగి పెద్దవాఁడై ఆదివ్య పురుషునికడనే శిష్యుఁడై ప్రవర్తిలుచుండెను. కణికృష్ణు నాదరించిన ఆ గురూత్తముని మహిమనెన్న నెవరికిని శక్యము గాకుండెను.

---

1. ఆధారగ్రంథములందా వృద్ధుఁడు దృఢవ్రతుఁడను నొక శూద్రుఁడుగా వర్ణితుఁడు. ఇందు కవి యాతని కులగోత్రముల ప్రసక్తిని గొనిరాఁడు. మన మూహించుకొనవలసినదే.

పరయోగి సామ్రాజ్యవైభవశ్రీలఁ బరమాత్మ విశ్వరూపము విలోకించి ౧
శ అకలంకుఁ డెరగలి కనుచూపుమగుడ సకలకాల నయన సహస్రములు జూపి ౨
కొంకణు రసపాద ఘుటికను బావ పంకజరజముచేఁ బరిహసింపుచును ౩
నీరజభవుఁ డయోనిజుఁడైన యోగి ధారుణీవిభుని బాంధవమాచరించి ౪
శ్రీ వేంకటేశదగ్ధత సుధాసార భావిత కుండంబు పరికించి కాంచి ౫
కణికృష్ణు నిజశిష్యుఁగాఁగఁ జేపట్టి గణుతింప ముదుసలిఁ గన్యఁగావించి
జగములు గొనియాడ జగదేకనాథుఁడగు ఫణిశాయి తెమ్మని తోడుకొనుచు
ననుచరుండై వచ్చు నాదేవుమగుడఁ జనుదెంచి తొల్లింటి సరవిమైనుంచి ౬
కువలయప్రాణంబు కుంభకోణంబు భవనంబుగామన్న ఫణిరాజశయను
నేదదేరఁగ నుతిసేసి మెప్పించి యాదేవుతో మాటలాడి యంతటను
వడనహంకృత విప్రవరుల నాలుకలు పెడతలఁ బట్టించి భీకులై వారు
శరణుఁజొచ్చిన దివ్యసారస్వతంబు గరుణించి యాచోటఁ గందర్పగురుడు
కరమర్థిఁ బరివృత్త కంధరుండగుచుఁ గరిమతో నిముఁ బెక్కుగతుల వీక్షింప
బావనచరిత సాష్టాంగంబునలన దేవర యిటకు నేతెంచి నాపేయ
నగ్రపూజనము నీవంగీకరించి యుగజన్మల దురహంకారమెడయ
ననఘు గోవిందుఁ బ్రత్యక్షంబుచేసి కాని యాద్మలోనిడికొంటి వివ్వేళ ౭
యెన్న శక్యముగాని యిట్టి నీ మహిమ నిన్నును వర్ణింప నేర్తునే యేను"

అని భక్తిసారమునిని భక్తులు సంస్తుతించిరి. ఇందు పైన పేర్కొనఁబడినవన్నియు నాతని మహిమలు. వీనిలో నాధారగ్రంథములతో భేదించెడి మార్పులును గూర్పులును గల ముఖ్యములగు కథా విషయములను మాత్రము కొన్నిటిని పేర్కొందును

(౧) ఆ మునిపుంగవుఁడు యోగమార్గమున పరిపూర్ణత గాంచి వివిమతంబులైన సర్వసిద్ధాంతముల్ చర్చించి చూచి కాణాద గురుభట్టకపిలాక్షపాదపాణిని మిథ్యాప్రపంచ శాస్త్రముల లక్షించి చూచి యల్పములని పూర్వపక్షముల్సేసి యభంగవిస్ఫూర్తిన్ శుభ

కరవిష్ణుసిద్ధాన్త మూర్ధాభిషిక్తుఁడై[1] పొలిచి భక్తిసారుండనఁ బ్రఖ్యాతిఁ గాంచెను. విష్ణుండు నల యోగివరు డెందమను తమ్మిలోని మెలఁ దేటియై యుండుచుండెను.

(౨) ఇట్లు ఆ తపోధనుఁడు శ్రీహరిపదాయత్తచిత్తుఁడై యుండుచుండఁగా నొకనాఁడు పార్వతీ పరమేశ్వరులు వెలిగిబ్బనెక్కి యిచ్ఛావిహారులై మింట నేగుచు నటకు విచ్చేసిరి. ధరనున్న భక్తిసారుని తపోనిష్ఠను గాంచిన పార్వతి యమ్మహామహుని గతియుఁ దన్మహిమయుఁగ నిపోవలయు నని పట్టుపట్టగా శంకరుఁడామెను ముని వద్దకుఁగొంపోయెను. అట్లు వెడలి 'ఉడురాజమౌళినే నోమునిచంద్రా! అడుగు మిచ్చెదవరం' బనిరాజసతామసములుట్టిపడ శంకరుఁడు భక్తిసారుని వలుకరించెను — దాని కాముని నగుచు తన చెంతనున్న బొంతను మునుమున్నె చొనిపియుండినయట్టి సూదిచేఁబూని 'దారంబు నందీ యీదారంబు సూదిద్వారంబునందు సంధానింపఁనవుడు వరం బిమ్ము నీవు దేవరవైతివేని హర!' అని వేడెను. అంతట భవుఁడు రోషావేశభరితుఁడై తనతో కేరడమాడిన మునిపై నలిగి మూఁడవ కన్నువిచ్చి చూచెను. హరనేత్రాగ్నిజ్వాలలు మిన్ను ముట్టినవి. దానికి ప్రతికారముగా మునియు తనచరణాంబుజాతంబు చాచి యందలి నేత్రాగ్నిని వెలువఱచెను. ఆ మంటలకు తట్టుకొనఁజాలక హరుఁడు వానలు కురిపించెను. మౌనినాధుని హృదయంబునందున్న దేవకీసుతుఁ డెత్తిన గోవర్ధనము కారణమున భక్తిసారుఁడు దానిని లెక్కగొన లేదు. హరపార్వతు లామహానీయుని భక్తిమహిమల కచ్చెరువంది

---

1. ఆధారగ్రంథములందు భక్తిసారుఁడు తొలుత పరమశైవుఁడై శివవాక్యర్ అను పేరు పొంది శైవ గ్రంథము లనేకములు రచించి శైవ మొక్కటియే మతమని సిద్ధాంతము చేసినట్లును పిదప మొదలాళ్వారుల ప్రయత్నమునను, విష్ణ్వనుగ్రహమునను నాతఁడు శైవమును తిరస్కరించి వైష్ణవమును బరిగ్రహించినట్లును గలదు, కాని చిన్నన్న ఆ విషయమెల్ల నిట విడిచిపుచ్చి 'పిమతంబులైన సర్వసిద్ధాంతముల్ చర్చించి అల్పంబులని పూర్వపక్షముల్ చేసె' నని మాత్రమే పేర్కొన్నాడు.

హరిదాసు లఖిలలోకైకపావను లని గుర్తించి తమ్ము మరువవలదని మునిని వేడుకొని వెడలిపోయిరి అతులు పాదంబునందు చూపిన కతన నామునికి అతుపాదాహ్వాయం బమరెను.

(౩) ఇట్లు భవజీర్ణవస్త్రములు పొదివి మాయాసూత్రమునఁ గాలనూఁచి నొడలి బొంతలు కుట్టుచుండిన మాయావి వడువున నా మౌనివరుఁడు బొంతలు కుట్టుకొనుచుండెను ఒకతూరి కొంకణ సిద్ధుఁడొకఁడు శార్దూలవాహనుఁడై మింటఁబోవుచుండెను. ఆ మునీశ్వరుని దివ్యతేజము నతిక్రమించి చనుటకు వెఱచి శార్దూలము మింట నాగిపోయెను. దానిని గుర్తించి సిద్ధుఁడు భూమికి దిగివచ్చి యంతటి తేజోవిరాజితుఁడు బొంతలు కుట్టుకొనుచుండుటను జూచి జాలిపడి యాతనికి ధరించినవారికి జరామరణ దుఃఖములఁ దొలఁచునొక బొంతను, సోకినంతనే లోహమునేని కుందనమొనర్చు నొక రసఘుటికను సమర్పించెను. అంతట నవ్వుకొని సిద్ధునకు భక్తిసారముని తన ప్రభావమును జూపఁదలచి మేననే దివ్యమణికంచుకమును ప్రదర్శించెను. తన పాదరేణువునిచ్చి యదిసోకినంత లోహమేకాదు మట్టికూడ బంగారమగునని చెప్పెను. సిద్ధుఁడా మహిమ కాశ్చర్యమందెను. పరీక్షింపఁ గోరి యాపాదరేణువును చిత్రకూటమునకు రాచిచూడగా నది రెండవ కనకాద్రియై భానుమండలం బగలించు కాంతితో నొప్పారినది. కొంకణ సిద్ధుఁడా మునీశ్వరుని శక్తి వేనోళ్లఁగొనియాడి హరిభక్తులధికులని గుర్తించి తనదారిన దానుబోయెను.[1]

---

1. ఆధార గ్రంథములందీ వృత్తాంతము రెండు కథలుగా వర్ణితమైనది. వ్యాఘ్ర వాహనుఁడయి శుక్తిహారుఁ డనువాఁడు భక్తిసారునకు కవచమును పద్మాక్షమాలను బహూకరింపఁబోయి యాతని మహిమను గుర్తించినట్లొక కథయు, కొంకణ సిద్ధుఁడను రసవాదసిద్ధుఁడు భక్తిసారులకీర్తివిని దర్శింపవచ్చి రసఘుటిక నీయబోయి యాతని పాదధూళి మహిమను గుర్తించి వెడలినట్లొక కథయు వర్ణితములైనవి. ఇందు చిన్నన్న ఆ రెండు కథలనొకటిగా గుదిగ్రుచ్చి విషయమును క్లుప్తపరచెను

(ఆ) కొండగుహాలలో యోగాభ్యాస వశముననుండిన భక్తి సారు నొకముదుసలి బహుకాలము భక్తి శ్రద్ధలతో సేవించి యాతని యనుగ్రహమున లలితరూపవయోవిలాసముల్ గల యువతిగా మారెను. అప్పుడామె లోకోత్తరసౌందర్యవతియై 'పుటముకడిగిన కల్వ పూదూపు'వలె శోభిల్లినది. ఆ జగన్మోహనాంగిని అప్పటి కాంచీ పాలకుఁడొకపరి చూచి మోహితుఁడై తత్కులగోత్ర శీలనామముల నారయక యేయామెను చతురంతయానాధిరోహఁజేసి తోకొనివచ్చి యుద్వాహమాయెను. ఇరువురును కొంతకాలము సురతక్రీడ లనుభవించిరి. నానాటికి ధరణీవిభుఁడు ముదియుచుండెనే కాని యామె వయస్సు మాత్రమెక్కివచ్చుచుండెను. తనకన్న మున్నుగా ముదియవలసిన ముదితకన్న తానే మున్ను ముదియుటయు, నామెమాత్ర మట్లే నవయౌవనవతియై యుండుటయు జూచి యామెనడిగి దానికి హేతువు భక్తిసారుని యనుగ్రహ ప్రభావమే యని తెలిసికొనెను. ఆమెవలన భక్తిసారునియు, తచ్ఛిష్యుఁడు కణికృష్ణకవి సార్వభౌమునియు మహిమల నెరిగియు తన ప్రభుత్వమును దలచుకొని రాజ సాహంకారములతోఁ గణికృష్ణుని గొనితేర పరిచారకుల నంపెను. గురుని యనుమతిని కణికృష్ణుఁ డవనీశుని దర్శించెను "భవద్గురుని దర్శింపవేడుకయ్యెడిని వేవేగబోయి తోడితె"మ్మని యహంకరించి పలికి రాజాతని కవితను బొగడుచు "వరరసరీతిభావవ్యంగ్య ముఖ్య పరిపూర్ణ శుభశబ్దబంధంబుగాగ నన్నయంబు *నీనేరుపంతయు మెరని తనమీఁద నొక్కపద్యము చెప్పు*'మని కోరెను. అప్పుడా నీచనర పాలుఁడాడు వాక్యములకు కినిసి యాతనికోరికకు రోసి కణికృష్ణుఁడు (శ్రీ) మనోహర పదాశ్రిత చక్రవర్తి మామక గురుఁడు సామాన్యుఁడే— తోయజభవశివాదుల లెక్కగొనఁడు. నీ యున్నచోటికి నేడేల వచ్చుపో'మ్మని తిరస్కరించి పలికి 'చక్కెరతీపు చవిగొన్నవారు వేపచేదు తిందురా? *బ్రహ్మాండ కోటులకు నేలికయగు శౌరినెన్నెడు నాదునాలుక నినునెన్నునా దుర్మదాంధ*' నీవు లక్ష్యమె నాకు — నీ విచ్చునట్టి యీవి లక్ష్యమే తుదినిచ్చితివేని యలవి ననిత్యంబు లసుఖంబులైన శిలలు లోహంబు లిచ్చెద వింతెకాని — వేరేమియగలవు —

దానవాంతకుఁ దక్క దక్కినయట్టివారి భజన గావించుట నాకన్న చెలియలివాని సు'మ్మని తృణీకరించి పలికెను. అంత రాజు రోషించి గురుశిష్యుల నిరువురను తన రాజ్యమును వీడి చనుఁడని యాజ్ఞాపించెను. కణికృష్ణుఁడును 'నీవేలు ధరణినున్నఁ బాపము చెందు నోరి పాపాత్మ!'యని రాజును, రాజ్యమును వదలిపోయెను. అతనివెంట భక్తిసారుఁడును నడచెను. వారిరువుర ననుసరించి యక్కడి రమానాథుఁడును కదలిపోయెను. ఊరు పాడుపడెను. పరిస్థితుల నెరిగి రాజు పశ్చాత్తప్తుఁడై భక్తిసార కణికృష్ణులను శరణువేడి మరలి రండని ప్రార్థించెను. వారు వచ్చిరి. వారితోపాటు ఆ యూరి స్వామియు స్వస్థానముచేరుకొని యథోక్తకారికుఁడని పేరువడసెను.[1]

ఈ విధమున భక్తిసారుఁడెన్నో మహిమలను ప్రదర్శించుచు కణికృష్ణునితోఁగూడి దివ్యదేశములందు బహుకాలము సంచరించి

---

1. ఆధారగ్రంథములలో భక్తిసారుని సేవించిన ముదుసలి మోహనాంగి యనునామె వృద్ధ వేశ్యగా వర్ణింపఁబడినది. ఇందు చిన్నన్న ఆమె కుల గోత్రముల నెన్నలేదు. కాంచీపురాధీశుఁడు పల్లవరాయఁడను విషయమిందు పేర్కొనబడలేదు. ఇక రాజు కణికృష్ణుని పిలిపించి తన కోరిక చెప్పి గురువును పిలుచుకొని రమ్మనగను, 'అతఁడు నిస్పృహుఁడు ఎచటికిని రా'డని శిష్యుఁడు చెప్పగా వాక్సిద్ధిగల కణికృష్ణుఁడేని తనకు యౌవనముగలుగ స్వామికి గానరూపమున నివేదింపవలసినదిగా నర్థించును. దానికి కణికృష్ణుఁడు వ్యతిరేకింపగా రాజు వారిని వెడలఁగొట్టినట్లుండగా నిందు చిన్నన్న కథను కొద్దిగా మార్చినాఁడు. ఇందు రాజు కణికృష్ణుని కవితను మెచ్చి తనపైఁగ పాటపాడుమని కోరుటయు, నంతకన్న మించియేమియు తాను పిలిపించిన యవసరమును గూర్చి పలుకకుండుటయు ననున వీతఁడు తెచ్చిన మార్పులు. ఈ మార్పులలో తన తాతతండ్రుల వృత్తాంతమేమేని గర్భితమైయున్నదేమో! అన్నమాచార్యుని జీవిత విశేషములను బరికింపఁదగును.

ద్రవిడ వేదములను రచించి గానము సేయుచు వైష్ణవ భక్తిభావము లను భక్తులలో వ్యాపింపఁజేసెను.[1]

భక్తిసారముని సుదర్శన చక్రాంశజులు. శ్రీచక్రము నిర్వ క్రమై స్వామికి ప్రతినిధియై లోకమునందలి దోషాటవుల ఖండించు టకై తిరుగునట్లే తదంశజులగు నీయాళువారును లోకసంచారము గావించి తన మహిమచేత నందరను లోఁబఱచుకొని వారికి స్వామి సాక్షాత్కారమును గల్పించిరి. వీరి చరిత్రము కులముకన్నను భగవద్భ క్తియు, భాగవతభక్తియు పరిగణనీయములని బోధించును. 'ఏ కులజు లైననేమి ఎవ్వరైననేమి ఆకడహరిభక్తులే అఖిల పావను' లన్న నుడిని వీరి చరిత్రము వెల్లడిసేయును.

౮. నమ్మాళ్వారు: పాండ్య మండలమున తామ్ర పర్ణీనది తీరమున గల పుండరీకమను పురమే ద్వాపరమున కురువను రాజుచేత పాలితమై కురుకాభిధానమై యొప్పుచుండెను. ఆ పురమునందుగల పరమప్రపన్నులైన భాగవతులలో వనధి నాగేంద్రుఁడను నాతఁడొకఁ డుండెను.[2] అతనికి పుత్రుఁడు ధర్మధరుఁడు. తత్పుత్రుఁడు చక్రపాణి.

---

1. తిరుమళిశైయాళ్వారు (భక్తిసారు)ల రచనలు-

| | |
|---|---|
| నాన్ముగన్ తిరువన్దాది | 96 పాశురములు |
| తిరుచ్చందవిరుత్తమ్ | 120 పాశురములు |

2. ఆధార గ్రంథములందు నమ్మాళ్వారుల పూర్వీకుల క్రమ మీతీరున వర్ణితమైనది,

కురుకఁడు
|
1. తిరువరుది వళనాడన్ (శ్రీ మద్విభూతినాథుడు)
|
2. ధర్మధరుఁడు
|
3 చక్రపాణి
|
4, అచ్యుతుఁడు

తత్పుత్రుఁడు రక్తధారాహ్వాయుఁడు. తత్పుత్రుఁడు పాటలమోచ నాఖ్యుఁడు. తత్పుత్రుఁడు భోక్తారి. తత్పుత్రుఁడు కారి. అపగతాహంకారియు యఖిలోపకారి యనుపమాలంకారి యవికారియగు నీకారి నామధేయుఁడు. కురుకా సమీపగ్రామమందలి కమలాప్తవతుఁడను పుణ్యాత్ముని తనయయగు నాధనాయికయను నలినాక్షిని పరిణయం బాడెను. ఆ పుణ్య దంపతులకు విష్వక్సేనాంశజుఁడు శఠగోపయతి

---

|
5. శంగణ్ణన్ (పాటలలోచనుఁడు)
|
6. పొరశాన్కారి
|
7. కారి X m నాధనాయిక (ఉడయనంగ) d of
తిరువార్ మార్గన్.

పరమయోగి విలాసము (అచ్చుప్రతి) ననుసరించి

కురువు.
|
1. వశదినాథేంద్రుఁడు
|
2. ధర్మధరుఁడు
|
3. చక్రపాణి
|
4 రక్తధారాహ్వాయుఁడు
|
5. పాటల మోచనుఁడు (పాటలలోచనుఁడు)
|
6. భోక్తాశి (భోక్తారి)
|
7. కారి. X m నాధనాయిక d of కమలాప్తవతుఁడు.

ఈ పేర్లలో రక్తధరాహ్వాయుఁడే అచ్యుతుఁడుగా తెలియనగును.

(నమ్మాళ్వారు) జన్మించెను.[1] కలియుగమున తొంబదిరెండు దినములు గడచిన తరువాత సవరనివేళ వైశాఖఁ గవివాసరమున గర్కాటక లగ్నమున నీ మహనీయుఁడు జన్మించెను. వరాహావతారుఁడైనట్టి హరియే సూతికాగృహమప్పుడు నేతెంచి కారిసూనునకు జ్ఞానోపదేశముగావించెను. కారిసూనుఁడు హరికృపాలబ్ధ విద్యామృతాహారపరితృప్తుఁడై ప్రాకృతాహారముల నొల్లఁడాయెను. 'చనునోరఁబెట్టఁడు, కనువిప్పి చూడఁడు, ఎలుగెత్తి యేడ్వఁడు; కురుకాదినాథుఁడే కరుణించి వరమిచ్చె; తలప బిడ్డఁడా వీఁడు దయ్యంబుగాక' అనుకొన్నారు తలిదండ్రులునూరివారును తుదకేమియును పాలుపోక తలిదండ్రులాలోచించియచటియాలయమునందలియొకచింతచెట్టువద్ద నుయ్యాలలోఁ బెట్టి విడిచిరాఁ గాళ్లాడక యేడ్చియేడ్చి దైవమును బ్రార్థింతురు. అప్పుడు స్వామి ప్రత్యక్షమై యడలకుండని యభయమిచ్చి తానే వారికి సంతానమై కలిగిన విషయమును వివరించును. కారిదంపతులానందించి బాలు

---

అయిదవ వ్యక్తి అచ్చుప్రతులలో నున్నట్లు పాటలమోచనుఁడు కాక పాటలలోచనుఁడై యుండును. పౌరశాఙ్కరినామరూపమే భోక్తారి అచ్చుప్రతులలో లోక్తారి యని యుండుట ప్రామాదికమైయుండును.

తిరుకురుగైవళనాడన్ శూద్రరాజని ఆధారగ్రంథములందున్నది. కాని చిన్నన్న ఆ విషయము నెత్తక ఆ పురమునందలి పౌరులలో నొక్క భాగవతుఁడు వకుళదినాథుఁడనివాఁడు.

1. నమ్మాళ్వారునకే- శఠకోప, శఠరిపు, వకుళదినాథ, కురుగూర్ నంబి, వకుళాభరణ, తింత్రిణీ మూలవాసయోగి, అప్రాకృతమానుషయోగి, కారిమార, మారయోగి, ద్రవిడోపనిషద్యోగి, పారస్వతముని దివ్యసూరి హరయోగి, విశాఖాయోగి, విష్వక్సేనాంశయోగి తామ్రపర్ణిముని, వేదయోగి ప్రభృతి నామాంతరము లనేకము లున్నవి.

జననము:— వృషభే తు విశాఖాయాం కురుకాపురి కారిజమ్,
పాండ్యదేశే కలేరాదౌ శఠారిం సైన్యపం భజే.

(బ్రహ్మతంత్రస్వామి రచన)

నింటికి గొనివత్తురు. పిదప నాబాలుఁడు 'ఆ షోడశాబ్దంబులంతరంగమున శేషపర్యంకుని జింతించుకొనుచు మౌనియైయుండె'. 'పదియారవయేట-[1]

"నరవిందభవనస్వామ్యాప్త గోవిందచరణారవింద నిష్యందమరంద
వారి ధారాకారవరవాగ్విపూరపూరిత గంభీర భూరినిర్ఘోష
రంగభంగ సంభ్రమభరోత్తుంగ గంభీరతరంగ వైఖరుల దీపింప
నిరవద్యములు యోగినికరవేద్యములు హరిగుణహృద్యంబులైన
పద్యములు
మకరకుండలధారు మైననేకంబులకలంకభావంబులలరఁగావింప'—గా
'శారిపూమని శావ్యకన్యకామణికి ధారుణి నర్చావతార సంఘములఁ
జెలఁగొందు విష్ణుని శ్రీమూర్తులెల్ల వలచివేగమె వచ్చివలచుట్టుకొనుచు
నతులించిండాకొటరావాసయోగిపతిని సత్కవి సార్వభౌము నీక్షించి -

తముఁబాడు తముబాడు మని తొందరించి తోద్రోపులాడసాగిరి. వారలనెల్ల వినయభాషణముల వినుతిసేయుచు, మౌనియైయుండుచు, వ్రాయుచు, చొక్కుచు-మఱల మఱల వ్రాయుచు కాలము పుచ్చుచుండెను.

*6. మధురకవియాళ్వారు:* నమ్మాళ్వారులకు మధురకవి యను నాతఁడు శిష్యుఁడాయెను. అతఁడు పాండ్యమండలమందలి తిరుకోళూరు గ్రామమున వాదికేసరియు నూర్ధ్వశిఖుఁడును, సామవేదియునైన యొక బ్రాహ్మణుని యింట[2] స్వామి సన్నిధినుండు గణముల కధినాయకుఁడగు కుముదాహ్వయుఁడు అనుపమ చైత్ర

---

1. ఈ నమ్మాళ్వారువలెనె తాళ్లపాక అన్నమాచార్యులును తమ పదియారవయేటనే సంకీర్తన రచనకుఁదొడఁగిరి. ఈ మహనీయు లిరువురి జీవితము లందును పోలిక లనేకములున్నవి చిన్నన్న యిందు వర్ణించిన నమ్మాళ్వారుల కవితా స్వరూపమే తన తాతగారగు అన్నమాచార్యుని కవితకును వర్తింపు ననవచ్చును.

2 ఆధార గ్రంథములందు ఈ బ్రాహ్మణుని పేరు నారాయణ దీక్షితుఁడని గలదు.

చిత్తాహ్వయతార జనియించెను.[1] పుట్టుకతోడనే తావితోడ మొలతెంచు మరువంపు మొలకచందమున కవివనచైత్రుఁడై మధురకవి నామాంచితుఁడాయెను. అతఁడు,

"పలికిన పలుకెల్లఁ బన్నీరుచెంబు, గులికిన చందానఁ గ్రొన్నెలసోగ
సొలసినరీతి కర్పూరంబులప్ప లొలుకుకై వడి మించులుడుగక మెఱయు
ననువునఁ జల్లగా నమృతంపుసోన చిలుకు సోయగమున జీవరత్నములు
మెలగెడు జాడఁ గ్రామినుకు వజ్రములు తులగింప జలజలఁ దూర్పెత్తినట్టి
మెలుపున వలపుఁ దెమ్మరలు వేఁచు నలువునఁ గ్రొత్త కట్టాణి
ముత్యములు
డాలించుసరణి బిటారంబులోకట గిలించుకరణిఁ జక్కెర లుప్పతిలఁగ
మగనిమైఁ బూన్మ రమాదేవి చూపునిగుడించు గ్రాతిఁ దేనియలుట్టి పడఁగఁ
గవిత మాధవుమీఁదఁ గావించుచుండె."[2]

---

1. మధురకవి జననము :
'చైత్రేచిత్తా సముద్భూతం పాండ్యదేశే గణాంశకమ్
శ్రీ పరాంకుశ సద్భక్తం మధురంకవి మాశ్రయే'
(బ్రహ్మతంత్ర స్వామి రచన)

ఈ మధురకవియాళ్వారులకే- మధురకవియోగి- కుముదాంశ యోగి, గురుముని. శఠకోపపాదముని పద్మయోగి, చిత్తాయోగి, సామవేద ముని, వాదికేసరితనయయోగి, తిరుక్కోళూర్ దీపముని మున్నగు నామాంతరము లున్నవి.

2. చిన్నన్న కీర్తించిన మధురకవి యాళ్వారుల కవితావైభవమే తాళ్లపాక కవీశ్వరుల కవితావైభవము. అచ్చముగా నీ తీరునవే అన్నమాచార్యుని పదకవితను పెదతిరుమలాచార్యుఁడుకాఁబోలు నిట్లు స్తుతించినాడు.
"సురలకు నరులకు సొరిది వినవిన నరుదు తాళ్లపాక అన్నమయ్య పదములు
చక్కెరలై చవిజూపి జాలై తావిఁజల్లి అక్కజపుమాతువజ్రాలై మెరసిని
నిక్కుటద్దములై మా నిలువు నీడలుచూపి అక్కర తాళ్లపాక అన్నమయ్య
పదములు"

అట్టియామధురకవి తీర్థయాత్రలకేగి కురుకానగర ప్రాంతము లందు తేజోరాశియై వెలుగొందుచు, చించాకోటరవాసియగు నమ్మాళ్వారుని దర్శించి కైవారములుసేసెను. శఠమత రాద్ధాంత సంహారియై శఠగోప పరాంకుశ ఖ్యాతులొనరిన యోగివరుఁడు మధురకవిని సంభావించెను. మధురకవి శఠగోపముని రచించిన ద్రావిడవేదముల లోని విశేషార్థములను వెల్లడిసేయఁగోరెను. నమ్మాళ్వారాతనిని శిష్యునిగా స్వీకరించి పరావ్యూహ విభవాంతరాత్మలన నొప్పు శౌరి పర్యాయ మూర్తులను గూర్చియు పంచరాత్రేతిహాసములను గూర్చియు విశదీకరించి శ్రుతిగర్భితంబులై తానుశవణించు నా ద్రావిడ ప్రబంధంబుల యర్థములు విశరించి కృతయుగవేళ ధ్యానయోగార్చనావిధులగలుగు ఫలము కలియుగవేళ నలినాక్షు సంకీర్తనంబుచేతనే కలుగునని విశదీకరించెను. సలలితవేదార్థ సారసంతతులు ద్రావిడకృతులుగాఁ జేసెను. కడలి నీరాని మేఘముల్గురియునట్లు వేదార్థములనే మార్దవత్వముతో నమ్మాళ్వారు అనువదించిరి. వారి-

ఆది ప్రబంధము - ఋగ్వేదతుల్యము శతపద్యములు
రెండవకృతి - యజుర్వేదతుల్యము - ఏడు గాథలు
మూఁడవకబ్బము -అధర్వస్వరూపము-తొంబదియేడు వృత్తములు
నాల్గవకావ్యము-సామ నిరూపకము-ఏకదశశతసంఖ్యాకలది.

వీనిలో నాల్గవకావ్యము ప్రాపితరసశబ్దబంధంబు గలిగి గాన కర్ణోచితాంగంబు శ్రావ్యంబునై, త్రివిధ జీవాళి కామోదకరము భవ్యమునై సంపుట్టిది. వీనిని వినినఁ జెప్పినఁ జదివిన యట్టివాఁడె వన

1. నమ్మాళ్వారు రచనలు.
(ఋక్) తిరువిరుత్తమ్- 100 పాశురములు
(యజుః) తిరువాశిరియమ్- 7 పాశురములు
(అధర్వ) పెరియ తిరువన్దాది 87 పాశురములు (97 ?)
(సామ) తిరువాయ్ మొఴి 1102 పాశురములు

జాతు దాస్యంబు వలసినవాఁడు. ఇట్లు ద్రావిడవేదముల పఠనపాఠనము లొనరించుచు గురుశిష్యు లిరువురును హరిపదధ్యానామృతంబు ననుభవించుచుండిరి. ఆ కురుకాధీశుఁడు నమ్మాళ్వారునకు మెచ్చి యొక పొగడదండ నిచ్చెను. తదాదిగా నా ముని వకుళాభరణాహ్వయుఁడాయెను. మధురకవి గురువును సంస్తుతించుచు నొక్కకృతి రచించెను.[1]

ఈ యాళ్వారుల కథలు విన్నవారికి "కరతలామలకంబు కైవల్యపదము - ధనధాన్య సంగతి తంగేటిజున్ను - గొనబైన ప్రాయంబు కొంగుపసిండి - యెడపక యొక్క మాటెన్నిఁడుఁజాలు జడునకైనను కల్గుసారస్వతంబు"—

ఈ యాళ్వారుల చరిత్రములు కులగోత్రములకు కాక భక్తికే ప్రాముఖ్యము నిచ్చుచున్నవి. భగవద్భక్తికి నమ్మాళ్వారులయు, గురుభక్తికి మధురకవియాళ్వారులయు జీవితము లుదాహరణములు. వీరి కథలు, రచనలు, స్వామిభక్తికన్న ననేకవిధముల గురుభక్తియే విశిష్టమైనదని వెల్లడిచేయుచున్నవి. అంతేకాక స్వామి కీయుగమున సంకీర్తన సేవయే మిక్కిలి ప్రీతికరమనియు, నుత్కృష్టమైనదనియు, దానివలన భక్తలోకము తరించుననియుఁ దెల్పుచున్నవి. ఈ యాళు వార లిరువురును సేనానాయిక గణాధిపతుల యంశముల నవతరించిన వారగుటచేత పన్నిద్దరాళ్వారులలో ద్రావిడ వైష్ణవ భక్తిసాహిత్య ప్రచారయాగమున వారికే ప్రాజాపత్యము. వీరిలో నమ్మాళ్వారులు వ్రాసినన్ని పాశురములొక్క తిరుమంగైయాళ్వారుతప్ప మరియెవ్వరును వ్రాయలేదు.[2] యోగ్యతకూడ వీరి రచనలకే హెచ్చు. ఈ దృష్టి

1. మధురకవియాళ్వారులు గురూత్తములగు నమ్మాళ్వారులను సంస్తుతించుచు 'కణ్ణినిన్ శిరుత్తాంబు' అను పదునొకండు పాశురములుగల యొకకృతిని రచించిరి.

2, నమ్మాళ్వారు తరువాత వారివలె సాహిత్య సృష్టి చేసినవారును, వారిలో ముఖ్యులుగా నెన్నఁదగినవారును తిరుమంగై యాళ్వారొక్కరే నమ్మాళ్వారువి 1296 పాశురములు- తిరుమంగైయాళ్వారువి 1361పాశురములు.

తోడనే కావచ్చు నమ్మాళ్వారు అవయవియనియు. నితరాళ్వారులవ యవభూతులనియు సంప్రదాయజ్ఞులందురు.

(7) కులశేఖరాళ్వారు : కేరళమునందలి కొల్లి (కుక్కుటు) నగరమును పాలించుచుండిన దృఢవ్రతుఁడను[1] భగవద్భక్తునకు 'నలువొందు మాఘ పునర్వసు తార జలజాతు కౌస్తుభాంశం బుదయించి కులశేఖరాఖ్యఁ గైకొని కులశేఖరుండునాఁగొమరు దీపించెను.' [2] ఆతఁడు రామకథాసుధారసమగ్నహృదయుఁడు జయశీలుఁడు. అధ్వరశతదీక్షితుఁడు నలుదిక్కుల జయస్తంభముల్ నిల్పిన సార్వభౌముఁడు. ఉత్తమ క్షత్రియుఁడు అయినను మురవైరి యవతారములందు భక్తిపరుఁడై విశేషించి సీతామనోహర శ్రీపదాబ్జాతచేతోద్విరేఫుడై భాగవతులను భక్తితో పూజించుచుండెడివాఁడు. సకలసంపదలు వైష్ణవుల సొమ్ముగను తలచి తత్పూజ యేకాగ్రబుద్ధిసేయు చుండెడివాఁడు. ఒకమారు కొందఱు వైష్ణవోత్తములు రాజదర్శనమునకై పోవుచుండఁగా రాజు అంతఃపురమున నున్నాఁడని చెప్పి కావలివారు వారినాటంక పరచిరి. ఆవార్తవిన్న కులశేఖరుఁడు పరిచారకులను దండించి యపరాధమును క్షమింప నాభాగవతోత్తముల శ్రీ పాదపద్మముల వ్రాలి ప్రార్థించెను. నాఁటినుండి కావలివారు వైష్ణవుల నాటంకపరుపఁ జాలకపోయిరి. అట్టి స్థితిలో రాజప్రాసాద

1. ఆధార గ్రంథములందు దృఢవ్రతుఁడు పాలించిన నగరము కొల్లి కుక్కుట కూటము, కోళకూరు, తి. వంజిక్కళమ్ మున్నగు నామములతో గానపచ్చుచున్నవి

2. కులశేఖరునకే కౌస్తుభాంశయోగి, పునర్వసుముని, కొల్లికావల్ ముని దృఢవ్రతతనయ, రాజయోగి, రవివంశముని, కేరళయోగి, రామభక్తయోగి హరిభక్త భక్తయోగి, సత్తమయోగి మున్నగు నామాంతరములున్నవి.

జననము: కుంభే పునర్వసుభవం కేరళే కొల్లిపట్టణే
కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రయే

(బ్రహ్మతంత్ర స్వామి రచన)

మున కట్టుదిట్టములు సేయుట కష్టమై మంత్రులొక పన్నాగము పన్నియట్టి భాగవతుల యథేచ్ఛావిహారమును రాజమందిరమున తగ్గించుటకై ప్రయత్నించిరి. బొక్కసములవారి కెరిగించియే రాజుగారి యాభరణములు గొన్నిటిని దాచి యవి దొంగతనము పోయినట్లు వెల్లడింతురు. విచ్చలవిడిగా వచ్చెడి వైష్ణవోత్తములు తప్ప వేరెవ్వరును వానిని దొంగిలించెడి యవకాశము లేదని ఈనికి వారు నచ్చఁ జెప్పఁ జూచిరి. వారు చెప్పఁబూనిన దానికే కంపరమంది రాజు వారలను రెచ్చిపోయి మందలించెను. సత్య నిరూపణార్థమొక క్రూర సర్పమును కుంభమధ్యముననిడి వైష్ణవులే చోరులని చాటి యాకుంభమునందుంచిన హేమ ఘటికను వెలికిఁ దీయుఁడని నిందారోపణము చేసినవారి నదలించెను. వారు వెఱచి వెనుదీసిరి. రాజు వారి యెదుట వైష్ణవోత్తములు చోరులు కారనిచాటి నిర్భయముగా నా హేమఘటిక నాకుంభమునుండి వెలికిదీసెను. తుదకు మంత్రులే తమ తప్పిదమును తెలిసికొని యొప్పుకొని పశ్చాత్తాపపడుదురు. కులశేఖరుని భాగవతభక్తి దశదిశల వెల్లడియగును. అతని భాగవతభక్తికిమెచ్చి శ్రీరాముఁడు ప్రత్యక్షమగును. వరమువేడు మన 'నీ మీఁద ననిశంబు నిశ్చలభక్తి మామకబుద్ధి నేమరకుండవరమిమ్ము' అని ప్రార్థించును. పిదప నారంగేశుని కోర్కెపై తన కూతునిచ్చి స్వామికి సలక్షణముగ వివాహము జరిపించును. కులశేఖరునకు రామభక్తి పారవశ్యమధికము. ఒకతూరి ప్రతిలేనియట్టి శ్రీ రామాయణంబున సీతాపహరణ ఘట్టమును వినుచు జగదేకమాతయెడ దుష్టుఁడగు రావణుని దుష్కృత్యమున కుగ్రుఁడై యారామచంద్రద్రోహినిబట్టి శిక్షింప సమకట్టి యుద్ధ సన్నద్ధుఁడగును. సైన్యముల నాయత్తపఱచి తానేస్వయముగ నశ్వమధిరోహించి లంకానగరాభిముఖుఁడై పోసాగెను. అతని భక్తి పారవశ్యమునకు మెచ్చి గోవిందుఁడు మణిమయ విమానారూఢుఁ జేసి కులశేఖరుని వైకుంఠమునకు గొంపోవును.[1]

---

1. ఆధార గ్రంథము లందు కులశేఖరుఁడు సైన్యముల నాయత్తపరచి తానే యుద్ధమునకు సిద్ధముకాగా మంత్రులావిషయము నెరిగి వెంటనే రామాయణము పఠించుచున్న భటును శ్రీరాముఁడు శత్రుసంహార మొనర్చిన ఘట్ట

ఈ యాళువారు కృతులలో నూరుపాటలది ద్రావిడ ప్రబంధము [1]. అందు ముప్పది పాటలలో నారంగనిలయుని గైవారంబుసేసి కడమ డెబ్బది పాటలలో చెడని సంపదలిచ్చు శ్రీ వేంకటేశుని, శ్రీ రామచంద్రుని వీరు సంస్తుతించిరి. వీరి చరిత్రము భగవద్భక్తిని, భాగవతభక్తిని ప్రబోధించును. భాగవతులు భగవంతునికన్న నధికులనెడి విషయమును నిరూపించును.

*8.* తిరుప్పాణాళ్వారు : పన్నిద్దరాళ్వారులలో తిరుప్పాణాళ్వారు అష్టమయోగి. కవియోగియనియు, మునివాహనయోగియనియు ప్రసిద్ధి, జెందినవారు.[2] శ్రీ వత్సాంశజులు. నిచుళానగరమున ప్రచురవైష్ణవకులపాథోధిశీతరుచినాగ కార్తికరోహిణీతారసీకవియోగి యవతరించిరి.[3] వీరు జన్మించిన యానిచుళానగరము (వరయూరు) కావేరితీరమున పరమపవిత్రమైన గ్రామము. అది స్వామివారి మామగారియూరు. అచ్చటనే రంగనాథస్వామి పెండ్లి

---

•ఘును చదువనాజ్ఞాపించినట్లును, అది విని కులశేఖరుం డానందమొంది సేనలనుపసంహరించుకొని వచ్చినట్లును వర్ణితమైనది.

1. కులశేఖరుని 'నూరుపాటలకృతి' యనంబడు నీగ్రంథము 'పెరుమాళ్ తిరుమొళి'. ఇందు 105 పాశురములున్నవి. ద్రావిడప్రబంధము. ఇదికాక వీరు సంస్కృతమున "ముకుందమాల" యను నొక దివ్యమగు స్తోత్ర గ్రంథమును గూడ విరచించిరి. చిన్నన్న ద్రావిడ ప్రబంధముల విషయమును మాత్రమే ప్రశంసించెనుగాని యందు ముకుందమాలను గూర్చి వ్రాయలేదు.

2. తిరుప్పాణాళ్వారులకే అష్టమయోగి, వీణాయోగి, గాయకయోగి, గానముని, కవియోగి, మునివాహన యోగి, శ్రీ వత్సాంశయోగి, తత్త్వముని, తటముని, కావేరితీరముని, రోహిణిముని, నిచుళాపురయోగి మున్నగు నామాంతరము లున్నవి.

3. కవియోగి జననము
వృశ్చికే రోహిణీ జాతం శ్రీ పాణం నిచుళాపురే
శ్రీ వత్సాంశం గాయకేంద్రం మునివాహన మాశ్రయే
(బ్రహ్మతంత్ర స్వామి రచన)

యాడి సుఖించెను. ఎట్లన తత్పురపాలకుడు రాయచోళోత్తమల్లరా జొకతూరి శ్రీరంగనాథుని దర్శించి వచ్చుచుండ నాతనికి దాపునందలి కాసారమున నొక బాలిక కాననగును. ముద్దులమూటగట్టు నాబాలికను దెచ్చి పెంచుకొని పద్మినియని పేరిడుకొనెను. ఆమె పెరిగిపెద్దదై యందాలరాశి యాయెను. కాని చిననాటినుండియు పరాంకుశముఖ్యా మునుల దివ్యప్రబంధములందలి స్వామివర్ణనముల జదివిచదివి యామె శ్రీరంగనాథునే వరించినది. స్వామికే సర్వాత్మసమర్పణముగావించు కొన్నది. తుదకు రంగనాథస్వామి ప్రత్యక్షముకాఁగా సంతోషించి నిచుళాధిపుఁడు కూతునిచ్చి పరిణయముసేయును. అట్లు పద్మినీ రంగ నాథుల పరిణయముజరిగి యాదివ్యదంపతులు సుఖించినచోటది.[1]

అట్టి పవిత్రమగు నిచుళానగరమున వైష్ణవకులపాథోధి శీత రుచినాగ కవియోగిసన్నుతుఁడు శ్రీవత్సాంశమున నవతరించెను. కాని ప్రాకృతులవలె ప్రకృతిరోదనమునోదనములేక జలజాక్షుభక్తియే ధారకము పోషకముకాఁగా యోగానందభరితుఁడై యుండెను. పెద్ద వాఁడై నారీకకుక్షి గానవిలోలుఁడగుచు వేణునాదము సల్పువెన్నుఁడో యనఁగ వీణాప్రవీణుఁడై వీణచేఁబూని యల రంగనాథుని బాడుచుం డెను. ఆ రంగభూమి దివ్యస్థలమగుట నావీడు ద్రొక్కరాదని తలపోసి కావేరి దక్షిణాంగణసీమయందే రంగవిభున కభిముఖంబుగ నిలచి శాస్త్రసమ్మతముగ గానము సల్పుచుండెను. ఆతని గానామృతమును రంగవిభుఁడు తనివితీరఁ గ్రోలుచుండెను. అప్పుడు శ్రీరంగనాయిక 'దేవరకింత ప్రియమైనవానిని బరునిసంగతి వెలుపలనుంపనేల?' యని ప్రశ్నింపఁగా, మెచ్చి, రంగనాయకుఁడు లోకసారంగమౌనిని బంపి యాతనిని మూపున గొనితెమ్మని యాజ్ఞాపించును. నిత్యము స్వామి వారి కభిషేకజలముల గొనివచ్చు నా లోకసారంగమౌని తదాజ్ఞ శిరసావహించి కవేరకన్యకదాటి చేరజనఁగా 'ఎక్కడవచ్చెదవెఱుగవే

---

1. ఆధార గ్రంథములందు నిచుళాధిపునిపేరు ధర్మవర్మఁడు. ఆతనికి కాసారమున లభించినబిడ్డ నిచుళానాయకి (వరయూర్ నాచ్చియార్). ఆమె శ్రీదేవి యంశము.

నన్ను రాకురాకు' మటంచు తిరుప్పాణుఁడు కదలి పోసాగెను. 'పోకుపోకు' మటంచు వెన్దగిలి పట్టి లోకసారంగమౌని యాతనిని భుజమున నిడుకొనిపోయి స్వామి కోర్కెదీర్చెను తదాదిగా నాతఁడు మునివాహానుండను పేరబరిగెను. ఆతఁడు తన భక్తివిశేషమున దివ్య సుందరమంగళవిగ్రహామగు నా స్వామివారి శ్రీపాదములను, చక్రమును, క్రొమ్మోవిని, కన్నుదామరులను, నెమ్మోనిని, తనివిదీర వర్ణించివర్ణించి గానకైంకర్య మొనరించెను. ఆతని యాప్రత్యంగ వర్ణనగీతమే ద్రావిడ ప్రబంధమాయెను. అట్లు భక్తిసేసి యారంగశాయిఁ గనుఁగొన్న తనకనుదోయి యొండుకనకుండుగా కని వేడికొని స్వామిసేవయందే జీవితమెల్లఁబుచ్చెను.[1]

---

1. ఆధార గ్రంథములందు తిరుప్పాణాళ్వారు శ్రీహరి యాజ్ఞచేత ఉరివెన్నునందు శ్రీ వత్సాంశమున జన్మించినట్లును, మాతదాసుఁడను పంచముఁడు ఆ బాలుని పెంచుకొన్నట్లును ఆ కారణమున ఆళ్వారును పంచముఁడుగనే పరిగణింపఁబడినట్లును వర్ణితమైనది. చిన్నన్న ఆ విషయములనే స్మరింపక 'ప్రచుర వైష్ణవకుల పాథోధి శీతరుచినాగ' మదయించినట్లు వర్ణించెను. ఇందు తిరుప్పాణుఁడు పంచముఁడని వాచ్యమై పవిత్రమగు రంగభూమిని తాను త్రొక్కరాదని తలచుటయు, శ్రీదేవి 'పరుని సంగతి వెలుపల నుంపనేల? ' యని యడుగుటఁ బట్టియు లోకసారంగముని పిలువగా 'ఎక్కడ వచ్చెద వెరుగవే నన్ను?' అని తిరుప్పాణుఁడు తొలఁగి చనుటను బట్టియు, నాతఁడంటరాని కులమువాఁడని వ్యంగ్యముగా తెలియుచున్నది. కవి యిట్లు కులగోత్రముల ప్రసక్తి నెన్నక, వ్యంగ్యమును బోషించి, యాతని భక్తిని మాత్రమే ప్రదర్శించుట యిందలి విశేషము—

ఇక స్వాములు కావేరీజలముల స్వామి కైంకర్యమునకై గొనిపోవుచుండ తొలఁగక ధ్యానమగ్నుఁడై యున్న తిరుప్పాణుని రాతితో గొట్టుటయు, తత్కారణమున స్వామి నుదుట రక్తము చిమ్ముటయు, పిదప వైష్ణవోత్తములు తిరుప్పాణుని భక్తివిశేషము నెరుగుటయు మున్నగాగల వృత్తాంతమిందు విడువఁబడినది. వైష్ణవోత్తములు కులభేదములు పాటించి యజ్ఞతతో వ్యవహరింతురను విషయమునొల్లక చిన్నన్న దానిని విడచి

ఈ యాళ్వారు చరిత్రము భక్తితో తన్మయమై జీవించు మనిషియే ధన్యమని బోధించును. భక్తికి కులము, మతము వయస్సు మున్నగునవేమియు ప్రతిబంధకములు కాఁజాలవు. సర్వాత్మ సమర్పణమే జీవునకు శరణ్యము. భగవద్ధ్యానమే మోక్షమునకు సోపానము. అందు శ్రీపాదమే తొలి మెట్టు. కైంకర్యములలో గానకైంకర్యమే, సంకీర్తనసేవయే స్వామికిష్టము. సర్వాభీష్టదాయకము. సంతోషప్రదము.

*9. తొండరడిప్పొడియాళ్వారు* : వీరు పన్నిద్దరాళ్వారులలో తొమ్మిదవ యోగి. విప్రునకు నారాయణానుగ్రహమున జన్మించుటచే విప్రనారాయణులని పేరు[1]. స్వామివారి వనమాలికాంశమున నవతరించినవారు. మున్ను చోళదేశమున కావేరీతీరమున నుత్తమబ్రాహ్మణకుటుంబమునకు నిలయమగు మండంగుడియను నగ్రహారమున సకలవేదాంతవిశారదుఁడైన యొక విప్రవరుని కాంత యుదరంబునందు జిష్ణుతారను మార్గశీర్షంబున వైష్ణవాన్వయ భవ్యవనధి చంద్రుండు—వనమాలికాంశమున నవతరించి విప్రనారాయణుఁ

---

వుచ్చెనేమో! నిజమైన వైష్ణవుఁడు లోకసారంగమునివలెనే యుండవలెనని చిన్నన్న యభిప్రాయము

అపాదమస్తకము స్వామివారిని వర్ణించిన ఆళ్వారు రచన -అమలనాదిపిరాన్ - 10 పాశురములు. ఈ ప్రబంధరాజమునకు లెక్కలేనన్ని వ్యాఖ్యానములున్నవి. వేదాంతదేశికులవారీ ప్రబంధమున ప్రతిపదము నెత్తి చెప్పి, తృప్తినొందక, ఒక్కొక్క పాశురమున కొక్కొక్క శ్లోకము చెప్పి భగవద్ధ్యానసోపానము గ్రంథమునే చెప్పిరి.

1. విప్రనారాయణులకే నవమయోగి, విప్రయోగి, నారాయణయోగి, మండఁగుడిముని, జ్యేష్ఠాతారముని, మాలాకారయోగి, రంగభక్తముని, రంగముని, శ్రీరంగముని, శ్రీరంగరాజతనయయోగి, వనమాలాంశయోగి, ఆరామయోగి, ఆరోపితదోషయోగి, తొండరడిప్పొడియాళ్వారు, భక్తాంఘ్రిరేణుముని మున్నగు నామాంతరములుగలవు.

డను పేరఁ బరఁగెను.[1] పిన్నతనముననే గురుఁ డుపనయనము గావించెను.[2] అతఁడును సంసారసారం బసారమని తలఁచి రంగని సౌందర్యమునకు చొక్కి యాతనినే సేవింపుచు వైష్ణవగృహాంగణముల ముక్తికరవృత్తియగు మాధుకరవృత్తి చెందియుండెను. శ్రీరంగమునకు పశ్చిమమున కావేరీ తీరమున శ్రీమకుటాంతరీపాఖ్యగల యొక దీవి యందొక తోటను బెట్టి నిత్యము పుష్పకైంకర్యమున శ్రీరంగనాథుని సేవించి తరించుచుండెను. పంకజభవ శంకరాదులు సేయు పూజ సామాన్యమని తలంచు పంకజాతుఁడును విప్రనారాయణుని పూజకు మెచ్చినాఁడు.

ఒకతూరి రంగవిభుఁడు తన లీలావినోదము చూపనెంచి యొక యచ్చరను భువిపై నవతరింపఁ జేసెను. ఆమె మరుఁ డేర్చి పట్టినమార్గణంబనఁగ దేవదేవిగా ఒక వేశ్యాగృహమున జన్మించి సర్వులను తన సౌందర్యాతిశయమున సమ్మోహితులఁ జేయుచుండెను. ఆమె యొకతూరి తన నర్తనకౌశలమును నిచుళేంద్రనగరమున బ్రదర్శించి రాజుచే సప్తాంగంబుగొని మరలిపోవుచు మార్గమున విప్రనారాయణుని తోటను గని అక్కతోఁ[3] గూడ చూడఁబోవును. నందనవనముఁ బోలిన యాయారామరామణీయకతకు వారు సంతసిల్లిరి అంతట దేవదేవి దృక్కు అచటి విప్రనారాయణునిపైఁ దగిలినది. కాని విప్రనారాయణుఁడుమాత్ర మామె మోమైన జూడలేదు. సౌందర్య గర్వాతిశయమున దేవదేవి యక్కతో పంతముబట్టి యా గోచిబాపనిని కొనల

---

1. విప్రనారాయణుని జననము
   కోదండే జ్యేష్ఠ నక్షత్రే మండంగుడి పురోద్భవమ్
   చోళోర్వ్యాం వనమాలాంశం భక్తపద్రేణు మాశ్రయే—
   (బ్రహ్మతంత్రస్వామి రచన)
2. ఆధారగ్రంథములందు విప్రనారాయణునకు సేనమొదలియారు పంచసంస్కారములు గావించినట్లు గలదు.
3. అక్క పేరు అలివేణియని ఆధారగ్రంథములందు గలదు.

కెక్కించెద చూడుమని ప్రతిజ్ఞ గైకొనినది. పిదప తొడవులూడ్చి, వేషముమార్చి పరమవైష్ణవముట్టిపడఁగ నభినయించుచు విప్రనారాయణుని పాదములఁ్రవాలి వెక్కివెక్కి యేడ్చుచు శరణువేడినది. ఆ విప్రుఁడామెపై జాలిగొని కేలనెత్తి కారణమడిగెను. హీనమగునాడుపుట్టువును, లంజపుట్టువునురోసి స్వామిసేవకై పరితపించి వచ్చితినని దేవదేవి బొంకెను. విప్రనారాయణుఁడు నమ్మి యుండనిచ్చెను. ఏడాది గడచెను. దేవదేవియు తనయాశ నిరాశయగునాయని విచారింపవలసివచ్చెను. ఇట్లుండ నొకనాటి రాత్రి హోరుగాలివీచి కారుమబ్బులు పట్టి కుంభవర్షము గురిసెను. తోటలో రావిక్రింద వానకుఁ దడిసి వజవజ వణకుచు 'నేలావిచారింప నిభరాజవరద!' యని యెలుగెత్తి మొఱవెట్టినది. పర్ణశాలలోనిముని వానవెలిసెనో లేదో చూడఁగోరి ద్వారసీమకువచ్చి దేవదేవి దుస్థితినిజూచి జాలినొందెను. ఈశ్వరప్రేరితాత్ముఁడైన విప్రనారాయణున కాసమయమున ఆమెపై గలిగిన అనుకంప అనురాగముగా మారిపోయినది. వయారియగు దేవదేవి యాయదనెరిగి వానిని వలలో వేసికొనినది. రాగంబుతో నంతరంగము రంగభోగి ప్రేరేప నప్పుడు మౌనివరుఁడు 'హరి కుబ్జ మున్ను నెయ్యంబునం గలయు కరణి' నాలేమ నం౯జకేళిదేర్చి యానందించినాఁడు.[1] కొన్నాళ్లకామె యాతనిని తన యింటికి తోడుకొనివెళ్ళినది. క్రొత్త మిన్నలివ్వని యాసన్యాసిని రోసి వృద్ధ వేశ్యామాత ఛీకొట్టి తరిమినది. విప్రనారాయణుఁడును దేవదేవిని వీడలేక విరహము నోర్వలేక ప్రక్కయింటి తిన్నెపై పరితపించుచుండెను. ఆ యవస్థను దలచి రంగనా

1. ఈ యుపమానమున చిన్నన్న కథాకథనచమత్కారము సాధించినాఁడు. ఆధారగ్రంథములందు దేవదేవి కుబ్జయొక్క అంశమున జనించినట్లు గలదు. కృష్ణ విరహమున తపించి మరణావస్థలో నుండిన కుబ్జను శ్రీకృష్ణుఁడనుగ్రహించి 'కామభోగమునకు ప్రలపించుచుంటివి. కనుక దాసివిగబుట్టుము - నేను బ్రాహ్మణుఁడనై యవతరించి యంగసంగమిచ్చెద' నని చెప్పినట్లే వారిరువురు నిట్లవతరించిరని యందుగలదు. ఈ యుపమానమీ పూర్వకథను జెప్పక చెప్పుచున్నది ఇటమీది శృంగార ఘట్టములెల్ల చిన్నన్న చాల మెలకువతో సంయమనముతో మనోజ్ఞమగు రీతిని వర్ణించెను.

ధుఁడు నవ్వుకొనును. జగదేకమాత యాతని యకారణమందస్మితమునకు కారణమడిగి తెలిసికొని విప్రనారాయణుని విషయమరసి,

"రవిదీప్తి కంధకారము పోకుటెట్లు భవదీయ భక్తులకు తాపమేలంటు
తనయుని నిగ్రహింపు తండ్రిదికాదె?"

యని ప్రశ్నించును.[1] దానికి రంగ విభుఁడు 'అతఁడు మహాయోగి యతనికి దుష్కరతిరక్తి గలదె యారసి చూచితేని—అతఁడు మల్లీలార్థమై రాగవశునిగతిఁ జెందియున్నాఁడుగాని' యని వివరించి యైనను భక్తుని పూజకు ప్రతిఫలమిచ్చుటకై తానే వటుని వేషమున బయలుదేరెను. విభీషణుఁడు మున్ను తన కర్పించిన హేమ పాత్రంబును గొని వేశ్యాగృహంబున కేగి విప్రనారాయణుని శిష్యుఁడు కాంతోపయంతు[2] డనువాఁ డిచ్చినట్లు వేశ్యమాతకిచ్చి వారిని మందలించి వాకిటి తిన్నెపై విరహాగ్ని తప్తుఁడగు విప్రనారాయణుని తట్టి లేపి దేవదేవి యాహ్వానించుచున్నది పొమ్మని చెప్పి పోయెను. అంతట విప్రనారాయణుఁడు తెలివొంది 'నీవెవ్వరో తండ్రి! నీవు నాపాలి దైవంబవగు రంగధారుణీపతివా!' యనుకొని దేవదేవిని గూడ బోయెను. మరునాటి యుదయము ఆలయమున బంగారు గిన్నె కానరాక శ్రీరంగనిలయార్చకులు వెఱచి యధికారులకును సభికులకును విన్నవింతురు. పోయిన వస్తువును రాఁబట్టుటకై వారు పలువిధముల ప్రయత్నించి చూతురు. కాని లాభముండదు. అంతలో నాదారిన బోవుచు చంచలవాణియను దేవదేవి చెల్లెలు 'ఆపోయిన

---

1. ఆధారగ్రంధములందు శ్రీరంగనాధుఁడు రంగనాయికతో శృంగారము చేయఁబోగా తమ భక్తుఁడగు విప్రనారాయణుఁడల్లాడుచుండగా తమకు శృంగారమేలనియు, వారి కలయిక కూడిన పిదపనే తమకును గూడికయగు గాకనియు చెప్పి శ్రీదేవి రంగనాధుని ప్రేరేపించిన మీదటనే స్వామి వెడలినట్లు గలదు. ఇందు చిన్నన్న స్వామివారి 'యకారణమందస్మితము', తరువాతి కథా గతికి కారణభూతముగావించినాఁడు. బహుశః ఈ భావమీతనికి నూరన్నకు శాపూర్ణోదయము వలన కలిగినదేమో!

2 ఆధార గ్రంధములందీ శిష్యుని పేరు రంగదాసుఁడని కలదు.

గిన్నె మాయక్క కడనున్న బంగారు గిన్నె కన్న గొప్పదా?" అని యడుగుటను బట్టి చుట్టు నున్నవా రా వనిత ననుమానించి వారి యిల్లు శోధించి దొంగసొమ్మును బట్టుకొందురు. వేశ్యమాత యిచ్చిన సాక్ష్యమును, దొంగతనము పోయిన తెఱఁగును, సాంగముగ విచారించి స్త్రీవ్యామోహితుఁడగు విప్రనారాయణుఁడే దానిని దొంగిలించి యెవడో వటువు మూలమున వేశ్యాగృహమునకుఁ జేరవేయించినాఁ డని నిర్ణయించి రాజానుమతిని సంకెలవేసి శిక్షింతురు. రాజు తీర్పరిని బిలిచి గిన్నె రంగేశున కిమ్మని బంపును. ఇంతలో నాశ్చర్యముగ రంగనాథుఁడచట ప్రత్యక్షమగును. వైనతేయుని సమ్ముఖమున ననిరుద్ధుని బంధములూడినట్లు ఆతపసి బంధములు రంగనాథుని సాన్నిధ్యమున తముదామె యూడిపడినవి. స్వామి రాజును మందలించి

"ఓరి నీకిటుసేయ నుచితమే తలప నీ గతినిల నటియించినవాఁడ
నీ గిన్నె వీరల కిచ్చినవాఁడ నేను, నీవెవ్వండవు? వీఁడు నా బిడ్డఁ
డేను గూర్చిన ధనంబితనిదిగాదె, చేకొని లంజకిచ్చినయట్టి సొమ్ము
కైకొందునే........................"—

యని వారి సొమ్ము వారికిప్పించి యత్తాపసోత్తముని తలపు నెత్తమ్మి నత్తరి ప్రవేశించి యంతర్ధానమగును రాజు మునికిసాష్టాంగ మెఱఁగి క్షమాభిక్ష వేడును.[1] విప్రనారాయణుఁడు నిర్విఘ్నముగ పుష్పకైంకర్యము జరపుచు శేషజీవితము స్వామి సేవలో గడపెను. ఆతని తపస్సునకు మెచ్చి స్వామి వరమడుగు మనఁగా 'నీదగు భక్తుల యడుగుదమ్ముల రేణు వను పేరు నాకు దయసేయుమా' యని ప్రార్థించి భక్తాంఘ్రిరేణుఁడను నామమును దాల్చెను ఆ వనమాలి కంకితంబుగను లాలిత వేదజాల ప్రసూనముల మాలికగాఁగ శ్రీమా

---

1. గుడిలో దొంగతనము జరిగినది మొదలు రాజు క్షమాభిక్ష వేడుకొను వఱకును గల వృత్తాంతమంతయు నాధారగ్రంథములందలి విషయమును గొంత యనుసరించియు స్వానుభవమును సమకాలిక పరిస్థితులను మేళవించియు స్వతంత్రముగా వ్రాసినట్లు తెలియనగును.

లిక యనెడు కృతియును, ప్రాబోధకీ ఖ్యాతిఁదనరు కృతియును నవరించి కృతకృత్యుఁడాయెను.[1]

ఈ యాళువారు చరిత్రము స్వామికిష్టమగు మాలా కైంకర్యమునుగ్గడించును. భక్తాంఘ్రిరేణువై, విప్రుఁడైన భక్తుఁడే పరమాత్మ ననుగ్రహమునకు పాత్రుఁడగునని వివరించును అట్లు పవిత్రమగు జీవితము గడుపు భక్తుఁడే మేని దైవకారణమున వివశుఁడై దోసఁగు లొనర్చినను కరుణామయుఁడగు పరంధాముఁడు వానిని పరిగణింపక దివ్యత్వ మనుగ్రహించి భక్తుని తనయంతవానినిగా జేయుటకే సంసిద్ధుఁడగును. పరమేశ్వరానుగ్రహమునకుఁ పాత్రులగు జీవులకు బాహిరములగు ప్రకృతులును భౌతికములగు బంధనములును ప్రతిబంధకములు కాఁజాలవు. అవి యాస్వామి యనుగ్రహమున సూర్యోదయమున నంధకారమట్లును, గరుఁడునిముందు నాగపాశము లట్లును పటాపంచలై పోవును. ఇదియే తచ్చరిత్రసారము.

*10.* పెరియాళ్వారు : పన్నిద్దరాళ్వారులలో పదియవవారు విష్ణుచిత్తాహ్వయులగు పెరియాళ్వారు.[2] పాండ్యదేశమున ధన్విపురమని ప్రఖ్యాతి గాంచిన శ్రీవిల్లిబుత్తూరు గ్రామమున జ్యేష్ఠమాసమున గంధవహాతారయందు నక్షత్రవేదమయాంగుఁడైనట్టి పక్షీంద్రు నంశంబున ప్రభవించి వీరు తొలుత భట్టనాధుండనఁ బరగిరి.[3] వైష్ణవ

---

1. తొండరడిప్పొడియాళ్వారు కృతులు—

శ్రీమాలిక (తిరుమాలై) 45 పాశురములు-

ప్రాబోధకీస్తుతి - తిరుప్పళ్లియళుచ్చి 10 పాశురములు.

2 పెరియాళ్వారులకే విష్ణుచిత్తయోగి, భట్టనాధముని, భట్టముని, స్వాతియోగి గరుడాంశయోగి, శుల్కముని కనక శుల్కముని, పరతత్త్వస్థాపకయోగి, గోదాజనకముని విష్ణుమతస్థాపనాచార్య, ధన్విపురయోగి మున్నగు నామాంతరములున్నవి

3. విష్ణుచిత్తులవారి జననము—

'జ్యేష్ఠాస్వాతిభవం విష్ణురథాంశం ధన్వినః పురే
ప్రపద్యే శ్వశురం విష్ణోః విష్ణుచిత్తం పురః శిఖమ్'

(బ్రహ్మతంత్రస్వామి రచన)

పూజావివర్ధను లగుటచేత వీరే పిదప విష్ణుచిత్తాహ్వాయు లయిరి. బాల్యము నుండియు నాయూరి వటపత్రశాయినే భక్తితోఁ బూజించి, 'సకల యాగంబులకంటె నెరయంగ గడుమనోహరమైన పూజ విరుల పూజనమని తెలిసి' మాలా కైంకర్యమునే సాగించుచుండిరి.

ఆ దినములలో మధురాపురము రాజధానిగా పాండ్యమండలము నేలుచుండిన వల్లభదేవుఁడను ప్రభువు తనయేలుచుండిన పురమునందలి సర్వజనుల యునికియు, వారాడుచుండు వాక్యములు విననంగోరి బయల్వెడలును. కాత్రక్రమిమ్మన యానదు రేయి ప్రభువు గొంగడి ముసుగిడి మరలి వచ్చుచుండగా నొకపంచతిన్నెపై నిదురించుచుండిన బ్రాహ్మణునొకని మేల్కొల్పి కైవీడియంబొసగి ప్రసంగ వశమున తారు చదివిన విశేషములు చెప్పుఁడనగా నా బ్రాహ్మణుఁ డిట్లు పల్కెను—.

'కడునేర్పమై వానకాలంబుకొఱకుఁ గడమయెన్మిదినెల లడియింపవలయు
నగపడురాత్రికై యామ్మఁజింతించి పగలెవస్తువుల సంపాదింపవలయు,
మునువచ్చువార్ధకమునకునై నరుఁడు తనయౌవనమున యత్నముసేయ వలయు,
కానీయంబైన పరకారణంబు నీజననమునందె యెఱుగంగవలయు', [1]

ఆ హితమువిని రాజు 'అదృష్టంబు గలిగించు తెరువు వెదుకంగఁ దలచి' సంపదుఁ[2] డను పేరఁబరగు తనపురోహితునిబిలిచి, 'యంతిమ పురుషార్థ సిద్ధియేలీలగలుగునో' యెరిగింపఁగోరును. ఆతని సూచన

---

1. వర్షార్థ మష్టౌ ప్రయతేతమాసాన్
నిశార్థ మర్థం దివసం యతేత
వార్థక్యహేతో ర్వయసానవేన
పరత్రహేతో రిహజన్మనాచ." అను శ్లోకమున కీయనువాదము.

2. ఈతఁడే శెల్వనంబి లేక సంపత్పూర్ణుఁడనఁబరగినవాఁడు. ఆధార గ్రంథములందలి నామములమ గాని, సన్నివేశములమగాని చిన్నన్న యిందు మార్పఁ బ్రయత్నింపలేదు—

ననుసరించి పిదప రాజు నిగమాంతవిదులను రావించి పరతత్త్వనిర్ణయము గావించి శుల్కముగొనుండని చాటించెను. కపిలాక్షపాదభట్టాదిఘన శాస్త్రవిదు లచటి కేతెంచి యన్యోన్యమతాభిదూషణములతో మృషావాదములతో పరతత్త్వము నిర్ణయింపఁజాలక వాదులాడుకొందురు. నరనాథుఁడు చింతించెను. ధన్వినగరావాసుఁడైన వటపత్రశయనుఁడు తన భక్తుఁడగు విష్ణుచిత్తుని బిలిచి 'పాండ్యభూకాంతుని సభకేగి కనక శుల్కము నైకొను'మని యాజ్ఞాపించెను—.

'వేదమో శాస్త్రంబో వివరించిచూడ వేదార్థసాధ్యమైవెలయు శుల్కంబు
పాయక గుద్దలిపట్టిన కేలికాయలచూపి యేఁ గైకొనుచెప్టు?'

అని యాముని విచారింపఁగా నాతని హృదయపద్మమున తానే నెలకొని నిశ్చితార్థంబు పలికింతునని చెప్పివంపును-సభలో విష్ణుచిత్తులు

'సర్వనియంతయై సర్వజ్ఞుఁడగుచు, సర్వంబుఁ దనకు శేషంబుగా మెలఁగు
కాంతిఁబాయని మణికరణి నాదివసకాంతుఁబాయని రుచిగతిఁ బద్మగూఁడి
మిగులవేదములాడి మిథునంబటంచుఁ బొగడఁబెంపొందు శ్రీ పురుషోత్త
ముండు పరతత్త్వమని'

చాటెను. ఆ పల్కుపల్కులోపలనే, తత్సభాస్తంభ మధ్యమున ఘనపాశములఁ గూడగట్టిన ముడుపు తనుదానె యాతని పాదములపై వ్రాలెను. తోడనే దుందుభులు మొరసినవి సురలు విరులవాన గురియించిరి. వల్లభదేవుఁ డానందించి, విష్ణుచిత్తులవారిని సన్మానించి దంతావళారూఢుఁజేసి తన నగరమున నూరేగించును. అప్పుడు గరుడ వాహనారూఢుఁడైన స్వామి వారికి సాక్షాత్కారమొసఁగును. విష్ణుచిత్తుఁ డానందతాండవ మొనరించును. భక్తితో స్వామివారికి మంగళాశాసనమును, 'దామోదరుని యవతారాదిలీల లామోదమాలికలై' యొప్పుచుండఁ బ్రామాణికోక్తి గర్భంబునై యొప్పు ద్రావిడోక్తులఁ బ్రబంధంబుఁగావించెను.

ఇట్లు ప్రబంధయుగ్మంబు విరచించి[1] యెప్పటియట్ల వటపత్రశాయికి మాలాకైంకర్య మొనరించుకొనుచు శేషజీవితమును స్వామి పాదపద్మములకడనే గడపుకొనెను[2].

ఈ యాళ్వారు జీవితము జిజ్ఞాసువులకు జ్ఞానముకన్న భక్తియే మిన్నయని నిరూపించును. సర్వవిధములగు కైంకర్యములలోను మాలాకైంకర్యము స్వామికి ప్రీతికరమనియు వెల్లడిసేయును.

*11. గోదాదేవి :* పెరియాళ్వారులు నివసించిన ధన్విపురము లేదా శ్రీవిల్లిపుత్తూరు ప్రాంతమే పూర్వము శ్రీమహావిష్ణువు వరాహావతారమున భూదేవితోగూడి రమించిన ప్రదేశము. ఆ సమయముననే భూదేవి సకలకైంకర్యములలో మాలాకైంకర్యమనిన యిష్టమని యెఱిగి తత్సేవాపలబ్ధికై గాఢముగా వాంఛించి యా శ్రీవిల్లిపుత్తూరునగరమందే ఒక మాలాకారుని యింట నవతరించినది. ఆమెయే గోదాదేవి. ఈమె పన్నిద్దరాళ్వారులలో పదునొకొండవ మూర్తి[3]. ధారుణీయంశమున శుచిమాసమున పుబ్బ శుభముహూర్త

---

1. పెరియాళ్వారుల ప్రబంధయుగ్మమున—
మొదటిది 'మంగళాశాసనము'-తిరుప్పల్లాండు-12 పాశురములు.
రెండవది పెరియాళ్వారు తిరుమొజి - 461 పాశురములు.

2. ఈ పెరియాళ్వారుల కథ నాధారగ్రంథములందున్న తీరుననే చిన్నగా యిందు పొందుపరచినాఁడు. కాని ఆముక్తమాల్యదాకారుఁడగు శ్రీకృష్ణదేవరాయలీ కథను చాల మార్పులతో కూర్పులతో వివరించెను.

3. ఈ గోదాదేవికే శూడిక్కొడుత్తనాచ్చియార్, ఆండాళ్, విష్ణుచిత్తతనయ, శ్రీరంగ మహిషి,- రంగరాజ మహిషి, రంగమహిషి, భూమిదేవ్యంశదేవి కాంతామణి రమాసపత్ని, దివ్యమహిషి, నమమాతా, తులసీమూలజాతా, మున్నగు నామాంతరములున్నవి.

జననము :—

'కర్కటే పూర్వఫల్గున్యాం తులసీకాననోద్భవామ్
పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్'

మున తులసిపాదు మధ్యమున పెరియాళ్వారు తోటలో నాయాళువారునకు సీతమ్మ జనకునకువలె లభించినది. అశరీరవాణి యామె యవతారమును గూర్చి వివరించినది. ఆళువారు ప్రీతితో నామెను కన్నబిడ్డనువలె గారాబుచేసి పెంచుకొనెను. పసితనమున నాబిడ్డ బలసోదరునిమీఁద పదములు పాడిననేగాని నిదురపోయెడిదికాదు. ఆటలలోను, పాటలలోను పతివేరు రంగఁడనియే యామె చాటుకొనుచుండెడిది. రంగని నామస్మరణముననే రంగని సేవలోనే ఆమె పెరిగి పెద్దదైనది. యౌవనవతియగు నామె తండ్రికి పుష్పాపచయమున సహకరించి పుష్పదామముల నల్లుటలో తోడ్పడెడిది. వనమాలి కర్పింపవలసిన విరులదండను తండ్రి కెరుకపడకుండ మున్నే తానుకొప్పునందుంచుకొని పెరటి నడబావిలోని నీడలో తన యాకృతిని తానుజూచికొని మురిసి పోయెడిది. తాను ముడిచివిడిచినదండనే యాదండ నున్న పూసెజ్జలో నిడఁగా నాళువారు దానినేగొని వటపత్రశాయి కర్పించెడివాఁడు. ఆ స్వామి యానందించు చుండెడివాఁడు. ఒకదినమున వటపత్రశాయికై యిడిన గూడలోని క్రొన్ననదండను తాను తురుముకొని నడబావినీడను జూచుకొనుచుండగా నేమరుపాటున నేతెంచి తండ్రి కోమలిదిక్కు కన్గొని, 'తల్లి! హరిసమర్పణమున కమరించు పుష్పసరములు నీకు శేషముఁజేయఁదగునా?' యని యాళువారు వేరొక కొన్ని యలరులుగోసి వటపత్రశాయి కర్పించెను. స్వామి యామాల నొల్లక 'నీ చిన్నికన్నె క్రొమ్ముడిని ముడువని దండ నేముడువ నెంతైన' నని పలికినాఁడు. తండ్రి తనుజాత ముడిచినదామము గ్గొనితేగా గోవిందుఁడానందమొంది యెదపైఁ జేర్చుకొనియుండినాడు. ఆమెనే ప్రేమదైనారంగఁ బెండ్లియాడెదనని బాసచేసినాఁడు. ఒకతూరి గోదాదేవి వెన్నునికథలువిను కుతూహలముతో తండ్రిని వేడగా నాళువారు నూటయెన్మిది తిరుపతులలోని యర్చావతారముల వైభవములను విపులాతివిపులముగా వివరించును. పరవశయై గోదాదేవి వీనులవిందు గూర్చెడు శ్రీరంగేశు చరితమును వినివిని యానందతన్మయత్వము నొందెను. ఆ రంగవిభుని మహిమ మఱివేల్పులకు నవాఙ్మానస గోచరమని యెఱిఁగి యామె యాస్వామినే నాథునిగా వరించినది.

వ్రేతలు మార్గశీర్ష వ్రతంబుగావించి కృష్ణుని పొందఁగాంచినట్లే తానును తద్వ్రతము నాచరించిన శ్రీరంగని పతిగా పడయవచ్చునని యెఱింగి శ్రద్ధతో నా వ్రతము గావించినది. తానే గోపకాంతగా భావించుకొని ముప్పదిపాటల ప్రబంధము నొకదానిని, నూటనలువది పాటల ప్రబంధము వేఱొకదానిని రచించి[1] కీర్తించుకొనుచు రంగనిమీఁది ప్రణయమున విరహాతిశయ మనుభవించుచుండెడిది. చెలికత్తె అనుగ్రహ ఆమెకుపచరించు చుండెడిది. గోదాదేవి యవస్థను జూడఁజాలక మున్ను శ్రీరంగఁడిచ్చిన బాసను దలచుకొని విష్ణుచిత్తు లామెను శ్రీరంగమునకు గొంపోయిరి. మార్గమున పల్లకియాపి చూడఁగా నందు గోదాదేవి కానరాదు. ఆమె అంతకుఁబూర్వమే యంతర్ధానమై శ్రీరంగనిచేరి యుండెను. విష్ణుచిత్తుఁడు లౌకికమగు వ్యామోహమున ఖేదమంది, 'వనజాక్షు! వలసినవాఁడవై తేని ఘనతమై మా యింటికడ కేగుదెంచి చుట్టరికమేపారంగ సేసయిడి నీవు గొంపోవుట తగునుగానియిదియేమి పని'యని స్వామిని మందలించును. శ్రీరంగఁ డట్లే చేయునట్లు బాస చేయును. తండ్రి దుఃఖముఁ బాపుటకై కమలాక్షుని వామభాగము నుండి గోదాదేవివచ్చి యాతని కడచేరును. శ్రీరంగని దర్శనానంతర మిరువురును స్వగ్రామమునకు చేరుకొందురు. శ్రీరంగఁడు వివాహమునకై తరలివచ్చును - వివాహము ఆగమోక్తముగ జరుగును. మంగళస్నానానంతరము వారలంకరించుకొందురు. దినకరచంద్రులు తెరవట్టుదురు. సగుడజీరకములతో, తలంబ్రాలతో, లాజహోమములతో, సప్తపదులతో పెండ్లి వేడుకగా జరుగును. యక్షగంధర్వసతులు శోభనములు పాడుదురు. గోదారంగనాథులు శేషతల్పమున మరుకేళిఁదేలి యోగనిద్రా సక్తినుండగా నలపరాంకుశముఖ్యులగు యోగివర్యులు ప్రాబోధకీస్తుతిని[2] పాడి వారిని మేల్కొలుపఁ జేయుదురు.

---

1. ఈ రెండును గోదాదేవి రచనలు :
   1. ముప్పది పాటల ప్రబంధము-తిరుప్పావై-30 పాశురములు
   2. నూటనలువది పాటల ప్రబంధము-నాచ్చియార్ తిరుమొళి —143 పాశురములు.

2. ఈ ప్రాబోధకీస్తుతి తొండరడిప్పొడియాళ్వారు రచన. అందలి పదిపాశురములకు విందు తెలిగింపు గలదు.-

ఇఁక నప్పగింతల సమయమున తండ్రియగు విష్ణుచిత్తుఁడు కూతురగు గోదాదేవికి, శాకుంతలమున కణ్వుఁడు శకుంతలకువలె గృహనీతి నుపదేశించును పౌరజనులతోఁ గలిసి వారందఱును, ఆ పుణ్యదంపతులను సాగనంపుదురు. శ్రీరంగఁడు పరమానందమున నా సీమంతినీమణి గోదాదేవికి సర్వమును బరిచయము గావింపుచు కావేరీతీరస్థమగు శ్రీరంగమునకుఁ గొంపోయి సుఖముండును. ఇదియే పదునొకొండవ యాళువారగు నాండాళ్ చరిత్రము.

ఈ గాథను చిన్నన్న చాల విపులముగ మూలముననుసరించి విరచించెను. కొన్నిపట్టుల నౌచితి నపేక్షించి మార్పులను గూర్పులను గావించినాఁడు. ద్రావిడ గ్రంథముల ననుసరించియు నీ పట్టులందు కవి చాలవఱకు శ్రీ కృష్ణదేవరాయని ఆముక్తమాల్యదాకథనే యనుసరించినాఁడు. ఈతని రచన ద్రావిడమూలము యొక్కయు, రాయల ఆముక్తమాల్యద యొక్కయు, మేలికలయిక యనఁదగును. ఉదాహారణకు గోదాదేవి ముడిచినదండను విడచి స్వామి కర్పించు ఘట్టమువ ద్రావిడ మూలమునందువలె తండ్రియగు విష్ణుచిత్తుఁ డవమానింపఁబడుటగాని, రాయలకవితయందువలె నాశఁడావిషయము నెఱుగకనే యుండుటకాని కానరాదు. ఇందు గోదాదేవి స్వామికై తండ్రికట్టియుంచిన దండను తాను తలలో తురుముకొనుచుండుటను విష్ణుచిత్తుఁడు తలవనితలంపుగ చూచుట తటస్థించును. ఆమె పూలు ముడుచుకొనుటకు ముచ్చటపడినది కాఁబోలుననుకొని, 'తల్లి! యిట్లు హారసమర్పణమున కమరించు పుష్పసరములు నీకు శేషముఁ జేయఁదగుఁనె ?' యని పలికి వేఱొకకొన్నియలరులు కోసి నాటి కావటపత్రశాయి కర్పింపనేగుటయు,పిదపస్వామివలననే సర్వవిషయము నెఱుఁగుటయు నిందువర్ణితము. ఈ కూర్పులలితమనోజ్ఞమై యాయా పాత్రలకు వన్నె పెట్టునట్లున్నది. ఇట్లే నూటయెనిమిది తిరుపతులందలిస్వాముల వర్ణనమును రాయలు విడచినను అభిమానమున విపులాతివిపులముగా మూలము ననుసరించి చిన్నన్న తెనుఁగుచేసినాఁడు. అట్లే గోదాదేవిని విష్ణుచిత్తులవారు పల్లకిలో శ్రీరంగమునకుఁ గొంపోవుచుండ మార్గమధ్యమున స్వామి యామె నంతర్ధాన మొనరించి చమత్కరించుటయు,

కథవివాహముతో మంగళాంతమగుటయు నను విషయములలో మూలముకన్న భిన్నముగ రాయలననుసరించియే రచించెను. ఇట్లే చిన్నన్న రచనము అంతకుపూర్వపు రచనాసంవిధానములలోని మేల్మి మెఱుంగుల నేర్చుకొని ప్రాతక్రొత్తల మేలుకలయిక యనఁదగి నట్లున్నది.

ఈ యాళువారి చరిత్రము భక్తి తత్త్వముయొక్క పరమావధిని ప్రపంచించుచున్నది. పరమప్రాప్యుఁడగు పరమపురుషుని చేరఁగోరు జీవుఁడు తానే నాయికయై, స్వామినే వలచి వలపించి భక్తిభావమును దివ్యశృంగారరసస్థితి కుద్ధరించి సంయోగమున తాదాత్మ్యానందానుభూతినందవలెనని ప్రబోధించుచున్నది. అట్టిపరిణతస్థాయిలో భక్తుని కైంకర్యము లౌకికరీతినెట్లు భాసించినను దైవికముగ నంగీకార్యమే కాఁగలదు. విశిష్టాద్వైతసిద్ధాంతప్రతిపాదనమున కీ గోదాదేవికథ వేదమునకు పురాణేతిహాసాదులవలె పరిపోషకము.

*12.* **తిరుమంగై యాళ్వారు :** పన్నిద్దరాళ్వారులలో పండ్రెండవ యాళ్వారుగా ప్రసిద్ధిగాంచిన తిరుమంగై యాళ్వారు[1] చోళమండలమున పరిరంభపురి ప్రాంతమునగల కమలాపూర్ణ (తిరుక్కురైయిలూర్)నగరమున 'కమలలోచను పాదకమల వంశమున' స్వామి వారి కార్ముకాంశమున కార్తీక కృత్తిక యందవతరించిరి. 'చతుర్విధ కవిత్వములఁ గవివరేణ్యులకెల్లఁగర్త'యై 'చతుర్విధ కవిత్వస్వామి'

---

1. తిరుమంగై యాళ్వారుకే పరకాలయోగి, పరాంతకయోగి, అరిదంశధర, శాత్రవాంతక, కార్ముకాంశయోగి, వసుయోగి, ఉపరిచరవసుయోగి సేనాపతియోగి, చోళయోగి, చౌర్యరసిక, కుముదవల్లీరమణ కరవాలభీమ, బౌద్ధభేదక, పరాక్రమముని, అపహాయశూర, మనోహరయోగి, అష్టాక్షరముని, నారాయణముని, అన్నదానరసిక, ఆత్మయోగి, మున్నగునామాంతరములున్నవి

వీరి జననము :—

కార్తికే కృత్తికా జాతం చతుష్కవిశిఖామణిమ్<br>
షట్ప్రబంధకృతం శార్ఙ్గమూర్తిం కలియమాశ్రయే.

(బ్రహ్మతంత్రస్వామి రచన)

యను బిరుదమునంది చోళరాజునకు మంత్రియై, స్వామి కైంకర్య మునను, తదీయారాధనమునను శక్తియుక్తులనెల్ల వ్యయించిన ధన్య జీవులు వీరు. శూద్రునింట సామాన్యకుటుంబమున జన్మించిన వీరి యునికికిని, మనికికిని, సార్థక్యముఁ గల్పించినది వీరి భార్య కుముదవల్లి యనునొక భక్తురాలు. ఆమె అందాల రాశి. వేల్పుజెలువ యంశ. నాగపట్టణమునందలి యొకభిషగ్వరుని కూతురు. ఆమె యందచందము లకు తిరుమంగై యాళ్వారు వరించి 'సరసిజాక్షుని శంఖచక్రచిహ్న ములు ధరియించి పరమప్రసన్నుఁడై యెపుడుఁ జారువైష్ణవసహ స్రమున కన్వహము నారగింపొనరింతు'నని మాటయిచ్చిన వానినేగాని యితరుని పెండ్లియాడ దని యెరిగి పరకాలుఁడు తానే యాయర్హ తలు గూర్చుకొని యామెను బెండ్లియాడి వైష్ణవభక్తితో తదీయా రాధనము గావించుచు సుఖముండెను. తాను రాజునకు బాధ్యుఁ డగు మంత్రియను మాటయు మరచి కోశాగారమునందలి ధనమెల్ల వెచ్చించి నిరతాన్నదానవ్రత మాచరించుచుండెను. కనులు గుట్టిన కరణముల దుర్వ్యవసాయమున చోళరాజు సైనికులు బంధింపఁబోగా వారినెల్లర నోడించి తానే స్వయముగ రాజసముఖమునకేగి విషయ మెల్ల నివేదించును. కాని చోళరాజు కపటమున స్నేహము నటించి వంచించి ధనమెల్లఁ గ్రక్కుమని పరకాలుని బంధించి నిర్బంధించును. స్వప్నమున వరదరాజస్వామి సాక్షాత్కరించును. తానే అరుళాల దాసుఁడను పేర తీర్పరిగా వచ్చి వేగవతి చెంత వారిసొమ్ము వారి కిప్పింతునని మాటయిచ్చును. ఆ మాటమేరకు పరకాలుఁడు మరు నాఁడు రాజభటులను ధనము చెల్లించు నెపమున వేగవతీ తీరమునకుఁ గొనిపోవును. ధనసూచకపురుషవేషమున స్వామియే అరుళాల దాసుఁడయి వచ్చి ముష్టి ధనమునకు పుణ్యాత్ముని బంధింతురా ? యని మందలించి తనమాయచేత నుద్భవమైన ధనమునుజూపి కొలుచు కొమ్మనును. వారును రావలసిన ద్రవ్యమును తూముఁపాటి గొలుచు కొని మూటలు గట్టి చెల్లుచీటి యిచ్చి నిర్గమింతురు. పరకాలుని నిజా యితీకి మెచ్చి చోళరాజు అతనికి చెల్లుచీటియే కాదు కబ్బాయి కుళ్ళాయినిచ్చి మఱియుఁ గొన్ని సీమల నిత్తునని పిలిపించుకొనును.

17)

కాని కోశాగారమున ద్రవ్యము చేరిన తరువాత స్వామి దానినెల్ల మాయముగావించును. దైవోపహతుఁడగు చోళరాజు ఆ మాయలు మహేంద్రజాలములు పరకాలునివే యని భ్రమించి సత్కరింతు నను మాటకు బదులు వారి యాస్తులనే తస్కరించి యా సీమలనుండి వెడల నడచును. పరకాలుఁడు నీచుఁడగు రాజు ప్రవర్తనము రోసి, యా సీమ వెడలి నిర్ధనుఁడయ్యుఁ దన భార్యకిచ్చిన మాటచొప్పున తదీయారాధనమును, నిరతాన్నదానవ్రతము నిర్విఘ్నముగఁ గొనసాగుటకై మార్గాంతరముల నన్వేషించుచు, తుదకు 'వైష్ణవార్థముగఁ దొడరి దొంగిలిన నే దోషములేదు' అని తలచి దోపిడిదొంగగా పరిణామము నెందును. అడవులలోఁ దాగి సముద్రతీరమునందలి కరపట్టణములనుండి సాగు వర్తకపు సరకుల దారులుకాచి దోచియు, ధనికుల తెరువడ్డగించి నిలబెట్టి నిలువున దోచియు, అహంకరించి పెనఁగిన వారి మదుమణంచి దోచియు పలుతెఱగుల నార్జించి నిష్ఠతో వ్రత మాచరింపసాగెను. కాని యెన్నఁడును శంఖచక్రములను తిరుమణి తిరుచూర్ణములను ధరించిన భాగవతోత్తములను మాత్ర మాకపెట్టి దోచి యెరుగఁడు. అది యాతని నియమము. ఇట్లు నియమనిష్ఠలతో చోరధర్మమున ధనమార్జించుచు భక్తి శ్రద్ధలతో తదీయారాధన మాచరించిన పరకాలునిజీవితమున స్మరింపఁదగిన విశేషము లెన్నియో కథలుగా గాథలుగా నిలిచియున్నవి.

ఒక దుర్దినము రాత్రి ముసురువట్టి వాన చినుకులు పడుచుండగా త్వరపడి పరకాలుఁడొక వైష్ణవునింటిపంచ నొదిగి ముచ్చిలఁ బొంచియున్న సమయమున నావైష్ణవోత్తము నంగనారత్నము పతి భోజనానంతర మా పళ్ళెమును వాన చినుకు పడుచుండిన కారణమున వాకిటనే నిలిచి కడిగి పారబోయుచుండఁగా మెఱపువెల్గున నది తళుక్కని మెఱయఁగా పొంచియుండిన పరకాలుఁడా కళ్యాణిచేతి కంచము నొడిసి లాగికొనెను. వెంటనే యామె 'అస్మద్గురుభ్యోన్నమః' యనుకొని లోనికి వెళ్లిపోయినది అట్లు దొంగిలించినది పరమభక్తుఁడగు పరకాలగురువే యనితలఁచి యాభక్తున కామాత్రమేని యీయఁ గలిగితినని యామె యానందము చెందినది. కాని పరకాలుఁడు ఆమె

పలుకులు వినినంతనే శ్రీ వైష్ణవుల సొమ్ము గ్రముచ్చిలించితినే యని విచారించి యా పళ్ళెరము నా వాకిటనే డించి, యేమగునోయని యా పంచనే పొంచియుండెను. ఆ శ్రీవైష్ణవ దంపతు లా పళ్ళెము వాకిటనే యుండుటను గుర్తించి పరకాలముని గావించు తదీయారాధనమునందలి పుణ్యమును తాము పంచుకొన లేకపోతిమి గదా యని విచారింతురు. ప్రక్కనే యుండిన పరకాలుఁడు వారి సొమ్మును తెలియ కపహరింపఁబోయినందులకు క్షమియింప వేడును. ఆ దంపతులు పరమభక్తుఁడగు పరకాలుని పాదకమలములపై వ్రాలి వేవేల చందముల వినుతింతురు. ఇట్టిది పరకాలుని చోరధర్మనియతి—.

*మఱియొక కథ :* ఒక తూరి తెరువాటు కొట్టుటకై పరకాలుఁ డెంత వేచినను ఆ మార్గమున నెవ్వరును రాకపోయిరి. అతఁడా నాఁడు తెరువాటు గొట్టక తదీయారాధనము సాగుటెట్లా యని చింతిల్లు చుండెను. అపుడు రమానాథుఁడు మత్పూజకంటె మద్భక్త జనులకు చేయు పూజనలే ప్రియ'మని పలికి యాతని మనోరథమీడేర్పఁ దలచి వైనతేయుని హాయముగావించి, నిత్యులకు నరాకృతులిచ్చి, బ్రహ్మను పురోహితునిగా నొనర్చి తానును లక్ష్మియు నూతన వధూవరులై పెండ్లి యూరేగింపు తరలి వెళ్ళుచున్నట్లుగా నా మార్గమున పయనించును. పరకాలుఁడును తన కోరిక ఫలించినదని తలఁచి వారిపైకి కలియఁబడును. వారి యరణము సమస్తముదోచెను. ఆ దంపతుల శరీరములందలి యాభరణముల నన్నిటిని దోచుకొనెను. చివరకా వీరుని వ్రేలనున్న పవిత్రంబుఁజూచి చేతితో తీయరాకపోగా నోటితో కఱచి తిగిచికొనెను. వానినన్నటిని పెట్టెలలోనింపి ఎత్తఁబోగా నా భార మాతనికి లేవకుండెను. పురోహితుఁడేమేని మంత్రించెనేమో యని పరకాలుఁ డాతని నిందింపఁగా వారించి, దానికి ప్రతిమంత్రముపదేశింతును రమ్మని చేరఁబిలిచి వరుఁడు వానిచెవిలో 'సంసారభవవార్ధిమునుఁగు జీవుల నొకదరిఁ జేర్చునావ'యగు నష్టాక్షరమంత్ర రాజమును సాంగముగ నుపదేశించును. ఆమంత్రోచ్చారణతో పరకాలునకు స్వామి ప్రత్యక్షమై జ్ఞానోపదేశమగును. అంతట పరకాలుఁడాళువారై స్వామివారి మహిమను పాటలుగా రచించి పాడుకొనుచు నాతనియనుగ్రహమున యథాపూర్వము దదీయారాధనముగావించుచుండెను.

ఇట్లే పాడుకొనుచు, శిష్యులతోఁగూడి, తీర్థయాత్రలొనర్చుచు, శ్రీనివాస దర్శనార్థమేగుచుండగా మార్గమున నలసిసొలసిన వారి కందరకును కాంచీనగర సాష్టభుజనృసింహస్వామి వృద్ధవేషమున వచ్చి యమృతమిచ్చి యుపచరించును. పిదప వారందరు నట్లే పాడుఁకొనుచు శ్రీ వేంకటేశ్వరుని దర్శించి వేనోళ్ల వినుతింతురు. మఱలి యందరును శ్రీరంగము చేరుకొందురు. అచట శ్రీ రంగేశునకు కైంకర్యము లొకకొన్ని చేయఁదలచి వలసిన ద్రవ్యమునకై పరకాలుఁడు పలుయత్నములు గావించెను. వానిలో నాగపట్టణమునందలి జైనాలయమునందలి బంగారు విగ్రహమును తన శక్తియుక్తు లుపయోగించి దోచుకొనివచ్చి కరిగించి, స్వామివారి కైంకర్యమునకు వినియోగించిన కథ చమత్కార భరితమైనది.

చోరులకుఁ జొరరాకుండ కట్టిన యా జైనాలయమందలి విగ్రహమును దోచుటకై తన్నిర్మాణమున పనిచేసిన శిల్పులుగల యూరికేగి యందలి విగ్రహమును దొంగలు దోచిరని వెల్లడింపఁగా నా వార్తవిని యక్కడి ప్రధానశిల్పి యాలయప్రదేశమున తాను నిర్మించిన రహస్యనిర్గమనమార్గమెల్ల వివరించి యా రహస్యములా దొంగలకెట్లు వెల్లడియైనవోగదా యని యచ్చెరువందును. ఆ యుక్తితో పరకాలుఁడు ప్రత్యక్షముగా నా రహస్యముల నెల్ల నెరిగి తన్మార్గమున నాలయమందలి సువర్ణవిగ్రహమును వెలికిఁ దీయించును. ఆ ప్రయత్నమున పరకాలుని మఱది ప్రాణత్యాగము చేయవలసివచ్చును. వానికిఁ బొందితో వైకుంఠము వచ్చును. స్వామి కైంకర్యమే లక్ష్యముగాగలవారు దేనికిని సంకోచింపక త్యాగము లనేకములుచేసి విగ్రహమును అంచెలంచెలుగా శ్రీరంగమునకు చేర్పింపఁజూతురు. మార్గమున చిక్కులెన్నో ఎదురైనవి.

ఒకనాటి రాత్రి కృష్ణపురియను నొకగ్రామమున వారు విడిది చేయవలసివచ్చెను. వారావిగ్రహము నూరివెలుపల పొలమున నిక్షేపించుకొనిరి. ఉదయముననే ఆ పొలముసేయు కాపులు దున్నుకొనుటకై వచ్చిరి. వారిని పొలము దున్ననిచ్చినచో విగ్రహము వెలువడును. అందుకై యాపొలమే తమదనియు వారు దున్నుటకే వీలు

లేదనియు వాదు లేవదీయుదురు. ఏడు తరముల వెనుకటినాఁటి తమ క్షేత్రాధిపత్యమును వారు నిరూపించుకొనలేకపోఁగా గ్రామమందలి కులకర్త వామనాఖ్యుని సాక్ష్యము ననుసరించి యా పొలము పరకాలునిదేయని నిర్ణయించును. అట్లు అప్పటికి స్వామిదయవలన చిక్కునుండి తప్పుకొని సంగమపురమును జేరుకొందురు. అచట వారికి ప్రయాణమున తోడుగా నూరిపొలిమేర వఱకును సంగమపురి తలవరినని చెప్పి యా యూరి స్వామియే వెంటవచ్చి పిదప నంతర్హితుఁడగును. అట్లు తోడునీడయైన సంగమపురీశునిపై పాటలు పాడుకొనుచు వారు తిన్నగా శ్రీరంగమును చేరుకొందురు. ముందు జాగ్రత్తతో పరకాలుఁడు ఆ విగ్రహముయొక్క కొనవ్రేలుమాత్రము కొట్టియుంచుకొని మిగిలిన సువర్ణమునంతను కరగించి స్వామివారికి కోటకట్టించును. తుదకు కోటగట్టిన కూలివారికి కూలినిప్పింతును రండని వారిని పడవలోఁ గొంపోయి కావేటినీటిలోముంచి మామూలు కూలి యేపాటిదని మోక్షమను ప్రతిఫలమునే గల్పించెను. ఇంతలో నాగపట్టణమున విగ్రహము పోయినవార్త విని నీటిలో జాడలెత్తజాలిన తలవరులు కొందఱు అడుగుజాడలను బట్టియు, మఱికొన్ని సాక్ష్యములనుబట్టియు వెన్నంటి వెదకుచువచ్చి పరకాలుని ప్రశ్నింతురు. అతఁడు విగ్రహమును తాను తేకున్నను తెచ్చినవారి వైనము నెరుగుటనుబట్టి కొంతకాలము గడువుబెట్టి యీలోగా 'ఆ విగ్రహము కొనవ్రేలుపోకుండ' నిప్పింతునని పత్రమును వ్రాయించి రంగపతిని సాక్ష్యముగాఁ జేసి వారినప్పటికి సమాధానపఱచి పంపును. పిదప గడువు పూర్తియై వారు విగ్రహమును కొనిపోరాఁగా వారి పత్రములనను సరించి వారికి "విగ్రహము కొనవ్రేలు"ను తాను ముందేకొట్టియుంచిన దానిని సమర్పించును. వారిదేమనగా పత్రమున నున్నప్రకార మిచ్చితి నని చెప్పివారిని మారుపలుకకుండఁ జేయును. వారు చోళరాజుతో మొఱవెట్టుకొందురు. రాజు పరకాలునికై పిలువనంపగా 'ఆగమ బాహ్యులను నెక్కడ బొడగన్న నక్కడ గతముసేయఁదగు'నని వివరించి రాజసమక్షమున వాదమున ప్రతిపక్షులనోడించి పరకాలుఁడే విజయమునందును. రాజు అతని ప్రతిభ కాశ్చర్యపడి సంభావించును.

ఇట్లు విజయమంది మరలివచ్చుచు మార్గమున ప్రసిద్ధ శైవ కవులతో వాదమునకు తలపడి వారి నోడించి మెప్పువడసి బంధచిత్ర గర్భ కవిత్వములతో నారాయణుని మహిమను గీర్తించుచు పర కాలుఁడు శేషజీవితమును గడపెను. తుదకు విరక్తినొంది తానును సతియు భద్రాశ్రమమున యోగవిద్యాసక్తి నుందురు.

ఈ యాళువారి జీవితమెల్ల తదీయారాధనముననే ధన్యమై పోయినది. చిన్నన్న వీరి చరిత్రమును విపులాదివిపులముగా రెండా శ్వాసములలో మూలద్రావిడ గ్రంథముల ననుసరించి విరచించెను. కాని యెడనెడ కథలో చోటుచేసికొని సమకాలిక సాంఘిక వాతావరణము, రాజుల ప్రమత్తత, స్వీయకుటుంబ సంబంధి వివరణము కొంత కొంత ద్యోతకమగుచుండునట్లే యాతని రచన సాగినది. యథాపూర్వమీ యాళువారిచరిత్రకథనమందును చిన్నన్న వారి ద్రావిడప్రబంధము లకు ఛాయానువాదములనఁదగిన ద్విపదలను కొలదిగా రచించెను. అతఁడే కథాసందర్భమున వివరించినట్లు తిరుమంగై యాళ్వారి రచన లలో ముఖ్యములైనవి యారు.[1]

"మీఁటిలోకము తెల్ల మెచ్చఁ జేసినవి - యాఱుకైంకర్యము లాఱు కబ్బములు-
నల మహాశ్రీవచనాభిధానమున నలవడు గృతి యందు నాదికావ్యంబు

1. తిరుమంగై యాళ్వారు రచించిన కృతులు ఆఱు.

1. పెరియ తిరుమొళి – 1084 పాశురములు.
(మహాశ్రీవచనము - వేయిన్నెనుబదియు నాలుగు పాటలు)
2. తిరుక్కురున్దాణ్డకమ్ - 20 పాశురములు.
3. తిరువెళుక్కూఱ్ఱిరుక్కై - 1 పాశురము.
(ఘనచిత్ర కావ్యభాగస్థితి యనఁగనొప్పు ప్రబంధము)
4. శిరియ తిరుమడల్ - 77½ పాశురములు.
5. పెరియ తిరుమడల్ - 148½ పాశురములు.
(మహోత్తమదళములనఁగ రెండు కృతులు)
6. తిరునెడున్దాండకమ్ - 30 పాశురములు.
(ధరణినెన్నగ నెడుందండకంబనఁగ)

మొత్తము 1361 పాశురములు.

తిరుపతులందు వర్తిలు భాగవతులె యరయగా కృతకృత్యులను నర్థమొదవ
నెనసి రెండవకృతి యిరువదినాలు దనరార ఘటియించె దండకంబనంగ
ఘనచిత్ర కావ్యభాగస్థితి యనంగ నమవొందుచుండ మూడవ ప్రబంధంబు
తలప మహోతమదళము లనంగ నలరెనాలవకృతి యైదవకృతియు
ధరణిసెన్నంగ నెడుందండకంబనంగ గరమొప్పనాఅవ కావ్యంబుచేసి"

(పరమ - 470 పు.)

ద్రావిడ ప్రబంధముల రచించిన పన్నిద్దరాళ్వారులలో తుది వారగు తిరుమంగై యాళువారి రచనలే యధికము-వీరు వ్రాసినన్ని పాశురములు మఱి యెవ్వరును రంచిపలేదు. వీరి రచనలు భావము నందును, బాహుళ్యము నందును గూడ సాటిలేవి-

ఈ యాళువారి చరిత్రము తదీయారాధన ప్రాముఖ్యమును వెల్లడించును. చేష్టకన్న మనశ్శుద్ధి ప్రధానమని బోధించును. భక్తి భావమునకు జాతిమతములవలెనే వృత్తి విధానములుగాని కర్మాచరణముగాని అభ్యంతరము కాఁజాలవనియు దైవకార్యపరుని పరిశ్రమమునకు లభింపవలసిన వెలలేని కూలి మోక్షమేకాని యన్యములగు లౌకిక విషయములు కాఁజాలవనియు వివరించును. లోకమున భక్తుఁడు తన జీవితము ను వెచ్చించియైన స్వామికైంకర్య మొనరింపవలెను. అతని శక్తి సామర్థ్యములును, యుక్తి చమత్కారములును గూడనందుకే వినియోగింపఁబడవలెను. పరమాత్మసాక్షాత్కారమునకు భక్తిని మించిన మార్గములేదు. భాగవతసేవను మించిన వ్రతవిధానములేదు. ఈ ధర్మములే వీరి జీవితచరిత్రమున నుద్ఘోషింపఁ బడినవి.

ఈ పరమయోగి విలాసమున చిన్నన్న పన్నిద్దరాళ్వారుల చరిత్రతోబాటు మఱికొంద రాచార్యుల జీవిత విషయములనుగూడ వివరించెను. వారందఱును పరమయోగులే. అందుకే చిన్నన్న ఈ కృతికి పన్నిద్దరాళ్వారులచరిత్ర మనికాక పరమయోగివిలాసమనియే పేరు పెట్టెను. ఇందు వర్ణితులైన యాచార్యపురుషులలో ముఖ్యులు మువ్వురు. వారే శ్రీమన్నాథమునులు, ఆళవందారులు, ఉడయ

వరులు. వీరు మువ్వురును వైష్ణవ మతప్రచారమునకును, దాని సుస్థిరత్వమునకు పన్నిద్దరాళ్వారుల తరువాత పాటుపడి కట్టుదిట్టములు గావించిన వారిలో ముఖ్యులు. వీరిలో ఉడయవరులే విశిష్టాద్వైత మత స్థాపకులును, ప్రవక్తలునై భారతీయ తత్త్వశాస్త్ర చింతనమున నొక నూతనోత్తేజమును గల్పించినవారైనారు. చిన్నన్న అట్టి పరమాచార్యుల చరిత్రములనిందు పొందుపఱచుటతో నాతని కావ్యరచనా ప్రయోజన మెన్నియోవిధముల నెరవేరినది-.

## శ్రీమన్నాథమునులు

కావేరితీరమున వీరనారాయణపురమున పరమభాగవతులు పలువురుండిరి. వారిలో శొట్టైకులమునకుఁ జెందిన ఈశ్వరభట్టు అను వైష్ణవునకు శౌరి సేనాధినాయకుని యాదిమ మంత్రియు గజాస్యాంశజుఁడునగు శ్రీమన్నాథమును లవతరించిరి.[1] వారు గానవిద్యా విశారదులు. ఈశ్వరముని వీరిసంతానము. తండ్రి కుమారు లిరువురును గొంత కాలము తీర్థయాత్రలు సలిపి వీరనారాయణ పురీశుని కోరికపై నచటనే స్థిరనివాస మేర్పఱచుకొందురు. ఒకతూరి నాథమునులు కురుకానగరము నుండి వచ్చిన కొందఱు వైష్ణవోత్తము లాలపించిన పరాంకుశముని రచిత ద్రావిడ ప్రబంధము నాలకించి యందలి భావ సంపద కచ్చెరువంది యా మహనీయుని కృతులనెల్ల సాంతముగ నధ్యయనముఁ జేయఁగోరుదురు. కాని యా వచ్చిన వైష్ణవుల కవి సాంతముగ రాని కారణమున తామే కురుకానగరమున కరిగి కురుకేశుఁగాంచి వరభక్తి నిదురవోవని చింత క్రింద నాశరగోపమౌనిని గానఁగోరి మున్ను మధురకవీంద్రుఁడు పలికిన దివ్యప్రబంధమును పండ్రెండు వేలమారులు ఆవృత్తిగావింపఁగా

1. నాథమునులకే - శ్రీరంగనాథముని, మునినాథుఁడు, శొట్టైకుల ముని, శ్రీవైష్ణవాచార్యులు, కృష్ణభక్తుఁడు, వీరనారాయణపురముని, గజవక్త్రాంశముని మున్నగు నామాంతరములున్నవి.

వీరి జననము :—

జ్యేష్ఠానురాధా సంభూతం వీరనారాయణే పురే
గజవక్త్రాంశమాచార్య మాద్యం నాథమునిం భజే॥.

కరుణతో శఠగోపమౌని నాథమునులకు దర్శనమిచ్చి యనుగ్రహించి తనదు దివ్యప్రబంధముల నన్నిటిని సార్థమ్ముగా నుపదేశించెను. ఇట్లు నేర్చి మఱలివచ్చి పిదప నాథమునులు వీరనారాయణాధీశుఁడగు శౌరితో జోడుగూడి యావృత్తి సేయుచు, తద్దివ్యప్రబంధనివహంబు తాళమానితముగాఁ బాడి, తన శిష్యవరుల కందరకును ఆ కృతుల నుపదేశించిరి. నాథమునులు తమ శిష్యులలో జయత్సేనాంశధారియగు పుండరీకాక్షునకు(ఉయ్యకొండార్ నకు) ద్వయమును దివ్యప్రబంధములను, శాస్త్రములను, నుపదేశించి కాళాంశసంజాతుఁడగు కురుకేశుఁడు (కురుకై కావలప్పన్) అను మఱియొక శిష్యునకు యోగవిద్యను బోధించి వారు తాము నేర్చిన విద్యలను గాపాడుకొని యట మీఁద బోడము తన పౌత్రుఁడగు యామునాచార్యునకు బోధింపవలసినదిగా నాదేశించిరి. పిదప వారు భగవద్ధ్యాన పారవశ్యమున లోకమంతటను రాధాకృష్ణులను సీతారాములను దర్శించి యానందించుచు పరమ భక్తులై పరమపదమందుకొనిరి.[1]

నాథమునులు గొప్పభక్తులు - గానవిశారదులు - చోళరాజు నాస్థానమున గానవిద్యాప్రదర్శనములిచ్చి వారిలో నుత్తముల నెన్నుటకు వీరే సభకు నిర్ణేతలుగా పిలువఁబడిరి. పంచలోహ నిర్మితములగు వేయి తాళములను వాయించినా తోడనే ధ్వనిని విని యవి యిన్నేసి పలములు తూకముగలవని చెప్పఁజాలిన సంగీత శాస్త్ర

---

1. నాథమునుల వంశవృక్షము.

(శొట్టైకులము.)
|
ఈశ్వరభట్టు
|
నాథమునులు (విష్వక్సేను మంత్రి-గజాస్య వంశజులు)
|
ఈశ్వరముని (వృష్ణిగర్భాంశము)
|
ఆళవందారు (యామునులు - సింహముఖాంశము)

వైదుష్యము గలవారు. వారే యాళువారుల ద్రావిడ ప్రబంధముల ప్రచారమునకు లోకమునఁ దొలుత యత్నముచేసినవారు. తాము పాడియు శిష్యకోటిచేత గానము చేయించియు వాని వ్యాపకమునకు వారెంతయో కృషి సల్పిరి.[1] కావుననే ఈ ద్రావిడాగమాంతములు తద్వంశపాలురచేతనే శ్రీ వేంకటేశ్వరుఁడెప్పుడును వినుచుండు'నని చిన్నన్న పేర్కొనెను. నాథమునులు ప్రథమాచార్యులు.

## యామునాచార్యులు (ఆళవందారు)

శ్రీ మన్నాథమునులకు పౌత్రులును, ఈశ్వరముని పుత్రులునగు యామునులు సింహముఖాంశసంభవులు.[2] వీరి జన్మమును గూర్చి నాథమునులు మున్నే భావించి వారి యుపదేశమునకై శిష్యులగు పుండరీకాక్ష కురుకేశతారాఖ్యుల నియమించి యుండిరి. వారిలో పుండరీకాక్షుఁడు బహుకాలము వేచియుండి తుదకు కుముదాక్షుఁడను సూరి యంశంబున నుదయించి శ్రీరామమిశ్రాఖ్యఁ జెలఁగు (మణక్కాల్ నంబి) శిష్యునకు తాను నేర్చిన యాగమరహస్యముల బోధించి యామునుల కుపదేశింపవలసినదిగా నాదేశించిపోయెను.వారు యామునుల కుపదేశించుకాల మెప్పుడాసన్నమగునా యనిచూచుచుండిరి.చిన్న

---

1. నమ్మాళ్వారువలెనే తాళ్లపాక అన్నమాచార్యులును వేలకొలదిగ సంకీర్తనములను రచించెను. ఆళ్వారులప్రబంధములను నాథమునులవలె అన్నమాచార్యులకీర్తనములను పెద తిరుమలాచార్యులు పలువిధముల ప్రచారమునకుఁ దెచ్చుటకు యత్నించిరి. ఈ తాళ్లపాక వారికిని ఆ యాళ్వారులకును అనేక విషయములలో సామ్యమున్నది.

2. యామునులకే - యామునాచార్యులు, యమునైత్తురైవరు, యామునతీర్థులు, యామునయోగి, సింహాసనాంశముని మున్నగు నామాంతరము లున్నవి

వీరి జననము :—

ఆషాఢే చోత్తరాషాఢా సంభూతం తత్ర వై పురే
సింహాసనాంశం విఖ్యాతం శ్రీయామునమునిం భజే॥

(బ్రహ్మతంత్రస్వామి రచన)

నాఁడే సూక్ష్మబుద్ధియైన యామునులకు తండ్రి సకలవిద్యలు చెప్పించి, పరిణయంబొనరించి, శాస్త్రాధ్యయనమునకై మహాభాష్యభట్టు రను వారికడకుఁబంపెను. ఇట్లుండ చోళరాజుకడ పురోహితుఁడైన పండితుఁడొకఁడు[1] గర్వించి తనతోడ వాదింపఁగలేని విద్వాంసులు తనకు పన్ను చెల్లింపవలెనని యాదేశించుచు నట్లే మహాభాష్యదేశికునికడకు పన్ను దెమ్మని భటులనంపెను. దేశికుఁడా విషయమెఱిఁగి విచారించుచుండఁగా యామునసూరి యచటికివచ్చి వాని బిరుదపత్రంబుచించి వైచి తనదైనబిరుదపత్రము వేఱొక దానిని రచించి ప్రత్యుత్తరముగాఁ బంపును. దానికి రోషించి వారు వాదమునకుఁ బిలతురు. చోళుని పట్టమహిషి యామునులే జయింతురనియు, లేకున్న తానా నగరి కుక్కలకెల్ల వండిపెట్టుదు ననియు పలుకును. రాజు తన పురోహితుఁడే జయించునని యట్లు జరుగకున్న తన రాజ్యమున సగము రాణికిత్తుననును. వీరి పంతము అయిన పిదప వాది ప్రతివాదులు పంతమాడుకొందురు. యామునులు కావన్నవెల్ల తానవునని నిరూపించునట్లును, లేని నాఁడు అతని పాదుకలతో నోటిమీఁద కొట్టించుకొనునట్లును నిర్ణయము జరుగును. వాదమున యామునులు చమత్కారమారంభించిరి. 'నిన్నుగన్న యంబ యవంధ్య', 'పతివ్రత యీ పట్టమహిషి' 'సార్వభౌముఁడీ రాజు', అని యామునులు ప్రతిపాదించిరి. ఆ ప్రతిపాదమునములను కాదని నిరూపింపవలసిన పండితుఁడట్లు చేయఁజాల కోడిపోవును. పిదప శాస్త్రోక్తులందును నోడిపోయెను. అప్పు డానందమున క్షితినాథుదేవి 'యామునేయు నెత్తికొని 'నన్నేల వచ్చితో తండ్రి!' యనెను. ఆ కతమున వారికి 'అళవందారు' అను నామమేర్పడెను.[2] పంతమున గెల్చిన రాణి రాజు తన కిచ్చిన అర్ధరాజ్యమును యామునులకే సమర్పించెను. యాము

1. ఆధార గ్రంథములం దీతనిపేరు అక్కియాళ్వార్ లేక విద్వజ్జన కోలాహలుఁడని గలదు.

2. 'నన్నేల వచ్చితో తండ్రి'-'ఎన్నె ఆళవందారో' అనుటకు తెనిగింపు. ఆ వాక్యమందలి పదములే 'అళవందారు' అను నామముగా యామునులకు నిలచిపోయినది—.

నులు రాజ్యమేలుచుండిరి. అట్టి యెడ వారికుపదేశించుటకై వేచి యుండిన శ్రీరామమిశ్రుఁడు ముండ్లములిచితకూర నారుమాపముల పాటు సమర్పించుచు యామునుల దృష్టి నాకర్షించి తాతగారు మనుమనికీయవలసినదిగా తమకిచ్చి పోయిన అర్థనిక్షేపమును గూర్చి ప్రస్తావించును. యామునులకు ప్రపత్తి మార్గమును బోధించి శ్రీరామమిశ్రుఁడు ద్వయమును రహస్యార్థములకు నుపదేశించును. యామునులు శ్రీరంగమునకు వేంచేసి రంగనాథుని సేవలో ప్రొద్దు పుచ్చు చుండును. అప్పుడే యామునులు సిద్ధిత్రయ, హరిస్తోత్ర, గీతార్థ సంగ్రహాది గ్రంథములను విరచించిరి. పిదప రామమిశ్రుని సూచన ననుసరించి యామునులు యోగవిద్యాగరిష్ఠుఁడగు కురుక్కావలప్పని దర్శించి శుశ్రూషించి గురుని చరమకాలమున తాను పొందవలసిన యోగవిద్యోపదేశమును పొంది చరితార్థులైరి. తమ తాతగారి తలఁపు ఫలప్రదమగునట్లు యామునులు 'స్థాపిత పటుజయ స్తంభములనఁగ నేపారు శిష్యులను, పెరియనంబి (మహాపూర్ణులు), తిరుమలైనంబి, (శ్రీశైలపూర్ణులు), తిరుకోట్టియూరునంబి (గోష్ఠిపూర్ణులు), తిరుకచ్చినంబి (కాంచీ పూర్ణులు) యను నల్వురను నాలుగు తావుల నిల్పి వైష్ణవ సిద్ధాంతము తరతరముల వఱకును జెడక నిలిచియుండునట్లేర్పాటు గావించి తాము సుఖముండిరి.[1] నాథమునుల సంప్రదాయమును యామునులు పోషించిరి.

ఈ యామునాచార్యచరిత్రను చిన్నన్న ద్రావిడగ్రంథముల ననుసరించియే రచించెను. ఆముక్తమాల్యదలో రాయలు రచించిన యామునులకథకును దీనికిని కొలది భేదమున్నది. ఈ భేదములకు వారి వారి రచనా ప్రణాళికలును, దృష్టులును భేదించుటయే హేతువులు.

ఆళవందారు చరిత్రము వైష్ణవ సిద్ధాంతమును ప్రతిపాదించును.

---

1. పెద తిరుమలాచార్యుని కాలమున తాళ్లపాక సంతతివారు నిట్లే నలుగురు దేశమున నాలుగు వైపుల నెలకొని వైష్ణవసిద్ధాంత వ్యాపనమునకును సంకీర్తనముల ప్రచారమునకును పాటుపడినట్లు తెలియనగుచున్నది.

గురూపదేశమే మహిమోపేత మనియు, కైవల్యప్రద మనియు,
బోధించును. జీవుఁడొకవేళ తన్ను విడచినను దయామయుఁడగు
పరమాత్ముఁడుమాత్రము తనను విడువక వెన్నంటియే కాపాడు
చుండుననియు, దాని నెరిగి భక్తుఁడు జ్ఞానికావలెననియు జ్ఞానవికా
సముతోఁబాటు యోగాభ్యాసము కూడ నవసరమనియు నిరూపించును.

## శ్రీమద్రామానుజాచార్యులు

తుండీరమండలమున బొలుపుమించిన మహాపుదూరసంగ
రాజిల్లు నగ్రహారమున శ్రీమద్రామానుజులవారు ఆసూరి కేశవా
ర్యాయ వైష్ణవునకు ఆదిశేషునంశమున చైత్రమాసంబున నార్ద్రా
నక్షత్రమున నవతరించిరి.[1] జనకుఁడే వీరికి పంచసంస్కృతుల్ చేసి

---

1. శ్రీరామానుజులకే ఉడయవరు, శ్రీభాష్యకారులు, యతిరాజు,
యతిపతి, భూతపురముని, లక్ష్మణముని, లక్ష్మణయోగి, శేషాంశముని, విష్వ
క్సేనముని, ఎంబెరుమానార్, ఇళైయాళ్వారు, సిద్ధాంతస్థాపకులు మున్నగు
నామాంతరములున్నవి.

వీరి జననము,

> చైత్రార్ద్రాసంభవం విష్ణోః దర్శనస్థాపనోత్సుకమ్
> తుండీరమండలే శేషమూర్తిం రామానుజం భజే.
>
> (బ్రహ్మతంత్రస్వామి రచన)

యామునాచార్యుల వారి మనుమఁడును, నల్వురి శిష్యులలో ముఖ్యుఁ
డునునగు తిరుమలనంబి (శ్రీశైలపూర్ణుల) వారి కిరువురు చెల్లెండ్రుగలరు.
వారిలో పెద్ద చెల్లెలు భూమీదేవి (కాంతిమతి లేదా భూమిపిరాట్టి) ని
శ్రీపెరుంబూదూరువాసియగు ఆసూరి కేశవసోమయాజి కిచ్చియు, చిన్న
చెల్లెలు ద్యుతిమతిని మధురమంగలనివాసియగు కమలనయనభట్ట రనువారి
కిచ్చియు తిరుమలనంబియే వివాహములు జరిపించెను. భూమీదేవి సంతా
నమే రామానుజులువారు. ద్యుతిమతి సంతానము ఎంబాన్ అను నామాంత
రముగల గోవిందభట్టు. రామానుజులవారి వంశక్రమమిది—

యుపనయన మొనర్చెను. అఖిల వేదాధ్యతుఁడైన నందనునకు వర వైభవమున వివాహము జరిపించెను రామానుజయోగి సకలవిద్యా విశారదులయ్యెను, దేవకీసుతుఁడు సాందీపనియొద్ద చదివినట్లు కాంచీ పుర నివాసియగు యాదవప్రకాశుఁడను సంయమీశ్వరునికడ వేదాంత శాస్త్ర మధ్యయనము చేయుచుండిరి. కాని తఱచు గురుని యద్వైత సిద్ధాంతమును తమద్వైతయుక్తులచేత ఖండింపుచు వాదమున ప్రతి వాదియై మెలగుచుండిరి. వారి విఖ్యాతిని విని యామునులవారే ఒక తూరి స్వయముగా కాంచీనగరమునకు విచ్చేసి రామానుజుని కటాక్షింపఁగోరి వరదరాజస్వామిని ప్రార్థించుకొనిరి. రామానుజులవారు దినదినప్రవర్థమానులగు చుండిరి.

ఒకతూరి చోళనాయకుని కుమారునకు[1] బ్రహ్మరాక్షసుఁ డావహింపఁగా తన్నివారణార్థము యాదవప్రకాశుఁడు శిష్యులతోఁ గూడి వెడలిరి. కాని బ్రహ్మరాక్షసుఁ డెదురు తిరిగి యాదవప్రకాశు నవమానించెను. పూర్వజన్మ విషయములను వివరించెను. యాదవ ప్రకాశుఁడు పూర్వ భవమున మధురాంతకాగ్రహారమందలి తటాకము నొడ్డున సంచరించిన యుడుమనియు, నచటికిఁ జేరిన పురుషులు భుజింపఁగాఁ జిందిన యెంగిలి మెతుకులు గతికి యీ జన్మమున నింత

యామునులు.
|
కుమారుఁడు
|
తిరుమలనంబి (శ్రీశైలపూర్ణులు) యామునుల శిష్యుఁడును మనుమఁడును.)
భూదేవి (పెరియపిరాట్టి) × ఆసూరి కేశవసోమయాజి (శ్రీ పెరంబూదూరువాసి)
|
శ్రీరామానుజులు.
ద్యుతిమతి × కమలనయన భట్టరు (మధురమంగల నివాసి)
|
గోవిందభట్టు

1. ఆధార గ్రంథములలో బ్రహ్మరాక్షసుఁడు పట్టినది రాజు కూతురునకని తెంగల గ్రంథములును, కొడుకున కని వడగల గ్రంథములును వివరించుచున్నవి.

మాత్రముగ నున్నాఁడనియు ; తానేమో పూర్వభవమున పుణ్యాత్ముఁడై యొక క్రతువు సేయుచుండఁగా నేర్పడిన మంత్రతంత్ర లోపమున ప్రారబ్ధమనుభవింప వలసి యిట్లు రాక్షస జన్మయెత్తవలసి వచ్చినదనియు వివరించెను. ఇట్లు మంత్రింప వచ్చిన యాదవుని భంగపఱచి బ్రహ్మరాక్షసుఁడు ఆతని శిష్యులగు రామానుజులవారి శ్రీపాదములపై మోకరిల్లెను. అపుడు రామానుజులవారు రాక్షసుని జూసి పొమ్మనఁగా నంగీకరించి యందుకు గురుతుగా నచటి యశ్వత్థవృక్షపుఁ గొమ్మను విఱిచి రాజపుత్రుని శరీరమును విడిచిపోయెను. తదాది రామానుజులనిన యాదవ ప్రకాశుల కీర్ష్యగా నుండెను. ఒకతూరి రామానుజులవారు యాదవప్రకాశులకు తలయంటుచుండఁగా వారు శిష్యవర్గమునకు బోధించుచు నొక వేద వాక్యం[1] బెన్ని 'జలజనికాశలోచన యుగళంబు గలిగిన యట్టి శ్రీకామినీ విభుని వనచరాసన వర్ణవలితాక్షయుక్తుఁడనుచు నారీతి నపార్థంబు' చెప్పుచుండఁగా విని రామానుజులవారు చింతించి కనుల నీరుబెట్టుకొనిరి. ఆ కన్నీరు యాదవప్రకాశుల తొడపై పడి కాల్చినట్లైనది. అంతట రోషించి యాచార్యుఁడు శిష్యుని తనకడఁ జదువ పని లేదు పొమ్మని పంపివైచెను. అది మొదలుకొని రామానుజులు తిరుకచ్చినంబి యుపదేశానుసారము 'హస్తిశైలేంద్రు తోయకైంకర్యంబును' తొడరి సేయుచుండెను. ఒకతూరి పెరియనంబి (మహాపూర్ణులవారు) యామునుల యాదేశానుసారము రామానుజులకు యామునాచార్య స్తోత్రమునందలి యొక శ్లోకమును[2] జదివి వినిపించిరి. అది విని యట్టి స్తవంబును సంతరించిన పుణ్యాత్ముని చూడవలెనని రామా

---

1. తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ

(ఛాందోగ్య - 1, 6, 7.)

2 "స్వాభావికానవధికాతిశయేశితృత్వం
నారాయణత్వయి నమృష్యతి వైదికః కః
బ్రహ్మా శివశ్శతమఖః పరమస్స్వరాడి
త్యేతేపి యస్య మహిమార్ణవ విప్రుషస్తే"

నుజులవారు పెరియనంబితోఁబాటు పయనమైరి కాని వారు శ్రీరంగము చేరునప్పటికే యామునాచార్యులు పరమపదించిన వార్త విందురు. మిక్కిలి దుఃఖింతురు. రామానుజులవారు ఆచార్యుని సజీవముగఁ జూడ నోచుకోకున్నను, అంతిమసమయమున నా యామునముని లోకనాథుఁ డనువొందబట్టిన వ్యాఖ్యానముద్రను[1] జూచియే దివ్యోపదేశమును బొందినవారైరి. తమకు యామునులవారితో స్వయముగ సంభాషించి సందేహముల నివృత్తిచేసికొను భాగ్యము గల్పింపనందులకై యాగ్రహించి రామానుజులవారు శ్రీరంగేశ్వరుని దర్శింపకయే కాంచికి మరలిపోయిరి. అచట తిరుక్కచ్చినంబి రామానుజుల కొఱకుగా వరదరాజస్వామిని ప్రార్థించి వారి సందేహములకు సమాధానముగా 'మహాపూర్ణుఁడెగురుననియు ప్రపదన ముపాయంబనియు; స్వామియే తత్త్వమనియు, సద్వైతంబ మతమనియు, —తత్త్వార్థమిది ప్రపదనమున కనియు,నంతిమస్మృతి వలదనియు[2] స్వామి వివరించినట్లు తెలియఁజేయుదురు. నాటినుండి రామానుజులవారు (మహాపూర్ణుల) పెరియనంబివారినే సేవించుకొనిరి. వారికొరకై శ్రీరంగమున కేగుచు మార్గమున మధురాంతకముననే రామానుజులు పెరియనంబిని దర్శించి యనుగ్రహింప వేడుదురు. త్వరపడుదురు. అంతట నచ్చటనే పెరియనంబి యామునుల పాదములను దలఁచుకొని

---

1. ఆధార గ్రంథములందు యామునులవారి చేతి మూఁడు వ్రేళ్లు నిర్యాణసమయమున ముడుచుకొని యుండినట్లును, ఆ ముద్రను జూచి రామానుజులవారు ధ్యానముచేసి వారి మూఁడభిప్రాయములను తెలిసికొనిరనియు వివరింపఁబడినవి.

అ యభిప్రాయములే — 1. బ్రహ్మసూత్రములకు విశిష్టాద్వైతరీతి భాష్యము రచించుట 2. పరాశరుల పేరును 3. నమ్మాళ్వారుల పేరును ఎవరికైన బెట్టి కొన్ని శాస్త్రములుచేసి వారి ఋణమును దీర్చుకొనుట.

2 తిరుక్కచ్చినంబికి వరదరాజస్వామి యిచ్చిన ప్రత్యుత్తరక్రమము-

"అహమేవ వరం తత్త్వం దర్శనం భేదమేవ చ
ఉపాయేషు ప్రపత్తిస్స్యా దంతిమస్మృతివర్జనమ్
దేహావసాన మోక్షంచ మహాపూర్ణం సమాశ్రయ."

రామానుజుల వారికి ద్వయమంత్ర ముపదేశింతురు. పిదప నిరువురును కాంచీనగరమున నాఱుమాసములు కలిసియుందురు. ఇట్లుండ నొక నాఁడు గురుశిష్యులభార్యలు బావిలో నీరు చేదుకొనుసందర్భమున బిందెలు తాకగా రామానుజులవారిసతీమణి మంచిచెడు లెఱుంగక కులంబులక్రమ మెన్ని మహాపూర్ణులవారిసతీమణి చేతి కలశంబును గొట్టపోయెను.[1] ఈ విషయములు శిష్యునకుఁ దెలిసిన నొచ్చుకొనునని యాదేశికుఁడు చెప్పకనే శ్రీరంగమునకు వెడలిపోయెను. పిదప రామానుజులవారు జరిగినదంతయుఁ దెలిసికొని, శ్రీవైష్ణవాపచార మునకు నొచ్చుకొని భార్యను పుట్టినింటి కనిపెడికై వడి ననిపి సన్యసించిరి. వారు తమ సోదరీతనయుఁడగు దాశరథిని దక్క సకలబాంధవుల డించితిమని చాటిరి. పిదప నా దాశరధి సంతసించి కూరాగ్రహారమున నెలకొన్న లోకైకపావనమూర్తి శ్రీవత్సచిహ్న దేశికుని[2] తోడుకొని యతిరాజులగు రామానుజులవారిని దర్శించి వారిచేతనే పంచసంస్కృతులనొంది పరమరహస్యంబులనెల్ల నెరిగెను.

ఇట్లు యతి రామానుజులవారి విఖ్యాతి దినదినప్రవర్ధమాన మగుచుండగా యాదవప్రకాశుఁడు తుదకు చేయునదిలేక రామానుజయతిపాదములఁ ప్రాలి పశ్చాత్తప్తుఁడై వారి యనుగ్రహమున దండాశ్రమమును స్వీకరించినవాఁడగును. అతఁడే రామానుజశిష్యుఁడై పిదప గోవిందజియ్యరను నామము వహించెను.

మునుపు రామానుజులు శ్రీరంగని దర్శింపనికారణమున వియోగ మనుభవించి రంగనాథస్వామి యతిరామానుజుని శ్రీరంగము

---

1. ఆధార గ్రంథములలో పెరియనంబి భార్య నవమానించుటే కాక మరి రెండుమూఁడు తప్పిదములు కూడ చేయుట చేతనే రామానుజులవారు భార్యను విడచి సన్యసించినట్లు కలదు.

2. శ్రీవత్సచిహ్నదేశికుఁడే కూరత్తాళ్వాన్. కూరాగ్రహారమందుండు నతఁడు. రామానుజుల మేనల్లుఁడగు దాశరధియే మొదలియాండాన్. ఇవి ప్రసిద్ధములగు వారి ద్రావిడనామములు.

నకు రప్పించుకొనుటకై రంగనాయకుఁడను[1] పేరుగల నాథముని వంశజు నొకని కంచి వరదరాజస్వామికడకు తమ రాయబారమంపును. ఆతఁడు గానవిద్యచేత వరదుని మెప్పించి యతిరామానుజుని శ్రీరంగమునకుఁ గొంపోవును. అచట యతిరాజు రంగనిలయునికో వెలకు గర్తయై యాలయ వ్యవహారములనెల్ల చక్కదిద్దెను. పెరియనంబి కుమారుఁడగు పుండరీకాక్షుని శిష్యునిగాఁ జేసికొని యుపదేశించెను. పిదప పెరియనంబివారి యుపదేశానుసారము గోష్ఠీపూర్ణులను (తిరుక్కోట్ట్యూర్ నంబి) దర్శించి, తిరుమంత్ర చరమశ్లోకముల కర్థము నెఱుగుటకై భక్తిశ్రద్ధలతో పదునేడుతూరు లర్థించి తుద కనుగ్రహింపఁబడిరి. ఆ రహస్యార్థము నొరులకు తెలుపవల దనినను, గురువాక్యము నతిక్రమించి తా మొక్కరు నరకమున కేగినను పలువురు మోక్షమందుదురు గదా ! యన్న భావమున తిరునాళ్ళ చూడవచ్చిన వైష్ణవాలికెల్ల నా తిరుమంత్రరహస్యార్థమును రామానుజులు బహిరంగముగా వెల్లడించిరి. ఇట్లు మహాపూర్ణ గోష్ఠీపూర్ణుల యొద్ద రహస్యములనెరిగిన పిమ్మట యతిరామానుజులు శ్రీమాలికాధరులచే[2] ద్రావిడాగమ రహస్యములను, కరమర్థి శ్రీరంగనాయకు (తిరువరంగప్పెరుమాళరయర్) చేతఁ బరిపూర్ణ తద్గానభంగులను దెలిసి శ్రీరంగమున శిష్యశేఖరులకు వేదాంతమానతిచ్చుచుండిరి.

ఒకతూరి గంగాతీరమునుండి యొక పేరుమోసిన యేకదండి రామానుజులవారితో శాస్త్రవాదమునకై వచ్చెను. ఇరువురును వాదమునకు తీర్మానించుకొనిరి. పందెము, ఓడినవారు గెలిచినవారికి శుశ్రూషచేయుట. వాద ప్రతివాదములు పదునేడు దినములు నడచినవి. ప్రతివాది ప్రచండుఁడుగ నుండెను. యతిరాజు వాదించి వాదించి వేసరిపోయెను. అప్పుడు రంగాధీశ్వరుఁడు యతిరామానుజులకు

---

1. శ్రీ రంగనాయకుఁడే తిరువరంగప్పెరుమాళరయర్ అనఁబడు యామునాచార్యతనయుఁడు-నాథముని వంశజుఁడు. గానవిద్యావిశారదుఁడు.

2. తిరుమాలెయాండాన్ లేక మాలాధరు లని వీరికే పేరు.

ప్రతివాదిజయహేతియుక్తు లుపదేశించును. మరునాఁడు యేకదండి యోడి త్రిదండసన్యాసము స్వీకరించి రామానుజులవారికి ముఖ్య శిష్యుఁడై యలరారెను. ఆ పిదపనే రామానుజులు వేదాంతసారము, వేదాంతదీపము, అర్చనాక్రమము, గద్యత్రయము, గీతావివరణము, మున్నగు గ్రంథములను రచించి శిష్యశిఖామణులతో దిగ్విజయము లొనర్చుచు కాశ్మీరమున శారదాపీఠమున శారదాదేవిని మెప్పించును. వీరి వేదాంతసంగ్రహమును శారదాదేవి శిరసా వహించెను. "సునుపాక శ్రుతివాక్యమునకు శంకరుఁడు వనమాలి కపిగుదవర్ణ నేత్రుండు అని యపార్థముఁ జెప్పినది తప్పటంచు దనుజారి పంకజదళ నేత్రుఁడంచు" రామానుజులు గావించిన వ్యాఖ్యకు శారదాదేవి యుప్పొంగి పోయినది. ఆమెచేత వారు బోధాయనవృత్తిని[1] గైకొని మఱలి వచ్చుచు మార్గమున శ్రీపురుషోత్తమము, శ్రీకూర్మము, సింహాచలము, శ్రీపురము, వెంకటాచలము,మున్నగు దివ్య క్షేత్రములను దర్శించిరి.[2] పరకాలముఖ్యులు త్రొక్కనోడిన వేంకటాచలమును

---

1. ఆధార గ్రంథములందు ఈ బోధాయన వృత్తిని గైకొని వచ్చుచుండగా దాని నెవరో యపహరించినట్లును, యతిరాజులవారి శిష్యుఁడు కూరత్తాళ్వాన్ తానొక్కమారు చూచినజ్ఞాపకమున ధారణచేసి యంతయు తిరుగవ్రాసినట్లును మున్నుగాగల కథావిషయము లనేకములను చిన్నన్న సంగ్రహముగా రచించెను. ఇం దాయావివరణములే కానరావు.

2. రామానుజులవారి తీర్థయాత్రలను వివరించుపట్టున నాధార గ్రంథములందు ఆయా పుణ్యక్షేత్రములందు కొన్ని వైష్ణవేతర స్థలములుగ నుండినవనియు, యతిరాజులవారే వానినెల్ల వైష్ణవ క్షేత్రములుగ నొనర్చి యర్చాక్రమముల నేర్పరచిరనియుఁ గలదు. ఇది చారిత్రకముగా కొన్ని యెడల యథార్థమని విశ్వసింపదగినప్పటికిని చిన్నన్న వానినెల్ల విసర్జించి యవి యప్పటికే ప్రసిద్ధములగు వైష్ణవ క్షేత్రములై యుండినట్లుగా వివరించెను.

ఉదాహరణమునకు అప్పటికి వేంకటాచలస్వామి సుబ్రహ్మణ్యుఁడను ప్రవాదము లోకమున నుండఁగా రామానుజులవారే యాయపోహలను దొలగించుటకై ప్రయాసపడి శంఖచక్రములను మరమున లక్ష్మిని సంధా

మొదట రామానుజులవారు త్రొక్కనోడియు తాము త్రొక్కనిదే దిక్కు దిక్కుల భక్తులును ద్రొక్కరను వెఱపుతో వారు శైలము నారోహింతురు. వారి రాకవిని తిరుమలనంబి స్వామివారి ప్రసాదము నిత్తురు. వారు వీరికి పాదనమస్కారము గావింతురు. 'ప్రసాదము మీరు తేవలెనా ? పిన్నపాపనిచేత పంపినచాలునే' యని యతిరాజు లనఁగా 'ఈకడనున్న వైష్ణవులలో నెన్న నాకన్న చిన్న లెవ్వరును లేరుగాన నేనే తెచ్చితినని' తిరుమలనంబి సమాధానమిచ్చిరి. రామానుజులావార్తను శిష్యులకువివరించి దేశికుని స్వరూపమునువిశదీకరించిరి. పిదప నంబివారితో యతిరాజులు "కోవెలకు వలచుట్టివచ్చి పావనతల భరణి మిళితసంసారతమిస్రౌఘతరణి ననుపమసుకృత సంహాతి జన్మ ధరణి జననుతయును నైన స్వామిపుష్కరిణి స్నానంబుఁ జేసి యాచక్క నున్న భూనళినాక్షి నింపున గౌగిలించి ఫణిరాజుపై నొక పదమూని నిల్చిన ధరణీవరాహు సేవించి యటప్రదక్షిణముగా వచ్చి వైకుంఠ గోపురమునకు ప్రణమిల్లి - గారుడస్తంభంబుచక్కి వినతుఁడై క్రొవ్విరి సాలకేగి - చంపకావరణంబు వేగ వలచుట్టి యాస్వామిపుష్కరిణి తోయంబులోని యుత్తుంగభాగమున నాయహికులపతి యవతార మగుచుఁ దిరుగని చింతలుం దెరలించు నీడదిరుగనిచింత కెంతే భక్తి మ్రొక్కి - రెండవగోపురము దాటి - లోని కమలమహానసాగార సేవించి - యానంద నిలయాఖ్యమగుచు పొలుపొందు మణివిమానంబు సేవించి - యట వచ్చి తురగతార్క్ష్యాహినాయకుల సేవించి సేనాధి నాధు సేవించి - నరసింహు సేవించి, తార్క్ష్యు సేవించి, - నిత్యుల సేవించి; లోని కరు దెంచి దివ్యసుందరమంగళవిగ్రహుఁడగు నయ్యలమేలుమంగామనోజ్ఞుని సేవించి ప్రణమిల్లి - పరవాసుదేవుఁడీ పంకజాక్షుండె - యీ ధరణీధరమె వైకుంఠము, ఇతని కెవ్వరును సరి

---

నించినట్లు ఆధారగ్రంథములందుండగా నిందు చిన్నన్న వర్ణించిన తీరు దానికి భిన్నముగా నున్నది. చిన్నన్న తన కాలమున నుండిన తీరునే వేంకటాచలస్వామిని తదాలయసన్నివేశాదులను రామానుజులకాలమున నుండినట్లుగా వర్ణించినాఁడని చెప్పవచ్చును.

చేరని వేసరణుల వేదశిరముల సన్నుతిఁజేసి 'సద్భక్తిఁదీర్థ ప్రసాదము లన్వయించి - దివసత్రయంబు వసించి యాకాశ గంగాదులైన తీర్థములు సేవించి' శౌరికైంకర్యంబుసలుప నొకకొన్ని కట్టుదిట్టములు గావించిరి. ఇరువది నలువు రేకాంగివరులను స్వామి కైంకర్యమునకై నియోగించిరి. తమకు మాఱుగా నిద్దఱు యతీశ్వరులఁ బట్టంబుఁ గట్టి కోవెలకర్తలుగ నియమించిరి. కపిరాజరూప సంకలిత ముద్రికలు కృపచేసిరి. ఇట్లు దైవమును దర్శించి తగిన యేర్పాటులు గావించి రామానుజులవారు తిరుమలనంబితోఁ గూడి కొండదిగి శ్రీపతిపురికి (తిరుపతికి) విచ్చేసిరి. అచటనే యతిరామానుజులు నంబివారికడ రామాయణార్థ మంతయునువిని, తమ గ్రంథములను వారికి వినిపించిరి. తిరుమలనంబివారి తనయుని శిష్యునిగా స్వీకరించి యటువీడి సేతువు దనుక వేంచేసి శ్రీవిభునకు నిలయములగు నాయా తిరుపతులను దర్శించి మఱలి శ్రీరంగమున కేగిరి. అచట బోధాయనవృత్తి గైకొని శ్రుతుల వాక్యముల కైక్యముగ బనుపడియొప్పు శ్రీభాష్యమును రచించి శిష్యులకు వేదాంతబోధ గావించుచుండిరి.

ఆ దినములలో చోళరాజొకఁడు[1] దుష్టుఁడును, గులపాంసనుఁడును, నచ్యుత ద్వేషియునై యుండి 'హరుఁడొక్కఁడే పరబ్రహ్మ

---

1. ఈతఁడే క్రిమికంఠచోళుఁ డనఁబడినవాఁడు ఈ చోళరాజును గూర్చిన వివరములను చారిత్రకాధారములతో నుద్ధరించి శ్రీ టి. ఎ. గోపీనాథరావుగారు తమ యమూల్యమగు నొక యుపన్యాసమున వెల్లడించినారు. ఆ వివరములివి:

క్రిమికంఠుఁడు కూరత్తాళ్వాన్ ప్రభృతుల కన్నులు తీయించిన వత్సరము 'కాళయుక్తి'యని రామానుజార్యదివ్యచరిత్రమను గ్రంథమున గలదు. అప్పుడే రామానుజుఁడు హోయసలరాజ్యమున బ్రచ్ఛన్నముగా నుండవలసి వచ్చెను. అప్పటికప్పుడే రామానుజులవారు శ్రీభాష్యమున మూఁడింట రెండుభాగములు పూర్తిచేసినట్లు గురుపరంపరలు చెప్పుచున్నవి. వీరుహోయసలరాజ్యమందుండఁగా శ॥ 1089 (1117 క్రి. శ.) లో క్రిమికంఠుఁడు మరణించెననియు నా వార్తవిని రామానుజులవారు తిరిగి శ్రీరంగమును చేరి

మనియెడి భ్రాంతిచేత విద్వాంసులనెల్ల భటులచేఁ బట్టి తెప్పించి 'శివాత్పరతరం నాస్తి' యని వ్రాలు పెట్టించుకొనుచుండెను. అపుడు చతుర్గ్రామియను వైష్ణవోత్తముఁడు కపటాత్ముఁడగు చోళకాంతునిఁ జూచి, 'యవైదికు లగువారుగాఁగ నిరవొంద నిట్టివ్రా లిడుదురుగాని వేదమార్గప్రతిష్ఠాపనాచార్యుఁడైన రామానుజాచార్యుఁ డీ రీతిఁ

---

శ్రీ భాష్యమును కొనసాగించి శ. 1047 (1125 క్రీ. శ.) ప్రాంతమున పూర్తి కావించెననియు వైష్ణవ గురుపరంపరల నాధారముగాఁ జేసికొని శ్రీ గోపినాధరావుగారు నిర్ణయము చేసిరి—.

క్రిమికంఠుని మరణకాలమగు శ. 1039 (1117 క్రీ. శ.)కి పూర్వము అతఁడు రామానుజుల హింసించిన కాలయుక్తి సంవత్సరము 1078-1079 క్రీ. శ. సంవత్సరముల నడుమనే కానవచ్చుచున్నది. అది చోళపరిపాలనలో మొదటి కులోత్తుంగచోళుని పాలనాకాల మగును. దీనిని బట్టి శ్రీగోపినాధరావుగారు క్రిమికంఠుఁడొకఁడేయని నిరూపించిరి.

అతఁడు పరమ శైవుఁడై నప్పటికిని మన్నార్ గుడి, శ్రీ రంగము, తిరువేండిపురము మున్నగు స్థలములలో నాతఁడు వేయించిన శాసనముల నాధారముగాఁగొని పరిశీలించినపుడు అతఁడు పరమోదారుఁడై పెక్కు శైవ వైష్ణవ జైనాలయములకు దానధర్మాదికములు జరిపినట్లు తెలియవచ్చుచున్నది. అట్లయినపుడు ఈ దౌష్ట్యమాతని కంటగట్టుటెట్లని వారే పరిశీలించి సమాధానమిచ్చుటకు యత్నించినారు. ఆవిద్వేషము రామానుజులవారియెడ వైయక్తికముగనేగాని మతమునెడను వైష్ణవసంఘమునెడను మాత్రము కాదని వారు సమాధానపడిరి ఆ యభిప్రాయమే సరియనుకొనవలెను. లేకున్న నీతఁడు వైష్ణవాలయములకు దానధర్మములను ద్రావిడదేశమందే కాక ఆంధ్రదేశమందును జరపించుటకు హేతువు కానరాదు—

చూ. No 121 సంపుటము 6 ద. హి. దే. శా. సంచయము. కులోత్తుంగ భూపాలుఁడు 1119 వఱకును జీవించియుండెనని తలఁపనగుచున్నది.

జేయునే.' యనెను. అంతట నేయిచల్లినయనలంబుకరణి రాజు మండి పడి కింకరులఁబంపి రామానుజు బట్టితెం డనును. ఆ విషయ మెఱిగిన రామానుజశిష్యుఁడు కూరుత్తాళ్వాను ఆచార్యుని వారించి తానే రామానుజుల వేషముఁ దాల్చి భటులవెంట రాజసమ్ముఖమున కేగెను. యథాపూర్వము రాజు వారిని 'శివాత్పరతరం నాస్తి' యని వ్రాలు వెట్టుఁడనగా నట్లే వ్రాసి దానివెనక "ద్రోణమస్తి తతః పరం" అని పూరింపఁగా రాజు ఆగ్రహోదగ్రుఁ డాయెను. కాని యింతలో నాతఁడు రామానుజుఁడుకాఁడని తెలిసి వారిని బట్టుటకై భటులు మఱల శ్రీరంగమునకు వత్తురు. రామానుజులవారు భటులను తమమంత్ర శక్తిచేత నిర్వీర్యులనుజేసి మారురూపమున వెల్లాలజాతి గృహస్థు వేషమున శ్రీరంగమును వీడి యాదవాచలమున కేగిరి. అట చోళుఁడు కూరేశుని కనులు తీయింపఁబోఁగా "విష్ణుద్రోహివగు నిను కనుగొన్న యిటువంటి కన్నులేమిటి" కని తానే తన గ్రుడ్లను పెరికి వైచుకొనెను. రామానుజు లావార్తవిని ఖిన్నులై వేంకటాచల స్వామిని ప్రార్థింపఁగా స్వామివారు తమ శితఖడ్గరాజ మంపి దుష్టుఁ డగు చోళుని శిరము ఖండింపఁజేసిరి. మరణసమయమున వాని కంఠమునుండి కంపుతోఁ గూడిన నెత్తురును, బురువులును వెలు వడుటచేత నాతనికి క్రిమికంఠచోళుఁడనియుఁ బేరాయెను. వారి మర ణము విని రామానుజులవారు సంతసిల్లి శిష్యబృందముతో మఱలి శ్రీరంగమునకు విచ్చేసిరి. కూరేశునకు తిరిగి కనులు వచ్చినవి. కూరేశ తనయుఁడు పరాశరభట్టరు రామానుజ శిష్యుఁడై వైష్ణవ సిద్ధాంతము నకుఁ దరువాత పట్టుగొమ్మ యాయెను. దేశమున డెబ్బదినాల్గు చోట్ల నేడు వేలమంది యేకాంగిముఖులు రామానుజశిష్యులై సేవించు చుండఁగా యతిరాజు ఉభయవేదాంత శాస్త్రములు శిష్యసంఘములకు బోధించుచు మహామహిము లయిరి.

ఇది ఉడయవరులైన శ్రీమద్రామానుజాచార్యులవారిదివ్య చరిత్రము. వారు వేదమార్గప్రతిష్ఠాపనాచార్యులగుటచేతను, విశిష్టా ద్వైతమతప్రవర్తకు లగుటచేతను, వైష్ణవాచార్య పురుషులలో వారిస్థానము అద్వితీయమైనది. ద్రావిడ గురుపరంపరలు వీరి సుచరి

త్రమును వేవిధముల విస్తరించినవి. ప్రత్యేకముగా విపులములగు వారి చరిత్రములే వెలువడినవి. వాని నాధారముగాఁగొనియే నాతివిపులము గను నాతిసంగ్రహముగను నుండునట్లు చిన్నన్న సుసూక్ష్మముగ రచించెను. ఆళ్వారులమతతత్త్వము నొక సంప్రదాయముగా రూపొందించి యామునాచార్యాదులు వ్యాపింపచేయఁగా శ్రీమద్రా మానుజాచార్యులవారు దానికొక సుస్థిరత్వమును గల్పించి దేశము నలుమూలల పాదుకొనునట్లు చేసిరి.

ఇట్లు పన్నిద్దరాళ్వారులయు, నాచార్యులయు జీవితచరిత్ర ములను చిన్నన్న పరమయోగివిలాసప్రబంధముగా సంతరించెను. ఈ రచనలో చిన్నన్న దృష్టి ప్రధానముగా వైష్ణవ సంప్రదాయమును బోషించుటయే. ఆ పుణ్యపురుషుల చరిత్రములు చదివినను, వినినను, వ్రాసినను ముక్తిదములే కావున తత్ప్రాప్తి తనతోఁబాటు లోకులకును గల్గించుటయే యాయన యుద్దేశము. అందుకే భక్తిరసావేశముతో నీకవి యట్టి వైష్ణవగ్రంథరచనకుఁ బూనుకొనెను. ఇందలి స్వామి వర్ణ నలు, స్తుతులు, భాగవతభగవద్భక్తిభావముల వివరించు రచనలు వైష్ణవమతాభిమానమును రేకెత్తించునవి. ఇందలి యుత్తమభావ సంపద, వర్ణనములందు చూపిన సోయగము, వైవిధ్యము, కావ్యగౌర వము నినుమడింపఁ జేయునవియై కవీశ్వరుని ద్విపదరచనాసామర్థ్య మును వెల్లడించుచున్నవి. 'చిన్నన్న ద్విపద కెరగును' అన్ననుడి యీ ప్రబంధమున సర్వత్ర ద్యోతకమగును.

## స్వామివర్ణనలు

గ్రంధారంభమున శ్రీ వైకుంఠనాథుని దివ్యస్వరూపవర్ణన మును చిన్నన్న భక్తితో శ్రీ వేంకటాచలాధీశుని దలపించునట్లు వర్ణించినాఁడు.

"భానుకోటులమించు ప్రభగల్గి నిర్భరానందుఁడును నిత్యుఁ డఖిలశేషియును
గురుతరుండును నిరంకుశమహోదయుఁడు పరమేశ్వరుఁడునైన పద్మాక్షుడు
నెమ్మితో శ్రీ భూమినీళలంగూడి-నెమ్మోముచక్కి- వెన్నెలనవ్వు చిలుక
నెలసంజగనిపించు నెత్తమ్మిదామరల యొలవు నెల్లిదమాఁడుచున్న పాదములు

పన్నికాశియలసంవర ముట్టుకోలు-గొన్ననిగ్గులసోనఁగులియు లేదొడలు

... ... ... ... ... ... ... ... ... ...

నానతశశిరేఖ హసియించునొసలు నానీలకుటిల దీర్ఘాలకంబులును
జగదధిరాజ్యసూచకమునై తనరు-ధగధగల్ దెగడు రత్నపుఁగిరీటంబు
నెఱసంజ నీరెండ నెనసినమొగులు-తెఱఁగున దీపించు దివ్యతేజంబుఁ
గలిగినసహస్రారకమల పూర్వాది- దళవీధులందుఁ జిత్తరముగానిలచె".

(పరమ-పు. 18-16)

ఇందలి వర్ణనము సాక్షాద్వేంకటాచలస్వామియగు శ్రీనివాసు నిదే[1]. ఈ స్వామివర్ణనము శ్రీ పాదముఁతో నారంభమయి ఆరో హణక్రమమున దివ్యమైయున్నది. ఇట్లే శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్య శరీరసౌందర్యమును పలుతావుల తనివితీర వర్ణించుకొనినాఁడు చిన్నన్న (చూ. ద్విపదవంక్తులు - పరమ-పు. 78-79). అలమేల్మంగావిభుని యాకృతిసౌభాగ్య మందు చిత్రితము. ఇందు వర్ణితములైన పసిడి యందియలు, గజ్జెలు, మొలనూలు, ముత్యాలకుచ్చులు, ముప్పిడి కటారంబు, బొడ్డుమానికము, ఒడ్డాణము, భుజకీర్తులు. బాహుపు రులు, తారహారములు, మౌక్తికకంఠసరములు, మకరకుండలములు మున్నగునవియెల్ల నాఁటి విజయనగరప్రభువులును వారి దేవేరులును స్వామిని సందర్శించిన సందర్భములందు సమర్పించుకొనిన కానుకలే.[2] ఇట్టివే మఱికొన్ని వర్ణనములు (పరమ. పుటలు 480-81; 582, 83) చూడఁదగును.

వీనియందు శ్రీ వేంకటేశపాదాది కిరీటపర్యంతదివ్యసౌందర్య భూషణాదికము మనోజ్ఞముగా వర్ణితమైనది.

---

1. ఈ వైకుంఠనాథుని దివ్యస్వరూపము తిరుమల శ్రీనివాసుని దైనట్లే యీ పట్టున చిన్నన్న వర్ణించిన వైకుంఠనగరము కూడ ప్రత్యక్ష ముగ తిరుమలనగరమే యనవచ్చును. అచటి 'సహస్ర స్తంభమంటప' ప్రస్తావనకూడ నిందు గలదు

2. చూ తిరుమలతిరుపతులలో విజయనగరప్రభువుల కైంకర్య ములఁ దెల్పు శాసన చారిత్రక విశేషములు.

అట్లు తిరుమల స్వామిని మాత్రమేకాక పలుపుణ్యక్షేత్రము లందు నెలకొన్న పరమాత్ము నర్చారూపములనుకూడ మనోజ్ఞముగ కనులకట్టించునట్లు చిన్నన్న చిత్రించినాఁడు. మచ్చున కిందలి కంచి వరదరాజస్వామివారియు, కుంభకోణమునందలి కోదండపాణి స్వామి వారియు వర్ణనలనుబోలినరచనలు మనోజ్ఞములు-(పరమ-పుటలు 29, 80; 101-102; చూడఁదగును).

ఇట్లే పద్మనాభస్వామివారి ప్రత్యక్షవైభవమును గూడ చిన్నన్న వర్ణించినాఁడు.

"మణిమయ కింకిణీ మంజీరకాంతి-గణసముజ్జ్వల పాదకమల యుగ్మండు
కనక చేలావృతఘంటికా ఘటిత-ఘనరత్నకీలోభి కటిచక్రతలుఁడు
బంధురోడ్యాణ శంపాలతా జఠర-బంధరోమాళి షట్పదపంక్తియుతుఁడు
సందీప్తధర సుదర్శనగదా శార్ఙ్గనందక యుతసమున్నత కరాబ్జుండు
శ్రీవత్సకౌస్తుభశ్రీవనమాలికా వరచందన కలిత వక్షుండు
వరహీరదర్పణోజ్జ్వల గండయుగళ నిరుపమ చాంపేయనిభనాసికుండు
నాకర్ణవిశ్రాంత హరిణాంబుజాతనీకాశ కరుణాంకనేత్ర భాసితుఁడు
చారుమందస్మిత చంద్రికాసార పూరింబాధర భూషితాననుఁడు
నిత్యప్రసన్నుఁడా నీరజోదరుఁడు-ప్రత్యక్షమయ్యె నా భక్తిసారునకు"

(పరమయోగి - పుట 111-112)

ఈ రీతి నాయా క్షేత్రస్వాముల యర్చామూర్తుల దివ్య సౌందర్యసౌభాగ్యములను సుసూక్ష్మముగ పాదాది కేశపర్యంతము వర్ణించి చిన్నన్న తనిసినాఁడు.

## స్తుతులు

చిన్నన్న ఈ గ్రంథమందెడనెడ గావించిన స్తుతులు సుందరములు. భక్తిమయములు. భక్తునకు భగవంతునియందుగల చనవును, స్వాతంత్ర్యమును వెల్లడించునట్టివి. కొన్ని కేవలము నామావళులు. కొన్ని యవతారమహిమాదికములను చమత్కారముగ నిరూపించు నట్టివి. మచ్చునకివి పరికింపఁదగును.

1. "గోపాలపాలక! గోవింద! కృష్ణ! నాపాలి దైవమ ననుఁగన్న తండ్రి
భావింప బ్రహ్మాండపటలసంతతులు - నీవాడుమన్నవూనిక నాడు - నట్టి
జాడనొప్పెడు రమాస్వామి; యేనిప్పుడాడించు కైవడి నాడెది నీవు
పాలాతునుత! భక్తపరతంత్ర! నీదుసౌలభ్యమేమని సన్నుతించెదను?
(పరమయోగి - పుట-160)

తిరుమళిశైయాళ్వారుల ననుసరించి 'క్రేపు వెన్నను గోవు క్రియ' నేగిన స్వామివారి సౌలభ్యమును వారిట్లు సంస్తుతించిరి. 'యథోక్తకారికుఁ'డను పేరును సంపాదించుకొన్న యాయూరిస్వామి భక్తపరతంత్రుఁడు. భక్తులకు భగవంతుఁడు సులభుఁడను విషయము నీస్తుతి నిరూపించుచున్నది.

2. కుంభకోణమునఁ బవ్వళించియున్న శార్ఙపాణిని సందర్శించి భక్తిపారవశ్యమున నాళ్వారులు గావించిన స్తుతిని చిన్నన్న యిందు చమత్కారముగ పొందుపఱచినాఁడు. ఆ పరుండుటకు హేతువగు బడలిక యేలకలిగిన దయ్యాయని స్వామినిట్లు అడుగుచున్నాఁడు.

"జలరాశిఁజొచ్చి రాక్షసుల గీటణఁచి చెలఁగి వేదములు దెచ్చినబడలికయొ
క్షీరసింధువు మథించియుఁ గ్రుంగకుండఁ జేరి మందరము మోచినబడలికయొ
ముఖదంత కోరకమున జగత్త్రియము నిఖలభారంబు నానిన బడలికయొ
పైకొన్న యుక్కుకంబముఁ గొనఁగోళ్లఁ జేకొని ప్రక్కలించిన బడలికయొ
జగములీరేడుమ చక్కని యడుగు - చిగురుటాకునఁ గొలిచిన బడలికయొ
గండ్రగొడ్డట రాజకంఠనాళములు - చెండిచెండాడి వైచిన బడలికయొ
దండకావనమున దనుజవర్గంబుఁ - జెండి చైచుచుఁ జరించిన బడలికయొ
కౌరవాధిపునితోఁగనలి తత్పురము సీరాగ్రమునఁ బెకల్చిన బడలికయొ
యలవిమీఱంగ గోపాంగనామణుల-చెలువంపు రతులఁదేల్చిన బడలికయొ
మేలిమితురగంబు మీఁదటనెక్కి - లీలవయ్యాళిఁదోలిన బడలికయొ
(పరమ - పుట-102-108)

ఇది యాలంకారికమగు దశావతారస్తుతి. కాని యిందు బుద్ధావతారము విడువఁబడి ముగురురాములు ప్రస్తుతింపఁబడినారు. రచన చమత్కారమయము.

ఈ గ్రంథమందలి తృతీయాశ్వాసమునగల స్తుతియొకటి (చూ. పు. 181) నామావళి యనఁదగినది.

ఇది రామనామావళియేగాని యిందు చమత్కారముగ రామ కథయంతయు పొందుపరుపఁబడి యున్నది[1]. ఇది రామాయణస్తుతి వర్ణనరూపమునగల రామాయణసంగ్రహము.

## వైష్ణవ భావసంపద

వర్ణనములందును స్తుతులయందును మాత్రమేకాక కావ్యకథా వస్తువునందును, భావనయందును, రచనయందునుగూడ నీతని కావ్యము వైష్ణవమతసంప్రదాయప్రచారమున కుద్దిష్టమైన గొప్ప వైష్ణవ గ్రంథమని చెప్పనగును. ఇందలి వైష్ణవభావసంపద గ్రంథమున కెంతేని పరిపుష్టిని చేకూర్చి పెట్టినది-.

## భాగవతులు-భాగవతభక్తి

ఈ గ్రంథమున చిన్నన్న పలుతావుల భాగవతు లన నెట్టివారో నిర్వచించి వారి నర్చించుటయే భగవంతునర్చించుటయని కంఠోక్తిగ వెల్లడించెను. చూడుఁడు.

1. హరిదాసు లఖిలలోకైక పావనులు
హరిదాసు లపగతాహంకారమతులు
హరిదాసులగువార లధికుల కధికు
లరయ వారలకంటె నధికులులేరు. (పరమ. పుట 67)

2. పాటించి వైష్ణవు పంచనున్నట్టి
కీటంబులును ముక్తికింబోవు నండ్రు (పరమ. పుట 157)

---

1. ఈ తీరున స్తుతినామావళులలో శ్రీరామ శ్రీకృష్ణ కథా సంగ్రహములను పొందుపఱచి రచించు టంతకుఁ బూర్వపు కవులు కొందరు చేసిరి. 18, 14 శతాబ్దుల నడిమి కాలపు కవియగు కృష్ణమాచార్యుఁడు తన వచన సంకీర్తనములలో నీతీరు రచన లనేకము లొనర్చినాఁడు.

3. పరవధూ పరధన పరనిందలోల్ల
   రరయంగఁ గలలోనసైన వైష్ణవులు. (పరమ. పుట 178)

4. తలఁపఁ బాతివ్రత్యధర్మంబువంటి
   నలినాక్షు దాస్య(ము) (పరమ. పుట 129)

భాగవతులను బూజించుటన్న భగవంతుని పూజించుటయే. వారి పాదరేణువుకూడ మహామహిమోపేతమే (పు. 72) భగవద్భక్తి పాతివ్రత్యమువంటిది. ఆ పారవశ్య మనుభవించినవారలకు జగత్తు సర్వము తన్మయముగానే భాసించును. ఈ విషయములనన్నిటిని పరమ యోగివిలాసమున చిన్నన్న సర్వత్ర ప్రవ్యక్త పఱచినాఁడు. అసలీ గ్రంథారంభమందే ఆళ్వారాచార్యుల యవతారమునకు వైష్ణవమత ప్రచారమే పరమోద్దేశ్యమని చిన్నన్న వివరించినాఁడు కదా! అట్లే ప్రచారబుద్ధితోడనే చిన్నన్నయు కావ్యరచన సాగించినాఁడు. వర్ణనములందే కాదు తుదకు చిన్నన్నగైకొనిన యుపమానములందును వైష్ణవమే ప్రతిభాసిల్లుచుండును. భాగవత రామాయణోపమానములనే ఈ కవి అధికముగ వాడుకొనెను.

## ద్రావిడ వైష్ణవకృతులు—ఛాయానువాదములు

చిన్నన్న పరమయోగి విలాసమును ద్రావిడ ప్రబంధంబుజూచి తెనుఁగున ద్విపదరూపమున రచించినట్లు గ్రంథారంభమందే చెప్పుకొని నాఁడు. తదనుగుణముగనే గ్రంథమున భక్తిభరితములును, మహనీయ ములును నగు నాళ్వారాచార్యాదుల దివ్యప్రబంధములలోని తలమాని కములనఁదగిన పాశురములనుఁ గొన్నిటినిగూడ చిన్నన్న యనువదించి ఆ భావసంపద చెడకుండ తెనుఁగున నిక్షేపించుకొనినాఁడు. దానివలన గ్రంథగౌరవ మధికమాయెననియే తలపవచ్చును. ఇవి పరిశీలనార్హ ములు.

ద్రావిడ రచనముల కివి యనువాదరూపములగుటవలన వాని నించుక వివరముగనే యుదాహరింతును.

1 సిరిగంటి చెన్నుమించిన మేనుగంటిఁ - గరమొప్పు వదనవిలాసంబు గంటి
సల్లలితావని స్తనకుంభకుంభ - పల్లవంబులఁబోలు పాదముల్గంటి
సరసిజహాల శంఖచంద్రాంకుశాంక - చరణముల్ జగదేక శరణముల్గంటిఁ
ధరణి బింబముచాయఁ దరళంబు కనక సురుచిరాంశుకము నంశుకము
గన్గొంటి

... ... ... ... ... ... ... ... ... ...

శాతాంశు మండల శతకోటి కోటి - రీతిఁ జూపట్టు కిరీటంబుగంటి
ములుగులై తెల్లఁదామరలఁ దామరలఁ గలిపించు నిడువాలుఁగన్నులఁ
గంటి
మకరకుండల బాలమార్తాండరుచుల వికసించు వదనారవిందంబుఁ గంటి"

(పరమ. పుట-99)

ఇది పేయాళ్వారు వామనక్షేత్రస్వామిసందర్శనానంతరము భక్తిపారవశ్యమున గావించిన రచన కనువాదము.

2. "తామసాంభోరాశి తరియింపఁజేసి - శ్రమించ నన్నుఁ గటాక్షించినయట్టి
కురుకాధిపతియైన గురుపదాబ్జముల - నిరతంబు వసియించి నిలచెనాతలపు
వేతెరంగులనైన వేరొండెఱుంగ - వేదమంతయును ద్రావిడముగాఁజేయు
పరమగురుండు నాపాలి దైవంబు" (పరమ. పుట-147)

ఇది మధురకవియాళ్వారుల 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' అను 11 పాశురముల ప్రబంధమునందలి సారము.

3 "శఠమునుఁడౌ వేంకట గ్రావేశుపాద-కమలముల్ నాకన్నుగవ నెలకొనియె
నలఘు ప్రసన్నుఁడై యఖిలలోకములు - గొలిచి దైత్యుల గాఢ
కులముల నణకి
కౌతుకంబున నొప్పు కాకుత్స్థతిలకు - పీతాంబరమునం బెరసె నాతలపు
చక్కని వేంకటేశ్వరు బ్రహ్మఁగన్న - పొక్కిలి యరసంజపొలుపులల్లార్చి
సిరిమించు లొయ్యారి చెంగావి వలువఁ బరికింపనా ప్రాణప్రదమైతనర్చె.

... ... ... ... ... ... ... ... ... ...

ఎట్టి చిత్రమొకాని యిట్టెనాతలఁపుఁ గట్టిగాఁ దనసొమ్ముగాఁ జేసికొనియె
నవనీతచోరుండు నామనోహరుఁడు - నవిరళ శుభమూర్తియగు రంగశాయి
గనుగొన్న యాతన కనుదోయి యొండు - గనకుండుగాక... ... ..."

(పరమ. పుట-218-15)

ఇది మునివాహనయోగి శ్రీరంగేశునాలయమును సందర్శించిన క్షణమున భక్తిపారవశ్యమున పాదాదికేశపర్యంతము వర్ణించి పాడిన 'అమలనాదిపిరాన్' అను పదిపాశురముల ప్రబంధమున కనువాదము.

4. "శ్రీమాల్యకారునిచే దివ్యపుష్ప - దామముల్ దాల్చి యుద్ధతరంగసీమ
జాణూరమల్లుని సమయించి మిగుల రాణించు కాగి దోర్దండంబులకును
వలపల రవికోటి వడకించు కాంతిఁ దలుకొత్తుచుండు సుదర్శనంబునకు
వల చెంత నని దైత్యులగలు నాదములఁ సలుపుచుండెడు పాంచ
జన్యంబునకును
... ... ... ... ... ... ... ... ... ...
కెందామరల పస గిలుకాడు పసలయందంబు గలుగు నీ యడుగుఁ
దమ్ములకుఁ
బూనిక తోడ నెప్పుడు బంటనైన - యేనును నీవును నెరవింత లేక
యొనఁగూడి యుండెడి యునికి కెంతయును నెనసియుండంగఁ బె
క్కేండ్లు మంగళము ... ... ... ..." (పరమ పుట-304)

ఇది విష్ణుచిత్తయోగి కృతమంగళాశాసనము. 'తిరుప్పల్లాండు' అను పంద్రెండు పాశురముల ప్రబంధమున కనువాదసారము.

5. "అరుణ బింబం బుదయాద్రిపై నిలిచెఁ బలపలవేగి పీఠ్వడ మబ్బులడఁగె
వలరుచుఁ బూదేవియల సోన గురిసెఁ జాలించి కరుణ చొప్పడయోగనిద్ర
చాలించి శ్రీరంగశాయి మేల్కనవె ... ... ... ... ...
నిధులు నంబుధులును నిర్జరకపిల-బుధులు నచ్చరలుఁ దుంబురునారదులును
మునులు నీముందర మొనసియున్నారు వనజాప్తకాంతి తీవలువాఱె దెసలఁ
జాలించి కరుణచొప్పడ యోగనిద్రఁ -జాలించి శ్రీరంగశాయి మేల్కనవె-
తమ్ములు వికసించె దరణియుఁబోడమెఁ - గొమ్మలు పసపాడి కోరి నీరాడి
కట్టిరి పుట్టముల్ కావేరి నడుమఁ బుట్టక పుట్టిన పూసెజ్జనున్న
నీలనీరదవర్ణ! నీయోగనిద్రఁ జాలించి శ్రీరంగశాయి! మేల్కనవె!"
(పరమయోగి. పుట-363-66)

ఇది భక్తాంఘ్రిరేణుండు (తొండరడిప్పొడి యాళ్వారు) గావించిన దశగాథల ద్రావిడ ప్రబంధమగు 'తిరుప్పళ్లియెళుచ్చి' (ప్రాబోధకీకృతి) కచ్చమయిన తెనిఁగింపు.

6. "ఘన విషజ్వాలలు గ్రక్కు-సర్పంబు-నొనఁగూడి యొకయింట నుండు చందమునఁ
గదలి నెన్నడును భగ్నంబై నయోడ-వడకుచుండెడి యోడవాని చందమున
వడిఁగోసిపాఱు ప్రవాహంబు చెంతఁ బుడమినుండెడి మహాభూజంబు కరణి
నిడియంగఁ దుదమొదలేర్చు కాష్ఠంబు-నడుమఁ జీమలపంక్తి నడకుండు సరణి
నెడపకపాఱు నట్టేటిలోఁ జిక్కి కడు భీతినొందు సృగాలంబు భాతి
తాపత్రయోర్మిసంతతుల వేపారు నాపూర్ణసంసారమను పయోరాశి
లోలత మునిఁగి తేలుచునున్న నన్నుఁ బాలించి దరిజేర్చుపరమేశ!..."
(పరమ. పుట-422)

ఇది తిరుమంగైయాళ్వారులు గావించిన 'పెరియతిరుమొఱి' యను వేయిన్నెనుబదినాలుగుపాశురముల ప్రబంధమునందలి యొక పాటకు హృద్యమయిన తెనిఁగింపు.

7. "కరుణ నార్తైన యాకరిఁ జూడలేక-యరుదెంచినా కమ్రతాన్నంబువెట్టెఁ
దననామ మడిగిన దయతోడ నవ్వి-పునుగకెప్పుడు సాష్టభుజకరుఁడైన
హతహేమకశిపుండనని యొనేవేలు-పతఁడె పంచేషు పంచాయుధాఢ్యములు
ధరియించి యసురడెందము విదారించి శిరముఁ జీరిన నరసింహవిగ్రహుఁడు
నతఁడె శ్రీవామనుఁడతఁడె విష్ణుండు-నతఁడె నాకులదైన మన్నియు నతఁడె
(పరమ. పుట-429)

ఇది తిరుమంగైయాళ్వారు సాష్టభుజకరనరసింహస్వామిని గీర్తించి గానముచేసిన పదిపాశురముల ప్రబంధమున కనువాదసారము.

ఈ రీతిని ప్రసక్తానుప్రసక్తముగ చిన్నన్న పరమయోగివిలాసమున సుప్రసిద్ధములగు ద్రావిడప్రబంధపాశురములలోఁ గొన్నిఁటికి ఛాయానువాదమును, గొన్నిటికి యథానువాదమును బొందుపఱచి తెనుఁగువారి కందలి భక్తిమరందధారల నందించినాఁడు.

## పూర్వకవుల కావ్యముల కనుకరణములు-సంవాదిరచనలు

చిన్నన్న తన కవితలో పలువురు పూర్వమహాకవుల కావ్యములలోని మేలిమిమెఱుఁగుభావములను పుణికిపుచ్చుకొని సొంతము గావించుకొన్నాఁడు. ప్రముఖ వైష్ణవకృతులను రచించిన నాచన సోమన, బమ్మెర పోతన, శ్రీకృష్ణరాయాదుల రచనలేగాక నన్నయాదిపూర్వకవుల రచనలనుగూడ ననుసరించినాఁడు.

ఈ యుదాహరణములు పరికింపఁదగును.

వనవర్ణనమున—

1. "పుట్టతొట్టెలలోని భుజగబాలకులఁ
బట్టి యొయ్యొయ్యన జోఁబాడునెమళ్లు
నెలమిఁ జెంతననాడు వేణపోతములఁ
బిలిచిమచ్చిక యుగ్గు బెట్టు బెబ్బులులుఁ
బలుమఱుఁ గరములం బట్టి రావించి
కలభసంతతి ముద్దుగావించుహరులు
నలమిప్రక్కలలోన నందందపొదలి
యెలుకపిల్లలకుఁ జన్నిచ్చు పిల్లులును"
(పు. 44)

ఇది నన్నయ గారి ఆదిపర్వము కణ్వాశ్రమ వర్ణన సీసమును బోలి యున్నది.

"శ్రవణసుఖంబుగా సామగానంబుల-
చదివెడు శుకముల చదువుదగిలి
కదలకవినుచుండు గరులయు గరికర
శీతలచ్ఛాయఁ దచ్చీకరాంబు
కణముల చల్లని గాడ్పునపడి వాని
తెంది సుఖంబున్న సింహములయు".
భార. ఆది. 4-28

2. "సారసభవుబోలె-శంభునింబోలె
శారదోద్యచ్ఛివాసంయుతంబగుచు
సురనాయకునిబోలె సుగ్రీవుబోలె
గరిరాజ వనచర కమనీయమగుచు
నాగలోకముబోలె నలినాస్త్రుబోలె
భోగీంద్రరతికుచ భూషితంబగుచు
(పు. 44)

చూ. నాచనసోమన ఉత్తరహరి వంశమునందలి.

"సారసంబునలేవ నీరసంబునజావ
పద్మాసనుఁడు వీరిపాలఁగనియె
రూపుకంటతెలంగ చూపుమంటనలంగఁ
బంచబాణుఁడు వీరిపాలఁగనియె."
ఉ. హ. 2-181.

| | |
|---|---|
| 3. "డాయదుమనలతోడను జారువలువ<br>మూయదు చనుదోయి మోహనం<br>జేయదుగానంబు చెలువారుమేనఁ<br>బూయదు కస్తూరి పొలుపొందునొసలఁ<br>దీర్పదు తిలకంబు తిన్నఁగా వీఁకఁ<br>గూర్పదు గేదంగి క్రొమ్ముడిచెంతఁ<br>జేర్పదు ముద్దురాచిలుకకు చదువు<br>నేర్పదు"— (పు. 204) | "చెప్పదు తల్లికిం దలఁపుటిక్క<br>దిశల్ దరహాస చంద్రికన్<br>బొదవఁ గప్పదు, వక్త్రతామరసగంధ<br>సమాగత భృంగసంఘమున్<br>రొప్పదు-నిద్రగైకొన దురోజ<br>పరస్పర సక్తహారముల్<br>విప్పదు కృష్ణమార్గగత<br>వీక్షణపంక్తులు త్రిప్పదెప్పుడున్.<br>భాగవతము దశమ.పూ.భా. 1782 |

శ్రీవిల్లిపుత్తూరు వర్ణనము.

| | |
|---|---|
| 4. 'విమత తాపత్రయ విపులార్తినార్పు<br>సమపమంబైనట్టి యప్పట్టణమున' | చూ. ఆముక్తమాల్యదలో కృష్ణరాయలు వర్ణించిన<br>'మలయపుగాలిరేలు' అను పద్యము (1-74) |

విష్ణుచిత్తుల వారి కథలో.

| | |
|---|---|
| 5. 'వేదమో శాస్త్రమో వివరించిచూడ<br>వేదార్థసాధ్యమై వెలయుశుల్కంబు<br>పాయక గుద్దలిఁ బట్టిన కేలి<br>కాయలచూపి యేఁగైకొనుటెట్టు<br>లితరవిచారఁబు లెవ్వియునెరుఁగ<br>మతినీదు పాదపద్మము లెఱుంగుదును.'<br>(పుట. 298) | చూ. ఆముక్తమాల్యద<br>"స్వామీ నన్ను......" (2-90)<br>"గృహసమ్మార్జనమో<br>జలాహరణమో." (2-91) |

చిన్నన్న పూర్వకవుల ననుకరించినట్లే ఈతని రచనలను తరువాతి ప్రబంధకవులు సారంగుతమ్మయాదులు కొందరనుకరించుటయు జరిగెను.

ఈతని పరమయోగివిలాసము సుప్రసిద్ధమగు వైష్ణవ ద్విపద ప్రబంధమగుటయేగాక అష్టాదశవర్ణనలతోడను, సమకాలికసామాజికపరిస్థితులను, వేషభాషావిశేషములను, వెల్లడించు వివరణము

తోడను నొప్పి, ఉదాత్తభావసంపద్భరితమై రసవంతమై నాఁటి వైష్ణవ ప్రబంధములతోఁ గెల్లఁ దలమానికమై యున్నదనవచ్చును.

## అన్నమాచార్య చరిత్ర

ద్విపద. కర్త: తాళ్ళపాక చిన్నన్న. ఇది లభ్యములగు నీ కవీశ్వరుని నాల్గు ద్విపద కృతులలోఁ బిట్టచివరిదనవచ్చును.[1] దాదాపు అయిదారు వందల ద్విపదలలో ముగియు చిన్న గ్రంథము. చిన్నన్నకు తాతగారగు తాళ్లపాక అన్నమాచార్యులవారి పవిత్రజీవితచరిత్ర మిందలి యితివృత్తము. ఈ అన్నమాచార్యచరిత్రము కథాపురుషుని మనుమఁడే రచించినది కావున విలువగల ప్రామాణిక చరిత్ర గ్రంథము. కాని ఈ జీవితచరిత్రగ్రంథరచనమున చిన్నన్నకు, సమకాలికుఁడగు సోమనాథ కవీశ్వరుఁడు సంస్కృతమున చంపువుగా రచించిన "వ్యాసయోగి చరిత"[2] ముద్బోధకమును మార్గదర్శకమునై యుండును. (అన్నమాచార్యులును వ్యాసతీర్థులును ఇంచుమించు సమకాలికులే. ఇరువురును విజయనగరసామ్రాజ్య వైభవవికాసములకు కారకులైనవారే) ఈ యిరువురి రచనలకును సామ్యమెంతోయున్నది. కాని తెనుఁగున మాత్రము ప్రాచీనకవులచరిత్రగ్రంథములు కవీశ్వరులవి, ప్రాచీనులే ఆయా కవీశ్వరుల దగ్గఱ కాలమువారే కవితతో రచించినవి చాలఁదక్కువ. బసవపురాణము, పండితారాధ్య చరిత్రము, కృష్ణరాయ చరిత్రము, రఘునాథ నాయకాభ్యుదయము, మున్నగునవి కొన్నిమాత్రమే వ్రేళ్లలెక్క కెక్కియున్నవి. వానిలో నీ అన్నమాచార్య చరిత్రము మతపాండిత్యకవితాప్రఖ్యాతిఁగన్న మహనీయుల చరిత్రమగుటచేత నింకను మిక్కిలిగా లెక్కింపఁదగినది.

---

1 పెద తిరుమలాచార్యుని జీవిత చరిత్రముకూడ (చిన్నన్నచేతనే కాఁబోలు) రచితమైనట్లు తెలియుచున్నది కాని యాగ్రంథమిపుడు లభింపకున్నది (చూ. అన్నమాచార్యచరిత్ర పీఠిక-పు. 1)

2. శ్రీ వి. వెంకోబరావుగారు విపులమును అమూల్యమునునగు పీఠికతో ప్రకటించిన సోమనాథుని 'శ్రీ వ్యాసయోగిచరితము'ను చూడఁదగును (1926).

ఈతని కృతులలో తొల్లిటివి రెండును పౌరాణికేతివృత్తములు గలవియైనను తుదివి రెండునగు పరమయోగివిలాసాన్నమాచార్య చరిత్ర ద్విపదలు మాత్రము దేశీయతాముద్రకలిగి యాతని కించుక పూర్వ పూర్వ కాలములందు వర్తిల్లి చారిత్రిక సాక్ష్యములతో గుర్తింపఁదగిన మహనీయుల జీవిత చరిత్రములే యితివృత్తములుగా గలిగిన గ్రంథములు. ఈ విషయమున చిన్నన్న బసవపురాణ పండితారాధ్యచరిత్ర కృతికర్తయగు పాల్కురికి సోమనాథు ననుసరించెను. కవితారూపమున జీవితచరిత్రలను రచించు ఫక్కికలో సోమనాథుని తరువాత చిన్నన్నకే యగ్రతాంబూల మనవచ్చును.

ఈ కృతివల్లనే చారిత్రికముగా యథార్థమును, పూర్ణమును నగు అన్నమాచార్యుని జీవితమును, తాళ్లపాకవంశమువారి ప్రఖ్యాతియు నేఁటికి వెలుఁగులోనికి రా వీలయినది.[1] యథాపూర్వ మీ కృతిని గూడ చిన్నన్న 'అలమేలుమంగాధీశు పేర' నంకితముగను రచించెను. ఇందు గ్రంథాదిని అలమేలుమంగాంబను, శ్రీవేంకటేశుని, నందక సుదర్శనములను స్మరించి "నరహరి సంకీర్తనపు నిధులొసగు పరమోప కృతిఁ దాళ్లపాకన్నయార్యు నాచారవిజితామరాచార్యుఁ దిరుమలాచార్యు ఘనుఁ (ద) దీయాచార్యుఁగొలిచి", జలజాతవాసిని

1. అన్నమాచార్య చరిత్రమును కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు విపులమగు పీఠికతో ప్రచురించిరి. (చూ. తి. తి. దే. ప్రచురణ 1949) అందు శ్రీ శాస్త్రిగారు వివరించినట్లు 'ఈ యన్నమాచార్య చరిత్ర కాగితపు వ్రాత పుస్తకము కడపజిల్లా రాయచోటి తాలూకా మడితాడు గ్రామ వాసి శ్రీ తాళ్లపాక సూర్యనారాయణయ్యగారు తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్య గ్రంథాలయమున కొసఁగిరి. ప్రాఁత తాటాకు ప్రతిననుసరించి వారు దానిని 1940 సం॥లో వ్రాసిరట!'. ఈ వ్రాతప్రతి కాక తదుపరి వ్రాతప్రతి మఱియొకటికూడ లభించినది. ఆ రెంటి ననుసరించియే అన్నమాచార్య చరిత్ర ద్విపద పరిష్కృతమై ప్రకటితమైనది.

అన్నమాచార్యుని జీవిత విశేషములు సమగ్రముగా స్థలాంతరమున వివరింపఁబడినవి చూడఁదగును.

చనుశాల పుష్టిచే చేకూరిననేర్పు పరిపాటిమెయి నీ రచన కుద్యుక్తుఁ డాయెను. "నందను సద్వర్తనము తండ్రి ప్రియమునొంద గీర్తించుట యుచితంబుగనుక అరలేక యీ యన్నమాచార్య చరిత' మును అల మేలుమంగావిభుని యను మతమున నాతనికే విన్నవించెను.

ఇందు కథారంభమున తాళ్లపాకవారి జన్మదేశమగు పొత్తపి నాటిసీమను, తాళ్లపాకగ్రామమును వర్ణించెను. ఎటు చూచిన చెంగల్వకొలఁకులు, గొజ్జంగిపూఁబొదలు, పాలుగారు రసదాళి చెఱకుఁ దోటలు,ముక్కారుఁ బండురాజనపు పైరు భూములు, వయి యాప్రాంతము సస్యశ్యామలముగ సుభిక్షముగ నుండెడిదట. అయూర వసించు భూసురోత్తములు వేదవేదాంగపారగులట.

'కనుట గోవిందు మంగళవిగ్రహంబె - వినుట నారాయణు వృత్తాంతచయమె
చేయుట కౌస్తుభాంచిత పూజె తలఁపు- నేయుట మాధవ శ్రీపాద యుగమె
కుడుచుట వనమాలిగొను ప్రసాదంబె - నడచుట నందనందను నగరికినె'

యని వారిని 'యిందిరారమణపదైక మానసులఁగ' వర్ణించెను. అట్టి వారిలో నందవరాన్వయార్ణవ సుధాకరుఁడును, భారద్వాజస గోత్రుఁడును, ఆశ్వలాయన సూత్రశాలియునగు నారాయణుఁడను నొక బ్రాహ్మణోత్తమునింట అయిదు తరముల తరువాత నాయూరి కేశవస్వామి చెప్పిన చొప్పున శ్రీవేంకటేశ్వరు ననుగ్రహమునఁ 'దాఁటూను బిరుదు గజ్జియల ముప్పిడి కఠారం' బగు నందకాంశమున అన్నమాచార్యుఁ డవతరించెనని చిన్నన్న వివరించెను. లభించిన తాళ్ల పాకవారి యితర గ్రంథములలో నెందుగాని అన్నమయ పితృపితా మహాదుల ప్రశంసలేదు. ఇందే అది గలదు. అన్నమాచార్యుని తాత విద్యాభ్యాసమునకు ఊటుకూరను బంధుగ్రామమున కరిగినట్లున్నది. ఇన్ని వ్రాసియు, 'చక్కని గ్రహములుచ్చమున మూఁడలర-అనుపమ లగ్నంబునందు వైశాఖమున విశాఖను' అన్నమాచార్యుఁ డవతరించె ననినాఁడే కాని తిథివారముల నీకవీశ్వరుఁడు విపులీకరింపలేదు. అన్న మాచార్యుని జననకాలమును నిర్ధారించుపట్టున నిది కొంత చిక్కే కొల్పినను నీయంశము లావిషయము నెఱుఁగుటలోఁ గొంత తోడ్ప

డక పోలేదు.[1] ఇట్లు అన్నమాచార్యుని జననము, బాల్యము, విద్యాభ్యాసము మొదలుకొని యాతఁడు తిరుమలకు యాత్రబోవుట, దేవి ప్రత్యక్షమగుట, దివ్య స్థలముల దర్శించుట, స్వామిని దర్శించుట, సంకీర్తన రచన సేయుట, రాయలను ధిక్కరించుట, సంకెలఁబడుట, స్వామియనుగ్రహమున విముక్తుఁడై పశ్చాత్తప్తుఁడగు రాయలను మన్నించుట, మహామహిమోపేతుఁడగుట, దర్శింపవచ్చిన పురందర దాసు నాదరించుట మున్నగు నంశములతో సమగ్రముగ నాతని జీవితమును గూర్చియు, రచనలను గూర్చియు, సంతతిని గూర్చియు, నిందు చిన్నన్న వివరించెను. అన్నమాచార్యుని జీవితమునే కాక యాతని యాకృతి విశేషమునుకూడ కవి యిట్లు వర్ణించెను.

"కనకాంబరుని గుణగణమణుల్ శ్రుతులు
గని చిక్కగొను రీతిగను కపోలములు
నత్తఱి మదిలోని హరికీర్తి మొలక
లొత్తినగతి నున్న యూర్ధ్వ పుండ్రములు
లాలితాచ్యుతభక్తిలలన వరించి
మాలికగతి తిరుమణి పదంబులను
తలనిడు విష్ణుపాదపుఁ దమ్మిపువ్వు
మెఱుపైన కెంబట్టు మేలు కళ్లాయి
నరవిందనయను కృపామృతధార
కరణిఁ జూపట్టెడు కంఠమాలికయు
నరహరికై కంకణము గట్టియున్న
సరణిఁ జూపట్టు పచ్చల కడియములు
ధవళనేత్రుని శారదా విలాసంబు
నివసించునట్లున్న నిలువు పేరణము
వాసుదేవుని యాజ్ఞవడిఁ జుట్టుకొన్న
యాసత్త్వ గుణమున నలరు దువ్పటము." (పుట - 85)

---

1. అన్నమాచార్యుల జనన కాలము క్రీ॥ శ॥ 1424 క్రోధి వైశాఖ విశాఖ కావున బహుళ పాడ్యమి విదియ తదియలలో నేదేని యొకదినమై యుండవచ్చునని పూర్వమే తెలిసికొంటిమి.

నలవడి చూడ ముచ్చటగా నున్నట్లు వర్ణితము. అన్నమాచార్యుని నిర్యాణ కాలమునకు చిన్నన్న జన్మించి రెండు మూఁడేండ్లు మాత్రమే నిండియుండవచ్చును. అప్పటి కాతనికి తాతగారి రూపును ప్రత్యక్షముగా చూచిన జ్ఞాపకమేసి యుండియుండదు. అయినను చిన్నన్న తాతగారి జీవితమును, ఆకృతిని ప్రత్యక్షముగ చూచి యెఱిఁగినంత చక్కగా విపులముగా వర్ణించెను. దానికి అన్నమాచార్యుని జీవితాకృతుల ముద్ర లోకమున చెరగిపోనంత చక్కగా శిలాలోహములందు బంధించి బయలుపఱచిన పెద తిరుమలాచార్యుని పరిశ్రమమే ప్రధానకారణము. అన్నమాచార్యుని నిర్యాణానంతరము కొలది కాలముననే పరిస్థితులను చక్కఁజూచుకొని పెద తిరుమలాచార్యుఁడు తండ్రిగారి రచనలనెల్ల - నంతకుఁ బూర్వము తాటియాకులపై వ్రాసియుంపఁబడిన వానిని సురక్షితమొనరించుటకును, ప్రచారమునకుఁ దెచ్చుటకును, శిలాఫలకముల మీఁదను, తామ్రఫలకములందును జెక్కించి సంకీర్తన భండారము నొకదానిని నెలకొల్పి యందు వానినినెల్ల భద్రపఱచినాఁడు. అప్పుడే అన్నమాచార్యుని మూర్తిని దర్శించియుండిన శిల్పులచేతను లోహకారులచేతను నాతని యాకృతికి ప్రతికృతులను కూడ చేయించి నెలకొల్పుకొనెను.[1] ఆ మూర్తులే తిరుమలమీఁద తాళ్లపాకవారి యర యని ప్రసిద్ధిగాంచిన సంకీర్తనభండారమున లభించి నేఁటికి నచట దర్శనీయముగ నున్నవి. ఆ ప్రతికృతులను జూచియే చిన్నన్న పై వర్ణనము నంత ప్రత్యక్షముగాఁ జేయఁగలిగెను. ఈ వర్ణనము వానిని జూచియే గావించెనను విషయ మారెంటిని దిలకించిన వారికి వ్యక్తము కాఁగలదు. ఇట్లే ఆ మహనీయుని జీవిత చరిత్రమును గూడ పెద

1. అన్నమాచార్యుల ప్రతిమాప్రతికృతులు మాత్రమేకాక పెద తిరుమలాచార్య చిన తిరుమలాచార్యాదులవిగా గుర్తింపఁగు ప్రతికృతులును నేఁడు మనకు లభ్యమగుచున్నవి.

తెనుగున వెలసిన పూర్వ మహాకవుల ప్రతిమలును వారి జీవితములును లభ్యమైన వానిలో వీరిదే ప్రథమోదాహరణము. కృష్ణరాయాదులు అన్నమయ్యకుఁ దరువాతి కాలమువారే.

తిరుమలాచార్యుఁడు రాగిరేకులలో భద్రపఱచిన అన్నమాచార్య సంకీర్తనముల క్రమమును ఆనుపూర్విని ననుసరించియే యుద్ధరించి నట్లు ఆ రేకులను ఈ ద్విపదను పరిశీలించినపుడు తెలియగలదు. ఇది యిట్లే యనుటకు హేతువు చిన్నన్న ద్విపదలలో నెడనెడ ప్రస్తావింపఁ బడిన సంకీర్తనము లనేకము లదేక్రమమున రేకులందుండుటయే. పెద తిరుమలాచార్యుని వలన గొంత వినియుండియు, నా రేకులందలి సంకీర్తనములను జదివియుండియు, నీ జీవిత చరిత్రమును చిన్నన్న సంతరించియుండును. అట్లగుటచేతనే ఈ జీవితచరిత్రద్విపద చారిత్రికముగా పరమప్రామాణికమైనదనుట. బసవపురాణ పండితారాధ్య చరిత్ర లీతీరున రచితములైనవికావు. అది తత్కర్తయగు పాల్కురికి సోమనాథునకు సంబంధములేని కాలమునను, సంబంధములేని దేశమునను వ్రాయఁబడి అప్పటికెంతోకాలము పూర్వము వెలసి గతించిన పుణ్యపురుషుల చరిత్రములగుటచేతను, గాలిలో నిలిచినకథల నాధారముగాఁ గొని రచితములైనవగుటచేతను, కొంతవఱకు కల్పితాంశము లధికముగా నుండియుండు ననవచ్చును. కాని యిం దాసందేహమునకు దావులేదు. అందుకే తెలుఁగున ప్రత్యేకముగా కవితలో వెలసిన జీవిత చరిత్ర గ్రంథములలో (సోమనాథుని రచన తరువాత) నిది ద్వితీయమైనను ప్రామాణికతలో నద్వితీయమైనదనియే చెప్పవలసియున్నది.

ఈ గ్రంథమున నాఁటి చారిత్రికసాంఘిక పరిస్థితులును, తిరుమల తిరుపతులును, తత్పరిసరములును, కనులఁగట్టినట్లు వర్ణితములైనవి. ఉదాహరణకు సాళువ నరసింహరాయఁడు విజయనగరసింహాసనమును ఆక్రమించుటకుఁబూర్వము టంగుటూరు పెనుగొండ ప్రాంతములలో పాలకుఁడుగను, దండనాథుఁడుగను, నుండిన దినములను గూర్చియు, నాతనికిని తాళ్ళపాకవంశమువారికినిగల సాన్నిహిత్యమును గూర్చియు నీద్విపద గ్రంథమున వెల్లడియైన విశేషము లపూర్వములే.

ఇందలి ద్విపదరచన లక్షణబద్ధమైయున్నది. భాషయు భావమును జీవిత చరిత్ర రచనలో నుండవలసినరీతినే సారళ్యమును, స్పష్టతను గోల్పోక తిన్నగా తేటగానున్నవి.

## చిన్నన్న ద్విపదలలోని రసరామణీయకము

చిన్నన్న ద్విపద లక్షణమును నిర్దుష్టముగ నిర్వచించుటయే కాదు- ద్విపదలనుగూడ మనోజ్ఞముగ రచించెను. ద్విపద రచనలో చేయితిరిగినవాఁడగుటచేతనే సమకాలికులచేత 'చిన్నన్న ద్విపద కెరగును' అని యనిపించుకొనినాఁడు. 'శ్రీవధూవరలబ్ధ సిద్ధవాక్ప్రౌఢి' మతో 'దినములోననె వేయి ద్విపద లింపొంద—వినుత వర్ణనలతో' విరచించిన వాఁడనియుఁ, 'గవి శిరః కంపయోగ్య ప్రతిద్విపద నవబిరుదాంకుఁ'డనియు చిన్నన్నను గూర్చి యీవరకే తెలిసికొంటిమి. 'నోరికొలఁదుల బలుఁకు మంకుబోతుల' గతి గాక చమత్కృతి సంఘటింప 'నలఘు శబ్దార్థ సారసరీతి రసప్రభావముగఁ గులికి కస్తురి పిణెఁ గోసినకరణి, దెలికప్పురపుఁ గ్రోవి దెఱచినసరణి, విరవాదిపొట్లంబు విడిచినమాడ్కిఁ బరిమళించుచుఁ గవుల్ బళిబళియనఁగఁ, గవిత చెప్పిన సులక్షణ కవీంద్రుఁడాతఁడు.

చిన్నన్న చెప్పిన కృతులన్నియు నవరసభరితములు. ద్విపదలు చమత్కారమయములు. అవి 'పరహృద్భిదమై తలయూపింపఁగఁ జేయఁ' జాలినట్టివి. ఇందాతని ద్విపదలలోని రసరామణీయకమును గూర్చి మాత్ర మించుక ముచ్చటింతును. ఆతని తొలి ద్విపదకృతులు రెండును 'జతుర శృంగారవాచాప్రౌఢి మెఱసి' నట్టివి. మలికృతి భక్తి రసభరితము. ఆతఁడు రసవిషయము సమగ్రముగ నెఱిఁగిన మహాకవియు శిల్పియు నైనకారణమున అలఁతియగు ద్విపదచ్ఛందముననే అలఘుశబ్దార్థసారసరీతి నతిప్రౌఢముగా రసవిషయమును బరిపోషించెను.

ఈతని ఉషాపరిణయము చక్కని శృంగారకావ్యము. అందలి నాయిక ఉష స్వీయ. నిండు జవ్వనమును, కామావేశబుద్ధియుఁ గలదై లజ్జ నించుక దూరమొనరించి యుపాయాంతరమున బ్రియుని తన కడకుఁదెప్పించుకొనినది కావున ప్రగల్భ. ఇఁక నాయకుఁడగు ననిరుద్ధుఁడు సుందరుఁడును, భోగాసక్తుఁడును, సుకుమారుఁడును నగుట చేత ధీరలలితుఁ డనఁదగును. ఈ నాయికానాయకుల శృంగారేతివృత్త

మును చిన్నన్న విభావాదుల మొదలుకొని రససిద్ధియగుఁదనుక శ్రద్ధతోఁ జిత్రించెను. కావ్యమున నంగిరసమగు శృంగారమునకు వీరము నంగముగా నొనర్చి సిద్ధికల్గించెను. ఆ రససామగ్రి వర్ణనమునందును, గవి వాచాప్రౌఢిమతో సంయమనమును బాటించియు, రసానుభూతి నధికముగ కల్గించెను.

నాయికయగు నుషాకన్యక కేళివనమునందలి సౌభాగ్యమున కబ్బురపడి హరపార్వతీవసంతలీలాచరణాదికమును గన్నులారఁగాంచి పరవశయై.

'ఒకటియు నొకటియు నొఁరసి లోలోన
తుకతుకలాడ బంధుర కుచద్వయము
ప్రియునివక్షము గాడ బిగియించిపట్టి
ప్రియములు రెట్టింప బింబాధరంబు
చవిగొను సతులెంత సౌభాగ్యవతులో
చివురువిల్తునికేళి చిత్తంబుగరఁగి
కళలంటి విభుని చొక్కఁగఁజేయు మగువ
తలపోయ మున్నెంత తపముసేసిఁదో!' (పు. 18)

అని తలపోసినట్లు వర్ణించుటలో కవి నాయికయొక్క 'సంభోగ విషయ ఇచ్ఛావిశేషమగు రతిభావమును చక్కఁగ చిత్రించెను. కోమలమగు నిందలి పల్కుబడియు, భావసంపదయు, మాధుర్యసౌకుమార్యములను గుణములతో భాసిల్లి చిత్తద్రుతికి హేతుభూతమగునట్లుగానున్నది. ఇట్టి రతిభావమున నుత్తేజితయైన ఉషాకన్యకు స్వప్నమునను చిత్రపట మునను ప్రత్యక్షమైన ప్రియుని మనోహరాకృతి యాలంబనమును నుద్దీపనము నునైనది. అప్పుడు.

'ముచ్చుమన్మథుఁడు మునిముచ్చు వీఁడనుచు
నారూపు చనుదోయి నంటనొత్తుచును
పారవశ్యమునొంది పలికె ప్రేమమున

అని కవి వర్ణించిన పట్టున నాయికలోని ప్రళయమను సాత్త్విక భావము ప్రదర్శితమైనది. ఇట్లు విభావానుభావ వ్యభిచారుల సంయోగ

మున నాయికానాయకుల తుల్యానురాగము రసస్థితిఁ గొంపోయెను. అంతలో బాణభటు లంతఃపురవిషయము నెరిగి యభ్యంతరము జెప్పుటయు, అనిరుద్ధుఁడు పరాక్రమమును ప్రదర్శించుటయు మున్నగు కథాఘట్టమున కవి శృంగారమున కంగమగు వీరమును చమత్కారముగ చిత్రించి యంగిరసమును బోషించెను. చూడుఁడు.

"ఘనసార కస్తూరికాలిప్తశాణ-తనయ మనోహర స్తనయుగ్మ ఘటిత
ఘనవక్షుఁడగు యదుకంఠీరవుండు-తనచేర్వ నున్నట్టి దారుణోత్తుంగ
పరిఘంబుగొని ప్రియశ్యామవారింప-సరభసవృత్తిఁదత్స్పర్ధంబు డిగ్గి
గురుగహ్వరీధర గుహనుండి వెడలి-కరుల ఢీకొను హరికరణి గర్జించి
పరిఘంబు వడిఁద్రిప్పి వరుల గొందఱిని-శిరములుపగులంగ నెలసి మోదినను.
(పు-44)

ఈ వర్ణనమున అనిరుద్ధుని సమరోత్సాహము వీరరసస్థాయిగా వర్ణితమైనది.

'డొక్కలు చెరజారిడుక్కలు దూరి-గుక్కుమిక్కనుచు దగ్గుత్తికల్వడగ
కళవళింపుచును డొక్కారంబుఁదొచ్చి-తలలువీడగను ముందర కానకరుగ'
'అనిమిషాహితుఁడప్పుడంత కాకృతికి-సరభసమోటక సాహస్రకేతు
గురుచామరవ్యూహకోదండదండ-పరశుతోమరముఖ పరిఘనారాచ
వరశస్త్రములచేత వలనొప్పు శేరు-' (పు-45, 46)

ఇత్యాది వర్ణనలందలి ద్విత్వకకారచకారాదులును, సమాసభూయిష్ఠమగు గాఢబంధమును ఓజోగుణ ప్రధానమై చిత్తదీప్తికి హేతు భూతములగుచున్నవి. ఇందు కవి ప్రతినాయకుఁడగు బాణుని విజృంభణమును గూడ నౌచిత్యమెఱిగి వర్ణించి నాయకపక్షము వారి సమరోత్సాహస్థాయిని బరిపోషించి రసస్థితివఱకుఁ గొంపోయి తుదకు దానిని శృంగారమున కంగముగ నొనర్చెను. ఉషానిరుద్ధుల వివాహముతో నీ శృంగారప్రబంధము రసప్రసిద్ధమైనది.

ఇట్లే శ్రీకృష్ణాష్టమహిషీకల్యాణకథలోఁగూడ చిన్ననన్న శృంగారము నుచితరీతిని బోషించెను. శృంగారమునకు వీరమువలెనే హాస్యమునుగూడ నీకవి తన కావ్యములందు సహకారిగాఁ జేసికొని

చిత్రించినాడు. "శ్రీ కృష్ణుఁడు గోపికలతో రాసక్రీడ జరపినపిదప జలకేళికారంభించును. అవట్టున చిన్నన్న

'మనహాస్యరసము శృంగారమధ్యమునఁ గొనకొన్నగతిఁ దాళిగోఁబంబుగట్టి'
వారితోనొనగూడి వారిలోఁజొచ్చి-వారికేళియొనర్చి వారనివేడ్క
తరఁగలఁగనియొక్క తరళాక్షి శౌరి-కరములోయని పట్టికరము నవ్వినను
హరికురులనియొక్కయతివ శైవలము-సరగునఁబట్టి వేసరికేరితిట్టి'

(అష్టమహిషీ-పు. 111)

ఇత్యాదిగా వర్ణించినాఁడు. ఇందు భ్రాంతియనునలంకారమున హాస్యము నంగముగాఁ జేసి చిన్నన్న శృంగారమును బోషించి నాఁడు. ఈ ఘట్టమెల్ల శృంగారరస సమంచితము. రచన చమత్కార జనకము. కొన్ని పంక్తులను చూడఁదగును.

'కలకలనాద కోకముల లోకములఁ-గలికాగ్రకాంత శృంగముల భంగముల
సముదిత హేమకంజముల పుంజముల-రమణీయ పుష్పనికముల పూరముల
కలిత శ్రీకృష్ణు శృంగారరసాబ్ధి-వలెనొప్పు నయమున వరపుత్రిగాంచి'

(పు - 110)

'నిలువగోవిందుఁ డూనిన ప్రేమ జలువ-వలచు చెంగలువచే వైచెనాచెలువ
కరమెత్తిచేగుత్తి కవంచే హత్తి-హరినొత్తివైచి రాయతివలఁ యెత్తి
మతులు సమ్మతులుగా మహనీయబాహు-లతలగొల్లెతల ఫాలతలములుంచి'

(పుట - 113)

'తెమ్ము ముత్యమ్ము పుత్తెమ్ము పోతెమ్ము-కమ్మపూఁ బొదరిల్లు కలికి నీసొమ్ము
కొమ్ము గంధము పూసికొమ్ము నీవంది-కొమ్ము పూవులు జాతికొమ్ము
నామమ్ము' (పు - 114)

ఇత్యాద్యుదాహరణములందు కానగు వర్ణవిన్యాసము కాంత్యౌదార్యమాధుర్యాదిగుణములతో భాసిల్లి శృంగారరసోచితమగు కైశికీ వృత్తి ప్రధానముగ నున్నది.

ఇట్లు చిన్నన్న శృంగారమునే కాక నవరసముల నొలికించె ననుటకు మఱికొన్ని యుదాహరణములనెత్తి చూపుదును.

*వీర రసమునకు :* అష్టమహిషీకళ్యాణమున రుక్మిణీపరిణయ ఘట్టమునందు శ్రీకృష్ణుఁడు కయ్యమునకు కాలుదువ్విన శిశుపాలుని మీఁదికి దండెత్తి వెడలిన ఘట్టము వీరరసోపేతము— చూడుఁడు:— .

'వాహినీపతివలె వాహినీసమితి ...................................
వాహిని దశదిశల్ వడఁకనేతేర వాహినీవిభుఁడు భూవర యొప్పుమిగిలి
యాతతచైద్య శౌర్యచ్ఛేదహేతు కేతువు గతి తార్క్ష్యకేతు లింపొంద
మాగధోత్పాత భూమహిత గర్జనము లాగున రథసముద్భట నాదమడర"
(పు - 192)

వెడలిన విషయమును,

'విడువక పోరద్రివిక్రమాగ్రజుఁడు-కడురేసి వైరిచక్రంబుపై నుఱికి
పటుతర కరిఘటాశట నిటలములు-చటులాశుగములచేఁ జక్కసేయుచును
చటులమౌసలపుఁగౌశలముఁ జూపుచును-క్రథనసంభృత పిజృంభణభీష దాంక
రథుల ఘాళి సారథులఁ ద్రెంచుచును భటకదంబములు కంబువులు
తోటతోట ధరరాల 'దునియనేయుచును.' (పుట - 197)

ఓజోగుణప్రధానమై యీపత్రౌపధార్థమున భారతీవృత్తితో నున్న యీ రచన వీరరస పోషణమున కనుగుణమైనది. ఇందు కృష్ణుఁడు నాయకుఁడు. సమరోత్సాహము స్థాయి. శిశుపాలుఁడాలంబనము. వీర్య పరాక్రమ ప్రభావాదు లనుభావములు. అమర్షౌత్సుక్యాదులు సంచారీభావములు. వీనిచేఁబరిపుష్టమైన సమరోత్సాహమిది వీరరసమున కుదాహరణము.

*రౌద్రమునకు :* అనిరుద్ధకుమారుని శ్రీ కృష్ణాదు లన్వేషించుచుండిన సందర్భమున నారదుఁడేతెంచి బాణుఁడు 'ఘనతరాశుగముల గట్టి బంధించి కనలుచు వేయించె గారాగృహమున వనజాక్ష! యిది చూచి వచ్చితినే' ననఁగ బలమర్ది యాగ్రహంబొదువ బలిపుత్రుఁడగు బాణుపై దండువెడలిన ఘట్టమును చిన్నన్న రౌద్రరస స్ఫూర్తితో వర్ణించెను.

'కాంచనాంబరమును కౌస్తుభమణియు-చంచత్కరాళదంష్ట్రాచతుష్కంబు
శరగదాచక్రాది శార్ఙ్గకృపాణ-దరపాశఖేటకోద్యద్భుజాష్టకము
శ్రీవత్సకాంచన శ్రీయును గలిగి-దేవకీతనయుఁడెంతే సంభ్రమమున
అనుపమనిజపౌరుషాన్వితుండగుచు-తనతొంటిరూపంబు దాల్చె రాముఁడును'

(ఉషా. పు 56)

శత్రుకృతాపచారము కారణముగాఁ బ్రజ్వరిల్లిన క్రోధ మందు స్థాయి. బాణుఁడు బాలుఁడగుననిరుద్ధునితో ననిసేసిన విషయమిందు ఆలంబనము. 'అనిసేసి యతని శౌర్యమునకు విసిగి ఘనతరాగములగట్టి బంధించుట' ఉద్దీపనము. ధైర్య శౌర్యము లనుభావములు. అమర్షము ఔగ్ర్యము సంచారులు. వీనిచేఁ బరిపుష్టమయిన యీ ఘట్టము రౌద్ర రసాంచితము.

*భయానకమునకు* : ఉషాపరిణయమున హరవాసుదేవ యుద్ధ సంరంభమును వర్ణించు పట్టున శ్రీ కృష్ణుఁడు మంత్ర పూర్వక బ్రహ్మాస్త్రమును ప్రయోగింపఁగా శివుఁడు భయకంపితుఁడై పరాజితుఁడగు సన్నివేశమున చిన్నన్న భయానక రసస్ఫూర్తిని గల్గించెను.

'అంభోజభవముఖ్యు లతిభీతినొంద-జృంభ సముత్పాత జృంభదారంభ
కుంభదంభోదరస్తోకనినాద-జృంభణ శరమేసె శిఖనేత్రుమీఁద...
అనఘగోవింద దివ్యాస్త్రప్రభావ-మున రుద్రుఁడప్పుడు మదమెల్లదక్కి
అవలింపుచు మేననలయికదోప-భావమంతయు మాఱువడఁగ
నిడువెండ్రుకలతోడ నిట్టూర్పువిడుచు-కడుదాహమున డస్సి కన్నులు మోడ్చి
పారవశ్యమునొంద భయమంది నంది-తేరుమరల్చె నెంతే తీవ్రగతిని'

(ఉషా. పుట. 78)

శ్రీ కృష్ణకృత బ్రహ్మాస్త్రప్రయోగము కారణముగ శివుని చిత్తమున గల్గిన యనర్థాశంక-భయము ఇందలిస్థాయి. బ్రహ్మాస్త్రము ఆలంబనము. స్తంభరోమాంచకంపాదులు సాత్త్వికభావములు. గ్లాని, త్రాస మున్నగునని సంచారులు- వీనిచేత భయానకరస మిందు పరిపుష్ట మైనది-

*బీభత్సమునకు :* ఉషాపరిణయమున హరవాసుదేవుల యుద్ధానంతరము బాణాసురసమరభూమితలమును చిన్నన్న చిత్రించిన తెలుఁగు బీభత్సరసోపేతము.

'కరికుంభముల మౌక్తికంబులు రాల-వరనఖాగ్రంబుల వ్రచ్చు గృధ్రములు
కడుపులు చించి రక్తముగ్రోలి ముక్కు లెడనెడ నిల దిండి యెగయు కాకములు
కరముల తతులు ముద్గరములతతులు-పురకదంబములు నూపురకదంబములు
సితసాయకములు శాసితసాయకములు-తతశివారవము సంతతశివారవము
కటఖండములును కంకటఖండములును-ఘటిత ద్విజాళి యఘటితద్విజాళి'

... ... ... ... ... ... ... ... ... ...

'శూలినయరదముల్ శోనవెల్ల విడిసి-వ్రాలినటెక్కెముల్ వరదలై పాఱు
నెత్తురు గాలువల్ నెరసి యంతటను-మొత్తంబులై యున్న మొండెముల్మిగుల
చెదరిన మెదడు గిజ్జడియైన తొడలు విడిసిన కాయముల్ చిందువందైన
గుండియల్ ప్రేవులు గుదురైన యెదలు-కండలు దుమ్మురైన కైదువుల్పోలి"
(ఉషాపరి. పు. 83-84)

నెత్రుటేర్లతోడను, భూతగణములతోడను నిండిన రణభూమివర్ణనమునగల్గు జుగుప్స యిందు స్థాయి. పలలాస్థిశోణితాదు లాలంబనములు. ఢాకినీగృధ్రఘూకాదిభూతగణము లుద్దీపనములు. రోత యనుభావము. త్రాస, ఆవేగము సంచారులు. దీనిచేత జుగుప్స యిందుతెస్సగాఁబోషింపఁబడినది.

*హాస్యమునకు :—* వికృతాకారవాగ్వేష చేష్టాదికము కారణముగా జనించు హాసస్థాయియొక్క వికాసమే హాస్యమగునని యాలంకారికులు చెప్పియున్నారు. పరమయోగివిలాసమున భక్తిసారుని కథలో వరమిత్తునని పలికిన శంకరునితో "ఈదారంబు సూదిదారంబునందు సంధానింప నిపుడు వరమిమ్ము" అని యాతఁడు పలికిన పలుకులు హాస్యస్ఫోరకములే. అందే గోదాదేవికథలో పరిణయానంతరము పౌరజనసంతోషాతిశయమును ప్రశంసించువట్టున చిన్నన్న యిట్లు రచించెను.

'తిలకంబు కామినీతిలకంబు నొసలఁ-దెలివి మీఱఁగఁ దీర్చితీర్చి యేతెంచి
తివిరి కాటుక కంటఁ దీర్పంగఁబోయి-శ్రవణావతంస కైరవమునందీర్చి
చనుదెంచె నొక్కర్తు, చంద్రాస్యయొకర్తు-తనకేలి నలివుమధ్యమునఁ బొంకించి
యరుదెంచి యొడ్డాణ మఱుతఁ గీల్కొలిపి పరువడి నేతెంచె భామ యొక్కర్తు'

(పుట - 369)

ఇట వ్యత్యస్తముగ నలంకరించుకొనిన పడతుల వికృతవేషము హాసమును వ్యక్తము చేయుచున్నది. సంభ్రమానందము లనుభావములు. ఆవేగము ముదము సంచారులు. వీనిచేతఁ బరిపుష్టమై హాస్యరస మిట బోషింపఁబడుచున్నది.

*కరుణమునకు* :— హితజన విరహదుఃఖమున బొడము స్థాయీభావమే శోకము. శోకముయొక్క పరిపుష్టావస్థయే కరుణము. పరమయోగివిలాసమున విష్ణుచిత్తులవారికథలో శ్రీరంగనాథుఁడు పల్లకిలోని గోదాదేవిని మాయము చేసిన సందర్భమున విష్ణుచిత్తుడు విలపించిన ఘట్టము కరుణరసపూరితము.

'అకట నీకిటు తగునయ్య రంగేశ!——
యీ రీతి దొంగిల నీ కొమ్మ గోప-నీరజాక్షుల నవనీతమే తలఁప
జగదేకసాక్షివై సర్వనాయకుఁడ-వగునట్టి నీవ యన్యాయంబు సేయు
మితిలేని మున్నీరు మేఱమీఱంగ-నితరుల వారింపనెట్టు లోపుదురు!'

(పుట - 354)

ఇట్లు విష్ణుచిత్తులకు పుత్రికావియోగమునఁ 'గన్నులతోయపూరములు తొరగినవి'. దుఃఖమున పలికిన వారిపలుకులందు శోకము వ్యక్తమగుచున్నది. పుత్రికమీఁది పరమానురక్తి యాలంబనము. ఆమె కానరాకుండుట ఉద్దీపనము. రోదన మనుభావము. నిర్వేదము మోహము దైన్యము సంచారులు—

*అద్భుతమునకు* : అపూర్వవస్తుదర్శనమున గల్గుచిత్తవిస్తారమును విస్మయమందురు. అట్టి విస్మయమను స్థాయీభావమే పరిపుష్టమై అద్భుతరసమగును. ఉషాపరిణయకథలో బాణుని యంతఃపురమున ననిరుద్ధుఁడు చేరిన వార్త విన్నప్పుడు—

"పదిలమై యీ యింతిభవన మేమరక కదలకెప్పుడు కట్టుగాచి యుండెదము
యెటువంటి చిత్రమో యిందర మెఱుఁగి యిటకు వేగరి వచ్చెనీ నరుఁడనిన
రోమముడిగదురు నద్భుతదుఃఖుఁడగుచు'- (పు - 48)

బాణుడు సమరమున కుత్సహించినట్లు చిన్నన్న చిత్రించిన
తెలుఁగు విస్మయ వ్యంజకముగనేయున్నది. ఇట్లే అష్టమహిషీ కళ్యాణ
మున శ్రీకృష్ణుని బాల్యచేష్టితములన్నియు నద్భుతావహములే.
ముఖ్యముగఁ 'బకవాణు లరుదందు'నట్లు 'హాలాహలాభిలమగు మడు
పున-గుభులుగుభుల్లన గుప్పించి దుమికి' కాళీయఫణిఫణాళిపై ఫణి
శాయి తాండవమాడిన దృశ్యమును చిన్నన్న అద్భుతరసోపేతముగఁ
జిత్రించెను. (చూ. పుట 63-65)

*శాంతమునకు* :—నవరసములలోఁ బైవానివలెనే శాంతమున
కును చిన్నన్న ద్విపదలనుండి యుదాహరణములఁ జూపవచ్చును.
ఈతని పరమయోగివిలాసము శాంతరస ప్రబంధమనియే చెప్పవచ్చును.
శాంతరసమునకు స్థాయి శమము. వైరాగ్యాదులచే చిత్తము నిర్వికారమై
యుండుటయే శమమని ప్రతాపరుద్రీయకారుఁ డనఁగా నిత్యానిత్య
విచారమువలనఁబుట్టిన విషయవిరాగమను పేరుగల చిత్తవృత్తివిశేష
మగు నిర్వేదము శమమని రసగంగాధరకర్త యనినాడు. ఇట్టి
యీ శమమను భావమును చిన్నన్న పరమయోగివిలాసమున బెక్కు
తావులఁబుష్టిగాఁ బోషించినాఁడు. ఒక్క యుదాహరణముమాత్ర
మిత్తును 'కనుపట్టు కనకకుల్యంబుఁగైకొనుము' అని వటపత్రశాయి
నుఁ డుద్బోధింపగా విష్ణుచిత్తుఁడు—

"వేదమో శాస్త్రమో వివరించిచూడ - వేదార్థసాధ్యమై వెలయుకుల్యంబు
పాయక గుద్దలి పట్టనేలి - కాయలఁ జూపియేఁ గైకొనుమట్ల
లితరవిచారంబు లెవ్వియునెఱుఁగ - మఱి నీదు పాదపద్మములెఱుంగుదును"
(పు - 293)

అని వినమ్రుఁడై విన్నవించుకొనుటలో శమమనుభావమే
తెల్లగఁబోషింపఁబడినది. ఇట్లే యామునుల వృత్తాంతముగూడ చూడఁ
దగును (పుట 490). 'ప్రపత్తిమార్గమ్ముదెలిపిన యామునదేశికుం
డపుడు పరమవిరక్తి చొప్పడె'నట! పితృపితామహులిచ్చిన యర్థనిక్షేప

రూపమగు దివ్యతత్త్వమిం దాలంబనము. గురూపదేశముద్దీపనము. ప్రవృత్తిమార్గమును వీడి ప్రపత్తిమార్గము నెఱుఁగఁగోరుట అను భావము. అధ్యానహర్ష బోధాదులు సంచారులు. వీనిచేత శాంతము బోషింపఁబడినది.

ఇట్లు చిన్నన్న ద్విపదలలో నవరస స్ఫూర్తిని గల్గించుటయే గాదు- విసుగుగొల్పని విధమున చిత్రగతులలో వానిని నడిపించి వింత వింత చమత్కారములను గూడ సాధించినాఁడు. స్త్రీ వర్ణనమను నొక్కవిషయమును జూచినజాలును. దానిని బహుముఖముల బహు విధముల నాతఁడెట్లు చిత్రించినాఁడో తేటతెల్లము కాఁగలదు. వర్ణనము లందారోహావరోహణక్రమములను పాటించినాఁడు. పాదభ్రమక రచనను గావించినాఁడు. ఓజస్సమాధిమాధుర్యాది గుణములను రసాను గుణముగ బోషించినాఁడు. ఒక్క విషయమును మాత్రముచెప్పి ముగింతును. ద్విపదచ్ఛందమున రసవత్ప్రబంధరచన సాధ్యమనువిషయ మును సోమనాథుని తరువాత సమర్థముగ నిరూపించిన కవిసత్తముఁడు చిన్నన్నయే. కనుకనే "చిన్నన్న ద్విపదకెఱుగును" అనిపించు కొనినాఁడు.

## మంజరీద్విపదకావ్యములు

తాళ్ళపాక కవీశ్వరులు సుప్రసిద్ధములగు ద్విపదకృతులనే గాక ద్విపదవికారములనఁదగిన ఛందమున గూడ నొండు రెండు కృతులను వెలయించినారు. మంజరీద్విపదయందును, ద్విపదకువలెనే పాదమున మూఁడింద్రగణములు నొక్క సూర్య గణమునుండును. యతినియమము గలదు. కాని ద్విపదయందువలె ప్రాసనియమ మిందు లేదు. "వలదు ప్రాసంబంద్రు వరుస మంజరికి" అనియు లాక్షణికులు మంజరియందు ప్రాసమును నిషేధించిరి. తాళ్ళ పాకవారు తమ మంజరులం దీనియమమును తప్పకఁబాటించినారు. ఇం దేచరణమున కాచరణము విచ్చుకొనిన రెక్కలవలె విడివడి విస్తృ తమై భావకుసుమసౌగంధ్యముల వెలార్పఁజాలియుండును. అందుకే మంజరీ నామము దీనికి సార్థకము. ఈ ఛందమునందలి రచనలు తేలి కగా ధారణచేసి గానముచేయఁదగియుండును. తెనుఁగున స్త్రీబాల

పామరాదులు పాడుకొను దేశిగేయరచనలు ప్రాయికముగా నీతీరు రచనలే. కనుకనే ప్రచారదృష్టితో తాళ్ళపాకవారీ ఛందమును పరిగ్రహించినారు.

తాళ్ళపాకవారి మంజరీ రచనలలో నేఁడు మనకు లభ్యములైనవి మూఁడు గలవు. అవియే (1) తాళ్ళపాక అన్నమాచార్యుని 'శృంగార మంజరి' (2) తత్పుత్రుఁడు పెదతిరుమలాచార్యుఁడు రచించిన "చక్రవాళ మంజరి;" (3) అన్నమాచార్యుని రెండవ భార్యయు పెదతిరుమలాచార్యుని తల్లియునగు తిమ్మక్క రచించిన 'సుభద్రా కళ్యాణము'—అనునవి.

*"శృంగారమంజరి"* : కర్త తాళ్ళపాక అన్నమాచార్యుఁడు. ఇది యాతని లఘుకృతులలో, లభ్యమైనవానిలో నొకటి. దాదాపు 517 పాదములలో ముగిసినట్టిది. ఇందలి ఛందము మంజరీ ఛందమగు టను బట్టియు, విషయము దివ్యశృంగార సంబంధము గల దగుటను బట్టియు నీ లఘు కృతికి 'శృంగారమంజరి' యని పేరైనది. తిరువేంకటాద్రీశున కంకితమీయఁబడినది. గ్రంథారంభమే శ్రీ వేంకటేశ్వర స్వామి వర్ణనముతోనున్నది.

ఇతివృత్తము : 'అమరాద్రితో మాద్రియగు వేంకటాద్రి నున్నతోన్నతలీలనుండెడివాని' శృంగారవిఖ్యాతిని, చెలువంబురీతిని —సకల జనానంద సంస్తుతిచేత వినివిని యొకబాల యాస్వామి యందు వినుకలి దగిలియుండును. ఇట్లు వినుకలి దలపోసి వెరువులఁజాని వెట్టలకెదురేగి వెతలను గ్రాఁగి యుండుటను జూచి తోడిచెలికత్తెలు కొందరామెను మాటల మాటున మరపింతమనుచు నుద్యానవనము నకుఁ గొంపోవుదురు. కాని యంతలోనె వసంత మెదురైనది. 'తగ విరహుల కోర్కి తలిరించెననఁగ నవకమై చివులునవిచెథూజములు' ఉద్యానవనమెల్ల మన్మథవసంతుల ప్రభావమునకు లోనైనది. తీగయుయ్యెలలలో నుయ్యాలలూఁగిచియు, దోహదక్రియలలో తేలియాడించియుఁ జెలు లామె విరహతాపమును దీర్పఁజాలక పోవుదురు. ఆమె కచటి వాతావరణమెల్ల విరహోద్దీపకముగ నుండెను. ఆమె స్థితిని గమనించిన 'వనపాలకాంతలు వనవిలాసినులు' కొందఱేఁగి యావార్త ను

వేంకటాద్రీశున కెఱిఁగించి శృంగార వనకేళిఁ జిత్తంబుగలిగి విహరించుటకై యాహ్వానింతురు. అపుడు 'భామలతలఁపులో పలిగారడీడును, వెలలేని వలపుల వేడుకకాఁడును, అఖిలశృంగారాబ్ధి కధిపతియు'నగు కోనేటిరాయఁడు కదలి వచ్చును. చెలులు పుష్పాపచయానంతరము మన్మథ పూజసేయుదురు. అపుడు వనవాటికల యందు విహరింప వచ్చిన గోవిందుని గాంచి యాబాల విరహాతిశయము ననుభవించును. అపుడు కీరములపలుకులును, జక్కవల జంటలును, పైవీచు గాలులును, పర్వినపరిపూర్ణ చంద్రికా ప్రభలును నామెకు విరహోద్దీపన కారణంబులగును.

'తాపంబు మేన ప్రతాపింపఁ దొడఁగె - నూర్పులు మిగుల నిట్టూర్పులై నిగుడె
బగలె మృగాక్షికి వగలుగాఁ దోచె - రాత్రులింతికి శివరాత్రులై తోఁచె"

ఇట్లు విప్రలంభావస్థల ననుభవించు నాచెలితాపమును దీర్చుటకై చెలికత్తెలు శీతలికలఁదెచ్చి శిశిరోపచారములు సేయుదురు. దానితో నాయమకు తాప మగ్గలంబగును. అప్పుడు చెలువల వెఱపుడిపి ప్రోడయగు మేటబోటి యొకతె యామెమనసిచ్చిన 'కందర్పగురుని దేకయుండిన నింతిఁదేర్పంగరా'దని తలపోసి దూతియై శ్రీ వేంకటాద్రీశునికడకేగి చెలియవిరహాప్తీరు వివరించి యాతనిఁదోడితెచ్చును. ఆ స్వామి యాబాలనుదేర్చి, చిత్తజు సామ్రాజ్య సింహాసనమున బట్టముగట్టించి, శృంగార రసవార్ధి నోలలాడించెను. ఇదియే 'శృంగార మంజరి' యందలి యితివృత్తము. గ్రంథనామమునకుఁ దగినట్లుగానిందు శృంగారము చక్కఁగా పోషింపఁబడినది. ఇందలినాయిక స్వీయ—ముగ్ధ—జ్ఞాతయౌవన. తొలుత 'వినుకలి'చేత నయోగశృంగారావస్థ ననుభవించినది. శృంగారవనమున రమానాయకుని సందర్శనమున నాతఁడాలంబనము కాఁగా వసంత ప్రభావమున విజృంభించిన శుకపికాలాపములును మలయానిల చంద్రికలును నుద్దీపనవిభావము లైనవి. అ కారణమున నామెలోని 'రతి' జాగరితమై తదనుభావమున రసోన్ముఖమగును. అపుడు 'పులికాలుతోఁద్రోపులాడ'—'చెక్కులుచెమరు భావంబుకదలును బలుకులోఁగొదలు'నేర్పడ—'మైమఱపయి' సాత్త్వికభావోదయమగును. నాయకుని పొందుతో రసోన్ముఖముగానుండిన నాయిక

యందలి రతి రసపర్యవసితమై శృంగారరసానందానుభూతిని కలిగించును. ఇందలిరచనయు తద్రసమున కనుకూలమై యొప్పుచున్నది. కాంతి సౌకుమార్యౌదార్యప్రసాదాదిగుణములతో నొప్పి యీ రచన వైదర్భీ వృత్తిప్రధానమై యున్నది.

ఈ యితివృత్తమున కవి నాయికను 'ఒకబాల'యనినాఁడు. కాని యామె లక్ష్మీస్థానమని భావింపనగును. ఇందు వర్ణ్యమగు విషయము శ్రీనివాసకళ్యాణమగుటచేత ప్రాయికముగా నిది వేంకటాచలమాహాత్మ్యమున వివరింపఁబడిన పద్మావతీ శ్రీనివాసుల పరిణయకథా సంఘటనకు సంబంధించినదని తలఁపవచ్చును. అన్నమాచార్యుఁడు శ్రీవేంకటేశ్వరుని భక్తుఁడై తనసుకవితావిలాసములచేత నా భక్తసులభుని వశముచేసికొనిన మహనీయుఁడు. అందుకే వేంకటేశ్వరస్వామి అన్నమాచార్యులవారిని తనకు మామగారుగా సంభావించుకొనెనట![1] అపుడు పద్మావతి (అలమేలుమంగ–అలర్ + మేల్ + మంగ – తామరగద్దెపై వెలసినతల్లి = లక్ష్మి) అన్నమాచార్యుని పుత్రియై తాళ్లపాకవారి యింటి యాడపడుచు అగును. ఈ విషయమును అన్నమాచార్యుని దౌహిత్రుఁడు రేవణూరి వేంకటాచార్యుఁడు తన శకుంతలా పరిణయమున విశదీకరించెను. ఆ హేతువుచేతనేగావచ్చును, తాళ్లపాకవారు తిరుమలమీఁద స్వామివారికి 'వైవాహికోత్సవ'[2] మనునొక యుత్సవమునుగూడ నూతనముగ నారంభించి తామే పెండ్లిపెద్దలై ఆ కళ్యాణోత్సవమును నిర్వహించుచు దానికిఁదగిన దానధర్మములను గూడ గావించినారు. అన్నమాచార్యుని సంకీర్తనములందే

---

1. "అమ్మహాదేవదేవుండు మదీయ మాతామహవంశశిఖారత్నంబగు నన్నమార్యునకు జామాతురుండనిపించుకొని భవదీయ సంకీర్తనంబులాలించిన కర్ణంబుల నితరసంకీర్తనంబు లాలింపనని ప్రతిజ్ఞఁగావించె."

రేవణూరి వేంకటాచార్యుని శకుంతలాపరిణయము - ప్రాతప్రతి - అముద్రితము–.

2 ఈ కళ్యాణోత్సవమును గూర్చిన వివరణమునకు. చూ. తి.తి.దే. శాసనముల సంపుటి సం. 5-71-99 సంఖ్యలు.

ఈ పెండ్లి తిరునాళ్లను గూర్చిన ప్రశంసలున్నవి.[1] ఈ వేడుకలే పిదప క్రీ॥ 1546-1547 ప్రాంతములలో నైదుదినముల పెండ్లిగా చినతిరుమలాచార్యాదుల పర్యవేక్షణమున ఘనముగా సాగినవి. ఆ వేడుకల సందర్భమున తిరువేంకటాచలమాహాత్మ్య[2] పఠనము కూడ జరుగుచుండినట్లు తెలియుచున్నది. పద్మావతీ శ్రీనివాసుల పరిణయకథ వేంకటాచల మాహాత్మ్యమునందలిదే. ఆ హేతువున శ్రీనివాసకళ్యాణ గాథను ఆ శుభసమయమున బహుశః పాడించుటకును, స్త్రీ బాల పామరాదులు సర్వులునుపాడి యానందించుటకును నెంచియే అన్నమాచార్యుఁడీ కథావస్తువును గేయరూపమగు మంజరీఛందమున 'శృంగారమంజరి'గా సంభావించినాఁడేమో!

ఇందలి రచనారీతి నెఱుఁగుటకై పంక్తు లుదాహరించిన జాలును.

వనవిహారము సల్పుచున్న చేడియవర్ణనము-

"కళుకులో చిలుకాకు కరవాలుఁగొనల-తళుకులో విటుల డెందములు గాపాడు ములుకులో యనఁగ నిమ్ముల మల్లెసిల్లి-శాలలో పుష్పాస్త్రుశృంగారునాట్య శాలలో పూవింట జడిగొన్న యంప-కోలలో తలఁపులో గుదిగొన్న తాల్మి చీలలో యనఁగ నచ్చెలు లెల్ల గూడి." (పు - ౫)

దోహద క్రియలు-.

"శేమా! విలాసంబు లేమావిమంచి-లేమావిఁ జేచాఁపలేమా యటంచుఁ దిలకంబుఁదీర్పక తిలకించి చూడు-తిలకంబుమానినీతిలకంబ యనుచు నడుగు కందువగోరి యడుగున కోక-మడిగెడుబోటి నీయడుగులాననుచు గర్ణికారంబు లాకర్ణింపఁబలుకు-గర్ణికా రమణీయకాంతిగా ననుచు" (పు.౬)

---

1. "పసిఁడి యక్షంతలివె పట్టరో వేగమేరారో
దెసలఁ బేరటాండ్లు దేవుని పెండ్లికిని"
(అన్నమా. అధ్యాత్మ 8-194)

2. శ్రీ వేంకటాచలమాహాత్మ్యమును సంస్కృతమున వెలయింపఁ జేసినది అన్నమాచార్యుఁడే యని అన్నమాచార్య చరిత్ర ద్విపదనుబట్టి తెలియుచున్నది.

నాయికావిరహావస్థ-.

'చూడదు తలయెత్తి క్రుతిదండెఁగూర్చి-పాడదు చెలులెల్లఁబై కొన్న సరస
మాడదు చిలుకతో నందంపు మాటలాడదు వెడమాట లాడెడిఁ గానిఁ
కొంచదు ప్రాణంబు గుఱుతుగాఁ జేసి-యెంచదు వీణె వాయించదు పరిణ
మించదు మదిసంభ్రమించదు-చెలియకించుకేనియును నయించదు కాని
కప్పదు చనుదోయి కమ్రగేవఁ జెప్ప విప్పదు తనప్రాణ విభుమీఁది మనసు
త్రిప్పదు మదిలోన దీకొన్న ప్రేమ-చెప్పదెవ్వరితోడఁ జెప్పవోకాని"

(పు. 11)

ఈ పట్టున పోతన వర్ణించిన రుక్మిణీ విరహావస్థ స్ఫురణకు వచ్చుచున్నది—.

*చక్రవాళ మంజరి* :— కర్త: తాళ్లపాక పెదతిరుమలాచార్యుఁడు- అన్నమాచార్యులవారి పుత్రుఁడు. ఇందలి యితివృత్తము కూడ శృంగారమంజరి యందలి యితివృత్తిమే. దానివలె నిదియు మంజరీఛందముననే రచితమైనది. అన్నిట నీ రెండుకృతులు నొక్క తీరు కలవేకాని యీకృతి పేరునుబట్టి తెలియనగుచున్నట్లు సాధారణ మంజరికాక 'చక్రవాళ మంజరి'. ఇందలి మంజరీ ఛందమున నధికముగా 'చక్రవాళ'మను రచనారీతి జోడింపఁబడినది. అన్నమాచార్యుని శృంగారమంజరి విపులమగు రచన. కాని పెదతిరుమలాచార్యుని రచన సంగ్రహము. ఇట్లు సంగ్రహమగుటకు చక్రవాళ మను రచనానిబంధన మందుండుటయే హేతువు కావచ్చును. ఈ రచన శృంగారమంజరీ రచనకన్న హృద్యము. ఆలంకారికము. రసమయము. చమత్కారజనకము. కవీశ్వరసామర్థ్యద్యోతకము. చక్రవాళరచనా రీతిని ప్రాచీనలాక్షణికు లిట్లు నిర్వచించినారు.

"పదము స్త్వం సమాదాయ యమకస్థితి భూషితః
ఆవృత్యా గీయతే యస్తు చక్రవాళస్స ఉచ్యతే
గద్యే వా పద్యబంధే వా పుణ్యనామాంతశోభితః
నామాంతే స్వరసంయుక్తో గీయతే చక్రవాళకః"

లక్ష్యమ్.

శశాంక శకలంకలంకితకుముదం ముదం న వహతేవహతే హిమకరే
కరే తదసమం సమం వివసితం సితం విజయతే యతే తవయశః

(చూ అన్నమా. చరిత్ర పీఠిక పుట. 78- అభిలషితార్థ చింతామణి, సంగీత చూడామణుల నుండి యుద్ధృతము).

ఇందు ముక్తపద గ్రస్తాలంకారము నందువలె పూర్వపదాంతము నందలి యక్కరములే ఉత్తరపదారంభముననుండి యావృత్తి సాగు చుండుట ప్రధానలక్షణము. ఇందలి పదాంతలక్షణమును పాదాంత లక్షణముగాఁ జేసికొని యేకపాదమాత్రాకమగు నీమంజరీ రచనను కవి నిర్వహించినాఁడు. ఇందు ప్రతిపదాంతమునందలి యక్కరములు పునరావృత్తియగుచుండి చమత్కారమును గొలిపి గీతాలాపనమున శ్రుతిమీటువలె శ్రవణసుఖముగనుండును. ఈ యుదాహరణలు చూడనగును.

"శ్రీలలనాధారుఁ జిన్మయాకారు-కారుణ్యావర్తి వేంకటగిరిమూర్తి
మూర్తిత్రయశరీరు మునిజనోద్ధారు-ధారుణీపంగు నుత్తమ శోభితాంగు
నంగుష్ఠ భవసింధు యదులోకబంధు-బంధురజలభూషు భక్తవిచారుఁ
జారు చక్రాబ్జాంకు సమరనిశ్శంకు-శంకుకర్ణాధ్యక్షు జలజపత్రాక్షు."

ఈ రీతిని కావ్యారంభమున చక్రవాళరచన సాగినది· ఇఁక కథావస్తువున తు చ తప్పకుండ శృంగారమంజరీ రచననే పెద తిరుమలాచార్యుఁ డనుసరించినాఁడు. వసంత వనవిహారాది వర్ణన లందున్నట్లే యిందున్నవి. దోహదక్రియల నీకవియిట్లు వర్ణించినాఁడు.

"అననాంబుజము లవ్వాముల్ వెలయ - వెలయయడుగని విరుల్
వెసగోసిఁ బెరసి
రసికతతో నొక్కరమణి గోరంట-గోరఁటఁ గౌగిటఁ గూరిచెఁ బొగడఁ
బొగడపై నుమిసెను బుక్కిట మదిర-మదిరాక్షి యొక్క రామాతిలకంబు
తిలకంబుఁజూచె నొద్దిక నొక కాంత-కాంతాళమున నశోకముఁ దన్నె నొకతె
యొకతెలుఁగునఁ గరఁబొనర రసాలసాలంబుపైఁ జాఁచె సకియ లీరితి"

(తాళ్లపాకవారిలఘుకృతులు - పు. 17)

ఇట్టి రచన సమర్థుఁడగు కవికిఁదక్క నన్యులకు దుస్సాధ్యము. కవితా విషయమున గవి యిన్నికట్టుబాటులు గావించుకొనియు కథావస్తువును సంగ్రహముగను, సమగ్రముగను, బరిష్కరించి స్థాయీభావమగురతిని క్రమమున విభావానుభావాదులచేత పరిపోషించి రసమయముగనే నిర్వహించినాఁడు. గ్రంథాంతమున,

"వాసవార్చితుఁడు శ్రీవామాక్షితోఁడఁ దోడఁ బ్రవేశించె దొల్లింటినగరు
గరువంపు సంభ్రమగతులనీ సరవి-రవికోటి తేజో విరాజితు పేరఁ
బేరగు జవరాలి పెనిమిటిపేరఁ-బేరఁగీర్తనకెక్క బెరసి నందవర
వరముఖ్యుఁడై భరద్వాజసంతాన-తానకుండన నెన్నఁదగుఁ దాళ్లపాక
పాకశాసనుఁడు వైభవములనొనరు-నరులలోఁ బూజ్యుఁ డన్నయవర్యతనయ
నయశాలి తిమ్మయ నవచతురతల-దలఁచి మంజరిచెప్పఁ దణ్ణులింపార
నారవిశారాబ్జమై యొప్పుజగతి-గతియైన విష్ణుమంగళమహాశ్రీల"

(తాళ్లపాకవారి లఘుకృతులు - పు. 20)

అని రచనలో 'నవచతురతల' ప్రదర్శించి తుదకు తుదిపదమున గూడ చక్రవాళ రచనారీతిని విడువక నిర్వహించెను. 'మంగళమహాశ్రీల' 'శ్రీలలనాధారు' అనునాద్యంతములనుసైతము నా ముక్తపద గ్రస్తముగ తీర్చి చమత్కరించెను.[1] ఇందు చక్రవాళ రచనారీతి

---

1. పూర్వ కవులు పలుతావుల ముక్తపదగ్రస్తాలంకారము గల పద్యములెన్నో రచించియుండిరి. వానియందు చాలవఱకు నలంకారము పద్యాంతమువఱకే సాగి యాగుచుండుటను గుర్తింపవనగును కాని దానికి భిన్నముగ రాయలకాలపుఁ గవియగు నందితిమ్మనగారు పారిజాతాపహరణమున నొకచోట పద్యాంతమునందును ముక్తపద గ్రస్తాలంకారము చెల్లునట్లు రచించి చమత్కరించిరి.

"దయమానాక్షివిలోక లోక హితకృత్ప్రారంభ రంభా కుచ
ద్వయ దుర్గాధిపతి ద్విషత్పతిత గాథాన్యక్తదోస్సార సా
ర యశస్సాంద్రదిశాంత శాంత హృదయారణ్యాన్నయాచార చా
రయుతోపాయ విచారచారణ గణ ప్రస్తూయమానోదయా."

(చూ. పారిజాతాపహరణము)

ఇది చక్రవాళ రచనా రీతిని సూచించును.

యుండుటయేకాక- కావ్యాది శ్రీకారముతోడను-కావ్యాంతము 'మంగళమహాశ్రీ'తోడను నుండవలయునను సంప్రదాయముకూడ పోషింపఁబడినది.

పెదతిరుమలాచార్యుఁడు తండ్రిగారువ్రాసిన 'శృంగార మంజరి' విషయమునే నే చక్రవాళ రచనారీతిని జొప్పించి 'నవచతురత'తో మఱల తెలుగ వ్రాయుటలోఁగల పరమార్థమేమో తెలియవచ్చుట లేదు. బహుశః ఆ పెండ్లి తిరునాళ్ళు ప్రతియేట జరుగుచుండిన కారణమున ప్రాఁతపాటనే పాడించుటకన్న క్రొత్త వెలయించుట తగునని దలచి యేదేని యొకవిశేషసమయమున దీనిని రచించెనేమో! ఏమైనను బహుళసంఖ్యలో రచితములైన పెదతిరుమలాచార్యుని కృతులలో నిదియు నొక లఘుకృతి.

సుభద్రా కళ్యాణము (మంజరి) : కర్త్రి తాళ్ళపాక తిమ్మక్క. అన్నమాచార్యుని ప్రథమ కళత్రము. నరసింగన్నకు తల్లి. సంగీత సాహిత్యచతుర. ఈమె కృతులలో నీ సుభద్రాకళ్యాణ మొక్కటే నేఁడు మనకు లభ్యమగుచున్నది. ఆంధ్ర కవితాప్రపంచమున గైత లల్లి కావ్యముల వెలయించిన కవయిత్రులలోఁ దెలియవచ్చినంత వఱకుఁ గాలమును బట్టి యీ తిమ్మక్కయే తొలితెలుఁగు కవయిత్రియని చెప్పనగును. ఈమె తరువాతి వారే మొల్లయు, ముద్దుపళనియు, తరిగొండ వేంకమాంబ ప్రభృతులును. అట్లగుట నీ తొలితెలుఁగు కవయిత్రి మెట్టినయింటివారగు తాళ్ళపాకవారి కవితాప్రశస్తికొక క్రొత్త వెలుఁగు కిరణమునే సంతరించిపెట్టిన దనవచ్చును. తిమ్మక్క రచించిన యీకృతి ద్విపదవికారమనఁదగిన 'మంజరి'గేయ రచన. స్త్రీ బాలపామరాదులు కంఠపాఠముగా నేర్వఁదగినది.పాడఁదగినది. పూర్వమట్లేసాగినది.[1] దీని వ్రాతప్రతిలిపి పాటపాడెడుతీరున తీగెసాగిన దీర్ఘాక్షరములతోనున్నది. గ్రంథాంతమునఁ గవయిత్రియే.

1. నేఁటికిని ఈ గేయకృతిని కొందఱు నోటిపాటగాఁ బాడుట గలదని పెద్దల వలన వింటిని.

"అవనిలో తాళ్లపాకాన్నయ్యగారి
తరుణి తిమ్మక్క చెప్పె - దాను సుభద్ర
కళ్యాణమను పాట - కడుమంచి తేట
పలుకుల ; నీపాట పాడిన విన్న
శ్రీహరి వారికి - చేరువై యుండు" (పు. 58)

అని యీ గేయకృతిని గూర్చిచెప్పుకొన్నది.[1] ఇదియును పెండ్లిపాటయే. తాళ్లపాకకవులు పెండ్లి విషయముగల పాటలకు మంజరీ ఛందమునే వాడియుండిరి.

---

1. ఈ లఘుకృతిని శ్రీ కాళహస్తి రాజాగారి యాస్థానినుండి తెచ్చిన తాళపత్ర గ్రంథ సంచయమునుండి వెలికిఁదీసి తి. తి. దేవస్థానము వారి పక్షమున శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించి ప్రకటించి వెలుఁగునకుఁ దెచ్చినారు. అం దీకావ్యాంతమునందలి పంక్తులిట్లేయుండి యిది అన్నమాచార్యుని తరుణియగు తాళ్లపాక తిమ్మక్క రచనగా తెలియఁదగి విస్పష్టముగనున్నది. అందు సందేహములేదు.

ఈ రచనమే పూర్వమెన్నడో గుజిలీ కాగితములో ముద్రితమయిన ప్రతియొకటి భ్రష్టరచనా రూపమున కాననగుచున్నది. అందిది యెవరో "తిమ్మప్ప" యను వ్యక్తి రచించినట్లున్నది. రచనయును చాల చెడియున్నది. ఆ అచ్చుప్రతి కాధారమగు తాళపత్ర ప్రతియేదో తెలియరాదు. కాని దీనికి నేఁటికి లభ్యమగు తాళపత్ర ప్రతియొక్కటే యున్నది. అదియే ఇప్పటి ముద్రిత ప్రతి కాధారమయి కాళహస్తినుండి తిరుపతికిఁ గొని తేఁబడినది. ఈ ప్రతియందలి పాట స్త్రీ పామరాదుల నోటఁబడి చాల రూపుచెడియున్నది. కాని శక్యమయిన సంస్కారములు జరిపి శ్రీ శాస్త్రిగారు దానిని ప్రకటించిరి ఏది యెట్లున్నను ఇది తిమ్మప్ప రచనకాక అన్నమాచార్యుని తరుణియగు తిమ్మక్క రచనయని యెఱుఁగుటకు మాత్రము తగినంత సాక్ష్యమిచ్చుచున్నది.

ఆగుజిలీ ప్రతియందలి 'తిమ్మప్ప' ప్రసక్తి ప్రామాదికమని తలఁతును. 'తిమ్మక్క' విషయమే 'తిమ్మప్ప' విషయముగా పొరపాటున ముద్రితమై యుండునని పై ప్రతినిబట్టి తెలియుచున్నది.

ఈ కృతియందలి యితివృత్తము సుభద్రార్జునుల పరిణయము. ఇదియెకరికంకితమో తెలియరాదు. కృత్యాదికానరాదు. గ్రంథారంభమే కథారంభముతోఁగలదు. ద్రౌపదీపరిణయానంతరము పంచపాండవులు ఇంద్రప్రస్థముననుండుటయు-నొకతూరి యర్జునుఁడు ద్రౌపది యుండఁగా ధర్మజుని శయ్యాగృహమును ప్రవేశించిన తప్పిదమునకు నారదవచనానుసారము తీర్థయాత్రలకేగుటయు, నులూచిని, చిత్రాంగదను వివాహమాడుటయు, బలరామాదులు రైవతకాద్రినున్నతరి కుహనాయతిరూపమున సుభద్రను శ్రీకృష్ణుననుమతంబున వివాహమాడుటయు నాదిగాఁగల భారతకథావిషయమే యిందలి యితివృత్తము. ఈ పాట నన్నయభారతకథారచనను నధికముగా ననువర్తించుచున్నది. కాని యిందు ప్రబంధధోరణిని కథాసంవిధానమున గొంతయధిక చమత్కారమున్నది.

ద్వారకానగరమున చాతుర్మాస్య వ్రతమును బూనిన కుహనామునికి సుభద్ర పరిచర్యసేయుసందర్భమున నామె పొలుపైన రత్నాల బొమ్మరింటిలో-పన్నిరుగురుగు లచ్చంపుదంతాన నమరు బొమ్మలును గూర్చుకొని, వానికిఁ జీనిప్రాతలును, చంద్రకావులును గట్టి వినోదించుచుండఁగా కవ్వడి యటకేగుదెంచి తానె పురోహితుఁడై బొమ్మపెండ్లి జరిపించి భావగర్భితముగా మర్మములుపలికి సరసమాడును. చెలియ లక్షణములుచెప్పెదనని యామె చేయిపట్టి నర్మగర్భముగ శృంగార భాషణము గావించును. ఆ చేష్టితములకు నివ్వెరపడి సుభద్ర శ్రీకృష్ణునితోఁ ఎక్కడి యతివరుం డితఁడు వోయన్న చూడ సంయమిగాని చూఱకాఁడితఁడు' అని యభియోగముదెచ్చును. తాను భిక్షమిడఁగా యతిపొత్తున భుజియింప పొలఁతిని రమ్మనెనట! ఈ వృత్తాంతమును విని శ్రీకృష్ణుఁడు చెల్లెలిని బుజ్జగించును. యతినిజూచి 'ఇచ్చట చెప్పిన యింతిసుభద్ర యచ్చట రాముతో నలిగిచెప్పినను యీ ద్వారకాపురి యిందుండబోదు-ఏమి యీ తొందరపనులని గేలిచేసి, మందలించివచ్చినట్లుగాను, ఇఁకపై నాతఁడట్టిపనులు సేయఁడనియును, శ్రీకృష్ణుఁడు చెల్లెలినోదార్చును. ఈ వివరములు నన్నయగారి భారతానువాదమున లేనివి. ఈ ఘట్టమున శ్రీకృష్ణుఁడు ప్రదర్శించిన నేర్పును, యతిరూప

మననున్న అర్జునునిపై సుభద్రలోఁ గల్గించిన మార్పును, గవయిత్రి తీర్చినతీర్పును ప్రశంసింపఁదగినవి.

"అమ్మరా ముద్దులగుమ్మరా వేగ కొమ్మరా నవకంపుబొమ్మ రావమ్మ
ముత్యాలసరమరాముద్దరాలా రా చిత్తజు బాణమా చెలియ రావమ్మ!"

అని యీ తీరున శ్రీకృష్ణుఁడు చెలియలిని బుజ్జగించినవైఖరి స్త్రీ హృదయము నెఱిగి చేసినట్లుగానున్నది. ఇట్లు ఓదార్చినవెనుక యతినిగూర్చి,

'ఏమని వర్ణింతు నితనిమాహాత్మ్యమేమని వర్ణింతు నితని పౌరుషము
ప్రమథగణముతోను పార్వతీశ్వరుఁడు సవతాడవచ్చితా చాలంగనొచ్చె
అకాలకంఠుఁడు నటులోడిపోయె నీతని గెలువఁగా నెవ్వరివశము"

అని వర్ణించి కృష్ణుఁడు ఆమెలో నభిలాష మొలకెత్తునట్లుగా చేయును. ఇట్లు పౌరుషాదికమును వివరించినమీఁదట "సుదతియీాతని కూడ సురపతిసుతుఁడె" అనియాతని యందచందములనుగూడ చెల్లెలామోదించునట్లుగా వర్ణించి, వ్రతకార్యము ముగియువఱకును నామె యాతనిని పూజించుట తగునని బోధించి పంపును. ఈ ఘట్టమును తిమ్మక్క రమణీయముగ పోషించినది. యతీశ్వరుని వర్ణించినపట్టులం దాతఁడు అర్జునుఁడనిచెప్పక చెప్పించినది. రతిభావమున కుద్దీప్తిని గల్పించినది. విజయుని రూపవివేకసంపదలు పూర్వము వినియుండిన కారణమున సుభద్ర యతీశ్వరునితోఁబోల్చుకొని అన్నగారిమాటలను కూడ ననుసంధించుకొని యాతఁడే క్రీడియని నిర్ణయమునకువచ్చును. తదాది రతిభావమున కాలంబనమగు నాముద్దులకొమ్మ సుభద్ర యందముగా నలంకరించుకొని యనురాగముతో 'చిత్తౌన్నత్యరసలత చిగురించ గాను' యతిని శుశ్రూషించును. 'కమలాక్షుపెంచిన కడుముద్దుచిలుక' యొకటి ఆ యువతీయువకుల మనములు కలియునట్లు రాయబారము సేయును.[1] ఈ పట్టున కవయిత్రి ముగ్ధానాయికా చిత్రణమును మనో

1. నన్నయగారి భారతానువాదమున నీ యంశము లేవియునులేవు. అందు సుభద్ర స్వయముగ తానే మున్నువిన్న విజయునివలెనున్న యతిని గూర్చి సత్యము నెఱుగుటకై ఇంద్రప్రస్థమున గల తన యత్తను గూర్చియు,

క్షిముగా గావించినది. 'కామతంత్రము రహస్యములు పుష్పించిన' సుభద్ర యలంకరించుకొని యభిలాషతో యతికడకేగిన వర్ణనము శృంగారమయమై ఆడువారి కలంకారముల పైఁగల యభిమానమును వెల్లడించునదియై రతికుద్దీపన విభావనమైయున్నది. తుదకు సుభద్ర తన మేనయత్త కొడుకులనుగూర్చి ప్రశ్నించి యతీశ్వరుని చిత్తమెఱుఁగఁ గోరిన సందర్భమున నర్జునుని ప్రస్తావించి యాతఁడు

'కోమలి యిద్దఱము గోకర్ణమందుకూడి యే యుంటిమి కొన్నాళ్లుంచట-అతనికి నాకును అరమర లేదు-అతనికి నా కైక్యమతివరోవిన వె-నీ రూపు నీ రేఖ నీ చక్క-
దనము నౌమాఱుదలపోసి వివశుఁడై యుండు-నిదురేయి పగలు కంటికి కూర్కు లేదు."

అని తనయునికిని పట్టిక చమత్కరించిన పట్టునుగూడ కవయిత్రి కథాకథనమున నౌత్సుక్యమును బోషించినది. సుభద్ర అర్జునుని మన సార ప్రేమించినదని యెరిగిన తరువాతగాని యతీశ్వరుఁడు తనయుని కిని గూర్చి బయటపెట్టడు. ఇట్లుగా కథానిర్వాహణమున తిమ్మక్క చాలమెలకువ చూపించి తరువాతి కాలపుఁగవులకు మార్గదర్శకమగు రచన గావించినది. ముఖ్యముగా నిందలి వర్ణనములు సుందరములు. కస్తూరినలుఁగిడి గొజ్జగినీట తానమాడి ఉమ్మెత్తపువువలె నుదికినమడత గట్టి-పయ్యెదకొంగు జాఱవిడచి-కురులుదువ్వి-కొప్పించుక జాఱము డిచి, విరులుతుఱిమి, గుమ్మడి గింజనామమ్ముతీర్చి, చెవులతాటంకాలు చేర్చి, పుంజాలదండదాపున సేవళముఱంతిల్లు బన్నసరము గ్రీడింప- నన్నిసొమ్ములకు వన్నెవెట్టునట్టు 'మూఁడువేల్ వెలసేయు ముక్కఱ' బెట్టి వెడలిన సుభద్రయొక్క అలంకారరచన స్త్రీలకభిమానపాత్రము. 'ముక్కఱ' పై నాఁటి యాడువారికిఁ గలమక్కువ నిందు తిమ్మక్క వివరించినది. [1] అర్జునుని వర్ణనమిది.

---

కుంతీ పుత్రులను గూర్చియుఁ దెలియఁగోరి ప్రశ్నించుటయు నందులకు సమాధానముగా యతి నేనచూవె యయ్యర్జునుండనని వివరించుటయు గలదు.

1. పాండురంగ మాహాత్మ్యమున నిగమశర్మ అక్క ముక్కఱపోయి నందులకు విలపించినట్లు రామకృష్ణుఁడు వర్ణించినది కూడ నీ విషయమును నిరూపించుటకే.

"ఎగు భుజమ్ములవాఁడు మృగరాజునడుము
నడచి పుచ్చుకొను నెన్నడుము గలవాఁడు
గరగరనివాఁడు చక్కనివాఁడు నతఁడు
గొప్ప కన్నులవాఁడు కోదండగుణకి
ణాంకంబులౌ బాహులమరినవాఁడు
పెన్నున మచ్చగల విభవంబువాఁడు
బవిరిగడ్డమువాఁడు పన్నిదంబిడిన
వెన్నుబగడసాల పెసనాడవచ్చు
చిగురొత్తు చంద్రిక చెలఁగు పాదములు.

(సుభద్రా - పుట-84)

కొన్ని కథాంశములతోఁబాటు తిమ్మక్క రచనము నుండి యీ వర్ణనముఁగూడ చేమకూర వేంకటకవి తన విజయవిలాసమున పొందుపఱచుకొనినాఁడు.[1]

సౌభాగ్యమును సౌకుమార్యము నుట్టిపడునట్లుగా తొలితెలుఁగు కవయిత్రి రమణీయముగా పోషించిన విరిమల్లెతోట యీ సుభద్రా కళ్యాణవుఁబాట !

---

1. చూ. విజయ విలాసము. 2-164 పద్యము.

సీ॥ "ఎగు బుజంబులవాఁడు మృగరాజ మధ్యంబు
బిడికి పుచ్చుకొను నెన్నడుమువాఁడు
గొప్ప కన్నులవాఁడు కోదండగుణకిణాం
కము లైన ముంజేతు లమరువాఁడు
బవిరిగడ్డమువాఁడు పన్నిదంబిడిరాగ
వచ్చు నందపు వెన్ను మచ్చవాఁడు
గరగరనివాఁడు నవ్వు మొగంబువాఁడు
చూడఁగలవాఁడు మేలైన సొబగువాఁడు
వావి మేనత్తకొడుకు కావలయునాకు
నర్జునుండు పరాక్రమోపార్జునుండు"

## శతకములు

తెనుఁగున వెలసిన పద్యమయములగు కవితా విభేదములలో శతకవి భాగమొకటి. ఆలంకారికుఁడగు విన్నకోట పెద్దన్న శతకములను ముక్తకాదిస్ఫుటతరచాటుప్రబంధములలోఁ జేర్చి 'శతకమననొప్పు మఱి పద్యశతకముకూడ' (4-9-కావ్యా.చూడా)అని వివరించినాఁడు. ఇటఁ జాటుప్రబంధమన విడివిడి పద్యముల రమణీయమగు కూర్పుఅని మనము సంభావించుకొనవచ్చును. అట్టిచాటు ప్రబంధములలో ముక్తక మేకపద్యము. శతకమే శతశతాధిక సంఖ్యలో నొప్పారు విస్తృత ప్రబంధము. ఇది పద్యసంఖ్యలో శతకమునకు మించినను శతకమనియే పిలువఁబడును.

'అష్టోత్తర శతపద్యము లష్టోత్తర శతకమనఁగ నశరుఁ గవీంద్రుం
డిష్టమగు సంఖ్యఁజెప్పిన దుష్టముగాదదియుఁ గర్ణ తుష్టినచేయున్."

అని వివరించినాఁడు.

తెనుఁగున ప్రాయికముగా 12, 18 శతాబ్దులందే యారంభమయి జనబాహుళ్యమున రూఢమయి పిదప విశేషప్రచారముగాంచిన యీశతకవాఙ్మయ ప్రక్రియయొక్క పుట్టుపూర్వోత్తరములు మిక్కిలి ప్రాచీనములనియు, దానియునికి వేదపురాణములందే బీజరూపమున గానవచ్చుననియు నదియే పిదప ప్రాకృతవాఙ్మయమున బిందువై విస్తరించి తరువాతి సంస్కృత కావ్యకవుల ప్రతిభాక్షేత్రమున భావగీతముల (lyrics) వలె పుష్టిని జేకూర్చుకొని శతకమనుపేర నొక లక్షణమగు ప్రక్రియగా తెలుఁగున వెలసినదనియు శతకవాఙ్మయ చరిత్రకారులు (శ్రీ) వంగూరి సుబ్బారావుగారు విశదీకరించిరి. శతకమునందలి శత, అష్టోత్తరశత, సహస్ర, అష్టోత్తరసహస్ర సంఖ్యానియమమునకును, స్తుతిప్రాధాన్యమునకును, మంత్రప్రధానములగు వేదములును గొంతవఱకు తాంత్రికవాఙ్మయమును మూలకారణములని వారు సోదాహరణముగ వివరించిరి [1] ఇక్లేపదేసి పద్యములవిభాగముతో

1. వేదములో 'శతయాతుఁ'డను-నూఱు మంత్రశక్తులు గల ఋషి యుండుటయు, యజుర్వేదమునందలి భాగమగు 'శతరుద్రీయము'నకు శతకమను నామముండుటయు వివరించి, 'యీ శతసంఖ్యావిశేషమగు నిర్ణయము

దశదశకములుగా శతకమును రచించు మర్యాద కూడ 'అవదాన శతకము' మొదలగు ప్రాకృతకావ్యములనుండి గ్రహించియుండవచ్చునని వారు పేర్కొనిరి. తెలుఁగునందలి కొన్ని శతకములందీ దశకవిభాగముండుట పై భావమునకు ప్రబలమగు హేతువుగా వారు చూపిరి. ఈ భావములు సమంజసములనియే తలఁపవచ్చును. ఇట్లు స్తుతి ప్రధానములై సంఖ్యానియమమునుగలిగి శతకమనుపేర సంస్కృత ప్రాకృతములందు వ్యాప్తినిగాంచిన కావ్యప్రక్రియయే పిదప తెనుఁగునకూడ వెలసి మఱి కొన్ని విశిష్టలక్షణములతో నొప్పారి సరిక్రొత్తరచనమును కూర్చుకొన్నది. పరిణామక్రమమున రానురాను తెలుఁగుశతకములయందు పూర్వోదాహృత లక్షణములతోఁబాటు మకుటనియమము, వృత్తనియమము నను మరిరెండు లక్షణములుకూడ ననివార్యములై పోయినవి ఈయంశములే తెలుఁగు శతకములకు ప్రధానలక్షణములై వాని వైశిష్ట్యము నెత్తిచూపునవిగా రూపొందినవి. కాలక్రమమున స్తుతితోపాటు లోకమునందలి యవసరములనుబట్టియు, నభిరుచులను బట్టియు శతకములందు నీతి శృంగార వైరాగ్యములను విషయములు కూడ ప్రవేశము కల్పించుకొనినవి. భక్తి నీతి శృంగార వైరాగ్య శతకములు తెలుఁగున కోకొల్లలుగా వెలసినవి. శతకములందలి పద్యముల పరిమిత సంఖ్యనుబట్టియు, నా పరిమితసంఖ్యలోఁగల పద్యములకైనను కథాబంధములేక అవి విడివిడి చాటు రచనలుగా నుండుటను బట్టియు,వృత్తమకుటనియమములతో పఠనధారణాయోగ్యములగుటను బట్టియు నీశతకరచనలకు పఠితృలోకమున బ్రచార మధికమైనది. ప్రాయికముగా తెలుఁగున వెలసినన్ని శతకములు మఱియే యితర భాషయందును వెలసియుండలేదనుటతిశయోక్తికాదు. తెలుఁగువారి తెలివితేటలు వారి శతకవాఙ్మయము మూలముగనే వికాసమునందినవి. వారి తీరుతెన్నులు ఆలోచనలు శతకవాఙ్మయమునందే అధికముగా

---

శక్త్యావేశముచేతను జేసిన స్తోత్రములయిన భక్తి శతకములయందుఁ గూడ వ్యాపించిన'దని శ్రీ సుబ్బారావుగారు శతకవాఙ్మయచరిత్రము (పు. 9-10) నందు వివరించిరి.

వెల్లడియయినవి. తెలుఁగువారు స్వతంత్రముగా తీర్చిదిద్దుకొన్న బహు్ళవాఙ్మయ ప్రక్రియలలో శతకరచనాప్రక్రియ విశిష్టమైనస్థానమునే యాక్రమించుకొనినది—

తెలుఁగున దీని యారంభ వికాసములించుక పరిశీలింపఁదగును. ఆంధ్రకావ్యపథమునుదీర్చిన నన్నయభట్టారకుని భారతాంధ్రీకరణమున (ఉదంకోపాఖ్యానము. ఆది—104-107) నుదంకుఁడు నాగపతులను స్తుతించు ఘట్టమున "అనంతుఁడు మాకుఁబ్రసన్నుఁడయ్యెడున్" అను మకుటముతోఁగల చంపకోత్పలముల యొరవడిలోనే తెలుఁగు శతక రచన వృత్తమకుటనియమములను గొంతవఱకుఁగూర్చుకొని యారంభమైనదనవచ్చును అటుపై పండ్రెండవ శతాబ్ది నడిమిభాగమునకుఁ గాని శతకరచన విడిగా నొక కావ్యప్రక్రియగా రూపొందుటకారంభము కాలేదు. పండితత్రయమున సుప్రసిద్ధుఁడగు మల్లికార్జునపండితారాధ్యుఁడే శివపారమ్యమును బ్రతిపాదించుటకై 'శివతత్త్వసార' మను నొక గ్రంథమును రచించెను. దానినే పాల్కురికి సోమనాథుఁడు పిదప 'శతకంబు శివతత్త్వసారము' (పండితా-పర్వత-369)అని శతకముగా పేర్కొనినాఁడు. ఇందు మనకు లభ్యములు దాదాపు 489 పద్యములు. పద్యములన్నియును కందములే. పెక్కు పద్యములలో శివునకుఁబర్యాయపదములగు 'సర్వానందా', 'రుద్రా', 'మహేశా', 'అజా', 'హరా' మున్నగు సంబోధనలు పద్యమధ్యమునను, పద్యాంతములందునుగూడ వాడియున్నాఁడు. ఇందలి పద్యములు చాల వఱకుఁగథానుపూర్విలేని విడి విడి రచనలే. గ్రంథమునందలి ప్రణాళికనుబట్టియు శ్రీకారములతో నారంభించిన పద్యములసంఖ్యనుబట్టియుఁ బరిశీలింపఁగా నీతఁడే 'శివతత్త్వసారము'ను నూఱేసి నూఱేసి పద్యముల నొకగణముగా మొత్తము వేయింటివఱకును వ్రాసియుండు నని తోపక మానదు. అందుకే శతకవాఙ్మయచరిత్రకారులు జైనుల ప్రాకృత శతకరచనాసంప్రదాయముననుసరించి 'సహస్ర' మను లెక్క చొప్పున శివసహస్రముగనే దానిని కవి వ్రాసియుండునని వ్రాసియున్నారు. ఏమైనను అసంపూర్ణముగ కానవచ్చిన యీ గ్రంథమునందే ఆంధ్ర శతకవాఙ్మయారంభస్థితిని మనము గుర్తింపవచ్చును. పండితా

రాధ్యుఁ డిందు పద్యనియమమును పాటించుటతో వృత్తనియమము తరువాతి కాలమున శతకమునకొక అనివార్య లక్షణమైనది మకుట నియమము నిందు కవి పాటింపకున్నను నన్నయగారి రచనలోని మకుట సౌందర్యము నెఱిగిన తెలుఁగు కవులు ఇందలి పరమేశ్వర పర్యాయపదసూచితములగు సంబుద్ధులను గుర్తించిన పిమ్మటనే సంబుద్ధి మకుటములతో శతకముల రచించుట కారంభించియుందురన వచ్చును. అందువలన శతకములందలి సంబుద్ధిమకుట నియమమునకీ గ్రంథము కొంత ప్రాతిపదికను గల్పించినదనియే చెప్పవలెను. అంతే కాదు. మన శతకములందలి జ్ఞానవైరాగ్య నీతిభక్తి శృంగారములను విభాగములలోఁ జెక్కింటి కీగ్రంథమునందలి పద్యములే యుద్బోధక ములై యుండనోపును. మచ్చునకు భక్తి శృంగార శతకములందు ప్రముఖముగా కానవచ్చు నాయికానాయక భావసంపద కిందలి

"క॥ దురితహరమనియు శుభములు
దొరకొనుననియును దలంచి దురితారిభవ
చ్చరణాబ్జభక్తిలలనా
పరవశభావమున నిన్నుఁ బ్రణుతింతు శివా!"

అను పద్యమువంటి పద్యములే పోషకకారణములై యుండునన వచ్చును. ఇట్లు తెలుఁగున శతకకావ్య పరిష్కృతికిని, అందలి వైవిధ్య మునకును, వికాసమునకును జాలవఱకు తొలి తెలుఁగు శతకకావ్యమ నందగు శివతత్త్వసారమే మూలమని చెప్పవచ్చును—

అటుపై పదమూఁడవ శతాబ్ద్యంతమునకు పాల్కురికి సోమనా థుని 'వృషాధిప శతకము' మున్నగు గ్రంథములలో తెలుఁగు శతక రచన పరిపూర్ణ వికాసమునంది పండితపామరజనసేవ్యమై బహుజనా దరపాత్రమైనది. సంఖ్యామకుటవృత్త నియమాది విషయములతో సర్వలక్షణ లక్షితమైనది. ఆ పిదపనే పలువురు కవులు పలు విషయ ముల ప్రతిపాదించుచు పలు భాషలలో, పలు వృత్తములలో, పలు మకుటములతో పలువిధములగు శతకములను రచించినారు. ఈదృష్టితో సర్వలక్షణ లక్షితమగు శతకకావ్య నిర్మాణమునకు పాల్కురికి సోమ

నాథుఁడే పితామహుఁడనవలెను. అతని యీనవీన సృష్టికి మతమే పునాది. కావున మతము కారణముగనే తెలుఁగున నీశతకవాఙ్మయ మారంభమైనది. శైవవైష్ణవశతకము లనేకము లుత్పత్తిల్లినవి. ఇట్టి భక్తిశృంగార శతకములతోఁబాటే పిదప, రూఢమగు నీ కావ్యప్రక్రియలో నీతిహాస్యశతకములుకూడ నెన్నో బయల్వెడలినవి.[1]

ఇట్లు పదమూఁడు పదునాలుఁగు శతాబ్దులనుండి యాంధ్ర సాహిత్యప్రపంచమున సుస్థిరమగు స్థానము నాక్రమించుకొనిన శతక రచనా ప్రక్రియనే పరిగ్రహించి తరువాత తాళ్లపాక కవీశ్వరులుకూడ మతబోధకును హితబోధకును శతకముల నెన్నిటినో రచించిరి.

## తాళ్లపాకవారి శతకములు

శతకకావ్యప్రక్రియలప్రయోజనమును, పరమార్థమును చక్కఁగా నెఱిఁగిన తాళ్ళపాక కవీశ్వరులు సుందరములగు పలుశతకములను రచించి కృతకృత్యులైరి. అన్నమాచార్యుఁడు విశిష్టాద్వైతమత దృష్టితో నాధ్యాత్మికతావాసన వెల్లివిరియునట్లు పండ్రెండు శతకము లను రచించెను.[2] తత్పుత్రుఁడు పెద తిరుమలాచార్యుఁడు శృంగార వృత్త పద్యాల శతక మొకదానిని, నీతిసీసశతక మొకదానిని రెంటిని రచించెను. ఇదికాక శ్రీకృష్ణ శతకమనఁదగిన రేఫఱకార నిర్ణయమను లక్షణగ్రంథ మొకదానిని గూడ రచించెను. తత్పౌత్రుఁడు తిరు

---

1. ఈ శతక వాఙ్మయమునకుఁ గల ప్రచారమును బట్టియే స్తోత్రాదులు మాత్రమేకాదు. కవులు నిఘంటువులను సైతము శతకములుగనే రచించిరి. కస్తూరి రంగని సాంబనిఘంటువు ఇట్టి శతకమే.

మఱికొంద రీశతకములందు మఱికొన్ని వింతవిన్యాసములను జూపిరి. భాస్కరవేణుగోపాలాది శతకకర్తలు శతకంబులాది నకారాదిగ నియమ మేర్పఱచుకొని రచించిరి. సుమతి శతకకర్త పద్యముల యారంభమందు అక్షర క్రమమును పాటించెను.

2. "శతకముల్ పదిరెండు - సకలభాషలను
బతిలేనినానా ప్రబంధముల్ సేసి"
(చూ. అన్నమా. చరిత్ర. ద్విపద .పు. 46)

వేంగళప్ప శృంగారామరుశతకమును వ్యాఖ్యాసహితముగ తెలిఁగించెను. వీరి యీ శతకములలో భక్తియు, నీతియు, శృంగారము నుదాత్తమగు రీతిని ప్రపంచితములై యున్నవి.

*శ్రీవేంకటేశ్వర శతకము*[1] :— కర్త తాళ్లపాక అన్నమాచార్యుఁడు. ఈతఁడు 'శతకముల్ పదిరెండు' రచించినట్లు చిన్నన్న పేర్కొనెను. చిన్నన్నయే అన్నమాచార్యచరిత్రద్విపదలో 'అలిమేలుమంగకు నాళుమార్గముగాను-సలలితంబుగనొక్క శతకంబుచెప్పె' (పు. 18) నని యొక అలిమేల్మంగాంబికాశతకమును గూర్చియు 'వితతవృత్తంబుల వేంకటపతికి శతకంబు కుతుకంబు సమకూరఁజేసి' (పు.24) అని మఱియొక వృత్తవేంకట శతకమును గూర్చియు ప్రస్తావించెను. కథాసందర్భమునుబట్టి చిన్నన్న పేర్కొన్న యీ రెండు శతకములును వేర్వేరు రచనలనియే తలఁపవచ్చును. గ్రంథస్థసాత్యమిట్లేయున్నది.

| | |
|---|---|
| 1. 'అలమేలుమంగకు నాళుమార్గమున' చెప్పిన శతకము అన్నమాచార్యుని తొలి రచనము. | వేంకటేశ్వర శతకము మలిరచనము. |
| 2. ఏ ఛందమున వ్రాయఁబడినదో తెలియదు. | ఇది వృత్తపద్య శతకము. |

---

1. ఈ శతకమును గూర్చి శతకవాఙ్మయచరిత్రమున నిట్లు గలదు. "వేంకటేశ్వర శతకము శృంగారవృత్తపద్యశతక మను పేరఁ బరిషత్తులో నున్నది. (సంఖ్య 1996 చూడు) - ఈ శతకము తిరుపతిలోనున్న రాగిరేకులనుండి పరిషత్తువారు వ్రాయించి తెప్పించిరి." (పు. 187)

అన్నమాచార్య చరిత్ర పీఠికలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిట్లు వ్రాసిరి.

"అన్నమాచార్యుని వేంకటేశ్వరశతకమొకటి నేము ప్రకటించిన ప్రబంధరత్నావళిలో నుదాహృతమైనది. దేవస్థానపు రాగి రేకులలోఁ గానరాదు." (పు. 78)

| | |
|---|---|
| 3. ఇది అన్నమయ్య యెనిమిదియేఁడుల చిన్న వయసున - కొండనెక్కుచు మోకాళ్ల ముడుపువద్ద తనను సేద దేర్చిన మంగాంబికను స్తుతించిచెప్పిన శతకము. | ఇది అటుపిదప స్వామిని సందర్శించి యురమున జగదంబ నిడుకొన్న వేంకటేశ్వరుని శృంగారలీలలను విస్తరించు ప్రౌఢరచన. |

కావున నా రెండును వేర్వేరు శతకములే. వీనిలో శ్రీవేంకటేశ్వరశతక మొక్కటియే మనకిపుడు లభ్యమై ముద్రితస్థితిలోనున్నది. మంగాంబిక పేరఁ జెప్పిన శతకమును, దానితోఁబాటు మిగిలిన పది శతకములును, నన్నమాచార్యునివి నేఁడు మనకు దుర్లభములు. లభ్యమగుచున్న యీ 'వేంకటేశ్వర శతకము'నుబట్టి అన్నమాచార్యుని శతకకవిత మిక్కిలి ప్రౌఢమైనదని చెప్పవచ్చును. 'ప్రబంధ రత్నావళి' యనుపేర శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించిన ప్రాచీన పద్యసంకలన గ్రంథమున[1] తాళ్లపాక అన్నమార్యకృత తిరువేంకటేశ్వర శతకము నుండి యీ పద్యముద్ధరింపఁబడినది.

చం॥. జరిసెలు నూనెబూరెలును నౌఁగులుఁ జక్కెరమండెగల్ వడల్
బురుడలు పాలమండెగ లపూపము లయ్యలమేలుమంగనీ
కరుదుగ విందుపెట్టెఁ బరమాన్నశతంబుల సూపకోట్లతో
నిరతవినిర్మలాన్నముల నేతులనోనలు వేంకటేశ్వరా. (పు. 3)

1. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 1918 లో నీ 'ప్రబంధ రత్నావళి'ని సంధానించినారు. ఇందు ప్రాచీనుఁడగు పెదపాటి జగన్నాథ కవి సంకలనము గావించిన ప్రబంధ రత్నాకరము నందలివియు, మఱియెవరో కూర్చిన మఱియొక సంకలన గ్రంథము నందలివియుఁ బద్యములు పరిశోధకుల కనువు గొల్పురీతి నుద్ధరింపఁబడినవి. ఈ ప్రాచీన సంకలన గ్రంథము నుండియే మనకు పలువురు పూర్వ మహాకవులను గూర్చియు వారి వారి కావ్యములను గూర్చియు, నపూర్వములగు విషయములు తొల్దొల్త వెల్లడియైనవి. అట్టి వానిలో నీ తాళ్లపాక అన్నమయ్యగారి 'తిరువేంకటేశ్వర శతక' మొక్కటి—

ఈ పద్యము 'వేంకటేశ్వరా' యను పద్యాంతసంబోధనము గలిగి 'వేంకటేశ్వరశతక'మను పేర వావిళ్లవారిచే నిటీవల ప్రకటింపఁబడిన శతకమునగలదు. కావున పై సంకలనగ్రంథకర్త పేర్కొన్న 'తిరువేంకటేశ్వరశతక'మిదియే కాఁదగును. ఇందు శతకమర్యాదనను సరించి నూటపద్యములున్నవి. ఇది చంపకోత్పలములతోఁ గూడిన వృత్తశతకము. పద్యాంతములందు 'వేంకటేశ్వరా'యను సంబుద్ధి గలదు. గ్రంథాంతమున కడపద్యము అంకితాంకపద్యముగా నిట్లు గలదు.

ఉ. అమ్మకుఁ దాళ్లపాకఘనుఁ డన్నఁడు పద్యశతంబు సెప్పెఁగో
కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలుమంగకున్
నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మదమంది వర్ధిలుము జవ్వని లీలల వేంకటేశ్వరా!

అన్నమాచార్యుని శతకరచనలను గూర్చి చిన్నన్న యిట్లు వివరించెను- అన్నమయ్య 'యెనిమిదేడుల'[1]. పిన్నవయసున తొలిసారిగా తిరుమల కేగెను. మార్గమున మొదటియెక్కుడగు మోకాళ్లముడుపు కడ జగదంబయగు నలిమేల్మంగాంబ ప్రత్యక్షమై సేదదేర్పఁగా కృతజ్ఞతతో నామెపేర నొకశతకంబుసెప్పి యామె యాజ్ఞానుసారము తిరుమలకేగి యచటి దివ్యస్థలములను దర్శించి స్వామిని సేవించి పలు తీర్థములనాడెను. అట్లు కొమరధారను, ఆకాశగంగను, పాపవినాశమునను, పాండవతీర్థమునను "నవగావానము సేసి యాతేటనీట-ధవళంబుగా *మునుతాఁగట్టు చీరనుడికి యారగవైచి-యొకరాతి దండనది యెంత*

---

1. ఇట చిన్నన్న 'యెనిమిది యేడుల' పిన్న వయసున అన్నమయ్య తిరుమలకేగి స్వామిని దర్శించినట్లు చెప్పినను సంకీర్తన రచనారంభము పదునాఱవయేట జరిగినట్లు తాగిరేకులలో స్పష్టముగా నుండుటనుబట్టి శ్రీ ప్రభాకరశాస్త్రిగారు విమర్శించి దాని నుపనయనముచే ద్విజత్వము వచ్చిన దాదిగానని సమన్వయించుకొని యెనిమిదేండ్లవాఁడని, మాతృగర్భమునుండి పుట్టినదాది పదునాఱేండ్లవాడని సరిచూచుకోవలె'నని వ్రాసియున్నారు.
(చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక పుట - 17)

నారెడు నంతలోపలనె వితతవృత్తంబుల వేంకటపతికి శతకంబు కుతుకంబు సమకూరఁజేసి వలగొని" యాలయద్వారము కడకువచ్చి "వేంకటపతిమీఁద వివరస్తవముగ—వేంకట శతకంబు విన్నవించు కొనుటయు, గాలంపుఁజిక్కులు గదియించునట్టి-తాళముల్ వీడియుఁదము దామెపడి" తలుపులు తెఱచుకొనినవి. అచటి యర్చకుఁడావింతకు నతని కవితామహత్త్వమునకు నచ్చెరువందెను. పిదప నంబి స్వామికి 'పూజనము సేయుతఱిని పంబినభక్తి నబ్బాలుండు మఱియు, వేంకటప్పకు విన్నవించిన తొంటి వేంకటశతకంబు విన్నవించుటయు, పెట్టిన ముత్యాలపే రాయశోదపట్టి పాదములపైఁ బడఁ బ్రసాదించె'నది మాచి యర్చకుఁడు మఱింత యాశ్చర్యమునొంది "యీ యన్నబాలుఁడే యెన్నఁగో నేటిరాయని దివ్యవరప్రసాదుండు-కాకున్న నీనవ్యకావ్యంబుఁ జేయఁ జేకూరు నెట్టు?"లని మెచ్చి చందన తీర్థములిచ్చి యందరి యెదుట సత్కరించెను".

పై వివరములలో చివరనున్నవి అన్నమాచార్యుని "వేంకటేశ్వరశతక" రచనను గూర్చి చిన్నన్న చెప్పినవి. ఈశతకము నాకవి యాశువుగా తడిబట్ట యారునంతవడిలోఁ జెప్పెను. తత్పఠనమున నాలయపుతలుపులు తమంతఁదామే తెరచుకొనినవి. స్వామికర్చనము సేయు సందర్భమున నీశతకమును విన్నవింపఁగా స్వామివారి ముత్యాలపేరు పాదములపైఁబడి తత్కర్త యనుగ్రహింపఁబడెను. ఆ కవితామహత్త్వమునకుమెచ్చి యా శతకమును చుట్టునున్నవారు 'నవ్యకావ్యమని కొనియాడిరి. ఈ యంశమునుబట్టి యిది తొల్లింటి 'మంగాంబికా శతకము'న కంటె భిన్నమైనదనియు, నిదియొక 'నవ్యకావ్య'మనియు తెలియనగును.

ఈ శతకమునందును తొల్లింటి కవుల శతకములందువలె, వృత్తమకుటసంఖ్యానియమములును, స్తుతి ప్రాధాన్యమును నున్నప్పటికిని, వానియందెందును గానరాని క్రొత్తఁదనమే దీనిని నవ్యకావ్యమని తజ్ఞులు కీర్తించుటకుఁగారణమైనది. ఇది దివ్యదంపతుల భవ్యశృంగారము నాలంకారికముగను, రసికజనమనోహరముగను, చిత్రించు సుందరకావ్యము. అంతేకాదు భంగ్యంతరమున వ్యంగ్యముగా

నీ కావ్యము సృష్టిరహస్యమును, జీవపరమాత్మల సంయోగమును విశిష్టాద్వైతసిద్ధాన్తసారమును ప్రతిపద్యమునఁ బిండిపోయు విశిష్ట రచనము.

సాధారణముగ శతకము లేదేవతనుగురించి వ్రాయఁబడునో ఆ దేవతను మాత్రమే సంబోధించు రీతిని శతకరచన సాగుచుండును. కానియిందట్లుకాక అపూర్వముగ దివ్యదంపతుల నిరువురను సంధానించు రీతిని రచన సాగినది. అర్ధనారీశ్వరుఁడని పేరుగాంచిన పరమశివుని గూర్చిన శతకములందేని యింతకు ముందిట్టి ప్రయత్నము జరిగియుండ లేదు.[1] అందుకే యీ శతకము 'నవ్యకావ్య'మని పేరుగాంచినది.

ఈ శతకమున బ్రతిపద్యమున అలమేలుమంగాంబికాస్తుతియు, వేంకటేశ్వరసంబుద్ధియు, జోడుకూడి యెడబాటు నెఱుఁగని యాదివ్యదంపతుల సంయోగశృంగారమునకుఁ బ్రతీకములుగ నుండును.

---

1. పాల్కురికి సోమనాథుని శతకరచనలందుగాని, యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వరశతకమందుగాని, త్రిపురాంతకుని అంబికాశతకమందుగాని యింతకుపూర్వ మిట్టి యత్నము జరిగియుండలేదు. తిక్కన్నగారి రచన యందైనను హరిహరనాథ కల్పనమేగాని జగజ్జననీజనకుల సమ్మేళన మిట్లు సాధింపఁబడి యుండలేదు.

తాళ్లపాక కవులకు రావిపాటి త్రిపురాంతకుని రచనలయం దభిమానము మెండని వారివారి రచనలందలి సామ్యమునుబట్టి గుర్తింపనగును. ప్రాయశః త్రిపురాంతకుని 'అంబికాశతక' మందలి యీ పద్యము లేమేని అన్నమయ్యనిట్టి శతక రచనకు ప్రేరేపించినవేమో!

"వాలిన కన్ను ముంగురులు వాతెఱకెంపు మెఱుంగు జంటిపైఁ
గ్రాలెడు తారహారమును గంకణచారుకరంబు డాఁపలన్
దూలుచున్న పయ్యెదయుఁ దోఁచిన కన్నుల మోడ్పుమోడ్పునీ
పాలగు నీకుమేనిసగబాలు మనంబునఁ జేర్తు నంబికా"

"ముప్పిరిగొన్న వేడుకలు మూగిన సిగ్గుసియ్యాడఁ బ్రీతినీ
వప్పురమేశుఁ జూచి తను వర్థముగొంటి పొసంగ నంబికా"

అసలు తిరుమల మీఁది శ్రీనివాసుని శృంగారస్వరూపమే యట్టిది. ఆతఁడు శ్రీదేవిని సదాయురముననే యుంచుకొనును. అందుకే తిరుమలమీఁద నలమేల్మంగాంబికాదేవికి ప్రత్యేకమగు నాలయములేదు. శ్రీనివాసనిలయమే శ్రీదేవినిలయము, శ్రీనివాస విగ్రహమే శ్రీదేవికిమందిరము. లక్ష్మీహృదయస్థితుఁడు శ్రీనివాసుఁడు. శ్రీనివాసుని హృదయాధిదేవత లక్ష్మీదేవి. ఆదిదంపతుల లీలావిలాసమే ప్రకృతియందలి చైతన్యము. వారియిరువురి సంయోగము జీవపరమాత్మల సంయోగమువంటిది. వారిలోవారి కొకరివలన నొకరికి విఖ్యాతి. ఇరువురుగా వారివైశిష్ట్యమును వెల్లడించుకొనుచునే దైహికముగను నాత్మికముగను గూడ విశిష్టమగు నేకత్వానుభూతిని వారు పొందుచుందుదురు. ఈ పై భావములన్నియు నీ కవీశ్వరుని 'తిరువేంకటేశ్వర శతకము'న పుక్కిలింతలుగా కానవచ్చుచుండును.

"పరిమళమో కదంబమొ ప్రభల్ విడనించిన నిగ్గొ నిర్మలా
భరణమొ నిక్కవైభవమొ భాగ్యమొ శ్రీయలమేలుమంగ భూ
ధరనకు నాదిలక్ష్మియని తత్త్వమహత్త్వ రహస్యవేత్త లం
బరముననుండి నీవనితఁ బ్రస్తుతి సేతురు వేంకటేశ్వరా"

ఇట్లే 'తత్త్వమహాత్త్వరహస్యవేత్త'యయిన అన్నమాచార్యుఁడును అలమేలుమంగా శ్రీవేంకటేశ్వరుల నామముల రెంటి నేకవృత్తమున బంధించి యొన్నోరహస్యముల వినిపించును

"ఆతఁడె నీవు నీవనఁగ నాతఁడె నీ పలుకే తలంపఁగా
నాతనిపల్కు నీ హృదయ మాతఁడె పో యలమేలమంగ నీ
చేతిదె సర్వ జంతువుల జీవనమంతయు నంచు సమ్మని
వ్రాతము సమ్మతించు ననివారణ నీసతి వేంకటేశ్వరా."

"తరుణి యురంబునం జెలఁగఁ దన్మయ మందెకి నీకుఁ బాతియే
పరమపదప్రభుత్వము నపారమహత్త్వము వేంకటేశ్వరా!"

"నెఱి నలమేలుమంగకును నీకును బ్రహ్మభాండభాండమే
మెఱసిన బొమ్మరిల్లు తగు మేడలు పైఁదటి లోకముల్ ప్రభల్

తెలుఁగమించు నయ్యముఁడె దీపము గుజ్జెనగూడు చంద్రుఁడే
తోలిన దేవసంఘములె తొత్తులు బంటులు వేంకటేశ్వరా!"

ఇట్టి పద్యముల నెన్నిటినేని యుదాహరింపవచ్చును. [ఈ శతకమం దిట్టిరహస్యములతోఁబాటు ఆ దివ్యదంపతుల శృంగార వర్ణనము, భక్తి, స్తుతి, మొదలగు నంశము లెన్నియో గలవు.

ఆ దంపతుల శృంగార వనవిహార మిందు వర్ణితము.

"వెలయఁగ వేంకటాచలము వీధులఁ గమ్మని పుష్పవృష్టికిం
పలరఁగ నేఁగివచ్చి యలపారఁగ నయ్యలమేలుమంగతో
నలరఁగ గోరకమ్ముల లతాంగన లిమ్ముల నేస చల్లఁగాఁ
గలకలనవ్వు మిమ్ముఁ గలకంఠకులావళి వేంకటేశ్వరా!" [1]

అన్నమార్యుఁడు వాక్ప్రసూనముల నాదంపతుల పూజించి నట్లే అయ్యలమేలుమంగయు విభుని తన దృక్ప్రసూనములచేఁ బూరించి పూజించుచున్నదట! [2]

"వడి నలమేలుమంగ విడువాలిక చూపునివాళి నీపయిన్
ముడిసిన తమ్మిరేకులు ప్రసూన శరంబులు గల్వరేకులున్
బడిబడి మీఁదమీఁద రసభావనఁగా దిగఁబోసినట్లు పో
పొడవగు పువ్వుఁబోంపముల పూజలు నీకుమ వేంకటేశ్వరా!"

1. ఈ పద్యము నన్నపార్యుని శకుంతలోపాఖ్యానమునందలి

"లతాలలనల్ మృదులానిలాపవర్జితకుసుమాక్షతావళుల నేసలవెట్టిన యట్లుశైరి నం, పతదళిపీ నినాదమృదు భాషల దీవనలొప్పనిచ్చుచున్" (భారతము - ఆ.వ.) అను పద్యమును బోలియున్నది.

2 నన్నెచోడుని కుమారసంభవమున నొకపద్యభావమిట్లే యున్నది.

"ప్రణుతాపాంగ విలో లే
క్షణదీప్తుల నఁగజ గలయఁగప్పిన నసమే
క్షణుఁ డుత్పలదళములఁ బూ
రణసేసిన కరణి నతి విరాజితుఁడయ్యెన్." (౫ - ౩౭)

ఇట్లే యెడనెడ.

"బాఁగు బళా జగత్పతికిఁ బాఁగు బళా జగదేకమాతకున్
బాఁగు బళా రమేశునకుఁ బాఁగు బళా యలమేలుమంగకున్."

"(మ)మ్మేలిన తల్లి! నీ విభునకించుక మాటెసఁ బూవుమంచు నీ
పాలికిఁ జేరి మ్రొక్కుదురు పద్మభవాదులు వేంకటేశ్వరా!"

అని స్తుతియు,

"యోగ్యతలేని కష్టుఁడ నయోగ్యుఁడ నన్నిటఁ జూడ గర్భని
ర్భాగ్యుఁడ నీ కృపామతికిఁ బ్రాప్తుఁడ నోయలమేలుమంగ నా
భాగ్యము నీ కృపాగరిమ ప్రాప్యము గావుమటంచు సారె నీ
భాగ్యవతీశిరోమణిని బ్రస్తుతి చేసెద వేంకటేశ్వరా!"

అని భక్తియుఁ బ్రకటించుచుఁ 'బూచిన వాక్ప్రసూనములఁ బూజలు' చేసి అన్నమయ్య యీ శతకవృత్తహారమును శ్రీనివాసుని శ్రీపాదముల సన్నిధి కర్పించినాఁడు.

*మంగాంబికా శతకము* :— అన్నమాచార్యుని పంద్రెండు శతకములలో పైన పేర్కొన్న 'వేంకటేశ్వరశతక' మొక్కటియే మనకు లభ్యమగుచున్నది. ఇదికాక యాతఁ డంతకుముందు "మంగాంబికాశతక" మొకదానిని కూడ రచించి యుండినట్లు చిన్నన్న ద్విపద లనుబట్టి తెలియనగుచున్నది. ఇవి రెండునుగాక మిగిలిన పదింటిపేరులే మన కెరుగరావు.

అన్నమయ్య 'ఎనిమిదేడు'ల బాలుఁడుగానున్నప్పుడే తొలిసారి కొండ యెక్కునప్పుడు మొదటి యెక్కుడగు మోకాళ్ళముడుపుకడ నలసి సొలసి యచటి వెదురుపొదల నీడ నొక బండపైఁదూలి యొడలెరుఁగని దశలో నుండఁగా జగదంబ యాతని యా యవస్థ నెఱిఁగి ప్రత్యక్షమై

"శౌరియుఁ దాను నిచ్చలు పొత్తుగలసి
యారగించిన ప్రసాదాన్నముల్ దెచ్చి
పరిపరిరుచుల నేర్పడ పేదదేర

పెరిమతో భుజియింపఁ బెట్టి యూరార్చి
తిరుమలప్పని దేవదేవునిఁ గొలువ
నరుగు మటంచుఁ— (పు. 17)

దెలిపి తొల్లింటి కరణి కౌస్తుభరత్నహారునుల్లంబు మీఁదట నుండెననియు నత్తఱి బాలుఁడగు నన్నమయ్య చిత్తంబున నచ్చెరువంది,

"కలయొ యాందోళమొ కాక నిక్కంబొ
కలవళంబో దీని కరణి యే కరణి
యని నిక్కమని యాత్మనలరి యాపద్మ
తనకేలనిడు ప్రసాద ప్రభావమున
పరమ సారస్వత పారీణుఁడగుచు
సరస కవిత్వ వాచా ప్రౌఢిమెఱసి
యలమేలుమంగకు వాకుమార్గమున
సలలితంబుగ నొక్క శతకంబుఁ జెప్పె!"

(అన్నమా. చరిత్ర. ద్వి. పు. 18)

ననియు అన్నమాచార్యచరిత్ర ద్విపదలో చిన్నన్న వ్రాసినాఁడు. ప్రాయశః ఇదియే అతని తొలిరచనము కాఁదగును. ఆపిదపనే అతఁడు స్వామిని సందర్శించి నిరర్గళ కవితాప్రసాదమును బడసి వేంకటేశ్వర శతకాదులను, సంకీర్తములను గావించినది. దురదృష్టమున మన కీశతకము లుప్తమై పోయినది. బహుశః రావిపాటి త్రిపురాంతకుని 'అంబికా శతకము'ను బోలినదే యీతని 'మంగాంబికా శతకము' నై యుండును. ఇది 'వేంకటేశ్వరశతకము'న కంటె భిన్నమైనదనినా తలఁపు. కాని పితృపాదులు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు లభ్యమగు శతకము నందలి "అమ్మకుఁ దాళ్లపాక ఘనుఁ డన్నఁడు పద్యశతంబు సెప్పె"నన్న అంకితాంక పద్యమునుబట్టి 'వేంకటేశ్వరా'యని పద్యాంత సంబోధనమున్నను నందు ప్రతి పద్యమును నలమేలు మంగాంబికా ప్రస్తుతిపరమే కావున నా వేంకటేశ్వర శతకమే యీ మంగాంబికా స్తుతిశతకము కాఁదగునని వ్రాసియున్నారు. (చూ. అన్నమా.చరిత్ర-

ద్వి. పీఠిక పు. 160-78) చిన్నన్న ద్విపద లాశతకములు రెండును వేర్వేరు రచనలుగా వేర్కొనుటే పై యభిప్రాయమునకుఁ బ్రతిబంధకమగును. లేకున్న వారి యభిప్రాయము సమంజసమైనదిగనే భావింపఁదగి యుండెడిది.

*పెదతిరుమలాచార్యుని శతకములు* :—అన్నమాచార్యులవారి తరువాత తాళ్లపాకవంశీకులలో శతకరచయితలుగాఁ బ్రఖ్యాతిగన్న వారిలో పెదతిరుమలాచార్యుఁడు ముఖ్యుడు. ఈ కవీశ్వరుని శతకములు రెండుమూఁడు నేఁడు మనకు లభ్యములగుచున్నవి. వానిలో నొకటి లోకనీతిని, రాజనీతిని గ్రమముగా విశదీకరించునీతిసీసశతకము (వానికే వేంకటేశశతకము, వేంకటేశ్వరశతకమనియు నామాంతరములు) మఱియొకటి శ్రీవేంకటేశ్వరుని దక్షిణనాయకత్వమును నిరూపించు 'శృంగారవృత్తపద్యాల శతక'మనునది. మూఁడవది లక్షణశతకము. తొలిరెండు శతకకావ్యములందును కవిలౌకికాలౌకికవిషయముల నతిలోకముగ వర్ణించెను. మొదటి కావ్యమగు 'నీతిసీసశతకము'న లోకనీతిని లౌకికమగునీతి నుపన్యసించినాఁడు. రెండవ కావ్యమగు శృంగారవృత్త పద్యశతకము'న, లౌకికమగు శృంగారము నలౌకిక స్థాయికెత్తి శ్రీవేంకటేశ్వరుని నాయకునిగను, తననే నాయికగను గూర్చుకొని జీవపరమాత్మల సంయోగానుభవమును కాంతాసమ్మితమగురీతిని వ్యంగ్య వైభవములు వెలార్చుచు తండ్రిగారి శ్రీవేంకటేశ్వరశతకము వందువలెనే రసానుభూతిని గల్గించినాఁడు. మూఁడవది లక్షణగ్రంథమే. అన్నమాచార్యుని శతకరచనలవలెనే పెదతిరుమలాచార్యుని శతకరచనలును నవ్యతనుగూర్చుకొనినవే. అన్నమయ్యగారి వేంకటేశ్వరశతకమున దివ్యశృంగారమును జిత్రించు వైఖరిలో నవ్యత గోచరింపఁగా నీతని శతకములందు లోకనీతిని భాషాలక్షణమును బ్రపంచించుటకే శతకరచనాప్రక్రియల నూఁతగాగొను టనునంశమే నవ్యతను బ్రదర్శించును. ఈతనికిఁ బూర్వపు కవులెవ్వరును నిట్లు శతకములను స్తుతికిని, దివ్యశృంగార వర్ణనమునకును దవ్వానితరములగు లౌకికానుభవములను వ్యక్తీకరించుటకో భాషాలక్షణమును వివరించుటకో వ్రాసియుండలేదు. తద్రీతిగల రచనల కీతని

యీ శతకములే మూలములు. ఈతని నీతిశతకమే వేణుగోపాల శతకము, కుక్కుటేశ్వర శతకము, రామలింగేశ శతకములకు మార్గదర్శకమని చెప్పవచ్చును.[1] అట్లే యీతని శ్రీకృష్ణ శతకమే తరువాతి కస్తూరిరంగ నిఘంటువు మున్నగు లక్షణ శతకములకు మార్గదర్శకము. ఇట్లు ప్రక్రియ యందు నవ్యతను, రచనయందు మాధుర్యమును, భావమునం దౌదాత్త్యమును ప్రకటించు నీ కవీశ్వరుని శతకములు మూఁడును సరస్వతీమూర్తి నలంకరించు మూఁడు తులలేని రత్న మణిహారములే యని చెప్పవచ్చును.

*శృంగార వృత్తపద్య శతకము* :— కర్త పెద తిరుమలాచార్యుఁడు. పేరును బట్టియే యిది శృంగారపరమనియు, చంపకోత్పలాది వృత్తములతో నొప్పినదనియు తెలియనగును. ఇది శ్రీ వేంకటేశ్వర స్వామివారి కంకితముగా 8 శార్దూలములు 18 మత్తేభములు 30 చంపకములు, 52 ఉత్పలములు వెరసి 108 వృత్తములతోఁగల శృంగార శతకము. ఇందు చంపకోత్పలములలో 'వేంకటేశ్వరా' అను మకుటము ప్రధానము. మూఁడు నాలుఁగు పద్యములలో 'తిరువేంకటేశ్వరా' అనియుఁ గలదు. పోగా మత్తేభ శార్దూలములలో 'వేంకటాద్రీశ్వరా' అను మకుటము కలదు. ఒండు రెండు తావుల 'శైషగిరీంద్ర నాయకా' అనియు, 'వేంకటశైల నాయకా' అనియు సంబుద్ధులు గలవు. ఇది వృత్తపద్యముల శతకమగుటచేత భిన్నవృత్తములకుఁ దగిన విధమున భిన్నమకుటము లా తీరునగలవు.

ఈ శృంగార శతకమున నాయకుఁడగు శ్రీ వేంకటేశ్వరుని దాక్షిణ్యము బహుధా వర్ణితమైనది. ఆ నాయకుఁడు జగన్నాయకుఁడగుటంజేసి సర్వజీవులను సమముగఁ బ్రేమించువారికి సంయోగానుభూతి ననుగ్రహించును. కాని యీ పరమపురుషుని యనుగ్రహమున భోగానుభూతిని బడసి ధన్యలైన జీవస్వరూపలగు నాయికలెల్లరు నెవరికివారే సౌభాగ్య గర్వమున తమ్మే యితరులకన్న నధికముగా నాయకుఁడు ప్రేమింపవలెనని సంభావించుకొనుచుందురు. స్వాధీన

---

1. చూ. శతకకవులచరిత్రము. పుట-142.

పతికలై మగని తలవాకిటనే గట్టివైచుకొనవలె నని తలపోయు సాధ్వుల కాతని దక్షిణనాయకత్వము దుస్సహమే కాఁగలదు. అప్పుడు వారు సత్యభామవలె ఖండితలగుచుందురు. ఆ యవస్థలో ప్రౌఢలును, ధీరలు నగు నాయికలు తమ వలచిన వానిమీఁది తగులమును వీడుకొన లేక వ్యంగ్యములాడి పంతమును దీర్చుకొనుచుందురు. అట్లు వారి నలయించి యనుగ్రహించుటయందే ఆ నాయకుఁడును నానందము పొందును. ఆ పరమ పురుషుఁడగు శ్రీ వేంకటేశ్వరుని యీ శృంగార లీలయే 'శృంగార వృత్తపద్య శతకము'నకు వెనుకనున్న యితి వృత్తము. ఆ శ్రీనివాసుఁడు అలమేలుమంగా ప్రియుఁడు. అయిన నింక నెందరినో వలచినవాఁడును, వలచినవారికి వశమై వర్తిల్లిన వాఁడును గూడ. కాని ఆ పరమ పురుషుని సర్వాంతర్యామిత్వము నెఱిగిన అలమేలుమంగాంబ సత్వగుణమున రుక్మిణీసతివలె నాతని దక్షిణ నాయకత్వమును గూర్చి వేరుగాఁ దలఁపదు. అయినను రాజసమున సత్యభామవలె నాతని యెడఁబాటు నెఱుఁగని యీ శతక కర్తమాత్రము వేదన ననుభవించును. తద్భావావేశమున తత్కాలమునకా జీవుని వేదన నాయికా స్థాయినందును. ఆ స్థితిలోనే తద్భావస్పందనమున పెద తిరుమలాచార్యుని నోట నీ శతకము వెలువడినది. ఇందు నాయిక తిరుమలాచార్యుని జీవుఁడే. నాయకుఁడు శ్రీనివాసుఁడు. ప్రేమాతిరేకమున నాయిక పలువిధముల నాయకుని చేష్టితములకునొచ్చి వ్యంగ్యవైభవము వెలార్చునట్లు దొసఁగుల నెమకుటయే యీ శతకమునందలి విషయము. తన్మూలముగ నా జగన్నాయకుని దాక్షిణ్యమును గీర్తించుట కవ్యుద్దిష్టమగు శతక రచనా పరమార్థము.

కవి శతకమున నీ భావములను వెలిబుచ్చును.

"అసలఁ బెండ్లియాడి మఱియన్గినఁ బెల్లునె, యెంతచేసినా
వేసర సమ్మ నీవునిఁక వేరుగఁ జూడక మాటలాడు మీ
దోసముగాదు నీ గుణము తొల్లి నెఱుంగుదు తోడివారితో
వాసికి నేఁబెనంగెదమ పంతఁబెట్టకు వేంకటేశ్వరా!" (పు. 74)

ఇట్లు బాళింజెంది మదిలో, జోలిన్ విరాళిఁ మహాందోళంబంది నాయకునితోఁ జెప్పుకొనుటకై నాయిక వచ్చును.

"కలరా నాకిల రామ లెవ్వరయినం దారిదుగా జోడుగా
గలరా నీవలరారఁ జూచుకొనుమింకా మానవా కానవా" (6)

అని వేడుకొనును. 'కాసులయాస బాసగొని కౌఁగిటఁగూడిన దానగా'నని ప్రమాణము సేయును. కాని నాయకుఁ డెవతెనో గూడి వచ్చిన సంగతిని నాయిక గ్రహించును. 'సమకొని మోవిగంటి యిదె సాక్షి యుండఁగ నిట్టినోరనే-యమరని మాటలేమిటికి నాడెదవిప్పుడు వేంకటేశ్వరా!" అనును. 'మగలెందున్ నొగిలించ రింతులను రమ్మా వేంకటాద్రీశ్వరా' అని యర్థించును. 'నిల్కడఁబాటల్ తగఁబాడి యాడి-నీకడఁ బాటింపుచుఁ బాడుదున్ విను' మని తన మనసెల్ల విప్పి చెప్పుకొనును. కావలసిన తనతో నితరులను బోల్చిచూడుమని 'ఆపెతన యంతర మెంచిచూడుము నిరంతరముం దగ వేంకటేశ్వరా!'యనును. కానియేటికి వంకలుదిద్ద శక్యముకాదని యెఱిఁగిన చెలియిట్లనుకొనును.

"శ్రీగలవాఁడ వేమనినఁజెల్లును నేనిక నడ్డ మాడినన్
బాగులఁగావు మౌనమున బంతముదక్కును మీరిపల్కినం
దీగెలుసాగి యూరొకటి దీయఁగఁ జేనటు వచ్చునంద్రు నీ
భోగము నాకు నిచ్చితివి పొందుగఁదొల్తనె వేంకటేశ్వరా!"

కాని యావెనుకటి తృప్తిలోననే యేదో అతృప్తి.

"వెందురలతోడ నవ్వు పదివేవురఁ బెడిలియాడు నిమ్మనే
వలదన విట్టివెల్ల మగవానికి సాజము లాటదానికిం
గలిగిన దొక్కసిగ్గు; నముఁగౌఁగిటఁగూడుచు నన్యకాంతలం
దలఁతురె నీకు మ్రొక్కెద వెతం బొరలించకు వేంకటేశ్వరా!"

కూరిమి నిచ్చియుఁ గొదువసేయుట తగునా యని మనవి. ఒకప్పుడు స్వామి తనపై నెంత మమకారముఁ జూపెడివాఁడో!

22)

"అడవుల వేటలాడుచుఁ బ్రియం బిగురొత్తఁగ వీడుకాంతకున్
నడుమిది సింహమంచు జఘనం బిభమస్తకమంచు నంచలే
నడుపులటంచు జక్కవలు నవ్యకుచంబు లటంచు నేయకే
విడుతువు వాని నీకెపయి వేడుకలెట్టివో వేంకటేశ్వరా!" (54)

కాని యిప్పు డాయనురాగ మేమైపోయినదో!

అనుకూలపుభార్యకు భర్తతోఁ గొఱకొఱలేల - పెక్కుముద్దియలనేలినవాఁడు దూరినా వెఱవఁదని యా చెలియెఱుఁగును. అందుకే 'చిత్తము వచ్చినట్లు యిచ్చకములాడెదను లె'మ్మని యూరడిల్లును. కాని యెంతటి కూరిమి చల్లినన్ 'ఱాతికిన్ బుట్టునే కొఱకొఱన్ గిలిగింతలు?'

"మఱవక యుండఁ జేసితివి మన్ననతో మవకార మెప్పుడున్
గుఱుతులు చన్గవన్నిలిపి, కోరికె చెల్లెను, రాకయుండినం
గొఱఁతలు లేవు, పద్మమునకున్ రవికిన్ మఱియాద కేడ నీ
వఱిముఱి నెందునున్న హృదయంబున బాయవు వేంకటేశ్వరా!" (72)

అని కొంతవఱకు మనసును నిలువఁ ద్రొక్కుకొనును.

'అలనై పిలచిన నోయటంచుఁ గడుఁ బ్రేమఁ జెలంగెద వేంకటేశ్వరా' అనుకొనును. కాని యాతని యెదలోఁ దానుగాక వేఱెవరో గలరు.

"ఎఱుఁగక నవ్వినందులకు నేమనివా నిఁక నీకుఁ జెల్లు నీ
మఱుఁగున నాకె దాగినది మామగ నే నటుఁ జూడనైతి యీ
తెఱఁగులు తొల్లి లేవు పలుదిక్కులఁ గ్రొత్తలు నేర్చుకొంటివా?" (61)

యని సందేహించును. సవతిగల్గెగదాయని చింతించును.

నాయకుఁ డామె నెదపై కెక్కించుకొని తనను వంచింపఁ జూచుట తగునా?

"కొసరుచు మాటలాడుమని కూరిమి చూపెద వాకెయుండఁగా
నెసఁగునె ముచ్చటాడ మనయింటికి వచ్చిన నట్లు చేసెదన్
సుసరముగాదు జంటమొనసూదిని రెంటెము గ్రువ్వ; నొక్కచే
పొసఁగినచోట నేమయిన బొంకఁగవచ్చునె వేంకటేశ్వరా!" (78)

"తడవకు నీవు మమ్ము నిమఁ దప్పులు సారెకుఁ బట్టనేల నీ
నడవడి యెప్పుడుం గలది వారికిఁ జక్కటులేల దిద్ద నీ
పడతులు వారె నావలని పంగెన యేఁటికి నిందు మోహ మె
య్యెడఁదను లేదు నీకు నది యేను నెఱుంగుదు వేంకటేశ్వరా!"

అనును కాని నాయకుఁడు చెలి ననునయింపఁ జూచెను కాఁబోలును.

"ఈ దెస నన్ను వేడుకొని యింతటి వాఁడవు బుజ్జగింపఁగాఁ
గాదననేల నిన్నుఁ గడుఁ గల్ల యొనర్చినవాఁడు వచ్చి తా
లే దనినంతఁ బోవు మరలించితిఁ గోపము వాదు లేల? నీ
పాదము దెమ్ము మ్రొక్కెదను పాన్పిదె రమ్మిక వేంకటేశ్వరా!"

అని సర్వాత్మ సమర్పణముగాఁ దనను స్వామి కర్పించుకొనును. అయినను స్వామి యొకరిని వంచించి వేరొకరిని సమతమందే కూడుటకు వెనుదీయఁడు. తననేలోనికి రమ్మనినాఁడు. చెలి యాతని వారించినది. 'పిలువకునన్నులోపలికి పెంపున నేసతియొందునుండునో!' 'సంగతి నాకె యున్నదని సన్నలఁ జెప్పెద వేను వచ్చినన్ సంగతిగాదు మానినులఁ జౌకలు నేతురె?'యని మందలించినది. స్వామి యనుగ్రహించి నట్లున్నాఁడు. 'కల్లలు గల్గినన్ విభునిఁ గాదనఁ జెల్లునె కాంతకున్, నీవు వచ్చుచో నిన్నటి కోపమంతయును నెమ్మదిఁ బాసెను వేంకటేశ్వరా' అని మనసిచ్చి యాహ్వానించినది. ఆ స్వామి యెదపై వేరొకతెను గూడినచిన్నె లట్లే యుండినవి. అందుకే చక్కఁగ రెంటెము గప్పు మందుపై -

"నంటునఁ జూడరాని వవి నాతులసిగ్గులు దాఁచుటొప్పగున్
గొంటరి నాకె పీవయిన గోప్యము నేయుము వేంకటేశ్వరా!"

యని బోధించినది. స్వామి తనతోనున్నను వేరొకతె పేరు వినినంతనే సాత్త్వికభావోదయమును బొంది కప్పిపుచ్చుకొనుటకై తంటాలు పడసాగెను. తుదకు చెలి యిట్లనెను.

"పులకలు మేననిండె నొకఁబోటినిఁ బేర్కొనినంత నీకు, నేఁ
బిలువఁగఁబోదునో, మగనిఁ బెండిలి నేసినఁ బుణ్యమౌను నా

వలపటువెట్టు నీ మనసు వచ్చినఁ జాలును నవ్వుగాదు వా
తలఁపునఁశాయ వెప్పుడును దప్పదు శ్రీ తిరువేంకటేశ్వరా!"

ఆ స్థితిలో నామెకు స్వార్థము వీగిపోయినది. ఆ నాయకుని యనురాగమును దాక్షిణ్యమును ననుభవించినది. పూజింపసాగినది. అందుకే తుదకు

"నీ నిలువునఁ గల్లగల్గినను నిన్నె భజింతును వేంకటేశ్వరా."

అనినది. స్వామి సరసుఁడు-చెలియుఁ దత్త్వము నెరిగినది. తుదకు క్షమాభిక్ష నిట్లు వేడుకొనినది.

"సరసుఁడ వన్నిటన్ మిగులజాణవు నిన్ను నుతించ టొప్పగున్
దరుణికి వ్యంగ్యమాడవలె దప్పక కాంతునిఁ గన్నచోటులన్
విరసముగాద చిత్తభవవిద్యకు మంత్రము దీనికై నినుం
బరుసము లాడితిం దెలిసి పట్టకుమెగ్గులు వేంకటేశ్వరా!" (101)

అనియిట్లు 'చిత్తభవ విద్యారహస్యము' నెరిగి 'వ్యంగ్యమాడ' నేర్చినకవిగావుననే తిరుమలాచార్యుఁ డీరీతిని శతకమున నాయిక యొక్కవిభిన్నావస్థల నొకక్రమమున గుదిగ్రుచ్చి కథగాఁ జెప్పుకొనుటకు వీలుగా వియోగ సంయోగ శృంగారముల నింతరమ్యముగఁ జిత్రించఁ గల్గెను.

ఈతని యీ శతకము తెలుఁగున స్వతంత్రముగ వెలసిన శృంగార శతకములలోకెల్ల మేలుబంతి యనఁదగినది. శతకరచనలో నీ కవీశ్వరుని మేలుతిరిగినచేయి చూపని సోయగము లేదు. యమక గమకము లీతనికవితకుఁ బెట్టనియలంకారములు. శతకారంభముననే శ్రీ వేంకటేశ్వరస్తుతి యీ రీతిని ముక్తపదగ్రస్తాలంకారముతో శోభిల్లుచున్నది.

"శ్రీ రమణీమణీప్రమదజీవన జీవనవాస వాసవా
దార విశేష శేషవసుధాధరనాథవిహారహారకే
యూరవిరాజి రాజిత మహోన్నతదేవ భుజంగ జంగమ
స్మేర వికల్పకల్పకమ మిమ్ము నుతించెద వేంకటేశ్వరా!" (1)

శబ్దాలంకారములకుఁ గొదువే లేదు.

"కనుపట్టం గనుపట్టమేల నతివం గాపాడరా పాడరా
మనకేలా మనకేల నున్నదిదె"— (28)

"నేరము చేసినం బలుకనేరము."
"గోరముఁ జేయకీ సురటిగోర మురాంతక" (30)

"మాను పరాకు నీ విచట మానుపడం గతమేమి యెప్పుడున్
మానము నీదు పొందు ననుమానములేటికి"— (33)

"పోరక పోర కాఁకలను-తేరక దేరక త్తియల్. (16)

ఇత్యాదులిందు కోకొల్లలు. వాడిన సామెతలకును లోకోక్తులకును లెక్కలేదు. 'ఓడకు దూలమైన క్రియ' 'సాకిరిపల్కె కూలికిన్' 'ఈరొకటి దీయఁగఁ బేనట వచ్చు' 'జాతికిఁ బుట్టునే గొలుకొలన్ గిలిగింతలు' ఇత్యాదులు చూపవచ్చును

ఇఁక వాడిన భాషలో శతకసామాన్యమగు వ్యవహార భాషా ప్రయోగములు 'ఇంకా మానవా' 'సొలసీని' 'కలసీని', 'కడివోతది, మున్నగునవి కలవు. ఈ ప్రయోగములు వ్యాకరణదుష్టము లగునప్పటికిని శతకమున శయ్యాసౌభాగ్యమును గూర్చునవియై జనరంజకములే యగును. ఇఁక ఛందోవిషయమునఁ గూడ కవి చమత్కారములు గావించినాఁడు. ద్విత్రిప్రాసరచనల కీయుదాహరణములు చూడ నగును.

"కలరా నాకల—
గలరా నీవల—
వలరా జవ్వల
కొలరా కాఁకల" (6)

"గరుపారం దమిరేఁచి-జం
గరుపారావతమేమి-జాన్పడ
గ్గరుపారాజవమెంత-భావంబెరుం
గరుపారంబుగ—" (13)

ఇట్లు రచనలయందే కవి యెన్నో సోయగములఁ జూపినాఁడు. స్వతంత్రమగు నీతని యీ శృంగార శతకమున నెడనెడ ప్రసిద్ధములగు సంస్కృత శృంగార శతకములందలి శ్లోకములకును అన్నమాచార్యుని

శృంగార సంకీర్తనలకును ఛాయ ననఁదగురచనలును గూడ కొన్ని గలవు.

"కరమటువేసె నీదువయిఁ గాంతల సందడిఁ బవ్వళింపఁగాఁ
దరుణియొకర్తె, వేఱొకతె తానను బాదమువేసె, వంతని
చరణము యంచు నింతి చెయి చాఁచిన నాపె యొఱింగి తిట్టె ని
ట్లరయఁగ నీవ రెంటి కపు డాశ్రయమైతివి వేంకటేశ్వరా! (98)

"అలుగుచుఁ గాంత మారుమొగమై యటుచూచిన దర్పణంబునన్
బెళకక నీ మొగంబు ప్రతిబింబము గానఁగవచ్చె నంతలో
గలకల నీవు నవ్వితివి కాంతయు నవ్వెను మీకు నద్దమే
యలుకలు దీర్చెఁ దోడిచెలు లచ్చెరువందగ వేంకటేశ్వరా" (64)

"కామిని గోర నొత్తినది కస్తురి నీమెయిఁ బూయదయ్యెఁదా
వేమఱు మోవియానినది వీడెము సేయఁగనీయ దయ్యె నీ
మోము చెమర్చఁజేసినది ముందర నేయలపార్చదయ్యె నీ
బూమెలుగంటి నా యెదుట బొంకఁగరాదిక వేంకటేశ్వరా" (46)

"వెలదులు గొల్వసేయ నెడ వేడుక యొక్కతి మీఁదనిల్పి ని
ట్టలముగ రత్నసౌధమున డాఁగిలిమూఁతల నాచరింత మా
యలవడ నంచు నేగి చెలి నక్కడఁగూడితి వెంతనేర్తువో
తెలియదు నీ మొఱం గని సతీమణులెంచిరి వేంకటేశ్వరా!" (79)

ఈ పై పద్యములందలి భావములు రమణీయములు. ఇందలి నాయకుని జాణతనము చెలిని సన్నిధియందే వచించి వేఱొకతెను గూడు దాక్షిణ్యము అన్నమాచార్యుని శృంగార సంకీర్తనములందు బహుధా వర్ణితము.

"నే నెఱుంగనా విభుఁడ నీ సుద్దులు
నీ నయగారితనాలనె పాలు సేసేవు
అనవెట్టి నన్నెక్కించి అట్టె తూగుమంచమూచి
ఆ నడుమ నాపెతో మాటాడేవు
పూనియప్పటి నీవు పువ్వుల చెండువేసి
మోహాన నంతలో నాపె మోవి యానితివి". (8-116)

ఇత్యాది శృంగారసంకీర్తనము లిందు కుదాహరణములు. ఇట్లే ప్రణయకలహమున నాయికానాయకు లేకశయ్యపై పరాఙ్ముఖులై యుండుటయు, వారి నేదేనొక చిన్న కారణమున మఱల ప్రసన్నులఁ జేయుటయు ననుభావముగల పద్యములవంటి రచనలు శృంగారామరు కావ్యమున కాననగును.

ఇందలి 'అలుఁగుచుకొంత' (64) అను పద్యము అమరు కావ్యమునందలి యీ శ్లోకము ననుసరించినదే యనవచ్చును. పోల్చి చూడుఁడు.

"ఏకస్మిన్ శయనే పరాఙ్ముఖతయా
వీతోత్తరం తామ్యతో
రన్యోన్యస్య హృది స్థితేఽప్యనునయే
సంరక్షతో ర్గౌరవం
దంపత్యోః శ్శనకై రపాంగవలనా
న్మిశ్రీభవచ్చక్షుషో
ర్భగ్నో మానకలి స్సహాసరభస
వ్యావృత్త కంఠగ్రహమ్. (21)

ఇట్లు మనోజ్ఞములగు శృంగార భావములతో నాయికానాయకుల విభిన్నావస్థలను చమత్కారముగాఁ జిత్రించు నీ శతకము కావ్యకతనుగూడ తదంతర్లీనము గావించుకొని రసమయమై యుదాత్తమై యొప్పుచున్నది.

*నీతిసీస శతకము* :- కర్త తాళ్లపాక పెద తిరుమలాచార్యుఁడు. ఈతని శతకములలో నిది రెండవది. లోకనీతిని ప్రపంచించునది గావున దీని కీపేరైనది. ఇందు మొత్తము నూఱు సీసపద్యములున్నవి. "కలిత లక్ష్మీశ, సర్వజగన్నివేశ, విమల రవికోటి సంకాశ, వేంకటేశ" అనునది మకుటము. ఈ మకుటాంతమును బట్టియే కావచ్చును. దానికి 'వేంకటేశ శతక' మనియు నామాంతరము గలదు. ఇందలి నూఱు సీసములలోఁ దొలిది సకలకళ్యాణగుణాభిరాముఁ డగు శ్రీ వేంకటేశ్వరుని దివ్యమూర్తిని సంస్మరించునది. ఇట్లే తుది రెండు

సీసములలో నొకటి స్తుత్యాత్మకము. మఱియొకటి అంకితాంక పద్యము. ఈ మూఁడు పద్యములునుపోఁగా మిగిలిన గ్రంథమంతయు లోకనీతిని ప్రతిపాదించునదే. ఇందు ప్రపంచితమైన లోకనీతి - రాజనీతి, సంఘనీతి యని ద్వివిధము. ప్రాయికముగా నిట్లు లోకనీతిని ప్రతిపాదించుటకై శతకరచనాప్రక్రియ నూతఁగాఁ గొనుట కిదియే యారంభ మనవచ్చును. ఈ విషయమున నీ శతకమే తరువాతి వేమన, వేణుగోపాల, కుక్కుటేశ్వర, నారసింహ శతకాదులకు మార్గదర్శకమైన దనవచ్చును. ఆయాశతకములం దీ నీతిసీస శతకమునందలి నీతులును, సూక్తులును-బహుధా సంగ్రహింపఁబడినవి కూడను. ఈ శతకమందలి ప్రధానవిషయ మగు లోకనీతి యించుకంత రాజనీతి రూపమునను, అంతకంత సంఘనీతి రూపమునను ప్రపంచితమైనది.

ఇందలి రాజనీతికి సంబంధించిన సీసములలో రాజనెవ్వఁడు-ఎట్టివాఁడు కావలె-రాజనీతి యెట్టిది-ఎవరినెట్లు చూచుకొనవలె-మంత్రిపదవియెట్టిది మున్నగు ననేకవిషయములను గూర్చిన వివరణమున్నది. ఇట్లే సంఘనీతికి సంబంధించిన సీసములలో శాంతజీవన విధానమెట్టిది?-జీవితమున మంచిచెడుగు లేవి? వాని ప్రభావములెట్టివి? భక్తి, పరమార్థము, మున్నగు విషయములను గూర్చియు నాచార్యుఁడు, శిష్యుఁడు, యోగి, సతి, మున్నగువారి వ్యక్తిత్వములను గూర్చియు విపులముగాఁ చర్చింపఁబడినవి. ఇందలి నీతు లన్నియు పొందికౌసగియంనముగా కూర్పఁబడినవి. సీసపద్యముల యల్లిక చిక్కఁగాచక్కఁగా నుండి విసుగుగొల్పని వింతగతుల సాగినది. అపారమగు లోకానుభవమును జాటుచు శతక మాద్యంత ముత్తేజము గొల్పునదిగా నున్నది. ఇందలి ప్రతిపద్యమును ప్రతిపాదమును నుదాహరింపఁదగిన నీతివాక్యములతో నిండియున్నది. గ్రంథవిస్తర భీతిచేత వానినెల్ల సంగ్రహింపసాధ్యము కాకున్నను ముఖ్యములగు వానినేని కొన్నిటి నిట కవివాక్యసరణి నుదాహరింతును.

*రాజనీతి* :— ఈ కవీశ్వరుని దృష్టిలో 'నఖిలంబు రక్షించునతఁడెరాజు'. రాజు చేసినదె ధర్మంబై ప్రవర్తిల్లు-ననఁగా రాజు ధార్మికుడు కావలెను. పురుషరత్నములని కొనియాడఁబడు నెనిమిదిమందిలో

న్నాచారవంతుఁడగు విప్రోత్తముని తరువాత నెన్నఁ దగినవాఁడు, ధార్మికుఁడు సంరక్షకుఁడు నగురాజే-స్వామియగువాఁడు భటునకుఁ జనవులొసఁగి మనువఁ దలఁచిన యట్టి సన్మార్గ మిట్టిదని చెప్పుచు నీకవి ప్రశాంతత, దాతృత్వము, సహనము, మేలును ప్రశంసించుట, చాడి వినకుండుట, దయఁదలఁచుట, తప్పును క్షమించుట మున్నగునవి గురుతులుగా పేర్కొనెను. రాజైన వ్యక్తి నిత్యజీవితమును క్రమ పద్ధతిని జరుపుకొనవలెను. అతని దినచర్య యిట్లుండవలెనని కవి చెప్పుచున్నాడు.

"జలకంబు; దగుపాటి జపము దేవార్చన బ్రాహ్మణసేవ పురాణగోష్ఠి;
దానంబు; చోరశాత్రవ నిగ్రహచింత; స్వజనగజాశ్వరక్షణము గణన
యాప్తమంత్రి పురోహితాలోకనంబును, రాజ్యాదిధనవిచారంబు,భుక్తి
సంగీత సాహిత్య సౌఖ్యానుభవములు ; గూఢచారుల కొలువు; గుప్తనిద్ర;
సలుపవలయు ప్రతిదివసంబునందు నయమెఱింగిన యట్టి భూనాయకునకు-"
(10)

మహారాజులకుచితమగు నీ దినచర్యాక్రమము నాఁటి సమకాలిక గ్రంథములందలి విషయముతో సంవదించు చున్నది.[1]

---

1. రాజుగారి దినచర్య యిట్లుండవలెనని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలోని యామునప్రభు రాజనీతిని వివరించు ఘట్టమున నీతీరు ననే పేర్కొనెను.

సీ॥ సౌఖశాయనిక శిక్షపూర్వకము కాల్య
వేళఁ గార్తాంతిక ద్విజులగోష్ఠి
జామువోవ నమాత్య సామంత పూర్వకం
బరార్ఘ్యనస్థకాయస్థగోష్ఠి
దినమధ్యమమున మర్దనమల్ల పూర్వకం
బగు సూద సూపకృన్మృగయగోష్ఠి
యపరాహ్ణమున దేవతార్చనా పూర్వకం
కార్య ధర్మాధికృత్యములగోష్ఠి

పెద తిరుమలాచార్యుఁడు వివరించినట్లు రాజు-రాజనీతి నీరీతి నెరిగి ప్రవర్తింపవలెను.

"చెలుపరాని మనుష్యుఁ జెల్లదు కోపింపఁ బాఁడు చేఁజిక్కిన వదలఁ జనదు
విశ్వాసియగువాని విడచుట యవినీతి ద్రవ్యాపహారినిఁ దగదు మనుపఁ
బాపాత్ముఁడైనట్టి బంటునేలఁగరాదు ధర్మాత్ము నలఁగింపఁ దగవుగాదు
వరుస నారసి యధిపులు వారివారి గుణము తెలుఁగుచుఁ గార్యంబు
గొనఁగవలయు." (26)

"సముఁడైన శత్రుతో సంధిసేయుట గార్యమెక్కుడైనను గప్పమిడగవలయు
దఱిసల్పదశమైన దండెత్తఁగాఁదగుఁ దొలఁగి డాఁగినను బోఁద్రోలవలయు
నిద్దఱైనను భేదమెసఁగఁజేయుట యొప్పుఁగాక గర్గోలుగాఁ గదుమవలయు
జనకున్న శత్రువుశత్రురేచుట లెస్స యొండె ముట్టడిసేసి యుడుపవలయు.
రమణ నీరీతిఁ దలపోయ రాజనీతిఁ యిట్లు నడచినవిభుఁ
డిలయెల్ల నేలు" (27)

"తనకుఁగా మునుచెడ్డ జనులను రక్షించి యిలమేలుగోరిన హితులఁ బ్రోచి
వడిదోడు నవసినవారిని మన్నించి బడిఁదిరిగినవారిఁ బ్రభులఁ జేసి
మిగుల దూరులఁ వడ్డ మిత్రులఁ బోషించి సరినర్థమిచ్చిన సఖుల మనిచి
యచటనుండి సహాయుఁ గువారి బ్రతికించి ప్రాఁతవారలకు సంపదలొసంగి
యెల్లవారలు జయపెట్ట నేలుచుండి-వినుతికెక్కిన యధిపుఁడు ఘనుఁడు
దలఁప" (30)

రాజునకు అంతర్బహిశ్శత్రువు లనేకులుందురు. ప్రాలుమాలి యుండరాదు (చూ. ప. 46).

---

తే॥ భుక్తి మీఁద విదూషక పూర్వకము పు
రాణ కవిగోష్ఠి, చారపూర్వకము సంజ
జాము గాయకగోష్ఠి శిశన్ సుషుప్తి
పూర్వకము ప్రేయసీగోష్ఠి నొసఁగుఁ బతికి" (4.271)

ఇట్లు దుష్టుల నొక కంట కనిపెట్టుచు మంచిచెడుగులెఱిఁగి రాజు బలమును గూర్చుకొనవలెను.

"తనకాప్తులగువారి దండ మున్నఁగఁదగు నధికశూరుల దండులంపఁదగును
మఱిధనాఢ్యులకును మణివంబులీఁదగు హితులవాకిలిగావ నిడఁగఁవలయు
ఘనకార్యపరుల దుర్గములఁబెట్టఁగఁదగు నిపుణుల నుడిగల నిలుపఁదగును
సముచితజ్ఞుల బ్రాయసము బ్రాయుఁడనఁదగు మాయావులఁ దలార్లఁ
జేయఁదగును
మఱచి యల్పుంఁదానమ్మి మనుపవలదు-గరిమ ధరయెల్ల నేలెడు ఘనున
కెపుడు (55)

"అధముని మొఱయైన నాలకించుట యొప్పు వినకున్న నానాజ్ఞ విఫలమగును
మెట్టిచూచుట యొప్పుమితిలేని రాజ్యంబు పోకున్న నఱజడిఁబొందుచుండుఁ
దనసొమ్ము పలుమాఱుఁదలఁచి కన్గొనుటొప్పుఁ గాకున్నఁ దెలియదు
కలిమిలేమి
కలయుటొప్పును గులకాంతల వరుసతోమానినఁ జావంబుతోనె కలుఁగు
మత్తుఁడై యున్న కార్యంబు మట్టుపడదు-వలసి యెల్లమి సేయంగ
వలదుపతికి" (61)

ఇట్లు హితులగువారిని దరిఁజేర్చుకొని, మితిలేని రాజ్యంబు నేమరక పాలించుకొనవలెను. అందుకే.

"అడవిలోపలి రాజ్యమదియెల్ల మనరాదు బలువుండు పైకొన్న బాధసేయుఁ
గ్రూరవర్తనమైనఁ గూర్పియేలుటఁ దగుఁ బగలుగూడినవాఁడు భయమొనర్చు
గడినున్నవానితోఁ దొడరుచుండుట యొప్పనూరకుండిన నతండొత్తఁజూచుఁ
బలిమియు బంటులఁ బొలుఁ జూచుటమేలు గర్వింతు రిటువలెఁగాకయున్న
నృపులకేమఱియుండుట నీతిగాదు బహువిధంబుల నెచ్చరి బ్రదుకవలయు
(84)

అని హెచ్చరించుచున్నాఁడు కవి. రాజు మందిబలగమును గూర్చుకొనుటే కాదు అదనెఱిగి శౌర్యమునుగూడ ప్రదర్శించుచుండవలెను. (చూ. ప 29)

ఈ కవి యిందు వివరించిన రాజనీతిసారము నాఁటి రాచవారు

పాటించిన రాజనీతి క్రమమును తెల్లడించునదిగానె యున్నది. ఆముక్త మాల్యదలో రాయలు వివరించిన రాజనీతివిషయము లనేకము లిందలి నీతులతో సరిపోలుచున్నవి. [1].

అసలీ సామ్రాజ్య శరీరమునకుఁ బ్రాణతుల్యుఁడు సామ్రాట్టే. (చూ. ప. 81)

పెద తిరుమలాచార్యుఁడు వివరించినట్లు యథార్థముగ నా జగన్నాయకుఁడే కాలపురుషుఁడై యీ ప్రకృతిశరీరమును, రాజును ప్రాణముగాఁ జేసి, నియామకుఁడై పోషించుచున్నాఁడు.

కవి యీ శతకమునందు రాజనీతితోఁబాటు మంత్రిపదవి యందుండువారు పాటింపఁదగు నీతినిగూడ కొంత వివరించినాఁడు.

---

1. చూ. ఆముక్తమాల్యద-యామునప్రభు రాజనీతిఘట్టము

'వీపట్టున విసువక ర
ణాపరుఁడవుగమ్ము ప్రజలచక్కి : విపన్ను
ల్గాఁపెట్టిన విని తీర్పుము
కాపురుషుల మీఁద నిడకు కార్యభరంబుల్ (4-204)

దుర్గము లాప్తద్విజవర
వర్గమునకె యిమ్ము; దుర్గపత్తత్తిక
త్వర్గశ ధరాధిరాజ్య వి
నిర్గత సాధ్వసత పొడమ నిలుపకు కొలఁదిన్. (4-207)

మఱియు, 'దండపారుష్యమ్ము కొండెంబుననతక్క
మరిసంధికెడయాక మరలబడుట......
...వింత పుట్టినఁగనుగల్గి చింతసేయ
కుఁట, మాన్యుల పట్టున నొక్క చూపె
చూడకుంట, విహీనులఁగూడుకొంట
వ్యసనియైయుంట చలముంట వలదుపతికి,
మొదలగునవి— (4-252)

'హితబుద్ధియడుగు మహీశుండు గలిగినఁ దెలిపిబోధించు మంత్రియును గలుఁగు' నని యీ కవివాణి. మంత్రి రాజునకు హితముగా నిచ్చక మాడవలెనుగాని దిసంతడవరాదు. ఒదిగి వర్తిల్లవలెను గాని పంత మాడరాదు. ఓర్పుతో గొలువవలెనేగాని యూరక ధనమడిగి వేసట గొల్పఁజనదు. తలఁపులో మెలఁగి యుండవలెఁగాని యెరవెరవై యుండఁదగదు. మంత్రి యగువాఁడు కార్యక్రమమున నిట్లు తెలిసి నడచిన శుభములు తేటపడునని కవి వివరించెను. అంతేకాదు.

"ఉచితకార్యంబు రాజొకమాటి వినకున్న మఱియుఁజెప్పఁగఁదగు మాన్యన
కును
దగ వెంచ కేలిక తన్నుగోపించిన వెగ్గుపెట్టఁగరాదు హితున కెపుడు
తనవిభుండొకకానిపని తప్పి చేసిన నమరఁజేయఁగవలె నాప్తునకును
మఱచి యధిపతి మనసులోతనుతెల్ల నెచ్చరించఁగవలెనెనిష్టునకును
సచివునకుఁబోదు పతి కెన్నిచందములను హితవుగోరక నీతినేకగతుల'
(95)

నని మంత్రియగువాఁడు రాజు శ్రేయస్సునుగోరి మెలఁగ వలసిన విధానమును వివరించెను. ఇట్లు రాజునకు మంత్రి సత్తముఁడు తోడునీడై యున్నప్పు డాయిరువురు నేలు రాజ్యమున కెట్టిలోటు నుండదు.

సంఘనీతి :—రాజనీతితోఁబాటు పెద తిరుమలాచార్యుఁడు ఈ శతకమునం దంత కెక్కుడుగనే సంఘనీతినికూడ ప్రస్తరించెను. లోకానుభవ మపారముగా గడించిన యీ కవీశ్వరుని వాణిలో సంఘనీతి సహజతను సంతరించుకొన్నది. ఈ పట్టున నీతనియనుభవమును, ఉక్తిచమత్కారమును, భావపుష్టియు గణనీయములు. ఈతని నీతి సీసములు బంగారుజలపోసనములు. అందు నించిన సత్యసుందరములగు భాషణములు సహృదయుల కమృతాపోశనములు. అనుభవాల కూటపట్టులును, సాహిత్యపుతేనెతెట్టులును నగు సామెత లిందు పదితల కామెతలు. ఈ శతకమున కవీశ్వరుఁడు తడవని నీతియే లే దన వచ్చును. ఇందలి వైవిధ్యమును జూపుటకీ క్రింది యుదాహరణములు చాలును.

ఈ నీతులు సద్గుణనికరంబు లైనసరసులకేగాని మూఢులకు గావనినాఁడు కవి. అందుకే 'పరమ నాస్తికునకు భక్తివాదములేల పండున కేటికి సతులపొందు?—సరసునకుగాక వివరింప సద్గుణంబు లెందుఁ జూచిన మూఢుని కేలకలుగు ?' ననినాఁడు. ఇట్లు సరసుఁ డైనవాఁడు తనవారిని, లోకమువారిని నెఱిఁగి వారివారి ప్రవృత్తులను మంచి చెడుగులను దెలిసికొని ప్రవర్తిల్లవలెను. ఈక్రింది నీతు లరయఁ దగును.

"కులము వారల కియ్యకోలైన దిల్లాలు-వరుసతో రక్షించు వాఁడు తండ్రి
ప్రియముతోఁ బెన్నిచ్చి పెంచిన యడితల్లి తనకుఁదోడగు వాఁడు తమ్ముఁడరయ
నాపదఁ బెడఁబాపు నాతండు బంధుండు-వంచనసేయనివాఁడె భటుఁడు
మోక్షమార్గము చూపుముఖ్యుండె యాచార్యుఁడాత్మకు నిష్టమౌనతఁడు
సఖుఁడు
ఎఱిఁగి వీరలతోఁ బొందు నెఱపవలయు, గురుతెఱింగిన సద్వివేకులకునెల్ల" (6)

అట్టివారియెడనైనను లోకరీతి నెఱిగి వరుసఁదెలిసి యుండ వలెనట—ఏలన

"ప్రాణంబుతో లంకెపాటుది తనసతి-ధనబుణంబుల లంకె తనయుఁ డరయ
సుఖదుఃఖముల లంకె సొరిదిఁదల్లియుఁ దండ్రి పాలికి లంకెలు భ్రాతలెందు
భువి మానరక్షణమునకు లంకె మఱంది, మెలఁతనొసఁగ లంకె మేనమామ
మేలుమీఁదటి లంకె మిత్రవర్గంబెల్ల-హర్షంబునకు లంకె యల్లుఁడెపుడు
వారివారికిఁ దగినట్టి వరుసఁదెలిసి యరయ వలయును యజమానుఁ
డైనవాఁడు" (44)

అనినాఁడు. సాంసారిక జీవితమున భార్యాభర్త లొక జట్టు. వారి యానుకూల్యమే వారి కానందము గూర్చునది. అందుకే కవి యిట్లనుచున్నాఁడు.

[1]"పతికి మాఱాడక పలుమఱునేడ్వక యలుగక మిగులఁగయ్యాళిగాక
తమదిట్టకొనక కాంతాళించి గొణఁగక ముచ్చిలింపక పాపమునకుఁ జొఱక

1. ఈ పద్యమును గూర్చియే శ్రీకృష్ణదేవరాయల యాస్థానమున జరిగినట్లుగా తెనాలి రామలింగాదికవుల ప్రసక్తిగల కథనొకదానిని శ్రీగుర

పొరుగింటికేఁగక పరునాత్మఁదలఁపక కుపితగాక పరానుకూలగాక
యదువదాపక మర్మమవ్వలఁజెప్పక బొంకక నిద్దురపోతు గాక
కాపురము సేయుకామిని గలిగెనేనిఁ బలుకులేటికి పురుషుని భాగ్యమహిమ (32)

పురుషుఁడు నిశ్చింతఁగా జీవితము గడుపవలెనన్న నీ కవిదృష్టిలో ఆశలు వీడవలెను. ధనలోభ ముండరాదు. పరహింస మానవలెను. భోగ మొల్లరాదు. పరాధీనుఁడు కారాదు. ధరయందును మగువలందును మమతలు వీడవలెను. దీనికి భిన్నముగ చెడి యధోగతి పొలగువాఁ డెవఁడన—

"పలుమారు శపథముల్ పలికెడు నాతండు పూటలు వడునట్టి పోటుకాఁడు
కూటసాక్షులకును గుఱియైన యాతండు నట యింటివారితో నలుఁగువాఁడు
విభుని రహస్యముల్ వెలిపుచ్చునాతండు పరులచే లంచముల్ పట్టునతఁడు
కుడుచునింటికిఁ జేటుఁ గోరెడునాతండు మహి నుపకారంబు మఱచువాఁడు
కోరునకుఁబోయి బడిగంటఁ గూలుకరణిఁ బడు నధోగతి నిహమునఁ
బరము లేక" (13)

---

జాడ శ్రీరామమూర్తి పంతులుగారు తమ 'కవిజీవితము'లం దుదాహరించిరి.
(చూ.పు. 236-1955 ప్రకటితము)

ఈ పద్యముగల 'పాతివ్రత్య ప్రదర్శిని' యనునొక గ్రంథము నెవరో యొక కవి రాయల సభలోఁ జదివి వినిపింప వచ్చినాఁడట. అప్పుడు తెనాలి రామలింగఁడాగ్రంథమును, తద్రచనను హేళన చేయుచు పై పద్యమునకు వికటార్థమును గల్పించి చెప్పినాఁడట. సభలోనివారాతని హాస్యమునకు నవ్వుకొనినను ప్రభువుమాత్ర మాకవిని యథోచితముగ సత్కరించి పంపెనట! ఇది యాకథ.

కాని యాకథలోని తద్గ్రంథకర్త యెవరో తెలియదు. 'పాతివ్రత్య ప్రదర్శిని'యనుగ్రంథము మాటయేమో గాని యందలిదిగా నుదాహరింపఁబడిన 'పతికి మాతాడక' యను పద్యము మాత్రము పెదతిరుమలాచార్యుని నీతిసీస శతకము నందలిదే కనుక రామలింగనిచేత తిరస్కృతుఁడై రాయలచేత స్వల్పసత్కారమునకు మాత్రమే నోచుకొనిన ఆయజ్ఞాతకవి యీ పెద తిరుమలాచార్యుఁడే కాఁదగును.

సప్తవ్యసనములను వాని దుష్ఫలితములను గవి యిట్లు సోదాహరణముగ వివరించెను.

"వరకాంతకై సింహబలుఁడట్లు మృతుండయ్యె రాజ్యలోభమున గౌరవుఁడు
వొలిసెఁ
ఐరసోక్తులను శిశుపాలుండు హతుఁడయ్యె మహిని జూదమున ధర్మజుఁడు
నొగిలె
నలపాండురాజు వేటాడశాపమునొందె-మనురావణుఁడు చలమ్మునను సమసె
గ్రూరదండంబునఁ గూలెను వేనుండు-జడిసెఁ బానమున రాక్షస గురుండు
ఘనవివేకులు వీరల గతులు దెలిసి-వ్యసనములుమాని నడువంగవలయు నిలను"
(17)

మానవుఁడు జీవితకాలమున దీపముండగనే యిల్లు చక్కఁబెట్టుకొనవలెను. లేదేని వ్యర్థుఁడగును (చూ. ప. 22) లౌకిక జీవితమున మానవుఁడు సుఖభోగములకై పడరానిపాటులు పడుచుండును. కాని వ్యర్థము. అతఁడు దేనినిగూర్చి చింతించిన నన్నివిధముల మేలో దానినిగూర్చి కాక యితరమునుగూర్చి ప్రాకులాడుట ఓడ విడిచి వదరిడుట. ఏలన.-

"భుజియించినప్పుడే పోవునాహారముల్ పూసిన గంధంబు పొల్లు రాలు...
—గలుగనేర్చునె నిత్యసౌఖ్యంబులిందు-నిన్ను గొలిచిన సుఖములు నిలుచుఁ
గాక" (54)

అనినాడు కవి.

భగవద్భక్తులే సుఖశాంతుల కాలవాలము. ఇహపరసుఖములకు శరణాగతియే మూలము. కాలగతులు విచిత్రములుగ నుండును. కావున దానికై కలఁగఁబనిలేదు. విధిని తప్పింప నెవరితరమునుగాదు కావున ధైర్యమున నెదురొడ్డి ధర్మముతో జీవించుటయే మార్గము. ఇత్యాది బోధలిందెన్నేని గలవు. సామెతలు లోకోక్తులు నిందు కోకొల్లలు. అట్టి సత్యసూక్తుల కిందలి పంక్తులు మచ్చునకు మఱి కొన్ని చూడఁదగును.

1) "ఇల దొమ్మరిది జాతిహీనత నెంచదు పూటకూళ్లది పుణ్యమునకుఁ జొరదు
వరగృహవాసిని పరనిందఁ గోరదు బడి సంతబసివి యెవ్వరిదిగాదు- (20)

2) "శక్తికిఁ దగని దుర్జనము సేయఁగ రాదు చదువక తర్కింపఁ దగదు సభల
సేమంగుతో వల దేలాటమాడంగ నెనయని బాంధవం బెపుడు వలవ
దెంతమాత్రంబు దనశక్తి యంతమాత్ర
మరసి యొనరించె నాతండె యర్హుఁ డెందు" (35)

3) ఇల వేటిదరిద్రమాని కెప్పుడుఁ జలనంబు నరనాథు పొరుగిల్లు నమ్మరాదు
పాముతోనటు పొందు పాటింపఁగా రాదు దుర్జనసంగతి దూఱుముట్టుఁ
బరికింప నోడపైఁ బ్రదుకు సందేహంబు ఘనునితో సరసంబు గాదు జరుప
నరసి కానివి వర్జించి యైనపనుల
నరుఁడు వర్ధిల్లవలయు నున్నతివహించి" (38)

4) ఏమఁగులావెంత యిల మావటీఁడెంత తిమిరంబు బలిమెంత దీపమెంత
ఘనసముద్రం బెంత కర్ణధారకుఁడెంత బహుకాననం బెంత పరశు వెంత
పాతెడు నీరెంత పర్వతం బది యెంత హారుఁడెంత మృదులపుష్పాస్త్రమెంత
యెప్పటికి దొడ్డగొంచెంబు లెంచరాదు
నడచు నిటువంటివెల్ల నీనాటకములు. (56)

5) వేలెన్ని బుట్టినఁ బెద్దగా బ్రదుకవు చీమలు వొడమి సహించిపోవు
చెదలు పుట్టలు వెట్టి శీఘ్రమె యడగును మిడతలు వైశమే మించిమడియు
బరఁగ నీరీతి దుర్జనుల్ ప్రబలులైనఁ
బరులఁ బీడించి చెడుదురు పాపములను (58)

6) మలసి యేకేటఁ బల్మఱును గూనలఁ బెట్టుఁ గంటిమా ధరఁ బిల్లి కదుపు నొకటి
పాము గ్రుడ్లం బెట్టుఁ బదియు నిర్వదియును బ్రదికెనా భూమిపైఁ దౌఱులగుచు- (59)

7) పదుగురాడిన మాట పాటియై ధరఁ జెల్లు నొక్కఁడాడిన మాట యెక్కదెందు
నుటకయుండినవాని కూరెల్లనోపదు నిజము ముందరఁ గల్ల నిలువదెపుడు
పుడమిలోకులు మెచ్చంగ నడవవలయుఁ
బలము సాధింపఁ జెల్లదు సభలలోన. (63)

8) దుష్టు మూర్ఖునిదెస దుమ్మెంత చల్లినఁ దనపైన పడుఁగాక దానికేమి
కొండతోఁదగరు డీకొని యెంతఁదాకినఁ దలవ్రక్కలగుగాక దానికేమి
యెదురుసత్త్వము దనసత్త్వ మెఱుఁగలేక
పోరువాఁడెందు నవివేకబుద్ధి యంద్రు- (66)

9) ఎలమిఁబతివ్రత నెవ్వఁడుగోరినఁ జెరఁటుననే నిప్పుసీమలోన
ఘన జితేంద్రియుని నేకాంత దగ్గఱినను గలఁగునే జలరాశి కప్పచేత
యెందులను ధార్మికులకుఁ గీడేల కలుగు
నిజ గుణంబులు బలిమిమై నిలుచుఁగాక. (68)

10) జీలువు పెరిగిన మాలెకంబముగాదు గొడ్డుబెంచినఁ బాఁడిగోవుగాదు
ధరఁబంచితం బెంత ద్రచ్చిన నేయిగా దెండమావులును నీళ్లెపుడుగావు
ఎనుఁబోతు ఘనమైనయెద్దుతో సరిగాదు కడునశుద్ధపు వాగు గంగగాదు
బ్రబలి చూపట్టునవి యెల్లఁబనికిరావు
ధీరుఁడగు నాతఁడొక్కండె వీరుఁడరయ. (70)

11) గోడపై సున్నంబు గోఁకినఁ బనికిరా దొడలిపై వాసన యూర్పరాదు
చేఁబట్టినయట్టి బిడ్డు లెక్కకురాదు కోఁకఁ బెట్టిన గంజి కూర్పరాదు. (71)

12) గాడిద యెఱుఁగదు గంధంబు వాసనలే దూరబందికి లింకొంత
వాడకోడికి నాదివారంబు వలవదు కోఁతికి మణి తాళిగోణమేల
వరుసతోఁ గుక్క దేవరలోన మెఱుఁగదు మొసలికి బడిసెంబు మొదలలేదు
సహజమూఢులు నిటువంటి జాడవారె
వారి గుణములు దిద్దంగ వలవ దెపుడు. (74)

ఇట్లే యింకను—

'తొలకరివానలు దొరతనం బెంచునే తగిలి బయటనున్నఁ దడుపుఁగాక'
'కోరి పవ్వులనున్న కొండలు మన్నన చేరి డగ్గరినను జెట్టు రాళ్లు'
'అపవిత్రమగునట్టి యన్నంబుగొనుకంటె నడవిలోఁదినుబలుసాకు లెస్స'
'కల్పవృక్షము నెంచి కలివిచెట్టెంచుట తలమెఱుంగనివారి తగవుగాక'
'వేగిరించంగ వలవదు విమలమతికి-సకలమున కోర్చియుండిన సౌఖ్యమొదవు'

మున్నగున వెన్నేని యుదాహరింపవచ్చును. ఇట్టివేకాక ఈ శతకమున గురువు, యోగి, శిష్యుఁడు, మతము, మూఢిమి మున్నగు విషయములనుగూర్చి గూడ వివరణమున్నది.

గురు వెవరన—

సత్సంప్రదాయుఁడై శాస్త్రపారీణుఁడై యాగమజ్ఞుండైన యతఁడు గురుఁడు
పరమదయాళుఁడై పాపనిర్ముక్తుఁడై యాచారవంతుఁడౌ నతఁడు గురుఁడు
భూరిసుజ్ఞానియై బోధింప శక్తుఁడై యతిశాంతచిత్తుఁడౌ నతఁడు గురుఁడు
కడఁ దపోనిష్ఠుఁడై ఘనమంత్రసిద్ధుఁడై యధ్యాత్మవేత్తయౌ నతఁడు గురుఁడు
తెలిసి యిటువంటి గురుఁ జేరి వెలయవలయు
సుజనులగువార లీదేఱఁ జూచి రేని (92)

ఇట్టి శిష్యుఁ డెవరన—

"అర్థంబు దేహంబు నాచార్యునిసొమ్మని యానాజ్ఞ దప్పక యాస్థ గలిగి
తగిన శుశ్రూషకుఁ దను వలవడఁ జేసి మఱిగల్గి యెప్రొద్దు మఱవు విడచి
యుపదేశమిచ్చిన ట్లూహలఁ దలపోసి యాహార నిద్రల కాస వడక
వేసరకాత్మలో విశ్వాసమెడలక హరిభక్తి గురుభక్తి నధికుఁడగుచు
నున్న యాతండె శిష్యుఁడీ యుర్విమీఁద.

ఈ కవీశ్వరుని వర్ణనము ముదిమిని గూర్చినది మనోజ్ఞము.

"ముదిమి తీగలువాఱి ముంచినకైవడి కడుమేన నరములు గానిపించుఁ
దనమేనుఁ గనుఁగొని తానె నవ్వెడుక్రియ మీసలు గడ్డంబు మిగులనరయుఁ
బంచేంద్రియములకుఁ బరఁగ నోడితినని వెన్నుచూపిన పోల్కి వీపు వంగు
నుప్పతిల్లినమద ముబ్బుదీసినరీతి నేర్పడు బడుపులై యొప్పులెల్ల
నిట్టి జరచేతఁ జిక్కియు పెద్దనరుఁడు
మనసు దెలియక భోగించు మనసుపెట్టి. (93)

ఈతని దృష్టిలో మతమన నెట్టిదన—

"దైవంబు గురుఁడును ధరఁ గలరని నమ్మి తలపోసి మమత యుత్తమమతంబు
కలదు వేదము ముక్తిగలదు పుణ్యుల కని మఱి భక్తి సేయుటే మంచిమతము
యజ్ఞాదికర్మంబు లఖిలప్రపంచంబు సత్యంబులనుట నిశ్చలమతంబు
హరి మాయచేఁ జిక్కఁ డాతఁడె సర్వజ్ఞుఁ డని భజియించుట యాదిమతము
చదివి తెలిసిన పెద్దల సమ్ముఖమున
నెఱుఁగు వారికి సఫలమౌ నీమతంబు. (94)

ఇట్లీశతక మాద్యంతము రమణీయమై నీతులకు నిలయమై పదిలమైన పరమపదమునకు సోపానపదమై భద్రమై భాసిల్లుచున్నది. శతకాంతమున సంప్రదాయము ననుసరించి అంకితాంక సీసమున 'మాధవ గోవింద మధుసూదనాచ్యుత వామన ప్రద్యుమ్న వాసుదే' వాది దివ్యనామములను జపించి— "తాళ్ళపాక—

గీ॥ అన్నమాచార్య సుత తిమ్మయాహ్వయుండఁ
బ్రణుతి చేసితిఁ జేకొమ్ము పద్యశతము
కలితలక్ష్మీశ సర్వజగన్ని వేశ
విమలరవికోటిసంకాశ వేంకటేశ!

అని చెప్పుకొనినాఁడు.

*శ్రీకృష్ణ శతకము*— (లేదా రేఫ ఱకార నిర్ణయము). కర్త పెదతిరుమలాచార్యుఁడు—లక్ష్యములగు నీతని శతకములలో నిది మూఁడవది. 'కృష్ణా!' అనుమకుటముతో నాసాంతము కందపద్యములతో నున్న దీగ్రంథము. ఇది ప్రాయికముగా శతకమర్యాదతోనున్న యొకానొక లక్షణ గ్రంథము. దీనికే 'రేఫఱకారనిర్ణయ' మనియు నామాంతరము. లక్షణ వివరణమునకు శతకప్రక్రియ నాలంబనముగాఁ గొనిన తెలుఁగులక్షణశతకముల కన్నిటికిని నిదియే మూలమనఁదగినది. కస్తూరిరంగని సాంబనిఘంటువు మున్నగురచన లీకోవకుఁ జెందిన శతకములే. ఇందు మొత్తము 108 పద్యము లున్నవి. వానిలో 107 కందములు. తుది పద్యము గీతము. వీనిలో కృత్యాద్యంత పద్యములై దారు పోఁగా మిగిలినవన్నియు లక్షణవివరణమునకే వినియుక్తములైనవి. వీనిలో రేఫఱకారములని తెలుఁగు భాషలో వెలయు రెండు విధములగు రకారములనుగూర్చి- యనఁగా సాధురేఫ శకటరేఫములను గూర్చిన వివరణము, పూర్వకవుల ప్రయోగములననుసరించి పదముల పట్టికతోసహా అక్షరవర్ణక్రమమున నీయఁబడినది. ప్రయోగములందు సాధురేఫములే గల పదములపట్టీ వర్ణక్రమము ననుసరించి 50 కంద పద్యములందును; అట్లే శకటరేఫ ప్రయోగములే గల పదముల పట్టీ మఱి 52 కందములందును, నీలక్షణశతకకర్త పొందుపఱచినాఁడు.

గ్రంథాదియందే కవివాక్యముగా నిట్లున్నది. 'శాళ్ళపాకయన్నమాచార్యుల కుమారుండు తిరుమలయ్యంగారు కవిత్రయము మొదలైన పూర్వపుంగవీశ్వరుల ప్రబంధములలోని రేఫఱకారములేర్పఱచి లక్షణ గ్రంథముగా నానతిచ్చిన రేఫఱకారముల పద్యాలు'—అని.

తెలుఁగులాక్షణికులలో నిట్టి నిర్ణయమును జేసినవారిలో నీతఁడే మొట్టమొదటివాఁడు. ఈతని తరువాత నీ విషయమునుగూర్చి చర్చించినవారు పలువురు లాక్షణికులుగలరు.[1] కానివారికెల్ల నీతఁడే మార్గదర్శకుఁడు. అందుకే సుప్రసిద్ధ లాక్షణికుఁడగు నప్పకవి (క్రీ॥ శ॥ 1656) తన గ్రంథమున రేఫఱకార సీసమాలికలో నీతనిఁ బ్రత్యేకముగాఁ బేర్కొనినాఁడు.[2]

ఈ గ్రంథము నీకవి ప్రజ్ఞాపరిణతినందిన పెద్దతనమున బహుగ్రంథ పరిశీలనానంతరము రేఫఱకారములను వేర్పఱచి వ్రాసినట్లుగా

---

1 శాళ్ళపాక పెద తిరుమలాచార్యుని 'రేఫఱకార పద్యాల' తరువాత నా విషయమై పరిశీలించినవారిలో ముఖ్యులు.

| | | |
|---|---|---|
| అప్పకవి | — | అప్పకవీయము 2 ఆశ్వాసము. |
| కూచిమంచి తిమ్మకవి | — | సర్వలక్షణ సారసంగ్రహము. 3 ఆ. |
| బద్దెపూఁడి భద్రన్న | — | రేఫఱకార శబ్దముల పద్యాలు |
| గణపవరపు వేంకటకవి | — | రేఫనిర్ణయ తారావళి |
| ఓగిరాల రంగనాథకవి | — | ద్విరేఫ వర్ణదర్పణము |
| భరతము లక్ష్మీపతి | — | శకటరేఫ నిర్ణయము |
| అడిదము సూరకవి | — | కవిసంశయ విచ్ఛేదము |

(రెండవ భాగము)

2. చూ. అప్పకవీయము (2-193)

"ఆదికవీంద్రకావ్యములెల్ల శోధించి క్రమత హ్రస్వములు దీర్ఘములునైన
యచ్చుల మీఁదను హల్లుల మీఁదఁను గలుగు రేఫఱకారములు వచింతుఁ
దాళ్ళపాకాన్వయోదధిపూర్ణధవళదీధితి పెదతిరుమలదేశికుండు
మొదలైనవారలు మునుపు రచించిన యవియెల్లఁ జాలవాయనఁగ వలదు"—

తెలియుచున్నది. గ్రంథాంతమందలి యీ గీతపద్యమిందులకుఁ బ్రమాణము.[1]

గీ॥ క్షీరనీర విభేదంబు చేసినట్లు
ధరణి రేఫ ఱకారముల్ తాళ్ళపాక
తిరుమలార్యుండు వేర్వఱఁ దేట పఱచె
నుచితమిదిగాదె పరమహంసోత్తమునకు॥ (108)

ఇందు తిరుమలయ్య తనను గూర్చి పరమహంసోత్తముఁడని చమత్కారముగ చెప్పుకొనినాఁడు. ఇట్టి గ్రంథరచనా పరిశ్రమమును గూర్చి చెప్పుకొనుచు తరువాత గణపవరపు వేంకటకవి కూడ నిట్లే "వ్రాసి కవులకు నుపకృతిచేసినాఁడ పరమహంస పాల్కిళ్లు నేర్పఱచు నటులఁ, బంకజాతాత్తనికాశ వేంకటేశ" అని యనుకొనినాఁడు. మరి తరువాతివారికి తిరుమలాచార్యుఁడే మార్గదర్శకుఁడు కదా !

ఈ గ్రంథరచనా విషయమునఁ దిరుమలాచార్యుఁడు తన పరిశ్రమమే పరిపూర్ణమని చెప్పుకొనక 'మఱి కలిగెనేనిఁ దెలియుఁడు తఱచెందును లేవు కృతులఁ దలఁపఁగఁ గృపా'అని వినయమునుఁ జాటుకొనినాఁడు. గ్రంథారంభమందలి యీ పద్యములు చూడఁదగును.

కం॥ శ్రీ వేంకటేశ నీకుం గావించెద నంకితంబుగా ఱారేఫల్
వావిరినేర్పఱచినకృతి శ్రీ వనితానాథ రామ చేకొను కృష్ణా!(1)

---

1 'పరమహంసోత్తముఁ డనుటచేత నీతఁడు సన్న్యాసియై యుండి దీనిని రచించెనని విశదమగుచున్నది. ఇది మిక్కిలి వింతయైన విషయము. దీనిచే నాతని కాంధ్రలక్షణవిషయమునఁగల గౌరవము సువ్యక్తమగుచున్నది.' అని యీ విషయమై శ్రీ వజ్ఝల చిన సీతారామశాస్త్రిగారు తమ వైయాకరణ పారిజాతము (పు. 441) న వ్రాసియున్నారు.

పెద తిరుమలయ్య తుదిదినములలో సన్న్యాసాశ్రమము ను స్వీకరించి నట్లే యున్నాఁడు. అతని భగవద్గీత వ్యాఖ్యానమున వ్యాఖ్యాతకుఁ గల వేంకటపతియోగినామము ఆ విషయమును సూచించునదిగా నున్నదన వచ్చును.

కం॥ అచ్చులు హల్లులు వరుసనె వచ్చిన రేఫలును ఱాలువర్జించెద మున్
మెచ్చఁగ నాదికవీశ్వరు లచ్చుపడంగ కృతులఁజెప్పినటువలెఁ గృష్ణా! (2)

ఇట్లు ప్రామాణికులగు నాదికవీశ్వరుల ప్రయోగముల ననుసరించి రేఫఱకార ప్రయోగములు విడివిడిగా 'అచ్చులు హల్లులు వరుసన' గూర్పఁబడియుండిన కారణమునను నట్టి యత్నమున తిరుమలాచార్యుని కృతియే తొట్రటిదగుటచేతను మనకీ గ్రంథము నేఁడు ప్రామాణికముగాఁగొనఁదగియున్నది. గ్రంథమున నితఁడు పదజాలమును వర్ణక్రమమున బొందుపఱచుటతోఁబాటు పద్యములందెడనెడ నాయాపదముల కర్థవిశేషములను గూడ విశదీకరించినాఁడు. గ్రంథారంభముననే రేఫఱకారములతత్త్వము నించుకగా కవి యిట్లు వివరించినాఁడు.

కం॥ ఇచ్చిరి తెచ్చిరి యనియెడి
యచ్చతెమంగులఁ గ్రియాపదాంతంబులపై
వచ్చినవి యెల్ల రేఫలు
రచ్చల జడ్డలవి ఱాలరచనలు కృష్ణా!.

ఇల ఘోషాక్షరములపై
గలుగవు తెలుఁగునను ఱాలు కడఁగును రేఫల్
తలఁపగ సంస్కృత పదములఁ
గలిగినవియు రేఫలయ్యెఁ గనుఁగొనఁ గృష్ణా!

ఎఱుక యెరవనుట మొదలగు
మెఱసెడి యెత్వములు నిత్యములు తెలుఁగున నే
ర్పఱచినవి యెల్ల నచ్చులు
పెఱిగి యకారములుగావు పెంపుగఁ గృష్ణా! (4,3,5)

పైనుదాహరింపఁబడిన పద్యములలో 'ఇల ఘోషాక్షరములపై' అను పద్యము సంస్కారము నపేక్షించుచున్నదని శ్రీవజ్ఝలవారు వ్రాసిన వాక్యములిట గుర్తింపఁదగినవి.[1] "ఈ పద్యములవెంబడినిగల

1. చూ. వైయాకరణ పారిజాతము. పుటలు 399-400.

తిరుమలయ్యగారి రేఫఅకార పద్యములలో ఘోషాతురములనయి, ననఁగా నచ్చులపైని గజడదబలపైని, నమలపైని శకటములుగల శబ్దములు పెక్కు చెప్పఁబడియుండుటచేత నీరెండవ పద్యము ప్రమాద బహుళమనక తప్పదు. పరిశీలింపఁగా నిది యీ క్రిందిరీతి నుండనోపు ననఁదగును.

కం॥ 'ఇల ఘోషాతురములపై
గలుగవు తెలుఁగునను జాఁకడగును రేఫల్
తలఁపఁగ సంస్కృత భవములఁ
గలిగినవియు రేఫంగును గనుఁగొన కృష్ణా!

పయి పద్యములోని భాషా శబ్దము గీర్వాణ పర్యాయమని గ్రహింపక లేఖకాదులు ఘోషాతురములని నవరించినట్లగుపడుచున్నది. అప్పకవీయములోని యీ క్రింది పద్యమునరయఁగా నాతఁడు పయి తిరుమలయ్యగారి పద్యములో 'ఘోషాతురము' లను పాఠమునే చూచియున్నట్లు తోచుచున్నది.

సీ॥ చనిరి కాంచిరి చేసిరియొక రనియెను
నని మొదలైన క్రియాపదములు
తుదలను సంస్కృత పదములందును దద్భ
వములయందును అకారములు లేవు."—

తిరుమలాచార్యుఁడే ఉదాహరించిన అకారపద్య ప్రయోగములను బట్టియు, అప్పకవివాక్యము ననునరించియు శ్రీ వజ్ఝలవారి సంస్కరణ మెంతో తగియున్నది.

పెదతిరుమలాచార్యుఁడే గ్రంథరచనాప్రణాళికలో నారంభమునసే 'క్రియాపదాంతంబుల' ప్రసక్తినిఁదెచ్చి వివరించిన తీరునుబట్టి యాతఁడు, 'క్రియాంతేచాన్యవర్ణేచలఘు రేఫాః ప్రకీర్తితాః । ద్వివిధా దిదుతశ్చస్యు రయవౌచకగౌతథా—" ఇత్యాదిగానున్న అధర్వణ కారికల ననుసరించి యుండునని శ్రీ వజ్ఝలవారే యిట్లు వ్రాసియున్నారు.

"అధర్వణ కారికలలోని 'క్రియాంత' ఇత్యాది ప్రకృతసూత్రముల ఛాయ తరువాతి లక్షణగ్రంథములు పెక్కిటిలోనగపడుచున్నది. తాళ్ళపాకము పెద తిరుమలయ్యయు, నప్పకవియు నీ యధర్వణ సూత్రములను వివరింపకున్నను వారి రేఫఱకారముల పట్టికలీ 'క్రియాంత' ఇత్యాది సూత్రములలోఁ జేర్కొనఁబడిన వరుసనే వెలయుచున్నవి. పాఠకులకు సుగ్రహాముగ నుండుటకై రేఫఱకారయుత పదముల నకారాది వర్ణక్రమానుసారముగఁ జేర్కొనుటలో శబ్దరత్నాకరాది కోశములవలెఁగాక వీనియందు "ద్వివిధావిదుత" ఇత్యాది ప్రకృత సూత్రపుఁ బద్ధతియే యవలంబింపఁ బడియున్నది. విస్తరభీతి నొకటి రెండుదాహరణలను మాత్రమే చూపుచున్నాను. 'అందఱు' అనుశబ్దము శబ్దరత్నాకరాదులలోవలె వీనియం దకారాదిశబ్దములలోఁ జూపఁబడలేదు. దకారపూర్వక శకట పదములలోఁ జూపఁబడెను. ఇట్లే 'ఏమఱు' అనునది 'ఏకారా'ది శబ్దములలోఁ జూపఁబడలేదు. ఇంక మకారపూర్వక శబ్దములలోఁ జూపఁబడెను." (చూ. వైయాకరణ పారిజాతము పు. ౪౪౬)

ఈరీతిని ప్రాచీనలక్షణానుమతంబున పెదతిరుమలాచార్యుఁడు రేఫఱకార పద్యములను వర్ణక్రమమున వివరించెను. ఈ గ్రంథమం దుదాహృతములైన రేఫఱకారపదములను ఆతని పద్యములలోనున్న క్రమముననే యిట పొందుపరచుచున్నాఁడను. ఆపదముల పట్టిక నీ వ్యాసానుబంధమునఁ జూడఁదగును. వానిలో గొన్ని పదముల విషయమున (నేఁటికి మనకు లభ్యములగు ప్రయోగముల ననుసరించి) కొంతచర్చ కెడమున్నది.[1]

ఈ క్రింది పదములు తిలకింపఁ దగును.

*1. తరిత్రాడు :*

తరిత్రాడు తరువ తరమిడి
తిరుగుట తిరియుటయు' (రేఫ. కార. ని-౨౬)

---

1. చూ. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారి ఉదాహరణ వాఙ్మయ చరిత్రము. పు. 111.

పెద తిరుమలాచార్యుఁ డిందలి 'తరి|తాడు-తరువ' పదములలోనిది సాధురేఫగా పేర్కొనినాఁడు. పూర్వకవిప్రయోగముల ననుసరించి తాళ్ళపాకవారి ప్రయోగము లన్నియు నిట్లేయున్నవి. ఉదాహరణకు చూ.

తరిత్రాళ్లు - ఉరితాళ్లు (అష్టమహిషీ-పు-41)

కాని త్రిపురాంతకోదాహరణమందు

'మఱితఱుఁ గటాక్షజితమారునందు
తఱిత్రాడు పొన్నొగు నుదారునందు'

అని శకటరేఫగా ప్రయోగము గలదు.

*2.* కొరప్రాణములు :

'కొరప్రాణము లనఁగ రేఫగుణములు కృష్ణా!' అని కొరప్రాణములలోని 'ర'సాధురేఫగా పెదతిరుమలయ్య పేర్కొనినాఁడు. అప్పకవియు నీతని మార్గమునే యనుసరించి 'కురియుట తొలుకరి కొరఁ ప్రాణములు' అని ప్రయోగమును చూపినాఁడు. కాని ఆదికవీశ్వరుల కృతులలో నీ పదమున సాధురేఫగల నిర్ధారక ప్రయోగములు కానరాకున్నవి. దానికి భిన్నము గా రంగనాథ రామాయణమునందు

'అఱిమి కొందఱు చచ్చిరావవక్షోణి
కొఱప్రాణముల తోడఁ గొందఱుపడిరి' (పు. 77)

అని శకటరేఫగల నిర్ధారక ప్రయోగమున్నది. దీనినిబట్టియే కావచ్చును, తరువాతి కవులందఱు నీ పదమును శకటరేఫ తోడనే ప్రయోగించిరి. ఏమైనను దీనినిఁబట్టి యీపదమునకు ద్వైరూప్యము ప్రసిద్ధమని తలఁప వలసియున్నది.

*3.* ఉఱుము :

'పదమూఁటి మెట్టి యుఱుముచు నేనట్లుఱక' (రేఫఱకార-6) అని యీ పదమును పూర్వకవిప్రయోగముల ననుసరించి తాళ్ళపాకవారు శకటరేఫతోడనే పేర్కొనిరి. కాని అప్పకవిమాత్ర మేలనో,

'కలన బెట్టురుముట గద్దికసేయుట' అని సాధురేఫతోడనే పేర్కొనెను.

ఇట్లే మఱికొన్ని. తిరుమలాచార్యుని మతమున 'నెఱియ' 'చెఱుచు', 'తెఱఁగు' మున్నగు పదములు శకటరేఫతోఁగూడినవే. అప్పకవి మతమున వీనికి ద్వైరూప్యమున్నది. కాని 'పఱిగొను-వరి మార్చు' మున్నగు పదముల విషయమున నిరువురును ద్వైరూప్య మంగీకరించిరి. దీనినిబట్టి పెదతిరుమలాచార్యుని కాలముననే యే పద ములకు ద్వైరూప్యము ప్రసిద్ధమో వేనికి కాదో, తరువాత అప్పకవి కాలమున కాయాపదములకు ద్వైరూప్యమెట్లు సిద్ధించినదో పూర్వకవి ప్రయోగముల ననుసరించి భాషావిషయకమగు పరిశీలనజరుపుట కిట్టి లక్షణగ్రంథము లెంతేని యుపకరించును. అంతేకాదు. దీనివలన నేఁడు మన నిఘంటువులకెక్కని కొన్నిపదప్రయోగములను గూర్చిన నూ... షాంశములు కూడ వెల్లడియగు చున్నవి. మచ్చున కి... ...లు పరికింపనగును.

1 అరగలి : 'అరగలియనవెలితి' (రే. ని. 6)

= వెలితి; లోటు ఈ పదమునకు 'సందేహము' అని శబ్దరత్నా కరమునం దర్థమీయఁబడినది.

'హరుఁడు భక్తుల మనం బరయఁగఁదలఁచి
యరుదైన వస్తువు లరుదెంచి వేఁడ
నరగలి గొనకిత్తు రల్ల భక్తులను - (బసవపు. 4 ఆ)

ఇచ్చటను 'సందేహింప' కనుట కన్న వెలితి—తక్కువ గాకుండ నిత్తురనుటయే బాగుండునేమో!

2 గరువు = గర్వము. 'గరువనగర్వము' (రే. ని. 22)

ఈ పదమునకు శ.ర లో చెంప, గులకఱాలచే గట్టియైనది అను నర్థములు మాత్రమే గలవు.

3 కొఱలుట = పూర్ణమగుట 'కొఱలుటయనఁబూర్ణమగుట' (రే.ని.13)

ఈ పదమునకు ఉండు, పొందు, ప్రకాశించు అనునర్థములు శ.ర లో నీయఁబడినవి.

'శాంతిఁగొలిపి విప్రకలము ద్వైవస్వరూపంబగుట
మనంబునందు దృఢంబుగనిల్పి' (శార-అను. 5)

ఇచ్చట 'పొంది' యనుటకన్న 'నిండి' అనునర్థమె పొసఁగును-

4 చఱిగొను = చలముగొను. 'చఱిగొనెననఁజలమగు' (రే. ని-20)

ఈ యర్థమున నీ పదము నిఘంటువునందు కానరాదు

5 నిఱిగొను = నిండు.

'నిఱిగొనియె ననఁగ నిండుట' (రే ని. 30)

ఈ యర్థమున నీ పదము నిఘంటువునందు కానరాదు.

6 నెఱకులు = అమ్ములు. 'నెఱకులె యమ్ములు' (రే. ని. 31)

'నెఱను' బహువచనరూపమగు నెఱఁకులు - (ఆయములు) అను పదమున్నదేకాని 'అమ్ములు' అను నర్థముకల 'నెఱకులు' అను పదము నిఘంటువునందు కానరాదు.

7 నెఱువు = అగ్ని, 'నెఱు పనలము' (రే. ని. 31)

ఇది ద్రావిడపదము. అగ్నియను నీ యర్థమున నీ పదము మన నిఘంటువులందు కానరాదు.

ఇట్టి గ్రంథము పదములందలి రేఫఱకారములను నిర్ధారించుటతోఁబాటు వీనిలోఁగొన్నిటికి క్రొత్తయర్థములను గూడ కూర్చిపెట్టి భాషావిషయకమగు పరిశీలన జరుపువారి కెంతయో యుపకరించుచున్నది. ఈ కృతి శ్రీ వేంకటేశ్వరస్వామివారి కంకితమీయఁబడినది.

## అనుబంధము

### లఘురేఫలు గల పదముల పట్టిక

| | | |
|---|---|---|
| అరి = అప్పనము | అరగన్ను | అరసి |
| అరిగె | అరిది | అరు = చల్లారగ |
| అరదము | అరవాయి | కన్నారగ |
| అరయ | అరగలి = వెలితి | అరెండు |

అరంగాఁగినపాలు
అరఁగూరె
ఆరెకులు = తలవరులు
ఆరాటము = అరటము
అరయ = పొంగారు, ఆవలింపారు
ఇర = నెలవు
ఇరువురు
ఇరువది
ఇరవు
ఇరవారంగా
ఇరుగెలఁకులు
ఒల్లఁబోయిరి
ఈరికలు
ఈరసము
ఈరెలుగు
ఈరె = ఈయరె
ఈరు = మీరు
ఈరేడు
ఉరులు
ఉరుంద్రోయు
ఉరవడి
ఉరవణించు = ఒత్తుట
ఉరియగ
ఉరియాడుట
ఉరుకింప
ఊరక
ఊరార్చుట = దుఃఖ ముడుపుట
ఊరు = గ్రామనామము

ఊరట
ఎరగలి = చిచ్చు
ఎరియు
ఎరగా = ఆహారముగా
ఎరవు
ఏరికి
ఒరులు
ఒరయు
ఒరసిన
ఒండొరులు
ఓరసేయు
ఓరరేక
ఓరీ
ఔరా
కరము
కరణి
కరవు
కరఁగు
కరిననము = కృషి
ఒక్కరుఁడు
కోరు = అప్పనము
చేకూరు = దక్కు
కోరిక
కూరిమి
కూరుతు
కోర = గిన్నె
అమ్ములు కూరంగా = బాణాలు నాటంగా
కురిసెనువానల్
కారించుట = నొంచుట

కారాకులు
కారుకొనెమొగులు
శత్రులుకారు
తాఁకిరి
కరువలి
కారులు = కల్లలు
కర్దము = కారియము
కరకరి
కరమొప్పగ
తొల్కరివానలు
కెరలి
కరకరఁగాలెన్
కరవాడి యమ్ములు
కొరప్రాణము
కూరలు
కారాటము
కరి
కోరిరి
కూరుకు = నిద్ర
కూరుట = పొగులుట
గారవము
గరువము
గారాము
గరుసెడి
బంగారము
గురుగులు
గరితలు
గోరది
గురువులు = గతివిశేషము

గరుడాళ్ళు
గరువు = గర్వము
గరువతనము = ఘనత
గురుగులు
వేగిరపడి
జేగురు
గోరు
గిరగిర
గరుసులు
గరుసింగారము
చేరువ
చెచ్చెర
చేరిరి
అచ్చెరువు
చొరక
చెరువుట
చీరలు
చీరిఁగొనక
అచ్చెరియము
చూరే
చిరుఁగనిచీరలు
వచ్చిరి
అచ్చరలు
జరగి
జరలు
నిల్చిరి
చేరువుట = చేర్చుట
చొరువు
తరెత్రాడు
తరువ

తరమిడి
తిరుగుట
తిరియుట
తిరము
తెరలు
తెరువు
తరలు
తరతరము
మార్తురు
నెత్తురు
తోరము
తెరయు
తొరుగుట
తేర
తెరతేర
ఏతేరగ
నేర్తులు ?
తారును
తేరెక్కు
తరమెంచక
చనదెంతురు
తొరలిన
తెరువులు
ఘూరుపుదెస
పత్తురు
తీరనికోపము
తరఁగలు
తెరలంగ్రాగిన
కస్తురి
చిత్తు(త్త?)రు వ్రాయగ

ఉద్యోగింతురు
దరికొని
కుదురుగ
జూదరి
దొర
దొరకోల్
దురము
ఎదురు
దురపిల్లు
దొర = నరి
దరిదొక్కుట
దొరకొను
దొరకొల్పు
దురదుర
దొరసిన
నేరిమి
నరములు
నరలు
నారలు
నోరు
నీరు
నారసము
కన్నారము
నెరయగ
నేరక
నురువు
నేరేఁడు
నెరసులు
నేరువు
నారి = వింటిత్రాడు

ఉన్నారు
నీరైరి = బూడిదయైరి
పరఁగ
పరికింప
పరువడి
పురుడు
పురుఁడు = సూతకము
పరిమార్చు
దెప్పరము
పరును
పొరయక
పొరిఁబొరి
వరుసన
పొరిగొని
పురపుర
పెరుఁగు
పొంపిరివోవు
పెరుగుట = వర్ధిల్లుట
పొరుగు
పరిగొని
పరిచనుదెంచు
పరువము
పెన(ను?)పరి
నేరుపరి
పురిగొలుపు
పొరపొచ్చెము
చప్పరము
పొరలితి
పరపు
పరుసము

పెరడు
పరివరి
పరఁగించు
పొరిగడుగు
పరిసరము
పోరితము
పోరు
పిరిగొను
పేరు = నామము
తేనెపెర
పేరురము
పేరడి
పరపుట = నించుట
పోఁచి
పేరిన నేయి
పోరాటము
పోరా
పోరు
పోరామి
బూరటిలు
బారినమరు
బోరగిలు
బరవసము
బోరని మ్రోయు
బారిఁబడ
బెరసి
పరిమెయి
బీరము
నిబ్బరము
బరణలు = గజ్జెలు

బిరుదులు
బురబుర
బరులుబ్బు
మురిసెను
మరలుట
మరిగించికొను
మెరమెర
సుమ్మర
మొరపరాళ్ళు
మొరసెను
మేరలు దప్పు
మారిమసంగు
మొరడు
మరియాద
మిరలు
ఈమరి
నూరేళ్లు
మురియలు = తునియలు
మిరియము
మరుపఁగవలె
తామర
మురిపెము
క్రమ్మర
మారట
వేమారు
మురముర
మరులు
రూపించు
రేయు
రచ్చ

| | | |
|---|---|---|
| రూపు | వారించుట | వారాశి |
| రమ్మ | ఎవ్వరికి | సరజడి |
| రిచ్చ | వారికి | ఏసిరి |
| రోయు | వారకము | సైరణ |
| రూపు | విరులు | సురిగిరి |
| రాలుట | వారక | సరి |
| రంకలు | వారువము | నూరెలు |
| రాయంచ | వల్వరకు | సిరి = లక్ష్మి |
| రిత్త | వీరు | చేసిరి |
| రక్కసి | వరటము | సరకులు |
| రాయుచు | వరపుట్లు | సురియలు |
| రామట | ఏవురు | సోరణగండులు |
| రాదు | విరియుట | సారిదిన్ |
| రామాలి | వరున | వేసరుల |
| రేయెండ | వెరవు | సౌకటాసారెల్ |
| రేకు | విరవిర | సరకుచేయు |
| రూఢి | నల్వురు | నరులు |
| రాయిడి | నవ్వరె | మోహరము |
| రుచి | పురిగొన | ఓహరి |
| రారు | వెరవిడి | ఆహిరి |
| రమణ | వారకుం ? | బేహరి |
| రోజుచు | ఆర్వురు | వుట్టిరి |
| రారా | వేరము | తిట్టిరి |
| రాగిల్లి | తంవరి | కూలిరి |
| రమ్ము | వెరను | భూపాలురు |
| రాని | విరియంజల్లు | నెయ్యురు |
| నేనేరా | వారని | పోటరి. |
| వినరా | ఓవరి | |
| (తురితుల) | దేవర | |

## శకటరేఫలుగల పదముల పట్టిక

| | | |
|---|---|---|
| అఱవఱలు | ఆఱని తేజంబు | ఎఱుకు |
| అఱుకట | ఆఱమ్ముల | తలనెఱవ |
| ఉక్కఱ | పావమఱలోటాతె | ఎఱకలు |
| అఱిమఱి | ఇఱికికొని | ఎఱిఁగిన |
| అఱచు | ఇఱులఁకొను | ఎఱుల్ |
| అఱుపుడు తోళ్లు | ఇఱికిట | ఒఱశరీరము |
| ఏపఱ | మిఱుచన్నుగవ | మన్మథునొఱపులు |
| అఱుమెఱలక | ఇఱమి | ఒఱిగాలనుండి |
| పొల్పఱి | క్రిక్కిఱియగ | ఒఱగెను |
| అఱువదికోట్లు | ఇఱిసిన = కదియుట | ఒఱపుగల కత్తి |
| అఱపొఱడు = గుజ్జు | జాగఱలు | ఒఱ |
| రూపఱ | ఉఱవుగ | ఒఱలుచు |
| అఱపులు | ఉఱుకట | కఱచెను = నేర్చెను |
| బిట్టఱ | పదమూఱి = మెట్టి | అక్కఱవడి |
| అఱచేయి | ఉఱుముచు | క్రిక్కిఱిసి |
| అఱుగుడు | ఉఱక | కాఱులు |
| సిగ్గఱి | చిమ్ముఱికించు | ఉక్కఱవడి |
| అఱుమట | ఊఱఁడు = గైకొనడు | కుఱుకులు |
| అఱలేనివానికి | ఉఱునట్టి | కఱతలకలికి |
| అఱుగును | ఊఱడిలంగా | కఱపించు |
| అఱుకాలందన్ని | ఉఱిది = నిలుకడ | కఱమఁబండ్లను |
| అఱుకమ్మట | ఊఱిన | కఱపులు = బుద్ధులు |
| అఱగొఱలేక | ఉఱుగడ | కుఱుకొని |
| వెంపఱ | ఎఱచి = మాంసము | కుఱఁగలికొను |
| అఱడి | ఏఱులు | కొఱమాలి |
| అడలాఱు | ఎఱఁగుట = వందనమిడుట | కొఱతపడు |
| అఱుపులు | | కఱవు |
| అఱుచవులు | ఎఱమంట | కొఱగాదు |

| | | |
|---|---|---|
| కొఱవి | గిఱిన | మచ్చిఱుట |
| కాఱియఁబెట్టు | గుఱుతుల్ | చెఱఁగు |
| కఱచీఁదెఱుపఁగ | గుఱియుగ | చేఱుట |
| కఱకంఠా | గుఱుములు = గింజలు | వాచఱచి |
| కఱఁగలి = చేర్పనఱడు | గఱిగుఱుకలు | ఇలచఱచి |
| కొఱలుట = పూర్ణమగుట | గిఱుచెప్పుట | పోఱుట |
| కోఱలు | గుఱిచి = కూర్చి | చెఱుసగము |
| కఱకులు = ప్రల్లదములు | గుఱుగల్లను | జఱిగొని |
| అక్కఱ | గుఱువెట్టు | జాఱఱ |
| కుఱుచ | గఱులు | జఱజఱ |
| కాఱెడు | చెఱుప | జెట్టిపోతు |
| కొఱపము | క్రచ్చఱ | జాఱెను |
| కాఱడవి | చఱుకు | జఱుపుచ్చ |
| కొఱడు | చఱచు | జఱభి |
| కుఱుమాపు | చఱి | జొఱజొఱ |
| కొఱగలవాఁడు | చిఱుముట | జిఱకిఱ |
| కఱకటి | చిచ్చుఱపిడుగై | తఱికొని నడువగ |
| కఱవేని = కందులేని | చుఱచఱ | తఱుముచు |
| చేకుఱు | చిచ్చఱకంట | తొఱఁగువడున్ |
| కఱుకెక్కి | చెఱవెట్టుట | తొఱఁగెను |
| పింఱగఱవి | చెఱుపమయుట | తూఱుచు |
| కొఱుకుటల్ | చుఱుపుచ్చుట | తొఱఁగులువోవు |
| కఱకు = కఠినము | చెఱకువిల్లు | తఱుముడు |
| కఱకఱి | చూఱవిడచు | తొఱగుట = పడుట |
| గిఱుపుట | చిఱునగవు | తఱియగు |
| గుఱుకొని | చిఱుతఁదనము | తఱచగు |
| గొఱియలు | చెఱుచుట | అత్తఱి |
| గిఱిగొను | చఱిగొను = | తెఱవలు |
| పగఱ | చలముగొను | వాతెఱలు |

| | | |
|---|---|---|
| తెఱచి | తేఱుదురు | నఱుమాడు |
| తెఱపి | తొఱఱు | నెఱుపు = అగ్ని |
| ఏడ్తెఱ | తఱుగఁజేయు | నెఱకూఁటిన |
| తొఱఁగు | తఱగని కింక | నెఱు |
| తెఱఁగు | దఱకె = వెలితి | నఱిసింగము? |
| తెఱగినతావి | ముందఱ-కాలవాచి | నూఱు |
| తొఱగమి | ఎదుఱ | నెఱసు |
| తుఱఁగలింప | ముందఱ | నీఱు పయి నిప్పు |
| తఱుగుట | ఆందొఱు | నూఱుట |
| తీఱమి | ఇందఱము | నాఱువిడిచి |
| తాఱుట | ఇద్దఱు | నెఱిలేని నఖుఁడు |
| తఱులు | చెదఱుట | ఎమ్మెలు నెఱపఁగ |
| తుఱుము | ఎందఱు | నెఱనారసము |
| తుఱిగొనియె | కొందఱు | నిఱుగంజేయన్ |
| తఱిగె = తగ్గను | ఏఁఱ ? | నెఱవుగ |
| తఱికొలిపి | అందఱు | నెఱనాటించిన |
| తేఱి | పెద్దఱికము | నిఱుఁబేద |
| తఱుచఱ | ఇందఱు | నెఱిచెరక |
| తఱిమియనసేసె | నెఱి | నెఱికగట్టుట |
| తఱియంఱనుము | నెఱయ | నెఱవాదులు |
| తలఱు తఱిగెద | నెఱసి | నఱుముదుడిచి |
| తొఱయుట | నఱికిన | నెఱిమొగము |
| తీఱఁగ | నెఱిదప్పంబడియె | నెఱద్రోవ |
| తఱఁక | నెఱమంటలు | నఱుజు |
| తఱలక | నిఱిగొను = నిండు | నెఱబిరుదు |
| తెఱఁగొప్ప | నెఱివెంద్రుకలు | పఱచెను = వేగఁబోయెను |
| తన్నుతెఱవఁగ | నెఱకులు = అమ్ములు | పఱపెద ⎫ బిడితోలుట |
| తెఱగన్ను | నఱుమై | పఱపితి ⎭ |
| తూఱెను | నఱుముగ | పిఱుసనుట = వెనుదీయుట |

| | | |
|---|---|---|
| పఱచినపాట్లు | గఱుపొత్త | మఱఁగును |
| పిఱికితనంబు | పొఱతీగె | మఱది |
| అంపఱ | తెప్పెఱ | మాఱుమొగము |
| పఱియలు | ఏదు పెఱిగినట్లు | పల్మఱు |
| పఱిమార్చు | పిఱివేఱ | మాఱుమనగి |
| పఱిగొను = | పఱవఁగ = | అమఱి |
| ముంచుకొను | ప్రవహింపగ | మఱవలె |
| పిఱుఁదు | పఱపువాఁబాట్లఱచి | మఱి |
| పెఱమూకలు | పఱిపఱియలు | మెఱుఁగు = మేఘము |
| పెఱచేత | పఱతెంచి | మఱమనొకో |
| పఱిపఱియలుసేయు | తోలుతొప్పఱ | మొఱసి |
| పఱివోయెను | వఱియలు | మాఱుటనోళ్లన్ |
| పఱవగనోపక | పొఱకలు | మెఱుచు |
| పిఱివోయె | బిఱుపోవుచు కదనమున | వేమాఱును |
| పెఱిగినచందము | బిఱబిఱగద త్రిప్పి | మాఱీడగునాతఁడు |
| చూపఱ | దబ్బఱ | వేమాఱును |
| పిఱిపికిఁబాఱు | బఱబఱ యీడ్చు | మాఱుఎగకు |
| పిఱుదులు | మఱచిన | ముమ్మాఱు |
| పెఱుకలు | మఱవక | మెఱములునైచు |
| చిక్కుఱువఱుపగ | మఱియును | మొఱఁగుచు |
| పఱపకు | మెఱయుట | మఱుమొండము |
| పాఱించునాఁటి | మెఱసి | మొఱలిడి |
| ఎదతెగఁబాఱుట | మెఱుపు | మఱువు = మాటు |
| ఇంకఁబాఱుట | మిఱుమిట్లు | పెదమఱి |
| పాఱుఁడు = విప్రుడు | మెఱుములు | మొఱకుదనము |
| పీఱిన వలువ | మీఱగ | మఱలేక |
| పెఱికిలికొండలు | మెఱుఁగులు | పెక్కుమాఱులు |
| పొంపఱన్ | ముఱిముఱి | మఱునాఁడు |
| పొఱ | క్రమ్మఱి | మాఱువడు |

| | | |
|---|---|---|
| మైమఱువులు | వఱడులుకూసెను | తేవు |
| మిఱుఋావులు | వేఱొక | తేవు |
| మాతేయఁగ | మఱతురు | తేను |
| మఱవలు | వఱతంద్రోవంగ | తేని |
| వఱలు | మిఱుగాలి | తెక్క |
| వెఱవఱ | వీటికి | తేఁడు |
| వెఱచఱవ | నివ్వెఱవాటు | తెప్ప |
| విఱుఁగు | ఱట్టు | టివ్వెన |
| వెఱఁగు | ఱనిక | టామఁడు |
| విఱిచి | ఱంకు | సుఱసుఱ |
| విఱుగుట | ఱాయి | సౌఱచొచ్చు |
| వెఱమృగములు | ఱిక్కించు | |

[మఱి కలిగనేని దెలియుఁడు తఱచెందును లేవు కృతులఁదలఁపఁగ కృష్ణా!]

*శృంగారామరుశతకము :* కర్త: తాళ్ళపాక తిరువెంగళప్ప. శతకాంతమునందలి యీ క్రింది పద్యములనుబట్టి యీ విషయము తెలియనగుచున్నది.

కం॥ ఇలఁదాళ్ళపాక సత్కుల
తిలక శ్రీవేంకటేశ దీక్షితసుతుఁడు
జ్జ్వల కవితానిధి తిరువెం
గళప్ప యమరుకము తెనుఁగుగా విరచించెన్.

కం॥ క్షితిపై నాచంద్రార్క
స్థితి మించఁగఁ దాళ్ళపాక తిరువేంగళదీ
క్షితుఁ డమరుకమున్ వేంకట
పతికి సమర్పణముగాఁగఁ బరువడిఁ జేసెన్."

తాళ్ళపాక వారిసంతతిలో అన్నమాచార్యుని మనుమఁడును చినతిమ్మ దీక్షితుని కుమారుఁడును నగు తిరువెంగళప్ప యొకఁడు ప్రసిద్ధుఁడు గలఁడు. అతఁడే కావ్యప్రకాశకవ్యాఖ్యను, నామలిం

గానుశాసన వ్యాఖ్యను విరచించినాఁడు. ప్రాయశః ఆ చినతిమ్మదీక్షితుని కుమారుఁడగు తిరువేంగళప్పయే ఈ అమరుకానువాదమునకును గర్తయై యుండవచ్చును. కాని యీ తిరువెంగళప్ప పై పద్యములందు శ్రీ వెంకటేశదీక్షితసుతుఁడుగా ప్రస్తుతుఁడైనాఁడు. తిరుమల, తిరువేంకటేశ, వేంకటేశ్వర దీక్షిత పదము లొక్కని పేర్లు కావచ్చును. నాఁడు వారి పేరులు కావ్యశాసనములందు పలు సందర్భములలో పలువిధములుగా నామాంతరములు వ్యవహరింపఁబడుచుండినవి కూడ. అట్లగుట నా చినతిమ్మ దీక్షితుని కుమారుఁడగు తిరువేంగళప్పయే యీ కావ్యమునకును గర్త యనుకొనుటలో విప్రతిపత్తి లేదు.[1]

విద్వాంసుఁడును, వ్యాఖ్యాతయు, గవియు నగుసీ తిరువేంగళప్ప సంస్కృతమున సుప్రసిద్ధమగు అమరుశతకమును శ్రీవేంకటా

1. కాని యీ యభిప్రాయమునకు భిన్నముగా అధ్యాత్మ సంకీర్తనలు 16 సంపుటము పరిష్కర్తలు శ్రీమాన్. ఎ. వి. శ్రీనివాసాచార్యులు గారిట్లు అభిప్రాయపడిరి.

"శృంగారామరుకమునందు తిరువెంగళప్ప వేంకటేశ దీక్షితుని కుమారుఁడైనట్లున్నది. కోనేటి వేంకటనాథుఁడే తిరువెంగళప్ప తండ్రియగు వేంకటేశ దీక్షితుఁడగునా? వేంకటనాథుఁడను పదమునే తిరువెంగళప్ప తన పద్యమున వేంకటేశుఁడని యనువదించి పేర్కొనెనా?"

(చూ. పు. 39 పీఠిక-అధ్యాత్మ 16 సం॥)

ఆయనుమానమును బురస్కరించుకొనియే కోనేటి వేంకటనాథున కొక కుమారుఁడు తిరువెంగళప్పయని యున్నట్లుగా కూడ వంశవృక్షమున నిచ్చియున్నారు.

కాని కోనేటి వేంకటనాథునకు తిరువెంగళప్పయను సంతానమున్నట్లితరాధారమేమియుఁ గానరాదు. కావున పై యూహకన్న ప్రసిద్ధుఁడును చిన తిమ్మదీక్షితుని సుతుఁడును, వ్యాఖ్యాతయు, కవియు, విద్వాంసుఁడునగు తిరువేంగళప్పయే యీ కావ్యకర్తయునగు ననుటకు సందేహింపవలసిన పని లేదను కొందును.

చలాధీశున కంకితముగాఁ దెలిఁగించినాఁడు. "సంస్కృతమున అమరు శతకము శ్రీమచ్ఛంకర పూజ్యపాదులు పరకాయ ప్రవేశముచేసి శృంగారానుభూతులఁదేలుచు రచించినదని కొన్ని గ్రంథములు వాకొనుచున్నవి. కాని యవి యప్రామాణికములే యని ప్రాజ్ఞులచే నవగణింపఁబడినవి. అమరు శతకకర్త అమరుఁడనీ, అమరకుఁడనీ పేరుగల యొకానొకరాజు గాఁదగునందురు. 'అమరుకవేరేకః శ్లోకః ప్రబంధశతాయతే' అని ప్రాచీనుల ప్రస్తుతి. అలంకార శాస్త్రకారులీ శతకపుశ్లోకములను ధ్వని ప్రభేదాదులకు లక్ష్యములనుగాఁ బదింబదిగా నుదాహరించిరి. దీనికిఁ దెలుఁగున సరిగా లెక్కపెట్టఁగాక యెన్నో పరివర్తనములు వెలసినవి. కొన్ని ప్రాచీనములు, కొన్ని నవీనములు. కొన్ని రచయితల దగ్గఅనే దాగి యున్నవి. ఉన్నవానిలోకెల్ల నీ పరివర్తనమే ప్రాచీనతమమనుకొందును."[1]

సంస్కృతామరుశతకమున మొత్తము 101 శ్లోకము లున్నవి. వానిలో తిరువెంగళప్ప విరచితమై లభ్యమై ముద్రితమగు 'ఆంధ్రామరు

1. చూ. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయ సంపుటి 10 – సంచిక 1 (1949) పుట 88 తెలుఁగు విభాగము- శృంగారామరు కావ్యము నకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మున్నుడి. వారే యిఁకను నిట్లు వ్రాసియున్నారు.

"నేను బరిశీలించినంతలో సంస్కృత శ్లోకముల యావదర్థ భావములు సరిగా గోచరించునట్లు వలిసిన తెలుఁగుసేఁతలు తక్కువ. కొన్ని రచనలలో కొన్ని కొన్ని పద్యములు మూలానుగుణముగాఁ జాలఁ జక్కఁగా నున్నవి. అట్టి తెల్గుసేఁతలలో నిదియు నొకటి తాళ్ళపాకవారిది యని ప్రాచీనము రసహృద్యము నని దీనిని ప్రకటించితిమి మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు ముప్పదేఁడ్లకు ముందు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెమున అద్దంకి యింటిపేరి వైష్ణవాచార్యుల యింటనుండి దానిని నేను సేకరించితిని. ఆ యేకప్రతిని జూచి మదీయులు చి॥ తి. కోదండ రామయ్యగారు శక్యమయిన సంస్కారములు జరిపి ప్రతి వ్రాసియిచ్చిరి. ఈ ముద్రణములో పాఠలోపములు తప్పు పాఠములు చాల మూలమును జూచి నేను సవరించితిని."

కముʼన 90 శ్లోకములకు మాత్రమే యనువాదము కానవచ్చు చున్నది.[1] వీనితో కృత్యాద్యంతపద్యములు కూడి వెరసి 94 పద్యములగు చున్నవి. ఈ కవి రచించినవే యిన్నో కాక యేవేని లుప్తములై పోయినవో తెలియరాదు.

అమరుకావ్యమనియు, అమరుశతక మనియుఁ బ్రసిద్ధమగు నీ రసవత్ప్రబంధము ఆలంకారికదృష్టితో శతసహస్ర ప్రబంధములకు తుల్యమైనది. అది శృంగారరసమయము; రమణీయము నైనది. అందుకే దానిని తెలిఁగించుచు తిరువెంగళప్ప భువనైక సుందరుఁడును శృంగారరసస్వరూపుఁడును నగు శ్రీవేంకటాచలాధీశునే కృతిపతిని గావించి యిట్లు తలపోసినాఁడు.

"శ్రీరుచిరాంగనాశ్రయ విచిత్రవిభూషణ సూనచందనో
దారవిలాస దీపితమునై యసితోత్పల కాంతిమించి శృం
గార రసంబు దోఁచెననఁ గమ్నల పండువయైన మేనియొ
య్యారముఁజూపు వేంకట నగాధిపుఁ డీవుత మాకుఁగోరికల్" (ప. 1)

ఈ యాంధ్రామరుకమున గవి కేవల శ్లోకముల కనువాదము మాత్రమే గాక విశదత్వమునకై ప్రతిపద్యమునకును వ్యాఖ్యాప్రాయమగు లఘు వివరణమునుగూడ జతపరచినాఁడు. ఆ లఘు వివరణము కూడ తేలికతెలుఁగులో వ్యావహారికరీతిని సరళమై చదువరుల కుపకారకముగ నున్నది. మచ్చున కిందలి తొలియనువాదమునకే గల యీ వివరణమును తిలకింపుఁడు.

"శృంగారరస ప్రధాన మమరుకావ్యము. శృంగారము సంభోగము, విప్రలంభము నని రెండు విధములు. అందులో సంభోగ శృం

1. సంస్కృతామరుకావ్యమును వేమభూపాలుని వ్యాఖ్యతోఁగూడ ప్రకటించిన వేదం వేంకటరాయశాస్త్రిగారి ముద్రణము ననుసరించి యందలి 1, 2, 30, 39, 48, 50, 77, 78, 84, 88, 94 సంఖ్యలు గల శ్లోకములు వదునొకండిఁటి కిందు అనువాదము కానరాదు. ఇఁకనిందలి 'మలయసమీర వారములు' అను ప్రోషిత భర్తృకను గూర్చిన (77వ) పద్యమునకు మూల శ్లోకము పై ముద్రణమున కానరాకున్నది.

గారము మొదలుగా నుద్యోగించి శృంగారరసానకు ఆలంబన విభావ మైన నాయికా స్వరూపమునే దేవతగా భావించి తృతీయ పురుషార్థ మును గూర్చి (కవి) ఆశీర్వచిస్తున్నాఁడు"—

ఇట్లు లఘువివరణమును గూర్చుటయే కాదు. మూలగ్రంథ మున నొక క్రమము లేక కలగాపులగముగా చెప్పఁబడిన పలు విషయ ముల నీ కవి శక్యమగు రీతిని వేర్పరచి శ్లోకములకు విషయ విభా గముచేసి యొక క్రమమేర్పఱచినాఁడు. అది యీ యనువాదము నందలి మఱియొక సొగసు.

ఇది శృంగారరసప్రధానమగు కావ్యమగుటచేత ముఖ్యముగా నారసమున కాలంబనవిభావమగు నాయికనుగూర్చియే యిందు వివరముగ విపులీకరింపఁబడినది. ఇందు త్రివిధనాయికలలోఁ దొలి దగు స్వీయకే ప్రాధాన్యము. ఆస్వీయయు ముగ్ధా, మధ్యా ప్రగల్భాది భేదములతోడను, ధీరాధీరాధీరాధీరాది యవాంతర భేదములతో డను గూడి వివిధ మానావస్థానాయికలుగను, అవస్థాభేదమును బట్టి మఱి యష్టవిధనాయికలుగను మన కిందు సాక్షాత్కరించును. ఒక్క నాయికా విషయమే కాక యీ రసవత్కావ్యమందు అనుకూల దక్షిణ ధృష్ట శఠులను భేదముచేత నలుతెగల వాఁడగు పతియొక్క స్వరూ పము గూడ చక్కగా చిత్రింపఁబడినది. ఇంతేకాదు. సఖీ దూతీ నిరూపణము గూడ నిందు కావింపఁబడినది. ఇట్లు సర్వాంగభూషిత మగు శృంగారము సంభోగ విప్రలంభములను రెండు విభాగములుగా నిందు చర్చింపఁబడినది. దానిలో సంభోగశృంగార మను విభాగము క్రింద సంభోగము, ఈర్ష్యా సంభోగము, ఏకశయ్యా విరహాపూర్వక సంభోగము, అభిలాష సంభోగము, విరహోత్కమత్వ రూపౌత్సుక్యము కాలాక్షమాత్వ రూపౌత్సుక్యము మున్నగు నెన్నో విభేదములుగా పద్యములు వింగడింపఁబడినవి. ఇట్లే మఱల విప్రలంభ శృంగారమను విభాగమున విప్రలంభము, ఈర్ష్యా విప్రలంభము, విరహావిప్రలంభము, ప్రవాస విప్రలంభము, ఆరోపితేర్ష్యాపూర్వక విప్రలంభము, మాన కరణము నను పలువిభేదములుగా చర్చింపఁబడినది. ఈ పై విషయము లన్నియు, మఱల సఖీవాక్యములుగను, నాయికా వాక్యములుగను,

నాయక వాక్యములుగను మఱికొన్ని వాకోవాక్యములుఁగను వేర్పరుపఁబడినవి. ఇట్లు పాశబంధములై చిక్కులు గొలుపు నీ శృంగార రసవిషయము నీ కవియెంతో మెలకువతో పాయలు పాయలుగాఁ జిక్కులు విడదీసి తద్రసాధిదేవత కందమగు వేణినల్లి పెట్టినాఁడు.

మచ్చునకిందలి విషయవిభాగములలో రమణీయములగు నొండు రెండు లక్ష్యోదాహరణములను వివరణసహితముగాఁ దిలకింపఁదగును.

1. “వాసకసజ్జిక పరిణామాలంకార రూపమున నాయికా సౌందర్య వర్ణనము.

చ. చెలువుఁడు వచ్చు వేళ సరసీరుహలోచన మంగళార్థమై
కలువలఁగాదు తోరణముఁగట్టుట వాలిక చూపు దండనే
యలరులఁగాదు మించునుపహారము నవ్వుఁగాని యర్ఘ్యముల్
కలశగతాంబుపూరముఁగాదు చెమర్చు నురోజపాళినే.”

(తెలుఁగు 16 - సంస్కృతము 40)

ఇందు *నాయిక స్వీయ - మధ్యా* - నాయకుఁ డనుకూలుఁడు. *హర్షము సంచారి.*

2. “సురతాంతమందుఁ బూర్వ్యాకృష్టమైన వస్త్రము నీయ కుండఁగాను కరుణాలాపములచేత వేడుకొను నాయికఁజూచి పునారతోద్యుక్తుఁడయిన నాయకునియందు బలాత్కారముచేత వస్త్రాపకర్షణచేసిన చోర వృత్తాంతమున్నూ మన్మథుని యందు తన్నివారకుఁడైన రాజవృత్తాంతమున్నూ తోచేటట్లు కవి వర్ణిస్తున్నాఁడు.

ఉ. కంతురణావసానమునఁ గాంతుఁడు చేలముదాఁచి యాయకే
యెంతయు జాగుసేయఁ జలజేక్షణ యాడెను దీనవాక్యముల్
కంతుఁడు వించు మేటివిలుకాఁడగుటన్ జనమూని తా సమీ
కాంతరముక్త సన్నహనుఁడయ్యెను బూనెఁబునారణోద్ధతిన్.”

(19-100)

(ఈ పద్యమున ‘మేటి విలుకాఁడు’ అను పట్టున “త్రిభువన మహాధన్వీ” అని సంస్కృతమున గల సౌందర్యమించుక లోపించినది.)

ఇందు నాయిక స్వీయ - మధ్య - స్వాధీనపతిక. నాయకుఁ డనుకూలుఁడు. వ్రీడ సంచారి. సంభోగశృంగారము.

3. "నాయికా కాలాతిమత్వరూపౌత్సుక్యము—

ఉ. అంగన దూరదేశగతుఁడౌ పతిరాఁ బవలెల్లఁగోర్కిచే
తం గడఁదేరఁజేసి రతిధామముఁజేరి సఖీమణుల్ కథా
సంగతి ప్రొద్దుపుచ్చ నెదొ చట్టనఁగుట్టె నటంచుఁ బల్కుచుం
గొంగువిదల్చి కేళిపయిఁగోరికఁ దీపముఁద్రెంచె నేర్పునన్."
(14-86)

ఇందు నాయిక స్వీయ - ప్రగల్భ. నాయకుఁ డనుకూలుఁడు. ఔత్సుక్యము సంచారి. ప్రవాసానంతరసంభోగము.

4. "ఈర్ష్యాకలుషిత తిరస్కృతుండైన నాయకుఁడు నాయిక సౌందర్యమును దలఁచుకొని ఖేదమున ననే మాట.—

ఉ. బాలికయాపె; మాకొదవెఁ బల్కులఁగొఁ; కది భీరు; మాయెదన్
వాలెడుభీతి; యున్నత ఘనస్తనయాపె; శ్రమంబు మాకు; ను
ద్వేల నితంబ యాజలద వేణి; చలింపగలేము మేము; హా
యా లలితాంగి దోషముల నబ్బురమే మటులౌట కారయన్."
(49-102)

ఇందు నాయిక స్వీయ-ముగ్ధ. నాయకుఁ డనుకూలుఁడు. ఇది నాయకవాక్యము.

5. "ప్రవాస విప్రలంభఖేదము నోర్వలేక నాయికా అనేమాట"-

మ. దయితుం దూరికిఁబోవ నాయితపడం దాఁ దోడనే జాతిఁ దా
ప్రియమౌ కంకణపాళి యశ్రువులు నెంతేఁ బాయకేఁగెన్ క్షణం
బయినన్ నిల్వవు ధైర్యముల్లమున నాయత్తంబు మున్మున్నబోఁ
బ్రియులెల్లన్ జననిట్లు జీవితము తారిం బాయఁగా నాయమే"
(76 - 81)

ఇందు నాయిక స్వీయ-మధ్య. నాయకుఁ డనుకూలుఁడు. దైన్యము సంచారి. ఇది నాయికావాక్యము.

6. ఉ. ఎచ్చటికేగెదే కువలయేక్షణ! యీనడురేయి; యిచ్చకున్
మచ్చిక సేయు నా హృదయనాయకుఁ డున్నెడ; కొంటి కీకిలే
కచ్చటి కెట్లుపోయె దబలా! యిదె పుంఖిత బాణుఁడైన యీ
పచ్చనివింటివో దడుగుఁబాయక రా వెలవేల నెచ్చెలీ!"

(84 - 68)

ఇందు నాయిక పరకీయ-అభిసారిక. ఇది యుక్తి ప్రత్యుక్తి మద్వాక్యమగు వాకోవాక్యము.

7. "ఆరోపితేర్ష్యాపూర్వక విప్రలంభము. నాయకునియందు అత్యంతానురాగముగల నాయిక సఖులచేత మానకరణం కొఱకు బోధింపఁబడ్డదై దాక్షిణ్యంచేతను, వారినేమియు ననలేక తనకు మానకరణమందు అసామర్థ్యమును దెలుపునది.—

చ. అతఁడు మొగంబుఁజూడ మొగ మల్లన వంచితిఁ జూపు లంఘిచే
ర్చితి నతఁ డాడు మాటలు గుఱించి వినం దమకించు వీను లా
గితిఁ దగఁ గేలు దోయి పులకించుఁ జెమర్చుఁ గపోలపాళి మూ
సితిఁ జెలులార! యీరవిక చిఱుదు నుబ్బున నేమి సేయుదున్."

(86 - 12)

ఇందు నాయిక స్వీయ—ముగ్ధ. నాయకుఁడు శఠుఁడు. హర్షము సంచారి.

ఇట్లు ఈ శతకమునందలి శృంగారరససంబంధివిషయము లనేకములు రసికజనుల 'కరవయామెతసామెత' కాగ నందింపఁబడినవి.

కావ్యాంతమునఁ గవీశ్వరుని మంగళాశంసనమును తిరువెంగళప్ప యిట్లు తెలిఁగించినాఁడు.

ఉ. యావరసార్ద్రిమున్ గిసలయాంచల కోమలమున్ వినూత్నర
త్నావళి నూపురంబును మదాలసభావము నౌపదంబుచే
నేవరపూరుషుండు ప్రణయేర్ష్యఁ బ్రియాంగనచేతఁ దాడితుం
డై విలసిల్లు వాఁడు కుసుమాయుధదేవునకుం బ్రియుండగున్.

(91 - 101)

* * *

## దండకములు

దేశికవితాశాఖకుఁ జెందిన పలువిధములగు పద పద్యకవితా విభాగములలో పద్యకవితా విభాగమునకుఁ జెందినవే దండకములు. ఇవి స్వభావమున వస్త్వాశ్రయకవితారీతికిఁ జెందిన ద్విపదయక్షగానాది రచనలవంటివి కావు. ఆత్మాశ్రయకవితారీతికిఁ జెందిన ఉదాహరణ శతకాదిసరసకావ్యరచనా వైలక్షణ్యము గలవి. దండకములు ప్రముఖముగా నేకగణమాత్ర ప్రస్తారకములు. బహుళముగా భక్తిమయములు. క్వాచిత్కముగా శృంగార మయములును. ఏమైనను ప్రధానముగా స్తుతిమాత్రసుందరములు. ఇందు మానుష స్తుతికన్నను దైవ స్తుతికే పరిగణన మెక్కువ. ఇట్టి దండకములు సంస్కృతవాఙ్మయమున స్వతంత్రములును, కావ్యాంతర్గతములును, సుప్రఖ్యాతములును ననేకములున్నవి. శ్యామలాదండకాదు లిందుల కుదాహరణములు. ఆ సంప్రదాయము చొప్పుననే తెలుఁగు కవులు కూడ తమ కవితా వ్యాసంగమున ఎడనెడ నీ దండకరచన కుద్యమించినారు.

దండకములందు ప్రధానముగా నేదేనొక్క యక్షరగణమే తొలినుండి తుదిదాక పునః పునరావృత్తమగు చుండును. వానిలోను అంత్యలఘువగు తగణమునకే దండకములందు ప్రయోగమధికము. ఈ తగణము శ్రీకారముతో నారంభించుటకును, అవృత్తియందు శ్రవణసుభగత్వము నాపాదించుటకును వలను గూర్చునది యగుటయే దానిని స్వీకరించుటలో గల ముఖ్యహేతువు. తగణసముచ్చయమున శీగెలుసాగుని దండకరచనావిన్యాసమున వృత్త్యనుప్రాసాది శబ్దాలంకారములు తోడ్పడినపుడు రాగరంజితమై తరంగభరితమగు జలనిధి గాంభీర్య మనుభూయమానమగును. గాయకుని యాలాపమునకు శ్రుతిని గూర్చు తంబూరా మీటువలె నీతగణపునరావృత్తి భావమును లయబద్ధమొనరించును. నామమంత్ర జపమువలె నిదియు మానసము నేకోన్ముఖము గావించును.

ఈ దండకముల లక్షణమును తెలుఁగు లాక్షణికులిట్లు నిర్వచించిరి. "అనియతపాదంబు-దండకంబు. 'కృతినాది నసహంబులొండెం

దకారంబు లొండెం బ్రకల్పించి యామీఁదనెల్లం దకారప్రధానంబు గుర్వంతమైక్రాల (కావ్యా. 8-పుట 112) నిచ్ఛానురూపావధిం బేర్మి నిర్మింపఁగాఁబడునని కావ్యాలంకార చూడామణికారుఁడు వివరించినాఁడు. అప్పకవియు నిట్లే నిర్వచించి చండ వృద్ధ్యాది దండకభేదము లెన్నిటినో పేర్కొనినాఁడు. ఈ లక్షణముల కనుగుణముగనే నన్నయాదితెలుఁగుకవులు పలువురు తమకావ్యములందు ప్రాయికముగా స్తుతిసందర్భములందీ దండకములను రచించిరి. కవిత్రయమువారును, తరువాతివారిలో పోతన్నయు నీ దండకరత్నములఁ గూర్చి తమ కావ్యకన్యకల నలంకరించి వలువురకట్టి పరిష్క్రియలం దభిరుచిని గల్పించినారు.[1]

ఇట్లు స్తుతిప్రధానములై కావ్యాంతర్గతములుగ మాత్రమే రచితములగుచుండిన దండకములకు తెలుఁగున గొంత యితివృత్తమును గూడ తోడ్పరచి వానిని ప్రత్యేక మొక వాఙ్మయశాఖగా వెలయింపఁజేసిన విఖ్యాతి తొలుత పోతన్నకే దక్కినది. అతని 'భోగినీ దండకము' ప్రత్యేకమొక లఘుకృతి. సర్వజ్ఞ సింగభూపాలుని భోగినీ

1. ఎఱ్ఱన-నృసింహ పురాణమున (5-111) "శ్రీనాధనాథా జగన్నాథ నమైత్రికరక్షా సమక్షా సరోజాక్ష సర్వాఖివంద్యా" అని మొదలుగా నృసింహస్వామిని స్తుతింపఁగా-పోతన భాగవతమున (8-201) దానినట్లే యనుకరించి "శ్రీనాధనాథా జగన్నాథ నమైత్రికరణా విపక్షక్షమాభృత్సహస్రాక్ష నీరేజ పత్త్రేక్షణా" అను రీతిని వేరొక దండకమును రచించెను. వీరి యీ రచనలలో స్తుతిమాధుర్యముతోపాటు వృత్త్యనుప్రాససౌభాగ్య మొకింత మాత్రమే గోచరించును. కాని తరువాత ప్రబంధకాలపు కవుల కావ్యములలో నీ దండకరచన మఱింత ప్రౌఢతనందుకొన్నది. ఉదాహరణకు నంది తిమ్మన్న పారిజాతాపహరణ ప్రబంధమున (8-88) గల గణసమక దండకమును జూడఁదగును. ఇందలి సమాసరచన, ముక్తపద గ్రస్తాలంకార సౌభాగ్యము, వృత్త్యనుప్రాసాదులతోపాటు రచన కొకింత ప్రౌఢిమను సంతరించి పెట్టినవి. ఇది శ్రీకృష్ణ చరితమును గూడ సంగ్రహముగ వివరించు స్తుతి ప్రధానమగు రచన.

సౌభాగ్యమును వర్ణించుచు కొంత చారిత్రికమానుషేతివృత్తము కథా విషయముగాఁగల సొబగురచన యిది. అది మొదలుకొనియే దండక రచన యొక స్వతంత్రమగునితివృత్తముతో నొక నూతన కావ్య ప్రక్రియగా తరువాతకవులచేత నాదరింపఁబడినది. ఆకోవకుచెందినదే తాళ్లపాకవారి 'శృంగారకదండకము.' పోతన్న రచన మానుషేతి వృత్తముగలదియై స్తుతిప్రధానమగు దండకరచన కించుకన్యూనత నాపా దింపఁగా వీరి 'శృంగారదండకము దివ్యమై దివ్యశృంగార మంగిగాఁగల దియై తన్మర్యాద నతిక్రమింపక ప్రస్తుతిపాత్రమై సాగినది. కావున నా కావ్యప్రక్రియామార్గమునఁ బూచినపూవులలోకెల్లనీ తాళ్ళపాకవారి 'శృంగారదండకమే' మేలుబంతి యనఁదగినది.

వీరశైవకవులు విరియించని యీ కుసుమరాజమును వైష్ణవ కవులగు తాళ్ళపాకవారే క్రొత్తగా విరియించి దివ్యసౌగంధ్యమును వెలార్పఁగా శ్రీపాదముల నలంకరింపఁ జేసినారు.

ఈ దండకములు స్తుతిమయములు, స్తుత్యేతరములు నని రెండు వర్గములుగా మనము పేర్కొనవచ్చును. తొలి వర్గమునకుఁ జెందిన స్తుతిప్రధానరచనలు కావ్యాంతర్భాగములేని కావచ్చును, లేదా, స్వతంత్రములేని కావచ్చును. కాని మలి వర్గమునకుఁ జెందిన స్తుత్యేత రములు స్వతంత్రములై యొక నూతన కావ్యప్రక్రియఁగా వేర్పాటు చేసి చెప్పఁదగిన విడి రచనలు.

*శృంగారదండకము—*[1] కర్త: తాళ్ళపాక పెద తిరుమలాచా ర్యుఁడు. ఇది యొక స్వతంత్రమగు లఘుకృతి. దివ్యశృంగార మయ మగు పద్మావతీ శ్రీనివాసుల పరిణయ గాథను రసవంతముగాఁ జిత్రిం చిన దండకమగుటచేత దీనికి శృంగారదండకమని పేరైనది. శ్రీవేం కటాచలాధీశున కంకితము. ఈ విషయమునే కవి యిట్లు గ్రంథాం తమున చెప్పుకొనినాఁడు.

1. ముద్రితము. చూ తి.తి. దేవస్థానము వారి ప్రతి 1935. 'తాళ్ళ పాక వారి లఘుకృతులు.' పు 86-93.

"సన్నుతిఁ దాళ్ళపాక పురశాసనుఁడన్నయ తిమ్మనార్యుఁ డ
త్యున్నతిఁ జెప్పె దండకము దుగ్ధపయోనిధి కన్యకా రతి
స్ఫిన్నమృగీమదాంకునకు వేంకటభర్తకు నవ్యభోగ సం
పన్నన కారవిందుకులపర్వతతారకమై చెలంగఁగాన్"

ఈ దండక రచన శ్రీకారముతో నారంభమై తగణములలో సాగి గుర్వంతమై లాక్షణికమై యొప్పి యున్నది. కాని యిది యొక స్వతంత్రమగు లఘుకావ్యప్రక్రియ యగుటనుబట్టి దేశీయ కవితా మర్యాద ననుసరించి ఉదాహరణాదులందువలె గ్రంథము అంకితాంక పద్యముతో ముగియుచున్నది.[1]

ఇట్లు దండకరచన అంకితాంకపద్యముతో ముగియు పద్ధతి యంతకు పూర్వపుఁ గవులు పాటించినదియు, లాక్షణికులు నిర్వచించి నదియు కాదు. తాళ్ళపాక కవులే దీనినీ నూతన ప్రక్రియలందు క్రొత్తగా వెలయించి వానికొక నూతనత్వమును గల్పించినారు. ఈపద్ధతినే తర్వాతకవు లనుసరించి స్వతంత్ర దండకరచనల నంకితాంక పద్యములతో ముగింపఁజేయుట కారంభించిరి. తదాది దండక రచనలకును అంకితాంక పద్యరచన మొక అనివార్యలక్షణమైపోయినది.

ఇట్లు లాక్షణికమై స్వతంత్రమై, నూతనమై సాగిన యీ దండకరచన వృత్త్యనుప్రాసాదులతోను, ముక్తపదగ్రస్తాలంకారాదులతోను విలసిల్లి హృద్యమై యున్నది. మచ్చున కీపంక్తులు పరిశీలింపఁ దగును.

---

1 ఉదాహరణాది లఘు కృతులను అంకితాంక పద్యములతో ముగియఁజేయు సంప్రదాయము నారంభించినవాఁడు పాల్కురికి సోమనాథుఁ డనియే ఒక విధమునఁ జెప్పవలెను. అతని తెలుఁగు బసవోదాహరణమున నీ మర్యాద కానరాకున్నను, సంస్కృత బసవోదాహరణమున మాత్రము దీనిని పాటించినాఁడు. సోమనాథుని తెలుఁగు బసవోదాహరణమున లేని కారణమున గావచ్చును, త్రిపురాంతకుని త్రిపురాంతకోదాహరణమున గూడ నీయంకితాంకపద్ధతి కానరాదు. కాని దండకోదాహరణాది యాంధ్ర లఘు కృతులందీ సంప్రదాయమును తొలుత బాటించి తరువాతివారికిని మార్గదర్శకుఁడైనది తాళ్ళపాక పెద తిరుమలాచార్యుఁడే.

"శ్రీ వేంకటక్ష్మాధరోత్తుంగశృంగాగ్రనిత్యస్థిరాగారు, గారుత్మతోద్దీర్ణ సౌవర్ణభూషావిశేషోజ్జ్వలాకారుఁ, గారుణ్యతారుణ్యలావణ్య సారప్రభాసద్మపద్మాధరాధీరలీలాకరోదారసంసారు, సారూప్య......"

ఈ తీరు రచనా చమత్కృతి[1] పెద తిరుమలాచార్యుని చక్రవాళమంజరియందును విశేషమగుటను గూర్చి పూర్వమే వ్రాసితిని. ఈ శబ్దార్థాలంకారములు కావ్యాంగమునకు వన్నెవెట్టునవిగా నున్నవి. ఒకే గణముతో సాగినను దండకమునందు వీరి రచన విసుగుఁగొల్పక వింతగతులను గూర్చుకొని వల్లెవేసి పాడుకొనఁదగినదిగా నున్నది. ఈ పంక్తులు తిలకింపఁదగును.

"నేఁడు చూడంగ నాకొక్కయేఁ డయ్యెడున్, వాడి పూఁతూంపముల్, వేఁడి క్రొవ్వెన్నెలల్, క్రూరముల్ కీరముల్, ఘోరముల్, భృంగఝుంకారముల్, దీపితారోపముల్ కోకిలాలాపముల్."

"కందుకక్రీడ గావింతమా, వింత మార్గంబుగా, నిందురాయిందురాజన్ముఖీ చూతమా, చూతమాలూరపుంజంబు, మోమెత్తి మాటాడవే, యాడ వేసాలు బోనేల పోనే లతాతన్వి......"

"దప్పికిం గప్పురం బొప్పుగా నీనగుంగాక హైయంగవీనాతిపానంబు సేయింపనేలా, సరోమండలీసౌరభోదండ సత్పుండరీకంబు సొంపారఁగాఁ జేయ, నాశారదోదారకాలంబు గోరం దగుంగాక, ప్రాలేయ జాలాతిలాభీల కీలాల వేలాభిలాషంబులేలా, లసల్లీల, మల్లీమతల్లీ సువల్లీమిళత్కోరకంబు స్వీకారంబునందింపుతో......"

---

1. దండకరచనయందు దిట్టయలంకారసౌభాగ్యమును వెలయింపఁజేయుటలో పెదతిరుమలాచార్యునకు సాటిచెప్పఁదగిన కవి పారిజాతాపహరణకర్తయగు నందితిమ్మన యనవచ్చును. ఈ పంక్తులు పోల్చి చూడవచ్చును. "యదుతిలక, జగత్త్రయీ నిర్మితి ప్రక్రియా కర్మఠేందిందిరోద్భాసి నాభీసరః పద్మ పద్మాసతీపాదపీఠాకృతి ప్రస్ఫుర త్కౌస్తుభాంకూరితాళీకబాలాతప ద్యోత సద్యోవరంగిణ్యుదక్షాళితైణాంక......"

25)

ఇట్లు 150 పంక్తులకు మించియున్న యీ గ్రంథ మాద్యం తము హృద్యముగనున్నది. ఇందలి యితివృత్తము ప్రాయికముగా అన్నమాచార్య పెద తిరుమలాచార్యులు రచించిన శృంగారమంజరీ చక్రవాళమంజరీ రచనల యందలి యితివృత్తమును బోలినదే. దివ్య మంగళ విగ్రహుండగు శ్రీ వేంకటాచలాధీశుని గుణగణములను నానాంగనా శ్రేణి కీర్తింపగా నొక్కబింబోష్ఠి యాలించి మోహంబు గీలించుటయు, మఱపించుటకై చెలులామెను జలక్రీడలకుఁ గొంపోవుటయు, వారట్లు మండలాకారంబుమైయుండి క్రీడింపఁగాఁ గాంచి యప్పంకజావాసముం గాచియున్నట్టి కాంతల్ వారిం జేరి యాతనికిఁ దగిన పధూరత్నమామెయే యని విన్నవించుటయు, నాస్వామి భవ్య సౌధాగ్రంబు పైనెక్కి యాకామిని న్వేమఱున్ జూచి కామించుటయు నిరువురకును చక్షుః ప్రీతి యగుటయు, శ్రీ వేంకటేశుం డతండని మనమున నెఱిఁగి యానాయిక గాలినాడించు కేళిపటంబందు నందం బుగా విన్నపంబుల్ దగం గస్తురిన్ వ్రాసి సూత్రంబునంగట్టి యా చక్రి సౌధంబుచాయన్ ముదం బార నాడించుటయు, దానినిబట్టి యాతఁడు నట్లే గాలిపటమున సమాధానమును బంపుటయు, నాయిక విరహావస్థ ననుభవింపఁగా, శైత్యోపచారములతోఁ గుదుటువడక చేయునది లేక చెలులే వెడలి శ్రీ వేంకటేశున కావృత్తాంతమును విన్నవించి విన్కలింగన్కలిం జిక్కి వేగుచున్న యామెను రక్షింపవేడుటయు, స్వామి యనుగ్రహించి శృంగారపుందోటకు వచ్చి యా నాయికను శృంగారరసాబ్ధి నోలలాడించి యిందిరామందిరంబైన యాత్మీయ గేహంబునకుఁ గొంపోవుటయు నాదిగాగల్గు విషయమే యిందలి యితివృత్తము. కాని పూర్వోదాహృతములగు మంజరీరచనలందు వలెగాక యిందు జలకేళికి ప్రాధాన్యముండుటయు సౌధాగ్రంబుల మీఁదినుండి గాలిపటముల మూలమున రాయబారములు సాగుటయు ననునంశములు క్రొత్తలు. ఇట్టి కూర్పుతోఁ గూడిన యీ దండక రచన దేశీయమగు వాతావరణముతో నొప్పి రమణీయమైయున్నది. గానయోగ్యమగు నీ రచనయు పూర్వోదాహృతములగు మంజరీ రచనలవలెనే సంస్కృత వేంకటాచల మాహాత్మ్యమునందలి పద్మావతీ

శ్రీనివాసుల పరిణయ కథా రచన కనుకృతియై, వాని వలెనే తిరుమల మీఁది స్వామివారి వైవాహికోత్సవముల సందర్భమున సంస్తుతి సేయఁబడుచుండెడిదేమో! అట్లే కానిచో తాళ్లపాకకవీశ్వరు లిదే యితివృత్తము నిట్లిన్నిమారులు ఇన్నిరీతులలో వెలయించుటకు హేతువు వేరేమై యుండును?

*అష్టభాషా దండకము*[1] :— కర్త- తాళ్లపాక అన్నమాచార్యుని మనుమఁడును, పెద తిరుమలాచార్యుని పెద్ద కుమారుండును నగు చిన తిరుమలాచార్యుఁడు. అష్టభాషాకవిచక్రవర్తి యని బిరుదము గలవాఁడు సంస్కృతాంధ్రములందు మహాకవియు, మహావిద్వాంసుఁడునగు నీకవీశ్వరుని ప్రతిభాసంపత్తికీదండకమొక నికషోపలము. సార్థకబిరుదాంచితుఁడగు నీకవీశ్వరుఁ డిందు సంస్కృతముతోఁబాటు షడ్విధప్రాకృతములను సార్వదేశి (నాగర) భాషను జోడించి వెరసి అష్టభాషలలో కవితారచనగావించినాఁడు. అందుకే యిది అష్టభాషాదండకమైనది. ఇందు ప్రయోగింపఁబడిన భాషలు క్రమమున 1. సంస్కృతము 2. ప్రాకృతము 3. శౌరసేనీ 4. మాగధీ 5. పైశాచీ 6. ప్రాచీ 7. అవంతీ 8. సార్వదేశీ.

---

1. ముద్రితము చూ. తి. తి దే. ప్రచురణము 'లఘుకృతులు' సం. 1 (పు-151-156) తాళ్లపాకవారి లఘుకృతులు కొన్నిటితోఁబాటు ఈ అష్టభాషాదండకము కూడ రాగిరేకులపై భద్రముగా చెక్కఁబడియున్నది. గ్రంథాంతమున అవి చెక్కఁబడిన తేదీ వివరణమిట్లున్నది

"హేమళంబి సంవత్సర మార్గశిర శుద్ధ ౫ బుధవారము తాళ్ళపాక చిన తిరుమలాచార్యులు అనతిచ్చిన అష్టభాషాదండకం తామ్రశాసనస్థముగాను వ్రాయించితిమి"—

ఇది సరిగా క్రీ॥ శ॥ 1537- నవంబరు 7 వ తేదికి సరిపడును. అనఁగా క్రీ॥ శ॥ 1490-1553 సం॥ల నడుమ జీవించిన యీ కవీశ్వరుఁడు ప్రాయికముగా నీ రచనలను 1537 నకు పూర్వమే తన ముప్పది, నలువదియేడుల ప్రాయమున ముగించియుండవచ్చును

ఇట్లు అష్టభాషలలో నీదండకమును రచించుటలో చినతిరుమలాచార్యునితోఁబాటు, అఖిలభారతదైవతమని ప్రసిద్ధిగాంచి 'నానాదిక్కులవరుల' నెల్ల నాకర్షించి మహిమలను బ్రదర్శించుచున్న శ్రీవేంకటాచలాధీశుని సంస్తుతించు నీరచనము తత్తద్దేశీయభాషాపరిజ్ఞానముకలవారికెల్ల ననువుగా జపించుకొనుట కుపకరించునుగాకను జిజ్ఞాసయుఁగొంత మనకు గోచరింపకపోదు. తాళ్ళపాకకవులు కేవల పదకర్తలే కాక యుద్దండులైన బహుభాషాపండితులనియు, సమకాలమువారికీకృతివలన చినతిరుమలాచార్యుఁడు నిరూపించుకొనినాఁడు.

ఇది లక్షణబద్ధమగు దండకరచన. శ్రీకారముతో నారంభమై తకారమునసాగి గుర్వంతమై యొప్పుచున్నది. స్తుతిమాత్రసుందరమగు నీదండక మొకస్వతంత్రమగురచన మగుటనుబట్టి యాకావ్యప్రక్రియలో పెదతిరుమలాచార్యుఁ డనివార్యమగునట్లుగా కల్పించిన నూతనమగు అంకితాంకపద్యరచనమను సంప్రదాయమునుగూడ నిందు కవి తుదకు పాటించినాఁడు. ఇందలి యంకితాంకరచన శ్లోకరూపమున నిట్లున్నది.

"వాణీవీణానినాద ప్రతిమ చతురవాక్ తాళ్లపాకాన్నయార్య
స్తత్పుత్ర స్తిమ్మయార్యో జి ఫణి భణితిం స్తత్సుతేనాష్టభాషః
క్లుప్తోయం తిమ్మయేనా రచిత పదగతి ర్వేంకటాద్రీంద్రభర్తు
స్తస్యోద్యత్కీర్తికేతు ర్జగతి విజయతాం దండకం పండితేభ్యః"

ఇది శ్రీవేంకటేశ్వరస్వామి కంకితము. దండకము నారంభించుటకుఁబూర్వము కవికావ్యారంభమున స్వామివారిని స్తుతించుచు రెండు స్రగ్ధరావృత్తములను రచించెను.[1] ఇందు తొలి వృత్తము సంస్కృతమునను, మలివృత్తము మిగిలిన ప్రాకృతాపభ్రంశములందును సంధా

1. మగణమ్ముగదియ రగణ ముండుటచేత నశుభదాయక మనియు, స్రగ్ధరావృత్తముతోఁ గావ్యము నారంభింపరాదనియు తెలుఁగు లాక్షణికుల మతమైనను, నిది సంస్కృత రచన మగుటచేత కాళిదాసాదుల ననుసరించి యీతఁడు స్రగ్ధరనే తొలుతఁ గైకొనినాఁడు.

నింపఁబడుటచేత మున్ముందు దండకమంతయు, నాతీరుననే అష్టభాష లలో రచితమగుననన్న సూచన మిందుగలదు. ఇఁక దండకమునందు 'కోటికందర్పలావణ్యమూర్తి'యగు శ్రీవేంకటాద్రీశుని శృంగార వర్ణనమును, సంస్తుతియు మెండుకొనియున్నవి. ఇందలి కవిత సంస్కృతమునందువలెనే మిగిలిన ప్రాకృతాపభ్రంశములందును ధారాళమై గాడీకీతి నోజోగుణభరితమై యున్నది. మచ్చున కీపంక్తులు తిలకింపఁ దగును.

సంస్కృతము :— "శ్రీవేంకటాద్రీశ జీమూతనీలాంజనగ్రావ బృంద ప్రభాభాసమానాంగ శృంగార శృంగారరూపోల్లసత్కోటికందర్ప లావణ్య వారాన్నిధే, మన్నిధే, సన్నుతాశేష శేషాదిభాషావిశేషార్థ గంభీర జంభారిశంభుస్స్వయంభూముఖామర్త్యజూట ప్రభాసేవ్య దివ్యాపగాభవ్యపాదాబ్జ కేకారవాపాదకాకీర్ణ...త్రయీ రావబంధూ భవత్కింకిణీధ్వానకాంచీకలావద్యుతే—"

ఇట్లే యీ కవి తరువాత షడ్విధప్రాకృతములలోఁగొన్ని కొన్ని పంక్తులు రచించి తన పాండిత్యమును భాషాపరిజ్ఞానమును వెల్లడించుకొనెను. ఈ షడ్విధాపభ్రంశములనేగాక (వానియన్నింటి సమ్మిశ్రణరూపమవఁదగినట్టిదేమో!) 'సార్వదేశి' అనునొక భాషారూపమును గూడ నీ కవి గ్రంథస్థముగావించినాఁడు. మచ్చున కీపంక్తులు కొన్ని చూడఁదగును.

సార్వదేశి :— "హేభట్టి యోసవ్వదేసేసకంప్లాకుడుంగేతు మంతత్తియే......ఇందిరానాహుతుంప్హాక్కసవ్వంగయో కిక్కడీదొంగ రీనావానారాయణో దేణమో దేణమో దేణమో !"

ఈరీతి నిందలి రచన బహుభాషామయమై లక్షణబద్ధమై యున్నది. ముఖ్యముగా సంస్కృతభాగమందలిరచన కాళిదాసునిదని చెప్పఁబడు శ్యామలాదండకమువలె చదువఁజదువఁ జవులూరించుచున్నది. ఈ రీతిని స్వతంత్రమగు 'దండకవాఙ్మయప్రక్రియయందు తాళ్ళపాకవారికై ముదుపు ప్రశస్తమును విశిష్టమునై యున్నది

## రగడలు

ఆశు, మధుర, చిత్ర, విస్తరములను చతుర్విధ కవితలలో 'రగడ భేదంబులును, దండక వృత్తంబులును' చిత్రకవిత్వంబునకుఁ జెందినవిగా లాక్షణికులు నిర్వచించిరి. ఈ రగడలే ఉదాహరణప్రబంధములందు ప్రయుక్తములై మధురకవితాశాఖకును జెందుచున్నవి[1] ఇట్లు చిత్రమధురకవితాశాఖలకుఁ జెందినదిగాఁ జెప్పఁబడిన దేశీయమగు నీరగడఛందము మిక్కిలి ప్రాచీనము. ఆంధ్ర కర్ణాటకములం దీఛందమునకు విశేషప్రచారమున్నది. మన ప్రాతపాటలలో పెక్కుపాటలీమాత్రాఛంధమున నొదుగునవే. ఇట్టి పాటలలోని గతిమాధుర్యమునకు లోఁగియే కావచ్చును వాని నుండి మన కవులును లాక్షణికులును రగడయను నొక ఛందమును గుర్తించి నిర్వచించుకొనినారు. కర్ణాటకకావ్యములం దీరగడరచన తొమ్మిదిపది శతాబ్దులందే కానవచ్చుచున్నది.[2]

ఇది దేశిఛందమగుటచే కావచ్చును సంస్కృతమం దీరగడరచనకు ప్రచారము లేదు. అయినను దేశీయమగు ప్రభావమునకు గురియై కొఁబోలును దాక్షిణాత్య సంస్కృత కావ్యములందు మాత్రమే

---

1. వార్తాకపిరాఘవయ్య (17 వ శతాబ్ది) తన లక్షణదీపికయందీ నిర్వచనము గావించినాఁడు. ఈతఁడు విభక్త్యధిదేవతోదాహరణములను మధురకవితాశాఖకును, రగడ భేదంబులును దండకవృత్తంబులును చిత్రకవిత్వ శాఖకును జెందినవిగాఁ జెప్పినాఁడు,

2 "రగడలు కన్నడమున క్రీ॥ శ॥ 840 ప్రాంతములకే వర్ధిల్లుచున్నట్లు కవిరాజ మార్గము తెలుపుచున్నది. క్రీ॥ శ॥ 940 లో పంపమహాకవి లలిత మందానిల రగడల వాడియున్నాఁడు. క్రీ॥ శ॥ 990 ప్రాంతముల నాగవర్మ ఛందోంబుధియందు లలిత, మందానిల, ఉత్సవ అను మూఁడు విధములగు రగడల నిచ్చియున్నాఁడు. వీనిలో మందానిలము తెలుఁగున మధురగతికి, లలిత ద్విరదగతికి, ఉత్సవ తురగవల్గన రగడలకు సరిపోవును." (చూ. శ్రీ. ని. వేంకటరావుగారి ఉదాహరణ వాఙ్మయ చరిత్రము పు. 70)

కానరగుచున్నది. క్రీ॥శ॥ 9వ శతాబ్దినాఁటి సోమదేవసూరి యశస్తి లక చంపువున రగడలు కలవు. మచ్చునకు,

"వికచకర్ణోత్పలస్పర్థి తరళితదృశాః
కేళికాశకవ్యణత్కనకమయ కంకణాః
సరసనఖరాజి విస్ఫురితభుజమండలాః
కాంచికోల్లాస వశ దర్శితోరుస్థలాః"

ఇది తెలుఁగున ద్విరదగతిరగడతో సరిపోవుచున్నది. రెండేసి పాదముల కనుప్రాసము కూడ పాటింపఁబడినది. కాని మాత్రా గణప్రధానమగు నీ దేశిరచనా విశేషమునెలుఁగని కారణముననేమో తద్వ్యాఖ్యాత వీనిని గుర్తింపలేదు. అచ్చునగూడ నేఁడిది వచనరూపముననే ముద్రితమై యున్నది. (చూ. వివరములకు శ్రీ వేంకటరావు గారి ఉదాహరణవాఙ్మయచరిత్ర. పుట. 70-72)

ఇట్లు దేశీయమగు నీ ఛందము దాక్షిణాత్యసంస్కృతకవుల నాకర్షించుటయే కాక వారికి 'క్రౌంచపద' మనునొక నూతన ఛంద మును గూడ నిది యావిష్కరించిపెట్టినది. మాత్రాగణబద్ధమగు నీ రగడఛందమే అక్షరగణబద్ధమగు క్రౌంచపదమను వృత్తముగా రూపొందినది.

ఇట్లు ప్రాచీనకాలముననే కర్ణాటకకావ్యములందు ప్రవేశము గల్పించుకొని సంస్కృతకవితయందు సైతము రూపాంతరమునావిష్క రించుకొన్న ఈ దేశిఛందము తెలుఁగున నంతకు చాలకాలమునకుఁ దరువాత గాని కావ్యములందు ప్రయోగింపఁబడలేదు.

రాజరాజ నరేంద్రుని కోరుమిల్లి శాసనమం దీరగడఛంద మున్నట్లుగా శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు వ్రాయుచున్నారు. ఇట్లు శాసనములం దెడనెడ నిట్టి రగడరచన కానవచ్చినను నన్నయ నన్నిచోడ తిక్కన యెఱ్ఱనాది కవులెవ్వరును దీనిని ప్రయోగించినట్లు తెలియరాదు. వీరిలో ఒక్క నన్నిచోడఁడు మాత్రమే తన కుమార సంభవమున ఈ రగడ రచనకు రూపాంతరమగు క్రౌంచపదమను వృత్తమును వాడి యున్నాఁడు.

"చంచుల నాస్వాదించుచు తేఁ దూం
డ్లఁగరువు ప్రియులకు నలఁదుచు మైరో
మాంచము లోలిం గంచుకితంబై
పాదమఁగ నదరుమఁ బులినములం గ్రీడించుచు" (10-80)

ఈ వృత్తమును నన్నయ పరిగ్రహింపలేదు ఇది అక్షరగణని బద్ధమై సంస్కృత వృత్తమువలె యతిప్రాస నియమములఁ గూర్చుకొని యున్నను, మాత్రాఛందస్సు ననుసరించి చూడఁగా ప్రసిద్ధమగు రగడ రచనఁగా భాసించును. సంస్కృతవృత్తమున నిది పాదమున కిరువదియైదక్షరములుగలది. 'భ మ స భ న న న న' అను గణములును ఒక గురువును నుండవలెను. నన్నిచోడుఁడిందలి తుదినగణమునగల తుది రెండులఘువులను గురువుగామార్చి పాదమున కిరువది నాలు గక్షరములతో వృత్తరచన సాగించెను. ఈ ఛందోరచన అక్షర గణబద్ధమగు సంస్కృతవృత్తమనుట కన్న నడకనుబట్టియు, విరుపును బట్టియు మాత్రాగణబద్ధమగు దేశి రచన యనుటయే సమంజసమై యున్నది దేశీయములగు రగడలలో నిది మధురగతి రగడకు సరివచ్చును. క్రౌంచపదమున తుది రెండుగురువులు నియతములై యున్నవి. కాని రగడలో నీ నాలుగుమాత్ర లెట్లైన నుండవచ్చును. అందుకే మాత్రాగణబద్ధమగు దేశీయఛందోభేద మక్షరగణబద్ధముగా సరిచేయఁబడుటచే నిది వృత్తముగా మారి యుండునని శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు భావించిరి.[1] ఇట్లు దేశీయములగు ఛందములెన్నియో సంస్కృత వృత్తములుగా మారినవి గలవు ఇదియు నట్టిదై యుండవచ్చును. మాత్రాఛందమునందలి మాధుర్యము నెఱుఁగని కవులు దీనినివృత్తముగనే సాగించినను నన్నిచోడుఁడు మాత్రముకొంతమార్చి ప్రాసయతిని పాటించి మఱల దానిని రగడగనే కూర్చుటకు యత్నించెను. ఇట్లు నన్నిచోడుని కాలమునకు క్రౌంచపదవృత్తరూపమున మాత్రమే రగడరచన కానవచ్చినది. అంతే కాని రగడవిభేదములను

1. చూ. నన్నెచోడుని కుమారసంభవము. మదరాసు విశ్వవిద్యాలయ ప్రచురణము – పీఠిక పు. Lvi శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు.

తెలుఁగుకవు లప్పటి కింకను కావ్యరచనయందు చేపట్టలేదు. తెలుఁగునకుఁ దొలిలక్షణగ్రంథమగు కవిజనాశ్రయమున గూడ దీనికి లక్షణము లేదు. ఇట్లు ఆంధ్రకావ్యపథమున నప్పటి కింకను ప్రవేశము కల్పించుకొనని యీ రగడ నొక కావ్య ప్రక్రియఁగా పరిగ్రహించి తరువాతకవులకు దారిచూపిన విఖ్యాతి తొలుత వీరశైవ కవులకే దక్కినది. పిదప దానిని పరిపోషించిన ప్రశస్తి వైష్ణవ కవులకే దక్కినది.

తెలుఁగున రగడలు ప్రత్యేకముగా వందలకొలఁదిచరణములతో నుండును. పాల్కురికి సోమనాథునివిగా పేర్కొనఁబడు రగడలును, వైష్ణవుఁడైన చక్రపాణిరంగన శైవుఁడుగా మారిన పిదప చెప్పినవిగా పేర్కొనఁబడు నయనరగడ, నమశ్శివాయరగడలును[1] నిట్టివే.

కాలమునుబట్టి వీనితరువాత విడిగా రగడతో కృతిని వినిర్మించిన విఖ్యాతి సుప్రసిద్ధవైష్ణవకవియు, వచనసంకీర్తనకర్తయునగు కృష్ణమాచార్యునిది. 'రామనామములు' 'నృసింహనామములు' అను రెండు రగడకృతులీకవీశ్వరునివి నూతనముగా తెలియవచ్చినవి.[2] అటుతర్వాత తెలుఁగున నీరగడరచనకు ప్రచారము హెచ్చినది. తెలుఁగు లాక్షణికులును దీని లక్షణమును విపులముగా వివరించిరి. క్రీ॥ శ॥ 1402 ప్రాంతమున విన్నకోటపెద్దన రగడనుగూర్చి సంగ్రహముగనే పేర్కొన్నను 1435 ప్రాంతములందు అనంతుఁడు మాత్రము తన ఛందోగ్రంథమున అష్టవిధములగు రగడభేదములనుగూర్చి విపులముగను సంపూర్ణముగను లక్షణమును రచించెను.[3] పిదప కస్తూరిరంగకవి తన రంగరా

---

1. ఈ రెండు రగడలును నేఁడు ప్రత్యేకముగా ముద్రితములైనవి. చూ. శ్రీ తిరుమల వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయ సంచిక 7. సం॥ 1, పుటలు (17-40) శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే పరిష్కృతములు.

2. వివరణమునకు "సంకీర్తనపద కవితా ప్రపితామహుఁడు - కృష్ణమాచార్యుఁడు" అను వ్యాసము చూడఁదగును - భారతి.

3. చూ. విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణి-రగడ.

సరియాావదిలేకులచే

బరువడి నుత్సాహ వృత్తపదయుగళముచే

ట్ఛందస్సులో గానయోగ్యములగు నీరగడలకు రాగతాళముల నిర్దేశముతో సంగీతలక్షణముగూడ విపులీకరించెను

అదిమొదలుకొని అనఁగా క్రీ॥ శ॥ 15వ శతాబ్ది ప్రారంభము నుండియు శ్రీనాధాది తెలుఁగు కవులు పలువురు తమతమ కావ్యములలో గేయరచనావిన్యాసమున కనువుగూర్చు సన్నివేశములం దీతీరు రగ

నిరవుగ వడిప్రాసంబుల
నరుదుగ రచియింప రగడయగుఁ దగు వృత్తిన్.' (4-40)

చూ. అనంతుని ఛందస్సు.

"ఆద్యంత ప్రాసంబులు
హృద్యంబుగ రెంట రెంట నిడిపాదములు
ద్వ్యద్వ్యతులఁ గూర్పఁదగు నన
వద్యంబుగ రగడలందు వారిజనాభా."

ఈతఁడు పేర్కొన్న రగడవిశేషము లివి.

1. హయప్రచార (తురగవల్గన రగడ:— త్రిస్రగతి (రూపకతాళము)

'శ్రీ పతిఁ బరమ పురుషుఁ జిత్తమున దలంచువారు
వాసవాది నిఖిల దివిజ వంద్యు నాశ్రయించువారు.'

2. విజయమంగళ రగడ :— పై తురగవల్గనము రెండుపాదములొకటిగాఁ జేసి యట్టి రెండేసి పాదములకు ప్రాసను పాటించుట.

"శ్రీధరాయ శిష్టజన నిషేవితాయ భక్తలోక
జీవితాయ గర్వితోరుసింధురాజబంధనాయ
గాధిపుత్ర యజ్ఞవిఘ్నకర మహాసురీ మహోగ్ర
కాయశైల దళన నిపుణఘనసురాధిపాయుధాయ"
(త్రిస్రగతి రూపకతాళము)

3. ద్విరదగతి రగడ :— (ఖండగతి) (జంపెతాళము)

"శ్రీయువతి నిజయువతిఁ జేసి యొంతయుమించి
కాయజునిఁ దన తనయుఁగా నెలమిఁ బాటించి"

4. జయభద్ర రగడ :— ఇది ద్విరదగతికి రెట్టింపు (ఖండగతి. జంపెతాళం).

డలను లెక్కకు మిక్కిలిగా రచించినారు. తొలుత వారు స్తుతిసందర్భములందుగాని యేదేని మహిమోపేతమగు విషయమును వర్ణించు పట్టునందుగాని రగడలను వాడుచుండిరి. అనఁగా కీర్తనమున కీరగడలను వాడిరన్నమాట. కాని తరువాత ప్రబంధకాలపు కవులు అందలి గానాంశమును బురస్కరించుకొని విలాసవతులు వేడుకలతో విహరించు పుష్పాపచయసందర్భము లందును ఈరగడల నుపయోగించిరి.

---

"శ్రీకి నాదయం బనఁగఁ జిత్తజుని గురుఁడనఁగ
శేషశయనుండనఁగఁ దెలుపుఁగఁ జతుర్భుజుఁడు
వాకౌకసుల నేలు ... ...నందగోపాత్మజుఁడు"

5. మధురగతి రగడ :— (చతురస్రగతి - ఏకతాళము)

"శ్రీవనితాధిపుఁ జేరి భజింపుఁడు
పావనజనకుని భక్తిఁ దలంపుఁడు."

6. హరిగతి రగడ :— ఇది మధురగతికి రెట్టింపు.

"శ్రీరామాకుచకుంకుమ పంకము
చేఁబొలువగు విపులోరఃఫలకము
తారతుషార ... ... ... ... పదకమలము."

7. హరిణగతి రగడ :— (మిశ్రగతి - త్రిపుటతాళము)

"శ్రీనివాసు భజింతు నేనని
పూని కుజముల పొంతఁబోనని"

8. వృషభగతి రగడ :— ఇది హరిణగతికి రెట్టింపు.

"శ్రీమనోహరు నంబుజోదరు
చిత్తజాతగురుం దలంచెద
కామితార్థ విధాయి నిర్జిత
కాళియాహిని నాశ్రయించెద" (మిశ్రగతి. త్రిపుటతాళము)

17వ శతాబ్దికిఁ జెందిన అప్పకవియు నిట్టి లక్షణమును వివరించుచు 'నవవిధ రగడల'ను పేర్కొనెను. అతని పరిగణనమున హయప్రచారము తురగ వల్గనమున సగము.

పదునారవశతాబ్దిలో తాళ్ళపాకకవులుకూడ కృష్ణమాచార్యాదులవలెనే దివ్యవిషయములను గీర్తించువట్టున రగడలనే గైకొనిరి.

*సుదర్శనరగడ* :— కర్త: తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు. వైష్ణవమతప్రచారమునకై సాహిత్యమును సాధనముగాఁ గొని యనేకనూతనప్రక్రియలను సాధించిన యాతని పలువిధములగు కృతులలో నీసుదర్శనరగడ యొకటి. ఇది అనంతుడు పేర్కొన్న రగడవిభేదములలో మధురగతిరగడకుఁ జెందినది. 'ఆద్యంత ప్రాసంబులు ప్ర్యాద్యంబుగ రెంటరెంట నిడి పాదము లుద్యద్యతుల'ఁగూర్చిన లాక్షణికమగు రచన. ఇందు 59 రగడలు—అనఁగా 108 పంక్తు లున్నవి. కృతి ఓంకారముతో నారంభమై '(శ్రీ)వేంకటపతి' నామ ముద్రతో నంతమైయున్నది. ప్రతిచరణాంతమున 'చక్రము' అను పదమే అంత్యప్రాసమై పునః పునరావృత్తమై సుదర్శనచక్రమాహాత్మ్యము నుగ్గడించునదియై యున్నది.

---

1. హయప్రచారము :— 'ఋతు విరామ మినులు నల్వురతుక
నొక్క యంఘ్రి చెల్వ'
2. తురగ వల్గనము :— 'హయప్రచార మిమ్మమడించి'
3. విజయ మంగళము :— 'తురగ వల్గనంబు రెండితోడ విజయమంగళంబు'
4. ద్విరదగతి :— 'కర మొప్పఁ బంచలఘుగణచతుష్టయముచే'
5. విజయభద్రము :— 'ద్విరదగతి రెట్టింప విజయభద్రము చెల్లు'
6. మధురగతి :— 'నాలుఁగు మాత్రలు నాటిన గణములు
నాలుఁగు రెంటికి నలి విరమణములు'
7. హరిగతి :— 'న ల స భ గగములలోపల నేవైనను
నెనిమిది నాల్గిటిపై విరమను.'
8. హరిణగతి :— 'నరహరి పదియు నాలుఁగు లములు'
9. వృషభగతి :— 'ఇరువది యెనిమిది లఘువులు
పదియేనిట విశ్రాంతియుఁ గూర్చిన'
(చూ. అప్పకవీయము. 4-447, 489).

"ఓంకారాక్షర యుక్తము చక్రము
సాంకమధ్య వలయాంతర చక్రము
శతమతఖండన చతురము చక్రము
దితినవవినికర కల్పిత చక్రము
కాలదండ శతకాండము చక్రము
జ్వాలానలముఖశౌర్యము చక్రము
విస్ఫులింగచయ విభ్రమ చక్రము
సస్ఫాలిత భుజహారము చక్రము
భద్రగజప్రభుపాలన చక్రము
రుద్రైకాదశ రూపము చక్రము
మిథ్యావాద తిమిరహార చక్రము
తథ్యామృత సంతర్పిత చక్రము
వేయువిధంబుల వెలసిన చక్రము
వేయంచులు గల విశ్వపుఁ జక్రము.
భావించు సుజనపాలన చక్రము
శ్రీవేంకటపతి చేతిది చక్రము."

శ్రీమహావిష్ణుని పంచాయుధములలోఁ బ్రశస్తమగు నీ సుదర్శన చక్రము యొక్క మహిమము హరివంశ భాగవత పురాణాదులందు వర్ణితమైనట్లే యిందున్నది. తెలుఁగున పూర్వకవులు పలువురీ చక్రము నిట్లే పలువిధముల స్తుతించినారు[1]

1. మచ్చునకు:

"సతతంబు న్నుతియింతు జంతుమయసంసారక్రియారక్షణా
క్షతశౌర్యక్షపితారి వక్షమగుటన్ సంగ్రామ భీమభ్రమా
గతగేహాంతిక దీర్ఘికా తటలుఠత్కంఠ ఛ్ఛిదాచ్ఛాదన
క్షతజక్షాళిత కేళికామరసరక్షశ్చక్రమున్ జక్రమున్."

(నాచనసోమన - ఉ. హ. 8-149)

"నీరజాక్షుండు చాల మన్నించునట్టి శస్త్రముఖ్యమ కావవే చాలుక్యమునిని"

"ఏ నమస్కరింతు నింద్రశాత్రవవధూమ
కేతువునకు ధర్మసేతువునకు

తాళ్ళపాక అన్నమాచార్యుని సంకీర్తనములందును సుదర్శన చక్రస్తుతి పలుతావుల కాననగుచున్నది.[1] ముఖ్యముగా నీ సంకీర్తనమున వర్ణితమైనట్లే సుదర్శనచక్ర మీ రగడయందును వర్ణితము.

నమో నమో దానవవినాశ చక్రమా
సమర విజయమైన సర్వేశు చక్రమా.

అట్టె పదారు భుజాల నమరిన చక్రమా
పట్టిన ఆయుధముల బలుచక్రమా
నెట్టిన మూఁడు గన్నుల నిలిచిన చక్రమా
అట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా.

ఆరయ వారు గోణాల నమరిన చక్రమా
ధారలు వేయిటి తోడి తగు చక్రమా

---

విమల రూపమునకు విశ్వగోపమునకుఁ
జక్రమునకు గుప్త శక్రమునకు." (పోతన - భాగ - 9-129-135)

"...స్వరితాకంపితభూమిచక్రము, మహోద్య ద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబర శుక్రమున్, బహు విధబ్రహ్మాండభాండచ్ఛటాం
తర నిర్వక్రముఁ బాలితాఖిల సుధాంధశ్చక్రముం జక్రమున్."
(పోతన - భాగ. 8-109)

"అదరఁగశాస్త్రధారలు మహాముఖవాంత సుధాంబు ధారలు
న్నొదవగు వహ్నికీలములు పొంగునుగాఁ బెఱదైత్యకోటికి
న్నెడిదవుఁ గిన్కతో నెసరువెట్టిన పెద్ద పనఁటివోలె నె
క్కుడు వెస రాహుమస్తకముగొన్న సుదర్శన దేవుఁగొల్చెదన్"
(రాయలు - ఆముక్తమాల్యద 1-9)

1. 'చక్రమా హరిచక్రమా-వక్రమైన దనుజుల నక్కలించవో'
(అన్నమా. 5-125)
'వెడలె వెడలె నదె వీధుల వీధుల-తొడికి దైత్యులను దుంచఁగను'
(అన్నమా. 7-281)
'మొక్కెద మిదిగో మూఁడు మూర్తులను-నొక్క రూపమై
నొనరెఁజక్రము' (అన్నమా. 7-282)

అరక మీఁదికి వెళ్ళే అగ్నిశిఖల చక్రమా
గారవాన నీ దాసులఁ గావవే చక్రమా
రవి చంద్రకోటి తేజోరాశియైన చక్రమా
దివిజసేవితమైన దివ్యచక్రమా
తవిలి శ్రీ వేంకటేశు దక్షిణకర చక్రమా
యివల నీ దాసులము యేలుకోవె చక్రమా॥ (అన్నమా - 8-283)

ఇందలి వర్ణనమే,

"షోడశభుజ సంశోభిత చక్రము-మొగిమూఁడు
వలయములుగల చక్రము-షట్కోణాంత సితాళవుఁ
జక్రము-వేయంచులుగల విశ్వపుఁ జక్రము-
శ్రీ వేంకటపతి చేతిది చక్రము"

అనురీతి నీ రగడయందును గలదు—

సుదర్శన చక్రస్తుతి నిట్లు రగడరచనలో గేయరూపమున గావించుటలో పెద తిరుమలాచార్యుని యుద్దేశము అన్నమాచార్యుని సంకీర్తనమువలె నిదియు కీర్తితను కావలెననియే కావచ్చును. తాళ్ళపాకవంశీకులు, అన్నమాచార్య పెద తిరుమలాచార్యాదులు, సుదర్శనచక్రోపాసకులుగా కానవచ్చుచున్నారు. సుదర్శనస్వామి (చక్రత్తాళ్వారు) మూలమూర్తి తిరుపతి గోవిందరాజస్వామి వారి యాలయమున పెరియగోపురం (గాలిగోపురము) సమీపమునగల యొక మంటపమునందలి రెండవ యంతస్థున ప్రతిష్ఠాపితమై యుండి నట్లు తిరుపతిశాసనములనుబట్టి తెలియుచున్నది.[1] ఈ చక్రత్తాళ్వారుల యుత్సవమూర్తి బ్రహ్మోత్సవ సమయములందు తొమ్మిదవ దినమున అవభృథస్నానార్థమై అళ్వార్ తీర్థము[2] నకుఁ గొంపోఁబడుచుం

1. చూ. సంఖ్యలు 22, 154, 162-G. T. మరియు 249-T.T.

2 తిరుపతిలో కొండ దిగువనున్న అళ్వారుతీర్థము ప్రఖ్యాతమైనది. క్రీ. శ. 1581 లో అచ్యుతదేవరాయలపాలన కాలమున నాతనికి పుణ్యముగా నచట తీర్థమునకు నాలుగు వైపుల సుదర్శనచక్రాంకితములగు శిలలు నెల

డెడిది. సుదర్శనస్వామి జన్మనక్షత్రము కృత్తికయని కూడ తిరుపతి శాసనములనుబట్టి తెలియనగుచున్నది. ఆ నక్షత్రమున చక్రత్తాళ్వారునకు జరుగుచుండిన విశేషపూజాదికమును గూర్చి కూడ నందే వివరింపఁబడినది. ఉత్సవసమయములందు చక్రత్తాళ్వారుల తిరుమంజనమునకును, తిరుమంజనవేళలందు తూప్పిల్ పిళ్ళ రచించిన కయ్యార్ చక్రం శ్లోకాల పఠనమునకును తాళ్ళపాకవారు ఎన్నో ఏర్పాట్లు గావించినారు.[1] తూప్పిల్ పిళ్ళ వేదాంతదేశికులవారే. వారు సుదర్శన చక్రత్తాళ్వారుని స్తుతించుచు వ్రాసిన శ్లోకములను తిరుమంజన వేళలందు పఠించుటకై ౭ సువర్ణ రేఖల జీతముతో పొత్తపి వెంగళయ్య అను వారిని తాళ్ళపాక చిన తిరుమలయ్యగారి కుమారుఁడు తిరు వెంగళనాథయ్య క్రీ. శ. 1554 లో ఏర్పాటు చేసినట్లు పై శాసనములనుబట్టి తెలియుచున్నది.

పైని వివరించిన యంశములనుబట్టి తాళ్ళపాకవారు సుదర్శన చక్రోపాసకులనియు, సుదర్శనస్వామి కాలయములనిర్మించినారనియు, సుదర్శనచక్రస్తుతికి తిరుమంజన వేళలందు వారేర్పాటులు గావించినారనియు తెలియుచున్నది. ఆ దినములలో వేదాంతదేశికులవారి రచనలవలెనే పెద తిరుమలాచార్యుని యీ సుదర్శన రగడయు నట్లే తిరుమంజనవేళలందు గానము సేయఁబడుటకే రచితమై యుండు ననియు భావింపవచ్చును.

---

కొల్పఁబడినవి. నూతనముగా రాతిమెట్లు, సంధ్యావందనమంటపములు నిర్మితములైనవి. ఆ కాలమున నిచట జరిగిన నూతననిర్మాణకార్యక్రమమున తాళ్ళపాకవారికిని కొంత భాగమున్నది. ముఖ్యముగా సుదర్శన చక్రోపాసకులగు నీ తాళ్ళపాకవారి ప్రోత్సాహముననే అచ్యుతదేవరాయలీ కార్యనిర్వహణమున కనుమతించియుండు ననవచ్చును. అప్పటి రాయలకును తాళ్ళపాక వారికినిగల సాన్నిహిత్య మట్టిది.

1. చూ. సం. 158 - తి. తి. దే. శాసన సం. 5, క్రీ. శ. 1554.
„ 159 - „ „ - 5. క్రీ. శ. 1558.

## ఉదాహరణములు

చతుర్విధకవితలలో 'విభక్త్యధిదేవతోదాహరణములు' మధుర కవితాశాఖకుఁ జెందినవని లాక్షణికుల నిర్వచనము. ఈయుదాహరణ మను కావ్యప్రక్రియ మార్గదేశి విభేదముచేత ద్విధాప్రసిద్ధమగు కవితా స్వరూపముయొక్క సరసమ్మేళనరూపమగు వినూత్నరచన. ఈకావ్య రచనా ప్రక్రియయందే తొలుత మార్గకవితతోపాటు దేశికవితకును ప్రాధాన్యము గలిగి రెండును సమస్థాయిలో కావ్యత్వగౌరవము నంద గల్గినవి. ఇందు అక్షరచ్ఛందమునకుఁ జెంది మార్గకవితయనఁబడు వృత్త రచనకును, మాత్రాఛందమునకుఁ జెంది దేశికవితయనఁబడు కళికో త్కళికాది గేయరచనలకును నవకాశము గలదు. ఇట్లు వృత్తముల తోడను, కళికోత్కళికలతోడను గూడి మార్గదేశికవితల కలయికకు చక్కని యుదాహరణమై సర్వవిభక్తులను గ్రమమున నుదాహరిం చుచు సృష్టియందు జీవపరమాత్మల సంయోగమువలెనే భాషయందును ప్రకృతిప్రత్యయముల కూడిక యనివార్యమై సార్థక్యమందునను విష యమును రమ్యముగా నుదాహరణ రూపమున వెల్లడించుచు నీవి నూత్నకావ్యరచనా ప్రక్రియ 'ఉదాహరణ'మను సార్థకనామమును వహించినది. ఈ 'ఉదాహరణ' పై విషయములందేకాక సంగీత సాహి త్యముల సాన్నిహిత్యమునకూడ చక్కనియుదాహరణమైయున్నది. ఇట్లు పలువిషయముల కలయికకు చక్కని యుదాహరణమై రూపొం దిన యీ యుదాహరణమను కావ్యప్రక్రియ యొక విశిష్టరచనారీతిగా నుదాహరింపఁదగి తెలుఁగున పరిణతినందినది. దానిసుస్వరూపము మనకు తొలుత తెలుఁగున దెలియవచ్చినంతగా మఱియేయితరభాషయందును తెలియరామిచేత నదితెలుఁగునకే విశిష్టమగు నొకనూతనరచనారీతి యేమో యనిపించును. పలన నీరచనారీతి తెలుఁగునకుఁ దోడిభాష లగు తమిళకర్ణాటకములందు కానరాదు.

తెలుఁగునకంటె పూర్వము సంస్కృతమున 'నుదాహరణ'[1]

---

1. 'ఉదాహరణము సంస్కృత భాషలో నతిప్రాచీనకాలము నుండి యున్నట్లు మనకుఁ దెలియుచున్నది. ఋగ్వేదమున కుంతాప సూక్తమున

మనునీనామమున్నట్లు తెలియవచ్చినను నప్పటిదానిస్వరూపమేమియో మన కెఱుగరాదు. ఇంక తరువాతికాలమున సంస్కృతమున వెలసిన యుదాహరణములను జూడఁగా నవి తెలుఁగునందలి యుదాహరణ రచనారీతినేయనుసరించి రూపొందినట్లు తెలియఁగలదు. ఈకారణము లనుబట్టి 'ద్విపదా'దులవలె 'ఉదాహరణ'మను నామముమాత్రమే సంస్కృతమునుండి గైకొనఁబడి, పైనవివరింపఁబడినట్లు బహువిషయములయు, ఛందస్సంప్రదాయములయు సమ్మేళనరూపముగా తెలుఁగునందే విశిష్టముగా రూపొందినరచనారీతి యిదియని, తలఁప వీలగుచున్నది. ఇట్లు విశిష్టమగు నుదాహరణవాఙ్మయశాఖలోఁ దెలుఁగునదెలియవచ్చిన తొలియుదాహరణము పాల్కురికి సోమనాథుని (12వశతాబ్ది) బసవోదాహరణమే.[1] తెలియవచ్చిన సంస్కృతోదాహరణములందును నాతనిసంస్కృత బసవోదాహరణమే తొల్తటిది' దీనిని బట్టి మత ప్రచారమునకై సాహిత్యమును సాధనముగాఁగొని నూతన రచనాప్రక్రియల నన్వేషించి ప్రచారమునకుఁదెచ్చిన వీరశైవకవియగు సోమనాథుఁడే సంస్కృతాంధ్రములందీ యుదాహరణవాఙ్మయశాఖ కాదిజుఁడగు సాహితీబ్రహ్మయైనాఁ డనవచ్చును. ఈతని రచనారీతినే తరునాతివారగు రావిపాటి త్రిపురాంతక, తాళ్ళపాక పెదతిరుమలా

---

నిట్టివి గలవు. లౌకికసంస్కృతమున కవికులగురుఁడు కాళిదాసు కాలమున మున్నట్లు. రఘువంశము (4-78) నుండి, విక్రమోర్వశీయము (2-15) నుండి తెలియుచున్నది. కాని యాకాలమున నివి యేరూపమునమున్నవో తెలిసికొనుటకు మన కేయాధారములేదు." (చూ. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర. పు 2. శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు. ముద్రణము 1950)

1. పండితత్రయమున ప్రసిద్ధుఁడును, పండ్రెండవ శతాబ్దివాఁడును నగు మల్లికార్జున పండితారాధ్యుఁడొక యుదాహరణమును రచించినట్లు పాల్కురికి సోమనాథుఁడు పేర్కొనెను.

"శతకంబు శివతత్త్వసారము దీప
కళిక మహానాటకము నుదాహరణ".

కాని నేఁడది దుర్లభము. (చూ. పండితా. పర్వతప్ర. 869)

చార్యాదులు యథోచితములగు మార్పులను గావించి యనుసరించి పోషించినారు. సోమనాథాదుల రచనలను పరిశీలించియే తరువాతికాలమున విన్నకోటపెద్దన (1403), అనంతుఁడు (1435) మున్నగు నాంధ్రలాక్షణికులును, విద్యానాథుఁడు (1320), పెదకోమటి వేమారెడ్డి (1400), గౌరన (1400) మున్నగు సంస్కృత లాక్షణికులును ఉదాహరణలక్షణములనుగూర్చి సమగ్రముగ చర్చించిరి. సోమనాథుని కాలమునకుఁ బూర్వపు లాక్షణికులెవ్వరును ఈఉదాహరణముల లక్షణముగూర్చి ప్రశంసించియుండకపోవుటయు నది తెలుఁగునకే విశిష్టమగు రచనారీతియని వివరించిన పైయూహకు బలమును గూర్చుచున్నది.

ఆంధ్రోదాహరణములను బరిశీలించుటనుబట్టి యీక్రింది లక్షణము లుదాహరణలక్షణములుగాఁ దెలియనగుచున్నవి.

1. ఉదాహరణము సప్తవిధవిభక్తులును, సంబోధనవిభక్తిని నుదాహరించు లఘుకృతి.

2. ఇందు వృత్తములు, కళికలు, ఉత్కళికలు, సార్వవిభక్తికపద్యము, కవికృతనామాంకితపద్యములు నుండును.

3. వృత్తములలో చంపకోత్పలములును శార్దూలమత్తేభములును, నుపయుక్తములగును. కళికయనఁగా మాత్రాచ్ఛందస్సునకు సంబంధించిన రగడభేదము. ఎనిమిది పాదములుగలది. ఉత్కళిక యనఁగా కళికలో సగము భాగము—అర్ధకళిక.

సార్వవిభక్తికము- ఒక్కపద్యముననే అన్నివిభక్తులు నుదాహరింపఁబడునది. ఇవి సాధారణముగా శార్దూలవృత్తములో నుండును.

4. ఉదాహరణములలో విభక్తిప్రత్యయములు వృత్తములలో సర్వత్ర భాసింపనక్కరలేదు. ప్రాయికముగా నాలవపాదమున గోచరించిన జాలును'. కాని కళికయందు మాత్రము ప్రతిపాదాంతమున భాసించి తీరవలెను. ఉత్కళికయం దిట్టి నియమములేదు. కాని దీనియందును తుది రెండు చరణాంతములందు ప్రత్యయములు విధిగా కన్పట్టవలెను.

5. ఒక్క చతుర్థీ విభక్తియందు మాత్రము ఉత్కళికలో ప్రతి పాదాంతముననుు 'కై' అను ప్రత్యయము విభక్తిప్రత్యయమైనను కాక పోయినను విభక్తివలె తోఁపింపఁజేయుచు భాసించితీరవలెను. ఇట్లు విభక్తివలెఁదోఁచియు విభక్తికాకుఁడు నీప్రత్యయస్వరూపమునే లాక్షణికులు 'విభక్త్యాభాస' మనిరి.

6. వృత్తముల యనంతరము కళికల యారంభము 'వెండియు' 'మఱియు' అను వానితో సంధింపఁబడుచుండవలెను.

ఉదాహరణములలో నియతముగా పైన పేర్కొనఁబడిన వృత్తములు తక్కఁ దక్కిన పద్యజాతులేవియు నుపయుక్తములు కావు. ఇఁక కళికోత్కళికలందు రగడవిభేదములగు నెనిమిదింటిలో నేదేని వైవిధ్యము నపేక్షించి ప్రయుక్తము కావచ్చును. ఇట్లు విభక్తి ప్రత్యయముల నుదాహరించు నీలముక్పతి శ్రీకారముతో నారంభించి, సంబోధనతోఁగూడి యెనిమిది విభక్తులకును వెరసి యిరువది నాలుగును, సార్వవిభక్తికము, నంకితాంక వృత్తము నను మఱి రెండింటితోఁగూడి మొత్తము ఇరువదియారు పద్యములతో నొప్పియుండును. ఇదియే ఉదాహరణస్వరూపము.[1]

---

1. ఉదాహరణముల యొక్క సాధారణ స్వరూపమిట్టిదే యైనప్పటికిని, తొలినాళ్లలో నా రచనారీతి పరిణతినందుచుండిన కారణమున గావచ్చును, ఈ లక్షణములన్నియు మనకు లభ్యములైన తొలి యుదాహరణములందు కానరాకున్నవి ఎట్లన—

అ) సోమనాథుని బసవోదాహరణమున చతుర్థీ ఉత్కళికలో ప్రతి చరణాంతమున నుండవలసిన కై అనుప్రత్యయము అట్లులేదు. చివరి రెండు చరణములందు మాత్రమే యున్నది.

ఆ) ఇందే తుది నుండవలసిన అంకితాంక పద్యము లేదు.

ఇ) తెల్గున రెండవదియగు త్రిపురాంతకోదాహరణమునను అంకితాంక పద్యము కానరాదు.

ఈ) సోమనాథుని కృతులలో వృత్తముల కొక నియమములేక చంపకోత్పలములు (మాత్రమే) ప్రయుక్తములైనవి. త్రిపురాంతకుని కృతిలోను

ఈ యుదాహరణముల లక్షణమును పదునాల్గవ శతాబ్దితరువాతి వారగు సంస్కృతాంధ్రలాక్షణికులు కొందఱు విపులీకరించిరి.[1] వారందు విభక్తుల మాఱు పేరులను గూర్చియు, విభక్త్యధిదేవత

---

నిల్లే నియమములేక చంపకోత్పలము లుపయుక్తములై తుది సార్వ విభక్తికమునందు మాత్రమే శార్దూలమున్నది.

సంస్కృతోదాహరణములందును ప్రాయికముగా నీ లక్షణము లన్నియు నున్నవి.

1. ఉదాహరణ లక్షణమును వివరించిన వారిలో తెలుఁగున విన్నకోట పెద్దనయు, సంస్కృతమున గౌరనయు ప్రముఖులును ప్రథములు నైనవారు. ఈ విషయమున వీరిరువురి లక్షణములు నొక్క తీరుననే గలవు.

గౌరన లక్షణ దీపికలో (1400 క్రీ॥ శ॥ దీనికే 'ప్రబంధదీపిక'యనియు నామాంతరము).

"అథ కాంతి గుణోపేతైః గౌడరీతి సమన్వితైః
అష్టభిః కథితైః పద్యైః కలికోత్కలికాక్రమైః.
పద్యేన నవమేనాంతే హృద్యం సర్వవిభక్తికః
జయేత్యుపక్రమం పూర్వై రుదాహరణ ముచ్యతే.
అత్ర సర్వాణి పద్యాని నేతృ నామాంకితానిచ
శక్వర్యాదిని బద్ధాని మాలినీవృత్తమాదిమమ్."

(ఇతి ప్రబంధదీపికాయామ్ - తృతీయ ప్రకాశః)

విన్నకోట పెద్దన 'కావ్యాలంకార చూడామణిలో (1408 క్రీ॥ శ॥) పై లక్షణములనే కాక విభక్త్యధి దేవతలను గూర్చియుఁ గళికోత్కళికల తాళనియమమును గూర్చియుఁగూడ విశదీకరించెను

"అథ పదయుగళము, వి
భ్రాజిత పటు గౌడరీతి బంధురమును ని
ర్వ్యాజాతరసవిభావవి
రాజితమునుగా నుదాహరణఁ దగుఁ జెప్పన్.

కళిక యే తాళముఁ బరిఘటితమయ్యె
నుత్కళికయును దానన యునుపవలయు

లను గూర్చియు కళికోత్కళికల తాళనియమమును గూర్చియు విశదీకరించిరి. వారి లక్షణవివరణమునుబట్టి యీ యుదాహరణములను రాగతాళనియమములతో నాలాపింతురనియు నపుడాయా విభక్త్యధిదైవతము లనుగ్రహింతురనియు తెలియనగుచున్నది. తొల్లి దేవ

నంత్య చాతుర్థికోత్కళికఁజూడఁ
బడి చతుర్థినిఁబోలె చూపట్టవలయు.

ఇట్లే మిగిలిన లక్షణములును.

| విభక్తి | నామాంతరము | అధిదేవత |
|---|---|---|
| ప్రథమ | వాణి | పీరావళి |
| ద్వితీయ | ఝట | కీర్తిమతి |
| తృతీయ | కీర్తి | సుభగ |
| చతుర్థి | దేవలాభిని | భోగమాలిని |
| పంచమి | పాణి | కళావతి |
| షష్ఠి | డోటి | కాంతిమతి |
| సప్తమీ | ఘోటికా | కమల |
| సంబోధన | సరసావళీ | జయవతి. |

కం॥ చతురస్ర త్ర్యస్రాదిని
తతయతి తాళముల గలుగు దళములనెల్లన్
కృతగుచ్ఛానుప్రాసం
బతులితగతి నిలుపఁదగు నుదాహరణలకున్.

కం॥ సురభాషాది ప్రాకృత
పరిభాషలనైన నితరభాషలనైనన్
విరచించుట యుక్తముదా
హరణ మిలాసురముఖాదులగు పుణ్యులకున్.

పై లాక్షణికు లిరువురును నామాంకిత పద్యమును గూర్చి ప్రస్తావించినను క్రీ॥ శ॥ 1485 ప్రాంతమువాఁడగు అనంతుఁడుమాత్ర మద్దానిని గూర్చి ప్రస్తావింపలేదు. అతని కాలము వరకును దెలుఁగున వెలసిన యుదాహరణములలో నామాంకిత పద్యము లేకుండుటయే దానికి హేతువు కావచ్చును.

దాసీలీయుదాహరణముల నాలపించి నాట్యముసేయుచుండెడి వార నియు వారి వారి పేర్లే ఆయా విభక్తులకుఁ బెట్టఁబడినవనియు సంప్ర దాయజ్ఞులగు పెద్దలు చెప్పుదురు.[1]

ఆంధ్రమున వెలసిన కావ్యప్రక్రియలలో నుదాహరణములు విశిష్ట రచనలు. పూర్వమే వివరించినట్లు వీనియందలి భాషావిషయక మగు ధాతుప్రత్యయముల కూడిక సాంకేతికముగా సర్వజీవ కళాప్రకృ తుల యందలి సామరస్యమునే గాక సృష్టియందలి రహస్యములను గూడ నిబంధించునదిగా నున్నది. అందుకే కవిసమ్రాట్ శ్రీవిశ్వ నాథ సత్యనారాయణ గారు 'జగత్తంతయుఁ గ్రియాస్వరూపము సర్వ క్రియయుఁ బరమేశ్వరునందుఁ బర్యవసించును. ధాతువు సర్వథా విభక్త్యాశ్రయము. ఏ విభక్తితో సంబంధములేక క్రియలేదు. అందు చేత నన్ని విభక్తులతోఁ బరమేశ్వరునిఁ జెప్పినప్పుడు భగవంతుఁడు సర్వక్రియాస్థానభూతుఁడని వ్యంగ్యము. ఇది యుదాహరణ కావ్య రహస్యము.' అని వ్రాసియున్నారు. ఉదాహరణములు సప్తవిధ విభక్తులతోఁ గూడి అర్థయుక్తిని సంపాదించుకొని అనిర్వాచ్యమగు సృష్టిరహస్యమును వాచ్యముచేయు భాషాసర్వస్వములు; సప్తస్వర ముల క్రమవికాసమున గంపితస్వరితములతోఁగూడి రాగభావమును గూర్చుకొని అపూర్వమగు నాదబ్రహ్మమున కాకృతిని గల్పించు సంగీతనిధానములు; సప్తాధారముల నాధారము జేసికొని సాధనలో ననుభూతిని గూర్చుకొని అవ్యక్తమును వ్యక్తముసేయు యోగవిధా నములు. అంతేకాదు వాని నిర్మితియందు గల పరిణతియు, శ్రవ ణము నందుగల సుభగత్వమును మన మనస్సులను దోచి యానం దపు నిచ్చెనల నెక్కించినట్లుండును.

అసలీ యుదాహరణముల యావిష్కృతికి చాలవఱకు నిందలి విభక్తులను గూర్చినపుడు కలుగు శ్రుతిమనోహరత్వమే భూమిక

1. ఈ విషయమును బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తమకుఁ దెలిపినట్లు ఉదాహరణవాఙ్మయచరిత్రమున శ్రీ నిడుదవోలు వారు వ్రాసినారు. (మా. పు. 102)

యేమో యనిపించును. దీనికిఁ గొంతవఱకు మనప్రాచీన కావ్యము లందలి ఆశ్వాసాద్యంత కృత్యంత షష్ఠ్యంతాది సంప్రదాయము కూడ దోహదకారియై యుండవచ్చును. ఇట్లే ముకుందమాలలో కులశేఖరాళ్వారు సార్వ విభక్తికముగా చెప్పిన రసవంతమగు శ్లోకమును బోలిన రచనలు కూడ కొంతవఱకు హేతువులై యుండవచ్చును. తత్పర్యవసానముగనే కావచ్చును ఉదాహరణములు సప్తవిధ విభక్తులతోడనే కాక సార్వవిభక్తికముతోఁగూడ నొప్పి యన్నింటిని సమకూర్చుకొన్నట్లున్నవి. ఇఁక నందలి యంకితాంకపద్యము సాహిత్యరచనలందలి గద్యాంకితమును, సంగీతరచనలందలి ముద్రాంకితమును మేళవించుకొని ఆ రెండిటి సమ్మేళనమును రమణీయముగాఁ బ్రదర్శించునట్లున్నది.

ఇట్టి విశిష్టమగు వాఙ్మయశాఖలో వెలసిన మేలుబంతియే మన కిపుడు ప్రస్తుతమగు తాళ్లపాక పెదతిరుమలాచార్యుని శ్రీవేంకటేశ్వరోదాహరణము. ఇది మనకు లభ్యములగు నాంధ్రోదాహరణములలో మూఁడవదియును, ముఖ్యమైనదియును—

*శ్రీ వేంకటేశ్వరోదాహరణము* :—కర్త తాళ్లపాక పెదతిరుమలాచార్యుఁడు. ఇది యాతని లఘుకృతులు పెక్కింటిలో నొక్కటి. శ్రీ వేంకటేశ్వరస్వామివారి కంకితమై సప్తవిధవిభక్తుల నుదాహరించుచు పరమార్థబోధనము గావించు భక్తిమయ రచన మగుటచేత దీనికి శ్రీ వేంకటేశ్వరోదాహరణ మని పేరైనది. ఇది తెలుఁగున వెలసిన యుదాహరణములలో మూఁడవదియునుసుసంపూర్ణమైనదియును. ఇందలి రచనా ప్రణాళిక యీతీరున నున్నది.

| విభక్తి | వృత్తము | కళిక[1] | ఉత్కళిక |
|---|---|---|---|
| 1. ప్రథమ | ఉత్పలమాల | వృషభగతి రగడ | హరిణగతి రగడ |
| 2. ద్వితీయ | ,, | ద్విరదగతి రగడ | (ఇందు సగము) |

1. వేంకటేశ్వరోదాహరణమునందలి కళికోత్కళికలందు వాడిన రగడలను గుర్తించుటలో 'ఉదాహరణ వాఙ్మయ చరిత్ర' ముద్రణమున' కొన్ని దొసగులు దొర్లినవి. అవి యిందు సంస్కరింపఁబడినవి.

| | | | |
|---|---|---|---|
| 3. తృతీయ | ఉత్పలమాల | హయప్రచార రగడ (లేదా తురగవల్గనము) | (ఇందు సగము) |
| 4. చతుర్థీ | ,, | హరిగతి రగడ | మధురగతి రగడ |
| 5. పంచమి | ,, | ద్విరదగతి రగడ | (ఇందు సగము) |
| 6. షష్ఠి | ,, | హయప్రచార రగడ (లేక-తురగవల్గనము) | (ఇందు సగము) |
| 7. సప్తమి | ,, | ద్విరదగతి రగడకు సమీపమగు ఛందము | (ఇందు సగము) |
| 8. సంబోధన | ,, | ద్విరదగతి రగడ | (ఇందు సగము) |

9. సార్వవిభక్తికము — శార్దూలము
10. అంకితాంక పద్యము— ఉత్పలమాల

పై లక్షణ వివృతినిబట్టియే యీ యుదాహరణము సర్వలక్షణ లక్షితమైనదని చెప్పనగును. పూర్వోదాహరణములగు బసవోదాహరణ త్రిపురాంతకోదాహరణములందు లేని ప్రక్రమమును, సమగ్రతను కవి యిందు సాధించినాఁడు. పోల్చి చూడవచ్చును

1 విభక్తులతో కళికోత్కళికలతో సార్వవిభక్తి కాంకితాంక పద్యములతో వెరసి యుండవలసిన 26 పద్యముల సంఖ్య బసవోదాహరణమునఁ గాని త్రిపురాంతకోదాహరణమున గాని లేదు.[1] ఆరెంటి యందును అంకితాంక పద్యములు కానరావు. ఇం దదియును గలదు.

2 ఉదాహరణము నందలి వృత్తముల నెన్నుకొనుటలో పూర్వోదాహరణము లందొక క్రమమేమియును లేక-చంపకోత్పలములు విచ్చలవిడిగా వాడఁబడియున్నవి.[2] ఈ విషయమున బసవో

---

1. సంస్కృత బసవోదాహరణము మాత్రము సోమనాథుఁడీ నియమము పాటించి 26 శ్లోకములను రచించినాఁడు

2. సంస్కృత బసవోదాహరణము మాలినీ వృత్తముతో నారంభించి ఆర్యావృత్తమున గల అంకితాంక శ్లోకముతో ముగిసినను మిగిలిన విభక్తులం దన్నిటను శార్దూలవృత్తమే వాడఁబడియున్నది. బహుశః వృత్త నియమము పాటించుటలో త్రిపురాంతకాదుల కిదియే మార్గదర్శకమైనదేమో!

దాహరణమునకన్న త్రిపురాంతకోదాహరణము కొంతమెఱుఁగు. అతఁడు (తిప్పన్న) షష్ఠికి చంపకమును, సార్వవిభక్తికమునకు శార్దూలమును వాడియున్నాఁడు మిగిలినవన్నియు నుత్పలమాలలు-కాని వేంకటేశ్వరోదాహరణమున వృత్తనియమమను శతకమర్యాదను పాటించి, కవి విభక్తుల కన్నింటికిని ఉత్పలమాలలే రచించెను. సార్వవిభక్తికమునకు మాత్రము తిప్పనవలెనే శార్దూలమును వాడెను. 'శార్యస్తవే నృపాదీనాం శార్దూల విక్రీడితా మతా' అను నిర్వచనము ననుసరించియే కావచ్చును. సర్వవిభక్తులతో సంస్తుతించు నీ సందర్భమున గవులిరువురును శార్దూలమునే యెన్నుకొనిరి.

8. ఉత్కళికల రచనలో చతుర్థీ విభక్తియందు ప్రతి చరణాంతమున విభక్తిరూపముగాని తదాభాసరూపము గాని యుండవలెనను మర్యాద సోమనాథుని ఆంధ్ర సంస్కృతోదాహరణములు రెండింటను గానరాదు. ఆ లక్షణము బహుశః త్రిపురాంతకుని యుదాహరణ లక్ష్యము ననుసరించియే యేర్పడి యుండును. త్రిపురాంతకుని చతుర్థీ ఉత్కళికయందు తుది రెండు చరణములందును, నడుమ రెండు చరణములందును 'కై' అనునది విభక్తిరూపముగాను, మిగిలిన చరణాంతములందు తదాభాసరూపముగాను నున్నది. కాని వేంకటేశ్వరోదాహరణమున విధిగా నుండవలసిన తుదిరెండు చరణములందే విభక్తిగానున్నది తప్ప 'కై' అను ప్రత్యయము ఆభాసరూపముననే తక్కిన చరణములందన్నిటను గలదు. ఈ విషయమున గవితా చమత్కృతి పూర్వోదాహరణములందు కంటె నిందె యధికము.

ఇట్లు బసవోదాహరణము కంటె త్రిపురాంతకోదాహరణమును, దానికంటె వేంకటేశ్వరోదాహరణమును పరిపూర్ణ వికాసము నందిన పరిణతరచనలుగా భాసించుచున్నవి. అందుకే ఉదాహరణ వాఙ్మయశాఖయందీ వేంకటేశ్వరోదాహరణము మేలుబంతి యనుట. పెదతిరుమలాచార్యుఁడీ యుదాహరణమును త్రిపురాంతకోదాహరణమును జదివి యందలి మేల్మినిగ్రహించి యంతకన్న మిన్నగానుండునట్లే రచించుటకు యత్నించి కృతార్థుఁడాయె ననవచ్చును. పలువిషయములలో తిరుమలాచార్యుఁడు త్రిపురాంతకుని ననుసరించినాఁడు.

మచ్చునకు ఆతని రచనలో సప్తవిధవిభక్తులందలి కళికోత్కళికల కెన్నికొన్న రగడవికారములే తిరుమలాచార్యుఁడును తుచ తప్పకుండ గ్రహించెను (సోమనాథుని రచన కిది భిన్నమైన మార్గము). దానిని బట్టియే మనమా విషయమును గుర్తింపవచ్చును. పోగా త్రిపురాంతకుఁడు సప్తమీవిభక్తి యందలి కళికోత్కళికలకు వాడిన ఛందస్సు చిత్రమైనది.

"మఱియును గటాక్షజిత - మారునందు
తఱిత్రాడు సౌమ్యగుణ - దారునందు" ఇత్యాది కళికయు
"ఇలయు - సలిలంబు - వెలుఁగు ననిలంబు
దివియు మిత్రుఁడు - కువలయాప్తుఁడు."

ఇత్యాదిగా నుత్కళికయుఁ గలవు. ఇందలి 'కళిక' 'జయభద్ర రగడ'లో సగమగు 'ద్విరదగతి రగడకు' సన్నిహితమగు ఛందమేగాని యచ్చముగా నదికాదు

ద్విరదగతి రగడ—

"శ్రీయువతి నిజయువతిఁ జేసి యెంతయు మించి
కాయజునిఁ దనతనయుఁగా నెమ్మిఁ గాంచి"

అను రీతిని 5 మాత్రలు లేక లఘువులకు విఱుగుచు $5 \times 4 = 20$ మాత్రల కొక్క చరణము చొప్పున సాగు రచన. కాని యిందు చరణమున ద్వితీయార్థమున 10 లఘువులుండుటకు బదులు 8 లఘువులతోనే ముగించి గతిలో వైచిత్రిని సాధించినాడు కావున నిది ద్విరదగతివికార మనఁదగు రగడ రచన. అచ్చముగా పెద తిరుమలాచార్యుఁడును పై ద్విరదగతి వికారమగు రగడ ఛందముననే సప్తమీ విభక్తి కళికను సాగించినాఁడు.[1] దానిని బట్టియే త్రిపురాంత

1. సోమనాథుని బసవోదాహరణమున సప్తమీవిభక్తి కళికయందుఁ గవి రగడఛందమునందలి మాత్రల పరిగణనమున మార్పుచేయలేదు - అతని
"సరసభక్త - స్వారునందు
దురిత భయవి - దూరునందు."
అను రచనలో హయప్రచార రగడ యొక్క గతియున్నది. కాని యిందలి చరణము అందలి చరణమున సగము మాత్రమే.

కుని రచనాప్రభావము తిరుమలాచార్యుని రచనపై నెఱగా కలదో తెలిసికొనవచ్చును. కాని యీతనిరచన పూర్వోదాహృత రచనలకన్న సొబగు కలది.

షష్ఠీ విభక్తి వృత్తమిది చూడుఁడు.

"మానిసిదిండ్లమొత్తు నెఱమంటల పిల్లలకత్తి వేల్పుపెన్
బోనపుముద్ద నిద్దముల పొల్పుదొలంకెకసంకుఁ గల్గునె
వ్వానికి వానికి న్నతభవానికి వేంకట శైలశృంగస
న్మానికి భక్తసంపదభిమానికి నే శరణంచు మ్రొక్కెదన్"

చతుర్థ ఉత్కళిక—

ధారుణి భారనివారణలకై
శౌరివిహార విచారమనెడికై
తవమున జవమున బవిరి తిరుగుకై
దువుఁగొని వివిధ సవిధ దానవకై
కసరుధిరసలిల మెసఁగ విసరికై
వసముగ సురవిసరము సేలినకై
లాస నివాస సతీవంద్యునకై
హాసనమున్నత బుధవంద్యునకై.

ఇందలి రచన పాంచాలీరీతిని, భారతీవృత్తిని ప్రదర్శించునదియై కాంతిసుకుమారతామాధుర్య గుణములతో నొప్పారి యున్నది. ఉదాహరణ రచన ఓజో గుణప్రధానమై గౌడీ రీతి నుండ వలెనను గౌరనాదుల లక్షణము ప్రాయికముగా సోమనాధుని యుదాహరణముల ననుసరించి చెప్పినదై యుండవచ్చును. గౌరన చెప్పిన లక్షణమునే పిదప చిన్నకోట పెద్దనయు వివరించియుండును. కాని చూడఁగా త్రిపురాంతక వేంకటేశ్వరోదాహరణములందు గౌడీరీతి కన్న పాంచాలీరీతియే ప్రధానమైయున్నట్లు తెలియుచున్నది.

వేంకటేశ్వరోదాహరణ మందలి యీ రచనాసౌకుమార్యమున కెడనెడ కళికోత్కళిక లందలి యనుప్రాసవిన్యాసము తోడి యోజస్సు కొంత తోడ్పడి కృతికి వైలక్షణ్యమునే కూర్చినది.

**చతుర్థీ విభక్తి**: అన్ని యుదాహరణములందువలెనే యిందును చతుర్థివిభక్తికి వైశిష్ట్యమున్నది చతుర్థీ ఉత్కళిక యందు పైన నుదాహరించినట్లు 'కై', అను ప్రత్యయము విభక్తి రూపమునను, తదాభాసరూపమునను, చరణాంతములందన్నిటను లక్షణానుసారము పాటింపఁబడినది. ఇందు మఱి యే విభక్తికిని లేని యీ నియమము చతుర్థికి మాత్రమేల యని సందేహము కలుగవచ్చును. ఇది స్తుతిప్రధానమగు రచనయగుటచేతనే చతుర్థి కిందు ప్రాధాన్యమని సమాధానము. ఈ విషయమును శ్రీ నిడుదవోలు వేంకటరావు గారిట్లు వివరించినారు. "తిక్కన శాంతి పర్వమున భీష్మధర్మజసంవాదమున విష్ణుమంత్ర ప్రభావమును గూర్చి చెప్పుచు (4-218)లో

"ప్రణవ పూర్వకమగు నమః పదము పొంత
షడ్గుణైశ్వర్య వాచక సర్వసన
నిర్వచన శబ్దములు క్రమనిష్ఠమెయి చ
తుర్థి గూర్పంగ మంత్రమౌఁ దోఁచ జేసి"

అని చతుర్థిని గూర్చిన సంప్రదాయమును వివరించినాఁడు. ఉదాహరణము స్తోత్రరూపమగు గ్రంథమగుటచేతను నది భగవంతునిఁ గూర్చియే ప్రధానముగా రచితమగుటచేతను నిందు విభక్తి ప్రత్యయములే నియతములగుటచేతను, చతుర్థిని నీ నియమము ప్రాచీనకవులు పాటించిరని తెలియుచున్నది." (ఉ॥ వాఙ్మయ చరిత్ర పుట. 50)

ఇంతే కాదు భాషాశాస్త్ర దృష్టితోఁ జూచినను చతుర్థికి ప్రాముఖ్యమున్నది. ద్రావిడభాషలందు ద్వితీయా, తృతీయ పంచమీ సప్తమీ విభక్త్యులందు వివిదార్థములతోఁ వివిధ ప్రత్యయములున్నను చతుర్థికి మాత్రమొక్కటే ప్రత్యయమున్నదను విషయము భాషాచరిత్రకారులు విశదీకరించినదే. కావున నదియునొక హేతువై యుండవచ్చునని వారే యందు వివరించిరి.

తెలుఁగునగల చతుర్థివిభక్తి ప్రత్యయము 'కై', అనునది. ఇదియే ప్రాచీన కావ్యములందు 'కునై', 'కినై' అనురూపములఁ బ్రయుక్తమునైనది. ఇందలి 'కున్ + ఐ' 'కిన్ + ఐ' అను విచ్ఛేదమున గానవచ్చు 'ఐ' లేక 'అయి' అనురూపమే చతుర్థీ ప్రత్యయముగా భాసించును.

ఈ రూపమునే ప్రాచీన కవులందరును నన్నయాదులు మొదలు కొని ప్రయోగించియున్నారు. ఈ 'కై', 'కయి' అను ప్రత్యయము నకుఁ దోడుగా తరువాతి కాలమున 'కొఱకు' అను ప్రత్యయమింకొకటి చతుర్థీ స్థానమున కుదుర్కొన్నది. ఈ క్రొత్త రూపమును నన్నయాది తొలికవులు తమ కావ్యములందు ప్రయోగింపకుండుటయు, తెలుఁగు నకుఁ దొలితెలుఁగు వ్యాకరణ మనఁదగు కేతనకృత ఆంధ్ర భాషా భూషణమున దీని ప్రశంస లేకుంటయు, విభక్తుల నుదాహరించుటయే ప్రధానలక్ష్యమగు నుదాహరణములలోఁ దొలిరెండు తెలుఁగు ఉదా హరణములందు నీ రూపము లేకుండుటయు నను నాధారములనుబట్టి చతుర్థి కేర్పడిన యీ క్రొత్త రూపము పదునాలుగవ శతాబ్దికి తరువాతి కాలముననే ప్రచారమునకు వచ్చియుండుననవచ్చును. కాని తరువాతి కాలపు కవులు దీనినిగూడ ప్రయోగించి యుండుటనుబట్టి విన్నకోట పెద్దనాది లాక్షణికులును, నవీన వైయాకరణులును, 'కయి-కొఱకు' చతుర్థీ అని లక్షణమును వివరించియున్నారు. విన్నకోట పెద్దన దీనిని విభక్తిగాకాక విభక్తికయిన నామాంతరముగా పేర్కొనినాఁడు. సోమనాథుఁడును, త్రిపురాంతకుఁడును నీ 'కొఱకు' అను ప్రత్యయ మును ప్రయోగింపకున్నను పెద తిరుమలాచార్యుఁడు మాత్రము తన యుదాహరణమున సార్వవిభక్తిక పద్యమున.

'కై వారంబొనరించు నీ కొఱకు సంకల్పింప నీడేఱ' అనుపట్టున 'కొఱకు'ను చతుర్థికి వాడియున్నాఁడు.1 పెద్దనాదులు దీనిని చతుర్థికి నామాంతరముగా పేర్కొనుటచేతనే తిరుమలాచార్యుఁడు దీని నిందు గ్రహించి యుండును మఱి యితని తరువాతి ఉదాహరణరచయితలు కూడ నంతగా నీ 'కొఱకు' ప్రత్యయమును వాడియుండలేదు.

1. ఉదాహరణ వాఙ్మయ చరిత్రమున శ్రీ నిడుదవోలు వేంకట రావుగారు 'కొఱకు' అను ప్రత్యయమును గూర్చి ముచ్చటించుచు 'ఇది ఉదాహరణములయం దె తమాత్రమును ప్రయుక్తము కాలేదు.' అని వ్రాసిరి. (చూ. పు. 41) ఇది పూర్వోదాహరణములందు లేని మాట నిజమే కాని వేంకటేశ్వరోదాహరణమున గలదు.

ఇట్లు విశిష్టము మనోజ్ఞమునగు నీ యుదాహరణమును పెద తిరుమలాచార్యుఁడు శ్రీ వేంకటాచలాధీశున కంకితము గావించి నాఁడు.

"అరవి తారకంబుగ నుదాహరణంబు రచించె భక్తిని
స్ఫారతఁ దాళ్ళపాకపురశాసనుఁ డన్నయతిమ్మనార్యుఁడిం
పారఁగఁ జక్రనందకగదాంబుజధారికి శ్రీసుధామనో
హారికి వేంకటాచలవిహారికి శౌరికి నంకితంబుగాన్."

శ్రీవేంకటాచల మాహాత్మ్యము : సంస్కృత భాషలో శ్రీ వేంకటాచల మాహాత్మ్యమును అన్నమాచార్యుఁడు రచించెను. ఈ విషయమును అన్నమాచార్యుని మనుమఁడేయగు చిన తిరువెంగళ నాథుఁడు (చిన్నన్న) తాతగారి జీవిత చరిత్రమును వ్రాయుచునిట్లు ప్రశంసించినాఁడు.

"ప్రవిమల ద్విపదప్రబంధరూపమున
నవముగా రామాయణము; దివ్యభాష
నావేంకటాద్రి మాహాత్మ్యమంతయును
గావించి ... ... ... ... ..." (అన్న. చరిత్ర. పు 46)

ఇట్లు 'దివ్యభాష నావేంకటాద్రి మాహాత్మ్యమంతయును' అని చిన్నన్న యనుటచేత నీ స్థలమాహాత్మ్యమును అన్నమాచార్యుఁడు సంస్కృతమున సంపూర్ణముగ విరచించెనని తెలియుచున్నది. గ్రంథ కర్తృనామాంకములతో నేఁడా గ్రంథము మనకు లభ్యము కాకున్నను ఆ పేరుగల స్థలమాహాత్మ్య సముచ్చయ మొకటి వరాహ పురాణాదుల లోనిదిగా సంఘటితమయి, పదునేడు పదునెనిమిది శతాబ్దుల పిదప తెలుఁగు పరివర్తనము పడసి, ప్రాచీన తాళపత్ర ప్రతులు గలిగి, యిప్పుడు నాగరాంధ్రాక్షరములలో ముద్రితమై[1] వ్యాప్తిగాంచి

1. ఈ స్థలమాహాత్మ్యమును మొట్టమొదట పుస్తక రూపమున అచ్చులోనికిఁ దెచ్చినవారు శ్రీ మహంత్ భగవాన్‌దాస్‌జీగారు. వారు దానిని క్రీ. శ. 1884 లో ఆంధ్రాక్షరములలో ముద్రించిరి. తరువాత నా గ్రంథమే.

యున్నది, అదియే "నాఁడు తాళ్లపాక అన్నమాచార్యుఁడు రచించి నదియైనను గావచ్చు"నని శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు. (చూ. అన్నమా. చరిత్ర పీఠిక పుట. 70) ఈ యభిప్రాయము సమంజసమైనదనియే తలఁపవచ్చును. సంస్కృత భాషలో నీనాఁడు ప్రసిద్ధములై ముద్రితములై యున్న స్థలమాహాత్మ్య గ్రంథము లనేకములు ప్రాచీనములగు నష్టాదశ పురాణములలోనివిగాఁ బ్రస్తుతములై యున్నప్పటికిని, అవి యెల్ల నాయా పురాణములలోఁ దొల్త రచితములై యుండలేదని ఆయా స్థలములను గూర్చిన చారిత్రకాధారములను బట్టియు, గ్రంథస్థలములగు విషయ వివరణమును బట్టియు, పురాణములకు ప్రాచీనులే నిర్ణయించిన గ్రంథ సంఖ్యను బట్టియు నిర్ధారింపనగుచున్నది. ఈ విషయమును గూర్చి శ్రీ శాస్త్రిగారే యిట్లు వ్రాసియున్నారు. "అష్టాదశ పురాణములలోఁ జేరినవిగాఁ గానవచ్చు స్థలమాహాత్మ్యముల నన్నింటిని సమకూర్చి గ్రంథ సంఖ్యను గణించినచో నష్టాదశ పురాణములకుఁ బ్రాచీనులే పరిగణించిన గ్రంథ సంఖ్యకంటె నీ స్థలమాహాత్మ్యముల గ్రంథ సంఖ్య చాల మీఱిపోఁగలదు. వ్రాతప్రతులు గలిగి పురాణక్రమ నిర్వచనమునఁ జెప్పఁబడిన యానుపూర్వి గలిగి యనేకస్థలములం దుపలభ్యమానములగుటచే ముద్రితములైన యష్టాదశ పురాణములలో నాయా స్థలపురాణములు నూటికిఁ దొంబది తొమ్మిది వంతులు గానవచ్చుటలేదు. పురాణపు ముద్రాపకులు కొన్ని స్థలపురాణములను నేఁటి పురాణముద్రణములందుఁ జేర్చుటయు జరుగకపోలేదు. అది యొక మహత్తర చర్చ. అధ్యాయ సంఖ్యలు, పురాణముల పేళ్లు ఉన్నను నేఁటి స్థలపురాణము

---

1887 లో దేవనాగరి లిపితోడను

1896 లో మరల తెలుఁగు లిపితోడను

1904 లో మరల దేవనాగరి లిపితోడను (బొంబాయిలో)

1928 లో మరల తెలుఁగు లిపితోడను

1930 లో మరల దేవనాగరి లిపిలో హిందీ అనువాదముతోడను

పలుమారులు పునర్ముద్రణ భాగ్యము నందినది.

ల్లె నాయా పురాణములలోఁ దొలుత రచితములు గావనుట ప్రఖ్యాత సత్యార్థము. ఇంచుమించుగా నిట్టి స్థలమాహాత్మ్యములు పదుమూఁడు పదునాల్గు శతాబ్దములనుండి నిన్నటి నేఁటి దాఁకఁగూడ నుప్పతిల్లుచునే యున్నవి. కాన అన్నమాచార్యుఁడు రచించినాఁడన్న వేంకటాచల మాహాత్మ్య మిప్పుడు ప్రఖ్యాతముగా నున్న వేంకటాచలమాహాత్మ్యము కావచ్చుననుట సిద్ధాంతపడవలసిన విషయము కాదు.

నేఁడు ముద్రితమై ప్రసిద్ధముగా నున్న వేంకటాచలమాహాత్మ్యము ప్రధానముగా వరాహ వామన బ్రహ్మాండ పాద్మ గారుడ మార్కండేయ పురాణములలోనిదిగా సంఘటితమైయున్నది. అనఁగా తొల్లింటి రచనలగు నాయాపురాణములలోని యీ స్థల మాహాత్మ్య బోధకములగు రచనల నన్నింటి నొక్కచోఁ జేర్చి యీ కృతి నెవరో యావిష్కరించి నట్లుగా వెల్లడియగుచున్నది. ఈ యభిప్రాయముననే ప్రాచుర్యము కల్గించునట్లుగా తాళ్ళపాక వారి కీర్తన మిది యున్నది.

"శ్రీవేంకటేశుండు శ్రీపతియు నితఁడె
పావనపు వైకుంఠపతియును నితఁడె.

భాగవతములోఁ జెప్పె బలరాము తీర్థయాత్ర
నాగమోక్షమైన దైవక మాతం డితఁడె
బాగుగా బ్రహ్మాండ పురాణ పద్ధతి యాతఁ డితఁడె
యోగమై వామన పురాణోక్త దైవ మితఁడె.

వెలయు సప్తఋషులు వెదకి ప్రదక్షిణము
లలరఁజేసిన దేవుఁ డాతఁ డితఁడె
నెలవై కోనేటిపొంత నిత్యముఁ గుమారస్వామి
కలిమిఁ దపముసేసి కన్న దేవుఁ డితఁడె" (అన్న – అధ్యా)

వేంకటాచలమాహాత్మ్య మను నీ స్థలమాహాత్మ్య సముచ్చయము గూర్చిన తొలిప్రశంస మనకు తిరుపతి శాసనములందే కానవచ్చుచున్నది. క్రీ॥శ॥ 1491 లో వసించి వెంకటత్తుఱైవర్ అనునామాంతరముగల జీయ్యర్ రామానుజయ్యంగారు అనువారు తాను నమ్రుఁడై

విన్నపము చేసిన తిరువేంకటాచల మాహాత్మ్యమును శ్రీస్వామివారు స్వీకారము చిత్తగించి ఆలకింప ననుగ్రహించునట్లు చేయుటకును, గొన్ని యుత్సవములు జరుపుటకును, ఉభయముగాఁ గొంత ద్రవ్య మొసఁగి స్థానాధిపతులచే శిలాశాసనము చెక్కించుకొనినారు.[1] అక్కడి శాసనములందే గ్రంథమును గూర్చిన తొల్దొల్లిటి ప్రశంస మన కిందే కాన వచ్చును. ఈ యంశముగల శాసనభాగమును దేవస్థానము ఎపిగ్రఫిస్టు శ్రీసాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు అనువదించుచు.

"God Tiruvenkatamudaiyan will, while presiding at the said Tiruvolakkam, be graciously pleased to hear, after an honourable announcement made there for, the TIRUVENKATA - MAHATMYAM compiled and humbly presented by him (The donor)."

అని శాసనకర్త (దాత)యే తిరుపతి వేంకట మాహాత్మ్యమును సంధానించి నివేదించినట్లుగ వ్రాసినారు. ఆ యభిప్రాయము తోడనే తత్కర్తృత్వమును గూర్చి విమర్శించుచు

'This is the earliest reference that we get in the inscriptions to the 'Tiruvenkata - Mahatmyam', and it is explicitly mentioned that it was humbly presented by Pasindi Venkatathuraivar. Consequently we may take it that the piecing together of the pertinent extracts from different puranas by Pasindi Venkata - thuraivar together with the additions of his own based on the Mangalasasanams (adulatory verses) of the Alwars or Tamil Vaishnavaite saints, who sang in praise of Sri Venkateshwara was completed in or before the Saka year 1413 Virodhi - in 1491 A D." (See his article in Sri Venkateshwara Journal - P - 15 & 16. Vol. I - No I - Aug. 1932).

అనివారే వ్రాసినారు. అట్లే History of Tirupati వ్రాసిన శ్రీ T. K. T. వీరరాఘవాచార్యులుగారు మున్నగువారు కూడ ఆ వేంకటత్తురైవ రనువారే వేంకటాచలమాహాత్మ్యకర్తగా పేర్కొనిరి.

1. చూ. No. 95–T. T. D. I Volume II Page 198–198.

కాని యీ యభిప్రాయము సరికాదని తెలియుచున్నది. ఆ తమిళ శాసనమున 'ఇవర్ విన్నపమ్ శెయ్‌ద' (వీరు విన్నపము గావించిన) అని మాత్రమే గలదు గాని "వీరు సంధానించిన" అను నర్థము గల వాక్యనిర్మాణ మందు కానరాదు. కావున తత్కర్త వెంకటత్తురైవర్ కాదనియు, మనకిటీవల తెలియవచ్చినట్లు తాళ్లపాక అన్నమాచార్యుఁడే యనియు, నాతనిచే రచితమగు వేంకటాచల మాహాత్మ్యమునే వేంకటత్తురైవరు స్వామివారికి విన్నపముఁ గావించినారనియు తెలియుచున్నది. అన్నమాచార్యుని కప్పటి కఱువదియేడేండ్లు - అప్పుడో అంతకింముక పూర్వమో ఆ కవీశ్వరుఁ డా గ్రంథమును ముగించి స్వామివారికి వెంకటత్తురైవర్ చేత సమర్పింపఁజేసి యుండవలెను. తదాది తిరుమల తిరుపతులలోని దేవాలయములలో వేంకటాచల మాహాత్మ్య పఠనమొక విధిగా దినచర్యగా రూపొందినది. ఆ నాళ్లలో వేంకటత్తురైవరులను పేరులు గలవారే భిన్ను లొకరిద్దరా పఠనమునకు నియుక్తులైనట్లు కూడ నక్కడి శాసనముల వలన తెలియుచున్నది.

1) 19-1-1546 లో అళియ రామరాయలు కొండమీఁద స్వామివారి సన్నిధానమున తిరువేంకటమాహాత్మ్యపఠనమునకై వడమామలయ్యన్ కుమారుఁడగు *తిరువెంకటత్తురైవర్* అను వారికి మాసమున కారుపణముల జీతమిచ్చి యేర్పాటు గావించెను. అప్పుడే దిగువ తిరుపతిలోని గోవిందరాజస్వామివారి సన్నిధిని కూడ తత్పఠనమునకై తిరువెంకటయ్యననువారి కుమారుఁడగు *అనంతయ్యంగారను* వారికి నెలకు నాలుగు పణముల జీతమిచ్చి వసతిఁ గల్పించెను.

2) 6-7-1546లో అరవీటి బుక్కరాజ రామరాజ తిమ్మరాజుగారి కుమారుఁడగు విఠలేశ్వరమహారాజు తిరుమలమీఁద వేంకటాచల మాహాత్మ్య పఠనమునకై అనంతయ్య ననువారికి నెలకు నాలుగు పణముల జీతముతో నేర్పాటుగావించెను. (ఈతఁడును వెనుక గోవిందరాజస్వామివారి యాలయమున నియుక్తుఁడగు అనంతయ్యాయు నొక్కరే).

3) 15-7-1545 లో సదాశివరాయల పాలనా కాలమున అరవీటి తిమ్మరాజు తిరుమలమీఁది యాలయమున అళగప్పిరానార్ తిరుమంజనవేళ ప్రతినిత్యము జరుగుచుండిన వేంకటాచలమాహాత్మ్య పఠనానంతరము చందనకర్పూర తాంబూలాదుల కేర్పాటు గావించి నట్లున్నది.

4) 8-6-1547 లో సదాశివరాయల పాలనా కాలమున తిరుమలనుంచి కుమారతాతయ్యంగారి కుమారుఁడు శ్రీనివాసయ్యంగారు తిరుమల మీఁద వేంకటాచల మాహాత్మ్య పఠనమునకై నెలకు రెండు పణముల జీతమిచ్చి అనంతయ్య గారి కుమారుఁడగు వెంకటత్తురై వర్ అనువారిని నియోగించిరి. (బహుశః తండ్రిగారి తరువాత నతఁడావిధి నిర్వహణమునకు నియోగింపఁబడెనేమో!)

5) 17-7-1546లో తాళ్ళపాక తిరువెంగళనాథుఁడు తిరుమల మీఁది స్వామివారి సన్నిధిని వేంకటాచల మాహాత్మ్యమును పఠించు చుండిన అనంతయ్య గారి కుమారుఁడగు వెంకటత్తురై వర్ అనువారికి నెలకొక్క పణము జీత మేర్పాటు గావించెను.

పై శాసనములనుబట్టి తిరుమలలో వడమామలయ్య కుమారుఁడు తిరువేంకటత్తురై వ రనువారును, తిరుపతిలో ఉరుపుత్తూర్ కరుప్ప తిరువేంకటయ్య కుమారుఁడు అనంతయ్యయు, అతని కుమారుఁడు వెంకటత్తురై వ రనువారును వేంకటాచల మాహాత్మ్య పఠనమున నియుక్తులై యుండినట్లు తెలియుచున్నది. క్రీ. శ. 1545 తరువాత అన్ని యాలయములందును అనంతయ్య వెంకటత్తురై వరుల పేరులేకాని వడమామలయ్యగారి కుమారుని పేరు వినరాదు. బహుశః అప్పటి కాతఁడు పరమపదించేనేమో! క్రీ॥ శ॥ 1491 లో తిరుమల మీఁద వేంకటాచల మాహాత్మ్య పఠనము గావించుచుండిన తిరువెంకటత్తురై వరు బహుశః ఈ వడమామలయ్యగారి కుమారుఁడేయై యుండవచ్చును. ఈ వేంకటాచల మహాత్మ్య గ్రంథపఠనము అన్నమాచార్యుని జీవిత కాలముననే ఆరంభమై తదాది తిరుమల తిరుపతులలోని యాలయము లలో నొకనిత్య కృత్యముగా తరువాత రూపొందినది. కాని తొలి

దినములలో నా పఠనము మార్గశిర మాసమునందే జరుగుచుండినట్లు తెలియనగును. సదాశివరాయల పాలనాకాలమున కది నిత్యకృత్యమై పోయినది. అంతేకాదు. తొలుత కొండమీఁద మాత్రమే పై పఠనముండె డిది. అది తర్వాతికాలమున తిరుపతిలోని గోవిందరాజ, వరదరాజ, అచ్యుతపెరుమాళ్ ఆలయములన్నిటిలోను నిత్యకృత్యముగానైనది.

పై పరిశీలనమునుబట్టి తిరుమల తిరుపతులలో నీ వేంకటాచల మాహాత్మ్య పఠనమునకు తాళ్ళపాకవారే యంకురార్పణము గావించి యారంభింపఁగా అరవీటి తిమ్మరాజు రామరాజాదులు మిక్కిలి దోహదము చేసినారనియు, పెదతిరుమలార్య తిరువెంగళనాథాదులు దానిని వర్ధిల్లఁజేసినా రనియు తలఁపనగుచున్నది.

ఇట్లు క్రీ॥ శ॥ 1491 కి పూర్వ మీస్థలమాహాత్మ్య సముచ్చయ మును గూర్చిన ప్రశంస మనకింక నెచ్చటను కానరాకుండుటయు, నప్పటి కన్నమాచార్యుఁ డరువదియేడేండ్ల వయసువాఁడై వర్ధిల్లు చుండుటయు, చినతిరువెంగళనాథుఁ డాతఁడే వేంకటాచల మాహాత్మ్య కర్తయని పేర్కొనిన యంశమును బలపఱచునవిగనే యున్నవి. అన్నమాచార్యుని కాలమున కంతకుఁ బూర్వమే యీస్థలమాహాత్మ్య సముచ్చయము గలదని నిరూపింపఁగలసాధనములు గానవచ్చునంత వఱకు నిది యన్నమాచార్య రచితమని తలంచుట యసంగతముకాదు. ఆతఁడే భక్తలోకము ప్రామాణికముగా గొనుటకై బహు పురాణ ములనుండి యుద్ధరించిన స్వల్పములగు కథాంశములను స్వీయ వర్ణన మున బెంచి పెద్దచేసి, తన కాలమునగల విశేషములను గూడ జతచేసి యిట్టిస్థలమాహాత్మ్యమును సంతరించి ప్రచారమునకుఁ దెచ్చియుండును. ఇపుడున్న పురాణములలోని వేంకటాచల మాహాత్మ్య భాగములు కాలాంతరమున వేర్వేఱు రచనముల కూర్పుతో చేరిపోయిన వను కొన్నను నందు ప్రాథమికముగా కొన్నియైన నతని రచనలై యుండ వలెననుట నిర్వివాదాంశమే కాగలదు.

ఈ స్థలమాహాత్మ్య సముచ్చయము బహుపురాణములనుండి యుద్ధరింపఁబడి కూర్పఁబడినట్లుగనే పేర్కొనఁబడినను, వేంకటాచల

మాహాత్మ్యమున గ్రంథస్థమగు విషయముల వివృతినిబట్టి పరిశీలించి చూచినపుడు ఇందలి కథాంశములెల్ల తొలుత నాయా పురాణము లందు రచితములు కావనుట వెల్లడియగు సత్యమే. శ్రీ శాస్త్రిగారని నట్లు అదియొక మహత్తర చర్చయే. అయినను అమూలముగా కాకున్నను పై భావములను బలపఱచునట్టి యంశము లొకటి రెండింటి నేని ఇచట స్థూలముగ చర్చించవలసియున్నది. ఈ విషయములను గూర్చి శ్రీ T. K. T. వీరరాఘవచార్యులుగారు తమ 'History of Tirupati' అను గ్రంథమున కొంత చర్చించియున్నారు (చూ. Vol. I పు. ౩౯) శ్రీ వేంకటాచల మాహాత్మ్యమున ప్రధాన భాగము నాక్రమించు వరాహ వామన పురాణాంతర్గత విషయమునే పరికింప వచ్చును. వరాహ పురాణమున ప్రథమ ద్వితీయ భాగములలోని 40 అధ్యాయములందున్నట్లుగా కొంత విషయ మీ వేంకటాచల మాహాత్మ్య మున వివరింపఁబడినది. ఈ విషయమెల్ల సూతుడు శౌనకాదిమునులకు చెప్పినట్లు కొంతయు, భూగోళోపాఖ్యాన మనుదానిలో ధరణీ వరాహ సంవాద రూపమున మఱికొంతయు విశదీకరింపఁబడినది. వేంకటాద్రి మాహాత్మ్య వర్ణనము, అచటి తదితర తీర్థముల ప్రశంస, శ్రీనివాసుని కళ్యాణము- అనునవి యిందలి ప్రధాన విషయములు. ఇట్లు వరాహ పురాణములోని నలువది యధ్యాయములలో నున్నట్లుగా పేర్కొనఁ బడిన విషయము సంగ్రహముగానేని పదునైదవ శతాబ్ది యుత్తరార్థ మున వెలసిన నందిమల్లయ ఘంట సింగయలను కవిద్వయముచే విరచిత మగు వరాహ పురాణానువాదమున కానరాకున్నది. ఆ పురాణమున నీ విషయమెల్ల అప్పటికెక్కినదో లేదోమఱి ! అంతేకాదు. వరాహ పురాణమందలివిగా పేర్కొనఁబడిన కథాంశములెన్నో కాలాంతరమున పలుకూర్పులకు మార్పులకు లోనై విస్తృతి నందినట్లుగూడా వక్ష్య మాణములగు నుపపత్తులచే గుర్తింపనగును ఇట్లే అన్ని పురాణ ముల విషయమును. అందుకే ఈనాఁడు పైని పేర్కొనఁబడిన పురాణ ములలోనివిగా చెప్పఁబడు స్థలమాహాత్మ్య కథలలో నందందే యెన్నో స్వల్పములగు భేదవిభేదములు, పునరుక్తులు కూడ నగుపడుచున్నవి. వివరింతును.

1. వరాహ పురాణాంతర్గతముగాఁ జెప్పఁబడు శ్రీనివాస కళ్యాణ కథావిషయమే భవిష్యోత్తర పురాణాంతర్గత కథావిషయముగా విస్తృతి నందినది. ఇందు కథ పెరుగుటతోపాటు పూర్వ పురాణోక్తమగుగాథలో లేని యంశములు- శ్రీనివాసుఁడు తన వివాహమునకై వలసిన ధనమును కుబేరుని నుండి యప్పుగాఁ దెచ్చుకొనుట, ఆ ఋణమును వెయ్యి సంవత్సరములలో తీర్చుకొనునట్లు పత్రము వ్రాసి యిచ్చుట- మున్నగునవెన్నో క్రొత్తవి వచ్చి చేరినవి. ఇవియే యింకను తర్వాతి కాలమున మఱికొన్ని మార్పులందినవి. ఇట్లే పురాణాంతర్గతములగు కథాంశములతో సంధానింపఁబడినట్లు చెప్పఁబడు శ్రీ వేంకటాచల మాహాత్మ్యమున నీ యంశము లన్నియు కాలక్రమమున జేరుచు తుదకు పందొమ్మిదవ శతాబ్దిలో తిరుమల మీఁద విచారణ కర్తలుగా నుండిన మహాంతులతో స్వామివారు పాచికలాడి యోడిన కథయు, తదాది కుబేరుని పక్షమున తామే యజమానులై ఋణమును రాబట్టుకొనుచు స్వామివారిచేత దాస్యము చేయించుకొన్న కథయుఁ గూడ ప్రవేశించినవి. కావున వరాహ భవిష్యోత్తర పురాణాంతర్గతములుగా చెప్పఁబడిన గాథలు[1] పదునైదవ శతాబ్ది పూర్వార్ధమునం దాయా పురాణములలో నున్నవో లేవోయని కూడ ననుమానింపఁబడునవి తరువాత క్రమమున పందొమ్మిదవ శతాబ్ది నాఁటి కెన్నివిధముల పెరిగి ప్రచారము నందినవో గుర్తింపనగును.

2. శ్రీ వేంకటాచల మాహాత్మ్యమున వామన పురాణాంతర్గత విషయముగా తద్గత బహు పుణ్యతీర్థముల ప్రశంసయున్నది. స్వామి పుష్కరిణీ వర్ణనమే అందు పలుతావులఁ గలదు. అట్లే అందు వేంకటాచల పాదమూలమునగల చక్రతీర్థ ప్రశంసయు గలదు. కాని యా తీర్థ

---

1. ఈ విషయమునే ప్రస్తావించి వేంకటేశ్వర మాహాత్మ్యమందలి కథలను పుక్కిటి పురాణములని త్రోసిపుచ్చుచు నా రచనము ప్రాచీనము కాజాలదని నిరూపించినారు శ్రీ T. K. T. వీరరాఘవాచార్యులుగారు.

(చూ. History of Tirupati by Sri T K T. Veera Raghava Charya Vol. I – Pages 85 to 87)

మెడనెడ నందే 'కపిలతీర్థ' మనియు వ్యవహృతము. ఈ చక్రతీర్థమునకు కపిలతీర్థ మనువ్యవహార మందే తప్ప మనకు తొల్లింటిశాసనాదులందెచ్చటను గానరాదు. రామానుజుల వారికాలము నుండియు చక్రతీర్థమనియు, దివ్యతీర్థమనియు, సుదర్శన చక్రత్తాళ్వార్ తీర్థమనియు, ఆళ్వార్ తీర్థమనియు పేర్కొనఁబడు నీ తీర్థమునకు 1866 A. D. వఱకును కపిలతీర్థమను నామము వ్యవహారముననే లేకుండెను. 10-2-1866 లో తిరుమల మీఁద విచారణ కర్తయగు మహాంతుధర్మదాసుగారే తమ శాసనమున దీనిని తొలుత 'కపిలతీర్థ' మని వ్యవహరించినారు. ఇట్లు పందొమ్మిదవ శతాబ్ది వఱకును చారిత్రికముగా కానరాని యీ కపిలతీర్థమను వ్యవహార నామము చక్రతీర్థమునకు బర్యాయముగా శ్రీ వేంకటాచల మాహాత్మ్యమున పురాణాంతర్గతస్థమగు విషయముగా ప్రశంసింపఁబడుట ఆయా రచనల యర్వాచీనతనే జాటునుగాని వేఱొకటి కాజాలదని శ్రీ వీరరాఘవాచార్యులుగారు విమర్శించిరి.[1] ఈ హేతువులను బురస్కరించుకొని పందొమ్మిదవ శతాబ్ది వఱకు వ్యవహారమునలేని 'కపిలతీర్థ' మను నామమున చక్రతీర్థము వ్యవహరింపఁబడుట పురాణములలో కాలాంతరమున జేరిన విషయమే అని గుర్తింపనగును.

8. వేంకటాచల మాహాత్మ్యమున వరాహ పురాణాంతర్గత విషయముగా శ్రీ భగవదావిర్భావ ఘట్టమున భగవన్మందిరమును వర్ణించు పట్టున "సహస్రరత్నసుస్తమ్భమణిమణ్డపశోభితమ్" అని గలదు. ఇల్లే ఆస్థానమంటపమగు నీ మణిమంటపముఁ గూర్చిన ప్రశంస మరి యొండు రెండు తావులఁగూడఁగలదు. ఈస్థలమాహాత్మ్యమున నిట్లు ప్రశంసింపఁబడిన మణిమండపము నేఁటి 'తిరుమహామణిమండపమే'యగునని వివరించుచు తన్నిర్మాణము క్రీ॥ శ॥ 1417 లో జరిగినట్లు శాసనసాక్ష్యముండుటనుబట్టి [No.196-vol-I (88-T.T) TTDI] దానిని పేర్కొన్న

1. చూ. History of Tirupati by Sri T. K. T. V. Vol I – P. 96 and Vol. II – P. 680–684.

రచన యటు తరువాతిదే కావలెనుగాని యంతకుఁ బూర్వపు రచన కా జాలదని శ్రీ సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వ్రాసియున్నారు.[1]

ఇట్టి చారిత్రికాధారములనుబట్టి ఈ స్థల మాహాత్మ్య ప్రశంసగల పురాణ భాగములేవియు క్రీ॥ శ॥ పదునైదవ శతాబ్ది (1417AD) కి పూర్వమందు రచితములై యుండలేదనియు, నా తరువాతనేగాని వాని యునికి మనకు తెలియరాదనియు వెల్లడి యగుచునే యున్నది. కావున నీ స్థల మాహాత్మ్యమును అన్నమాచార్యుడే పదునైదవ శతాబ్ది నడిమి భాగమున నెప్పుడో దానిని క్రొత్తగా వెలయించి ప్రచార దృష్టితో భక్త లోకమున నీ కృతికి ప్రామాణికత నాపాదించుటకై బహు పురాణములందలి విషయముగా సంఘటితపఱచి వైష్ణవభక్తి మతమున కెంతయో సేవగావించినాఁడనవలెను. ఈ స్థల మాహాత్మ్యము ఆలయములందును పురాణగోష్ఠులందును పఠితము కావలెననియే ఫలశ్రుతియందు కవియిట్లు వ్యాసప్రోక్తముగా చెప్పుచున్నాఁడు.

"య ఇదం ధర్మసంవాదం అవయోః సూతపావనమ్
పఠేద్వా దేవపురతో బ్రాహ్మణానాం పురస్తథా
సర్వేషామపి వర్ణానాం శృణ్వతాం భక్తిపూర్వకమ్
సప్రతిష్ఠామవాప్నోతి పుత్రపౌత్రసమన్వితః
శృణ్వతా మపి సర్వేషాం యదిష్టం తద్భవిష్యతి."

(వారాహ - 2-96-98)

నేఁటి వేంకటాచల మాహాత్మ్య కథలన్నియు తాళ్లపాకవారి సంకీర్తనములలోఁ గానరాకున్నను నందుదాహృతములగు కొన్ని కొన్ని స్థానిక దేశిగాథలు మాత్రమున్నవి.

(శంకరాభరణం) [స్వామి మహిమలు]

ఎటువంటి వాఁడవో నీ మహిమ
 లెట్టు దెలియవచ్చును

1. చూ. 'Tirumala Sri Venkateswara' Journal vol. I No. I – p – 15 – 16, Aug. 1932.

నిటలలోచనుఁడు అజుఁడు తెలియలేరు
నిన్నెట్లు దెలిసేరీ మానవులు ॥పల్లవి॥
తిరుమలనంబి తా తాతయన్ననాఁడె - తెలిసెనో మీ పెద్దతనములు
కురువనంబిగారిచేతి బంకమట్టి పువ్వులు - కొన్ననాఁడె తెలిసెమీ భోగము
మఱియుననంతాళువారి చెఱువుగట్టు - మన్ను మోయఁగా తెలిసె మీ నటనలు
గరుడ గంభముకాడ కానుకొక్కవరమిచ్చి - గడియించఁదెలిసె మీ సంపద ॥
తొండమాం జక్రవర్తికి సంపద - తొలుతనియ్యఁగాఁ దెలిసె మీ యీవులు
అంద యెఱుకువారి కొట్టుచేని యెన్ను - లారగించఁగాఁ దెలిసె మీ రుచులు
వుండిగొల్లల కావిళ్లపాలెల్ల - వుట్టుకోఁగఁ దెలిసె మీనేమములు
దండిగ సంపంగిమాఁకుల నడిపించ - దైవరాయ తెలిసె మీ విద్యలు ॥
మునుదాసు తిమ్మన్న తుంబురుకొండకు - మోక్షమియ్యఁగా దెలిసె మీ బుద్ధులు
పనివడి తాళ్లపాక అన్నమయ్యగారి - పదములలోఁ దెలిసె మీ వోజలు
యెనయ శ్రీవేంకటనాథ యలమేలుమంగ - నెద నుంచఁగా దెలిసె మీ గోప్యము
వెనుకొని పరుషవారి కెదురువోయి - వేఁటలాగాఁ దెలిసె మీ రాజసము ॥

(శేషాచార్యులు గారి వ్రాతప్రతి)

(కాంభోది) [కురువనంబి]

కురువనంబి తిరుమల కురువనంబి నీ
చరణములే కొలిచి బ్రదికె కిరీటముగలరాజు ॥పల్లవి॥
దవ్వులా మాటనుండి నీవు పువ్వులఁ బూజించితే అని
చివ్వన అప్పని యడుగుదామెరలపై చెలఁగి యప్పుడే నిలచె
పువ్వులకు ఱెక్కలున్నవో లేక వుండరీకాక్షుని మహిమో
నివ్వటిల్లు నీ భక్తియో కాని నేఁడు నాతోఁజెప్పవే॥ (శేషా. వ్రాత ప్రతి)

(గుండక్రియ) [స్వామి పుష్కరిణి]

దేవునికి దేవికి నీ తెప్పల కోనేరమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా ॥పల్లవి॥
ధర్మార్థ కామ మోక్షతతులు నీ సోపానాలు
అర్మిలి నాలుఁగు వేదాలవే నీదరులు

నిర్మలవు నీ జలము నిండు సప్తసాగరాలు
కూర్మము నీలోఁతు వో కోనేరమ్మా॥

తగిన గంగాది తీర్థములు నీ కడళ్లు
జగతి దేవతలు నీ జలజంతులు
గగనవుఁ బుణ్యలోకాలు నీదరి మేడలు
మొగినీ చుట్టుమాఁకులు మునులోయమ్మా॥

వైకుంఠ నగరము వాకిలే నీ యాకారము
చేకొను పుణ్యములే నీ తీవభావము
యేకడను శ్రీ వేంకటేశుండె నీపునికి
దీకొని నీ తీర్థమాడితిమి కావమ్మా॥

వేంకటాచల మాహాత్మ్యమందు వర్ణితములగు కురువనంబి తొండమాన్ చక్రవర్తుల కథలే పై కీర్తనములందు వర్ణితములు. స్వామి పుష్కరిణీ వర్ణనము పై సంకీర్తనమున స్థలమాహాత్మ్యముననుసరించియే యున్నది.

## వచన సంకీర్తనములు

స్తుతి ప్రధానములగు స్తోత్రములు, దండకములు, ఉదాహరణములు, శతకములు సంకీర్తనములు మున్నగు కావ్యప్రక్రియలు ప్రముఖముగా వస్తు ప్రధానములగు కావ్యనాటకాదులవలెగాక ఆత్మికములై కవీశ్వరుని రసానుభూతికి స్వరాలంకారములవలె భాసిల్లుచుండును. అందు కవీశ్వరుని చిత్తవృత్తి చాటుమాటలులేక తేటతెల్లముగ బహిర్గతమగుచుండును. ప్రాయికముగా నీకావ్యప్రక్రియ లన్నియు పరమపురుషునిగూర్చిన అలోకసామాన్యమగు ననుభూతి పరిపాకమును భక్త్యావేశమున బ్రకటించునవిగా నుండును. కావుననే అవి చిరస్థాయిరచనలై సహృదయహృదయముల కత్యంత సన్నిహితములు కాగల్గుచున్నవి. ఈ చమత్కారమును గుర్తించియే తత్త్వదృష్టిగల తెలుగుకవులు కొంద రిట్టికావ్యప్రక్రియలోనే సాహితీ సృష్టి గావించినారు ఆ శాఖకుఁ జెందినవే వచనములు, విన్నపములు మున్నగునవికూడ.

*శ్రీ వేంకటేశ్వర వచనములు* : కర్త తాళ్ళపాక పెదతిరుమలాచార్యుఁడు-వారికీర్తనాచార్యుఁడును, పదకవితా పితామహుండును నగు అన్నమాచార్యుల తనయుఁడు - ఈరచన శ్రీ వేంకటేశ్వర స్వామివారి కంకితముగావించినాఁడు. - [1]

పెదతిరుమలాచార్యుల వేంకటేశ్వరవచనములు వారి హృదయ నివేదనము లనఁదగిన విన్నపముల సముచ్చయము. ఈ గ్రంథరచనలో నేదేనొక కథావస్తువో, ఆనుపూర్వియో ఏదియు కానరాదు. అన్నియు విడివిడిరచనలు. అప్పుడప్పుడు తనకుఁదోచినతత్త్వవిషయముల నీశ్వర స్తుతిపరములుగావించుచు తనయింటివేల్పుదగ్గర కూర్చుండి భక్తితో హృదయమును స్వామిపాదములకడ నర్పించుకొను విషయ మిందు మనకు గోచరించును. 'నీవు చక్కని మూర్తివిగావున నీ విగ్రహంబు నాయింటిలోపలనిడుకొని నావేడుకలకు దేవరంగా గొల్చితిని' అని యాతఁడు చెప్పుకొనినాఁడు. ఇక 'నేను దుర్జనుండనని యెవ్వరు మరుగుపడ విన్నపంబుచేయుదురో? యిప్పుడే నా నేరములు నేనే చెప్పుకొనెదను. మంతాడు కొనియెద' అని శీలమును శిక్షించి చక్కఁజేసికోఁదలంచిన పూజ్యులు తమదినచర్యను గ్రంథస్థము గావించుచు, మొగమోటములేక తోచినభావములను తోచినట్లు భగవద్భక్తితోడను, పాపభీతితోడను వ్రాసికొను "డైరీ"లవలె పెదతిరుమలయ్యకూడ నిత్యనివేదనగా నీగ్రంథమునుచెప్పుకొని యుండెనేమో!

---

1. క్రీ. 1925 క్రోధన వైశాఖము భారతి లో శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి వచనములఁ గొన్నిటిని ప్రకటించి యుండిరి. వానిని విడిగా గ్రంథముగాఁగూడ ప్రకటించనెంచి నూటయిర్వది వచనములు 80 పుటలు ముద్రించియు నుండిరి. పిదప క్రీ. 1935 లో తిరుపతి దేవస్థానమువారు "వైరాగ్యవచనమాలికాగీతము"లను పేరున అరకొరగా నలువది యేడింటిని మాత్రము ప్రకటించినారు. మరల శ్రీ ప్రభాకరశాస్త్రిగారే 1945 లో ఆకార్యమును కొనసాగించి దేవస్థానము వారి పక్షముననే మొత్తము 166 వచనములను పరిష్కరించిరి. (చూ. వేంకటేశ్వర వచనములు పీఠిక పు. 16)

ఈగ్రంథమందు గృహదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిమీఁద నా మహాకవికిఁగల అపారమైన భక్తి యడుగడుగున కానవచ్చును. "నీ వాక్కుభక్తిచేతనే సాధ్యుండవు" అని ద్రావిడాళ్వారులవలె స్వామిని గీర్తించి యామార్గమునే యనుసరించినాఁడు. అట్టి భక్తిలోనే తృప్తిని, రక్తిని, ముక్తిని తానను భవించినాఁడు. "నీ దాసుల సంగతినియోగము నలవడె. ఇంక నిన్నడిగెడిదేమి? అన్నిట గృతార్థుండనైతిని శ్రీ వేంకటేశ్వరా!" అని యాతఁడొకతూరి తృప్తిపడును. "పద్మనాభా! నీకు మ్రొక్కనెత్తిన కేలినమస్కారంబు ముంజేతి కంకణంబు. నీ లాంఛనంబులైన తిరుమణిపదంబులతోడు మంగళసూత్రంబు. ఇతరంబుమాని నిన్నే గొల్చుట పాతివ్రత్యధర్మంబు. నీ దాసులసంగతి మెలంగుట కులాచారనియమము. నీ దాస్యమే మానంబు. నీ మూర్తిని సేవించుటే సదానుభవంబు" అని రక్తితో విశిష్టానుభూతిని వేదాంతివలె నొకతూరి పొందును. "పతివ్రతా భావంబున దాస్యంబునకు కంకణము గట్టుకొంటిని. ఇదే నావిన్నపము" అని స్వామిముందు ప్రమాణముచేయును. "ప్రత్యక్షంబైన మిమ్ముఁ గొల్చిన పరోక్షంబు మీరే యిచ్చెదరుగాక వేగరింప నేటికి? నీ దాస్యమే నే గోరంగలవాడ" అనిదాస్యమే తనకబ్బిన ముక్తిగా నుబ్బిపోవును. ఇదియే విశిష్టాద్వైతులు పొందెడి శాశ్వతమైన సత్యానుభూతి. దానిని చక్కగా నిందు కవి పలుతాపులలో వ్యక్తీకరించినాఁడు. స్వామికే కాదు అతని దాసుల దాసులకుఁగూడ సేవచేయుట కీభక్తుఁడు సంసిద్ధుఁడు. ఆ దాసదాస్యమాహాత్మ్యమును గుర్తించియే "నీకంటె నీదాసు లధికులౌట తేటబడె" ననుకొనినాడు కవి. "మిమ్ము నాకుంజూపి చెప్పిన యాచార్యుల శ్రీపాదతీర్థ విశేషంబులకుం జేయొగ్గెద. మీ దాసుల పాదరక్షలు మోసెద. మీ దాసానుదాసుల సేవకుండనయ్యెద. మీ దాసీజనంబులకు నీళ్ళుమోసెద. నీ లెంకలకు లెంకతనంబునకుఁ జొచ్చి యచ్చువేసికొనియెద" అనియు వాపోయినాడు. భక్తితో శరీరమును పదునుచేసి, దాస్యమున బరిశ్రమించి, అనురాగపుఁబంట పండించుకొని సారూప్యమనెడి ధనమును గడించుకొన నా కవి యభిలషించును. "వెన్నపట్టుక నేయి వెదుకనేమిటికి ?" "పరుస వేది యింటనుండగా

బంగారమడుగవలెనా" అని యొక్కొక తడవ కొండంత తృప్తి ననుభవించును.

స్వామినే నమ్ముకొని, "నీకు శరణుజొచ్చి, నామంబులు పఠించిన నీవే దయదలచెదవుగాక" అని భారమంతయు స్వామిమీఁదనే వైచి "మీ యంత మీరెప్పుడు నన్ను మన్నించి విచ్చేయుదురో యని మీ శ్రీ పాదపద్మంబుల చప్పుడు నాలకింపుదును. మీకై నే నేవేళనైనను హృదయంపువాకిళ్ళు గాచుచుండెద" అని జాలిజాలిగా కొసరి స్వామి కృప నర్థించును. శరణాగతిఁ బొందును. ఆ భావముననే కొండంత ధైర్యమును గూర్చుకొని నిబ్బరముతో "ఉండుగాకేమి పెద్దతనంబులు కొందరికి, నీశరణాగతధర్మంబుతోఁ బురుణింపరావు" అనుకొనును. స్వామియే యీ జగన్నాటక సూత్రధారుడు. మానవ మాత్రు లాయన యాడించునట్లెల్ల నాడుచుందురు. కావున బాధ్యత పూర్తిగా స్వామిదే. అందుకే ధైర్యమున నొక్కతూరి "ఈరీతినే నీకల్పితంబులైన దేహంబులు మోచుచున్నవారము, మానేర్పు నేరములు మా స్వభావములు, మాసంసారకృత్యంబులు నీ కల్పితమైన నీప్రభావంబులే. మమ్ముఁదప్పులెంచఁ బనిలేదు" అనిముచ్చటించును. మితిమీరిపోయి మరియొక్కతూరి "ఊరకున్న జీవులచేత నపచారంబులు చేయించవేల ? వారిని రాక్షసులుగాఁ బుట్టింపనేల - నీవు జన్మంబు నొందనేల ? మొదలనే సుజ్ఞానులం జేసిన నీకేమి వెలితయ్యెడిని ?" అని నిర్భయముగ స్వామిని నిలువదీసి ప్రశ్నించును. ఇట్లే పలుసందర్భములలో మౌగ్ధ్యమున పసిపిల్లవానివలె రెచ్చిపోయి మాట్లాడును. వెనువెంటనే పశ్చాత్తాపమునంది గౌరవమున సంభావించి దయజూపుమని యర్థించును. భక్తితోఁ గేరింతలు కొట్టును. ఒక్కొక్కసారి నిష్ఠతో యోగముద్రదాల్చి కేవలనామజప మొనరించును. ఉపనిషత్తులలోని. పురాణములలోని తత్త్వమును రచనలో రంగరించుకొనును. "సర్వం విష్ణుమయంజగత్తు"ని నారుకావున తాను పరమ వైష్ణవుఁడనని చాటుకొనును. "నిన్ను మెచ్చి నీకేమి యొసగెదము ? నిన్నుం బొగడుటే మా చేతనైనపని" అని చేతులు కట్టుకొని ప్రార్థించి, "దాసరి తప్పునకు ప్రాయశ్చిత్తముగా దండము" పెట్టెద ననును.

స్వామికిని దనకును స్వామిభృత్యన్యాయము తప్పదనును. తానొక మదించిన యేనుగట! దాని మదమణచి దిద్ది చక్కజేసుకొని "అష్టాక్షరంబనియెడి ఘంట కట్టించి, రామానుజ సిద్ధాంతంబనియెడి మురజ గట్టించి, కృష్ణరాహుత్తుండనెడి మావంతు నెక్కించి భాగవత సజ్జారంబునం గట్టి పాలించుకొమ్మని వేడుకొనెను. అనంతంబులైన విన్నపములాచరించి యాడుకొనును; పాడుకొనును. ఇట్లు బహు ప్రకారముల విన్నవించి తన కవితాకన్యకు శ్రీ వేంకటేశ్వరుఁడే వరుడని నిర్ణయించి, ఆయనకే ఆమెను సమర్పించుకొనెను. అర్పించి "ఇంక నాకర్మబంధంబు లూడెఁగదె, నీవిట్లు పాణిగ్రహణంబు సేసికొంటి, విక నీదేవులు నీవును చిరంజీవులై యుండి సంగీత సాహిత్య నానాలంకారాది పుత్ర పౌత్రాభివృద్ధి వెలయించుచు నీదాసుల రక్షింపవే శ్రీ వేంకటేశ్వరా" అని వేడి నిశ్చింతుఁడగును.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారీగ్రంథ పీఠికలో వ్రాసినట్లు "ఇందు విశిష్టాద్వైత సిద్ధాంతవిషయములు సర్వత్ర కరుడుగట్టియున్నవి" మఱి కొన్ని యుదాహరణము లెత్తి చూపుదును.

"నీలమేఘశ్యామలా : అణువులకు అణువవు. మహాత్ములకు మహనీయుండవు. ప్రకృతి పురుషులకుం బరమాత్మవు. మూఁడు మూర్తులకు మూలమవు ... విచారించిన నిర్గుణుండవు. వినంగడంగిన కళ్యాణగుణుండవు కన్నులం జూచిన సాకారమవు స్వరూప వ్యాప్తిని నిరవద్యుండవు. భక్తపరులకుఁ బ్రసన్నుఁడవు -" (వ–15)

"ఆదిమూర్తి! నేనుభూలోకంబున నాకర్మంబు లనుభవింపం బుట్టితిని గాని నిన్నుగుఱుతెఱిఁగి కొలిచెదనని పుట్టినవాఁడను గాను. ఇంతలో నిర్హేతుక శీలం గరుణించి, నన్ను బంటుగా నేలితివి" (వ – 48)

"...శేషత్వ పారతంత్ర్యముల మఱుఁగున నిల్పి మిమ్ము సేవించు మీ దాసానుదాసుండనని యెఱుంగుమా శ్రీ వేంకటేశ్వరా" (వ–58)

"భక్తసులభుండవని చదువులలో నిన్నుఁ జెప్పంగాఁ జెవులు చల్లంగా వినుటయొకటి, కన్నుల పండువుగా నీమూర్తులు దర్శించుట యొకటి, నీరూపులు మనంబునఁ దలపోయు టొకటి, కరంబుల నీకు మ్రొక్కుటొకటి, నీ నామంబులు జపించుటొకటి – ఇంతియకాని వేఱొక్క యుపాయంబు మఱి లేదు" (వ–117)

"...తిలలోని తైలంబు విధంబునఁ గాష్ఠంబులోని యనలంబు చందంబున, పుష్పంబులోని పరిమళంబు పోలిక, బీజంబులోని వృక్షంబుల కైవడి నీరీతి జగంబులలోన నీవును, నీలోన జగంబులును, బాహ్యాంతరంబుల నీవు పరిపూర్ణుండవై యున్నావు" (వ-168)

ఇట్లే ప్రకృతి పరిణామ క్రమమును (వ-148) అర్చామూర్తుల సౌందర్యమును (వ-146) నూట ఎనిమిది దివ్యతిరుపతులను (వ-147) పెదతిరుమలాచార్యుఁడు విపులీకరించియున్నాడు. అన్నమాచార్యుని కీర్తనములందలి భావసంపద పుష్కలముగా వీరి వచన గీతములందు వచ్చిచేరినది. చూ. "నిన్ను నీవే యెఱుంగుదువుగాక యితరులకు నెఱుఁగ దరమా" (వ-72) అను వచనమునందలి భావము "ఇతరులకు నినునెఱుఁగదరమా!" అను అన్నమాచార్యుని కీర్తనమున జూడఁదగును. ఇట్లు పెక్కులుదాహరింపవచ్చును.

పెద తిరుమలాచార్యుఁడీ కృతిని నడివయస్సున రచించెనని తోఁచుచున్నది. "బాల్య కౌమార యౌవన గతులం బెరుగుచున్నవాఁడను" (వ-45, 57, 90) ఈకవి యిందు తన స్వరూపమును గూడ కొంత చిత్రించుకొనినాఁడు. ఈతఁడు కృష్ణరాయల సమకాలికుడు, పరోక్షమున రాయల ప్రసక్తి కొంత యీతని వచనములందున్నట్లున్నది. కొందఱనడుగంగాను వారలొండేమి యడుగుచున్నాఁడవని హుంకారధిక్కారంబులచేత భర్జింపఁగాను వారలం దిరిగి కోపింపక యందులకు నొదిగి శాంతిఁ గైకొని వర్తించితి - శాంతియే కాయుత్తమవస్తువని నామనోవీథింగట్టితిని - అది యమూల్యము. తులాభార హిరణ్యగర్భాది మహాదానంబు లిందులకు సరిగావు" (వ-65) రాయలు తిలాపురుష దానాదు లానాఁడు పెక్కులుగావించియున్నాఁడు. మరియొక వచనమున తాననియెడి మదించిన యేనుంగునకు కృష్ణరాహుత్తుండనియెడి మావంతు డున్నట్లు చెప్పుకొనెను. మావంతుఁ డేనుగును అంకుశముతో బొడిచి దారికివచ్చునట్లు చేయును. బహుశః రాయని అహంకారమో ఔదాసీన్యమో పెద తిరుమలాచార్యుని పరియైన మార్గమున బెట్టినదను సూచనమిందేమైన కలదేమో !

గ్రంథవిషయమువలెనే యిందలి రచనారీతియు ప్రసన్నముగ నున్నది. ఈ రచన మనసువిచ్చి సూటిగా మాట్లాడుచున్నట్లుండును. అన్వయ క్లేశ మెక్కడను గానరాదు. కాని యాలంకారికముగ నుండును. వాక్య నిర్మాణ వైఖరియు ఛందస్సుతోఁ గూడుకొన్నట్లే సరసముగ తోచును. ఈ వచనములకు రాగతాళముల నిర్దేశమున్నది. నాఁడీ వచనములను బాడెడివారు, 'అయిన నౌగాకేమి - ఎందులకు వేలా భయంబు నొందఁ - ఉండుగాకేమి పెద్దరికంబులు కొందరికిని- అవధారు దేవా నావిన్నపమొకటి కలదు - వీడేల తగిలెడునని తలగకు - శ్రీవైష్ణవుండనైతి రక్షింపవే' ఇత్యాదిగా వచనరచనావిన్యాసము నందే భావౌద్ధత్యమును ప్రదర్శించినాఁడు కవి. మచ్చున కొక్క యుదాహరణము.

## రామక్రియ - రూపకతాళము

"క్షీరాబ్ధిశయనా ! కమలంబు సూర్యున కెదురుచూచినయట్లు నాహృదయపద్మంబు రవిమండలమధ్యవర్తియైన నీ కెదురు చూచుచున్నది. కుముదంబులు చంద్రోదయ మపేక్షించినట్లు నాకన్నుంగలువలు భవద్దివ్యముఖచంద్రదర్శనం బపేక్షించుచున్నవి. మయూరంబులు మేఘాగమనంబునకుం జెలంగినట్లు నా మనోమయూరంబు నీల మేఘవర్ణుండవైన నీ తిరుమేను దలంచి యానందించుచున్నది. ముత్యపుఁజిప్పలు స్వాతిచినుకులకు నోరు తెరచినట్లు నావదనశుక్తి మీ పాదతీర్థంబునకు వికసింపుచున్నది. సర్పంబులుగానంబులుగోరి చొక్కి పడగలెత్తి యాడినట్లు నావీనులు నీకథల నాలకించుచున్నవి. నీవు పరాత్పరమూర్తివి. నేను ప్రకృతి సంబంధంబులైన యంగంబులు ధరియించినవాఁడ, నది యెట్లు గూడుననవలదు. ఆ ప్రకృతికి నీవ చైతన్యమవు. ఈ చుట్టరికము తొల్లి కలుగఁగానే దీనికియనురాగము గలిగియున్నది. కన్నెఱుఁగకున్నఁ గడు వెఱుఁగునంద్రు లోకులు. ఇంతియకాని నిన్ను నెఱుంగ నే నెంతటివారము. నాయాస విన్నవించితి నింతియకాని నిన్ను నేఁ గక్కసించినవాఁడఁగాను జుమీ - శ్రీ వేంకటేశ్వరా" (వ-4)

ఇందన్నియు నిట్టి వచనములే. జీవితమంతయు సంకీర్తన రచనకే అంకితము గావించుకొన్న ఆ పుణ్యాత్ముఁడు ధన్యుఁడు.

# తెలుఁగు సంకీర్తన లక్షణము

## లక్ష్యలక్షణ సమన్వయము

నేడు మనకు దుర్లభముగా నున్న 'సంకీర్తన లక్షణ' మను సంస్కృత లక్షణ గ్రంథమునకీ కృతి తాళ్లపాక చిన తిరుమలాచార్యుడు కావించిన యాంధ్రీకృతి. పదకవితా పితామహుడనియు, హరికీర్తనాచార్యుడనియు పేర్వడసి జీవిత మెల్ల స్వామి సేవలోను, సంకీర్తన రచనలోను గడపిన సుప్రసిద్ధ వాగ్గేయకారుడయిన తాళ్లపాక అన్నమాచార్యుడే తొలుత నీ 'సంకీర్తన లక్షణము' ను సంస్కృతములో రచించెనని చిన తిరుమలాచార్యుని యీ లక్షణ గ్రంథమును బట్టి తెలియుచున్నది.

క. భరతాదులు గ్రంథంబుల
విరచించిన లక్షణములు వేంకట భూమీ
ధరవర కీర్తన లక్ష్యము
లురుపద కవితా పితామహుం డేర్పరచెన్.

ఆ. అట్టి యన్నయార్యుఁ డానతిచ్చిన పద
లక్ష్య లక్షణముల లాగు దెలిసి
పలుక నేర్చెనేని బాలుఁడు ప్రౌఢ యాఁ
దత్ప్రబంధ మమృతధారఁ బోలు.

మ. ధరలోఁ దాళ్ళపాక యన్నయ గురూత్తంసుండు సంకీర్తనా
పరిశుద్ధిన్ మును చేయఁబూని తగనుత్పాదించెఁ దల్లక్షణం
బరుదై మించిన సంస్కృతంబున గవీంద్రానంద సంధాయియై
పరిపూర్ణాఖిల శాస్త్ర సమ్మతముగా భావజ్ఞ లౌనౌననన్.

(సం. ల. 13-15)

ఇట్లు భరతాదుల లక్షణములకు లక్ష్యములుగాఁ జూఁపదగిన కీర్తనముల నెన్నో స్వయముగా రచించిన అన్నమాచార్యుఁడే 'సంకీర్తనాపరిశుద్ధి నేర్పరచుటకై యీ లక్షణ గ్రంథమును సంస్కృతమున రచింపఁగా దాని కాతని కుమారుఁడగు పెద తిరుమలాచార్యుఁ డొక

లఘువ్యాఖ్యను గూడ గావించి యుండెను. (ఆ వ్యాఖ్యయు నేఁడు మనకు లభించుటలేదు.)

ఇట్లు అన్నమాచార్య కృతమును, పెదతిరుమలాచార్య వ్యాఖ్యాతమును నగు సంకీర్తన లక్షణమును మూల వ్యాఖ్యా సహిత ముగ అన్నమాచార్యుని పౌత్రుఁడును, పెదతిరుమలాచార్యుని పుత్రుఁడును నగు చిన తిరుమలయ్య ఆంధ్రీకరించెను. ఈ యంశముల నాతఁడే ఇట్లు చెప్పుకొనెను.

"అలరుఁ దాళ్ళపాక యన్నయార్య సుతుఁడు
తిరుమలార్యుఁ డఖిల దేశికుండు
తత్సుతాగ్రజుండ ధరలోనఁ జిన తిమ్మ
యాహ్వయుండ దంఘ్రియమమతమున.

పరమామ్నాయ సమానమై వెలయు మత్పైతామహ గ్రంథమున్
వరచాటూక్తి మదీయ పుణ్యజనక వ్యాఖ్యాతము న్వేడ్కదా
చరణాంభోరుహముల్ మదిం దలఁచి సచ్ఛాస్త్రజ్ఞు లింపొందఁగా
వరుసం జెప్పెదఁ బద్య రూపమునఁ దద్వ్యాఖ్యానుసారంబుగన్."

(సం. ల. 16-17)

అని ఇట్లు 'మహనీయమగు సంకీర్తన నామక పద సంప్రదా యము' సంపూర్ణముగా వివరింపబఁడిన యీ సంకీర్తన లక్షణ గ్రంథ మును చిన తిరుమలాచార్యుఁ డందఱికిని సుబోధమగు రీతినే యనువ దించెను. గ్రంథారంభమున చిన తిరుమలాచార్యుఁడు తాతగారిని భక్తి పురస్సరముగా 'పూర్వపదకవిమణి శ్రేణీవరహారమున నాయకమణి'గా వర్ణించెను. అటుపై అన్నమాచార్యుని కీర్తనముల యోగ్యతను పది పండ్రెండు పద్యములలోఁ గీర్తించెను.

క. పావనములు హరి భక్తివి
భావనములు సర్వమంత్ర పరమ రహస్యో
ద్భావనములు గాయకనిక
రావనములు తాళ్లపాక యన్నయ పదముల్. (8)

క. లక్షణములు పద కవితా
రక్షణములు వివిధ కుకవి రాజీ మదన
మ్మోక్షణములు వేంకట పతి
వీక్షణములు తాళ్ళపాక విభు సత్కవితల్. (7)

ఇట్లే వారి పదములు 'బహు దేశ విహారంబు' లనియు, 'వాణీ వీణానాదంబు' లనియు బహుధా స్తుతించి తుదకు.

మ. శ్రుతులై శాస్త్రములై పురాణ కథలై సుజ్ఞానసారంబులై
యతిలోకాగమ వీథులై విపుల మంత్రార్థంబులై నీతులై
కృతులై వేంకట శైల వల్లభ రతి క్రీడారహస్యంబులై
నుతులై తాళమపాక యన్నయ వచో మూర్తుల్ క్రియల్ చెన్నగున్.

అని వివరించెను. వేంకటాద్రిపతిపై నాయన చెప్పిన పదమే తుదిపద మయ్యెను.

ఈ విధమున గ్రంథము నారంభించి చిన తిరుమలార్యుడు మూలానుసారముగా పద సంప్రదాయము ననుసరించి పదముల లక్షణమును, వాని స్వరూప భేదములను, అందలి భాషానియమములను, పద విభాగములను తదవాంతర రూపములను, విపులీకరించి యంతమున కుపద కవిత్వ నిరసనమును గూడ చక్కని శైలిలో రచించినాడు.

ఈ గ్రంథమందలి విషయము పదకవితకు సంబంధించినది.[1] తొలుతనే కవి 'పదమగు సుప్తిఙంతము - పద మవయవ మవయవి యును, పదమున బరగున్' అని వివరించెను. అందు 'అవయవపద' మనునదే మనకిందు ప్రస్తుతము. ఇది చతుష్పాదంబగును. దీనినే

1. తి. తి. దేవస్థానము వారు (1935 లో) ముద్రించిన 'సంకీర్తన లక్షణము' నందలి గ్రంథస్థ విషయమును, పద్యములును కలగాపులగముగ కలిసి పోయినట్లున్నవి. వానినొక క్రమము నేర్పరచి విషయము నిందు వివరించుచున్నాడను. కొంత యెచ్చటనేని గ్రంథ పాతము కూడ మున్న దేమో అని యనుమానమగుచున్నది. ఉదా :— గొబ్బిళ్లు పదమున కిందు వివరణము కానరాదు.

వృత్త, ధాతు, అవయవము లనుసంజ్ఞలతోఁడను బాటింతురు. శరీర ధారణమునకు వాత పిత్త కఫముల వలెనే పదశరీరసముద్భవ కారణంబులైన వృత్తము లలరుట చేతనే వానికి ధాతుసంజ్ఞ లేర్పడెనని భరతాదులు వివరించిరి.

పదములు వర్ణ్య విషయమును బట్టి శృంగార పదములనియు, వైరాగ్య పదములనియు ద్వివిధము. శృంగారపదములందు పాత్రోచిత భాష యవసరము. గ్రామ్యములైనను బొంక మెరిగి పలికినఁ జెల్లుబడి యగును. వైరాగ్య పదము లట్లుగాక అగ్రామ్యరమ్యావిష్ణుచరితోదారములై యుండవలెను. వీనినే అధ్యాత్మ పదము లనియు నందురు.

పదము సంస్కృత మందేని, ప్రాకృత మందేని ఒండె దేశ భాష లందేని పలుక వలయును. అందు యతిప్రాసము పద్య భంగినే చెల్లు ననిరి భరతాది మునులు.

పదములు లక్షణ భేదమును బట్టి 1. వృత్తపదము, 2. నిబంధ పదము, 3. అనిబంధ పదము - అని మూడు తెరగులు.

పదము

వృత్త పదము | నిబంధ పదము | అనిబంధ పదము

వీనిలో వృత్తపదములు భరతుడు వివరించినట్లు సంస్కృత ఛందమున ప్రసిద్ధములగు 26 ఛందః ప్రక్రియల నుండి రూపొందింపఁ బడిన పదములే.[1] ఈ వృత్త పదము మరల 1. విషయము, 2 సమము 3. అర్ధసమము అని మూడు విధములు.

## (1) వృత్తపదము

విషమము : పదము నందలి చరణములలోని నాలుగు పాదములును, నాలుగు విధములుగ నుండును.

1. చూ. భరతుని నాట్య శాస్త్ర గ్రంథము - ధ్రువాధ్యాయము, ఉక్తా అత్యుక్తా మున్నగు షడ్వింశచ్ఛందో భేదములనుండి తీసి చూపిన వృత్త (పద) భేదములు.

సమము : చరణము నందలి నాలుగు పాదములు నొక్క చాలున వర్తిల్లును.

అర్ధ సమము : చరణము నందలి విషమపాదము లొకరీతిని సమ పాదములు మరియొక రీతిని వర్తిల్లును

నిబంధ పదము 'యతులుం బ్రాసములుం బదంబులును మాత్రానీకముల్ తాళ సంగతులుం గల్గి- ఆఖ్యాతార్థ సంయుక్త సత్కృతియై అన్వయ గురూక్తిన్ లోక విఖ్యాతమై' విరాజిల్లును. నిబంధ పదమునకీ యతులును, ప్రాసలును, మాత్రాగణ ప్రధానములగు పదములును, మార్గదేశి తాళములును, ముద్రయు - నను నంగము లయిదు కలవు.

నిబంధపదము (అంగములు)

యతి ప్రాస. మాత్రా గణములు. మార్గదేశి తాళములు. ముద్ర

ఈ నిబంధ పదమునకే మరి యైదవయవములున్నవి. అవి వరస క్రమమున 1· ఉద్గ్రాహము (లేదా ఉగము), 2. మేళాపము, 8. ధ్రువము, 4. అంతరి, 5.ఆభోగము అనునవి.

నిబంధ పదము (అవయవములు)

ఉద్గ్రాహము. మేళాపము. ధ్రువము. అంతరి. ఆభోగము

నిబంధపదమున పదమనఁబడు నాలుగు పాదములు గల చరణమొక్కటియేని అంతకు మించిన సంఖ్యలోనేని నుండును. అట్టి పదముల (చరణముల) యర్థమును వదలక అన్నిటికి నేకవాక్యతఁ జేయన్ గుది గ్రుచ్చినట్లు తగులై పదము తుదిన్ మరియు మరియు భాసిల్లునట్టి 'పల్లవి' యుండును. అది 1. పల్లవి, 2. శిఖాపదము నని రెండు విధములు. 'పదః మానమాన పాద యుగ్మము' కలది పల్లవి. అందు అర్ధమైనయది (అనఁగా ఏక పాద మాత్రమైనది) శిఖా పదము.

పల్లవి (పాద యుగ్మము కలది)

శిఖా పదము (ఏక పాదము కలది)

ఈ నిబంధ పదము విషయమున పల్లవి యున్న శిఖాపద ముం డదు. శిఖా పదమున్న పల్లవి యుండదు. ఇట్లని యీ విషయము 'సంగీత చూడామణి' యందు చెప్పఁబడినట్లుగా 'సంగీత చంద్రిక' అను లక్షణ గ్రంథమున నుదాహృతమైనది.

ఇట్టి పల్లవి శిఖా పదములతోఁ గూడిన నిబంధ పదము ప్రయోగ సంప్రదాయమును బట్టి నాలుగు విధములగు నవాంతర పదములగును. అవియే చతుర్ధాతుక, త్రిధాతుక, ద్విధాతుక, ఏక ధాతుక పదములు.

---

1. ఈ లక్షణ గ్రంథములే కాక అన్నమాచార్యుని సంకీర్తన లక్షణ మున మరికొన్ని లక్షణ గ్రంథములు కూడ నుదాహరింపఁబడినవి. వాని వివరణ మిది.

చూ. వాగ్గేయకార చరిత్రము — శ్రీ రజనీ కాంతరావుగారు.

1) భరతుని లక్షణము — క్రీ.పూ. 200-400 క్రీ శ. నడిమి కాలమున వర్తిల్లినట్లు చెప్పఁబడు భరత ముని చెప్పిన 'భరత నాట్య శాస్త్రము'

2) సంగీత రత్నాకరము—క్రీ. శ. 1210-1242 ప్రాంతములందు వ్రాయఁబడినట్లు తలఁపఁబడు శార్ఙ్గదేవుని లక్షణ గ్రంథము.

3) సంగీత చంద్రిక — వారణాసీ వాస్తవ్యులగు మాధవభట్టు అనువారి లక్షణ గ్రంథము.

4) సంగీత చూడామణి — ఉత్కళ దేశపు రాజగు ప్రతాపుని లక్షణ గ్రంథము.

5) సంగీత సుధాకరము— క్రీ.శ 1309 - 1312 ప్రాంతములందు రచింపఁబడిన హరిపాలదేవుని లక్షణ గ్రంథము.

క్రీ.శ. 1424-1503 సం.ల నడుమ నుండిన అన్నమాచార్యుని సంకీర్తన లక్షణమున పేర్కొనఁబడిన పై లక్షణ గ్రంథములను రచించిన లాక్షణికులంద రును ప్రాయికముగా నప్పటికిఁ బూర్వము వారే యనుట నిశ్చయము.

నిబంధ పదము

| చతుర్ధాతుకము. | త్రిధాతుకము. | ద్విధాతుకము. | ఏకధాతుకము |
|---|---|---|---|

వీనిలో చతుర్ధాతుక నిబంధ పదమున ఉద్గ్రాహ మేళాపక ధ్రువములుండి ఆభోగయుక్తమగు పల్లవియుండును. అంతరి వర్జితము త్రిధాతుక నిబంధ పదమున ఉద్గ్రాహ ధ్రువా భోగములును, పల్లవియు నుండి మేళాపమును అంతరియు వర్జితములగును. ద్విధాతుక నిబంధ పదమున ఉద్గ్రాహమును ధ్రువమును పల్లవియు నుండును. మిగిలినవి వర్జితములు. ఇందు ముద్రతోఁ జెలువొందు ఆభోగముకూడనుండదు కావున ఆ ముద్ర ధ్రువమునందే చేర్పఁబడును. ఇక ఏకధాతుక పద మీ యుగమునందే లేదు. కాని నాట్య శాలలో దేశి మర్యాద చొప్పున పాడఁబడు "మొగవరి" యనఁబడునదే ఉద్గ్రాహము మాత్రము పల్లవి తోఁగూడి ఏకధాతుక మనబడును. పై విషయము లెల్ల ధాతుప్రయోగమునకు సంబంధించినవి.

1. చతుర్ధాతుక నిబంధ పదము - ఉద్గ్రాహ, మేళాపక, ధ్రువ, ఆభోగము (ముద్రతో) లుండును. అంతరి యుండదు. పల్లవి కలదు.
2. త్రిధాతుక నిబంధపదము - ఉద్గ్రాహ ఆభోగము (ముద్రతో) లుండును. మేళాపము అంతరియు వర్జితములు. పల్లవి కలదు.
3. ద్విధాతుక నిబంధ పదము - ఉద్గ్రాహ, ధ్రువము లుండును. ధ్రువమునందే ముద్రచేరును. పల్లవి కలదు.
4. ఏక ధాతుక పదము — ఈ పదము అరుదు. నాట్యశాలలోఁ బాడఁబడు 'మొగవరి' రచన ఇట్టిదన వచ్చును. ఇందు ఉద్గ్రాహము మాత్రమే పల్లవినిగూడి యుండును.

వృత్తములు నాలుఁగు పాదములతోడను, జాతులు రెండు పాదములతోడను నుండునట్లే సంకీర్తనములుకూడ చతుష్పాద ద్విపాదాకృతిని వర్తిల్లుచుండును. ఇట్టి కీర్తనములలో దరువులు, జక్కుల రేకులు, గొబ్బిళ్ళు, ఖాసుర వాక్యములు, చందమామ పదములు పేర్కొనఁ దగినవి

పద్యజాతి ముక్తకము కుళకము అను రూపముల నుండునట్లే ముక్తకము వలె వ్యస్తమై దరువును, కుళకము వలె పంచధాతు మిశ్రితమై పదమును నొప్పుచుండును.

వృత్తము - చతుష్పాదాకృతి గలది.
జాతి - ద్విపాదాకృతి గలది.
దరువు - పద్యజాతిలోని ముక్తకమును బోలినది.
పదము - పద్యజాతిలోని కుళకమును బోలినది.

పదములలో దరువు, వాక్యము, అర్ధ చంద్రిక, ఏల, గొబ్బిళ్ళు చందమామ పదము, అనునవి పాదయుగళమునఁ బరగునవి. వీనిలో

1. దరువు - ద్రుత మధ్యమానములు, చిత్రవర్ణము, తాళము కలిగి మునుపు పాడిన పదవాక్యముల బోసంగి ద్విచతుష్పాదాకృతితోఁ జెలగును.

2. వాక్యము - తానాంచితమై, విలంబమానమై, తాళ విరహితమై, పదార్థంబుచెంది కేవల ద్విచతుష్పాదాకృతినిఁ జెలగును. అన్నమాచార్యుఁ డిట్లు చెప్పెను.

3. అర్ధచంద్రిక పదము - ఉద్గ్రాహము, ధ్రువము, అభోగము - సగమె పలికి పల్లవము సంధించి - తాన ప్రతాన కాంచితమగునది.

4. ఏలపాట -నాయకాహ్వాన పూర్వమై, మ్లేచ్ఛ పరిభాషతో రాగమిళితమై - నాయక సంబుద్ధిమధ్యమగుచు పద మనఁ బరగునది.

5. గొబ్బిళ్లు - (ఇందు దీని వివరణము కానరాదు. లోపించి యుండునేమో.)

6. చందమామ పదము - విప్రలంభమున - నాయకుఁడేనియుఁ, గాంతయేనియున్ పాద పాదమున జందురుని బేర్కొని పాడగా ద్విచతుష్పదాకృతిని బరగునది.

ఇట్టే యక్షగాన పదములుకూడ అనేకవిధ తాళ సంగతులతో నవరసాలంక్రియా సవర్ణములగుచు భాసిల్లునని వారికి ర్తనాచార్యుఁడు వివరించెను.

ఇవిగాక పదవిశేషము లెట్టివనిన :-

1. అష్టపది -గీత గోవిందమున జయదేవుఁడు రచించినట్లు ఎనిమిది పదములును, పల్లవియుగల రచన

2. పదమాలిక - సొగసైన పల్లవిని గూర్చుకొని-అర్థచాతురితో బహువిధముల పదమాలిక సీసమాలికవలె శోభిల్లును.

3. శరభపాద పదము - ఎనిమిదేసి పాదములుగల పదము (చరణము) గలది. (ఇది అష్టపదికన్న భిన్నమైనది).

ఇక పదములలో వృత్తనిబంధపదముల తరువాత పేర్కొనవలసినది అనిబంధ పదము. ఇదియే అనిర్యుక్తనామ భాసితమై, తాళబంధచ్ఛందో విరహితమై చూర్ణాఖ్యం బరగును. ఇది కృష్ణాచార్యాదిక పరికల్పిత పదము. ఇట్టి చూర్ణపదమే ఛందోగణముల నియతిలేక తాళ ప్రమాణమున మాత్రమొప్పి 'తాళగంధి' యనియుఁ బేర్కొనఁ బడుచున్నది.

అనిబంధ పదము. (కృష్ణాచార్యాదిక పరికల్పితము)

- చూర్ణము. (తాళ బంధచ్ఛందో విరహితము)
- తాళగంధి. (తాళ ప్రమాణమున గడుతెలువైనది)

పైన వివరించిన రీతిని పద లక్షణ పద ప్రయోగ ప్రక్రియా వైవిధ్యమును జూపిన పిదప సంకీర్తన లక్షణకారుఁడు కొంత పద సంధులను గూర్చియు, దేశి పదములను గూర్చియు, స్మరించి యాపిదప కువద కవితా నిరసన మిట్లు గావించెను.

క. బూరుగు కాయం గోరికిన
నీరస తూలంబు దిశల నిండిన గతి ని
ప్సార పదబంధ కవితా
పారీణుల పదము హాస్యపదమై యుండున్.

మరియు అన్యగీత చౌర్య మెట్టిదనిన—

ఆ॥ వె॥ కూటసాక్షి సాక్షి గోరిన పలుకుట
అన్యవిత్తములకు నాశ పడుట
సకల నితర గీత చౌర్యంబు సేయుట
భరత మౌని యొక్క పాటి యనియె.

పై విషయ వివరణమును బట్టి చిన తిరుమలార్యుఁడు సంకీర్తన లక్షణమును చాలవరకు సుబోధమగు రీతి ననువదించినాఁడనియే చెప్పవలెను. ఇందలి లక్షణమున ఆ కాలపు పదస్వరూపములతోఁబాటు వానికి ధాతురూపమగు సంగీత ప్రయోగవిధానమునుగూర్చి కూడ అన్నమాచార్యుఁడించుక వివరించినాఁడు. నిబంధ పదలక్షణమున తదవాంతర పదభేదములను వివరించుపట్టునగల ఉగాభోగములనబడు పంచ ధాతువుల ప్రశంస సంగీతము(ధాతువు)నకు సంబంధించినదేగాని మాతువునకు సంబంధించినదికాదు. వీరి లక్షణ గ్రంథమున నాటి సంగీతపు ప్రయోగమునందు పై పంచ ధాతువులలో 'అంతరి'స్వరూపముచతుర్ధాతుకాది నిబంధ పదములలో సంపూర్ణముగ వర్జితమై వర్ణింపఁబడినది. ఈ ప్రబంధ ధాతువులతోఁ గూడిన 'ఉగాభోగము'లను పద ప్రకియలను కన్నడ దేశమున నేటికిని సంప్రదాయజ్ఞులు గానము చేయుచున్నారు. తాళ్లపాకవారి ఉగాభోగములలోని సంగీత రచన నేఁటికి మరుగు పడియున్నను దాని నుద్ధరించు నవకాశము లేకపోలేదని తోచును, ప్రయోగ స్వర సహితముగా ధాతువుల కూర్పుతో నీ ప్రబంధ

ధాతువుల స్వరూపములన్నిటిని వేర్పరచి చూపు రచనలు కొన్ని యీ నాఁటి శిలాశాసనములలో కానవచ్చుచున్నవి.[1] వానినిగూర్చిమన్మిత్రులు శ్రీమాన్ ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగా రిట్లు వ్రాసియున్నారు.

"సరిగమాదిస్వరవిన్యాసముతోను, సాహిత్యముతోను తిరుమలలో శ్రీ స్వామివారి చంపక ప్రదక్షిణోపక్రమమున సుమారు 4 అడుగుల వెడల్పు 7 అడుగుల ఎత్తుగల శిలా ఫలకములపై శాసన రూపముగా చెక్కించియుండిరి. అవి యెన్ని చెక్కి నాటి యుండిరో తెలియరాదు. కాని 1949లో నేను వెళ్ళి చూచునప్పటికి 4వ వరుస సంఖ్యగల శిలా ఫలకమును, సంఖ్యలేనిది యొకటియు, వెరశి రెండు ఫలకములుండినవి...అందలి సాహిత్యము తాళ్లపాక వారిదిగనే కలదు. అన్నమాచార్యులచే దేవభాషలో రచింపఁబడి, ఆయన పుత్రుఁడైన పెద తిరుమలాచార్యులచే వ్యాఖ్యానింపఁబడి, ఆయన మనుమఁడైన చిన తిరుమలాచార్యులచే పద్యకావ్యముగా రచింపఁబడిన 'సంకీర్తన లక్షణము' అను గ్రంథమునకు లక్ష్యము లందు చెక్కినట్లున్నారు. ఇందులో అక్కడక్కడ ఉద్గ్రాహము, మేళాపకము ధృవము, అంతరము, ఆభోగము, ఉగము, ఆవృత్త నియమము, ఝంప, ఆట, రూపక, త్రిపుట-అని కలవు. శ్రీ వేంకటేశ్వరముద్రతో సంస్కృత భాషలో కీర్తన కలదు. లిపి తీరు వగైరాలన్నియు చిన తిరుమలాచార్యుని నాఁటివే" (చూ. శృం. సంకీర్తనములు సం. 15 తి. తి. దే. ముద్రణములు 1961—పు. 8).

పై యభిప్రాయములు సమంజసములైన వనియే నేను విశ్వ సించుచున్నాను. తాళ్లపాకవారి సంకీర్తనములలో రాగిరేకులపై చెక్కఁబడినవానిలో పెక్కు సంస్కృత కీర్తనములకే రాగనిర్దేశముతో బాటు తాళముగూడ సూచింపఁబడియున్నది.[2] అన్నమాచార్యుఁడు

1. చూ. తి. తి. అధ్యాత్మ సంకీర్తనములు సం 16-పు. 41-44. తి తి, దే. వారి ముద్రణము 1962

2. చూ తాళ్లపాకవారి సంకీర్తనములు సం 3-612 - కాంబోది - రచ్చ. 3 - 39- శుద్ధవసంత, రచ్చ . 3-33- ముఖారి, జంపె. 5-170, శంకరాభరణం - ఆట.

తన సంకీర్తన లక్షణమునకుఁ దగిన లక్ష్యములనుగూడ (సంస్కృతమున) రచించియే యుండెను. సంకీర్తన లక్షణమున నిబంధపదముగ కవాంతర పదములగు నవయవ పదములందలి పల్లవ ప్రయోగ ప్రక్రియ వివరింపఁ బడియే యున్నది. తదనుగుణముగనే తరువాత పెద తిరుమల చిన తిరుమలాచార్యాదులు ఆ లక్షణ లక్ష్యసమన్వయమునకై ఒక కొన్ని సంస్కృత కీర్తనములనే పై శిలా ఫలకములందు చెక్కించి యుందురు. అందలి కీర్తనములు సంస్కృతభాషలో నుండుటయు, నా శిలా ఫలకములు ఆలయ ప్రాకార కుడ్యములలోఁ, బొదుగఁదగిన పరిమాణములుగలవై యుండుటయు గుర్తింపఁదగిన యంశములు. లక్షణమువలెనే లక్ష్యమును సంస్కృతమున నుండుటచేత నాలయమున స్వామి సందర్శనమునకు వచ్చు భక్తులును, విద్వాంసులును ఆ ప్రాకార శిలలపై గల స్వరసాహిత్యములను గుర్తించి నేర్చి యానందింతురుగాక అనుభావమే తాళ్లపాక వారి నట్టిచేతకు బురికొల్పియుండునని భావింతును. ప్రాయశః స్వరసహితమగు సాహిత్యమును నిబంధించుటలోఁ దెలుఁగు దేశమున జరిగిన తొలియత్నమదియే యనవచ్చును. కాని యా దినములలో నట్టి యత్నము విస్తృతమగు పరిధిలో జరిగినట్లు మాత్రము కానరాదు. అవకాశముకూడ లేకపోయెనేమో! ఒక వేళ జరిగినను తరువాతి రాజకీయ కారణముల మూలమున మనకాయత్నము కనుమరుగై పోయినదో! లేకున్న వేలకొలదిగా నున్నవారి సంకీర్తనములలో నాఁడు వారి కభిమతమగు సంగీత స్వరూపమెట్టిదై యుండెనో యీనాడు మనకు ప్రత్యక్షముగా తెలియరాకుండునా? ఇప్పటికైనను ఈ విషయమున ఆశిలా ఫలకములందలి స్వరసాహిత్యములు సంపూర్ణముగా ప్రకటింపఁబడినచో కొంత పరిజ్ఞానము మనకు కలుగ గలదు. శ్రద్ధతో మా మిత్రులు శ్రీమాన్ శ్రీనివాసాచార్యులువా రీవిషయమున పరిశ్రమించిరి కాని వారి కృషి యింకను వెలుగు మొగము చూడవలసి యున్నది. స్థూలముగ శిలా ఫలకములను జూచి యందలి పంక్తులను గొన్నిటి నుద్ధరించుటకు యత్నించితినిగాని అందు నేను గుర్తించిన సాహిత్యపు చరణభాగము లిప్పటి వరకును ముద్రితములైన తాళ్లపాకవారి కీర్తనములందు గుర్తింప వీలుకాలేదు. భవిష్యత్తున దాని విషయము వెల్లడి కావలసియున్నది.

1949-50లో ఆ శిలాఫలకమును జూచినపుడు అం దెడనెడ గుర్తించిన పంక్తులివి యుదాహరించుచున్నాను.

(1) ఆభోగం. జనక సుతా జని.........ర
    వినయ గుణాన్విత భార్గవ—

(2) ఉగ. విదిత హుత—

(3) ............ మపమరిస, మమమ సరి సరిగగమరిపమ
    గుణపరుణాదిక తనుపాతిత తాటక ప్రయోగం
    పపమ పపపమ మగరి సరిగమ
    ఇయ ఇయ ఇయ ఇయ

(4) ............................భూషణ'
    వరయ...చల పతిత పోషణ
    చరణ నూపురచయ ఝణం ఝణ
    గురుర...త్సవ

(5) ఆభోగం. విహత దానవ.........

(6) అలంకారం..........గతి విరహిత కంస విదూషణ
    మానస మఘ పోషణ......విదాయక...

(7) ఆభోగం. జంతుహృదంతర జనితోపాశ్రయ
    కాంతా....................ధారయ
    ........................
    చింతయ మామిహ వేంకట గిరిశం."

పై పంక్తులలో కొన్నిట యతి ప్రాసలును, అంత్యాను ప్రాసలును, చతురస్ర, మిశ్రగతులును గుర్తింప నగుచున్నవి. ఇంతేకాక యిట్టివే మరికొన్ని పంక్తులను బట్టి యందలి రచన ప్రధానముగా రామాయణ కథా సంబంధి రచనగాఁ దోచినది. ఈ విషయము నింతటితో విడిచి, పై లక్షణ గ్రంధమునందలి పద లక్షణములకు గుర్తింపఁ దగిన లక్ష్యముల గొన్నిటి నుద్ధరించి లక్ష్యలక్షణ సమన్వయమున కించుక యత్నింతును.

తాళ్లపాకవారి పద రచనలలో నిబంధ పదములే ప్రధానములు. అనిబంధ పదములకు పెద తిరుమలార్యుని వేంకటేశ్వర వచనముల నుదాహరింపవచ్చును. వృత్తపదములలోని త్రివిధ భేదములవలె వీరి నిబంధ పదములలోను మనము సమ, విషమ, అర్ధసమ పదములను గమనింప వచ్చును.

సమ పదమునకు :— గోవిందాశ్రిత గోకుల బృందా
పావన జయ జయ పరమానందా ॥
జగదభిరామా సహస్రనామా,
సుగుణాధామా సంస్తుత నామా
గగన శ్యామా ఘనరిపు భీమా
అగణిత రఘువంశాంబుధి సోమా. (2-268)

అర్ధ సమపదమునకు :- వేద వేద్యులు వెదకేటి మందు
అది నంత్యము లేని ఆ మందు ॥
అడవి మందులు గషాయములు నెల్లవారు
కడగానక కొనంగా
తొడిబడ నొక మందు దొరకె మాకు భువి
నడియాలమై నట్టి ఆ మందు." (2-2)

విషమ పదమునకు -

సకల దేవతలు నీ శరీరమని సర్వేశ్వరా నిను దలచుట మేలు
వికటమేల నిను యేకాగ్రబుద్ధి నీ వేడుకలతో సేవించె నింకను ॥
శివదుర్గ రవి గణాధిప క్షేత్రపాలక సహితముగా
భువిలో మిమ్మును పంచ పూజగాఁ బూజింతురు కొందరు
తివిరి యిందరును బంతినే పొత్తుల దేవర వై పోరియావుసేతురని
వివరముగా నిన్నే కొలిచితి నీవే వహించుకొని రక్షించవే. (2-358)

వీరి పదముల నిర్మాణము సాధారణముగా రెండు పాదముల పల్లవితో నాల్గేసి పాదములు గల చరణములు మూడింటితో నొప్పు చుండును. నిబంధ పదములకుండు యతి, ప్రాస, మాత్రా గణములు, మార్గదేశితాళములు, ముద్ర అను నయిదంగములును మనము వీరి పదములందుగుర్తింపనగును. యతి ప్రాసలు తెలుఁగున వలెనే ఈ కవులు

సంస్కృత పదములందును పాటించినారు. ముద్ర 'శ్రీ వేంకటేశ్వర' నామముతో సాధారణముగా తృతీయ చరణమున కానవచ్చుచుండును. కొన్ని యెడల ముద్రాలంకారమును గూడ వీరు పాటించినారు. పైన పేర్కొన్న (2-268) కీర్తనము 'లలిత' రాగమున గలది - అందు ద్వితీయ చరణమున వీరు 'దనుజహరణ లలిత స్వరణా' అని రాగము పేరు వందాలంకారికముగా ముద్రించినారు. వీరి పదములలో ముద్ర యనగా ప్రధానముగా స్వామి నామాంకితమే. ఇక మాత్రాగణములకును, మార్గదేశి తాళములకును వీరి పదములన్నియు నుదాహరణములే యనవచ్చును.

పల్లవి శిఖా పదములను గూర్చి సంగీత చూడామణి సంగీత చంద్రికల నుదాహరించి వీరు పల్లవంబున్నచో శిఖా పదము కల్గదనియు శిఖాపదంబున్నచో పల్లవముండ దనియు వారి మాటగా నను వదించిరి. కాని తాళ్లపాకవారి రచనలలో పల్లవి ప్రధానమైన పదములు, శిఖాపదప్రయుక్తములైన పదములునుండుటతోబాటు పల్లవి శిఖాపదములు రెండును ప్రయుక్తములైనపదములుకూడ కొన్ని లేకపోలేదు.

పల్లవి — "ప్రలపనవచనై। ఫలమిహ కిం
చలచల కుద్యాకాశనయా కిం" (8-89)

ఇది పద సమాన మాన పాద యుగ్మము కలది.

శిఖా పదమునకు - 'ఉపకారి దేవుడు అపకారి గాడు' (5-150)

ఇది ఏకపాద మాత్రయైన శిఖాపదము. ప్రాసయతివాడినారు.

'డోలాయాం చల డోలాయాం హరె డోలాయాం' (5-140)

ఇదియు శిఖాపదమే. సంస్కృత కీర్తన.

శిఖా :- పరమ పురుష నిరుపమాన శరణు శరణు రే -
యిందిరా నిజమందిరా

చరణము :- కమల నాథ కమల నయన కమల చరణురే
నమిత సురముని నాథ యూథప నాయకా పరదాయకా' (5-188)

ఈ పదము కర్ణాటకసంప్రదాయమున నున్నట్లున్నది. ఇందలి శిఖా పదము (పల్లవిలో సగమై) చరణమున నాలుగవభాగముగా నుండుటను గుర్తింప వచ్చును. యతియో ప్రాసయతియో ప్రతి పాదమున మూఁడు తావుల పడుచుండుట గుర్తింపుఁడు.

ఈ విధమున వీరి పల్లవి శిఖాపద రచనలున్నను, నూతనముగా పల్లవి శిఖాపదములు రెండును గల రచనలుకూడ కొన్ని తాళ్లపాక వారి పదములలో లేకపోలేదు. సంకీర్తనలక్షణకారు డీ విషయమున తత్పూర్వ లక్షణకారుల నుదాహరించేనే గాని, అవి యట్లు కూడి యుండరాదను తన యభిప్రాయమును స్పష్టముగావించియుండలేదు. అందుకేనేమో, వీరి పదము లట్టివి కూడ నున్నవి.

పల్లవి శిఖాపదములు కూడియుండుటకు :—

శిఖా :- చెలి నేడు తానేమి సేయునమ్మా
పల్లవి :- చెలియేమి సేయు నీ చెలులేమి సేయుదురు
చెలువైన విభుమేని చెలువింత సేయంగ." (2-844)
(ఆ పిదప మూఁడు చరణములు)

మరియొక యుదాహరణము.

శిఖా :- ఇతరులకు నిను నెరుఁగఁ దరమా
పల్లవి :- సతత సత్యవ్రతులు సంపూర్ణ మోహ విర
హితు లెరుంగుదురు నిను నిందిరారమణా."
(5-166)
(ఆ పిదప మూఁడు చరణములు)

పైన పేర్కొన్న ఉదాహరణములందు తొలి పాదమును శిఖా పదముగను, మలిపాదములు రెంటిని పల్లవముగను బేర్కొనక తప్పదు ప్రాయశః పదరచనాసంప్రదాయమున నీ శిఖాపద పల్లవములే పల్లవి-అనుపల్లవి రూపముల నంది యుండునని తలఁపవచ్చును. ఇట్లు పల్లవి-అనుపల్లవి కూడి యుండిన తరువాతి కాలపు పద రచనలకుఁ దాళ్లపాక వారి పై పదముల వంటి పదములే ప్రాతిపదిక కల్పించిననేమో.

ఇక ప్రబంధ ధాతువులను గూర్చియు, నేలాదులను గానము చేయువిధానమునుగూర్చియు శార్ఙ్గదేవాదులు కొంత వివరించి యున్నారు. అట్లే తాళ్లపాకవారును పంచధాతువులతోఁ గూడిన ప్రబంధభేదాలను వివరించిరి. ఇందు వీరు 'అంతరి'ని అయిదవ అవయవముగాఁ బేర్కొనియు, ఏక ద్వి త్రి చతుర్ధాతుక ప్రబంధాలలో దాని ప్రయోగము వర్జితమని చెప్పినారు. ఈ 'అంతరి' సాళగ సూడ ప్రబంధములందు మాత్రమే ప్రయుక్తమగునని తజ్ఞులందురు. ఏమైనను ఈ చతుర్ధాతుప్రయుక్తములగు ప్రబంధములను గానము చేయు పద్ధతినిగూర్చి లక్షణగ్రంధములందున్న తెలుగు మన కంత విస్పష్టముగ నున్నట్లు తోపదు. శార్ఙ్గదేవుఁడు ఏలాదులను గానము చేయువిధానమును గొంత వివరించెను. కాని యా పద్ధతి తెలుఁగున ప్రసిద్ధములగు 'భాను వంశమున బుట్టి - దానవ కామిని గొట్టి' వంటి యేలల కెట్లన్వయించునో తెలియరాకున్నది. సంగీతశాస్త్రజ్ఞు లీ విషయము లను పూర్ణముగా శోధించి యెరుక పరుపవలసి యున్నది. ఉద్గ్రాహము ప్రబంధపు ప్రారంభ భాగమనియు, ధ్రువము అంత్య భాగమనియు, మేళాపము వానిని రెంటిని సంధించునదనియు, ఆభోగము వాగ్గేయకారుని నామాంకము గలదై ధ్రువమునకుముందు గానము చేయఁబడునదనియు లక్షణకర్తలు వ్రాసినదానినిబట్టి తెలియుచున్నది. జయదేవుని గీతగోవిందమున అష్టపదులలో ధ్రువ మనుభాగ మున్నది. ఈ ధ్రువమునకును, తరువాత పల్లవి, అనుపల్లవులకును గల సంబంధమును గూర్చి డా. శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు సెప్టెంబరు 1961 భారతిలో చర్చించిన విషయమును పరిశీలింపఁదగును. ప్రబంధ పరిణామమున ధ్రువమే శిఖాపదము పల్లవి - అనుపల్లవి అను విధముల రూపాంతరమందినదేమో అనిపించును.

పల్లవి :- ఇతరులకు నిను నెఱఁగఁ దరమా
సతత సత్య వ్రతులు సంపూర్ణమోహవిర
హితు లెరుఁగుదురు నిను నిందిరా రమణా

చరణము 1 :- నారీ కటాక్ష పటు నారాచ భయ రహిత
శూరు లెరుఁగుదురు నినుఁ జూచేటి చూపు

ఘోర సంసార సంకుల పరిచ్ఛేదులగు
ధీరు లెరుఁగుదురు నీ దివ్య విగ్రహము.

... ...

చరణము 3 :- పరమ భాగవత పద పద్మ సేవానిజా
భరణు లెరుఁగుదురు నీ పలికేటి పలుకు
పరగు నిత్యానంద పరిపూర్ణ మానస
స్థిరులెరుఁగుదురు నిను దిరు వేంకటేశ. (5-155)

ఇందు తొలి చరణము ఉద్గ్రాహము. ఈ ఉద్గ్రాహానంత రము పై పల్లవి అనఁబడు ధ్రువము గానము చేయఁబడును. ఇది 'ఇందిరా రమణా' అని స్తుతినామాంకితమై, లక్షణకారులు వివరించినట్లు, మధ్య విలంబిత పదత్రయము గలదిగానే యున్నది. ఇట్లు చరణము - ధ్రువము కలిపి కలిపి గానము చేసిన పిదప తుది చరణము గానము చేయఁబడును. ఇదియే ఆభోగము. ఇందు వాగ్గేయకారుని నామాంకము లేదుగాని 'వేంకటేశ' అను ముద్ర యున్నది ఈ ముద్ర సాధారణముగా ఆభోగమునందే యుండును. ఒక్క ద్విధాతుక పదము నందు మాత్రమే ఆభోగముండదు కావున ధ్రువమునందే ముద్ర చేరును.

పై పదమునందలి ధ్రువమే 'పల్లవి' గా పేర్కొనఁబడినది. తాళ్లపాకవారు పేర్కొన్న యీ పల్లవియే తరువాత కాలమున తొలి చరణము పల్లవిగాను, మలి రెండు చరణములు అనుపల్లవిగాను పేరును సంతరించుకొని పల్లవి - అనుపల్లవి అను విధమున నేర్పడి నట్లున్నది పదమును పాడుటలో ముందు చరణము (ఉద్గ్రాహ భాగము)ను పాడి పిదప పల్లవి(ధ్రువము) నందుకొను సంప్రదాయము తాళ్లపాకవారి కాలమున గలదని చెప్పవచ్చును. అచ్చులో పల్లవి-చరణము అను తెఱగుననే యున్నను, పాడుట మాత్రము చరణము-పల్లవి అనుక్రమముననే యుండెనని తోచును. తంజావూరు లోని తాళపత్ర ప్రతిలోని తాళ్లపాకవారి పదములీ తెరగుననే వ్రాయఁబడి యున్నవి. ఈ సంప్రదాయ మిట్లే యనుటకీ పదమును తిలకింపఁదగును.

పల్లవి :- అనుచు రావణు సేన లటు భ్రమయుచు వీగె
యినకులచంద్ర నేడిదిగో నీ మహిమ.

చరణము :- దదదద దదదద దశరథ తనయా
కదిశితిం శకకక కావవె
అదె వచ్చె బాణాలు హానాథ హానాథ
పదపద పదపద పారరో వవులు. (2-164)

'అనుచు రావణసేన' లని పదము నందుకొనుట అర్థరహితము. ముందు చరణమును బాడిన పిదపనే పల్లవి యందుకొన వలెననియు అదియే నాటి సంప్రదాయమనియు దీనివలన తెలియనగును.

చతుర్ధాతుక, త్రిధాతుక పదములకు తాళ్లపాకవారి కీర్తన లన్నిటిని ఉదాహహరణములుగా పేర్కొనవచ్చును. (చూ. 5-155, 11-9-69). ద్విధాతుకములు వారి రచనలో వరుదుగ నున్నట్లున్నవి. చూడుడు.

చరణము :- మానుషము గాదు మరి దైవికము గాని
రానున్నది రాక మానఁబోదు
అనుభవమునకుఁ బ్రాప్తమైనది తనకుఁ
దానె వచ్చి తగిలి కాని పోదు.

పల్లవి :- తిరువెంకటగిరిదేవుని
కరుణ చేతఁగాని కలుష మింతయుఁ బోదు. (2-6)

ఇందు పల్లవియే ధ్రువము. 'తిరువేంకటగిరిదేవుఁ' డను ముద్రతోఁ గూడిన పల్లవమున్నది. ఇందున్న ఒక్కచరణము ఉద్గ్రాహ భాగము కాఁదగును. అచ్చులో నీ కీర్తనము చరణమును ముందుపాడు సంప్రదాయము చొప్పుననే మొదలిడినట్లున్నది. కాని వ్యత్యస్తముగా ముద్రితమైనదని తలతును.

ఇక నేకధాతు పదము లరుదనియు, నాట్యశాలలందు బాడ బడు 'మొగవరి'ఇట్టి రచన కాఁదగుననియు తాళ్ళపాకవారే పేర్కొనిరి.

"మొగవరి కట్టడ మొనపు కోలాటంబు
చొక్కంపు మురువులం చిక్కణీలు,
బిరవు శారదు చేసి బహుళ రూపుల దగ
బంధుర గీత ప్రబంధ వితతి"

అను పద్యము నుదాహరించి శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు 'పై పద్యములో చాలా పదాలు తెలియవు. కొన్ని అచ్చు తప్పు లేమో, మొగవరి = మొగ్గ వాలుట యని యర్థమేమో!' అని వ్రాసి యున్నారు. (చూ. ఆంధ్రుల సాంఘిక చరిత్ర పు. 843) మొగవరి యన మొగ్గవాలుట కాదనియు నది యొక పదభేదమనియు తెలియఁ దగును.

చతుష్పాద, ద్విపాదాకృతులతో నొప్పెడి వృత్త జాతి భేద ములను తాళ్ళపాకవారు పేర్కొనిరి. వీరి రచనల వృత్తములు బహు ళములు. జాతులు కూడ లేక పోలేదు.

వృత్తమున కుదాహరణముగా దీనిని జూప వచ్చును. చూ :-

పల్లవి :- నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుగొందు
సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం
స్తుత్యుఁడే తిరు వేంకటాద్రి విభుఁడు.

(మరి 3 చరణములు సుదీర్ఘములగు పాదములుగలవి యున్నవి.)
(2-76)

జాతి కుదాహరణముగా నీ క్రింది పదమును పేర్కొనవచ్చును.

పల్లవి - యేరా యిప్పుడు నా యెదుట గడవరాయ
నారి నేను నిన్నెరుంగుదు నను నీ వెరుంగుదువు ॥

చరణము :- పలుకులంబదరకురా కడుఁ బగటి చెలియనేను
చెలఁగి యే పనులు మనసునఁ గలిగిన చేసి చూపుదువుగాని.

(ఇట్టివే రెండేసిపాదములుగల చరణములు మరి రెండున్నవి.)
(2-285)

ఇట్లే 'పరగున్ వృత్తము జాతియంతయుఁ జతుష్పాద ద్విపాదాకృతిన్' అని చెప్పి తదాకృతులనే పత్రిల్లు పద ప్రక్రియలను తాళ్లపాకవారు పెక్కింటిని వేర్కొనినారు. వానికి దిగువ నుదాహరణము లెత్తిచూపుచున్నాను.

దరువునకు :- కూరి మెరిగి కైకోవు - నీ
వీరములే నెరిపేవు
రంతులె సేసిటు రావు,
యెంతైనం జన వీవు,
చెంతలే కడుఁ దలచేవు,
యింతలో నెరవయ్యేవు" (8.876)

ఇది చతుష్పాదాకృతిని బరగి ద్రుతమానమును, చిత్ర వర్ణ తాళములును గల దరువును బోలిన రచన యనవచ్చును. తరువాత కాలపు యక్షగానములం దిట్టి దరువు లనేకములు కాన నగును.

భాసుర వాక్యమునకు :-

ఏ దైవము (శ్రీ) పాద నఖమునం బుట్టిన గంగ
త్రిలోక పావనము చేయను త్రిపథగామిని యాయెను
ఏ దైవము నాభి నలినంబున జనియించిన అజుండు
అఖిలాండఁబులు సృజియింప నధిపతి యాయెను
ఏ దైవము పురస్థలంబు తనకును మందిరమైన
యిందిర మాతయయ్యె యీ జగంబులకెల్లను
ఏ దైవము అవలోకన మింద్రాది దివిజ గణంబుల
కెల్లప్పుడును సుఖంబు లాపాదించును......(11-8-84)

ఈ పదముపై 'గీతం - నాట' అని గలదు. ఈ గీతమే భాసుర వాక్యమగునా యని నేననుకొనుచున్నాను. ఏలన నిందలి రచన వాక్యమునందువలనే తానాంచితమై విలంబభూతమై, తాళవిరహితమై యున్నట్లున్నది.

అర్ధ చంద్రిక పదమునకు :-

అతి శోభతేయం రాధా
సతత విలాస వశా రాధా

దర్పక బల బోధా రాధా
తర్పణ గంధవిధా రాధా
దర్పయుత క్రోధా రాధా
దర్పక రస వేధా రాధా (4-48)

సుగ్రీవ విజయము నందున్న 'చదువులు తెచ్చిన జలచరపతికిన్-కుధరము మోచిన కూర్మంబునకున్ - మేదిని దాల్చిన యాదిమ కిటికిన్' - 'కన్నుల నశ్రులు కమ్మగ వగచున్ ఔరా విధివశమని తల యూచున్, ఏటికి ప్రాణము లికనని తలచున్' మున్నగు నర్ధచంద్రిక పదములను బోలినదే పై రచనయును. చతుష్పాదాకృతి గలది. పాదాంతమున నన్ప్రాసలు గలది. తాన ప్రతాన కాంచితమైనదే.

ఏలపాటకు :-

మేడ లెక్కి నిన్నుఁ జూచి
కూడేననే యాసతోడ
వాడుదేరి వున్న రందురా - వేంకటేశ
యాడనుంటి వింఠాకనురా. (1)

తోడుగూడి నీవు నేను
నాడుకొన్న మాట లెల్లా,
గోడలేని చిత్తరువులై - వేంకటేశ
యాడా నామతిఁ బాయవురా. (12)

నెత్తమాడే నంటూ రతి
పొత్తుల పందేలు వేసి,
వొత్తి నీవే వోడే వేలరా - వేంకటేశ
కొత్తలైన బాణ వౌదువు (20)

వున్నతి శ్రీ వేంకటేశ
మన్నించి కూడితి విదే
నన్ను నెంత మెచ్చు మెచ్చేవు - వేంకటేశ
కన్నుల పండువ లాయరా. (21) (18 - 228)

తాళ్లపాకవారి పదములను 'యేల పదాలు - దేసాళం' అని పేర్కొనినారు. తాళ్ళపాకవారి యేలలలో రమ్యములైనవి ఇవి 25 మాత్రమే లభించినవి. శార్ఙ్గదేవుఁడు ఏలాలక్షణమును వివరించుచు నందు 16 పదములుండునని తెలిపెను. కాని ఇందు 25 పదములున్నవి. మిగిలిన లక్షణములన్నియు సరిపోవుచున్నవి.

<u>గొబ్బిళ్లు :—</u>

కాలని దోపరికి గొబ్బిళ్లో - యదు
కులస్వామికిని గొబ్బిళ్లో ॥
కొండ గొడుగుగా గోవుల గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపు దైత్యుల కెల్లను - తల
గొండు గండనికి గొబ్బిళ్లో॥ (8 - 484)

ఇది చతుష్పాదాకృతి గలది.

<u>చందమామ పదములు :—</u>

చల్లనై కాయగదో చందమామా నీ
వెల్లగా తిరువేంకటేశు నెదుర ॥
మొల్లమిగ నమృతంబు వెల్లి గొలుపుచు - లోక
మెల్ల విను గొనియాడఁగాను. (8 - 293)

ఈ పదములే కాక పదవిశేషములుగా తాళ్లపాకవారు పేర్కొన్న వానికిఁ గూడ వారి రచనలనుండి యుదాహరణము లీయవచ్చును.

<u>అష్టపదికి :—</u>

అహో సురత విహారోయం
సహజ పరాజయ శంకా నాస్తి ॥.
యమునాకూలే సుమలతా గృహే
విమల సైకత విజనస్థలే
రమణీ రమణా రమత స్తయోః
ప్రమదస్య పరాత్పరం నాస్తి. (1)

పరిమళ భరిత ప్రచురసుశీతల
వరమృదు వాయా వాతి నతి
తిరువేంకట గిరి దేవ రాధయా
సరస రతి సుఖ ప్రాంతి వాస్తి. (8)

ఇది వస్తువు నందును రచనా రీతి యందును నచ్చముగ జయదేవుని యష్టపదులను బోలిన రచనయే. ఎనిమిది చరణములిందున్నవి.

పదమాలికకు :—

పల్లవి. లేరా దేవతలు లేరా లావరులు
ఆ రీతి నాడెంద వోయి రధికులే కలితే

అటు పిమ్మట నీ పదమునందు చతుష్పాద పదములు పదునైదున్నవి.

తాళ్ళపాకవారి నిర్వచనము ననుసరించి వీనిని పద మాలిక యని పేర్కొనవచ్చును. ఇట్టిదే ?-?80, 440 కీర్తనములను గూడ చూడఁదగును.

శరభ పాద పదమునకు :

2-76-(శ్రీ)రాగమునగల పదమును శరభ పాద పదముగా పేర్కొన వచ్చును. ఇందు స్థూలముగా చరణములు చతుష్పాదా కృతిగా సాగునట్లే తోచును. కాని యతులు పాదపాదమున నాలుగు తావులఁ బడుటచే వానినే విరిచి యెనిమిదేసి పాదములు గల పదములుగా నుదాహరింపవచ్చును. పల్లవి పదసమానమానపాద యుగ్మము కలది. కావున నిందలి పల్లవి నాలుగు పాదములతో నున్నది. దానిని బట్టియే దీనిని శరభ పాద పదమనుట. స్థలాభావమున నుదాహరణ నుద్ధరింపక విడచుచున్నాను

నిబంధ పదముల తరువాత తాళ్ళపాకవారు పేర్కొన్న అనిబంధ పదములలో చూర్ణమునకును, తాళగంధికిని గూడ నుదాహరణము లెత్తి చూపవచ్చును. కృష్ణమాచార్యుని వచన సంకీర్తనములను తాళబంధచ్ఛందోవిరహితములగు చూర్ణములుగానే వారు

పేర్కొనిరి. పెద తిరుమలాచార్యుని వేంకటేశ్వర వచనములు రాగ తాళ నిర్దేశములతో నున్నవి గావున వానిని తాళ గంధి వచనములన వచ్చును. ఉదాహరణములకు ఆయిరువురు కవుల వచన సంకీర్తనము లను బరికింపఁదగును.

ఇట్లు తాళ్ళపాకవారు సంకీర్తన లక్షణమును రచించుటయే కాదు, వానికిఁ దగిన లక్ష్యములను గూడ రచించి "సంకీర్తనా పరిశుద్ధి" కెంతయో పాటు పడిరని నిస్సందేహముగా చెప్పవచ్చును.

## వ్యాఖ్యలు - వివరణలు

గీర్వాణవాఙ్మయమునందలి సౌరభమును వెల్లివిరియఁజేయు టకై భారత దేశమం దతిప్రాచీనకాలము నుండియు నెన్నో ప్రయత్న ములు అక్షర రూపమున జరిగినవి. అట్టి వానిలో భాష్యముల రూపము నను, వ్యాఖ్యల రూపమునను, వివరణముల రూపమునను వెలయింపఁ బడిన విశేష రచనలే ప్రముఖములు. వేదములు, ఉపనిషత్తులు బ్రాహ్మ ణములు, సూత్రములు, మున్నగు రూపములలో పరిణామ వశమున విస్తృతినందిన వైదికసారస్వతమునకే గాక సాహిత్యాలంకారనాట్య సంగీతాది శాస్త్ర విషయములతోఁ గూడిన లౌకిక వాఙ్మయమునకు నైతము మనదేశమున వ్యాప్తిని గలిగించి జాతికి వానియందలి చవిని చూపించిన విఖ్యాతి అట్టి విశిష్ట రచనలకే దక్కినది. వేదమునకును, ప్రస్థానత్రయాదులకును విభిన్న దృక్పథములతో విద్యారణ్యాదు లును; శ్రీ శంకర రామానుజ మధ్వాచార్యాదులును వెలయించిన భాష్యములు; సోమనాథుని రుద్రభాష్యము; బ్రాహ్మణారణ్యకముల కును, ఉపనిషత్తులకును విద్యారణ్యాదులు వెలయించిన దీపికలు; గృహ్యశ్రౌతసూత్రాదులకు కపర్దిస్వామి ప్రభృతులు వెలయించిన వ్యాఖ్యలు ఆకోవకుఁ జెందినవే. అట్లే లౌకిక వాఙ్మయము విషయ మున సాహిత్యమునకు సంబంధించి పంచకావ్యములను సంప్రదాయ పరంపరగల సంస్కృత కావ్యములకు దక్షిణావర్తనాథాదులు మొదలు కొని సుప్రసిద్ధుఁడగు మల్లినాథసూరివఱకును విద్వాంసులు వెలయిం చిన వ్యాఖ్యలు; మల్లినాథునిదేయైన నైషధీయ వ్యాఖ్య, భట్టికావ్య

వ్యాఖ్య, పెదకోమటి వేమారెడ్డి శాలివాహన సప్తశతికి వెలయించిన శృంగారదీపికావ్యాఖ్య, చెరుకూరి లక్ష్మీధరపండితుని ప్రసన్న రాఘవ వ్యాఖ్య—అనునవియు; అలంకార శాస్త్రమునకు సంబంధించి విద్యానాధుని ప్రతాపరుద్రయశోభూషణమునకు కుమారస్వామి సోమపీథి గావించిన వ్యాఖ్య, ధ్వన్యాలోకమునకు అభినవ గుప్తపాదాచార్యుఁడు వెలయించిన లోచన వ్యాఖ్య, గోపేంద్ర తిప్పభూపాలుని వామన కావ్యాలంకార సూత్ర వృత్తి వ్యాఖ్య అనునవియు; నాట్య శాస్త్రమునకు సంబంధించి కుమారగిరిరెడ్డి కూర్చిన వసంత రాజీయ మను నాట్యశాస్త్రమునకు—అతని బావమఱది కాటయ వేమారెడ్డి విపులీకరించిన వసంతరాజీయ వ్యాఖ్య—అనునవియు. సంగీతశాస్త్రమునకు సంబంధించిన శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరమునకు సర్వజ్ఞ సింగభూపాలుఁడు వెలయించిన 'సుధానిధి' వ్యాఖ్య, కల్లినాధుఁడు వెలయించిన 'కళానిధి' వ్యాఖ్య, జయదేవుని గీతగోవిందమునకు చెరుకూరి లక్ష్మీధర పండితుఁడు వెలయించిన 'శ్రుతిరంజనీ' వ్యాఖ్య అనునవియుఁ గూడ నిట్టివే. పైనుదాహరింపఁబడిన భాష్య వ్యాఖ్యా గ్రంథము లెల్ల గీర్వాణ వాఙ్మయమునకు గీర్వాణ భాషలోనే వెలయింపఁబడిన వివరణములు. ఇట్లు గీర్వాణ భాషయందే వ్యాఖ్యలను సైతలు వెలయించిన వ్యాఖ్యాతలలోఁ బలువురు ఆంధ్రులు— మరికొంద ఱాంధ్ర దేశమున వర్తిల్లినవారును. ఇట్లు ఆంధ్రమున వ్యాఖ్యా రచన మూలమున గూడ గీర్వాణ భాషా వికాసమునకు ఆంధ్రులెంతయో పాటుపడిరి. వారిలో మల్లినాధాదులు తమ ఆదర్శప్రాయములగు వ్యాఖ్యలతో జగద్విఖ్యాతి నార్జించుకొనినారు కూడ.

పరిశీలించి చూడఁగా పదునైదవ శతాబ్ద్యంతము వఱకునుఁ బ్రాయికముగా నీ వ్యాఖ్యాతలలో కొందరు ఆంధ్రులైయుండియుఁ దమ వ్యాఖ్యానములను గీర్వాణ భాషయందే కాని జనసామాన్యమున కందుబాటులో నుండు రీతిని తెలుఁగున నధికముగా వెలయింపలేదని తెలియును.[1]

1. సుబ్బరామ దీక్షితులవారు తమ 'సంప్రదాయ ప్రదర్శని'లో శార్ఙ్గదేవుని సంగీత రత్నాకర వ్యాఖ్యలను గూర్చి ప్రస్తావించుచు హంసభూపాలుని

అట్టి స్థితిలో సంస్కృత మూలమునకు లఘువివరణము రూపమునను, వ్యాఖ్యారూపమునను తెలుఁగులో వ్యావహారిక భాషా మూలమున జనసామాన్యమున కందుబాటులో నుండు రీతిని రచన గావించినవారిలో తాళ్లపాకవారే ప్రముఖులుగా కానవచ్చుచున్నారు.[1] వీరు సంప్రదాయము ననుసరించిన గీర్వాణ భాషయందు కూడ వ్యాఖ్యలొకటి రెండు వెలయించియున్నారు. తాళ్లపాక పెదతిరుమలాచార్య కృతమని తెలియవచ్చు సంకీర్తన లక్షణ వ్యాఖ్యయు, మమ్మటాచార్యుని కావ్యప్రకాశికకు తిరువెంగళప్ప రచించిన 'సుధానిధి' యను వ్యాఖ్యయు సంస్కృత మందలివే. కాని నేఁడవి మనకు సంపూర్ణముగా

---

యాంధ్రవ్యాఖ్య నొకదానిని పేర్కొనిరి. ఆ వ్యాఖ్యాత యెవరో తెలియరాదు కాని రత్నాకర వ్యాఖ్యాతయగు సర్వజ్ఞ సింగభూపాలుఁడే యీ యాంధ్ర వ్యాఖ్యను కూడ రచించియుండు ననియు సింహ (సింగ) భూపాలుఁడనుటకే హంస భూపాలుఁడని పొరపాటున సుబ్బరామ దీక్షితులవారి గ్రంథమున కెక్కియుండుననియు విమర్శకులు తలచుచున్నారు. అదియే సత్యమగుచో నా సంగీత రత్నాకర వ్యాఖ్యయే తెలుఁగున తొల్త రచింపఁబడిన వ్యాఖ్యా గ్రంథముగా పేర్కొనవలసి యుండును తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరిలో విఠలభట్టు రచితమగు సంగీత రత్నాకర వ్యాఖ్య మతియొకటి గలదు – (తెలుఁగున) ఈ విఠలభట్టే భండారు లక్ష్మీనారాయణ పండితుని తండ్రియగు విష్ణుభట్టారకుఁడని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు వ్రాసియున్నారు. ఈ లక్ష్మీనారాయణుఁడు తన సంగీత సూర్యోదయమున తండ్రిగారిని "సంగీతాగమ లక్ష్య లక్షనిపుణై । శ్రీ విష్ణుభట్టారకై ।" అని స్తుతించియున్నాఁడు.

1. తరువాతి కాలమున జాలమంది వీరి వలెనే వ్యావహారిక వచనమున టీకలు వ్రాయసాగిరి. పదునేడవ శతాబ్దికిఁ జెందిన కాకునూరి అప్పకవి తన అప్పకవీయమున 'వరుస నన్నిటికిం డీక వ్రాయవలసెఁ దెనుఁగు మాటలఁ గడు తేటతెల్లగాఁగ' (4 - 188) అని చెప్పుకొని, యట్లే గ్రంథమున నెడనెడ వ్యావహారిక వచనమునే ప్రయోగించెను.

(చూ. అప్పకవీయము - 1932. వావిళ్లవారి ముద్రణము)

లభ్యము కాకున్నవి. బహుళ ప్రచారముగాంచి పలుతాళపత్రప్రతులు గలిగి నేటికి సంపూర్ణముగ లభించియున్నవారి యితర వ్యాఖ్యా రచనలలో ఆంధ్ర భాషయందు రచితములైననే ప్రసిద్ధములు. వానిలో తాళ్లపాక పెద తిరుమలాచార్యుఁడు గావించిన భగవద్గీత తెలుఁగు వచనము (దీనికే ఆంధ్ర వేదాంతమనియు నామాంతరము) ను, తిరువెంగళప్ప రచించిన గురుబాల ప్రబోధికయను అమరకోశ వ్యాఖ్యయు ముఖ్యములు. ఈ రెండు వివరణ గ్రంథములందును తాళ్లపాకవారు అచ్చముగా ఆనాఁటి ప్రచారమునందుండిన వ్యావహారికపు తెలుఁగు భాషనే ప్రయోగించి, యటు తర్వాతికాలపు సంస్కృతాంధ్ర కావ్య వ్యాఖ్యాతలకు మార్గదర్శకులై భాషకును భావమునకును మాత్రమే కాక జాతికిని దేశమునకుఁ గూడ నెంతో గణనీయమగు సేవ గావించినారు వీరి యీ రచనలు మూఁడునాలుగింటిలో పెద తిరుమలార్యుని సంకీర్తనలక్షణవ్యాఖ్య అలభ్యము. భగవద్గీత వచనము సంపూర్ణముగా లభ్యము. అముద్రితము. తిరువెంగళప్ప. గురుబాల ప్రబోధికాటీక సంపూర్ణముగా లభ్యము. ముద్రితము - అతనిదే కావ్య ప్రకాశికా వ్యాఖ్య. సంస్కృత రచన. గ్రంథాదిని కొంత భాగము మాత్రమే లభ్యము. అముద్రితము. వివరణము నీ దిగువఁ జూడఁదగును.

*సంకీర్తన లక్షణ వ్యాఖ్య* : కర్త తాళ్లపాక పెద తిరుమలాచార్యుఁడు అన్నమాచార్యుఁడు సంకీర్తన పరిశుద్ధికై "సంకీర్తన లక్షణ"మను లక్షణ గ్రంథమును సంస్కృతమున రచింపఁగా దానికాతని కుమారుఁడగు నీ పెద తిరుమలాచార్యుఁడొక వ్యాఖ్యానమును వెలయించినట్లు తెలియుచున్నది.

'పరమామ్నాయ సమానమై వెలయు మత్పైతామహ గ్రంథమున్
వరచాటూక్తి మదీయ పుణ్యజనక వ్యాఖ్యాతమున్'

అని చిన తిరుమలాచార్యుఁడు తన సంకీర్తన లక్షణ ఆంధ్రానువాదమున పేర్కొనిన యంశమే దానికాధారము. మూలమువలెనే ఆ వ్యాఖ్యయు నేఁడు కానరాకున్నది. చిన తిరుమలాచార్యుఁడు 'వరచాటూక్తి మదీయ పుణ్యజనక వ్యాఖ్యాతమున్' అనినాఁడే కాని ఆ వ్యాఖ్య నాతఁ డేభాషలో విరచించినది వివరముగా తెలుపలేదు.

అయినప్పటికిని అతఁడు 'వరుసం జెప్పెదఁ బద్యరూపమునఁ దద్వ్యాఖ్యానుసారంబుగన్' అని చెప్పుకొని యుండుటనుబట్టి మూలము వలెనే సంస్కృతమందే లఘు వివరణము గలదై యుండునేమో అనిపించును. ఈ రచనను గూర్చి యింతకు మించి యేమియుఁ దెలియరాకున్నది.

*భగవద్గీత వచనము* : కర్త పెద తిరుమలాచార్యుఁడు ఇది సంస్కృత మహాభారత మందలి భీష్మ పర్వాంతర్గతమగు భగవద్గీత పదునెనిమిది యధ్యాయములకును సంగ్రహ తాత్పర్యరూపమున రచింపఁబడిన తెలుఁగు వచనము. దీనికే 'ఆంధ్ర వేదాంత మనియు,'భగవద్గీతా టీక' యనియు నామాంతరములు. గ్రంథాంతమున కవివాక్యముగా "ఇది శ్రీమత్తాళ్లపాక అన్నమాచార్య పుత్రుండైన తిరుమలయ్యగారు భగవద్గీతార్థము తెలుఁగుజేసి అర్థం ప్రాపించినది పద్దెనిమిది అధ్యాయాలు సంపూర్ణము—

ధర తాళ్లపాక అన్నయ
వరసుతుఁడగు తిరుమలయ్య వాచాప్రౌఢిన్
వెరవున భగవద్గీతల
పరమార్థము ఆంధ్రభాష పరఁగ రచించెన్"-

అని గలదు. ఈ వేదాంత గ్రంథము నితఁడు ప్రాయశః సన్న్యాసాశ్రమ స్వీకారానంతరము (రేఫఱకార నిర్ణయమను శ్రీకృష్ణ శతక రచన తరువాత) రచించెనేమో! అందుకే కావచ్చును. సప్తమాధ్యాయమునకు టీకనారంభించుచు 'శ్రీకృష్ణ పదారవింద మకరందరసానుభవుండైన వెంకటపతియోగి వ్రాసింది' అని యొక వాక్యమును కవి చేర్చుకొనెను. సన్న్యాసాశ్రమ స్వీకారానంతర మితని వ్యవహారనామము తిరుమలయ్య = వేంకటపతియోగిగా మార్పు చెందినదేమో ! ఈ యభిప్రాయము సరియగుచో నిది యాతని రచనలలో చిట్టచివరిదై యుండుననవచ్చును. తాళ్లపాకవారు శ్రీ వేంకటేశ్వరునితోపాటు శ్రీకృష్ణస్వామిని కూడ గొప్పగా ఆరాధించిన వారే. వారు శ్రీకృష్ణ భక్తులుగను, సుదర్శన చక్రోపాసకులుగను, హనుమదారాధకులుగను కూడా వారి రచనలనుబట్టి గోచరింతురు. శ్రీకృష్ణ

ప్రోక్తమగు నీ గీతోపనిషత్తును ఆంధ్రీకరించుటకుఁ బూనుకొనుటయు వారి శ్రీకృష్ణ భక్తినే చాటుచున్నది.

టీకారంభమునకుఁ బూర్వము విశిష్టాద్వైత మతసాంప్రదాయము ననుసరించి గీతాపఠనమునకు ముందు చేర్పఁబడు ధ్యాన శ్లోక న్యాసాదుల నన్నిటిని గూర్చుకొనియే రచన యారంభించెను. అట్లే గ్రంథాంతమున గీతాధ్యయన పారాయణ మహిమము నుగ్గడించు సంప్రదాయ శ్లోకముల నుదాహరించెను. ఇఁక గ్రంథ విషయమును వరుసగా పదునెనిమిది యధ్యాయములలోని శ్లోకముల నుట్టంకించుచు పూర్వాపరసందర్భములఁ గూర్చుకొనుచు తేట తెలుఁగున వ్యావహారిక రూపమున విశిష్టాద్వైత మతానుసారము లఘు వివరణముతో సహా పొందు పరచెను. ఈ క్రింది పంక్తులాతని రచనలోని కూర్పు నేర్పునకును, అనువాద పటిమకును, భాషాసారళ్యమునకును, మత దృక్పథమునకును సూచికలుగా గ్రహింపవచ్చును.

1 ఆరంభము :- ధర్మరాజువారున్ను దుర్యోధనునివారున్ను యుద్ధానికి ఆయత్తపడి ఉభయదళాలవారున్ను మోహరించి ఉండగాను, ధృతరాష్ట్రమహారాజు యీ యుద్ధనిమిత్యం అనేక ప్రజాక్షయం అవుతా ఉన్నదని చాలా వగువగాను అక్కడికి వ్యాసులువచ్చి ధృతరాష్ట్రా! యీ యుద్ధానికి నీవేల వగచేవు? శ్రీ కృష్ణస్వామి భూభారం అణచేట్టుగా అవతరించినాఁడు. ఈ రాజలోకానకెల్లా కాలం చేరిక అయినది. ఇది యవ్వరివల్లా తీరేదికాదు. నీవు విచారము కాయవద్దు. నానాటి యుద్ధరహస్యమైన వార్తలు హృదయాభిప్రాయాలున్ను నీకు తెలియచెప్పేటట్టుగాను, త్రికాలవేదియగునట్టుగాను, సంజయునికి అనుగ్రహం చేసినాను. ఆ సంజయునివల్ల సకలకార్యాలున్ను వినుమని సంజయున్ని ధృతరాష్ట్రునివద్ద నిలిపి వ్యాసులు తమ ఆశ్రమానకు పోయిన వాఁడాయను. ధృతరాష్ట్రుడు సంజయునితో ఒకమాట పలికిన వాఁడాయను.

ఓయీ సంజయా! ధర్మక్షేత్రమైన యీ కురుక్షేత్రమందు

యద్ధముసేయ నిశ్చయించి కూడినట్టువంటి మావారలైన కౌరవు లున్ను, పాండురాజ కుమాళ్లున్ను యేమిచేసినారు అని అడిగితేను."

2. గాండీవం స్రంసతేహస్తాత్ — అను శ్లోకమునకు (1-30)

"చేతినుండిన్ని గాండీవమనే విల్లున్ను జారుచున్నది. శరీర మందలి చర్మమున్ను మండుచున్నది. నా మనస్సు భ్రమసినట్టు వలెనే ఉన్నది. నిలువ శక్తుండనుగాకను వున్నాఁడను."

ఇట్లీతని టీకలు సూటిగా తేటగానుండి మూలమునకు సన్నిహితముగా నున్నవి. ఇందలి భాష వ్రాసిన తీరునగాక 'చాటూక్తిగా' నోటఁజెప్పుచున్న వైఖరినే తోపింపఁజేయుచున్నది.

3. సప్తమాధ్యాయమున జ్ఞానవిజ్ఞాన యోగమును వివరించుపట్టున పరాపరప్రకృతులను గూర్చిన శ్లోకముల యనువాదమిది.

(7 - 4-8)

"భూమిరాపానలో వాయుః" భూమిన్ని ఉదకమున్ను (అనలమున్ను) వాయువున్ను, ఆకాశమున్ను మనసున్ను బుద్ధిన్ని అహంకారమున్ను అనేటి అష్టభేదాలు కలిగి సమస్తానకున్ను కారణమైన ప్రకృతిని నావశమైన దానిగా నెరుగుము.

అపరేయమితః-ఇది అపర ప్రకృతి. ఇంతకంటే అన్యమైన జీవస్వరూపమైన యాప్రకృతిచాత యీ సర్వమైన జగత్తున్ను ధరియింపఁబడును. అది నా సంబంధమైన పరప్రకృతిఁగా నెరుగుము.

ఏతద్యోనీని — యీ సర్వశరీరాలున్ను జడమైన అపరప్రకృతి వల్లను, అజడమైన జీవుండనే పరప్రకృతివల్లను బుట్టినవి గనుక యీ ప్రకృతిన్ని జీవుఁడున్ను కారణాలుగా గలవని నిశ్చయింపుము.

ఆ జీవునికిన్ని నేనే కారణము గనక యీ ప్రకృతి పురుషాత్మకమైన సర్వజగత్తుకున్ను జన్మలయాలకు కారణమైనవాఁడను —

మత్తః పరతరం — ఓయి అర్జునా! నాకంటే శ్రేష్ఠమైన వస్తువులు యించుకంతాను లేవు. యీ చేతనా చేతనాత్మకమైన సర్వ ప్రపంచమున్ను సూత్రమందు మణిగణాలు వున్నట్టె నా యందు నా యాధారమున వున్నది.

రసోఽహమప్సు — సర్వప్రపంచమున్ను నాకు శేషమై నా శరీర భావం బొందినది గనక ఉదకములయందు చవికలుగ జేసినవాఁడున్ను నేనే; సూర్యచంద్రులయందు ప్రభయైయున్నవాఁడా నేనే. సర్వవేదాలయందున్ను ప్రణవమై యున్నవాఁడా నేనే. ఆకాశమందు శబ్దమున్ను నేనే. నరులయందు పౌరుషమున్ను నేనే.

4. ఇట్లే రాజవిద్యా రాజగుహ్యయోగమును ప్రతిపాదించు నవమాధ్యాయమున - భక్తితత్త్వ మిట్లు ప్రతిపాదితమైనది.

అనన్యాశ్చింతయంతో మాం - ఏ జనులైనానేమి యితర దేవతల గొలువనివారై, కోరికలు కోరనివారై నన్నే గతియని కొలుతురు — యీ తీరున నిత్యమున్ను నాతోడి యోగము పేక్షించువారియొక్క యోగక్షేమములను నేను వహించి మోక్షమిత్తును.

సమోఽహం సర్వభూతేషు — సర్వభూతాలందున్ను నేనే సముండను. నాకు పగవాఁడున్ను లేఁడు. ప్రియుండును లేఁడు. ఎవ్వరాయనేమి భక్తిచాతను నన్ను భజింతురు. వారున్ను యే జాతివారైనాను, నా యందు భక్తి కలిగివుంటె వారందరి యందున్ను నేను దయగలిగి వుందును.

అపిచేత్సుదురాచారో — మిక్కిలిన్ని దురాచారైన వాఁడైనాను అన్యదేవతల భజనసేయక యీ చెప్పిన ప్రకారానను నన్ను భజించెనా సాధువు. లెస్స వాఁడే, బహుమానంశాయ తగినవాఁడున్ను వాఁడె, యెరుక గలవాఁడున్నవాఁడె, లెస్సనడక గలవాఁడున్ను వాఁడె.

మచ్చునకు పై నుదాహరింపఁబడిన పంక్తులలో గోచరించు శేషశేషి, దేహదేహి భావములును, మంత్రాంతర దేవతాంతర వర్జన

విషయమును రచయితకు వ్యాఖ్యా రచనలోఁగల విశిష్టాద్వైత మత దృక్పథమునే వ్యక్తము సేయఁగలవు.

ఎడనెడ నీకవి క్లిష్టవిషయమును సంగ్రహముగా చెప్పవలసి నపుడు టీకను వ్రాసియు దానికి మరికొంత వివరణమును గూడ జతే చేసి విపులీకరించెను. ఉదాహరణకీ టీక చూడఁదగును.

"శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్." (12-12)

అర్థం —

కర్కశమై నామీద సంతతమున్ను భక్తి అభ్యసించుట దొరకని వారిక ఆత్మధ్యానము సులభము. ఆత్మధ్యానం దొరకని వారికి ఫలము కోరని కర్మానుష్ఠానం సులభం - ఆ రీతి కర్మానుష్ఠానం చేస్తేను శాంతము కలుగును - ఇటనగా యేమనుటంటేను - శాంతుఁడైతేను ధ్యానం కలుగును. ధ్యానం దొరికితేను ఆత్మను గనవచ్చును. ఆత్మను కనుగొంటేను భక్తినిష్ఠ మహా ఘనమౌను."

ఈ రీతి నీతని వ్యాఖ్య గీతాహృదయమును సామాన్యజనుల కందించునట్లుగా సంపూర్ణముగా వ్రాయఁబడియున్నది.

*నామలింగానుశాసనవ్యాఖ్య* (గురుబాల ప్రబోధిక) : కర్త తిరువెంగళప్పయను నామాంతరముగల తాళ్లపాక తిరువెంకటాచార్యుఁడు. సంస్కృత పదకోశములలో ప్రాచీనము సుప్రసిద్ధమునగు అమరకోశమున కాంధ్రవ్యాఖ్య యిది. ఇది కేవలము అమరకోశమునందలి మూలసూత్రము (శ్లోకము) లకు మాత్రమేకాక ఆ పదకోశమునకుఁ బ్రాచీనులు వెలయించిన పదవృత్తులను, టీకలనుగూడ పరిశీలించి వాని యందలి యంశములనుగూడ కృతజ్ఞతతో స్వీకరించి సమగ్రముగా సంధానించుకొన్న యాంధ్రవ్యాఖ్య యిది. గురుబాలప్రబోధిక యను పేరున నేఁడు ముద్రితమై సర్వాంధ్ర దేశమున సుప్రఖ్యాతమైయున్న తెలుఁగు టీక యీ తాళ్లపాక తిరువెంగళప్ప రచించినదే. కృత్యాద్యంతములందు ఆ విషయమును నిరూపించు శ్లోకములును గద్యమును

గురుబాల ప్రబోధిక తొలిముద్రణమునందు ప్రాచీనతాళపత్రప్రతులలో నున్నట్లే యున్నది. కాని తరువాత తరువాత వావిళ్లవారు ప్రచురించిన గురుబాలప్రబోధిక ముద్రితపుప్రతులందు దా విషయము పూర్తిగా విడువఁబడినది.

తిరువెంగళార్య రచితమగు గురుబాలప్రబోధికాటీకగల తాళపత్రప్రతులు నేటికిని దేశము నాలుగు మూలల లభించుచున్నవి. తంజావూరు, మదరాసు, తిరుపతి, మున్నగు స్థలములందలి ప్రాచ్య లిఖిత పుస్తక భాండారములందును లెక్కకు మిక్కిలిగా నున్నవి.[1]

వానియందలి కృత్యవతరణిక[2] యిట్లు గలదు.

"శ్రీవేంకటేశేన సరోజజాతా సేయం సరోజాలయలాలనీయా
ఇతీవ సత్యం హృదయారవిందే నివేశితా మాం కమలాలయావ్యాత్.
ఆసిదాసేతునీహారగిరివిఖ్యాతనామవాన్
తాళ్ళపాకాన్నయాచార్యః వేంకటేశపదాంచితః.

---

1. 867—నామలింగానుశాసనవ్యాఖ్య గురుబాలప్రబోధిక (తంజావూరు సరస్వతీ మహాలు లైబ్రరీ)

676 (A) లింగాభట్టీయము (తిరుపతి ప్రాచ్యలిఖిత పుస్తకభాండారము) చూడఁదగును.

2. ముద్రితప్రతిలో నీకృత్యవతరణిక—

"......తతోథ తిరుమలగురు ర్గురుబుద్ధిసమానధీః
శారద్వాతాన్వయపారావార కళానిధిః।
తదాస్సన్మశ్శ్రీ తిరువేంకటాఖ్యో విబుధాగ్రణీః।
బుగ్వేదసరసీహంసో మిత్రహంస సరోరుహః।"

అని లోపభూయిష్ఠముగ నున్నది. ఇందు తాళపత్ర ప్రతులలో నున్నట్లు 'దీక్షితశ్చివ తిమ్మాఖ్యో ముక్తాఛత్రద్వయాంచితః' మున్నగు పంక్తులు లేకుండుట పొరబాటు - కావున నేతద్గ్రంథకర్త చినతిరుమలార్యుని కుమారుఁడగు తిరువెంగళప్పయే గాని-తిరుమలగురు (పెదతిరుమలార్యు)ని సంతానమగు కోనేటి తిరువెంకట నాథాదులు మాత్రము కారు.

తతోభవ త్తిరుమలగురుర్గురుసమానధీః,
భారద్వాజాన్వయపయఃపారావారకళానిధిః.
తస్మాదభూన్నందవర వరవీరవారిన్మణిః
దీక్షితశ్శ్రీన్నృసిమ్హాఖ్య ముక్తాఛత్రద్వయాంచితః.
తదాత్మజన్మా తిరువెంగళాఖ్యో ఋగ్వేదసఖ్యో విబుధైకవంద్యః
సోహం జనానామతిబుద్ధిదం ప్రియం బాలప్రబోధాఖ్య మిదం కరోమి.
ఆలోక్య దీక్షితీయాది నానా బాలప్రబోధికామ్
టీకామమరసింహస్య రచయత్యాంధ్రభాషయా.

గ్రంథాంతమున గద్య యిట్లు గలదు

"ఇతి శ్రీభారద్వాజాన్వయపయఃపారావారకళానిధి తిరువెంకటార్య బుధవర్య విరచితాయాం లింగాభట్టీయ టీకాసర్వస్వాది మిశ్రితాయాం గురుబాలప్రబోధికాఖ్యాయాం, అమరకోశవ్యాఖ్యాయాం - తృతీయ కాండః—శ్రీభరద్వాజాన్వయ పయఃపారావారచంద్ర తిరువెంకటార్య బుధవర్య విరచితంబును లింగాభట్టీయ టీకాసర్వస్వాది మిశ్రితంబునునగు గురుబాలప్రబోధికయను నమరకోశవ్యాఖ్యానమునందు తృతీయ కాండము సంపూర్ణమాయెను. (చూ ప్రాచీన ముద్రణము).

పై యంశమునుబట్టి తిరువెంకటార్యుఁడు నామలింగానుశాసనమునకు సంస్కృతమునం దంతకు పూర్వమున్న దీక్షితీయాది టీకలను చూచియు, లింగాభట్టీయము టీకాసర్వస్వము నను వాని యందలి యంశములను గూర్చుకొనియు నీ గురుబాల ప్రబోధికా టీకను సంధానించినట్లు తెలియుచున్నది.

అమరకోశమునకు సంస్కృతమున వృత్తులును, టీకలును, ప్రాచీనులును అర్వాచీనులును రచించినవే వెరసి దాదాపు నలువది తొమ్మిదింటికి పైబడియున్నట్లు డా॥ వి. రాఘవన్‌గారు పేర్కొని యున్నారు.[1] వానిలో నీ రచయిత పేర్కొనినవి కూడ గలవు.

---

1. చూ. New Catalogus Catalogorum. (Prepared by Dr. V. Raghavan—Vol. I Madras University Publication 1949)

*1 దీక్షితీయాదులు* :—1 వ్యాఖ్యాసుధ (లేక సుబోధిని) కర్త భానోజీ దీక్షితులు-ఈతనికే రామాశ్రమి యనియు నామాంతరము. 2 పీయూష-కర్త రామకృష్ణ దీక్షితులు - గోవర్ధన దీక్షితులవారి కుమారుఁడు.

*2 లింగాభట్టీయము* :—దీనికే అమరపదవివృతి యనియు నామాంతరము. కర్త వెంగళ కామయభట్టు కుమారుఁడగు లింగయ భట్టు. ఈతనికే లింగయసూరియనియు నామాంతరము. (మన దేశమున లభ్యములగు లింగాభట్టీయ పదవృత్తులుగల నానులింగానుశాసనప్రతులు పెక్కింటిలో తిరువెంగళార్య విరచితమగు గురుబాలప్రబోధికయను నాంధ్ర టీకయు జతగూడి కానవచ్చుచున్నది. ఈ రెంటితోఁ గూడిన నామ లింగానుశాసనవ్యాఖ్యకే ఆంధ్రదేశమున ప్రచారమధికముగా నుండినట్లు తెలియనగును.)

*3 టీకాసర్వస్వము* :— కర్త వంద్యఘటీయ సర్వానంద నామాంచితుఁడు.

పైన పేర్కొనఁబడిన సంస్కృత టీకాకారులు, క్రీ॥ శ॥ 1550 ప్రాంతములందుండిన తిరువెంగళప్పకన్న పూర్వులు. ఇట్లు 'లింగాభట్టీయ టీకాసర్వస్వాది మిశ్రితంబుగా రచితమైన యీ గురుబాలప్రబోధికా టీక సర్వజనసుగ్రాహ్యమై సుబోధమగురీతిని తేటతెనుఁగున వ్యావహారికభాషాసరళిలో నున్నది. తాళపత్ర ప్రతులందన్నిటను వ్యావహారికభాషలో తేటతెలుఁగుననున్న యీ వ్యాఖ్య ముద్రణమున కెక్కునప్పటికి పండితుల ప్రమేయమున సంస్కరింపఁబడి గ్రాంథిక భాషారూపమును దాల్చినది.

ప్రథమ కాండాంతమందలి యీ పంక్తులు పోల్చిచూడవచ్చును.

**తాళపత్రప్రతి :** "అటు తర్వాత కాండను ముగియింప నిశ్చయించినవాఁడై యీ కాండమందు చెప్పంబడ్డ వర్గులనెల్లా సంక్షేపాన తెప్పుచున్నాఁడు.

అది యెటువలె నంటేను స్వర్గసంగతమైనవి దేవతాదులున్ను వ్యోమసంగతమైన మేఘాదులున్ను దిక్సంగతమైన దిగ్గజాదులున్ను ... ... ... ... ... ... నరక సంగతమైన బాధాదులున్ను, వారిసంగతమైన నౌకాదులున్ను చెప్పఁబడెను."

(చూ॥ తంజాపూరు కేటలాగు Vol - II పుట. 111)

**ముద్రితప్రతి :** "కాండమును ముగించుచు నీ కాండమునందు జెప్పఁబడిన వర్గములనన్నిటి నొకసారి పేర్కొనుచున్నాఁడు — ఎట్లనిన — స్వర్గసంగతములైన దేవతాదులును, దిక్సంగతములైన దిగ్గజాదులును ... ... ... ... వారి సంగతములైన నౌకాదులును జెప్పఁబడినవని యర్థము." (చూ. పు. 208)

ఇట్లే టీకారచన యంతయు ముద్రణమున నెన్నోవిధముల మార్పునందినదన్ననాశ్చర్యములేదు. అందుకే వానిని పరిశీలించిన శ్రీసుందరశర్మగారు తమ 'తంజాపూరు తాళపత్ర గ్రంథముల కేటలాగు Vol II పుట 111 లో ముద్రిత ప్రతికిని తాళపత్ర ప్రతులకును పాఠభేదములు పెక్కులున్నట్లు పేర్కొనినారు కూడ !

ఈ టీకా రచనమున లింగాభట్టీయ టీకా సర్వస్వాది రచనలను తిరువెంగళప్ప సంగ్రహించిన విధానము స్థూలముగా నిట్లున్నది. ముందు పదకోశ శ్లోకముండును. ఆ పిదప లింగయసూరి విరచితమగు పదవృత్తి సంస్కృతమున నీయఁబడును. ఆ వెనుక దానికి తాను వ్రాసిన తెలుఁగు టీక యుండును. అందును లింగయసూరి పేర్కొనిన యంశములు టీకాసర్వస్వము నుండి సంగ్రహించిన పట్టున 'టీకా సర్వస్వమనియు పేర్కొనఁబడియుండును. ఇదియే యిందలి రచనా ప్రణాళిక.

ఈ విషయమున గ్రంథాదియందున్న ఇష్టదేవతా ప్రార్థన శ్లోక విషయము నించుక పరిశీలింపఁదగును.

*లింగయసూరి విరచితా పదవృత్తిః - అవతరణికా :*

"అథ సకలశాస్త్రాభిజ్ఞః అమరసింహాఖ్యో మహాప్రాజ్ఞః లోకోపకారాయ నామలింగానుశాసనాఖ్యం గ్రన్థం చికీర్షుః ప్రారిప్సితస్య గ్రన్థస్యావిఘ్నపరిసమాప్తయే ఇష్టదేవతా నమస్కారరూపం మంగళమాదా వాచరతి —

*గురుబాల ప్రబోధికయను తెలుఁగు టీక :*

అవతరణిక : (సకల శాస్త్రవిజ్ఞుండగు అమరసింహుఁడను మహాపండితుఁడు లోకోపకారము కొఱకు నామలింగానుశాసనమను గ్రంథమును జేయనారంభించినవాఁడై) ప్రారబ్ధమైన గ్రంథానకు విఘ్నమురాక నెరవేరేది కొఱకు గ్రంథకర్త ఇష్టదేవతా నమస్కారము స్తుతిరూపాన తేస్తున్నాఁడు - యస్యేతి-

శ్లో॥ యస్య జ్ఞాన దయాసిన్ధో రగాధస్యానఘా గుణాః
సేవ్యతా మక్షయో ధీరాః స శ్రియై చామృతాయ చ"

పిదప —

యస్యేతి. హేధీరాః హే పణ్డితాః- ఇత్యాది పదవృత్తి. తదుపరి - టీకా సర్వస్వమునం దుదాహృతమగు విశేషవ్యాఖ్య. ఆ పిదప పై రెంటిని సంధానించిన విశేషములు గల తెలుఁగు అర్థము.

(పూర్తి వివరములకు ముద్రితప్రతి తొలిమూఁడు పుటలును పరికింపఁదగును.)

ఈ శ్లోకమునకు లింగయసూరి పదవృత్తిలో సూచితమై టీకాసర్వస్వమున విపులముగా వివరింపఁబడిన యర్థము సముద్రపరముననుపరమాత్మపరముననుగూడ తెలుఁగున విశదీకరింపఁబడినది.

కావుననే తిరువెంగళార్యుని గురుబాల ప్రబోధిక పండితపామర జనసేవ్యమై సార్థక నామధేయము గలదిగా ఆంధ్రులచేత నేఁటికిని కొనియాడఁబడుచున్నది.

*కావ్యప్రకాశ వ్యాఖ్యా - సుధానిధి :*

కర్త తాళ్లపాక అన్నమాచార్యుని మునిమనుమఁడును, చినతిరుమలాచార్యుని కుమారుఁడును, గురుబాల ప్రబోధినీ టీకా కారుఁడును, అమరుకావ్యము ననువదించినవాఁడును నగుతిరువెంగళప్పయే.

మమ్మటాచార్యుని కావ్యప్రకాశిక కీతఁడు వెలయించిన యీ సంస్కృత వ్యాఖ్యకు 'సుధానిధి' యనియు నామాంతరము. ఇది 'కావ్యప్రకాశ వ్యాఖ్యా' అను పేరున మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండారమున 818 (A) లో గుర్తింపనగుచున్నది.[1] దానినే శ్రీ S. K. De ప్రభృతులు తమ History of Sanskrit Literature లో నుదాహరించి యున్నారు. కాని మన దురదృష్టమున నేఁడీ గ్రంథము పూర్ణముగా లభ్యమగుటలేదు.

గ్రంథారంభ మిట్లున్నది—

"శ్రీవేంకటేశేన సరోజగాత్రా సేయం సరోజాసనలాలనీయా
ఇతీవ నిత్యం హృదయారవిందే నివేశితామాంకమలాలయావ్యాత్॥
ఆసీదానేతుసీహారగిరి విఖ్యాతనామవాన్
తాళ్ళపాకన్నయాచార్యః వేంకటేశ వరాంచితః
తతోభవ త్తిరుమలగురు ర్గురుసమానధీః
? రద్వాజాన్వయ పయః పారావార కళానిధిః
తస్మాదభూన్నందవర వరహారహరిణ్మణిః
దీక్షితశ్చిన్న తిమ్మాఖ్య ముక్తాఛత్రద్వయాంచితః
తదాత్మజన్మా తిరువేంకటాఖ్యస్సుధీమణిః (?)
ఋగ్వేద సరసీ హంసో హ సౌమిత్ర సరోరుహమ్
గోపాల ప్రముఖోక్త వ్యాఖ్యాసు సమాకలయ్య సారాంశమ్
టీకా సుధానిధిమసౌ రచయితి కావ్యప్రకాశస్య ॥."

గురుబాల ప్రబోధికలోని కృష్ణావతరణికా శ్లోకములేకొలది మార్పులతోనిందున్నవి. ఈ యవతరణికను బట్టి తిరువెంగళప్ప కావ్యప్రకాశికను సుధానిధియను టీకను సంగ్రహముగా 'గోపాల ప్రముఖోక్త వ్యాఖ్య'ను చూచిన పిమ్మట వ్రాసినట్లుగా తెలియుచున్నది.

---

1 చూ. Madras. Tru Catalogue 818 (A)

గ్రంథ లిపిలోనున్నది తాళపత్రప్రతి. కొలది పత్రములు మాత్రమే లభ్యము. క్రీ. 1910-11లో మన్నార్‌గుడి వాస్తవ్యులు శ్రీగోపాల స్వామి అయ్యంగారు దీనిని బహూకరించినట్లుగా కేటలాగునందు గలదు.

మమ్మటుని కావ్యప్రకాశికకు సంస్కృతమున వెలసిన వ్యాఖ్యలే వెరసి డెబ్బదివరకును గలవని S. K. De పండితుఁడును, డెబ్బది యైదింటి వరకును గలవని P. V. Kane పండితుఁడును పేర్కొని యున్నారు. సంస్కృత వాఙ్మయమున భగవద్గీత తరువాత నంత విపులముగా నందఱిచేత వ్యాఖ్యానింపఁబడిన గ్రంథములలో మమ్మటుని కావ్యప్రకాశికనే రెండవదిగా పేర్కొనవలసి యున్నదని S. K. De ప్రభృతు లాయలంకార గ్రంథమునుగూర్చి ప్రశంసించియున్నారు.

కావ్యప్రకాశికను గూర్చి Dr. P. V. కాణే పండితుఁడిట్లు వ్రాసెను. 'In the Alankara literature the Kavya prakasa occupies a unique position. It sums up in itself all the activities that had been going on for centuries in the field of poetics, while it becomes itself a fountain head from which fresh streams of doctrines issue forth." (History of Skt. Literature P. 266) దీనిని బట్టి అలంకార శాస్త్రవాఙ్మయమున కావ్యప్రకాశిక యొక్క విశిష్ట రచనగా గుర్తింపనగును. దానిమీఁది వ్యాఖ్యలు ఆ గ్రంథ ప్రాశస్త్యమును మఱి వేవిధముల వెలికిఁదెచ్చినవి— బంగారమునకుఁ దావియబ్బినట్లైనది.

ఇట్లు అలంకారశాస్త్రమున వినూత్నములగు దృక్పథములకును జర్చలకును వీలుకల్పించిన కావ్యప్రకాశికకు ప్రాచీనులే, రాజానక రుయ్యక, మాణిక్యచన్ద్ర, సరస్వతీ తీర్థ, జయంతభట్ట, సోమేశ్వర లౌహిత్యభట్ట గోపాలసూరి ప్రభృతులెందరో వ్యాఖ్యలను వెలయించినట్లు తెలియుచున్నది. అట్టి ప్రముఖ వ్యాఖ్యాతలలోఁ బదునైదవ శతాబ్దికించుక పూర్వుఁడును, భానుదత్తుని రసమంజరీ వ్యాఖ్యాతయగు హరివంశభట్ట ద్రావిడుని కుమారుఁడును, 'సాహిత్య చూడామణి' యను పేరున కావ్యప్రకాశికకు వ్యాఖ్యను వెలయించినవాఁడును నగు లౌహిత్యభట్టగోపాలుఁడే తిరువెంగళప్ప యీ వ్యాఖ్యయందు పేర్కొనిన గోపాల నామకుఁడై యుండును. కావున తిరువెంగళార్యుని సుధానిధి వ్యాఖ్య అంతకు ముందుండిన కావ్యప్రకాశ

వ్యాఖ్యలలోని సారాంశమెల్ల కలిగిన 'సంగ్రహ రచన' యని తలంప వచ్చును.

143 కారికలతో పది యుల్లాసములతో నున్న కావ్యప్రకాశికకు తిరువెంగళార్యుని వ్యాఖ్య మనకు లభ్యమైనది గ్రంథారంభమున గల మంగళ శ్లోకములు మాత్రమే. దానిని బట్టియే తిరువెంగళార్యుఁడు సంస్కృత సాహిత్యాలంకార సాంప్రదాయము నెఱిఁగిన వ్యాఖ్యాత యనియు, విద్వాంసుఁడనియు, సాహిత్య వ్యాకరణ, తర్కమీమాంసా శాస్త్రములందు గొప్ప పాండిత్యము గలవాఁడనియు తెలియనగు చున్నది.

* * *

తృతీయాధ్యాయము

# త్రాళ్లపాకవారు-తత్సన్నిహితులు

(పుటలు 475–515)

# తాళ్ళపాకవారు - తత్సన్నిహితులు

తాళ్లపాకవారి కృతులను పరిశీలించినట్లే తాళ్లపాకవారికి సన్నిహితులుగను, బంధుగులుఁగను పరిగణింపఁబడుచున్న మఱియొక రిద్దరి కృతులను గూడ నిట పరిశీలించుట అవసరము కాకపోదు. వానిలో నృసింహకవి విరచిత కవికర్ణరసాయన మొకటి. తక్కినవి రేవణూరి వేంకటాచార్య రచితములగు శకుంతలా పరిణయము. శ్రీ పాదరేణు మాహాత్మ్యము అనునవి.

కవికర్ణరసాయన కర్తయగు నృసింహకవి ప్రౌఢ ప్రబంధ కవిగా తరువాతి కాలపు కవులచేత కీర్తింపఁబడినవాఁడు తెనాలిరామ కృష్ణుని చాటుపద్యమున చిన్నన్న పెదతిరుమలార్యులతో బాటు 'నరసింగన్న కవిత్వంబు పద్యగద్యశ్రేణిన్' అను సందర్భమున ప్రస్తుతుఁ డయిన నరసింగన్నయే కవికర్ణరసాయనకృతికర్తయను ప్రతీతి యొకటి లోకమున గలదు. అది యథార్థమగుచో ఆ నరసింగన్న తాళ్లపాక వంశీకుఁడును,అన్నమాచార్యుని పెద్దకుమారుఁడును, పెద తిరుమలాచార్యున కగ్రజుఁడును నగు నృసింహకవియే కావలసి యుండును. కనుక కవికర్ణరసాయన కర్త తాళ్లపాక నృసింహకవియే అన్న విశ్వాసము చొప్పున నాకృతి యిటఁబరిశీలింపఁబడుచున్నది. అటు పై - రేవణూరి వేంకటాచార్యుని గూర్చి. లభ్యములగు కృతులనుబట్టి యీతఁడు తాళ్లపాక అన్నమాచార్యుని కూతురి కొడుకుగా (?) తెలియవచ్చుచున్నాఁడు. కనుక అన్నమాచార్యుని దౌహిత్రుని కృతు లను గూడ తాళ్లపాక వారి కృతులను గూర్చి వ్రాయు సందర్భమున నించుక పరిశీలించుట సమంజసము కాకపోదు.

తాళ్లపాక కవులు పలువు రొక సంస్థగాఁ గూడి విజయనగర యుగమున వైష్ణవ మత సాహిత్యముల ప్రచారమున కెంతయో పాటుబడినారు. అట్టి వారితో వీరును జతగూడి అమ్మహాయత్నము

విజయవంతమగుటకుఁ జేయూత నొసగినారు. అందుకే వారితో బాటు వీరును అభ్యర్చితులగుచున్నారు.

*కవికర్ణ రసాయనము* : ఈ కృతి మాంధాతృచరిత్రము ప్రధానేతివృత్తముగా గల యొక ప్రౌఢ ప్రబంధము. కృతికర్త నరసింహాకవి.

కం. కవితా విచక్షణతగల
కవికంఠ విభూషణముగఁ గైకొనవలయుం
గవివర నృసింహ విరచిత
కవికర్ణ రసాయనమను కావ్యము దీనిన్... 6-217

అని కవియే 'కవికర్ణరసాయన' మని నామకరణము గావించెను. కావ్యము కేవల కళావిష్కారముగా వించునదేకాక జగద్ధితమును సాధించు ప్రయోజనము లక్ష్యముగాగలదిగాకూడ నుండవలెనని నృసింహాకవి యభిమతము. రసాయనము జరావ్యాధులను బోఁగొట్టెడి యౌషధ విశేషము మాత్రమేకాక ఆరోగ్యవర్ధకమగు నాహారముకూడ. అందుకే 'తెలుఁగంచుం జెవిపెట్టలేని' వారి కాతఁడందిచ్చిన 'మందు'గా నీకృతి రసపరిపాకమునందుకొన్నది. అది సాధారణ కర్ణరసాయనము కాదు. కవి కర్ణరసాయనము. అది 'విద్వదౌషధ'మును బోలినది.

కావ్యము 'ఆర్యులకుఁగర్ణరసాయన లీల' గ్రాలునట్లుండవలెనని తొలుతఁ జెప్పిన తెలుఁగుకవి నన్నిచోడఁడే. కవికర్ణరసాయనకర్త నన్నిచోడని పలుకాపుల ననుకరించినాఁడు. ఈ గ్రంథనామముకూడ పై విషయమును నిరూపించుచున్నదనవలెను. ఈ కవికి కర్ణరసాయన ప్రాయములగు శబ్దములన్న ప్రీతి. అందుకే 'శ్రుతిరసాయనమయ్యెడు తేంట్లయార్పులన్' (8-117) అని మరియొకతావునగూడఁ జెప్పుకొని నాఁడు. కవితా విషయమున ప్రాతిపదికమగు శబ్దము మొదలుకొని వరమావధియనదగు రసధ్వని పలుకునుగల సర్వవిషయములను నీకవి శ్రవణ సుభగమగు శయ్యావిధానముననే ఆవిష్కరించెను ఆతఁడు తన కవితలో 'నపూర్వరచనా చాతుర్యము'ను బ్రదర్శించెను. కథా సందర్భమున నృసింహాకవి - 'శ్రవణయోగ్యంబైన శబ్దమొక్కఁడులేక - ప్రియము గొల్పెడు నలంక్రియలులేక సరసమై మృదువైన శయ్యగల్గుట లేక - యర్థసంగ్రహముపై నర్థిలేక, పరుఁడు పట్టినచోటఁ బ్రత్యుత్తరములేక -

ప్రాణహానికి గొంకుపాటులేక, వర్ణ గౌరవలాఘవములపై మతిలేక - వృత్తభంగమునకు వెఱపులేక, తారుదారయతక్క నెవ్వారు నోరులు - దడవ రోకమూలబడి ప్రసిద్ధులుగాకయుండు 'సవిద్వత్ప్రబంధంబు' లను వర్ణించుటలో కవికి విద్వత్ప్రబంధమున నుండఁదగు లక్ష్యమెట్టిదో సూచించి యున్నాఁడు "అనుకూల క్రియ చూపనేరక బలవ్యాకృష్టిచే వక్రమై. యనుమానాకులతం బదంబు మృదుశయ్యంగూర్పఁగాలేక చాలనిగూఢంబుగ భావముం" (4-167) గలిగి "కుకవిత్వ"ముండునని యాతఁడే వేరొకతావున జెప్పికొనినాఁడు. కావున కవితా విషయమున నాతని యాదర్శమెట్టిదో పై పద్యములనుబట్టి మనమూహింపనగును. ఈతని కృతి సర్వవిధములఁ "గవికర్ణరసాయన" మగుట చేతనే

'ఒకతి విటుఁడు గాకపోవుటె ట్లన్మదీయ
కావ్యశృంగార వర్ణనాకర్ణనమున
విటుఁడు యతికాకపోరాదు వెస మదీయ
కావ్య వైరాగ్య వర్ణనాకర్ణనమున' (1 - 62)

అని ధైర్యముగా చెప్పుకొనినాఁడు. కావ్యగతవర్ణనములను బట్టియు, నందు ప్రదర్శితమైన యనుభవ పరిపాకమునుబట్టియు నీ కావ్యమును గవి యించుక వయసు మళ్లిన పిదపనే వ్రాసెనేమో అనిపించును. ఈ కృతి రచనా కాలము ప్రాయికముగా క్రీ. శ. 1515 - 1520 ప్రాంతములందై యుండునని భావింపవచ్చును.

*కవి - కాలము* ... కవి యిందు తననుగూర్చి "శ్రీమద్భట్ట పరాశరదేశికేంద్రచరణసరసీరుహ సేవకోపనేనకుఁడ" ననియు "నరసింహ నామధేయము" గలవాఁడననియు మాత్రమే వ్రాసికొనినాఁడు. అంతకు మించి యేమియు పేర్కొనని కారణమున మనకాతని తలిదండ్రులను గూర్చికాని వంశమువారిని గూర్చికాని వివరములేమియు తెలియరాకున్నవి. కానియీాతనికి "సంకుసాల నృసింహకవి"యని యింటి పేరు"సంకుసాల"గా లోకమున బ్రసిద్ధియున్నది.లక్షణ గ్రంథములందు "సుంకసాల నరసింగన్న" అని గలదు. కాని గ్రంథమున నాయింతయేని సాక్ష్యములేకుండుటచేత నాతని యింటిపేరేమోకూడ స్పష్టముగ తెలి

యరాని పరిస్థితి యేర్పడినది. "సుంకసాల, సాకుసాల, సుంకేసులలు ఒక యూరి పేరి వికారములేమో! నరసింగన్న ఆ గ్రామమునందున్న వాఁడగుటచేత నాయూరి పేరే యింటి పేరుగా, ప్రసిద్ధికెక్కినదేమో! గ్రంథస్థాధారములనుబట్టి, యీ కవినిగూర్చి మనకింతకంటె నేమియుఁ దెలియ రాకున్నను వృద్ధానుశ్రుతినిబట్టి వినవచ్చుచున్న కొన్నికథలను పురస్కరించుకొని మన మీతని విషయమై కొన్ని నిర్ణయములకు రావీలు కలుగుచున్నది. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారీ నృసింహ కవిని గూర్చి యిట్లు వ్రాసియున్నారు. "శ్రీ వీరేశలింగము పంతులు గారు కవి చరిత్రమున కవికర్ణరసాయనకర్త కృష్ణదేవరాయల నాఁటి వాఁడని, కృష్ణరాయని "అందోళికలయందు నంతరచరులౌట నవి కృతాకృతుల పిశాచ జనులు... ప్రభు దురాత్ముల నెవ్వాఁడు ప్రస్తుతించు" నని గర్హించెనని వ్రాసినారు. వృద్ధానుశ్రుతినిబట్టి వ్రాసిన యీ వ్రాత విశ్వాస్యమే యనుకొందును. కవికర్ణరసాయనకర్త నరసింగన్న తాళ్ళపాక నరసింగన్న కాఁగూడుననుకొందును...కవికర్ణ రసాయనమున నాతఁడు తన కులగోత్రములను తలిదండ్రులను బేర్కొనఁడయ్యెను. గ్రంథాదిని "గురువర భట్టపరాశర చరణ సరోరుహ సముల్లసన్మానసుఁడన్" అని గురుస్తుతి చేసినాఁడు. తుదిని "ఆదిమ శఠకోపాది" అని యాశ్వాసాంత పద్యమునఁ జెప్పినాఁడు. వీనినిబట్టి యీతడు భట్టపరాశరాహ్వయుని శిష్యుఁడనీ, రెండవ శఠకోపయతి యైన యహోబలమఠప్రతిష్ఠాపకవన్ శఠకోపయతి నెఱిఁగిన వాఁడనీ గుర్తింపనగును. వేదాంత దేశికుల శిష్యులు, గీతావ్యాఖ్యాత భట్టపరాశరు లొకరు గలరుగాని, అయినను రామానుజులనాఁటి పరాశర భట్టారకుల వంశజులందఱకు పరాశరభట్ట నామము సాధారణమని కూడ వాడుక గలదు. క్రీ. పదునైదవ శతాబ్ది యుత్తరార్ధమున ఏన్ శఠకోపయతులు గలరుగాన ఈతఁడు వారినాటివాఁడో వారి తర్వాతివాఁడో అగుటచే నన్నమయ పుత్రుఁడగుట నిర్బాధమగును.

కవికర్ణరసాయనమున వైష్ణవమతాభిమానము, అద్వైత మత ద్వేషము, అన్నమాచార్య సంకీర్తనచ్ఛాయలునిండార్లుగానున్నవి...

కవికర్ణ రసాయనము తాళ్ళపాక నరసింగన్న రచనమే యగుచో నందు రాజాశ్రయగర్హ సహేతుకమే యగును"[1]

కవికర్ణ రసాయనమును నృసింహకవి కృష్ణరాయల కడకుఁ గొంపోయిన కథ నొకదానిని శ్రీ గురజాడ శ్రీ రామమూర్తిగారు తమ "కవిజీవితము" లం దుదాహరించినారు. ఈర్ష్యచేత అల్లసాని పెద్దన కవికర్ణరసాయనకర్తకుఁ గృష్ణరాయని దర్శనము కాకుండ నడ్డుపెట్టినట్లును, బహుకాలము వేచియుండియు రాజదర్శనము కాకుండినందుకు రోసి నరసింహకవి ప్రభుదురాత్ములను నిరసించి, తన కావ్యమును నరాంకితము సేయక శ్రీరంగేశున కర్పించెననియుఁ దత్కథాసారము. కవికర్ణరసాయన పీఠికాపద్యములను బరిశీలించినను నరసింహకవి తొలుత "ననుకూలనాయకాన్వేషణ పరాయత్తంబైన చిత్తంబు" గలవాఁడనియు మొదట నీ గ్రంథము నరకృతి చేయ యత్నించి యుండెననియు నదియేకారణముననో మాఱి దైవకృతి కంగీకరించెననిచెప్పెడు లోకప్రతీతి సరియైనది గానే కానుపించుచున్న దనియు శ్రీ గురుజాడ శ్రీరామమూర్తి గారు వ్రాసినారు.[2]

ఏది యెట్లున్నను పై చర్చను దిలకించిన పిమ్మట మనము తేల్చుకొనవలసిన యంశములు రెండున్నవి. అందొకటి కవికర్ణరసాయనకర్త కృష్ణరాయల కాలమున నున్నవాఁడని గుర్తించుట. రెండవది తత్కర్త తాళ్లపాక నరసింగన్న యగునా యని పరిశీలించుట... ఈ యంశముల నించుక విశదీకరింతును.

కవికర్ణ రసాయనకర్త కృష్ణరాయల కాలముననున్నవాఁడా? ఈ విషయమై క్రీ. 1915 ప్రాంతములందు శ్రీమాన్ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు కొంత చర్చించి ఈతఁడు రాయలకాలము వాఁడగుట "సుతరా మసంభవ"మని వ్రాసినారు. భట్టపరాశరు లిరువురిలో రెండవ వారు 1268-1369ల నడుమనున్న వేదాంత దేశికుల వారి శిష్యులనియు భట్ట సుదర్శనాచార్య తనయులనియు, "ధానా

1. చూ. అన్నమాచార్య చరిత్ర పీఠిక - పు. 82.84
2. చూ. కవిజీవితములు – పు. 434 - 463

ముష్టిముచున్" "ప్రచ్ఛన్న బౌద్ధ దుస్సహాహ్వాచ్చర"మున్నగు వాక్య విన్యాసములందు వేదాంతదేశికులవారి నీతఁడనుసరించుటచేత తచ్ఛిష్యుఁడే ఈతని గురువై యుండుననియు, రాయలకాలమువాఁడు కాజాలఁడనియు వారి యప్పటివాద సారాంశము. కాని అన్నమాచార్య చరిత్ర పీఠిక ప్రకటింపఁబడినతరువాత శ్రీ శాస్త్రిగారి యభిప్రాయములనుగూర్చి వారే యిట్లు వ్రాసియున్నారు. "సంకుసాల నరసయ్య తాళ్ళపాకవాఁడేమో అనే సందేహం నిజంగా సహేతుకమే. సంకుసాల సుంకసాల సుంకేసులల పరస్పరసామ్యం గమనింపవలసినదే..కానికవికర్ణరసాయనం రంగనాధుని కంకితం. కవి తాళ్ళపాకవాఁడైతే తిరువతిదైవాన్నిస్మరించక పోవుటకు కారణమూహింపవలసియున్నాము. ఇట్లే మహానుభావుడగు తండ్రియైనా-అతడు పేర్కొనలేదు".[1] ఈ విషయములుకూడ పరిశీలింపవలసినవేగాని ప్రస్తుతమున నొకటిమాత్రము చెప్పవచ్చును. కవికర్ణరసాయనకర్త రాయలకాలమున నున్నవాఁడే. "రామానుజులనాఁటి పరాశరభట్టారకుల వంశజులందఱకు పరాశరభట్టనామము సాధారణమని కూడ వాడుకకలదు" అని శ్రీ శాస్త్రిగారు వ్రాసినది నిజమే. క్రీ. 1586 మన్మథసంవత్సరమున శ్రీ పరాశరభట్టాచార్యుల శిష్యుఁడగు మట్ల రామయ్య వేయించిన శాసనమొకటి కలదు.[2] కనుక నాఁడుకూడ పరాశరభట్టనామకు లొకరుకలరని తెలియవచ్చుచున్నది. నరసింహకవి గురువుకూడ వారేయగుదురేమో! కనుక పరాశరభట్టాచార్యుల శిష్యుఁడగు నరసింహకవి రాయల కాలమువాఁడగుటలో నాశ్చర్యములేదు.[3]

ఇక రెండవ యంశము కవికర్ణరసాయనకర్తయగు నృసింహకవి-తాళ్ళపాక నరసింగన్న యగునా? అగుచో శ్రీఅనంతకృష్ణశర్మగారు

1. ఇది శ్రీ అనంతకృష్ణ శర్మగారు 16.8.49లో శ్రీ శాస్త్రిగారికి వ్రాసిన లేఖలోని భాగము.

2. చూ. తి.తి.దే.శా. సం 4-78 — క్రీ 1536

3. ఆంధ్రకవితరంగిణికారులు శ్రీ చాగంటి శేషయ్యగారు కూడ నిట్టియభిప్రాయమునే ప్రకటించియున్నారు.

వెలిబుచ్చిన సందేహముల కేమని సమాధానము లూహింపఁదగినవి కలవా అని యోచింప వలసియున్నది. ఈ క్రింది యుపపత్తు లట్టి నిర్ణయమున కుపకరింపఁ గలవని తోఁచుచున్నది.

1. కవికర్ణరసాయనకర్త నృసింహకవి పరమవైష్ణవుఁడని యాతని గ్రంథమును బట్టి తెలియుచున్నది. తాళ్లపాక నరసింగన్న కూడ పరమవైష్ణవుఁడే.

2. నృసింహకవి "గద్య పద్య శ్రేణిన్" శృంగార వైరాగ్య తత్త్వ ప్రతిపాదకమగు ప్రబంధమును రచించెను. తాళ్లపాక వంశీకు లందరును శృంగార వైరాగ్యతత్త్వ ప్రతిపాదకములగు రచనలు గావించినవారే.

3. కవికర్ణరసాయనకర్త నృసింహకవి – శ్రీరంగనాథునకు తనకావ్యము నర్పించుటచేత తద్భక్తుఁడనియు, శ్రీరంగమందు కొంత కాలముండిన వాఁడనియుఁ దెలియుచున్నది. కాని అతనికే "సుంకసాల నృసింహకవి" అనియుఁ బ్రసిద్ధియుండుటను బట్టి యాతఁడు "సుంకేసుల - సుంకసాల" అను పేరుగల గ్రామమందు బహుకాలముండియుండునని తలఁపనగును. సుంకేసుల నేఁటి కడప జిల్లా పులివెందల(?) తాలుకాలో నున్నది. ఆ గ్రామమందే నృసింహకవి నివసించి అదే యింటిపేరున వ్యవహృతుఁడైనాఁడేమో ! వృద్ధానుశ్రుతిని బట్టి యాతఁ డించుక "స్వాతిశయము" గలవాఁడని తెలియుచున్నది. పైన పేర్కొన్న వివరములన్నియు తాళ్లపాక నరసింగన్నకును జెల్లఁగలవు. శ్రీరంగముతో తాళ్లపాకవారికిని సంబంధ మున్నది. అన్నమాచార్యాదులు శ్రీరంగమునకేగి కొంతకాలముండిరేమో అని అనుమానింపఁ దగినట్లు వారిని శ్రీరంగనాథుని మీఁది కీర్తనములు కొన్ని యున్నవి. కనుక తాళ్లపాక కవులు కీర్తించిన శ్రీరంగనాథునకు కవికర్ణరసాయనకర్త తనకృతి నంకితమిచ్చుటలో వింతలేదు. ఇక నరసింహకవి యొక్క "స్వాతిశయము" తాళ్లపాక నరసింగన్న యందును కలదేమో అనిపించును. తాళ్లపాక నరసింగన్న తమ బందుగులు పోయిన దారినుండి విడివడి ఇంచుక ప్రత్యేకతను స్వాతిశయమును ప్రదర్శించు కొనినవాఁడే. అతఁడు సోదరులతో నించుక భేదించి

యిల్లువెడలి పోయినట్లున్నాఁడు. అన్నమాచార్యుఁడు జీవించి యుండిన సందర్భముననే తుళువ నరసానాయకాదులతో రాజకీయ సంబంధములగు స్పర్ధలలోఁ దాళ్ళపాకవారు చిక్కుకొని నట్లున్నారు. ఆ దినములలోనే వీరు తాళ్ళపాక గ్రామమును వీడి యెటో వెళ్ళినా రనిపించును. తండ్రిగారి నిర్యాణానంతరము కొంతకాలమునకు పెద తిరుమలయ్య తిరుపతి చేరుకొనఁగా భేదాభిప్రాయాలతో విడివడిన నరసింగన్న సుంకేసుల చేరుకొని యుండవచ్చును. అట్టి భేదాభిప్రాయములకు గూడ హేతువు లివియై యుండవచ్చును. నరసింగన్నయు, తిరుమలయ్యయు సవతితల్లుల బిడ్డలై యుండుటయు, తండ్రిగారు దివ్యధామమంది యుండుటయు, పెదతిరుమలయ్య తండ్రిగారి అడుగు జాడలఁబడి దైవమునే నమ్ముకొని పొలమురాజుల వెంటఁబోకుండగా నరసింగన్న వారివెంటబడి ప్రతిష్ఠకై ప్రాకులాడ దలచుటయు ముఖ్యకారణములై యుండును. రసికుఁడును, కవితాప్రియుఁడును నగు కృష్ణరాయఁడు రాజ్యమునకు వచ్చినదే తమకు తుళువరాజులతోఁ గల్గిన స్పర్ధనుగూడ లెక్కచేయక నరసింగన్న అతని ఆశ్రయము సంపాదించుకొని కృతుల నంకితము చేయుటకై యత్నించి విఫలమనోరథుఁడై యుండవచ్చును. దీనికి నరసింగన్న "స్వాతిశయమే" కారణము కాఁదగును.

4. కవికర్ణరసాయన కర్తనుగూర్చి మన కితర వివరములేవియుఁ దెలియ రాకున్నను గ్రంథమునందలి అంతరంగిక సాక్ష్యమును బట్టి మనమాతని చరిత్రను గొంతవఱకు గుర్తింప వీలగుచున్నది. అట్లు గుర్తించిన వివరములు చాలవఱకు తాళ్ళపాక నరసింగన్నను గూర్చి పైన ఊహించిన తెఱగుతో సరిపోలు చున్నవి. మాంధాత పూర్వజన్మమున "నుద్రిక్తచరిత్ర, నిష్ఠురోక్తుల లోకోపద్రవముచేసి" 'సమస్త బంధుబాహ్యుఁ'డయ్యెనట. మఱియు వసిష్ఠుఁ డిట్లు చెప్పెను.

'పైతామహంబైన చేతిరొక్కము చెల్లు
నంతకు నుద్వృత్తి నట్లు దిరిగి
పేదవై కృషిచేసి పెట్టిన సస్యంబు
లెల్లఁ బొల్లైనఁ గొన్నాళ్ళు నవని

గతిలేక దాస్యంబుగై కొని దానిచే
 గ్రాసంబు నడువక కడుఁ గృశించి
కడఁ దిరిపంబవై కాంతయు నీవును
 దేశంబులం దెల్లఁ దిరిగి తిరిగి
యంత కోకపట్టణమున విష్ణ్వాలయంబు
చేరి యొక కొందఱచట వసించి పరమ
యోగివరులుండ నిచ్చలుఁ జూఁగి మ్రొక్కి
నిండుమతిఁ జేసితివి వారలుండు నెలవు
లూడ్చియును నీరు చల్లియు నూడిగములు...

(కవికర్ణ 6 – 17)

ఇందు తత్కృతికర్త జీవితవిశేషము లేమేని పొందు పరుపఁబడి యున్నవేమో అని నా అనుమానము. చేతిసొమ్ము వెచ్చించుకొని నృసింహకవి రాజదర్శనము కొఱకై పెద్దనాదుల నాశ్రయించి వ్యర్థుఁడై విసిగి వేసారి శ్రీరంగనాథునకుఁ గృతిని సమర్పించుకొనెనని వృద్ధానుశ్రుతి. తాళ్లపాక నరసింగన్న చరిత్రము కూడ నిట్లే యనుమానింప నగుచున్నది కదా.

6. పెద్దన్న ఈర్ష్యచేత నృసింహకవిని పైకి రానీయలేదనియు, రాయల దర్శనము కాకుండ వడ్డుపెట్టెననియుఁ బ్రతీతి. ఈ ఈర్ష్యకు హేతువు కానరాదని శ్రీ వీరేశలింగము పంతులుగారు వ్రాసిరి కాని శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారు నృసింహకవి గ్రంథస్థాధారములను బట్టి స్మార్తుఁడై యుండి వైష్ణవము స్వీకరించిన వానివలె నగుపడుచున్నాఁడని సూచించి, కవితా విషయమున నాయిరువురకు స్పర్థ పర్పడి యుండవచ్చుననియు, పెద్దన కవితకన్న ననేక విధముల నృసింహకవి కవిత ప్రశస్తముగ నున్నదనియు భావించినారు... కావచ్చును. తాళ్లపాక నరసింగన్నయు స్మార్తుఁడై యుండి వైష్ణవము స్వీకరించిన అన్నమాచార్యుని కుమారుఁడే. వారి స్పర్థ కదియునునొక హేతువేమో ! అంతేకాక తాళ్లపాకవారు పదకవులేయన్న తిరస్కారబుద్ధియు, తుళువ నరసరాయాదులను వారు వ్యతిరేకించినారనెడి సుద్దియు పెద్దనకుఁ దగిన యవకాశమిచ్చి యండును. జనశ్రుతిలోనున్న కథలో కృష్ణరాయఁడు "ఉద్ధతుల

మధ్య పేదలకుండఁ దరమె" అను పద్యమును విని కవికర్ణరసాయనమును తనకడకుఁ దెప్పించుకొని చూచినట్లున్నది. అట్టి సందర్భముననే నృసింహకవి రాయలను సరకు సేయక తిరస్కరించి పెద్దనాదులను దుయ్యబట్టినట్లున్నాడు. చిన్నన్న తాళ్లపాక నరసింగన్నను గూర్చి వ్రాయుచు "పాడ జెప్పగ నీడు జోడు లేఁడని సభ జొచ్చి వాదించి *పరగిన ధీశాలి ప్రతివాది దైత్యనరసింహుఁ డనగల్గె నరసింహ గురుఁడు"* అని చెప్పినాఁడు. ఆ "ప్రతివాది" పెద్దన్నయే గాఁబోలును. సభలో ధీశాలియై పెద్దనను రాయలను తిరస్కరించి తన ప్రతిభను చాటుకొని బయట పడినట్లున్నాడు. రాయఁడు కవికర్ణరసాయనమును జూచినాఁడు అతని ఆముక్తమాల్యద తద్గ్రంథ పరిచయమును చెప్పక చెప్పుచున్నది. కాని రాయఁడు పెద్దన పక్షము వహించి యుదాసీనుఁడై యూరకుండెను గాఁబోలును. "అక్షర పక్షపాతమున నర్థము నగాళ్లనొసంగ నబ్బునన్ భిక్షుజటాధరాధికులు భిన్ననిజ వ్రతులౌదురు - భక్తియచాలు, దాన తత్ప్రభు భితత్వమే యఘముఁ దార్పదు శంకఁదలంగు మయ్యెడన్" (ఆముక్త 4-242) అన్నది నాఁటిరాయని రాజనీతి కదా! ఊరకుండుటయే కాదు తాళ్ళపాక గ్రామమును రొక్క ధాన్యములతో సహా స్వామికర్పించి ప్రసాద భాగములనేని రాయఁడు తాళ్ళపాకవారి కిప్పింపలేదు. రాయఁడీ కవికర్ణ రసాయనమును మెచ్చి నృసింహకవి నాదరింపఁ డాయెను. అందుకే అతడు-

"ఎల్లరు మెచ్చని మత్కృతి
నుల్లంబున మెచ్చుఁగాక యొకఁ డుష్ట్రికులం
బొల్లని వల్లవితామ్రము
గొల్లలుగాఁ బొగడ నొక్క కోయిల లేదే" అనుకొనినాఁడు (1-20)

కవికర్ణరసాయనకర్త శ్రీకృష్ణదేవరాయని కృతి భర్తగాఁ జేయ నెంచుకొనియే కావ్యారంభమునకుఁ గడఁగినట్లుగా మనము భావింపవచ్చును. మాంధాత రాజ్యమునకు వచ్చినతోడనే రాజనీతి ప్రసంగముల నాలించుట, విజయయాత్రల కేగుట, జయస్తంభములను నాటించుట, పిదప వైష్ణవమతమునం దాదరమును ప్రదర్శించి తత్సంపర్కమున నుత్తేజితుఁడగుట మున్నగు కథావిషయములు

రాయలనుద్దేశించి వ్రాసినవే అనిపించును. కాని రాయఁడాదరింప లేదు. అందుకే-

"ఆందోళికలందు నంతరచరులైన సవికృతాకృతుల పిశాచ జనులు
వరకరాళంబులై ప్రార్థింపఁ గముఁగోక వాయెత్తకుండు జీవచ్ఛవములు"

అని ప్రభుదురాత్ములను నిందించినాఁడు. అందుకే ఈ కృతి రచనా కాలము క్రీ. 1518-20 ప్రాంతములందై యుండునని తలఁచుచున్నాను. ఆ తరువాత నెప్పుడో పీఠికాభాగమును నూతనముగాఁ జేర్చి శ్రీరంగనాథున కర్పించియుండును. నృసింహకవికి జ్ఞానోదయమైన వెనుక తాళ్ళపాక వారి వలెనే...

'నరగుణాంకితమయ్యెనే సరసకృతియు
దూష్యమగు శుని దృతగత దుగ్ధమట్లు
హరిగుణాంకితమయ్యె నేనసదుకృతియు
హారసూత్రంబు గతి హృదయంగమంబు'

అనుకొనినాఁడు. కనుక ఉద్వృత్తితోఁ జెలఁగిన నృసింహకవియే తాళ్ళపాక నరసింగన్న కాఁగూడును.

6. కవికర్ణరసాయనమున యువనాశ్వుఁడు బిడ్డలకై పరితపించుచు "ఏలా బిడ్డలు లేని యీ బ్రతుకు గొడ్డేఱయ్యెఁ జింతింపఁగన్" అని చింతించినట్లు నృసింహకవి రచించినాఁడు. ఆఘట్టముననే "నందనుఁ జూడనానందించుచూడ్కుల కెవ్వియు నాలింప నేవమయ్యెఁ...బట్టి కౌఁగిటఁ జేర్పంగ బరఁగు మేని కితర మెవ్వియు సోకంగ నేవమయ్యె, విశ్వభూమీశుఁడగు యువనాశ్వపతికి *సుతుఁడు వెలియైన బ్రదుకేమి సొంపు దలఁప*" (1-86) అని పుత్రుని బడసి కోల్పోయిన వాని తెఱఁగున నృసింహకవి తన కంఠమునుగూడ గలిపి పుత్రులు లేని యువనాశ్వుని యా వేదనను వర్ణించెను. నృసింహకవికి సంతాన సౌభాగ్యము వెలియైనదేమో. తాళ్ళపాక నరసింగన్న స్థితియు నట్టిదే యని తలంతును. నరసింగన్న కిరువురు భార్యలుండుటయు, నాతనికి ముప్వురు తనయులు కలిగినట్లు తెలియవచ్చినను వారినిగూర్చిన వార్తలేమియు మనకుఁ దెలియరాకుండుటయుఁ, బైగా అన్నమా

చార్యుని కాలముననే పసిప్రాయముననున్న తమవారెవరో దగ్గరబంధువులు పోయినట్లుగా వర్ణితము లైన కీర్తనము లొకటి రెండు కానవచ్చుటయుఁ గారణముగా నాతనికి సంతానభాగ్య మాలస్యముగా కల్గినదనియుఁ గలిగిన సంతానముకూడ కొన్నియేండ్లపాటేని నిలువకపోయినారనియు తలఁపనగుచున్నది. తత్కారణముననే ఈతఁడు సంసార విషయమున విరక్తుఁడైనట్లున్నది. నరసింగన్నయే కవికర్ణ రసాయన కర్త యగు నృసింహకవియనుట కిదియు నొక యుపపత్తి కాఁదగును.

7. తొలుత కవికర్ణరసాయనకర్త రాజుల వెంటబడి తిరిగినను తుదకు పశ్చాత్తప్తుఁడై పరమార్థమును గుర్తించి శ్రీరంగమును చేరుకొని రంగనాథునకే కృతినంకితము గావించెను. తాళ్లపాక నరసింగన్నయు కామధేనువును మాని యెద్దును బిదుగఁబోయిన మాడ్కి పాలమురాజుల వెంబడితిరిగి బంధుగులకును తోడి సోదరులకును దూరుఁడయి కామితమును బడయఁజాలక విరక్తుఁడై పశ్చాత్తప్తుఁడైనట్లున్నాడు. అందుకే కావచ్చును, అంతవఱకును దలపోయకున్నను నరసింగన్న నిర్యాణానంతరము క్రీ. 1546లో చిన్నన్న తన పెదతండ్రిగారిని భక్తితో స్మరించినాడు. అప్పటికే నరసింగన్న వైరాగ్యమున వేఱొక తనువునెత్తియుండుటచేత వారి బాంధవ్యము మఱియొక తూగి చిగురుదొడగి యుండేనేమో!

వైష్ణవ మతప్రచారమే కవికర్ణరసాయన కర్తయొక్క లక్ష్యముగా గ్రంథమునుబట్టి కానవచ్చుచున్నది. తాళ్లపాకవారును అట్టి లక్ష్యశుద్ధికల్గినవారే.

8. కవి కర్ణరసాయనకర్త సంగీత నాట్యసాహిత్యము లందు ప్రౌఢి పరిజ్ఞానము కలవాఁడుగాఁ దోచుచున్నాఁడు. తాళ్లపాక నరసింగన్నయు "పాడఁజెప్పఁగ వర్ణపద్ధతి నీడు జోడులేఁడనఁ" బరగినవాడే!

9. కవికర్ణ రసాయనము క్రీ. 1515-20 ప్రాంతములందు రచితమనుకొంటిమి. రచననుబట్టి యప్పటికే నృసింహకవి వార్ధక్యము ననుభవించినట్లుగా గ్రంథమునందలి వృద్ధావ్య వైరాగ్య వర్ణనము

లనుబట్టియు నందు ప్రదర్శితమగు ప్రౌఢపరిపాకమునుబట్టియు నూహింప నగుచున్నది. గ్రంథరచనాకాలమున కాతనికి అరువది యేండ్లుండు నేమో! క్రీ. 1464 ప్రాంతములందు జన్మించిన తాళ్లపాక నరసింగ న్నయు నప్పటి కదే వయసు కలవాఁడగును.[1]

10. నృసింహకవి నాచన సోముని ఉత్తర హరివంశ రచన నధికముగా నభిమానించినట్లు కవికర్ణరసాయనమునుబట్టి తెలియు చున్నది. (చూ. 1-89, 8-27) తాళ్లపాక కవులు నట్లే. చిన్నన్న నాచనసోముని విశేషముగా ననుకరించినాఁడు.

పైనజూపిన యుపపత్తులన్నియు కవికర్ణ రసాయనకర్త తాళ్ల పాక నరసింగన్నయేకాఁదగు ననుటకు సహకరించుననియే తలఁతును. ఈయన్నిటితోఁబాటు అన్నమాచార్యాదుల రచనా రీతియు కవికర్ణ రసాయనమున గానవచ్చి యాతలఁపు సత్యమేమో అనిపింపఁజేయు చున్నది.

మఱియు నృసింహకవి తాళ్లపాక నరసింగన్నయే యగుచోఁ దమవంశమునేకాక పరమపావనుఁడగు తనతండ్రి పేరునుగూడ స్మరింప లేదేమి అను సందేహము సమంజసమే. దానికిది సమాధానము కావచ్చును.

---

1. కవికర్ణ రసాయనకర్త తాళ్లపాక నరసింగన్న కాఁడను నభి ప్రాయముతో శ్రీ చాగంటి శేషయ్యగారు 'కృష్ణరాయల కాలమునాటి కాతని వయసు 60—70 సం. లైయుండును. ఆ కాలమున నట్టి శృంగార ప్రబంధము నాతఁడు రచియించినట్లు దలంపనవకాశము లేదు' అనివ్రాసిరి. ఈవాదము సమంజసముకాజాలదు. ఇది శాంతరస ప్రధానమగు ప్రబంధము. శృంగారమును మించిన వైరాగ్యమునే కవియిందు ప్రదర్శించియున్నాఁడు. దానికేమి? ఆ వయసుననే ఆంధ్రకవితా పితామహుఁడు మనుచరిత్రమును వ్రాసియుండలేదో? వృద్ధుఁడు శృంగారమును జిత్రించుట సమంజసము కాకున్నచో యువకుఁడు వైరాగ్యమును బ్రదర్శించుట సమంజసమగునా ?

పరమపావనుఁడగు నన్నమాచార్యునంతటి వానికిఁ దనయుఁడై జన్మించి వారియాదర్శములకు భిన్నముగా తన కావ్యకన్యకను నరాంకితము చేయనుద్యమించి యుద్వృత్తితోఁ జెలరేగిన దోషమునకు తన వ్యక్తిత్వము నజ్ఞాతముగా నుంచుకొనుటయే తగిన ప్రాయశ్చిత్తమనుకొనినాఁడేమో![1].

ఏమైనను ప్రస్తుతమున కివియన్నియు నూహాలే ఈయూహాలకును, వా రభిన్నులని తలపోయుటకును వారి నామసామ్యమును సమకాలికతయు, రామకృష్ణుని చాటుపద్యమును, జనశ్రుతియుఁ గొంత ప్రాణముపోసినవి. భవిష్యత్కాలమున ప్రబల ప్రమాణమేదేని లభించినప్పుడే ఇందలి యాదార్థ్యమిదమిత్థముగా నిరూపింప వీలుకలుఁగును.

*కావ్య గౌరవము-వైష్ణవత* : కవికర్ణరసాయనమందలి ప్రధానేతి వృత్తము మాంధాతృచరిత్రము. భారతేతిహాసాదులందు ప్రసిద్ధమగు నీమాంధాత చరిత్రమునే[2] నృసింహకవి పరిగ్రహించి క్రొత్తకూర్పులతో మార్పులతో నష్టాదశ వర్ణనాదులతోఁ బెంచి పెద్దచేసి యాశ్వాసములలో రసవత్ప్రబంధముగా నిబంధించినాఁడు. ఇందలి యితి వృత్తము కేవలము ప్రఖ్యాతమో ఉత్పాద్యమో కాక మిశ్రరీతిని రసవంతముగాఁ గూర్పఁబడినది. ఇట్టి మిశ్రకావ్యమె కావ్యమై మెఱుఁగు

---

1...... వేరిచిన సుకవికృతిచే పేరెఱిగించుకొని జగతి బెంపగు టొప్పున్" అని యీతని మతము. సుకవి కృతిచేతనే ప్రఖ్యాతుఁడు కావలెనుగాని. వేరుచేత కృతికిఁ బేరుదెచ్చుకొనువాఁడు కాఁగూడదని భావించి నట్లున్నాఁడు. వాస్తవమునకు కవికర్ణరసాయనకృతివల్లనే కదా నృసింహకవికి ఘనత కలిగినది! ఈతని పీఠికా పద్యములన్నియు నిట్లే విశేషార్థ స్ఫోరకములుగ నున్నవి

2. ఈ మాంధాతృచరిత్రము మహాభారతారణ్యపర్వాంతర్గతమై సంగ్రహముగ నున్నది.

ఈ మాంధాతృప్రశంస మహాభారత శాంతిపర్వమునందును గొంత కలదు.

దెచ్చునని నృసింహకవియొక్క నిశ్చితాభిప్రాయము. అతఁ డిట్లని నాఁడు.[1]

> 'కావ్యముత్పాద్యమైన సత్కావ్యమింక
> ముక్త కావ్యంబ యేఁ బునరుక్తిఁ దెచ్చు
> గాన కవితాభిముఖుఁడైన కవివరునకు
> మిశ్రకావ్యంబె కావ్యమై మెఱుఁగుదెచ్చు' (1-10)

ఇట్టి మిశ్రకావ్యము నీకవికోకిల "లక్ష్యలక్షణసహా కావ్యనిర్వాహతగల్గు" నట్లుగా "పలుఫణితులలో" "కలకంఠ కలనచూపి" సహృదయుల నలరించినాఁడు ఏ రసము చెప్పఁబూనిన నారస మాలించువారి కదరించెడివిధమున నిర్వహించినాఁడు. గ్రంథారంభమున గవి ప్రతిజ్ఞ యిట్లున్నది.

> హృదయగతిం బురాతనకవీశ్వరు లేగని వీథిలేదు నేఁ
> డదమమటన్ రచించుకృతి తాత్త్వికులం గరఁగింపకుండ నే
> మదగజరాజము ల్చనిన మార్గములం గడు నింపు నింపవే
> మదగజరాజయానమదమంథరబంధురయానమానముల్.

అంతేకాదు; తదీయ కావ్య శృంగార వర్ణనాకర్ణనమున యతియైన విటుఁడగుననియు తద్గతవైరాగ్య వర్ణనాకర్ణనమున విటుఁడేని యతిగా మారిపోవుననియుఁ జెప్పికొనినాఁడు. ఈ ప్రతిజ్ఞలయందు కవి సర్వత్ర కృతకృత్యుఁడైనాఁడని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

సాకేతాధీశుఁడగు యువనాశ్వుఁడు మునిశాపము కారణముగా సంతానము లేనివాఁడయి వసిష్ఠు నాదేశమున నింద్రయాగము

---

1. ఈపద్యమున ప్రఖ్యాత ఉత్పాద్యకావ్యముల నవగణించి కవి మిశ్రకావ్యప్రాశస్త్యమును భావించినాఁడు. ఈ యర్థమున ముద్రిత పద్యమున "కావ్యముత్పాద్యమైన సత్కావ్యమింక" అని యుండుటకన్న "కావ్యముత్పాద్యమే నసత్కావ్యమింక" అని యుండుట సమంజసమనుకొందును. ఉత్పాద్యమేని-అసత్కావ్యము, ఉక్తకావ్యంబయేని పునరుక్తి-కనుక మిశ్రకావ్యమె కావ్యము - అని భావము కాఁదగును.

సేయును. యాగానంతరము మంత్రపూతమగు జలమును తానే తెలివిదప్పి దప్పికిఁ ద్రాగఁగా తత్ప్రభావమున యువనాశ్వున కొక కుమారుఁడు కల్గును. ఆ బాలుని నోట నమృతస్యందినియగు నిజకరాంగుష్ఠమునిడి పోషించి యింద్రుఁ డాతనికి "మాంధాత" యని నామకరణము గావించి యంతర్హితుఁడాయెను. కొంతకాలమునకు మాంధాత పట్టాభిషిక్తుఁడై ధర్మమార్గమున భూమిని పాలింపసాగెను. దిగ్విజయయాత్రలు గావించి స్వర్గమును సైతము ముట్టడించెను. పిదప రావణునితోఁ బోరి విజయమునంది, యింద్ర పూజితుఁడై నిజ నగరమునకు మరలివచ్చెను. "చిత్రస్వయంవరమున" గుంతలేశుని పుత్రియగు విమలాంగిని వరించి వివాహమాడి యభిమతసుఖము లనుభవించెను. ఇట్లు కొంతకాలము చన్నవెనుక వసిష్ఠాది మునులు మాంధాతను దర్శింపరాఁగా వారివలన నాతఁడు తనపూర్వజన్మవృత్తాంతము నెఱిఁగికొని, యుత్తరోత్తర జన్మములం దంతకన్న నతిశయమగు పెంపుబడయుటకుఁ దగిన యుపాయము నుపదేశింపుఁ డని వారిని ప్రార్థించెను. అప్పుడు వారాతనికి అధ్యాత్మవిద్యను సమగ్రముగ నుపదేశించిరి. మాంధాత తదుపదేశ ప్రభావమున దపశ్చర్యకారంభించెను. ఇంద్రుఁ డాతని తపస్సునకు వెఱచి విఘ్నము కల్పించుటకై రంభాద్యప్సరసలనుబంపును. కాని వారందరును తత్తపః ప్రభావమునకు లొంగి శిష్యులై పోవుదురు. బృహస్పతి యుపదేశింపఁగా నింద్రుఁ డంతటితో నాయత్నమునుండి విరమించుకొని వైకుంఠమునకేగి శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహమును దర్శించిస్తుతించును. నారాయణుఁ డింద్రుని వెఱపుడిపి, "మత్పదభక్తుండైన యతని వలన నొరులకెవ్వరికిం గీడువొంద దట్లగుట నిశ్శంక మరలి చనుం" డని చెప్పి పంపెను. అపిదప అతని తపమును వారించుటకై నారాయణుఁడే ప్రత్యక్షమై మాంధాత ననుగ్రహించెను. భక్తియోగ నిష్ఠుండై మాంధాత స్వామియనుగ్రహమున బహుకాలము రాజ్యమును బాలించుచుండెను. ఇదియే ఈ ప్రబంధమునందలి కథాసారము. ఈకథను దీర్చుటలో నృసింహకవి రసోచితములగు ప్రబంధ వర్ణనములనన్నిటిని సందర్భశుద్ధితో ప్రవేశపెట్టి నిజరచనా వైశిష్ట్యమును బ్రదర్శించెను.

తొలి నాలుగు ఆశ్వాసములలోను మాంధాత చరిత్రమును జెప్పి ముగించి తుదరెండు ఆశ్వాసములందును సందర్భము గల్గించుకొని కవి వైష్ణవ మతతత్త్వమును సమగ్రముగ ప్రతిపాదించెను.

*రసపోషణము* : నృసింహకవియే చెప్పుకొనిన ట్లీప్రబంధము సర్వరసోత్కృష్టమైనట్టిది. కవి యిందు విమలాంగీ మాంధాతల పరిణయ ఘట్టమున శృంగారమును సమగ్రముగఁ బోషించెను. పరిణయమునకుఁ బూర్వము చిత్రపటమును జూచి మాంధాత విమలాంగిని వలచి తల పోయుటలో నయోగశృంగారమును చక్కగా చిత్రించెను. చూ.

తమకమునాఁగి ముచ్చటకఁదార్చి నెపంబున సోఁకి హస్తసం
గమమున కియ్యకొల్పు పులకంబులు మైనొదవించి వంచన
క్రమముల నొయ్యఁబయ్యెదయుఁ గంపమున న్దొలఁగింపఁబూనికిన్
సమకొని సిగ్గు నీయను జార్చి యెద న్సతికూర్చు టెన్నఁడో...(8-64)

ఇట్లే విమలాంగి విప్రయోగమును వర్ణించుపట్టున కవి దశదశా నిరూపణమును చక్కగా గావించినాఁడు. ఒక్క యుదాహరణమును గాంచుడు.

ఉదయమెకాని యస్తగతి నొందక తీవ్రగతిన్వెలుంగున
మ్మదనభుజ ప్రతాపరవి మండఁగ నెప్పుడు మోడ్పెఱుంగ మి
న్నిదురకుఁబాసి యచ్చెలువనేత్రమహోత్పలముల్లయించె నె
ల్లిదమున రాత్రులెల్ల ముకుళించు రవిస్ఫురదంబుజంబులన్ (8-86)

ఇందు జాగరమను మన్మథావస్థను కవి రమణీయముగా ప్రదర్శించెను. అట్టి దశదశా నిరూపణము విషయమున నీకవి ప్రభావతీ ప్రద్యుమ్నకారునకు మార్గదర్శకుఁడై యుండెనని చెప్పవచ్చును. విప్రలంభ శృంగారమునేకాక సంభోగశృంగారమునుగూడ నీకవి పరి పుష్టముగఁ బోషించినాఁడు. నవోఢా సంగమ వర్ణన మను విభాగమున నృసింహకవి విమలాంగీ మాంధాతల ప్రణయమును వర్ణించిన ఘట్ట మెల్ల నిట్టి శృంగారమున కుదాహరణమె.

వెడలి పోఁదలఁచుచో నొడిసి కేల్వట్టినఁ
దిరిగి నెచ్చెలిఁ జూచు దీనదృష్టి
శయ్యకు దిగుచుచోఁ జనుదేక బిగ్గరఁ
జరణాంబుజము ద్రొక్కు చండితనము
... ... ... ... ... ... ...
మాటలాడక చేకొన్న మౌనముద్ర
యైన నివి పంచబాణుని కైదుతూపు
లయ్యెఁ బతిడెందమునఁ గాఁడునట్లు తేయ
నంగనామణి సరిక్రొత్త సంగమమున ... (8-212)

నెమ్మోవి దాఁచెడి నెపమునఁ జెక్కులు
చుంబింప నెరమిచ్చు సుదతినేర్పుఁ
గినిసి చెక్కులు దాఁచికొనియెడి నెపమున
మోము మోమునఁ గూర్చు ముదిత వెరవు
సడలెడి తన నీవి సవరించు నెపమునఁ
గౌఁగిట నొదవించు కాంతవలపుఁ
గరములఁ జనుదోయి గప్పు నెపంబున
నీవిక సందిచ్చు నెలఁత మతము
దొడిఁబడక గానఁబడనీక యొడలు నులియు
నెపము మైఁగౌఁగిట కెదుర్చు నీరజాక్షి
యుపమయును భూమివల్లభునుల్లమునకు
గ్రొత్తచవిగూర్చె మఱి వేఱె కొన్నినాళ్లు ... (8-226)

ఇట్టి మనోజ్ఞమగు వర్ణనమును జేయు సామర్థ్యమున్నది గనుకనే "యతి విటుఁడు గాకపోవుటె ట్లస్మదీయ కావ్య శృంగార వర్ణనాకర్ణనమున" అని ధైర్యముగా కవి చెప్పుకొనగల్గినాఁడు. రస విషయమును విభావానుభావాది క్రమమున బోషించుటయేకాదు ఆయారసాధిదైవతములను గూడ పలుతావుల కవి చమత్కారముగ స్మరించినాఁడు. శృంగార నాయకుఁడగు మాంధాతృతమామండలేశ్వరుని వర్ణించుచు 'ఆతండొక రాజమాత్రుఁడటె సాక్షా ద్విష్ణుఁడూహించినన్' (8-60) అని తద్రసాధిదైవతమును నిరూపించినాఁడు. ఇట్లే

యీ కవి సర్వరసములను సమగ్రముగ బోషించెను. రాముఁడు మాంధాత మీదికి దండెత్తునప్పుడు వీరమును, మధుపాన క్రీడావర్ణనమున హాస్యమును, రావణుని దూతపలికిన పలుకులకుఁ గినిసి మాంధాత చెప్పిన సమాధానమునందు రౌద్రమును, సమరరంగ వర్ణనముగల వచనమున బీభత్సమును, రావణరణావని భూతపిశాచ బాలికలు చేసిన చెయ్దములందు భయానకమును, యువనాశ్వుని గర్భముగలించుకొని మాంధాత జన్మించిన ఘట్టమునందును, ఇంద్రుడా బాలునినోట వ్రేలిడి యమృతమును చిందించిన పట్టునందును అద్భుతమును, పతిభిక్షవేడి యువనాశ్వుని రాణివాసము విలపించిన సన్నివేశమునందును, సంతానాభావముచేత యువనాశ్వుఁడు చింతించిన వేళయందును కరుణమును, కావ్యాంతమున మాంధాత తపస్సునకుఁ బూనినది మొదలుకొని నారాయణానుగ్రహమును బడసి తద్భక్తి ననుభవించు వఱకునుగల ఘట్టమందు శాంతమును నృసింహకవి సమర్థముగ బోషించెను.

కవికర్ణరసాయమున అంగిరసము శాంతము. దానికీకవి తన పాండిత్యమును, ప్రతిభను తోడుచేసికొని వీరశృంగారములను అంగములుగా మలచుకొనెను. 'శాన్తః సర్వరసోత్కృష్టో న మైత్రీ న విరోధతా' అన్న అమృతానందయోగిమతమునిట ననుసంధించుకొనఁ దగును ఆ రెండేయననేల శాంతమునకుఁ దక్కిన యెన్మిదింటిని గూడ నీకవి అంగభూతములుగ నొనరించుకొనె నన్నను అతిశయోక్తి లేదు. కొందఱు లాక్షణికులు ఉత్సాహమునే శాంతమునకు స్థాయీ భావముగా బేర్కొనియున్నారు. ఈ కావ్యమున తొలుత మాంధాతృజనపాలుని ప్రవృత్తి ధర్మోత్సాహము వీరముగను, పిదప నివృత్తి ధర్మోత్సాహము శాంతముగను చిత్రితమై పోషింపఁబడియున్నది. ఇట్లు ప్రకృతిరసమగు శాంతము నంగిరసముగా పోషించు విషయమున నృసింహకవి యాంధ్ర కవితా పితామహుని కన్న నెక్కుడు సామర్థ్యము ప్రదర్శించినాఁడని నిస్సంశయముగా చెప్పవచ్చును.

ఈ యంశమును ముగించి కవికర్ణరసాయనమునందు ప్రతిపాదింపఁబడిన వైష్ణవధర్మమును గూర్చి ముచ్చటించులోపున ఆ కావ్యము

నందలి కవితాచమత్కారము నెరుగుట కొకటి రెండు పద్యములను మాత్రముదాహరింతును.

మాంధాత బాల్యమును కవి చమత్కారమునగ దశావతారములతోఁ బోల్చి వర్ణించెను. అతని ప్రౌఢ భావనకు వైష్ణ వాభిమానమునకు నిది యుదాహరణము.

'కనుఱెప్ప విడ నెరుంగని చూడ్కిచూచుచు
జిగివీఁపుదోఁప బోరగిలఁబడుచుఁ
గరజానువులఁ జతుశ్చరణుఁడై తిరుగుచు
శిశునిదర్శిత దృఢస్నేహుఁడగుచు

... ... ...

వసననిరపేక్ష నిర్భ్రాంతప్రవర్తియగుచు
హయసమారోహణంబు సేయంగఁ గలిగి
రాసుతుఁడు దన శైశవ క్రమదశావ
తారములచేతఁబూరుషోత్తమతఁ దెలిపె ... (1-55)

రావణుఁడు మాంధాతపై దాడివెడలునప్పుడు మ్రోగిన ప్రస్థాన భేరీ నాదమును గంభీరమగు మహాస్రగ్ధరా వృత్తమున బలగర్జా నాదవేద ప్రణవరవణమై ... పలభుగ్భర్త ప్రయాణ ప్రతిహాట పటహ ప్రౌఢరావం బెలర్చెన్ (2-144) అని వర్ణించెను. ఇందు భావన కనుకూలమగు ఫణితిఁ ఛందస్సుఁ లెన్నుకొనుటలో కవికిఁగల నైపుణ్యము ప్రదర్శితమగుచున్నది. నృసింహకవి తన కవితను జిగితో నల్లుకొని పోవును. చూడుఁడు.

హరికరిఁ గరిహరి హరికరు
లరద, మరదము కరిహరులు, హరికరిరథముల్
పురుషునిఁ బురుషుఁడు రథకరి
హరులంగాచికొనఁ బన్నిరధిపతిపీటన్ ... (2-149)

ఇంతేకాదు అతని కవితలో ప్రతిపలుకు నిల్లే చమత్కారము నొలకబోయుచుండును. సాభిప్రాయపదప్రయోగమున నాతఁడు కడు మేటి.

"ముద్దియమొగఁగల్గుమోమోట మఱచితే, కాఱించెదేల రాకా శశాంక
కోమలాంగికి నట్టుగు త్రికవై యుండి, కలకంఠమా కనికరము వలదె...
కాలమెల్ల పగలుగావచ్చినది మాకుఁ గొమ్మ నేచఁ దగదు కోకయుగమ"
(8.120)

ఈ పద్యమును దిలకింపుఁడు.

ప్రౌఢవుగాన నీపలుకు పోలదు గా దనరాదుగాకయీ
పీడని తాపవేదనల వేగెడు చెన్నటిమేఁ ప్రాణముల్
గూడి వసింప నోర్వ విదిగోచనుచున్నవి యేల ప్రీడయుం
గ్రీడయు నాకు హారమును గిరముఁ జాతము గీతముం జెలీ'..(8-118)

నిజమే. ఆ ప్రౌఢుని వాక్కును కాదనుటెట్లు ? నిందార్థమున వచ్చు గిగీలను గూడనెంత సాభిప్రాయముగ చిత్రించినాఁడు !

వైష్ణవత : కావ్యారంభముననే నృసింహాకవి శ్రీరంగక్షేత్రావిర్భావకథను పురాణోక్తరీతిని వర్ణించెను. చతుర్ముఖుని కోరిక దీర్పుటకై కరుణామయుఁడగు పరమపురుషుఁడు శ్రీరంగ దివ్య విమానగర్భంబున నర్చామూర్తియై వెలసి బ్రహ్మపురియందుండ సాగెను. పిదప 'సాకేత నగరి నైక్ష్వాకులచే మహాయుగ చతుష్కము పూజనొంది పిదపఁ గావేరిఁ జంద్రపుష్కరిణీ తటంబున సప్తమన్వంతరస్థాయినగుదు' నని బ్రహ్మతో రంగధాముఁడు చెప్పినపగిది, నిక్ష్వాకు కులజుల పూజలనుగాంచి, శ్రీరామచంద్రుని యనుగ్రహమున విభీషణునకు జిక్కి, అతడు 'ఇక్ష్వాకుకులదైవతమును' లంకకుఁ గొంపోవుచుండగా మార్గమున చంద్రపుష్కరిణీ సరస్తటమునందు నెలకొని పోయి మర్త్యలోకము ననుగ్రహించెను 'అర్చాకృతులకెల్ల నాద్యమిదియ యర్థింపు మీ స్వయంవ్యక్తవిగ్రహు నన్ను' అని శ్రీరంగధాముఁడే చెప్పుకొని యున్నాడు. అట్లు పవిత్రమైనదే ఆ శ్రీరంగ క్షేత్రము.

నృసింహాకవి కవికర్ణరసాయనమున నీక్షేత్రమాహాత్మ్యము నిట్లుగ్గడించుటయే కాదు గ్రంథాంతమున 5,6 ఆశ్వాసములందు విశిష్టాద్వైత తత్త్వంబును, పాంచరాత్రాగమ వైశిష్ట్యమును విపులముగా ప్రదర్శించినాఁడు.

చతుర్విధఫలంబులకు భగవత్సేవాచరణం బొకండు సాధనంబని వసిష్ఠుఁడానతీయఁగా మాంధాత ఆమహర్షి వలన తన సందేహములను దీర్చుకొనుటకై తత్త్వరహస్యము నెరుఁగఁగోరి కర్మస్వరూపమును వివరింపఁ బ్రార్థించును. అంతట వసిష్ఠమహర్షి యాతని జిజ్ఞాసకును ప్రజ్ఞావిశేషంబునకునుఁ దనిసి కర్మస్వరూపమును, ఉపాస్యబ్రహ్మ స్వరూపమును, వేదవేదాంత పురాణస్వరూపమును, ఉపాసక స్వరూపమును, విరుద్ధశ్రుతి సామరస్య స్వరూపమును, భగవద్విగ్రహస్వరూపమును, అవతార రహస్య స్వరూపమును, ప్రసన్న స్వరూపమును. భక్తియోగ స్వరూపమును, భజనీయ భగవత్స్వరూపమును, త్యజనీయ సంసృతి స్వరూపమును, జీవజన్మ క్రమ స్వరూపమును, మోక్షస్వరూపమును — క్రమమున మాంధాత కుపదేశించెను. ఈపట్టున నృసింహకవి విశిష్టాద్వైతతత్త్వరహస్యమునంతను సంగ్రహముగా వసిష్ఠునిముఖమున జెప్పించెను.

తొలుత వసిష్ఠుడు లౌకిక వైదిక కర్మలలో నిత్యనైమిత్తిక కామ్యము లను విభాగములను గూర్చియుఁ బ్రసంగించెను కాని మాంధాత "వివిధ దేవతారాధనాకార కర్మవితతియందొకండు నిఖిలఫలమనేకఫలము బహుకర్మములకిచ్చుననుట పొసగకున్న" దని సందేహింపఁగా నారాధన స్వరూపమునుగూర్చికూడ విననిదే ఆ సందేహము తీరదని చెప్పి వసిష్ఠుడు అయా విషయములనుగూర్చి వివరించెను. "నిఖిలకర్మసమారాధనీయుఁడతఁడ యఖిలవివిధ ఫలప్రదాయకుఁడతండ యఖిల దేవతలకు నంతరాత్ముఁడతఁడ" అని ఉపాస్యబ్రహ్మస్వరూపమును వివరించి "దేవతలెంద ఱందఱుఁ దదీయ శరీరము లట్లగాన దత్సేవ తదర్చనంబయని సేవకు లాత్మనెఱుంగ" వలయునని చెప్పెను. "అట్లు అఖిలాత్మలకు వాస్తవాభిగమ్యుఁడు ముముక్షువులకాశ్రయము ముక్తులకుఁ బ్రాప్య మఖిలప్రకారనిరతిశయభోగ్యంబు వివిధ వేదాంతైక వేద్యతముఁడు-నిఖిల విషయంబులకుఁ బ్రత్యనీకమగుట, సకలకళ్యాణ గుణగణాస్పదుఁడునగుట లక్షిత స్వాన్యవస్తువిలక్షణుండు విభుఁడు పురుషోత్తముఁడు రమావిభుఁడు వెలుగు" (5-42) అని వివరించెను. శ్రీవల్లభుఁడె సూక్ష్మచిదచిద్విశిష్టతఁదాన యీ జగదుపాదానమయ్యె,

ఆత్మసంకల్పవిశిష్టతఁ దాన జగన్నిమిత్తంబులయ్యెఁ గాలాదులకు సహకారుల కాత్మయై తా జగత్సహకారితయు వహించె - మహదాది కారణాత్మతఁ దాన వెండియుఁ దత్కారణత్రయము నయ్యె - సూక్ష్మ చిదచిద్విశిష్టవస్తువు నిజేచ్ఛానామరూపవిభాగసటనమునకు స్థూలచిద చిద్విశిష్టమై తోఁచుఁగాన గార్యవస్తువు దానె యక్కైటభారి' అనిచెప్పి మఱియు నిట్లు వివరించెను.

"ఆత్మసంకల్పమహిమచే నవ్విభుండు
స్వాపృథక్సిద్ధచిదచిద్ద్వయంబునందు
జూపుఁ బరిణామ మాత్మస్వరూపమునకుఁ
గలుగకుండుటఁ దానిర్వికారుఁ డగును.

నిర్వికారమయ్యు నిజవపుః పరిణామ
భాజియైన యట్టి బ్రహ్మమునకు
గలుగు ప్రాగవస్థ కారణభావంబు
భావ్యవస్థ కార్యభావమయ్యె -

ప్రకృతి పురుషులు తదీయులు
ప్రకృతి పురుష మూలమీ ప్రపంచంబగుటన్
బ్రకటమతిఁ జూడఁ దదితర
సకలముఁ దజ్జనిత మింత సత్యము సుమ్మీ

చేతనము శేష మతనికిఁ
జేతన శేషంబు మఱి యచేతనమగుటన్
జేతన కులమున కఖిలా
చేతనముల కతఁడ సర్వశేషి తలంపన్ ..." (4-45-49)

"అతఁడ దేహియగుఁగాని జగము దా దేహమయ్యు నతని కుప కారకంబుగా" దనియు వేర్కొనెను.

ఈశ్వరులకెల్ల నీశుఁడొక్కఁడే విష్ణువని గుర్తించిననాడె తత్ప్రియుఁడు కాగల్గుననియు దానికిట్టి తత్త్వజ్ఞాన మవసరమనియుఁ దెల్పి వసిష్ఠుఁ డాపిదప వేదవేదాంతస్వరూపమును సుదీర్ఘముగ నిరూపించెను.

32)

ఆ పిదప నారురుతువు, ఆరూఢుఁడు నని యిరుతెఱఁగులఁ బరగు నుపాసకునిగూర్చి తెలిపి వారికిని శ్రీవిభుఁడుక్తరూపములనె సేవ్యుఁడగునని వివరించెను.

'వసథి సర్వంకషం బయ్యె వలయువనికి
దేవులనకాని చేరరాని రీతి నధిప
విశ్వరూపకుఁడయ్యె శ్రీ విభుఁడు నుక్త
రూపముల సేవ్యుఁడగు నారురుతువులకు' (77)

పిదప విరుద్ధశ్రుతి విషయములకు వసిష్ఠుఁ డిట్లు సామరస్యమును బోధించెను. చిదచిద్విశిష్టతచెప్పిన శ్రుతి దాన తిరుగ బ్రహ్మం బద్వితీయమనుట-సదృశ మొకఁడులేమిఁ జాటుటకే. విజ్ఞాతృభావంబు వెలయించి శ్రుతి దాన మఱియు బ్రహ్మంబు చిన్మాత్రమనుట – జడభాగహీన మనుటకు. శుభ గుణయోగంబు చూపిన శ్రుతి దాన మగుడఁ బరబ్రహ్మ మగుణమనుట-హేయమైన గుణాలు గలుగదనుటకు. ఇట్లే దివ్యవిగ్రహాయుక్తిఁ దెలిపిన శ్రుతి దాన యప్పటియును బ్రహ్మ మతను వనుట-కర్మకార్యదేహంబు లేదనుటకు. కనుకనే అంతరాత్మ "సర్వాచేతన చేతన సర్వావసరానుభూత సర్వావస్థా సర్వప్రవృత్తి సత్తానిర్వాహక" మనుట.

అట్టి భగవద్విగ్రహాస్వరూప మెట్టిదనగా-

'పంచోపనిషదుక్తపరమేష్ఠి ముఖశుద్ధ
సత్వసంశ్రయ పంచశక్తి మయము
నిత్య దివ్యనిసర్గ నిస్తులాద్భుతయౌవ
నాదికల్యాణ గుణాస్పదంబు

... ... ...

స్వేతర సమస్త వైరాగ్య హేతుభూత
మఖిల యోగిమనః ప్రథమావలంబ
మాశ్రితార్థంబు లక్ష్మి సమాశ్రితంబు
విభునకైచ్ఛికమై కల్గు విగ్రహంబు (5-82)

శ్రీదయితుండుదాల్చు మణి జీవుఁడు లక్ష్మి ప్రధానమంత్రు కౌమోదకి బుద్ధి శార్ఙ్గము సముజ్జ్వల శంఖము లింద్రియాది భూ

తాదులు చక్ర ముల్లము శరాదిక వర్గము లై జయంతి సో
త్పాదకభూత పంక్తి యని వైకృతవిద్యయు నయ్యవిద్యయున్'...(88)

'ఏతాదృగ్విధ విగ్రహ విశిష్టవేషంబునం బరవ్యూహవిభవాన్తర్యామి రూపంబులనం బరమపురుషునకుం బంచప్రకారంబులు గలవు' అని వసిష్ఠుడు వానినిగూర్చి విశదీకరించెను. "నిత్యముక్తానుభవార్థంబుగా నిత్యేచ్ఛానుగృహీతంబై న నిత్యవిగ్రహంబునం బరమ పదంబునం బరవాసుదేవాభిధానంబున వెలుగొందు ప్రధాన ప్రకారంబు" పర రూపము. "జగదుత్పత్తి స్థితి ప్రళయార్థంబు నుపాసకానుగ్రహార్థంబును నుక్తగుణద్వయద్వయాభివ్యక్తిలక్షణ లక్షితంబులై నిజేచ్ఛావశంబునం గైకొనిన సంకర్షణప్రద్యుమ్నానిరుద్ధ వాసుదేవ భావంబులగు చతుర్విధ భాగ విశేషంబులు" వ్యూహంబు లనంబడును. ఇవి కాక "కేశవాది మూర్త్యంతర గ్రహణరూపంబులై న యవాంతర వ్యూహంబులు వివిధంబులు." ఇట్టి వ్యూహ విశేషంబులు "దుష్టనిగ్రహ శిష్ట ప్రతిపాలనార్థంబుగాఁ దివ్యజన్మనుష్య విజాతీయతాంగీకారంబునం జూపు నావిర్భావంబు" విభవం బనఁబడును. ఈ విభవము గౌణము, ముఖ్యము అని ద్వివిధము. "కర్మవశ్యజీవాధిష్ఠాన ద్వారంబునం దాత్కాలిక కార్యార్థంబుగాఁ జూపుగుణావిర్భావంబు గౌణంబు." మఱి "దివ్య విగ్రహంబుతోడన చూపు నావిర్భావంబు" ముఖ్యము. ఇఁక నంతర్యామియన నుపాసనాసిద్ధికై యుపాసకాంతరంగంబులకు విషయం బయ్యెడు నుపాస్యవిగ్రహ విశేషంబు. మఱి యర్చావతారంబనం బరవ్యూహాది సమస్త ప్రశస్తలక్షణ పరిపూర్ణంబై దేశకాలస్వభావవిప్రకర్షంబు లేక-జగజ్జనోజ్జీవనార్థంబుగా మాంసనయనంబులకు ననుభావ్యంబై న అవతార విశేషంబు. ఈ యర్చారూపము స్వయంవ్యక్తము, దైవము, సైద్ధము, మానుషము అని నాలుగు విధములు. ఇట్లు పరమపురుషుని పంచప్రకారములను వర్ణించి "శ్రీవరుఁ డర్చాగతుండ సేవ్యుం"డని వసిష్ఠుఁడనెను. ఏలన—

దారుశిలాదిభావమున దైవముల న్నిరసించి తామసుల్
కోరుదు రెంతచేరువయొకో తమ కాత్మవివేకపాకముల్
వారిధరంబుల న్విడిచివచ్చిన చాతకధూర్తు లంబుధిన్
దారుగొనంగ శక్తులె సుధామధురోదకపానసౌఖ్యముల్ ? (5-95)

కనుక సర్వాంతర్యామూర్తులను సేవించుటయే మార్గము. "తత్సేవయు శరణాగతుండై" కావింపవలెను. 'కృపాశక్తిసంపన్నుండైన సమర్థునియందు నుపాయాంతర నివృత్తిపూర్వకంబుగాఁ జేయు భర సమర్పణంబు శరణాగతిత్వం' బనంబడును. ఆ శరణ్యత్వంబు భగవంతు నందు స్వాభావికంబును, నిరతిశయంబును నై యతని యందుం దదితర సమస్తపురుషులకు శరణాగతత్వంబు స్వరూపోచితత్వంబును నిరతిశయ ప్రయోజనార్థంబునగు. కావున యథార్థజ్ఞానంబున నిశ్చితంబుగా నెఱింగిన సాత్త్వికుం డభిమతార్థసిద్ధికి నితరుల నొల్లక భగవంతు శరణంబుసొచ్చి తదారాధనంబు సేయవలయును. ఇట్టి సాత్త్వికుఁడు మిశ్రసత్వనిష్ఠుండు శుద్ధసత్వనిష్ఠుండు నని యిరు తెరగులు. శుద్ధ సాత్వికుండు 'అభిమత భగవత్ప్రాప్తికి గర్మజ్ఞానాను గృహీతంబైన భక్తియోగంబుచే భగవదనుగ్రహంబు వడయఁగోరి తాదృగ్విధ భక్తినిష్పత్తికై తదంగంబుగా శరణంబుచొచ్చునతండై' అంగ ప్రతిపత్తిపరుండును, నుక్తభక్తియోగనిష్పాదనఁబునయం దశక్తుఁడును, విలంబాసహిష్ణువు నై యవ్యవధానంబున భగవదనుగ్రహంబువడయుటకై ప్రపత్తిసేయునతఁడై' స్వతంత్ర ప్రపత్తినిష్ఠుండును అని యిరుతెరగులఁ బరగుచుండును. ఈ విధమున వసిష్ఠుఁడు ప్రపన్న స్వరూపమును నిరూపించి పిదప భక్తియోగమునుగూర్చి కొంత ప్రసంగించెను. పైన వివరించిన తత్వమునంతను తుదకొక్క పద్యమున నిట్లు వివరించెను.

'జ్ఞానకర్మంబు లాత్మదర్శనము కొఱకు
నాత్మదృష్టియు భక్తి సంప్రాప్తికొఱకు
భక్తి భగవత్పదాప్తికై పరఁగు నిందు
లేదొక విపర్యయ సముచ్చయాదిశంక' ... (౫-౯౬)

వస్తువివేకంబులేక విషయ విరక్తియు భగవద్భక్తియుం బొడమ వట్లగుట భజనీయభగవత్స్వరూప నిరూపణంబుతో పాటు త్యాజనీయ సంసృతిస్వరూపంబుకూడ నెఱుఁగవలెనని చెప్పి వసిష్ఠుఁడు జీవ జన్మక్రమమును కొంత విపులముగానే మాంధాతకు బోధించెను. ఈ ఘట్టమును చిత్రించుటలో నృసింహకవి వైరాగ్యభావములను బహు సమర్థముగఁ బోధించెను. జన్మక్రమమునందలి రోతను, వార్ధక దుఃఖ

ములను, నారకయాతనను కనులగట్టునట్లు చిత్రించెను. విరక్తిభావము నెట్లు చిత్రించెనో తిలకింపుఁడు.

చన్నులగాక పసిండి కుండలట వక్షశ్చర్మదుర్మాంసముల్
కన్నులగ్రొవ్విరి దమ్మిరేకులఁట వెల్లడ్డూషికాగోళముల్
వెన్ను లొసంగయనంటి యాకులట సంపీతాస్థిపుంజంబు లి
యన్నిల్సాఖ్యముగాఁ దలంచు జను లాహా యెంతమూఢాత్ములో
(5-125)

"విటుడు యతికాకపోరాదు" అని నృసింహకవి తన వర్ణన శక్తిని గూర్చి చెప్పుకొనుటలో నాశ్చర్యమేమున్నది.

ఇంతేకాదు. కామక్రోధాదులనుగూడ జంపుకొనవలెనని వసిష్ఠుఁ డుద్బోధించెను. ఇట్లు త్యజనీయ సంసృతి సాగరము నుత్తరించి భక్తి పథమున బయనించినచో వ్యక్తిమోక్షమును బడయ గల్గునని యతఁ డుపదేశించెను. "తనువుఁ దన్నుగాఁగఁ దలఁచుట తను భోగ్యవిషయ మాత్మభోగ్య విషయ మనుట" - యీ యిరు తెలుఁగు భ్రాంతియే అవిద్యామహీజమునకు బీజమని వివరించి, మాంధాత కాతఁ డష్టాక్షరీ మంత్రముపదేశించి చనెను. తన్మూలమున నాతఁడు పరమేశ్వరాను గ్రహమునకుఁ బాత్రుఁడాయెను. కావ్యాంతమున నృసింహకవి మాంధాత ముఖమున నిట్లు చెప్పించెను.

ఉల్లము చల్లనయ్యె మొదలూడె మనోరథముల్ జగంబుపై
నొల్లమి పుట్టె చేరుగడ నొందితి నీ శుభదివ్య విగ్రహో
త్ఫుల్లసనావలోకనసుఖోదధిలోపల నోలలాడుచుం
దొల్లిటివాఁడఁగాని గతిఁ దోయరుహేక్షణ సంతసించెదన్...(6-211)

ఇట్లు పాంచరాత్రాగమానుసారము తత్త్వవిషయమును ప్రతిపాదించుటయేకాక శ్రీవైకుంఠమును శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహమును గూడ తదనుసారమే చిత్రించినాఁడు కవి. చూడుఁడు.

'రూపింపఁబడు నీ స్వరూప మిట్టిదిగదా
జ్ఞానంబు నీకుఁ బ్రధానగుణము
పరమేశ! నీ జగత్ప్రకృతి భావంబెద్ది
యది శక్తి నీకు రెండవగుణంబు

పేర్మితో స్వాతంత్ర్య బృంహిత కర్తృత్వ
    మైశ్వర్యమనఁగ మూఁడవ గుణంబు
సకల ప్రపంచంబు సతతంబుఁ జేయుచో
    నలయమి బలము నాలవ గుణంబు
జగదుపాదానమయ్యు నిశ్చలత వికృతి
నందమియ వీర్య మనఁగ నేనవగుణంబు
కార్యకరణంబు నెడ సహకారి నొకటి
నభిలషింపమి తేజ మాఱవ గుణంబు (6-177)

ఇట్లు గుణవర్ణనముతోఁ బాటు శ్రీనారాయణుని దివ్యమంగళ విగ్రహమునుగూడ నృసింహకవి తనివిదీర వర్ణించికొనినాఁడు. స్తుతి రూపమున నిందున్న దండకము (6-183) ముక్తపదగ్రస్తాలంకార భూషితమై, తత్త్వప్రతిపాదకమై మృదుమధురముగనున్నది. 'తృష్ణాపరుండైన తెరువరి తియ్యని మున్నీటిసలిలంబు లెన్ని గ్రోలు-నట్టిదయవో యనంతకళ్యాణగుణసమృద్ధుఁడగు నిన్ను ననుఁబోటి యెంత పొగడు నెంతమాత్రముఁ బొగడుటకేదియొయుక? యొయుక నేఁడిఁకఁ గలుగునే?యీశ్వరేశ' అని కవి పరమపురుషుని మహిమాతిశయమును తన యల్పజ్ఞత్వమును చక్కగా పోల్చుకొని చెప్పినాఁడు. నిజమే. కాని ఆయత్నమున కవి కృతకృత్యుఁడైనాఁడనియే చెప్పవలెను.

సర్వలక్షణ లక్షితమైన యీ రసవత్ప్రబంధము సర్వవిధముల కవికర్ణరసాయనమే యనఁదగును. ఇదియొక విశిష్ట వైష్ణవ ప్రబంధము.

## రేవణూరి వేంకటాచార్యుఁడు

ఈ కవీశ్వరుని కృతు లొకటిరెండు తెలియవచ్చినవి. వానిలో తొలిది "శ్రీపాదరేణుప్రభావ" మను నాలుగు ఉల్లాసములు గల యొకలఘుకృతి—[1] తరువాత ప్రసిద్ధమైనది "శకుంతలా పరిణయ"[2]

1. ఈ కృతిని క్రి. 1955 లో తి. తి. దేవస్థానమువారు ముద్రించివారు. పరిష్కర్త శ్రీ వంగనామాల బాలకృష్ణమూర్తిగారు.

2. ఈ ప్రబంధ మింకను ముద్రణ భాగ్యమును బడయలేదు.

మను మూఁడాశ్వాసముల శృంగార ప్రబంధము. శ్రీపాదరేణు ప్రభావమునందలి ఉల్లాసాంతగద్యలో "ఇది శ్రీసంకీర్తనాచార్య దౌహిత్ర రేవణూరి తిరుమల కొండయాచార్యసుధీవర్య సుపుత్ర వేంకటాచార్య ప్రణీతంబైన శ్రీపాదరేణు ప్రభావంబను నిస్సహాయ కావ్యంబునందు" అని గలదు. అందువలన నీతఁడు తాళ్లపాక అన్నమాచార్యుని కూతురి కొడుకనియు, తిరుమల కొండయార్యుఁ డితని తండ్రియనియు భావింపఁబడుచున్నది. తన వంశమువారిని గూర్చి యాతఁడే తరువాత శకుంతలా పరిణయమునం దిట్లు చెప్పుకొనినాఁడు.

"శ్రీవత్సాన్వయు రేవణూరి కులజున్ శ్రీపాదరేణుప్రభా
సౌవర్ణ స్ఫుట కావ్యకల్పకకవిన్ సంకీర్తనాచార్య పు
త్రీవంశోత్తము నందవైదిక బుధాది ప్రోక్తవృత్తిస్వయం
భావున్ దిర్మల కొండయార్య సుతు శుంభద్వేంకటాభిఖ్యునిన్.

... ... ...

కనుగొని చండికాభిసుముఖప్రదనందవరాగ్రహార పా
వన ఘన పెద్దిభట్టకుల వార్ధినిశాకర నీవు శ్రీనివా
సుని యలమేలుమంగకృపఁ జొక్కిన దిక్కరివాంధ్రభూమి రా
ద్విమత సభాస్థలీవన నవీనపికంబవు శాకలీ కృతిన్.

... ... ...

శ్రీ వేంకట రమణునకు సమర్పించెద. ఆహావరసాధనంబులకు నికనేమి కొదవ. *అదియునుంగాక యమ్మహాదేవుండు మదీయ మాతామహవంశ శిఖారత్నంబగు నన్నయాచార్యునకు* జామాతురుండనిపించుకొని భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంకీర్తనంబు లాలించనని ప్రతిజ్ఞ గావించె తత్తనూజుండగు పెద్ద తిరుమలాచార్య బిడౌజునకుఁ ద్రిపురుష పర్యంతముగాఁ బ్రత్యక్షంబును, సప్తపురుష పర్యంతముగా మోక్షంబునొసంగెదనని వరమిచ్చె. సచ్చరిత్రులగు దదీయ పౌత్రులకుఁ *జిన తిరుమల దీక్షితాన్నయాచార్య తిరువెంగళనాథ కోనేటి తిరువెంగళనాథ వెంగళాచార్యులకు* విచిత్ర ముక్తాతపత్ర రత్నకిరీట ముద్రికా ప్రచండ మణిమండిత మకరకుండలోత్కరాహాః కరదీపికా పాదుకాది బహూకరణంబుల గరుణించె,

విశేషించియు న త్తిరువెంగళనాథుండు సంకీర్తనంబుఁబాడిన నాడం డొడంగె నేతత్ప్రకారంబున నన్నమహామహునకుఁ బాండవసహాయుం డైన శ్రీకృష్ణదేవునింబలె సహాయుండై ... ధన్యుండనయ్యెదనని నిశ్చయించి" ఇత్యాదిగా నున్నది.

ఈ కావ్యమును బరిశీలించిన శ్రీ వీరేశలింగము పంతులుగారు తమ కవులచరిత్రలో "ఇతడు శబ్దాలంకారములనిమిత్త మమితముగా పాటుపడి గ్రంథమునందు వ్యాకరణ దుష్టములైన ప్రయోగముల ననేకములను జేసియున్నాడు. వసుచరిత్రములోని కల్పనలను బోలిన కల్పనల ననేకములఁ జేసినను మొత్తముమీద నీతని కవిత్వము శబ్దాలంకారభూయిష్ఠమయి హృద్యముఁగ నున్నది - ఈ కవి నూరు నూటయేబది సంవత్సరముల క్రిందట (అనగా క్రీ. 1760 ప్రాంతమున) నుండియుండవచ్చును"[1] అని వ్రాసియున్నారు,

వేంకటేశ్వర వచనముల పీఠికలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారీ విషయమై పరిశీలించి యిట్లు వ్రాసినారు. "ఈ గ్రంథమును బట్టి చూడఁగా, నీ వేంకటాచార్యకవి సంకీర్తనాచార్యుఁడగు నన్నమాచార్యునికి దౌహిత్ర వంశములోని వాఁడని యేర్పడును. రచనమును జాలఁదర్వాతిదిగానే యున్నది. కాని యీతనిదేయగు శ్రీపాదరేణు మాహాత్మ్యము గద్య మాతఁడు సంకీర్తనాచార్యుని మనుమఁడే యనఁదగినట్లున్నది... ఇది తప్పయియుండునేమో! "సంకీర్తనాచార్య దౌహిత్రవంశ్య" అని యుండఁదగునేమో" అని!

వారట్లు తలచుటకు శకుంతలాపరిణయ రచన మర్వాచీనముగా కానవగుటయే ప్రధానమగు హేతువు. ఆ భావమున కాతని వచనము నందలి వాక్యవిన్యాసమును, పెదతిరుమలాచార్యుని పుత్రులను గూర్చి చెప్పుటలో క్రమమును మార్చి భిన్నముగ జెప్పుటయుఁ దోడ్పడినదన వచ్చును. ఈ యనుమానమునందు సత్యము లేకపోలేదుకాని ప్రబలము లగు నితరాధారము లాయూహను బలపరచువఱకును శ్రీపాదరేణు మాహాత్మ్య గద్యననుసరించి యీ కవీశ్వరుడు అన్నమాచార్యునకు

1. చూ. ఆంధ్రకవుల చరిత్రము. తృతీయ భాగము. పు-226

దౌహిత్రుఁడనియే భావింతము... అట్లగుచో అన్నమాచార్యుని కడగొట్టు కూతురగు తిరుమలాంబకును, తిరుమల కొండయార్యునకును బుట్టిన సుపుత్రుఁడే వెంకటాచార్యుఁడగును.

ఈతఁడు నందవరీక వైదిక బ్రాహ్మణుఁడు. శ్రీవత్స గోత్రుఁడు. ఇంటిపేరు రేవణూరివారు. కృత్యాది పద్యమున నొక చోట "పెద్దిభట్టకులవార్ధినిశాకర" అని చెప్పుకొనియున్నాఁడు. అది యింటిపేరో యేమో తెలియరాదు. కాని ఈ కవిగృహనామము కర్నూలు మండల మందలి కోయిలకుంట్ల తాలూకా రేవణూరు అను గ్రామమునుబట్టి వచ్చియుండునని శ్రీ చాగంటి శేషయ్యగారు వ్రాసినది సత్యమే కావచ్చును. కడపమండలము – ప్రొద్దుటూరు తాలూకా రామేశ్వరమను గ్రామమున క్రీ. '544 క్రోధిసంవత్సరమున వెలసిన యొక శాసనములో రేవణూరు వెంకటశాస్త్రియను వారి పేరుగలదనియు, నాతఁడీ కవియే కాఁదగునా యనియు శ్రీశేషయ్యగారు సందేహమును వెలిబుచ్చియున్నారు. ఆ వెంకటశాస్త్రివర్యుని కులగోత్రములేవియో వారందు పేర్కొనలేదు. "రేవణూరి" ఇంటి పేరుగలవారు ప్రసిద్ధులు పండితులు, రేవణూరి లింగమభట్టు తత్పుత్రుఁడు మహాదేవసోమయాజి ప్రభృతులు కొందఱు కానవచ్చుచున్నారు–[1] కాని వారిది హారితస గోత్రము, ఆపస్తంభసూత్రము, యజుశ్శాఖ. కనుక ఇంటిపేరున్నంత మాత్రమున వారిసంబంధ మిట్టిదని తలఁపజాలము.

ఏమైనను వేంకటాచార్యుడన్నమాచార్యుని దౌహిత్రుఁడని తలఁచుచున్నాము గనుక అతని జననము క్రీ. 1470-80 ప్రాంతము కావచ్చుననియు, కృతిరచనా కాలము క్రీ. 1530-40 ప్రాంతము కావచ్చుననియు తలఁపవచ్చును. ఇఁక నాతని కావ్యములందలి వైశిష్ట్యము నొకింత పరిశీలింతము.

*1.* శ్రీపాదరేణు మాహాత్మ్యము: ఇది తిరుమల శ్రీనివాసుని శ్రీపాదరేణు మాహాత్మ్యము నుగ్గడించు నొక లఘుకృతి. గ్రంథమున

1. చూ. తి తి దే శా. సం. 4-80 క్రీ. 1584.

నవతారికా పద్యములు కానరాకున్నవి. అలమేల్మంగా సమేతుఁడగు శ్రీ వేంకటేశ్వరస్వామివారికే అంకితమై యుండునేమో! ఇందు మొత్తము నాలుగు ఉల్లాసములున్నవి. ప్రథమోల్లాసము మన్మథ నారదసంవాదరూపముననను, ద్వితీయోల్లాసము దత్తిల తుంబుర సంవాదరూపముననను, తృతీయోల్లాసము రంభాపురందర సంవాదరూపముననను, చతుర్థోల్లాసము సరస్వతీ చతుర్ముఖుల సంవాదరూపముననను గలదు. వీనియందొక్కరు లోకమునందలి వైభవాదికమునకుఁగల లౌకిక కారణములేవో వచింపగా రెండవవారు తిరస్కరించి వానికెల్ల శ్రీహరి శ్రీపాదరేణుప్రభావమే ముఖ్యకారణమని వెల్లడింతురు. ఇట్టిసంవాదములు ప్రతిపద్యమున రెండేసి రెండేసి చరణము లొక్కొక్కరుగా చెప్పుచున్నట్లు చిత్రితములైనవి. ఆ పిదప రెండవవారు సమర్థించిన యర్థము నంగీకరించి మొదటివారు తమయభిప్రాయమును మార్చుకొని శ్రీపాదరేణుమాహాత్మ్యము నుగ్గడించుటయు జరిగినది. ఇట్టి రచనలోఁ గవియేదో ఒక్క కవితాఫణితినే గాక వృత్తాదులు రగడలు ద్విపదలు అష్టకములు దండకములు చూర్ణికలు మున్నగు వానినిగూడ పొందుపరచెను. ఈ రచనా ప్రణాళిక లోని వృత్త వైవిధ్యము చదువరుల కుల్లాసము గొల్పురీతి నుత్తేజకముగనున్నది.

ప్రథమోల్లాసమున మన్మథుడు జగత్తునందలి శోభాహేతువుల నేవో వచింపగా నారదుఁడు వానిని ఖండించుటయుఁ దుదకాతఁడు బుద్ధితెచ్చుకొని శ్రీపాదరేణుమాహాత్మ్యమును ప్రస్తుతించుటయు వర్ణితమైనది. ఈ కథావిషయమున వేంకటాచార్యుఁడు కవితాశిల్పమును ప్రదర్శించినాఁడు. ఇందు క్రమమున నారదుఁడు "కొవ్వగనేలపల్కెదవు ఘుమ్మను వేంకట పాదరేణువే నివ్వటిలున్ *మరుత్సురభి* నీమది నెన్నఁగదోరి మన్మథా!" "తియ్యనకంటె, దియ్యనగు దీర్ఘముతోడుత *గ్రోలు* మన్మథా" "*పలుకులొసంగు* వేంకటుని పాదరజస్కములోరి మన్మథా" 'మెరగకురోరి వేంకటుని ముఖ్య *పదాంబుజరాగ మాలికల్*-దొరకిన సర్వసంపదలతోఁ దులదూగుచుబొంగు మన్మథా' 'వరుస వేంకటపద పల్లవముల *ధూళి-శిలకుఁ* జైతన్య మొదటిది యౌ గలికిమిన్న'-అని చెప్పి వివరించుటలో గంధమురసము శబ్దము రూపము

స్పర్శ అనువానిమూలమున శ్రీపాదరేణువు పంచేంద్రియ పరితృప్తి కల్గించు తెఱగున మహనీయమై యున్నదని కవిసూచించుచున్నాఁడు. ఇట్లు సర్వేంద్రియపరితృప్తిని గల్పింపఁజాలిన శ్రీపాదరేణువే జగత్తునకు శోభాహేతువని భావము.

'కాలాగరుజధూపగతవాసనలకన్న
కాటీరతర సౌరభములకన్న
... ... ...
సధికతరమైయుమంఘమాయతనమగుచు
మధురతరమైన శేషాద్రి మందిరాత్మ
పాదరేణువు నాజిహ్వపై వసించి
సుకవితారీతి పలువులు కోమవుగాత' ...

అని నారదముఖమున కవియందు ప్రార్థించుకొనినాఁడు. ఆ పిదప మన్మథుఁ డిట్లు తన్మహాత్మ్యమును గొండాడినాఁడు.

'ఎంతటిరోగమైన హరియింతు విశేషములోన నంచు ధ
న్వంతరి రూపమైన నెఱవైద్యుఁడు వెంకటనాథుఁ డట్టి శ్రీ
మంతుని పాదరేణు పరమౌషధమౌచు మదీయ రోగమా
ద్యంతముగా నడంచియుఁ జిరాయువొసంగును నాకు నీయెడన్
పైత్య భ్రమధ్వాంత పటలభానూదయం
బతి మేహ దావానలాభ్రవృష్టి
కఫరోగదుర్భరకర్కర్దమ గ్రీష్మంబు
పాండు దుష్టోరగ పక్షిరాజు
... ... ...
వాతజీమూత సంఘాత వాయుపథము
చిరతరాయుర్ధి భావసంజీవకరణి
వేంకటేశ్వర శ్రీపాదపంకజాత
రేణువు మదీయ రుజలు హరించుగాత ।'

ఇట్లే మిగిలిన మూడు ఉల్లాసములందును కవి భక్తిశ్రద్ధలతో తన్మాహాత్మ్యమును బహుభంగుల జిత్రించినాఁడు. సంవాదరూపమగు

నీ కావ్యమున ప్రయుక్తులగు నారదతుంబురులను, రంభాసరస్వతులను దలచుకొనినప్పుడు కవి యిందు భక్తితోఁబాటు సంగీత నాట్య సాహిత్యములను కళలయందు తనకుఁగల ప్రావీణ్యమును బ్రదర్శింపనెంచెనేమో యనిపించును ఇందలి రచనా రీతియుఁ దద్భావమున కనుకూలముగనేయున్నది. రచనా వైవిధ్యమును గుర్తించుట కొక కొన్ని పంక్తుల నుదాహరింతును.

రగడలకు—

'శ్రీకరసంగతిఁ చెలఁగిన రేణువు
ప్రాకట మహిమలఁ బరగిన రేణువు
ఘుమఘుమ వలపులు గుప్పెడి రేణువు
సమరస భావపుఁ జల్లని రేణువు...'

'అండగను దండగను నార్తులకు నర్థిబలు
గండములుఁగాపు వెంకటనాథు పదరేణు
కొండుఁడిదె కొంకుఁ డిదె కోవిదులకోవిదుల
గండములుగాపు వెంకటనాథు పదరేణు
వెండియును వెండియును వేడుకొన వేడుకొన
గండములుగాపు వెంకటనాథు పదరేణు—.'

'శ్రీల నయ్యలమేలుమంగకు
చాలఁ బయ్యగఁజాలు రేణువు
భూమిపాపటఁ బ్రేమఁగొల్చిన
కామితార్థిక కామరేణువు—.'

'శరణు వేంకటాచలాఖ్య సౌధవీధి సంచరించు
పరమమూర్తి రామభద్రు పాదరేణు జాలమునకు
శరణు శరణు శరణు శరణు శరణు శరణు శరణు శరణు
పరమపదనివాస శౌరి పాదరేణు జాలమునకు ...'

అష్టకములకు—

రంభ సంభ్రమకేళి శ్రీహరిరమ్యపావవరాగముల్
దంభ జృంభితమూక్తి నైపుణిఁ దాగణింపగఁగైకొనెన్

ధిక్కృత తకతక ధిక్కృత తకతక ధిక్కృత తకతక ధింధితా
ధిక్కృత తకతక ధిక్కృత తకతక ధిక్కృత తకతక ధింధితా

ద్విపదలకు—

"సంకీర్తనాచార్య సఫల రేణువును
వెంకటాహ్వయ పద్మ విమలరేణువును
అలమేలుమంగాధిపాంఘ్రి రేణువును
దలఁతు మమ్ముల బ్రోవఁ దలచు రేణువును

కవియే పేర్కొన్నట్లు—

'రహసి సౌమి తే' అను శ్లోకాల రీతికి
'అమర సేవ్యమై అమిత భవ్యమై
ప్రమథముఖ్యమై భక్త సౌఖ్యమై
ఘుమ ఘుమం ఘుమై గుప్తకుంకుమై
యమరనెద్ది నాథాంబుజాసనా...'

చూర్ణికలకు—

'అహో! పంకజాసనా వేంకటేశు చరణు రేణునా సకలదురితాయఃపిండ వండ దుర్గుణ ఖండ నముద్దండ పరశువేదినా, క్షయ పాండు కామి లాస్థిగతజ్వర... నిఖిల రోగధరాధర భిదురధారా చమత్కారహారిణా...మదీయ ప్రాణప్రద మహాప్రభో...'

ఇట్టి రచనలేకాక యీ గ్రంథమున తత్త్వప్రతిపాదకములును, రమణీయములును నగు పద్యములుకూడ నున్నవి. ఒక్క పద్య ముదాహరింతును.

తిరుమంత్రాఖ్యహలంబుఁబూని కృషికృద్ధీమంతుఁడాత్మీయ హృ
ద్ధరణిన్ దున్ని ద్వయార్థ బీజములు నిండంజల్లి నంకూరమై
పరగన్ దాచిన మోక్షశాలికిని బైపై సత్తువల్ నీవు గా
నెరువై శేషగిరీంద్రపాదరజమూహింపంగ నిద్ధాముణిన్...

ఈ కావ్యమున ప్రసక్తానుప్రసక్తముగ—

"వేడవఁ దాళ్లపాక తిరువెంగళనాథుఁడు పాదనాద ద
ర్వీకర శాద్గిరీశ పదరేణువులెల్లను గప్పఁబోల్ జుమీ"

'తాళులపాక చిన్నన వరంబులు వాడిన వాడె సర్వరా
జ్యైశ్వలవిభుండు తత్పదరజంబుమ మాకు నొసంగఁజెల్లదే !.'

అనియుఁ గవి తమ బందుగుల సంగీత ప్రజ్ఞావిశేషమును గొని యాడెను. వారిలో పెద తిరువెంగళనాథుఁడు గొప్ప గాయకుఁడ గుట విదితమేగాని చిన్నన్నన్ను, చిన తిరువెంగళనాథునిఁ గూడ నీతఁడు గాయకులుగా స్మరించుట అపూర్వముగనున్నది. ఆతఁడును గాయకుఁడేమో !

వేంకటాచార్యుఁడు శ్రీపాదరేణుమాహాత్మ్యమున తద్వస్తువును వర్ణించినాఁడు. "స్వామి మేనెల్ల మేదించిన, మేదించుటలో శ్రీపాదములందుఁ దొరగిన కర్పూరధూళితోడి పునుఁగు తైలమును, దన్మిశ్రమయిన పాదతీర్థమును శ్రీపాదరేణు నామమున ప్రస్తుతిగ న్నది" అని ప్రభాకరశాస్త్రిగారిందలి వర్ణనములనుబట్టి గుర్తించి యున్నారు.

ఈ కృతి ఆ కవీశ్వరుని తొలికృతి. ఇక రెండవది —

*శకుంతలా పరిణయము* : ఇది మూడాశ్వాసములుగల శృంగార ప్రబంధము. భారతమునందలి శకుంతలా దుష్యంతులకథనే గ్రహించి యీకవి కొలది మార్పులను గావించుకొనెను. కనుక నిందలి యితి వృత్తము మిశ్రము. రచనలో నీతఁడు చాలవఱకు నన్నపార్యునను కరించెను. వర్ణనము లిందు ప్రబంధ ధోరణి నున్నవి.

ఈ ప్రబంధము నీకవి యెవరో ఒక ప్రభువునకంకితమీయసంక ల్పించి యారంభించినట్లున్నాఁడు, కాని నడుమ నొక కరణమువన్నిన దుస్తంత్రముకారణముగా నాయత్నము విఫలమైపోగా ప్రభువునకుఁ గృతి నిచ్చు సంకల్పమును విరమించుకొని వేంకటాచార్యుఁడు శ్రీవేంకటే శ్వరస్వామి వారికే దాని నంకితముగావించెను. ఈ ప్రబంధమునందలి కృత్యాది పద్యములవలన నీవృత్తాంతమే కాక వేంకటాచార్యుని వంశ మువారినిగూర్చియు, వారికిని దాళ్లపాకవారికిగల సంబంధమునుగూర్చి యుఁగూడ కొంత తెలియవచ్చినది. ఆయావిషయముల నీవఱకే కొంత ఉదాహరించియుంటినిగాన నిట మరల పేర్కొన నవసరములేదు.

"శ్రీ లక్ష్మీరమణీనిభుండునను సుశ్రీయుక్తుగా జేయుతన్" అని కావ్యమునారంభించి లక్ష్మిని, సరస్వతిని, శంభుని, శంభుని రాణిని, వేదండాస్యుని, హాయవక్త్రుని వాల్మీకి ప్రభృతి పూర్వసంస్కృతకవులను స్తుతించి—

పరగన్ భారత కల్పనారతులు శబ్దస్ఫూర్తి సంధింప ని
ర్భరవృత్తిన్ బరమేశ పోతఘనులాలంకారముల్గూర్పఁజూ
వరులైనట్టి పితామహాద్యులు మతుల్పాటింప నర్తించు నీ
సరసాంధ్రోక్తి వధూటికేను సుమనస్సంపూర్తి గావించెదన్

అని ప్రతిజ్ఞ గైకొనెను. అపై కుకవినింద నిట్లు గావించెను—

మోవిం దీపురసంబులేక కళలన్ మొల్పింపకే చిత్రబం
ధావాప్తింగన కాప్తవాగ్విరహితంబై పాకహీనస్థితిన్
క్రోవౌ దుష్కృతి మూఢకామిని రతిన్ బోలెన్ హృదానంద బో
ధావర్జంబగు దానిమెచ్చరు సుమేధాకామశాస్త్రాధికుల్.

పిదప స్వవిషయము నించుక విశదీకరించి శ్రీ వేంకటాచలపతి కంకితముగా షష్ఠ్యంతములను రచించెను.

స్థిరమతి నంకితంబొనర జేసి విభాసిల నమ్మహాకవీ
శ్వరుఁడు రసప్రబంధపదశయ్యల నుద్యోలయాపి నెయ్యపున్
గరగరజెప్పఁబూనిన జగద్ధితకాంతలసచ్ఛకుంతలా
పరిణయ నవ్యకావ్య పరిపాకకథాక్రమ మెట్టులన్న చోన్.

అని—నైమిశారణ్యంబున శౌనకాదులకు సూతుఁడు చెప్పిన రీతి నీకథ నాతఁ డారంభించెను. కావ్యారంభము పురవర్ణనాదులతో ప్రబంధరీతిని సాగినది. దుష్యంతుఁడు స్వప్నమున నొక సుందరాంగిని దర్శించి, "కలను కనుగొన్న కాంతపై కాంతుచేత" నువ్విళులూరుచుండును. అప్పుడు వనపాలకులు వచ్చి యాహ్వానించుటయు, దుష్యంతుఁడు వేటకై బయలుదేరి వెడలుటయు, వనమున కణ్వాశ్రమమున శకుంతలను జూచి మోహించుటయు నిత్యాదిగాగల తరువాత కథ ప్రసిద్ధమగురీతినే సాగినది. ప్రియంవదయను చెలికత్తె నాయికానాయ

కుల శృంగారవిషయమున సహకారిణి యగును. ఇక తక్కినకథా విషయములన్నియు నన్నయగారి భారతకథ ననుసరించియే నడచినవి.

ఇందు కవి ప్రౌఢాధికవర్ణనములందును, శృంగార రసపోషణము నందును ప్రావీణ్యమును ప్రదర్శించెను. ఇక పద్యరచనా నిర్మాణము నం దీతఁడు పోని పోకడలు లేవు. పూర్వకవుల రచన ననేకవిధముల ననుకరించి తర్వాతికవులకు మార్గదర్శకమగున ట్లీతఁడీ ప్రబంధమును సంధానించెను.

దుష్యంతుని వర్ణనమిది చూడుఁడు. చేమకూరకవికి మార్గదర్శకముగ నున్నది.

ఇంతటివాఁడటంచు వచియింప నశక్యము బ్రహ్మకైన స
త్కాంతి విశేషతన్ రజనికాంతుని కంటెను కాంతుఁ డద్భుతా
త్యంత విలాసవైఖరి జయంతునిగొన్ణయవంతుఁ డౌర దు
ష్యంతుని సాటి లేరు చతురబ్ధి పరీతధరాతలంబునన్...

నాయకుఁడు స్వప్నమున దర్శించిన నాయికారూప వర్ణనమును గాంచుఁడు.

మెలఁత కన్నులబెళుకు మేనివాసనయులుకు
తుదిమదైణము నైణమదము గేరు
కలికి వాతెరరంగు కరయుగంబు తెరంగు
తలిరు కెంపును గెంపు తలిరునేలు
పణతి ఫాలము కాంతి పలుకులందు పొలంతి
చంద్రఖండము ఖండచంద్ర మణచు
చెలువడాల్ గల కొప్పు చికిలిచూపులమెప్పు
నళికదంబము కదంబాళి నెగుచు
కాంత నెమ్మోని......కటిఘనంబు
ధరవసుత్వవసుంధరత్వముల గెలుచు
మగువ చిరునవ్వులో హేల మొగములీలఁ
బెడగువెన్నెల వెన్నెలబెడగు నౌరయు.

దరము దరము దరము ధవళాక్షి కంఠంబు
ఘనము ఘనము ఘనము కచభరంబు
కెంపు కెంపు కెంపు సొంపైన వాతెర
మించు మించు మించు మేనికాంతి.

ఇట్టి చమత్కారరచనలోఁ గవి నాచనసోముని మించి పోయినాఁడు.

"కాంత నవమ్మృంత గుణపాంత ఫలకంత సద
నాంతరలతాంత రసవాంతవిసినాంత
ప్రాంతములకాంత శశికాంతముల పంతముల—" (?)
'ఒకయంద మరవింద మకరంద...బృంద
మొకప్రేమ మురుహేమ వికరధామ...'

ఇత్యాది సీసవృత్తములం దీకవి వసుచరిత్రకారుని పద్యరచనా విన్యాసమును దలపింపఁజేసినాఁడు. రచనా చమత్కారమున కింకొక్క పద్యమును జూడుఁడు.

'చిలుకవే దయనీవు చిలుకవే నీవు నా
పలుకుతోడవటంచు పలుకరించి
తేటి కేరెదవు యిదేటికే నాచూపు
తేటదానవటంచు తేటిచూపి'

ఇట్లే
"బింబమో మాణిక్య బింబమో కాక యీ
అంబుజేక్షణ మధురాధరంబు"

అనురీతి సీసమున బోతన్న ననుకరించెను. ఇఁక "ఇది మునికన్య ధన్యయని యిందొక సందియమంద," "ఇమ్మునిపల్లె నుండుటిది యొందుకు", "తనకుం బుట్టము తానగు తనకుం దాగతియు", "బాలార్కతేజుఁడల వెల బాలుఁడు", "గురుపరిష్వంగసుఖము

గైకొనుము మిగుల - వనికిమాలిన విపరీతభాష లేల" - ఇత్యాదులందు నన్నయగారి కవితాప్రభావమెంతగా నీతనిపైఁ బనిచేసినదో గుర్తింప నగును. సభలో శకుంతల యేడ్చును గవి యిట్లు వర్ణించినాఁడు.

"ఆలోలాక్షికుచంబు లాస్యముకురం బశ్రూద్గతిన్ గట్టగా
చేలాఁగ్రంబునవొత్తి యేడ్చె రవళిం జెన్నారు లేకోయిలన్
... యెలుగెత్తి రాల్గరుగు.............దితనీలాంబరీ
లీలాంచన్మణి వల్లకీరవసుధాళీధారలూరింపఁగన్"

ప్రబంధములందు ప్రసిద్ధములగు "నేడ్పుపద్య" ములతో దీనిని గూడఁ దులఁదూపవచ్చును.

ఇట్లు రచనా విషయముననేకాక పాత్రచిత్రణమునందును, రసపోషణంబునందునుగూడ కవి శ్రద్ధవహించినాఁడు. శకుంతలా దుష్యంతులసమాగమమును వర్ణించుదీర్ఘవచన మాతనికి రసవిషయమున గల శ్రద్ధనుజాటుచున్నది. ఈకవి సంగీతజ్ఞుఁడని తోచుచున్నది. మేఘ రంజి, పున్నాగ, సారంగ, శంకరాభరణము మున్నగు రాగములను గూర్చియు, గీతప్రబంధతతులను గూర్చియు నీతఁడు ప్రస్తావించిన యంశము లావిషయమును వెల్లడించుచున్నవి.

ఈ శృంగారప్రబంధము పరిష్కృతమై వెలుగు మొగము చూడవలసియున్నది.

*రామచంద్రోపాఖ్యానము* : అలభ్యము. శకుంతలాపరిణయ ప్రబంధమునగల గద్యలో నిట్లున్నది. "ఇది శ్రీమత్తిరువెంగళనాథ శ్రీపాదరేణుప్రభావకావ్యకల్పన, నందపురార్యవృత్తి ప్రవీణ, రేవణూరి వంశ పయఃపాథోధి సుధాధామ రామచంద్రోపాఖ్యాన ప్రబంధ సంధాన విద్వత్ప్రచండ తిరుమల కొండయాభిధ బుధాగ్రణి తనూభవ ఘూభుతాస్థాన నిరాతంకచర్య వేంకటార్య ప్రణీతంబైన..."

ఇందలి వాక్యవిన్యాసమునుబట్టి శ్రీ వీరేశలింగముపంతులుగారు రామచంద్రోపాఖ్యానము వెంకటాచార్యుని కృతియని యభిప్రాయపడిరి. కాని శ్రీ చాగంటి శేషయ్యగారు ఆ వాక్యమును వేరొక విధమున నన్వయించుకొని తత్కర్త వేంకటాచార్యుని తండ్రియగు తిరుమల కొండయార్యుఁడగునని వ్రాసియున్నారు—[1] నాకుఁజూడ నిదియు వెంకటాచార్యుని కృతియే కావచ్చునని తోచుచున్నది. కాని యాకృతి దుర్లభమగుట వలన నింతకన్న నధికముగ చెప్పుటకు వలను పడకున్నది.

1. చూ. ఆంధ్రకవుల చరిత్రము తృతీయభాగము. పు. 226 మఱియు ఆంధ్రకవితరంగిణి సం. 8 – పు. 154.

## కావ్యప్రకాశికా టీకా[1]

శ్రీమతే హయగ్రీవాయ నమః ॥ శుభమస్తు ॥

శ్రీ వేంకటేశేన సరోజ జాతా
సేయం సరోజాసనలాలనీయా ।
ఇతీవ నిత్యం హృదయారవిన్దే
నివేశితా మాం కమలాలయాఽవ్యాత్ ॥

ఆసీదాసేతునీహారగిరి విఖ్యాత నామవాన్
శాళపాకన్నయాచార్యః వేంకటేశ వరాంచితః

తతోఽభవత్తిరుమలగురు ర్గురుసమానధీః ।
భరద్వాజాన్వయపయఃపారావారకళానిధిః ॥

తస్మాన్నభూన్నందవర వరహార హరిన్మణిః ।
దీక్షితశ్చిన్నతిమ్మాఖ్యముక్తా ఛత్రద్వయాంచితః ॥

తదాత్మజన్మా తిరువేంకటా (?) ఖ్యస్సుధీమణిః ।
ఋగ్వేదసరసీహంసో హంసోమిత్ర సరోరుహామ్ ॥

గోపాల ప్రముఖోక్త
వ్యాఖ్యాసు సమాకలయ్య సారాంశమ్
టీకా సుధానిధిమసౌ
రచయతి కావ్యప్రకాశస్య ॥

అథ స్వకర్తృకాం కారికాం వ్యాచిఖ్యాసుః గ్రంథకారః విశిష్ట శిష్టాచార పరిప్రాప్తతయా ఆదౌ మంగళం ప్రేక్షావత్ప్రవృత్త్యంగతయా ప్రయోజన సాధనత్వేనాభిధేయం వా వక్తుముచితం, నతు దేవతాకీర్తనమితి శంకాం నిరాకర్తు మాహ.

అనేన మంగళస్య కర్తవ్యత్వే సదాచారః ప్రమాణమితి సూచితమ్. విఘ్నవిఘాతాయేత్యనేన సమాప్తిర్నక్షమంగళజన్యా మంగళా

1. చూ. ఈ గ్రంథమున పుటలు. 471 – 474.

భావేఽపి ప్రమత్త నాస్తికానుష్ఠిత సమాప్తేః, న చ తత్ర జన్మాంతరీయ మంగళ కల్పనం, జన్మాంతర సమాప్తి ముద్దిశ్య శిష్టైస్తదకరణాత్, కిరణావళీ,-కాదంబర్యాదావన్వయ వ్యభిచారాత్ అన్యథా సిద్ధేశ్చ. కింతు విఘ్నధ్వంసః, నహి విఘ్నాభావమద్వారీకృత్య మంగళం సమాప్తిసాధనమిత్యావశ్యకత్వాత్ విఘ్నాభావ విశిష్ట సమాప్తిరూప కార్యాపేక్షయా విఘ్నాభావరూప కార్యస్యైవ లఘుత్వాత్. సమాప్తిశ్చ సతి దురితాభావే స్వకారణాదేవేతి ప్రతిపాద్యతే. 'విఘ్నం త్యారబ్ధ' మితి విఘ్నాదురితాని, తేషాం నాశాయ విఘాతాయేతి తాదర్థ్యే చతుర్థీ. అనయా నమస్కారస్య కార్యతా సూచ్యతే. సముచితేష్టదేవతామితి. ద్వివిధా హి దేవతా సాధారణ్యసాధారణీ చ. తత్ర విష్వక్సేనాది - సాధారణీయతయా అత్యంతముపకరోతి సా అసాధారణీ. ఇయమేవ సాధారణీ సముచితపదే నాభిధీయతే. ఇష్టత్వం సాధారణాసాధారణయోః సమానమ్. ఏవం చ సముచిత ఇష్టదేవతయోరవశ్యం నమస్కార్యత్వాత్ క్రమవినిగమనాభావాత్ ఏక ఏవ నమస్కార తంత్రన్యాయేనోభయోక్త ఇతి న్యూనత్వ శంకా నిరస్తా. గ్రంథకృదితి. కర్తృవ్యాకర్తృభేదాత్ భేదేన వ్యపదేశః. పరామృశతి ఇతి. అత్ర పరామర్శపదం కేవల స్మృతిపరం న తు స్తుతిపరం, నమస్కరణీయత్వేన స్మృతిపరం వా, ఉభయత్ర నిర్భీజలక్షణాపత్తేః. న చ మంగళపరత్వ ప్రతీతిరేవ ప్రయోజనమ్. గ్రంథారంభ ఇత్యాది వాక్య ప్రతిపాద్య వైశిష్ట్యజ్ఞానాదేవ లక్షణాదీనాం పరామర్శస్య మంగళ పరత్వప్రతీతేః సంభవాత్ అభిధేయోపపత్తౌ లక్షణాయా అస్వీకరణీయత్వాత్.

శ్లోకార్థస్తు :— కవేర్నిర్మితి మాదధతీ నిర్మాణం కుర్వతీ. న చాత్ర పౌనరుక్త్యం నిర్మాణధారణయోః, నియతి కృతేత్యాది విశేషణ విశిష్టాం నిర్మితిం కుర్వతీతి సామాన్య విశేష భావేన పౌనరుక్త్యాభావాత్. యథా అర్ఘ్యాదికయా సపర్యయా పర్యపూపుజదిత్యాది "భారతీ జయతి" సర్వోత్కర్షేణ వర్తతే. నతు కవిః భారతీ జయతీత్యన్వయః. కవి భారత్యా కావ్యాత్మకతయా అచేతనత్వాత్ సముచితేష్టదేవతా త్వాభావాత్. తదధిష్ఠాతృదేవతా పరాతాయాం తు కవిపద

వైయర్థ్యాత్. కవి సమభివ్యాహృత భారతీశబ్దస్య కావ్యార్థపరతయా ప్రసిద్ధస్య సరస్వత్యాంన్నిహితార్థత్వాపత్తేశ్చ. అత ఏవ వృత్తికారః "ఏత ద్విలక్షణా కవివాఙ్నిర్మితి" రిత్యాహ. నియతి కృతేత్యాది. నియమ్యతే అనేనేతి నియతిః అసాధారణో ధర్మః. కమలత్వాదిరదృష్టం వా తత్కృతో యో నియమః. సౌరభవిశేషాది నియమః. స్థిరవినశ్వరాది నియమో వా తద్రహితా. కవినా కమలసౌరభం కామినీముఖేవినశ్వరం చ స్థిరం ప్రతిపాద్యతే. యద్యప్యత్ర కవిసంప్రదాయ నియమసాపేక్షత్వాత్ నియమరహితత్వ మసంభావి. తథాపి బ్రహ్మసృష్టినియమానపేక్షత్వేన నియమరాహిత్య మత్ర వివక్షితమ్ "హ్లాదైకమయీ మితి" ప్రాచుర్యేణ ప్రస్తుతముచ్యతే. యస్య ఏకమయీ హ్లాదేన ఏకమయీ హ్లాదైకమయీ. నచ ఏకశబ్దస్య ప్రాచుర్యార్థత్వే మయటో వైయర్థ్యమితివాచ్యమ్. ఏకో ద్వౌ బహవ ఇత్యత్ర ప్రకృతిప్రత్యయాభ్యాం యథా ఏకత్వాదికమేవోచ్యతే ఏవం (ప్రాచుర్యేణ) ఏకశబ్దేన మయటా చ ప్రాచుర్యమేవోపస్థాప్యతే. అతో న పౌనరుక్త్యమ్. న చాత్ర ఏకశబ్దః సంఖ్యావాచీ. పూర్వకాలైకేత్యాదినా ఏకశబ్దస్య పూర్వనిపాతాపత్తేః అథవా ఏకశబ్దో ద్వితీయ వ్యవచ్ఛేదపరః. మయట్ చ స్వార్థే కః తథాచ హ్లాదైకైవ హ్లాదైకమయీ, అద్వితీయ స్వరూపాహ్లాదైకమయీ తతశ్చ ఏకశబ్దస్య సంఖ్యాయాం తాత్పర్యాభావాత్ పూర్వనిపాతానాపత్తిః అనన్యపరతన్త్రమితి. పరతంత్రశబ్దః ఆయత్తవచనః అఖండః. యథా త్వత్పరతంత్రో మత్పరతంత్ర ఇతి. అతః అన్యపరశబ్దయోర్న పౌనరుక్త్యమ్. అన్యస్య కవివ్యతిరిక్తస్య పరతంత్రా నభవతీత్యపరస్య పరతంత్రాన్నవరస రుచిరామితి నవసంఖ్యాకా రసా యస్యాస్సా నవరసా. నవరసా చాసౌ రుచిరా చేత్యుభయం విధేయమ్. బ్రహ్మనిర్మితా వుభయవైలక్షణ్యస్య వక్ష్యమాణత్వాత్, తన్న విధిద్వయకల్పనాగౌరవాత్. రసానాం రుచిరతాహేతుత్వానవగమాచ్చ, అత్ర నవానాం రసానాం సమాహారే నవరసీతిస్యాత్, నవరసరుచిరాధ్యస్యా ఇతి బహువ్రీహిపక్షేపి రసానాం రుచిరతాహేతుత్వం నస్యాత్ కింతు నవభిః రసైః రుచిరామితి విశిష్టవిధిః. రక్తం పటం వక్షేతివత్ (?) అత్ర సంఖ్యాపూర్వకత్రిపద

స్తత్పురుషః త్రిలోకనాథ ఇత్యాదివత్ త్రిమునిలక్షణమితివత్. తద్ధి
తార్థేత్యాదినా సమాసః ఏవం చ నవరస శబ్ద వాచ్యరుచిరామిత్యర్థః.
అన్యథా బ్రహ్మనిర్మితి సాధారణరస్య రసస్యాభావాత్ తదపేక్షయా
కవినిర్మితే రుత్కర్షో నప్రతీయేతి భావః. వ్యతిరేకాలంకార ద్వయం
చాత్ర వ్యంగ్యం బ్రహ్మనిర్మిత్యపేక్షయా కవినిర్మితే ర్బ్రహ్మాపేక్షయా
చ కవేః ప్రకర్షప్రతీతేః ఏకస్మిన్ శ్లోకే వ్యతిరేకాలంకారం స్ఫుట
యితుం ప్రతియోగిన మన్వయముఖేన నిరూపయతి. నియతిశక్త్యే
త్యాది. ప్రతియోగి స్వరూపానవగమే తద్వ్యతిరేకస్య జ్ఞాతుమశక్య
త్వాత్ నియతిశక్త్యా అసాధారణ ధర్మశక్త్యా అదృష్టశక్త్యా నా
నియమితస్వరూపా ప్రతినియతస్వరూపేత్యర్థః నియతి నియమనయోః
పౌనరుక్త్యశంకా మా భూదితి శక్తిపదగ్రహణం 'సుఖదుఃఖ మోహ
స్వభావేతి' యథా ఏకైవ కామినీ రూప యౌవనాది సంపన్నా స్వా
మినం సుఖయతి తం ప్రతి తస్యాః సుఖరూప సత్వ సమృద్ధత్వాత్ సైవ
సపత్నీం దుఃఖాం కరోతి తాం ప్రతి తస్యాః దుఃఖాత్మకరజః సమృద్ధ
త్వాత్ సైవాన్యం తామవిందతం యువానం మోహయతి. తం ప్రతి
తస్యాః మోహరూపతమః సమృద్ధత్వాత్. అత ఏవ గుణత్రయ
మయత్వ మనయా రీత్యా విశ్వస్యేతి ద్రష్టవ్యమ్. పరమాణ్వోరితి
ద్వంద్వాంతే శ్రూయమాణ కారణశబ్దః ప్రత్యేకమభిసంబధ్యతే, పర
మాణ్వాది ఉపాధౌ కారణ పరతంత్ర కర్మాది సహకారే కారణ పర
తంత్రాచేతి పరమాణ్వాదీత్యాది శబ్దే (?)- ద్వ్యణుకాది సంగ్రహః పర
మాణుద్వయ సంయోగరూపా సమవాయ కారణ సంగ్రహశ్చ కర్మాదీ
త్యాది శబ్దేన దిక్కాలాదీనాం గ్రహణం మద (?) వధాతవ్యమ్. యదా
నియతికృతేత్యత్ర నియతపద మసాధారణ ధర్మపరం తదా కర్మా
దీత్యత్ర కర్మపదం అదృష్టపరం. యదా నియతిపదం అదృష్టపరం
తదాత్ర కర్మపదం పరమాణు కర్మపరమితి. యద్యపి కవినిర్మితావపి
ఉపాదానాద్యపేక్షా అస్తి తథాపి కవి నిర్మితేః సదసద్విషయత్వేన
సద్విషయబ్రహ్మనిర్మిత్యపేక్షయా అతిశయత్వాత్. అథవా ఉత్ప్రేక్షా
బహుళతయా బ్రహ్మేచ్ఛాతః కవీచ్ఛా చమత్కరోతి. తమాహుః.

"అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః
యథాఽస్మై రోచతే విశ్వం తథైవ పరివర్తతే" ఇతి

షడ్రసాః మధురామ్లలవణకటుకషాయతిక్తాత్మికాః. న చ హృద్యైః వత్తైరితి త్రైరసేన చ హృద్యైర్యేవేత్యన్వయః భోక్తౄణామభిలాషా భేదాదాహ్లాదో కశ్చిదేవ కస్మైచిద్రోచతే. యద్యపి తిక్తకషా దయః క నిర్మితావప్యరుచికరా ఏవ తథాపి కావ్యాభినయా భ్యామాస్వాద్యమానదశాయాం తేషామపి హృద్యత్వాత్ వక్ష్యతి చ "సద్యః పరనిర్వృతయ" ఇతి బ్రహ్మణి నిర్మితి ర్బ్రహ్మ నిర్మాణమితి. అత్ర నిర్మితి నిర్మాణ పదయో ర్వ్యాఖ్యాన వ్యాఖ్యేయభావేనాన్వయః వ్యాఖ్యాతమన్వయం వ్యతిరేకే యోజయతి ఏతత్ విలక్షణా కవివాక్ నిర్మితిరితి. యతః కవి సృష్టి నియతినియంత్రణాదిక్రాంతా యతః సుఖైకస్వరూపా యతః పారతంత్ర్య వార్తాభి (?) జ్ఞాయతశ్చ శృంగారాద్యలౌకిక విషయ రస వైచిత్ర్య చారు చమత్కారా అతఏవ జయతి సర్వోత్కర్షో హి జయతే రకర్మకస్యార్థః నను నమస్కార ప్రస్తుతావుత్కర్ష కథనం న సంగచ్ఛత ఇత్యత ఆహ "జయ త్యర్థః న చేతి ఆక్షిప్యతే" ఇతి వ్యజ్యత ఇత్యర్థః నత్వనుమీయత ఇత్యర్థః. వ్యాప్త్యభావాత్. న చ యః సర్వోత్కృష్టః స నమస్కార్య ఇత్యస్తి వ్యాప్తిరితి వాచ్యమ్ నమస్కార యోగ్యత్వలాభేఽపి నమస్కారాలాభాత్. అనుమానేన నమస్కారలాభేఽపి అనుమాన సామగ్ర్యం వ్యాప్త్యాది స్మృతి విలంబన విలంబితత్వాత్ తదపేక్షయా వ్యంజనాయాః సంభూత సామగ్రికత్వాత్ తథైవ నమస్కారబోధనాత్. నను నమస్కారే ఆక్షిప్తే కోఽన్వయః కవే ర్భారతీ జయతి నమస్కార ఇత్యుక్తం స్యాత్. తథా చ దశదాడిమాని. షడపూపా. ఇతివదనన్వయః స్యాదిత్యత ఆహ తాంప్రత్యస్మిన్ క్రియస్యపి నతివద్దేవతా స్మృతిరపి మంగళమితి నమస్కారవ్యంజనఫలం తథాపి నమస్కారాతిరిక్తం నమంగళ మిత్యభిప్రాయేణోక్తమ్. నన్వేవం విఘ్నవిఘాతాయ స్మరణ మనుపపన్నం స్మృత్యాక్షిప్త నమస్కారస్య విఘ్నవిఘాత కత్వమితిచేన్న ప్రయోజకత్వ మాత్రేణ తదభిధానాత్. నన్వత్ర నమస్కారః స్వవాచకశబ్దే నాభిధయైవోచ్యతాం కిం వ్యంజ

నయా ఇతి చేన్న శక్త్యుపేతయా వ్యంగ్యార్థస్య చమత్కార కారిత్వాత్ ఇత్యభిప్రాయేణోక్తమ్ ఏవం చ శ్లోకైకమయీం కవినిర్మితిమిత్యనేన సప్రయోజన మభిధేయం నమస్కార వ్యంజనేన మంగళం చ ప్రతిపాదితమితి శ్లోకేన న్యూనతేతి బోద్ధవ్యమ్. నను నమస్కారానన్తరమిదమేతదర్థ మారభ్యతే ఇతి ప్రతిజ్ఞయా భావ్యమ్. యయా ప్రతిజ్ఞయా శాస్త్రారంభహేతుభూతానుబంధ చతుష్టయ నయనం సిద్ధ్యతి తత్రాభిధేయస్యాన్యద్య శ్లోకేన ప్రతిపాదనేపి ప్రయోజనా ప్రతిపాదనాదత ఆహ పరాభిధేయం ఇతి. కావ్యం ఖల్వత్రాభిధేయం. ప్రకరణకావ్యయోః యయాశాస్త్ర మభిధానాభిధేయ భావసంబంధః కావ్య ప్రయోజనయోః కార్యకరణ... ...

(ఏతావానేవ గ్రంథే దృశ్యతే)

[కావ్య ప్రకాశ వ్యాఖ్యా - నెం. 318A, Re 31/463, మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భండాగారమునందలి నాగరిలిపి వ్రాత ప్రతిలోని విషయ మింతే లభ్యము. నకలు వ్రాయించుకొన్న తేది 29-5-1963.

దీని మూలమును సరిచూచి ఇచ్చిన మిత్రులు డా॥ శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు గారికిని, ముద్రణకు సిద్ధపరచి తిరుగజూచి యిచ్చిన సహోపన్యాసకులు శ్రీ రవ్వ శ్రీహరిగారికిని కృతజ్ఞుడను.]

## ఉపకరించిన రచనలు


| | |
|---|---|
| అంబికాశతకము | రావిపాటి త్రిపురాంతకుడు |
| అన్నమాచార్య చరిత్ర-పీఠిక | శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు |
| అప్పకవీయము | |
| అమరుకావ్యము | Ed. శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి గారు |
| ఆంధ్రకవితరంగిణి (సంపుటములు) | శ్రీ చాగంటి శేషయ్యగారు |
| ఆంధ్రమహాభారతము | నన్నయ్య |
| ఆంధ్రుల సాంఘిక చరిత్ర | శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు |
| ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలు | |
| ఆముక్తమాల్యద | శ్రీ కృష్ణదేవరాయలు |
| ఆళ్వారాచార్యుల చరిత్రము | శ్రీ టి. లక్ష్మణాచార్య |
| ఉత్తర హరివంశము | నాచన సోమన |
| ఉదాహరణ వాఙ్మయ చరిత్రము | శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు |
| ఋగ్వేదసంహిత | |
| కట్టా వరదరాజు రామాయణము | Ed. శ్రీ ని॥ వేంకటరావుగారు |
| కవికర్ణ రసాయనము | నృసింహ కవి. |
| కవి జీవితములు | శ్రీ గురజాడ శ్రీరామమూర్తిగారు |
| కవి జనాశ్రయము | |
| కవుల చరిత్ర | శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులు గారు |
| కళాపూర్ణోదయము | పింగళి సూరన |
| కాటమరాజు కథ | Ed. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు |
| కావ్యాలంకార చూడామణి | విన్నకోట పెద్దన |
| కుమార సంభవము (నన్నిచోడ) | Ed. శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారు |
| గురుపరంపరా ప్రభావము | |

| | |
|---|---|
| గురుబాల ప్రబోధిక | |
| ఛాందోగ్యోపనిషత్తు | |
| తాళ్లపాక కవుల (శృంగార - అధ్యాత్మ) సంకీర్తనల సంపుటములు | |
| తాళ్లపాక కవుల లఘుకృతులు | |
| నాట్యశాస్త్రము (భరతుడు) | |
| నృసింహ పురాణము | ఎఱ్ఱన |
| పండితారాధ్య చరిత్ర | పాల్కురికి సోమనాథుడు |
| పాండురంగ మాహాత్మ్యము | తెనాలి రామకృష్ణుడు |
| పారిజాతాపహరణము | నంది తిమ్మన్న |
| ప్రబంధ రత్నావళి | Ed. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు |
| బసవపురాణము-పీఠిక | Ed. ,, ,, |
| భారతి - మాసపత్రికలు | |
| భోగినీ దండకము | పోతన |
| మను చరిత్ర | అల్లసాని పెద్దన |
| రంగనాథ రామాయణము | Ed. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు |
| వాగ్గేయకార చరిత్రము | శ్రీ బి. రజనీకాంతరావుగారు |
| వాల్మీకి రామాయణ(గోవిందరాజీయ) వ్యాఖ్య | |
| విజయవిలాసము | చేమకూర వేంకటకవి |
| వ్యాసయోగి చరిత్ర (సోమనాథ) | Ed. శ్రీ బి. వెంకోబరావుగారు |
| వైఖానసాగమము-ఆనందసంహిత | |
| వైయాకరణ పారిజాతము | శ్రీ వఝల చినసీతారామశాస్త్రిగారు |
| శతక వాఙ్మయ చరిత్ర | శ్రీ వంగూరి సుబ్బారావుగారు |
| శ్యామలా దండకము | కాళిదాసు |
| శ్రీపాదరేణు ప్రభావము | Ed శ్రీ పంగనామల బాలకృష్ణ మూర్తిగారు |
| శ్రీ వేంకటేశ్వర వచనములు | Ed. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు |
| సంగీత సంప్రదాయ ప్రదర్శిని | శ్రీ సుబ్బరామ దీక్షితులవారు |
| హరివంశము | ఎఱ్ఱన |

| | |
|---|---|
| A History of Tirupathi | *Dr. S. Krishnaswamy Ayyangar* |
| Annals of S.V.O.I. (Volumes) | |
| Archaeological Survey Report (Vols) | |
| Chandonuru Sasanam (Inter) | *Prof. Velankar* |
| Descriptive Catalogues - Madras & Tanjore O. Mss. Libraries | |
| Epigraphical Report (T.T.D.) | *Sri S. Subrahmanya Sastri* |
| History of Sanskrit Literature | *Dr. P. V. Kane* |
| ,, ,, | *Sri S. K. De* |
| History of Thirupathi | *Sri T. K. T. Veera Raghava Chari* |
| Inscriptions (Volumes) (T.T.D.) | |
| Journals of S.V.O.R. Institute | |
| New Catalogus Catalogorum | *Dr. V. Raghavan* |
| South Indian Inscriptions (Vols) | |

# కొన్ని ముఖ్య సవరణలు

| తప్పు | పుట | పంక్తి | ఒప్పు |
|---|---|---|---|
| కధాసార | 1 | 22 | కథాసార |
| సంగమ | 4 | 8 | చంగ* |
| వివసించు | 10 | 16 | నివసించు |
| జరుగెచుండి | 12 | 1 | జరుగుచుండి |
| పూజారుల | 13 | 19 | పూజారులు |
| సామూవై | 13 | 25 | చామవై * |
| ద్వాశి | 13 | 27 | ద్వారశి |
| నంది | 17 | 10 | నంబి |
| వశింవ | 17 | 24 | వసింప |
| కోండ | 18 | 5 | కొండ |
| —200 | 21 | 21 | I —200 |
| చెందునశ్లేర్పరిచిరి | 24 | 19 | చెందునట్లేర్పరచిరి |
| వివేషమగు | 29 | 5 | విశేషమగు |
| 1513—1514 | 29 | 20 | 1513—1524 |
| కాయ్ | 30 | 21 | కై |
| శిధిలమై | 30 | 24 | శిథిలమై |
| యధాక్రమము | 34 | 2 | యథాక్రమము |
| భుజద్కందము | 37 | 11 | భుజస్కంధము |
| తిరుప్పాణక్కము | 37 | 12 | తిరుప్పోనగము |
| ఆదివన్ | 38 | 9 | ఆదివణ్ * |
| మున్మ్రుందు | 51 | 27 | ముమ్ముందు |
| మట్లగారు | 53 | 15 | మట్లవారు |
| కారము | 60 | 9 | ఘారము |
| రజస్వలాతూర్పర్వము | 64 | 14 | రజస్వల కాకపూర్వము |
| దీనిని | 71 | 4 | వీనిని |
| పెదతిరుమాలా | 73 | 3 | పెదతిరుమలా |
| శేట | 75 | 11 | వేట |
| తిరువణిపిళ్ల | 82 | 13 | తిరువ్వణిపిళ్ల |
| అథ్యాత్మ | 91 | 8 | అధ్యాత్మ |
| ప్రభోధిక | 92 | 13 | ప్రబోధిక |
| 4. రామచంద్రోపాఖ్యానము (17వ పంక్తిలో తొలగింపవలెను) | 93 | 17 | 3. రామచంద్రోపాఖ్యానము (పంక్తి 22 తర్వాత చేర్పవలెను) |

| తప్పు | పుట | పంక్తి | ఒప్పు |
|---|---|---|---|
| ముధానిధి | 92 | 14 | సుధానిధి |
| గ్రంధము | 94 | 21 | గ్రంథము |
| గురుఁడుపపీతు | 95 | 12 | గురుఁడుపనీతు |
| పరిపంధి | 99 | 15 | పరిపంథి |
| వాథు | 102 | 21 | నాధు |
| వనిలేని | 107 | 15 | వసిలేని* |
| నడమ | 108 | 12 | నడుమ |
| మన్నధ | 108 | 21 | మన్మథ |
| నేసినంత | 112 | 9 | చేసినంత |
| సుబ్రహ్మశాస్త్రి | 123 | 16 | సుబ్రహ్మణ్యశాస్త్రి |
| నెక్కి | 126 | 8 | నెక్కి |
| ఛకదోప్రక్రియ | 138 | 8 | ఛందఃప్రక్రియ |
| దివిద్యా | 152 | 8 | దవిద్యా |
| చంఛదము | 152 | 27 | చ్ఛందము |
| ప్రసిదద్ధాః | 154 | 18 | ప్రసిద్ధః |
| తిరుమాలాచార్యుని | 167 | 24 | తిరుమలాచార్యుని |
| ,, | | 26 | ,, |
| యశిచ్చి | 170 | 15 | యశుచ్చి* |
| వృతి | 170 | 25 | కృతి |
| పాత్తుముత్తై | 171 | 17, 18 | శాత్తుముత్తై* |
| నేనే | 171 | 29 | లోనే |
| స్వారోచిత | 173 | 26 | స్వారోచిష |
| మృగమదాంబకు | 174 | 2 | మృగమదాంగకు* |
| గాస్రి | 181 | 19 | గ్రావాసి |
| శ్రీకృష్టు | 183 | 20 | శ్రీకృష్ణు |
| భవరభవు | 186 | 21 | భవభవు |
| దీని యధా | 198 | 5 | దీనినేయథా |
| శంభకరా | 206 | 16 | శంకరా |
| పతి నప్పగారు | 214 | 9, 11, 15 | పతి అప్పగారు* |
| చక్కిన వెన్నెలవ్వు | 216 | 12 | చక్కి వెన్నెలవ్వు |
| కుంజిరాప్యాది | 216 | 16 | కుంజరాప్యాది |
| శేషభ్రాతు | 216 | 22 | శేషభూతు |
| భక్తి శ్రేణి | 218 | 8 | భక్త శ్రేణి |

| తప్పు | పుట - పంక్తి | | ఒప్పు |
|---|---|---|---|
| జీవితకథాప్రగ్గథిత | 219 | 14 | జీవితకథా సుమదామము |
| ధనిషా | 220 | 16 | ధనిష్ఠా |
| సంస్కృతి | 221 | 2 | సంస్కృతి |
| ధనిషా | 222 | 13 | ధనిష్ఠా |
| వసజోదయము | 232 | 5 | వసదోదయము* |
| చంక్రాంకకాంక | 233 | 6 | చక్రాంకుకాంక |
| (పుట సంఖ్య) | 233 | | 233 |
| గంతా | 235 | 6 | గంగా |
| భటును | 240 | 29 | భట్టుమ |
| భక్తులకు | 247 | 3 | భక్తులం* |
| వాయించినా | 265 | 18 | వాయించిన |
| క్రిమికంఠుడొకండే | 278 | 13 | క్రిమికంఠుడొకండే |
| పరమోడా ర్తుండై | 279 | 16 | పరమోదాత్తుండై |
| తిరుమళిణికై | 283 | 6 | తిరుమళికై |
| ప్రబంధములతో | 291 | 2 | ప్రబంధములలో |
| నవసరభరితములు | 297 | 13 | నవరస భరితములు |
| నిల తిండి | 303 | 5 | నిలందీడి* |
| రెండవ | 307 | 7 | పెద్ద |
| పెదతిరుమలాచార్యుని | 307 | 8 | నృసింహకవికి |
| చివులు | 307 | 24 | చివురులు |
| లూంగిచి | 307 | 26 | లూగించి |
| విరువహో | 307 | 28 | విరహో |
| పులికాలు | 309 | 27 | పులకలు |
| చికురాకు | 310 | 13 | చిగురాకు |
| లహ్వముల్ | 312 | 21 | లహర్షముల్ |
| వెలయయడుగని | 312 | 21 | వెలయడుగని |
| మంజిరి | 313 | 11 | మంజరి |
| వివయమునేనే | 314 | 5 | విషయమునే |
| ఇదియొకరి | 316 | 2 | ఇదియొవరి |
| నేమాలు | 318 | 9 | వేమాలు |
| నగఖ | 331 | 24 | నగఖ |
| వానికే | 334 | 10 | దానికే |

| తప్పు | పుట | పంక్తి | ఒప్పు |
|---|---|---|---|
| శైవ | 335 | 18 | శేవ |
| (పు. 74) | 336 | 28 | (ప. 74) |
| విరసముగార | 340 | 11 | విరసముగాదు |
| గొలుకొ అన్ | 341 | 11 | గొఅకొఅన్ |
| కాదుము | 342 | 4 | కాదము |
| లచ్చరు | 342 | 10 | లచ్చెరు |
| మోహాన | 342 | 28 | మోనాన |
| బరార్జునస్థ | 345 | 21 | బర్హార్ధనస్థ |
| మూపః వ్యస్మృగయ | 345 | 28 | మూపకృన్మృగయు |
| పాౖమాట్టే | 348 | 4 | సౖమాట్టే |
| మృతుఁడయ్యె | 353 | 8 | మృతుఁడయ్యె |
| గృష్టా | 358 | 15 | గృష్ణా |
| జిరఫణి ఫణిశిం | 388 | 17 | జితఫణి ఫణితి |
| దండకం | 388 | 19 | దండకః |
| తరశీతుణాః | 391 | 8 | తరశేక్షణాః |
| (రూపక తాళము) | 394 | 14, 28 | (అదితాళము)* |
| 108 పంక్తులు | 396 | 9 | 118 పంక్తులు |
| గుణోపేద్రైః | 405 | 18 | గుణోపేతైః |
| జిౖక | 415 | 6 | జౖక |
| నాకుంజాపి | 429 | 22 | నాకుంజాటి |
| తిలా పురుష | 432 | 28 | తులా పురుష |
| తాలుత | 434 | 8 | తొలుత |
| దాళము పాక | 434 | 19 | దాళమ పాక |
| వదమున | 436 | 20 | వదమన |
| చతుర్థాతుకము | 44? | 2, 3, | చతుర్ధాతుకము |
| సైతలు | 459 | 17 | సైతము |
| సుఖానిధి | 471 | 21 | సుధానిధి |
| రచయితి | 472 | 2? | రచయత |
| కునిధృత | 485 | 11 | కునీ దృతి* |

(*ఈ సంస్కారములను సూచించిన శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారికి కృతజ్ఞుఁడను)



"తాళ్లపాకవారి సాహితీ మందిరమునకు మతము పునాది. సంస్కృతాంధ్రములు కట్టడపు శిలలు. సంకీర్తనాది సాహితీ ప్రక్రియలు సోపానములు. అందలి యారాధ్యదైవము శ్రీ వేంకటేశ్వర స్వామి. ధర్మార్థకామమోక్షములు నాలుగు ప్రాకారములు. మధుర కవితలు ద్వారవాకిళ్ళు. సార్వజనీనము సార్వకాలికమునగు నుత్తమ భావసంపద తన్మందిర శ్రీభండారము. ఆకవులే యర్చకులు. భక్తియే భగవత్ప్రసాదము. గానమే స్వామి కంగరంగ భోగములు. రసిక వర్యులే. యాత్రికులు. ఇదియే వారి కవితా స్వరూపము"

వేటూరి ఆనందమూర్తి